నార్ల

నార్ల వెంకటేశ్వరరావు శతజయంతి (1908-2008)



స్మరణిక

నార్ల వెంకటేశ్వరరావు శతజయంతి స్మరణిక

(1908–2008)

ఎడిటర్: డాక్టర్ వెలగా వెంకటప్పయ్య

ప్రచురణ: నార్ల కుటుంబం

ముద్రణ: 2009

డిజిటల్ రూపం;2022

పెద్ది సాంబశివరావు, 94410 65414

ఉచిత దిగుమతికి;

తెలుగు తేజమ్. కామ్. Teluguthejam.com

మనవి

ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి దినపత్రికలలో మా నాన్నగారు సుదీర్ఘకాలం ఎడిటరుగా పనిచేశారు. అంకితభావంతో, నిబద్ధతతో కృషి చేసి, పత్రికారంగంలో ఉన్నత విలువలు నిలిపారు. ఆ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించారు. సమాజానికి దిశానిర్దేశం చేశారు. ఉద్యోగరీత్యా పలు సంఘర్షణలు ఎదుర్కొన్నా – ఎదురునిలిచి పోరాడి విజయం సాధించారు. ఆ రంగానికి వన్నె తెచ్చిన, ఒక రోల్ మోడలుగా నిలిచారు.

వారి జీవితకాలంలో పలు గ్రంథాలు రాశారు, పరిశోధనా వ్యాసాలు వెలయించారు. రేడియో ప్రసంగాలు చేశారు. విశ్వవిద్యాలయాలలో ధర్మనిధి ఉపన్యాసాలిచ్చారు. రాజ్యసభలోనూ తమ వాణి వినిపించారు. వర్తమాన విషయాలపైనేగాక, కలకాలం నిలువదగిన అసంఖ్యాకమైన సంపాదకీయాలు రాశారు. భాషకు పదును పెట్టారు. భావ సంచలనంలో వేగం పెంచారు. అగ్రశ్రేణి సంపాదకునిగా నిలిచారు. కనుక వారి రచనలు, ఉపన్యాసాలు, సంపాదకీయాలు నేటి తరానికి, ముందుతరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయనే ఉద్దేశంతో దాదాపు నాలుగేళ్ల క్రితం తెలుగులో ఏడు, ఇంగ్లీషులో ఐదు – మొత్తం 12 సంపుటాలు ప్రకటించాం. ఇది చాల వ్యయ, ప్రయాసలకోర్చి చేసిన పనే అయినా, మా కుటుంబం అంతా ఒక బాధ్యతగా ఈ సత్కార్యాన్ని నిర్వర్తించాం. ఇందుకు మా సోదరి డాక్టరు మీనాక్షి, డాక్టరు శరత్ బెల్లప్రవలుగారికి, కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలుపవలసి ఉంది.

2008 డిశెంబరు 1 నాటికి మా నాన్నగారు జన్మించి నూరేళ్లు గడిచింది. నార్లవారి శతజయంతి ఉత్సవాల సందర్భంలో – '**ఉత్తమ జర్నలిస్టు లైఫ్ టైమ్ అఛీవ్ మెంట్ అవార్డు**' ఏర్పరచిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టరు వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారికి, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ దేవులపల్లి అమర్ గారికి, విజయవాడలో నార్ల కాంశ్య విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ పశు సంవర్థక, మత్స్య శాఖామాత్యులు మండలి బుద్ధప్రసాద్ గారికి, ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ ఛైర్మన్, డాక్టరు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గార్లకు మా కుటుంబం తరఫున కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. ఈ సందర్భంలో నార్లవారితో కలసి పనిచేసినవారు, అనుయాయులు, అభిమానులు రాసిన కొన్ని వ్యాసాలను వారి స్మరణిక (శతజయంతి సంచిక)గా మీముందు ఉంచుతున్నాం.

ఇందు కొన్ని వ్యాసాలు ఇంతకుముందు వివిధ సందర్భాలలో రాసినవి పునర్ముద్రించాం. కొన్ని ప్రత్యేకంగా రాయించాం. ఇందలి వ్యాసాలు నార్ల కృషిని కొంతమేరకైనా తెలియపరచగలవనే విశ్వాసం నాకుంది.

ఇవన్నీ ఒక ఎత్తు. నాకు నిరంతరం సహకరిస్తూన్న నా భర్త డాక్టరు కొల్లి గంగాధరరావుగారికి ప్రత్యేక ధన్యవాదాలు. వారి సహకారం లేకుంటే ఇంత కార్యక్రమం జరిగి ఉండేది కాదు.

మా నాన్నగారికి మిత్రులు డాక్టరు వెలగా వెంకటప్పయ్య, లంకా సూర్యనారాయణగారలు ఈ సంపుటాన్ని సిద్ధం చేయడంలో ఎంతో సహకరించారు, శ్రమించారు. వారికి మా కుటుంబం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఇంతకు పూర్వం ప్రచురించిన నార్ల రచనలు, సంపుటాల వలె ఈ స్మరణికను సమాదరిస్తారని నా నమ్మకం.

ఈ డిజిటల్ ముద్రణ గురించి

2008 ప్రచురించిన నార్లవారి రచనలు ప్రస్తుతం అందుబాటులో లేవు. వాటిని సాహిత్యాభిలాషులు కోరుతున్నారు. ఇపుడు మారిన సాంకేతిక పురోగతి ఆధారంగా ఈ పుస్తకాలు అన్నిటిని డిజిటల్ రూపంలో ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకు రావటం సాధ్యమవుతుంది. ఈ ప్రక్రియకు దోహదపడిన పెద్ది సాంబశివరావు గారికి, సహకరించిన అన్నమయ్య గ్రంథాలయ నిర్వాహకులు లంకా సూర్యనారాయణ గారికి ధన్యవాదములు.

కొల్లి శారద

(నార్ల కుటుంబం తరపున)

గమనిక: ఈ ప్రచురణలో రచయితల పరిచయాలు 2008 నాటివి.

విషయసూచిక

తెలుగు విభాగం

నార్ల పథం

పత్రికారంగంలో నార్ల

సాహిత్యరంగంలో నార్ల

ఇతర రంగాలలో నార్ల

1. రాజ్యసభ సభ్యుడుగా నార్ల – ఎన్. ఇన్నయ్య
2. నార్ల రచనలపై సమీక్ష
    1. నార్ల అక్షర మహా యజ్ఞం – ఇనగంటి వెంకట్రావు
    2. తెలుగువారి అక్షర సంపద – గోపరాజు నారాయణరావు
3. నార్లతో మధురవాణి ఇంటర్ వ్యూ – పురాణం సుబ్రహ్మణ్యశర్మ
4. సంపుటాలలో రాని నార్ల రచనలు, సంపాదకీయాలు

నార్లవారి కొన్ని ప్రసిద్ధ సంపాదకీయాలు


1. బాపూజీ
2. వ్యర్థమైన మూడు జీవితాలు : రణడే, గోఖలే, గాంధీ
3. మానవ విజయం
4. నేటికి ఇంతే
5. కాటన్ "పెట్టిన దీపం"
6. సంస్కృతం – సంస్కృతి–1
7. ఓజియాన్ అశ్వశాలలు
8. నార్ల కుటుంబ సభ్యుల ఉత్తరాలు – శ్రీకాంత్, రాధిక, మీనాక్షి, బెల్లాప్రవలు, విజయ్ కె.బోజెండ్ల, మోనిక నార్ల, ఎడెల్ స్టీన్


పత్రికా రంగంలో నార్లవారి యుగం - ఒక స్వర్ణ యుగం

పొత్తూరి వెంకటేశ్వరరావు









ఇరవయ్యవ శతాబ్ది తొలి మూడు పాదాలలోనూ తెలుగు పత్రికా రంగాన్ని తీర్చి దిద్దిన మహనీయులలో ముఖ్యంగా పేర్కొనవలసిన వారు ముగ్గురు. వారిలో ప్రథములు ముట్నూరి కృష్ణారావుగారు. ఆయన ఆధిపత్యంలో 'కృష్ణా పత్రిక' ఆంధ్రప్రజా జీవితంలో ఒక భాగమై భాసించింది. రెండవ వారు కాశీనాధుని నాగేశ్వరరావుగారు. మొదట వార పత్రికగా బొంబాయిలో 'ఆంధ్ర పత్రిక'ను ప్రారంభించి, తరువాత దానిని దినపత్రికగా కూడా వృద్ధిపరచి, దిన, వార పత్రికలకు 'భారతి' మాస పత్రికను సంధించి ఆంధ్ర సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ రంగాలను ప్రభావితం చేసిన కీర్తి ఆయనది. మూడవ వారు నార్ల వెంకటేశ్వరరావుగారు. 'క్విట్ ఇండియా' ఉద్యమం వల్ల భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో 1942 సంవత్సరానికి విశిష్ట స్థానం లభించినట్లు, నార్లగారు 'ఆంధ్రప్రభ' సంపాదకత్వాన్ని చేపట్టడం వల్ల అదే 1942 సంవత్సరం తెలుగు పత్రికా వ్యాసంగాన్ని దాదాపు ముగించిన 1977 వరకు, అంటే మూడున్నర దశాబ్దాల కాలం, తెలుగు పత్రికారంగం చరిత్రలో 'నార్లవారి యుగం' నిస్సందేహంగా అది తెలుగు పత్రికా రంగంలో స్వర్ణయుగం.

- డాక్టరు పొత్తూరి వెంకటేశ్వరరావు మాజీ చైర్మన్, ప్రెస్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్

(నార్ల రచనలు ౬ వ సంపుటం నుంచి పునర్ముద్రణ)

యాభయ్యేళ్ళ తీపి జ్ఞాపకాలు- - వెలగా వెంకటప్పయ్య



సరిగ్గా యాభై సంవత్సరాలనాటి సంఘటన. 1958లో నేను రేపల్లెలో పని చేస్తున్నాను. "విజయవాడ, దుర్గా పిక్చర్ ప్యాలెసులో నార్ల సన్మాన సభ జరుగుతోంది- నాతో రా" అని నార్లకు సన్నిహిత మిత్రులు శరణు రామస్వామిచౌదరిగారు కబురు పెట్టారు. వారితో కలిసి వెళ్ళి, కనుల పండువుగా ఏ తెలుగు జర్నలిస్టుకూ జరగనంత గొప్పగా జరిగిన ఆ సభను

1964 లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ స్వర్ణోత్సవాలు జరిగాయి. ఆ సందర్భంలో వారిచే ఒక సంపాదకీయం ఆంధ్రజ్యోతిలో రాయించాలని 'గ్రంథాలయోద్యమం'పై నాకు తోచిన కొన్ని అంశాలు రాసి నార్లకు చూపి, "దీన్ని సంపాదకీయంగా మలిచి ప్రచురించమని" కోరాను. నేను రాసింది పైనుంచి చివరిదాకా చదివి **"భేష్ చాలా బాగా రాశావు"** అని వెన్నుతట్టారు. "అప్పుడప్పుడు కనిపిస్తూ ఉండు" అన్నారు. ఆశ్చర్యం కలుగవచ్చు! నేను రాసింది 29-4-1964 న యథాతథంగా సంపాదకీయంగా అతి కొద్దిమార్పుచేసి ప్రచురించారు. ఆపై నా ఆనందానికి అవధులు లేవు. నేను 1966-68 మధ్య విజయవాడలో గ్రంథాలయ శిక్షణాలయ ప్రిన్సిపల్ గా ఉద్యోగం చేసే సమయంలో మా పరిచయం మరింత పెరిగింది. 1968లో అచ్చయిన నా రచన 'పుస్తకాల భద్రత'కు నార్లగారు ముందుమాట రాసి అభినందించారు.

ఉద్యోగ ధర్మం రీత్యా ప్రతిఏటా ఒకసారి పాత పత్రికలను రద్దీక్రింద వేలంవేసి అమ్మేస్తుంటాం. అంతకుముందే నార్లవారి, ఇతరుల నుంచి సంపాదకీయాలు, వ్యాసాలు భద్రపరచే అలవాటుండేది. ఆవిధంగా నేను సేకరించిన సంపాదకీయాలకు మరికొన్ని చేర్చి నార్ల "మూడు దశాబ్దాలు" గ్రంథాన్ని 1976లో ప్రచురించారు. నేను ఏలూరులో పనిచేసే కాలంలో నార్ల అప్పుడప్పుడు వచ్చేవారు. రెండు సార్లు ఎల్.వి.బి. చౌదరిగారిని వెంటబెట్టుకొని వచ్చారు. ముందుగా వట్లూరులో ఆగి వేగుంట కనకరామబ్రహ్మంగారిని తీసుకుని ఏలూరులోని మా ఆఫీసుకు వచ్చి, నాగదిలో కూర్చునేవారు. వారిని కలిసేందుకు కొనకళ్ళ వెంకటరత్నం, బొడ్డు బాపిరాజు, పంద్రంగి రాజేశ్వరరావు మొదలైన ఎందరో కవిపండితులు వచ్చేవారు. నిజానికి అవి మరపురాని మధురమైన దినాలు.

తదుపరి విజయవాడ, హైదరాబాదులలో ఎన్నో పర్యాయాలు వారిని కలిశాను. కొత్త పుస్తకాలను గురించి తెలుసుకోవడం వారికెంతో ఇష్టం. వారు నాచేత కొన్ని పుస్తకాలకు సమీక్షలు రాయించి ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించారు. హైదరాబాదులో స్థిరపడ్డాక వారిలో అనారోగ్యం పెరిగింది. దాంతో కొంత అసహనం, వర్తమాన విషయాలపై ఎనలేని చిరాకు కలిగింది. కొన్ని సందర్భాలలో చాల చికాకుగా ఉండేవారు.

మానసికంగా ఒక ఘర్షణకు లోనవుతుండేవారు. ఎమర్జన్సీ వారిని బాగా కుంగదీసింది. అయినా నాలాటి గ్రంథాభిమానులు వెళ్తే ఎంతో ఆనందంగా గడిపేవారు. ఒక్కోసారి మూడు నాలుగు గంటలు నేను వారితో గడిపిన సందర్భాలూ ఉన్నాయి. సులోచనగారి కమ్మని ఆతిథ్యం పిదప వారి కారులో బంజారా హిల్స్ నుంచి నగరంలో నేనుండే చోటికి పంపేవారు. ఒకసారి సులోచనగారే అన్నారు. “ఇవాళ మీరొచ్చాక నార్లగారు చాలా ఆనందంగా ఉన్నారు" అని. అదీ నార్లకు నాకు ఉన్న సాన్నిహిత్యం.

1985 లో ఏదో పనిపై హైదరాబాదు వెళ్ళాను. ఉదయం దినపత్రిక చూడగానే నార్ల అస్తమయం వార్త నన్ను దిగ్భ్రాంతుణ్ణి చేసింది. వెంటనే బంజారా హిల్సుకు చేరుకుని వారిని చివరిసారి దర్శించుకునే అవకాశం కలిగింది. ఏడుపులు, పెడబొబ్బలు లేని ప్రశాంత వాతావరణంలో కుటుంబసభ్యులు, అభిమానుల మధ్య వారు కనుమరుగయ్యారు.

నార్ల గతించి ఇరవై సంవత్సరాలయ్యాక కూడ ఏదో సందర్భంలో వారిని గుర్తుచేసుకుంటూనే ఉన్నాం. ఎన్నో మౌలికమూ, ఆలోచనాత్మకమూ అయిన వారి రచనలు, సంపాదకీయాలు లభ్యం కానందుకు బాధపడుతూనే ఉన్నాం. వారి రచనలన్నీ సంపుటాలుగా కూర్చగల సమర్థులు, నార్లకు, నార్ల భావాలకు సన్నిహితులు లేకపోలేదు. ఐనా సిక్స్త్ సెన్స్ ప్రేరణతో జరిగిందేమో సులోచనగారు ఆరోగ్యంగా ఉన్న దినాలలో వారి సంపూర్ణ రచనలు ఎడిట్ చేసే అవకాశం నాకు కల్పించడం ఒక మహద్భాగ్యంగా భావించాను. ఇందు నార్ల కుమార్తెలు ముఖ్యంగా డాక్టరు కొల్లి శారద, మీనాక్షి బెల్లప్రవలు అపారమైన సాహసం, తండ్రిగారి పట్ల వారికుండే ప్రత్యేక అభిమానం ప్రశంసనీయమైనది. సులోచనగారి ఆరోగ్యం బాగా క్షీణిస్తున్న దినాలలో నార్ల రచనలు తొలి నాలుగు సంపుటాలు చూపగా, ఎంతగా ఆనందించారో, ఎంతగా సంతృప్తి చెందారో చెప్పనలవిగాదు. పన్నెండు సంపుటాలు పూర్తయ్యాక నాకు మౌలికమైన మంచి రచనలు లోకానికి అందించామనే తృప్తి కలిగింది. ఈ రచనలు ఇంతబాగా తెచ్చేందుకు, ఈ బృహత్కార్యంలో అహర్నిశలూ నావెంట ఉండి, దీన్ని విజయవంతం గావించేందుకు తోడ్పడిన మరో హంటిగ్టన్ లంకా సూర్యనారాయణగారికి సింహభాగ గౌరవం దక్కవలసి ఉంది. సందేహం లేదు.

సంపూర్ణ రచనలు పూర్తిచేసిన మరో నాలుగేళ్ళకు ఈ శతజయంతి సంచికకు సంపాదకత్వం వహించడం కూడ ఒక అదృష్టంగా భావించాను. దేవుని చెంతకు చేరే పూలమాల నిలిచే కాలం అతి స్వల్పం. కానీ ఆవిధంగా దక్కే తృప్తి స్వల్పకాలమే అయినా గొప్పదేగదా! ఆవిధంగా నా జీవితం ధన్యమని భావిస్తాను. ఈ జన్మకు అది చాలు.

నార్లవారి జీవిత విశేషాలు

– పి. కృష్ణమూర్తి

వి.ఆర్. నార్లగా ఆంధ్రదేశానికే కాదు యావద్భారత దేశానికి ఉత్తమ సంపాదకులుగా సుపరిచితులు నార్ల వెంకటేశ్వరరావుగారు. ఆంధ్రదేశంలో ఉన్న కొద్దిమంది ఉత్తమ సంపాదకులలో అగ్రేసరులుగా, తెలుగుజాతి మేధావి వర్గంలో అనుపమ వ్యక్తిత్వం గలవారు. రచయితగా నార్లవారు విలక్షణమైన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకున్నారు. వారు ఉత్తమ సంపాదకులే కాదు విమర్శకులు, వ్యాసరచయిత. ఉత్తమ కవులే గాదు తాత్త్వికులు, ప్రజాస్వామ్య ప్రియులు, హేతువాదులు వీటిని మించి మానవతావాదులు.

నార్లవారి పూర్వీకుల చరిత్ర

కృష్ణాజిల్లా కాటూరు నార్లవారి పూర్వీకుల గ్రామం. 18, 19 శతాబ్దాలలో ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి యుద్ధసామగ్రిని చేరవేసే కాంట్రాక్టర్లుగా నార్ల రామయ్య, రమణయ్య, తాతయ్య నియుక్తులై మధ్యప్రదేశ్ లోని సాగరు ప్రాంతానికి వలస వెళ్ళారు. నార్ల తాతయ్య కుమారుడు మాధవరావు సిపాయి పితూరీలో కంపెనీ మెప్పు పొంది సాగరులో స్థిరపడ్డారు. వెంకటేశ్వరరావు తాతలైన హనుమయ్య, వెంకయ్యగారలు అతి సాహసవంతులు. వెంకయ్యగారి సంతానంలో గోవిందరావు, లక్ష్మణరావు, ఒక ఆడబిడ్డ మాత్రమే బ్రతికారు. అధిక వ్యయానికి అలవాటుపడ్డ గోవిందరావు మూలంగా కుటుంబ ఔన్నత్యం క్షీణింప సాగింది.

లక్ష్మణరావు, మహాలక్ష్మమ్మ అనే పుణ్యదంపతులకు 1908 డిసెంబరు 1న వెంకటేశ్వరరావు జన్మించారు. పుట్టింది జబల్పూరులో, పెరిగింది సాగరు. లక్ష్మణరావు పోయిన ఆస్థి పోగా 1914–15 ప్రాంతంలో లక్ష్మణరావు భార్య స్వగ్రామమైన కృష్ణా జిల్లా కౌతవరంలో స్థిరపడ్డారు. జన్మించింది సాగరు కాబట్టి నార్లవారికి మొదట హిందీయే అలవడింది. తల్లిదండ్రులు ఆంధ్రదేశంలో స్థిరపడ్డాక ఏడవ సంవత్సరంలో తెలుగు నేర్వనారంభించారు.

బాల్యం విద్యాభ్యాసం

నార్లవారి విద్యాజీవితం కౌతవరం బోర్డు ఎలిమెంటరీ పాఠశాలలో ప్రారంభమైంది. చిన్ననాటనే బాలభటోద్యమంలో చేరారు.కౌతరంలోని ఆంధ్రలక్ష్మీ ఎడ్వర్డు మెమోరియల్ స్కూల్లో ప్రవేశించి సెకండు ఫారంలో కృతార్థులయ్యారు. గుడివాడ హైస్కూల్లో ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదివారు.

ఆదర్శవంతులైన నార్ల వెంకటరామన్నగారు వీరి చదువుకు ఆర్థిక సహాయం చేశారు. 1927లో గుంటూరు హిందూ కాలేజి హైస్కూలులో యస్.యస్.ఎల్.సి. పరీక్షకు వెళ్ళి ఇంగ్లీషులో ఒక్క మార్కు తక్కువ రావటంతో తప్పారు.

1927 డిసెంబరులో జరిగిన మద్రాసు కాంగ్రెసు సమావేశానికి నార్ల ప్రేక్షకునిగా హాజరయ్యారు. 1928లో యస్.యస్.ఎల్.సి. ఉత్తీర్ణులయ్యారు. నార్లవారిపై అప్పటికే బ్రహ్మసమాజ ప్రభావం పడింది. కాకినాడ పిఠాపురం రాజావారి కాలేజిలో ఇన్టర్మీడియట్ చేరినపుడు ఆ భావాలు బాగా బలపడ్డాయి. విగ్రహారాధనను మాని మానవతావాదిగా మారారు. సామాన్య మానవుల స్థితిగతులను మెరుగు పరచడానికి 'సోదర సమితి' అనే సమాఖ్యను ఏర్పాటు చేశారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో తుఫానుకు గురైన ప్రజలకు ధన, వస్త్రాలను వసూలు చేయడంలో సహాయపడ్డారు. సాంఘిక, రాజకీయ కారణాలవల్ల వారి చదువు సరిగా సాగలేదు.

1928లో పూర్వం మద్రాసు సమావేశ పునఃపరిశీలన కలకత్తాలో కాంగ్రెస్ పార్టీ చేయగా దానిపై ఆగ్రహంతో మద్దూరి అన్నపూర్ణయ్యగారికి రాసిన వ్యక్తిగత లేఖను వారు 'కాంగ్రెసు' పత్రికలో వ్యాసరూపంలో ప్రచురించారు. అదే వారి అచ్చయిన మొదటి రచన. 1930లో ఒక్క తెలుగులో మాత్రమే ఇన్టర్మీడియట్ కృతార్థులుకాగా, 1931లో గుంటూరు ఎ.సి. కళాశాలలో ప్రైవేటుగా పరీక్ష రాసి కృతార్థులయ్యారు.

ఉద్యోగాన్వేషణ

ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొనడానికి చిన్న ఉద్యోగం కోసం ప్రయత్నించి విఫలులయ్యారు. మహోద్రేకంతో సాగుతున్న ఉప్పు సత్యాగ్రహంలో చేరిపోయారు. ప్రతి ఆదివారం డాక్టర్ పట్టాభిగారి 'జన్మభూమి' పత్రికకు వ్యాసాలు రాసేవారు. ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం వీరిపై తప్పుడు కేసు బనాయించి ఏడు మాసాలు కఠిన కారాగార శిక్ష విధించింది. 1930–32 ప్రాంతాల్లో పోలీసులు చర్యల మూలంగా తీవ్రవాదుల్లో చేరిపోయారు. 1932లో బందరు నోబుల్ కళాశాలలో బి.ఏ.లో చేరారు. వేసవి సెలవులలో 'కృష్ణా పత్రిక'కు ఉపసంపాదకులుగా పనిచేశారు. అప్పుడప్పుడు "భారతి"కి వ్యాసాలు రాసి కొంత డబ్బు సంపాదించేవారు.

1933 లో బి.ఏ. చదివే రోజుల్లో మొదటి గ్రంథం "స్వదేశీ సంస్థానాలు" ప్రకటించారు. స్వదేశీ సంస్థానాలలో ప్రజల కష్టసుఖాలు ఇందులో వివరించగా ముట్నూరి కృష్ణారావుగారు "కృష్ణా పత్రిక"లో

మెచ్చుకుంటూ సమీక్షిస్తూ సంపాదకీయం రాయటంతో ఈ గ్రంథానికి అనన్య ప్రచారమెచ్చింది. తమిళంలోకి అనువదించబడింది. అయితే నిజాం, మైసూరు, తిరువాన్కూరు ప్రభుత్వాలు బహిష్కరించాయి.

1934లో బి.ఏ. ఉత్తీర్ణులై, బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఎం.ఏ. చెయ్యాలన్న బలమైన కోరికను సుకరం చేసుకోడానికి తన చెల్లెలు బంగారు గాజులమ్మి "నేటి రష్యా" అనే గ్రంథాన్ని ప్రకటించారు. రష్యాను గురించి తెలుగులో వచ్చిన మొట్టమొదటి గ్రంథం. కాని ప్రకటించిన నెలలో ప్రభుత్వం దీనిని నిషేధించింది. 1935లో ఇంగ్లీషు జర్నలిజంలో చేరాలన్న కోరికతో చెన్నయ్ చేరారు. రామకృష్ణ మొదలియార్ సంపాదకత్వంలో గల "జెస్టిస్" పత్రికలో చేరారు. పూర్వ రాజకీయ చరిత్ర వలన, విప్లవ వాదులతో గల సంబంధాలవల్ల నెలకే ఉద్యోగం పోయింది. సుమదర్శిని, భారతి, ప్రజామిత్ర వంటి పత్రికల్లో ప్రకటించిన వ్యాసాల ద్వారా తామొక పత్రికా రచయితగా నిరూపించుకున్నారు. తర్వాత "స్వరాజ్య" అన్న ఇంగ్లీషు పత్రికలో చేరి విలేకరిగా, ప్రూపు రీడర్, ఉపసంపాదకునిగా, రాత్రిపూట సంపాదకునిగా పనిచేసేవారు. చేరిన తొమ్మిది నెలలలోపల "స్వరాజ్య" మూతపడింది. 1936లో పిఠాపురం మహారాజా వారిచే ప్రజాపార్టీ ఆధ్వర్యంలో నడపబడే "జనవాణి" పత్రికలో నార్లవారు న్యూస్ ఎడిటర్, తాపీ ధర్మారావుగారు సంపాదకులు. అభిప్రాయ భేదాల కారణంగా రాజీనామా చేసి ప్రజామిత్ర తెలుగువార పత్రికలో అసిస్టెంట్ ఎడిటరుగా చేరారు.

1938 ఏప్రిల్ 2న సులోచనాదేవితో మద్రాస్ లో రిజిష్టర్ మ్యారేజి జరిగింది. అక్టోబర్ నెలలో హిట్లర్ చేసిన ఆస్ట్రియా దురాక్రమణను, అంతర్జాతీయ రాజకీయాలను తెలియజేస్తూ 'ఆస్ట్రియా ఆక్రమణ' పేరుతో రసవత్తర గ్రంథం వెలువరించారు. ఆగస్టు 1న ఆంధ్రప్రభలో న్యూస్ ఎడిటర్ గా ప్రవేశించి 1942 మధ్యలో ప్రధాన సంపాదకులై 1959 వరకు ఆ పని నిర్వహించారు. 1939 జనవరిలో హిట్లర్ జెక్ దేశాన్ని రాజకీయ తంత్రాలతో ఎలా కూలదోసింది తెలుపుతూ 'జెక్ రాజ్య విచ్ఛేదము' అనే పేరుతో ప్రకటించారు. ఫిబ్రవరి నెలలో పాలస్తీనా అరబ్బులు, బ్రిటీషు ఇంపీరియలిజంతో సంఘర్షించిన విషయాలను 'పాలస్తీనా' గ్రంథంలో వివరించారు. 1943 లో 'రష్యన్ కథలు' అనే పేరుతో కథల అనువాదాన్ని చేశారు. 1944 అక్టోబర్ 19న ఆంధ్రుల శిల్పసంపదపై ఆంధ్రప్రభలో రాసిన సంపాదకీయం వల్ల ప్రముఖుల్లో నాగార్జునకొండ, జగ్గయ్యపేట, ఘంటసాల మొదలైన ప్రాంతాల్లోని శిల్పాలను ఇతర ప్రాంతాలకు తరలించకూడదన్న ఆశయం ప్రబలింది.

1945లో కథలు, వ్యాసాలు, నిర్వచనాలు సంపాదకీయాలతో కూడుకున్న వివిధ విషయాలను సంకలనం చేసి 'కదంబం' గా రూపొందించారు.

1945 డిసెంబర్ 30న మద్రాసు మహాజన సభలలో ఆంధ్రరాష్ట్ర పత్రికా రచయితల సంఘం 5వ వార్షికోత్సవ సభాధ్యక్షులుగా నార్లవారు పత్రికా రచయితల బాధ్యతలను గురించి ఉపన్యాసం చేశారు. 1946లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి జరిగిన ఎన్నికల్లో ప్రజాభిప్రాయాన్ని కాదని గాంధీజీ రాజగోపాలాచారిని ముఖ్యమంత్రి చెయ్యాలని సంకల్పిస్తే, నార్లవారు దానిని వ్యతిరేకించి ప్రకాశం పంతులుగారు ముఖ్యమంత్రి కావడానికి దోహదం చేశారు. ప్రకాశంగారి ప్రభుత్వం పనితీరు పట్ల అసంతృప్తి చెందిన నార్లవారు 'ప్రజా ప్రభుత్వం' అనే శీర్షికతో రాసిన ఐదు సంపాదకీయాలతో ప్రభుత్వం పడిపోయింది. 1945లో తూర్పు కోస్తానిధికి, 1952లో రాయలసీమ క్షామనిధికి, 1953లో గోదావరి వరదబాధితులకు నిధులు వసూలు చేసి రామకృష్ణ మిషన్ ద్వారా పంపిణీ చేయించుటలో నార్లవారు ప్రధాన పాత్రను వహించారు. 1947లో రైతు జీవితాన్ని ఇతివృత్తంగా స్వీకరించి 'కొత్తగడ్డ' అనే పదహారునాటికల సంపుటి ప్రకటించారు. 1949 సెప్టెంబరు 6న విజయవాడలో అప్పటి ఆస్థానకవి చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి సన్మానం సందర్భంగా ఏర్పాటైన పత్రికా ప్రదర్శనానికి నార్లవారు ప్రారంభోత్సవం చేశారు. 1950 ఫిబ్రవరిలో మంచిర్యాలలో నిజాం ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆరో వార్షిక సభకు ప్రారంభోత్సవం చేశారు. 1951 సెప్టెంబరులో 'కృష్ణా–పెన్నార్ ప్రాజెక్టు'కు అభ్యంతరం తెలుపుతూ 'నాగార్జున సాగర్' ప్రాజెక్టు ఆవశ్యకాన్ని వెల్లడించగా నందికొండ ప్రాజెక్టును 'నాగార్జున సాగర్'గా పేరు మార్చారు. 1955లో ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి, కమ్యూనిస్టుల ఘోర పరాజయానికి ఆంధ్రప్రభ ద్వారా నార్లవారు ఎంతో కృషి చేశారు.

1954లో ఒకసారి నార్లవారు యూరప్ యాత్ర చేశారు. మనదేశానికి కమ్యూనిస్టు వ్యవస్థ తగునా? తగదా? అనే విషయంపై "ప్రగతి" అనే పుస్తకం రాశారు. 1956 డిసెంబరులో "వాస్తవమ్ము నార్ల వారిమాట" అనే మకుటంతో గురజాడ వారిని అనుకరిస్తూ "నార్లవారి మాట" అనే పద్యాల సంపుటి వెలుగులోకి తెచ్చారు. 1957లో అప్పుడప్పుడు రాసిన యాభై అయిదు గేయాలను సంకలనం చేసి "జగన్నాటకం" అనే కవితా సంపుటి ప్రకటించారు. కొన్ని గేయాలు హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువాదాలయ్యాయి. వీరి 'కొత్తగడ్డ' నాటికల సంపుటిని బాలశౌరి రెడ్డిగారు "నయా ధర్తీ" పేరుతో హిందీలోకి అనువదించారు. ఈ నాటికలు వివిధ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలుగా నిర్ణయించారు.

1958లో ఒక పర్యాయం, 1964లో రెండో పర్యాయం రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైనారు. 1958లో పారిస్లో జరిగిన పదో యునెస్కో మహాసభలకు మనదేశం పక్షాన డాక్టర్ సర్వేపల్లివారి నాయకత్వంలో వెళ్ళిన ప్రతినిధి బృందంలో నార్లవారు సభ్యులు. 1959లో విజయవాడ దుర్గాకళామందిరంలో వీరి స్వర్ణోత్సవం జరిపారు. రాజమన్నార్ గారు 'హాఫ్ వే' సన్మాన సంచికను బహూకరించారు.

సమ్మెచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సమంజసమైన కోర్కెలకు సానుభూతిగా 1959 మే 12న ఆంధ్రప్రభనుంచి ఉద్యోగ విరమణ చేశారు.

1960 లో నార్లవారిని అభిమానిస్తున్న స్నేహితులు కలసి 'ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్'ను స్థాపించి జులై 1న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికను విజయవాడలో నార్లవారి సంపాదకత్వాన వెలువరించారు. ఎన్నో కొత్త విషయాలను పత్రికాముఖంగా ప్రకటించి ప్రజలను చైతన్యవంతులను చేయడంలో నార్లవారి పాత్ర ప్రశంసనీయం. 1957 నుంచి చాలాకాలం కేంద్రసాహిత్య అకాడమి సభ్యులుగా ఉన్నారు. ఒక్క ఆస్ట్రేలియా తప్ప మిగిలిన ఆధునిక నాగరికత విస్తరించిన దేశాలన్నీ పర్యటించారు. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత పత్రికా యజమానులను, సంపాదకులను, వారి సిబ్బందిని కలుసుకొని వారితో చర్చలు సాగించారు. రాధాకృష్ణన్ 75వ జన్మదినోత్సవ సందర్భంగా ఆయన భారతరాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతిలో రాయించిన 5 వ్యాసాలను గ్రంథంగా ప్రచురించారు. దీనిని ఒరియా భాషలోకి అనువదించారు.

భారతీయ సాహిత్య నిర్మాతలు (Makers of Indian Literature) అన్న శీర్షిక క్రింద కేంద్ర సాహిత్య అకాడమివారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ భాషయైన ఆంగ్లంలో వీరేశలింగం, వేమన, గురజాడలపై నార్లవారి గ్రంథాలు ప్రచురించారు. ఇవి భారతీయ భాషలన్నిటిలోకి అనువదించారు. 1968 డిసెంబరులో ఆంధ్ర పార్లమెంటు సభ్యులు, అధికార, అనధికార ప్రముఖులు నార్లవారికి ఢిల్లీలో, 1969 జనవరి 26న గుడివాడలో షష్ట్యబ్ది పూర్తి సన్మానం చేశారు. అదేకాలంలో వేమనను గూర్చి పాశ్చాత్యుల అభిప్రాయాలను (Vemana Through Western Eyes) అధిక వ్యయప్రయాసల కోర్చి పరిచయం చేయగా మరుపూడి కోదండరామి రెడ్డిగారు 'వేమన-పాశ్చాత్యులు' అనే పేరుతో తెలుగులోకి అనువదించారు. వ్యాసాలు, చర్చా ప్రసంగాలు, రేడియో ప్రసంగాలతో కూడిన 'Traditional Indian Culture and other Essays' ముద్రించారు, 1971లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ కన్నడ స్టడీస్, మైసూరు వారి గోష్ఠిలో Gandhiji in Indian Literature అన్న అంశంపై చేసిన ఉపన్యాసం ముద్రించి కన్నడంలోకి అనువదించారు. 1969లో తెలంగాణా ఉద్యమంలో, 1972లో జై ఆంధ్ర ఉద్యమంలో రాష్ట్ర సమైక్యతకు పాటుపడ్డారు.

1973 సెప్టెంబరు 29న గవర్నర్ ఖండుభాయి దేశాయిగారి నుంచి ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ద్వారా “డాక్టర్ ఆఫ్ లెటర్సు” గౌరవ బిరుదాన్ని స్వీకరించారు, 1975లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంనుంచి గౌరవ డాక్టరేట్ పట్టం పొందారు.

“వాస్తవమ్ము నార్లవారి మాట” అన్న మకుటం మార్చి “నవయుగాలబాట నార్ల మాట” అనే శీర్షికతో 1974లో కొన్ని పద్యాలు చేర్చి ప్రకటించారు.

'Rajammohan Roy - A Bio Centenary Tribute' అనే పరిశోధనా గ్రంథం, 1974 లోనే సంప్రదాయ వ్యతిరేకమైన సనాతన వ్యాఖ్యతో, విపుల పీఠికతో 'జాబాలి' అనే నాటికను ప్రచురించగా తీవ్రవాదోపవాదాలకు దారితీసింది. మాటా-మంతీ, పిచ్చాపాటీలను కలిపి "కొత్త-పాత" పేరుతో కొన్ని వ్యాసాలు జోడించి, "కదంబం"ను పునర్ముద్రించారు. సాహిత్య అకాడమి పక్షాన గురజాడవారి "కన్యాశుల్కము" ను 1975లో కుదింపు కూర్పును చేశారు.

1975 జులై 25న దేశంలో అత్యయిక పరిస్థితి ప్రకటించబడింది. 1976 మార్చిలో సంజయ్ గాంధి గుంటూరు రాకసందర్భంగా నార్లవారికి చెప్పకుండా ఆంధ్రజ్యోతి ప్రత్యేక సంచిక ప్రచురించగా, నిరసనగా నార్ల రాజీనామా ఇచ్చారు. పత్రికాధిపతి కోరికపై ఉపసంహరించుకున్నారు. తర్వాత ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ పత్రికలో రాయమని అధిపతులు కోరగా అందుకు సమ్మతించని నార్లవారు 1977 జనవరిలో రాజీనామా చేశారు.

1976 ఆగస్టులో 1944-77 మధ్యకాలంలో ఎన్నిక చేసిన సంపాదకీయాలను "మూడు దశాబ్దాలు" పేరుతో ప్రకటించారు. 1978లో మైసూరు విశ్వవిద్యాలయంలో ఇచ్చిన ఉపన్యాసాన్ని వారే "Poverty of Intellectualism in India" ప్రచురించారు. 1979లో విస్తృత పీఠికతో "సీత జోస్యం" ప్రకటించగా 1981లో కేంద్రసాహిత్య అకాడమి బహుమతి పొందినది. మానవతా వాదానికి పట్టం కట్టే "Gods, Goblins and Men" ఉస్మానియా విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవం సందర్భంగా సోషియాలజీ విభాగం వారి ఆధ్వర్యంలో ఇచ్చిన ఉపన్యాసం "Indian Culture and Its Caste Complex" నాగార్జున విశ్వవిద్యాలయం ప్రధమోపాధ్యక్షులు ఆచార్య వి. బాలయ్య ధర్మోపన్యాసాల సందర్భంగా 1980 డిసెంబరు 4, 5 తేదీల్లో చేసిన ఉపన్యాసం "East and West Myth of Dychotomy" నూతన వ్యాఖ్యానంతో కూడుకున్న వీరి "నరకంలో హరిశ్చంద్రుడు" వీరి ప్రముఖ గ్రంథాలు.

హిరణ్య కశ్యపుని హత్య, పంచరత్నం, అనే నాటకాలు పీఠికలు రాయక ముద్రించలేదు. మా ఊరు, ఆషామాషి, సంస్కృతం-సంస్కృతి, సాబాడినేలియన్ కథలు వెలుగు చూడవలసిన గ్రంథాలు.

వీరి ధర్మపత్ని సులోచనాదేవి వీరి వృద్ధాప్యంలో అనారోగ్యంతో బాధపడే నార్లవారిని వెన్నంటి ఉండి కంటికి రెప్పలా కాపాడిన ఆదర్శజీవి. ఈ దంపతులకు ముగ్గురు కుమార్లు, ఐదుగురు కుమార్తెలు. ఇంట్లో పుట్టినవారు, ఇంటికి వచ్చినవారు (అంటే అల్లుళ్ళు, కోడళ్ళు) అంతా డాక్టర్లు కావడం ప్రత్యేకం. పెద్దకూతురు డాక్టర్ కొల్లి శారద, అల్లుడు డాక్టర్ కొల్లి గంగాధరరావు తప్ప మిగతా అందరూ అమెరికాలో ఉండటం విశేషం.

Retreat అంటే తిరోగమనం, Refugee అంటే 'కాందిశీకుడు', U.N.O. అంటే 'ఐక్యరాజ్యసమితి', UNESCO అంటే 'ప్రపంచ విజ్ఞాన సమితి', Non alligned కు 'అలీన' అన్నవి నార్లవారి ఉత్తమ అనువాదాలు. ఇన్ని ఆంగ్లపదాలను తెలుగులో అనువదించినా "సంపాదకుడు" అని కాకుండా "ఎడిటర్" అని రాయడం నార్లవారి ప్రత్యేకత.

ఇంతటి ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించి జాతికి సేవచేసి, నవమేధావి అనిపించుకున్న నార్ల 1985 ఫిబ్రవరి 16న...

మా నాన్న గారు

– కొల్లి శారద

ఈ శీర్షిక చూస్తూనే నాకు కొంత ఇబ్బందిగా ఉంది. ఏమంటే మేమెప్పుడూ మా తండ్రిని నాన్నగారు అని పిలవలేదు. మా చిన్నతనంలో ఎస్.ఎస్. మూర్తి పెదనాన్నగారి అబ్బాయి మా తండ్రిగారిని బాబాయి అని పిలిచేవాడట. నాకు నోరు పూర్తిగా తిరగక బాబా అని పిలుస్తూండే దానిని. అదే పూర్తిగ అలవాటయి నా తరువాత తమ్ముళ్లు, చెల్లెళ్ళు కూడ అదే విధంగా 'బాబా' అని పిలిచేవారు వాళ్ళు.

మాకు మా బాబా అంటే ఎంతో ప్రేమ, గౌరవం. కొంత భయం కూడా ఉండేది. ఏమంటే ఆయన మితభాషి, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా ఉండేవారు. అలా అని మామీద ప్రేమ లేదని కాదు. నేను అందరిలో పెద్దదాన్ని కనుక ఒక విషయం గమనించాను. ఆయన మా తమ్ముళ్ళూ, చెల్లెళ్లను రెండు మూడు ఏళ్లు వచ్చే వరకు ఎంతో ముద్దు చేసేవారు. ఆయన రాత్రంతా చదివి ఏ ఒంటి గంటకో, రెండు గంటలకో నిద్రపోయేవారు. అందుకని ఉదయం 7–30, 8–00 గంటలకు ముందు లేచేవారు కాదు. లేవటానికి మా అమ్మ మాచెల్లినో, తమ్ముడునో ఆయన మంచం మీదకు వదిలేస్తే వాళ్లు తట్టి కొట్టి పిలిచి నిద్రలేపేవారు. ఆయన కూడా విసుక్కోకుండా మీద ఎక్కించుకొని కాసేపు ముద్దు చేసి దింపేవారు. కొంచెం పెద్దవాళ్లు అయ్యేసరికి దూరం కూడా పెరిగేది. తన రచనా వ్యాసంగం మూలాన ఇంటి విషయాలపై శ్రద్ధ ఉండేదికాదు. అంతా మా అమ్మగారే చూసుకునేవారు. జీతం మొత్తం ఆవిడకు అందజేసి తన బాధ్యత అయిందనిపించుకునేవారు. తను బజారు వెళ్లితే ఇంటి అవసరానికి సరుకులు తేవటానికి కాదు, తనకు నచ్చిన పుస్తకాలు కొనుక్కోవటానికో లేక తను మెచ్చిన ఫర్నిచర్, ఆర్ట్ కు సంబంధించినవి కలెక్షన్ చేసుకోవటానికో.

మేము చదువుకునే రోజుల్లో ఎన్నోసార్లు ఎవరైనా వచ్చి మీ పెద్దమ్మాయి ఏం చదువుతూంది అని అడిగితే తటపటాయించి కొంచెం ఆలోచించి నన్ను పిలిచి నీవేం క్లాసు చదువుతున్నావు అని అడిగేవారాయన. అలా అడగటం నాకు ఎంతో చిన్నతనంగా ఉండేది. ఏమంటే మా నాన్నగారికి మా గురించి శ్రద్ధ లేదేమో అని. కాని ఇప్పుడు అనుకుంటాను ఆయనకు గనుక మా చదువుల గురించి శ్రద్ధలేకపోతే మేము 8 మంది డాక్టర్లుగా ఎలా అవగలిగేవాళ్లమని.

వారు ఆంధ్రప్రభ పత్రిక సంపాదకుడుగా ఉన్నప్పుడు క్షణం తీరిక ఉండేదికాదు. ఉదయాన మేల్కొనినప్పటి నుండి కప్పుమీద కప్పు కాఫీ త్రాగుతూ, సిగరెట్టు కాలుస్తూ, న్యూస్ పేపర్లు పుస్తకాలు ఆఫీసుకు వెళ్లే వరకూ చదువుతూ ఉండేవారు. ఉదయం 10-00, 10-30 గంటలకు ఆఫీసుకు వెళ్తే మళ్లీ రాత్రి 8-00, 9-00 గంటలకు గాని ఇంటికి తిరిగి వచ్చేవారు కారు. మధ్యాహ్నం భోజనం క్యారియర్ వెళ్లేది గాని చాలా రోజులు అలానే తిరిగి వచ్చేది.

ఏమంటే వారు రాసిన ఎడిటోరియల్స్ ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఆ రోజుల్లో పేపరు చేతిలోకి రాగానే 'నార్ల ఇవ్వాళ ఏమి రాశారు?' అని ముందు చూసి, చదివిగాని మిగతా పేపరు చూసేవారు గాదు. ఆయన కూడా ఎడిటోరియల్ రాయడం ఒక యజ్ఞంలా చేసేవారు. ఆఫీసులో కొంత పనిచూసుకొని 12-00 గంటల తరువాత టాపిక్ నిర్ధారణ చేసుకొని ఫ్లాస్కులో కాఫీ. ప్రక్కనే సిగరెట్టు టిన్ను పెట్టుకొని మొదలు పెట్టేవారు. వారి ఎడిటోరియల్ పూర్తయ్యేసరికి కాఫీ ఫ్లాస్కు, ఖాళీ అయితే యాష్ ట్రే సిగరెట్లతో చెత్తబుట్ట చింపి పారేసిన కాగితాలతో నిండిపోయేవి. మధ్య మధ్యలో ఏమైనా పుస్తకాలు కావలసివస్తే, ఇంటికి ఫోను చేసేవారు. ఆ టైములో మేమందరం ఇంట్లో ఉండేవాళ్లం కాదు, ఒక మా అమ్మ తప్ప. ఆవిడకు ఇంగ్లీషు రాదు కాని మా నాన్నగారి జ్ఞాపకశక్తి అపారం. ఆవిడకు ఫోను చేసి తనకు కావలసిన పుస్తకం ఏ గదిలో ఏ బీరువాలో ఎన్నో వరుసలో ఎన్నో పుస్తకమో ఏ రంగు కవరుతో సహా చెప్పేవారు. ఆవిడ కూడా దాన్ని జాగ్రత్తగా గుర్తించి వచ్చిన మనిషికి ఇచ్చి పంపేవారు. ఇకపోతే ఆ టైములో ఎవరైనా డిస్టర్బ్ చేస్తే విసుక్కునేవారు. ఆ ప్రయత్నంలోనే లంచ్ కూడా మర్చిపోయేవారు. వారి చేతివ్రాత అంత అందంగా ఉండకపోవడమేకాక, కంపోజ్ చేసేవారిలో ఒకరిద్దరికి మాత్రమే అర్థం అయ్యేది. అందుకని తప్పనిసరిగా ఆ కంపోజిటర్స్ వారి లీడర్స్ కంపోజ్ చేసేవారు. అప్పటికీ మళ్ళీ ఎడిటోరియల్సు వారే స్వయంగా ప్రూఫ్ రీడింగ్ చేసుకునేవారు.

1946లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి జరిగిన ఎన్నికల్లో ప్రజాభిప్రాయాన్ని కాదని గాంధీజీ, రాజగోపాలాచారిగారిని ముఖ్యమంత్రిని చేయాలని సంకల్పిస్తే నాన్నగారు దాన్ని వ్యతిరేకించి ప్రకాశం పంతులుగారు ముఖ్యమంత్రి కావడానికి దోహదం చేశారు.

అదే ప్రకాశంగారి ప్రభుత్వ పనితీరు పట్ల అసంతృప్తి చెందినప్పుడు వారు "ప్రజా ప్రభుత్వం" అనే శీర్షికతో రాసిన ఐదు సంపాదకీయాలతో ప్రభుత్వం పడిపోయింది. మళ్లీ మామూలే. రాజమండ్రిలో ఆంధ్రప్రభ పేపర్లను తగులబెట్టారు. ఒక పాఠకుడు ఆ ఐదు లీడర్లను పంచమహాపాతకాలుగా వర్ణించి రాశాడని ఆయన మాకు చెప్తూ ఉండేవారు.

1950లో తుఫాను బాధితుల సహాయార్థం అలానే గోదావరి వరదలు, రాయలసీమ కరువు సమయంలో సహాయనిధి ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలు వసూలుచేసి రామకృష్ణ మిషన్ ద్వారా సహాయ సహకారాలు అందజేసి పత్రికలు కూడా సమాజసేవ చేయగలవని మా నాన్నగారు నిరూపించారు. సరికొత్త పదాలు సృష్టించి ప్రయోగంలోకి తీసుకొనిరావటం కూడా జరిగింది. వాటిల్లో ముఖ్యంగా పేర్కొనదగినవి రోదసి శిఖరాగ్రం, తిరోగమనం, కాందిశీకులు, అలీన విధానం, ఐక్యరాజ్యసమితి లాంటివి. అవి ఇప్పటికీ బహుళప్రచారంలో ఉన్నాయి.

రాజీనామా పత్రాన్ని సర్వకాలాలలోను జేబులో పెట్టుకొని ఉద్యోగాలు చేసిన స్వాభిమాని వారు. ఆంధ్రప్రభలో యాజమాన్యం వారికి, సిబ్బందికి బేదాభిప్రాయాలు వచ్చినప్పుడు తానుకూడా సిబ్బందిలో ఒకడినేనని రాజీనామా ఇచ్చి బయటకు వచ్చారు. 1938 ఆగస్టులో సబ్ ఎడిటర్ గా చేరి 1940 నుండి ఎడిటరుగా మారారు. ఆంధ్రప్రభ సర్క్యులేషన్ ను 2700 ప్రతుల నుండి తను రాజీనామా ఇచ్చేనాటికి అంటే 1959 కి 60,000 ప్రతులకు తీసుకువచ్చిన ఘనత వారిదే. వారి దృష్టిలో ఆంధ్రప్రభ వారి ప్రథమ సంతానం.

ఎమర్జన్సీలో ఆయన ఎంతో ఆవేదన, బాధ అనుభవించారు. నేను బానిసత్వపు రోజులలో పుట్టాను. పోయేటప్పుడు కూడా అదేగతి నాకు పట్టదుకదా అని వగచేవారు. "వెయ్యి తుపాకుల కంటే పత్రికలకు ఎక్కువ భయపడతాను నేను" అన్నాడు ఆనాడు నెపోలియన్. అదే నాన్నగారు తన 'నార్లవారి మాట'లో ఇలా వ్యక్తపరిచారు. 'పత్రికొక్కటున్న పదివేల సైన్యమ్ము, పత్రికొక్కటున్న మిత్రకోటి, ప్రజకు రక్షలేదు. పత్రిక లేకున్న వాస్తవమ్ము నార్లవారి మాట' వారు పత్రికా రచనా రంగాల్లో అనేక నూతన ప్రయోగాలు చేశారు. ఆంధ్రప్రభ వారపత్రిక స్థాపించి అందులో మహిళలకు ప్రత్యేకంగా శ్రీమతి మాలతీ చందూర్ గారి ఆధ్వర్యంలో ప్రమదావనం అనే శీర్షిక ప్రారంభించారు. లత (హేమలతగారి 'ఊహాగానం' శీర్షికను ఆంధ్రప్రభ వారపత్రికకు ఒక హైలైటుగా నిలిపారు. ఎంతో జనామోదం పొందిందా శీర్షిక. అలాగే వ్యవసాయ, వాణిజ్యం, పరిశ్రమలు, సాహిత్యం, పుస్తక సమీక్షలు, పల్లెలు, పట్టణాలు అనేవి మరికొన్ని కొత్త శీర్షికలుగా ప్రవేశపెట్టి వారపత్రికలకే తలమానికం అయ్యేటట్లుగా

తీర్చిదిద్దారు. అయితే వారు తన పేపర్లో వారఫలాలను ప్రచురించడానికి విముఖత వ్యక్తం చేసేవారు. ఎందుకో వారికి నచ్చేది కాదు.

ఆంధ్రజ్యోతి పత్రిక 1960లో విజయవాడలో ప్రారంభించినప్పుడు శీర్షికల్లో మార్పు తేవాలని, జాతి నిర్మాణంలో వార్తాపత్రికలు తమవంతు సేవచేయాలనే ఉద్దేశ్యంతో వ్యవసాయరంగంలో కొత్త మార్పులను రైతులకు అందజేయాలని ఎన్నో వ్యాసాలను రాయించారు. ఎన్నో కొత్త వరి వంగడాలను రైతులకు అందించారు. అలానే ఇంగ్లీషు పుస్తకాలను కూడా పత్రికలో రివ్యూ చేయటం, పట్టణాల వారీగా సప్లిమెంట్లు వగైరా నూతన ప్రయోగాలుగా చేశారు.

తను పత్రికా సంపాదకత్వానికి రాజీనామా ఇచ్చిన తరువాత ఎక్కువ రచనలపై దృష్టి సారించారు. మేము కూడా పెద్దవాళ్ళమై ఎవరి బరువు బాధ్యతలు వారు నిర్వర్తిస్తూ అప్పుడప్పుడు వారిని చూడటానికి హైదరాబాదు వెళ్ళినపుడు కలిసి కూర్చొని కబుర్లు చెప్పుకొనేవాళ్ళం. టైములో తమ చిన్ననాటి ముచ్చట్లు గుర్తుతెచ్చుకునేవారు. మా నాన్నగారు వారి సోదరుల విద్యాభ్యాసానికై మధ్యప్రదేశ్లో నివసించేవారి పెదనాన్నగారైన వెంకట్రామయ్యగారు ప్రతినెల మనియార్డరు పంపేవారు. 12 సంవత్సరాలు ఆ విధంగా ఖట్నీ నుండి వరుస తప్పకుండా డబ్బు వచ్చేది. ఒకసారి పరీక్ష ఫీజుకై మనియార్డర్లు పంపిస్తూ ఈ డబ్బు సమయానికి చేరకపోతే వెంటనే టెలిగ్రాం ఇవ్వమని,అప్పుడు టి.యం.ఓ. పంపిస్తానని కూపన్లో రాశారు. మనియార్డరు అందితే ఆ కూపనుపై రాసిన విషయానికి టెలిగ్రాం అక్కరలేదు కదా! కాని ఖట్నీలో వారు దూరాన ఉన్న పిల్లల చదువు పట్ల ఆతృత వహించిన దానికి అదొక గుర్తు.

ఆ మనియార్డరు కూపన్ ను నాన్నగారు చాలా మందికి చూపిస్తూ ఆ విషయాన్ని మధుర స్మృతిగా చెపుతూ భద్రంగా దాచిపెట్టారు. ఆ తరువాత ఇల్లు మారినప్పుడు ఆ కూపన్ పోగా చాలా బాధపడ్డారట. గుంటూరు, హిందూ కాలేజి టౌన్ హైస్కూలులో యస్.యస్.యల్.సి. చదివినప్పుడు లైబ్రరీ పురుగుగా మారిన ఆయనను హెడ్మాస్టరు బుద్ధిరాజు రామచంద్రరావుగారు ఇంగ్లీషు పండితుడని పిలిచేవారట. కాని 1927లో యస్.యస్.యల్.సి. పరీక్షలలో ఒక్క మార్కు తేడాతో ఇంగ్లీషు ఫెయిల్ అయ్యారట. హెడ్మాస్టరు రామచంద్రరావుగారు ఎగ్జామినేషను బోర్డుకు ఉత్తరం రాస్తూ నార్ల వెంకటేశ్వరరావు మంచి విద్యార్థి అని ఇంగ్లీషులో ఒక్క మార్కు ఇచ్చి పాస్ చేయాలని కోరారు. కాని బోర్డు రూల్ కు విరుద్ధంగా పోలేదు. నేను మున్సిపల్ కార్పొరేషన్ మేయరుగా అదే స్కూలు యాజమాన్యంలోని బోర్డులో ఉన్నానంటే నాకు ఎంతో గర్వంగా ఉంది.

కాకినాడలో ఇన్టర్ చదివే రోజుల్లో కాలేజీ లైబ్రరీని ఎక్కువగా వినియోగించుకునేవారట. పుస్తకాలలోని, పత్రికలలోని బొమ్మలు మంచి వ్యాసాలు విద్యార్థులు చించుకుపోతున్న సమయంలో ఆ

పని చేయకుండా శ్రద్ధగా కూర్చుని చదివే నాన్నగారిని గమనించిన కాలేజీ లైబ్రేరియన్ ఎప్పుడయినా బజారుకు వెళ్లవలసివస్తే తనస్థానంలో కూర్చోబెట్టి వెళ్లేవారట. మా నాన్నగారికి ఒక పెద్ద లైబ్రరీ ఉండేది. సుమారు 20,000 పైగా గ్రంథాలు తన జీవితకాలంలో సేకరించారు.

పుస్తకాల సేకరణ అలవాటు మొట్టమొదట చెన్నయ్ లో 1928లో జరిగిన భారత జాతీయ కాంగ్రెసుకు వెళ్లినపుడు ఆరంభం అయింది. ఆ సమావేశం సందర్భంగా అమ్మిన అనేక పుస్తకాలలో డబ్బు పరిమితిని బట్టి కొనగలిగినన్ని కొని తెచ్చుకున్నారట.

యుద్ధ విషయాలపై సంపాదకీయాలను రాయడం కోసం రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఎక్కువగా పుస్తకాలు కొనడం ప్రారంభం అయింది. తరువాత అదొక హాబీగా మారిందా లేక వ్యసనంగా మారిందా అని నా అనుమానం. ఏమంటే డబ్బు లేకపోయినా పుస్తకాల షాపువైపుకే ఆయన మనస్సు పీకేది. కాళ్లు లాక్కువెళ్లేవి. అప్పు చేసైనా తనకు నచ్చిన పుస్తకం కొనితెచ్చుకునేవారు.

చెన్నయ్ లో ఉండేటప్పుడు ప్రతి ఆదివారం మూర్ మార్కెట్టుకుగాని, లేక మైలాపూర్ లోని మహదేవన్ గారి పుస్తకాల షాపుకుగాని తప్పనిసరిగా వెళ్లేవారు. నేను కూడా చాలాసార్లు ఆయన వెంట వెళ్లేదాన్ని. కొంత ఆసక్తి ఉంది కాని ముఖ్యంగా మా నాన్నని తొందరగా ఇంటికి తీసుకురమ్మని మా అమ్మ నన్ను తోడిచ్చి పంపేవారు. వారా పుస్తకాల షాపుకు వెళ్తే టైమ్ మర్చిపోయేవారు. మూర్ మార్కెట్టులో ఎక్కువగా పాతపుస్తకాల షాపులు ఉండేవి. ఆ షాపుల యజమానులందరికి ఈయన బాగా పరిచయస్తులు. చేతిలోకి ఏదైన పుస్తకం తీసుకున్నారంటే వాళ్లకు తెలిసిపోయేది వెంటనే అది చాలా మంచి పుస్తకమనో, విలువైన పుస్తకమనో, వెలగల పుస్తకమనో. వారికి మాత్రం చాలామట్టుకు అడిగిన ధరకే పుస్తకాలు విక్రయించేవారు. అలానే ప్రతి పుస్తకాల కొట్టు యజమానిని ఏమైనా క్రొత్తవి వచ్చాయా, నేనడిగినవి దొరికాయా అంటూ పలకరిస్తూ మొత్తం తిరిగేవారు. ఇకపోతే మహదేవన్ గారి షాపు, ఇల్లు కూడా ఒకచోటే ఉండేవి. ఆయన వ్యాపారం అంతా కొత్తపుస్తకాలే. అక్కడ కూడా చాలాసేపు పుస్తకాలు తిరగేస్తూ గడిపేవారు. ఆయన షాపు చెన్నయ్ లోని మేధావుల కలయిక కేంద్రం. హైకోర్టు జడ్జీలు, పేరుమోసిన వకీళ్లు, జర్నలిస్టులు, రచయితలు ఎవరో ఒకరు తారసిల్లేవారు. ఆయన ఆర్ట్ 'ఫిలాసఫీ' సాహిత్యం, సోషియాలజీ, రెలిజియన్, హిస్టరీ, పొయిట్రీ, డ్రామాలాంటి అభిమాన విషయాలపై ఎక్కువగా పుస్తకాలు సేకరించేవారు.

Thinkers Library Series, Modern Library Series, Every Man's Library Series. Penguin books ఎన్నో డిక్షనరీలు కలెక్టు చేశారు. విదేశాలకు వెళ్లినప్పుడల్లా ముఖ్యంగా లండన్లో పుస్తకాల షాపులకు వెళ్లి పుస్తకాలు తప్పనిసరిగా కొనుక్కునేవారు.

పుస్తకాలను చక్కని బీరువాలలో అమర్చుకోవటంలో కూడా చాలా శ్రద్ధ వహించేవారు. ఆయన షష్ఠిపూర్తికి ఢిల్లీలో నీలం సంజీవరెడ్డిగారి ద్వారా 61 పుస్తకాలు స్వీకరించారు.

ఆ పాత పుస్తకాలు ఇంటికి తీసుకురాగానే వాటికి ప్రత్యక్షంగా ట్రీట్మెంటు ఇచ్చేవారు. చిమ్మెటలు, సిల్వర్ ఫిష్ చావటానికి దానికి వారు ముద్దుగా పెట్టుకున్న పేరు 'తలస్నానం చేయించటం'. ఆ పాత పుస్తకాలను చక్కగా బైండింగ్ చేయించి వాటి విలువ బట్టి 'రేర్' అని 'అవుట్ ఆఫ్ ప్రింట్' అని రాసుకునేవారు. అలానే వాటికి తనదైన శైలిలో వెలకట్టి దానిపై ధరకూడా రాసేవారు. ఆ పుస్తకాలను రెగ్యులర్ గా దుమ్ము దులపడం, ఫ్లిట్ కొట్టడం, కలరా ఉండలు వేయడం లాంటివి మేము, మా అమ్మగారు సెలవులలో చేసేవాళ్లం. ఆయన తన పుస్తకాలను అరుదుగా ఎవరికైనా చదవటానికి ఇచ్చేవారు. ఇచ్చిన తరువాత మళ్లీ తిరిగి ఇచ్చేవరకు ఊరుకుండేవారు కాదు. ఫోనుచేసి ఎలా ఉంది పుస్తకం? ఎంత వరకు చదివారు? అని వాళ్ళని అడిగినట్లే అడిగి తన పుస్తకం తిరిగి ఇవ్వాలి సుమా తొందరగా అని గుర్తుచేయకనే చేసేవారు.

బుద్ధుడంటే ఆయనకు ప్రత్యేక అభిమానం. అందుకే తన ఇంటికి లుంబిని అని పేరు పెట్టుకున్నారు. అలానే భక్తితో కాక కళాత్మక దృష్టితో శివుని చిత్రపటం, నటరాజు విగ్రహాలు ఉన్న గదిని, శివరూమ్ అని, దేశవిదేశాల నుంచి సేకరించిన బుద్ధ విగ్రహాలు చిత్రపటాలు ఉన్న గదిని బుద్ధరూమ్ అనీ, కృష్ణ విగ్రహాలు ఉన్న గదిని కృష్ణరూమ్ అని, మేవాడ చిత్రకళ గల గదిని మేవాడ్ గది అని పిలుచుకునేవారు. అలాగే అందరికి పరిచయం చేసేవారు. రచనా వ్యాసంగంలో విద్యార్థి దశనుంచి ప్రయోగాలు చేసినా, సంపాదకత్వం నుంచి విరమించిన తరువాత రచన నొక యజ్ఞంగా నిర్వహించారు. ఎంతో రాయాలని తపన పడేవారు. ఆరోగ్యం సరిగా లేక ఆస్పత్రిలో చేరినప్పుడు 'నాకు ఇంకా రెండేళ్లు బ్రతకాలని ఉంది డాక్టరుగారు, ఎందుకంటే ఇంకా నేను రాయవలసింది కొంత మిగిలి ఉంది' అని చెప్పేవారు. అలానే వారికి తన 50వ వివాహ వార్షికోత్సవం కూడా చేసుకోవాలని కోరిక ఉండేది. కాని అలా జరగక ముందే వారు మరణించారు. ఆనాటి 'స్వదేశీ సంస్థానాలు' నుండి అముద్రితమైన 'హిరణ్యకశిపుని హత్య' వరకు ఎన్నో గ్రంథాలు రాశారు. వ్యాసాలైనా. గేయాలైనా, పద్యాలైనా, నాటకాలైనా, విమర్శలైనా ఎన్నెన్నో అన్నింటిలో నాకు బాగా నచ్చినవి కదంబం. మాటామంచి, పిచ్చాపాటి, కొత్తగడ్డ, గాడ్స్, గోబ్లిన్స్ అండ్ మెన్.

వారు తన ముచ్చట్లలో తన తొలిరచన గురించి చెప్తూ ఉండేవారు. కోల్కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెసు సమావేశ తీర్మానాలపై అసంతృప్తితో రాసిన లేఖను 1929 తొలి మాసాలలో పేరు పెట్టకుండా "ఒక యువమిత్రుడి ఆవేదన" అంటూ కాంగ్రెసు పత్రికలో ప్రచురించారు మద్దూరి

అన్నపూర్ణయ్యగారు. తరువాత అదే పత్రికలో "ఉపేంద్ర", "రవీంద్ర" అనే కొన్ని మారుపేర్లతో రచనలు చేశారు. తన మొదటి సంపాదన భారతి మాసపత్రికలో ఒక వ్యాసానికి ఇచ్చిన పాతిక రూపాయలు. కాని ఆయనకు ఆ డబ్బు రచన ప్రచురించి చాలాకాలం అయినా అందకపోతే సంపాదకులైన గన్నవరపు సుబ్బరామయ్యగారికి మదనపడుతూ లేఖ రాశారట. చిన్నవాడినని డబ్బు ఇవ్వక పోయి నట్లయితే, కనీసం భారతి మాసపత్రికను ఒక సంవత్సరంపాటు ఉచితంగానైనా పంపమని కోరారట. ఆ తరువాత వారికి డబ్బు అందినదట. ఆనాటి ప్రాథమిక ఉపాధ్యాయుడికి నెల జీతం కన్నా మూడు రెట్లు ధనం ఒక వ్యాసానికి రావటం చూసి మా నాయనమ్మగారు ఎంతో సంబరపడ్డారని చెప్తూండే వారు. అలా అంచెలంచెలుగా తెలుగు పత్రికా రంగంలో ఎదిగి నాలుగు అంకెల జీతాన్ని తీసుకున్నారు.

నాన్నగారికి మొదటినుండి ఇంగ్లీషు జర్నలిజంపై మక్కువ ఉండేది. ఆయన పట్టాభి సీతారామయ్యగారి సంపాదకత్వంలో జన్మభూమిలో ఇంగ్లీషు వ్యాసాలు రాస్తుండేవారు. తరువాత లాలా లజపతిరాయ్ స్థాపించిన లాహోరులోని పత్రికకు పూనా నుండి తిలక్ స్థాపించిన మరాఠా పత్రికల్లో ఆంగ్ల వ్యాసాలు పడ్డాయట. ఆ తరువాత అప్పుచేసి ఢిల్లీ వెళ్ళి హిందూస్థాన్ టైమ్స్ లో చేరాలని విఫలయత్నం చేశారు. చెన్నయ్ లో 1935 నుండి నాలుగేళ్ళు ఆర్థికంగా చాలా కష్టపడాల్సి వచ్చిందని, అప్పుడప్పుడు డబ్బు లేకపోతే పస్తులు ఉండటం లేదా పాత న్యూస్ పేపర్లు అమ్మిన డబ్బుతో సమయం గడిపే వాడినని చెప్పేవారు.

మా నాన్నగారికి మొదటి నుండి కొన్ని ఆశయాలు, ఆదర్శాలు ఉండేవి. 1938 ఏప్రిల్ 24న చెన్నయ్ మానస సరోవర్ అనే హోటల్లో మా అమ్మగారిని ఏమీ కట్నకానుకలు లేకుండా రిజిష్టరు మ్యారేజి చేసుకున్నారు. అది ఈనాడు సర్వసాధారణ విషయమే అయినా ఆనాడు అది ఆదర్శ వివాహం. వారు తన పిల్లలకు కూడా అలాంటి పెళ్ళిళ్లే చేయాలని కోరుకున్నారు. ఏ ఆడపిల్లకు వారు కట్నం ఇవ్వలేదు. ఏ మగబిడ్డకు కట్నం పుచ్చుకోలేదు. నా వివాహం, మా చెల్లి మీనాక్షి వివాహాలు కూడా రిజిష్టరు మ్యారేజ్ లే. ఆయనకు కుల మత పట్టింపులు కూడా లేవు. ఆయన ఇంటికి వచ్చిన కోడళ్ళు ఇద్దరు వెలమలు, ఒక అల్లుడు మహారాష్ట్ర బ్రాహ్మణుడు. మన వివాహ పద్ధతిలో ఉండే కన్యాదానమనే దాన్ని ఆయన పూర్తిగా వ్యతిరేకించేవారు. ఆడపిల్ల ఏమైనా వస్తువా దానం చేయటానికి?, అలా చేయటం ఆ కన్నెపిల్ల వ్యక్తిత్వాన్ని కించపరచటమేనని ఆయన భావన. అలా అని తన భావనలను ఇతరులపై రుద్దటానికి ప్రయత్నించేవారు కాదు. ఆయనకు పూజలు గిట్టేవికాదు. కాని మా అమ్మ పూజచేస్తే వారించేవారు కాదు. ఒక్కసారి మాత్రం నాకు బాగా గుర్తు. మొట్టమొదటిసారి రోదసిలోకి నీల్ ఆమ్ స్ట్రాంగ్ ను పంపినప్పుడు కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఏర్పడి స్పేస్ షిప్ ప్రమాదంలో పడినప్పుడు మా అమ్మను పిలిచి మీ దేవుడుతో చెప్పు, అతను ఏ ప్రమాదం లేకుండా భూమికి తిరిగి చేరాలని అని

చెప్పారు. బహుశా ఆ క్షణంలో ఆయనలోని మానవ ప్రయత్నం ఏవిధంగాను భంగపడకూడదు అనే ఆవేదన, ఆరాటం ఆయనతో అలా అనిపించిందేమో!


నరుని వృద్ధి కంటే పరమ లక్ష్యము లేదు
నరుని జగతి విడిచి పరము లేదు.
నరుడు లేనిచోట నారాయణుడే లేడు.
వాస్తవమ్ము నార్లవారి మాట.

మతము లెన్నియైన మానవత్వము ఒకటి
జాతులెన్నియైన జగతి యొకటి
పథములెన్నియైన పరమార్థమొక్కటే
వాస్తవమ్ము నార్లవారి మాట.

ఆయన ఆస్తికుడూ కాదు. నాస్తికుడూ కాదు. సంశయవాది. ఆగ్నోస్టిక్ హేతువాది. మానవతావాది. హేతువు ఆయనకు పట్టుకొమ్మ. ప్రశ్నకు వారు ప్రాధాన్యం ఇస్తారు.

ప్రశ్న నుండి ప్రశ్న ప్రభవింపకున్నచో★నరుని జ్ఞాన పరిధి పెరుగబోదు
ప్రశ్నలేని బ్రతుకు పసరంబు బ్రతుకురా★వాస్తవమ్ము నార్లవారి మాట.

అలానే పరమ పూజనీయ
గురువాదు లార్గురి చెప్పమన్న పేరు చెప్పవచ్చు.
ఎందు, కెప్పు, డేమి, ఎచ్చ డెట్లు, ఎవరు
వాస్తవమ్ము నార్లవారి మాట



మా చిన్నప్పుడు చెన్నయ్ లో మా అమ్మ రోజూ రాట్నం వడికేది. ఆ నూలు కృష్ణారావుగారి ఖద్దరు షాపులో ఇచ్చి మా నాన్నగారికి కావలసిన పంచెలు, లాల్చీలకు, బనీనులకు గుడ్డ తీసుకునేవారు. ఆ రోజుల్లో ఆ రాట్నం మీద నూలు వడకాలని మేము మా అమ్మ చూడకుండా ప్రయత్నాలు చేసేవాళ్ళం.

ఆ ప్రయత్నంలో కదురు వంకర పోయేది. మా అమ్మచేత చివాట్లు తప్పేవి కావు. నాన్నగారి ఆగ్రహావేశాలకు రాగద్వేషాలకు షాక్ అబ్జార్బర్గా మా అమ్మ ఉంటుండేవారు. చాలా విషయాలలో వారితో ఏకీభవించక పోయినా అవగాహనా లోపం ఉండేది కాదు. తన కోసం పిల్లలు త్యాగం చేసి వారి భవిష్యత్తును పాడుచేసుకోరాదని వారి ఉద్దేశ్యం. కనుక విదేశాలకు పోతామంటే మా తమ్ముళ్ళకు కాని, చెల్లెలుకు గాని అభ్యంతరం చెప్పకపోగా ప్రోత్సహించారు. ఆయన మమ్మల్ని ఎన్నిభాషలు వస్తే అన్ని నేర్చుకోమని ప్రోత్సహించే వారు. కాని అదేం విచిత్రమో చెన్నయ్ లో ఉన్న 30 సంవత్సరాలలో ఒక్క ముక్క తమిళం కూడా నేర్వలేదు. దక్షిణ ప్రాంతం టూర్ వెళ్లినపుడు తంజావూరు, మధుర, కంచి, రామేశ్వరం లాంటి ప్రదేశాలు సందర్శించినపుడు ప్రతి దేవాలయానికి వచ్చేవారు. దేవుణ్ణి పూజించడానికి కాదు. అక్కడ ఉన్న కళాసంపదను తిలకించడానికి. ప్రతి ప్రతిమ గురించి విపులంగా తెలియ చెప్పేవారు. ఎవరి కాలం కట్టడాలో, ఎలాంటి శైలి, ఆ శిల్పం వెనుక గల గాథ కళ్లకు కట్టినట్లు వివరించేవారు. మా నాన్నగారి దగ్గరకు ఎందరో ఉద్యోగార్థులై వచ్చేవారు. అలానే ఇతరులకు తమను రికమెండ్ చేయమని వచ్చేవారు, లేక కాలేజీలో సీట్లకోసం అర్థించేవారు. వచ్చిన అందరికి సహాయం చేయలేదేమోగాని చాలామంది అర్హతలున్నవారికి తప్పక సహాయం చేసేవారు. చాలా మంది ఇప్పటికి ఆయన చేసిన సహాయం గుర్తుచేసుకుంటూ ఉంటే ఎంతో ఆనందంగా ఉంటుంది.

నాన్నగారు తమ జీవితంలో ఎన్నో సన్మానాలను, సత్కారాలను పొందారు. కాని మాకు ఎంతో గుర్తున్నవి మూడు. ఆయన 50వ జన్మదినోత్సవ సందర్భంగా విజయవాడలో జరిగిన స్వర్ణోత్సవం. 13-4-1959 సాయంత్రం విజయవాడ, దుర్గా కళామందిరంలో జరిగిన ఈ సన్మాన సభకు వచ్చినంత జనం మరేసభకు ఎప్పుడూ రాలేదేమో. రాజకీయ, సాంఘిక విభేదాలు విస్మరించి అనేక మంది విద్వాంసులు, విదుషీమణులు, ప్రజా నాయకులు విచ్చేశారు. ఘంటసాల వెంకటేశ్వర రావుగారు ప్రార్థనా గీతం ఆలపించారు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు ఈ సభకు అధ్యక్షత వహించారు. HALFWAY అనే సన్మాన సంచికను డాక్టర్ రాజమన్నారుగారు బహుకరించారు. ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, అల్లూరి సత్యనారాయణరాజు, అక్కినేని నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. అలానే ఆయన గత మూడు దశాబ్దాల నుండి తన పత్రికా సంపాదకీయంతో ఆంధ్రప్రజలకు వివిధ రంగాలలో చేసిన సేవలు గుర్తించి 1968 డిసెంబర్ 1న ఢిల్లీలోని ఆంధ్రకు చెందిన పార్లమెంటు సభ్యులు, అధికారులు, ఆంధ్ర ప్రముఖులు కలిపి అప్పటి భారత ఉపరాష్ట్రపతి వి.వి.గిరిగారి అధ్యక్షతన సన్మానించారు. ఆ సందర్భంలో ఆయన ఆదేశంతో రాయించిన Studies in the History of Telugu Jorunalism అనే గ్రంథాన్ని కూడా సన్మాన సంఘం వారే ప్రకటించి ఆయనకు బహూకరించారు.

1-12-1978 ఆయన 71వ పుట్టినరోజున వంశీ ఆర్ట్స్ వారు చేసిన సన్మానం కూడా విశిష్టమైనదే. అలానే వంశీ ఆర్ట్స్ థియేటర్ స్థాపించిన ఆరు సంవత్సరాలలో వారు నిర్వహించిన 71వ కార్యక్రమం కావటం కూడా యాదృశ్చికమే. ఆయన ఎడిటరుగా పనిచేసినా, చేయకపోయినా ఊపిరి ఉన్నంతవరకు తను నమ్మిన జీవిత విలువలకై పోరాడారు. తండ్రిగా, తనయుడుగా, భర్తగా, సంపాదకుడుగా, రచయితగా, కవిగా, కథకుడుగా, వ్యాసరచయితగా, రాజకీయవేత్తగా, పార్లమెంటేరియన్, కళాభిమానిగా, పుస్తక ప్రియుడిగా మానవతావాదిగా ఎంతో ఉన్నత శిఖరాలను ఆయన అధిరోహించారు.

యువ ఆర్టిస్టులకు వారి చిత్రాలను పత్రికలో ప్రచురించి వారికి పారితోషికం పంపడం ద్వారా అనేక మందిని ప్రోత్సహించేవారు.

అనేకమంది ఉద్యోగార్థులై వచ్చేవారు. సహాయం పొందినవారేకాక, సహాయం పొందని వారుకూడా కలిసినప్పుడు కృతజ్ఞతలు తెలిపిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు ప్రముఖ సినీ నటులు కైకాల సత్యనారాయణగారు ఒక సందర్భంలో ఉద్యోగం కోసం వారిని కలిశారు. కారణాంతరాల వల్ల వారికి సహాయం చేయలేకపోయారు. ఒక సినిమా ఫంక్షన్లో కలిసినపుడు ఆనాడు మీరు నాకు ఉద్యోగం ఇచ్చి ఉంటే నేను ఈనాడు నటుడుగా గుర్తింపు పొందలేకపోయేవాడిని కదా! అని సభలో చెప్పడం గమనార్హం.

ఆయన జీవితం మా అందరికి ఆదర్శం, మార్గదర్శకం. ఆయన బిడ్డల మైనందుకు మేమెంతో గర్వపడ్డాం. ఆయన ఆశలకు, ఆశయాలకు వారసులమై ఎంతోకొంత ఆచరణలో పెట్టగలిగితే మా జీవితాలు ధన్యమైనట్టే.

మా అమ్మగారు

మా నాన్నగారి గురించి రాసేదేమైనా మా అమ్మగారి ప్రస్తావన లేకపోతే అసంపూర్తిగా ఉంటుంది.

మా అమ్మ నార్ల సులోచనాదేవి... ఈ పేరు మాత్రమే చెపితే గుర్తుపట్టేవారు బహుకొద్దిమందే. కాని మిసెస్ నార్ల అంటే చాలా ముఖాల్లో చిరుదరహాసం, కళ్ళల్లో చిన్న మెరుపు. చిన్న పిల్లల్లో చిన్న పిల్లాలా, పెద్దవాళ్ళతో పెద్ద తరహాగా మసలే మా అమ్మది ఒక విశిష్ట వ్యక్తిత్వం.

ఎనిమిది మంది సంతానంలోకి ఎవరికీ ఆవిడ అందం రాలేదు. ఒక్క కుమార్తెకు తప్ప. అయితే ఇక్కడ Bernard Shaw కు, బ్రిటిష్ నటికి జరిగిన హాస్య సంభాషణ గుర్తుకు వస్తుంది.

ఈ అందగత్తె ఆయనతో "మనం పెళ్ళి చేసుకుంటే మనకు పుట్టే పిల్లలు నాలా అందంగా, మీలా తెలివైనవారుగా ఉంటారు గదా? అని అంటే 'నిజమే అలాకాక నా అందం నీ తెలివి వస్తేనో?' అని చమత్కరించారట. అలా అని మా అమ్మ తెలివి తక్కువమనిషిగాదు. చాలా వివేకవంతురాలు. అయితే పెద్దగా చదువుకోలేదు. మా అందరికి మా అమ్మ అందం రాకపోయినా మా తండ్రిలా అందరం ఉన్నత విద్య అభ్యసించి డాక్టర్లమయ్యాం. నార్లగారికి ఆంధ్రా, నాగార్జున, శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసిన తరువాత మన కుటుంబంలో అందరూ డాక్టర్లే, మీ అమ్మ తప్ప, ఆవిడకు మనం అందరం డాక్టరేటు ప్రదానం చేస్తే పోలా అని ఆటపట్టిస్తూ ఉండేవారు.

ప్రతిమనిషి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందనే మాట నార్లగారి విషయంలో అక్షరాలా నిజం. వారు బాల్యంలో తల్లి మహాలక్ష్మమ్మ ప్రోత్సాహంతో ఉన్నత విద్య అభ్యసించగలిగితే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగటానికి ఆయన వెంట నిలిచి సుఖదుఃఖాలను, కష్టనష్టాలను పంచుకుంటూ నిలిచారు సులోచనాదేవి. సంపాదకుడుగా తన వృత్తిని, ప్రవృత్తియైన రచనా వ్యాసంగాన్ని నిరాఘాటంగా నార్లగారు సాగించగలిగారంటే అందుకు ఆవిడ ఇచ్చిన సహాయ సహకారాలే కారణం. కుటుంబ విషయాలేవీ నాన్నగారు పట్టించుకునేవారుకాదు. హోం మినిష్టరుగా అంతా ఆవిడే చూసుకునేవారు. నార్లగారు ఎంత మేధావి అయినా తన స్వవిషయంలో చిన్న పిల్లవాడిలాగా ఉండేవారు. రచనలో పడితే వేళకు స్నానం, భోజనం అనేవి ఆయనకు గుర్తుకు వచ్చేవికావు. వెంటపడి మరి ఆయన అవసరాలను గమనించేది ఆవిడ. బయటకు వెళ్ళేప్పుడు తలకు నూనెరాసి, తలదువ్వి జేబులో మర్చిపోకుండా డబ్బు పెట్టి పంపాల్సి వచ్చేది. నాన్నగారికి 1964లో హార్ట్ అటాక్ వచ్చాక ఢిల్లీగాని, మరే ఊరుగాని వెళ్ళేప్పుడు వారితో తప్పక వెంట వెళ్ళేదావిడ విజయవాడలోనో, హైదరాబాదులోనో మా కుటుంబాన్ని వదలి.

చెరుకూరి సత్యనారాయణ, శశిరేఖ దంపతులకు కృష్ణా జిల్లా, పెరిసేపల్లి అనే కుగ్రామంలో పెద్ద కుమార్తెగా జన్మించిన సులోచనాదేవి వివాహానంతరం చెన్నయ్ వెళ్లడానికి రైలెక్కినప్పుడు అదే మొదటిసారి రైలును చూడటంగాని, ఎక్కడంగాని. అటువంటి వ్యక్తి తర్వాత ఇండియాలోనేకాక, విదేశాలలో కూడా ధైర్యంగా ప్రయాణించడం ఊహించని పరిణామం. కారణాలు ఏమైనా చదువు ఐదవ క్లాసుతో ఆగిపోయింది. కాని ఆవిడ పరిజ్ఞానం మాత్రం అపారం. తెలుగు పేపర్లు కూలంకషంగా చదవడమే కాదు, రేడియోలో, టి.వి.లో ఇంగ్లీషు న్యూస్ చక్కగా ఫాలో అవగలిగేవారు. దేశ రాజకీయాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవడమే కాక, విశ్లేషించి మాట్లాడుతూ ఉంటే మేమంతా ఆశ్చర్యపడేవాళ్ళం. నాన్నగారు 12 సంవత్సరాలు పార్లమెంటేరియనుగా ఉన్నప్పుడు, ప్రతి సెషనుకు ఆయనతోపాటు ఆమె కూడా ప్రతిరోజూ పార్లమెంటుకు వెళ్ళి విజిటర్సు గ్యాలరీలో కూర్చుని ప్రొసీడింగ్సును ఆలకించేవారట.

విసుగు, విరామం లేకుండా ఇంటిపనితో పాటు నాన్నగారికోసం వచ్చేవారికి అతిథి సత్కారాలు చేసేదావిడ. ఇజ్రాయిల్ నుండి ఈసన్బర్గ్ దంపతులుకాని, అలహాబాదు (ఢిల్లీ) నుండి నేషనల్ హెరాల్డ్ సంపాదకులు చలపతిరావుగారు కాని నాన్నగారితో కొంతసమయం గడపడానికీ కాక అమ్మ ఆతిధ్యం కోసం తరచు మా ఇంటికి వస్తూండేవారు. సులోచనాదేవి చాల స్వతంత్ర భావాలుగల వ్యక్తి. నాన్నగారి మరణానంతరం మేమెంతో కోరినా మా ఎవరి ఇంట ఉండకుండా పాతికేళ్ళు ఒక్కరే హైదరాబాదులో జీవించారు తన స్వగృహంలో. ఆవిడకు కుమార్తెల కన్న అల్లుళ్ళపైన, కొడుకులకన్నా కోడళ్ళ పైన మక్కువ ఎక్కువ. కోడళ్ళు, అల్లుళ్ళు కూడా ఆమెను అంతే ఆదరించేవారు. నార్లగారి రచనా వ్యాసంగానికి సంపాదకులుగా ఖ్యాతిగడించడానికి మా అందరి ఎదుగుదలకు, మాకు తెరవెనుక నుండి ఎంతో కష్ట నష్టాలను సంతోషంగా భరించిన ఆవిడ మాకు ఎప్పుడూ చిరస్మరణీయురాలే.

ఈ వ్యాస రచయిత్రి డాక్టరు కొల్లి శారద నార్లగారి పెద్దకుమార్తె. వీరు, వీరి భర్త డాక్టరు



గంగాధరరావుగారితో కలిసి 1966 నుంచి 2004 వరకు గుంటూరులో వైద్యసేవలు అందించారు. శారదగారు నాగార్జున విశ్వవిద్యాలయ మొదటి సెనేట్ సభ్యులు. గుంటూరులో సారా, మద్యపాన వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. 1983 నుంచి తెలుగుదేశం పార్టీతో సంబంధం ఉంది. 1995లో గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ కు తొలి మేయరుగా ఎన్నికయ్యారు. 2003లో విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి పట్నాల అభివృద్ధి సంస్థకు ఛైర్మన్ గా ప్రభుత్వంచే నియమితులై, 2004లో పదవీ విరమణ చేశారు. నార్ల రచనలు సంపుటాలుగా పునర్ముద్రించడంలో కీలకపాత్ర వహించిన సౌజన్యమూర్తి.

అనుబంధం

పుస్తకాలే ఆమె ఆభరణాలు!



నార్ల సులోచనాదేవి సుదీర్ఘ ఫలవంత జీవితం గడిపిన వ్యక్తి. నార్ల వెంకటేశ్వరరావు భార్యగా ఆమె అనుభవాల పుట్ట. ఎందరో మహానుభావులు ఆమె అతిథి సత్కారాలు స్వీకరించి ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుగా నార్ల ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నా, సులోచన తొణకకుండా ఆయన్ను కాపాడుకున్నది.

కృష్ణా జిల్లాలో ముదినేపల్లి గ్రామం నుండి ఘోషాల మధ్య పెరిగిన సులోచన ప్రాథమిక విద్యాభ్యాసంతోనే ముగించారు. 1938లో నార్ల వెంకటేశ్వరరావుతో చెన్నయ్ లో రిజిష్టర్ వివాహం జరిగిన తరువాత ఘోషా తొలగిపోయింది. చెన్నయ్ లో నార్ల ఎడిటర్ గా ఆంధ్రప్రభను నడుపుతున్న రోజుల్లో గృహిణిగా, సంతానలక్ష్మిగా సులోచన పిల్లల్ని అతి జాగ్రత్తగా పెంచారు. నార్లవారు సులోచనకు పుస్తకం అంకితం ఇస్తూ "కొని ఇవ్వలేని నగలు, చీరెల బదులు' అన్నారు. సంతానమే సంపదగా చూచిన సులోచన హుందాగా జీవితం సాగించి, భర్త సున్నిత ఆరోగ్య రీత్యా వారిని అద్దంలా చూసుకునేవారు. నార్ల వెంకటేశ్వరరావుతోబాటుగా సులోచన దేశ, విదేశాలన్నీ పర్యటించారు. అనేకమంది నార్లగారి కోసం ఇంటికి వస్తుండడం వలన వారి సంభాషణలు వింటూ ప్రవృత్తులు తెలుసుకుంటూ సులోచన ఆయా మనుషుల్ని బేరీజు వేసేవారు. ఆ విధంగా రచయితలు, కవులు, రాజకీయవాదుల మనస్తత్వాల్ని ఔపోశనం పట్టారు. అందులో పురాణం సుబ్రహ్మణ్యశర్మ, డి. ఆంజనేయులు, బెజవాడ గోపాలరెడ్డి, ఎసికె ఆచార్య పేర్కొనదగినవారు. నార్లగారు చనిపోయిన తరువాత ఆయన 40 సంవత్సరాలపాటు సేకరించిన గ్రంథాలు. రాసిన డైరీలు, అట్టిపెట్టిన అరుదైన కళాఖండాలు సులోచన సంరక్షణలో సురక్షితంగా ఉండేవి. ఆ గ్రంథాలన్నీ ప్రస్తుతం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి ఇచ్చి తృప్తి చెందారు. సంవత్సరానికో మారు నార్ల పేరిట జరిగే ఉపన్యాసం కూడా సులోచన ఆర్థిక సహాయం వలననే సాధ్యపడింది. వ్యక్తుల మనస్తత్వాలు ఇట్టే పసిగట్టి దగ్గర వాళ్ళకు వారి స్వరూప స్వభావాలు విడమరచి చెప్పి సులోచన ఆశ్చర్యంలో ముంచెత్తేవారు. లండన్లో స్థిరపడిన గూటాల కృష్ణమూర్తి, తుమ్మపూడి నుండి సంజీవదేవ్, ఢిల్లీ నుండి ఎడిటర్ ఎం. చలపతిరావు నార్ల ఇంట్లో ఉంటూ ఎన్నో చర్చలు జరిపేవారు. అలాంటి వారి గురించి సులోచన నుండి ఆమె కోణంలో ఎన్నో సంగతులు విన్నాను. సులోచనగారి ఆతిథ్యం స్వీకరించిన వారెవరూ ఆమె ఆప్యాయతను తలచుకోకుండా ఉండలేరు. ఆమె సంతానంలో పెద్ద కుమార్తె శారద మినహా మిగిలిన వారంతా అమెరికాలో డాక్టర్లుగా స్థిరపడి మంచి దశలో ఉన్నారు.

ఎన్. ఇన్నయ్యగారు 1937 అక్టోబర్ 31న పాతరెడ్డిపాలెం చేబ్రోలు గుంటూరు జిల్లాలో జన్మించారు. చేబ్రోలు, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ; "ఆధునిక విజ్ఞాన తాత్విక ఫలితాల'పై 'పిహెచ్.డి'. పట్టా పొందారు. సంగారెడ్డిలో ఉపాధ్యాయులుగా, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉపన్యాసకులుగా పనిచేశారు. పత్రికారచన చేయసాగారు. 'ప్రసారిత' త్రైమాస సామాజికశాస్త్ర పత్రికకు సహసంపాదకులుగా పనిచేశారు. అమెరికా నుండి వెలువడిన "ఎన్ సైక్లో పేడియా ఆఫ్ అన్బిలీఫ్"లో భారతదేశం గూర్చి 1975 లో ప్రత్యేక వ్యాసం రాశారు. ఎం.ఎన్.రాయ్, ఎ.బి. షా, వి.బి. కర్నిక్ రచనలను తెనిగించారు. ఆంధ్రప్రదేశ్లో రాజకీయాలు, పార్టీలు, ప్రభుత్వం, కుల వ్యవస్థ మొదలైన అంశాలపై ప్రత్యేక పరిశోధన జరిపి పుస్తకాలు వెలువరించారు. మానవత, సెక్యులర్ ఉద్యమాలలో పాల్గొంటుంటారు. నార్లకు మంచి మిత్రులు.

నార్లవారి సాహచర్యం – కొన్ని జ్ఞాపకాలు

– యోగానంద

ఈ శతాబ్ది ప్రారంభంలో ఆంగ్ల భాషాధ్యయనం చెయ్యదలచినవారు రఘుపతి వెంకటరత్నం నాయుడుగారి వద్ద చదువుకోడం, కవితా వ్యాసంగానికి దిగదలచినవారు చెళ్లపిళ్ల వారి ఆశ్రయం పొందడం ఎలా సుకరంగా భావించేవారో – కిందటి తరంలో జర్నలిస్టులు కాగోరిన వారు నార్ల వారి వద్ద పనిచేసే అవకాశం లభించడం అటువంటి మహద్భాగ్యమని ఉప్పొంగిపోయేవారు. మా కోట సుబ్బారావుగారి పుణ్యమా అని అట్టి సదవకాశం లభించిన కొద్ది మందిలో నేనొకణ్ణి,

1929 లో ముట్నూరి కృష్ణారావుగారు జైలుకు వెళ్లినప్పుడు వారి సూచనపై ఈ కోట సుబ్బారావుగారే "కృష్ణాపత్రిక"కు సంపాదకత్వం వహించి, నాలుగేళ్ల పాటు ప్రతిభావంతంగా నడిపారు. అప్పుడు బందరు నోబుల్ కాలేజిలో చదువుకొంటున్న నార్లవారు నిత్యం “కృష్ణా పత్రిక” ఆఫీసుకు వస్తూ, పత్రికకు కావలసిన హంగులెన్నిటినో సమకూరుస్తూ సుబ్బారావుగారికి కుడి భుజంగా ఉండేవారు. జర్నలిజం పట్ల ఆయనకు సహజంగా ఉన్న ఆసక్తి ఆ రోజుల్లోనే మరింత పెంపొంది, జర్నలిస్టుగానే జీవయాత్ర సాగించాలనే నిశ్చయానికి వచ్చారు. కృష్ణారావుగారు జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా కొద్దిరోజులు ఆయన “కృష్ణాపత్రిక”కు రచనలు అందిస్తూ ఉండేవారు. తాను రాసిన "స్వదేశ సంస్థానాలు” అనే పుస్తకాన్ని సమీక్ష నిమిత్తం కృష్ణారావుగారికిస్తే దానిపై ఆయన ఏకంగా సంపాదకీయమే రాశారని ఆ రోజుల్లో ఆయన గర్వపడ్డారు కూడా.

బందరు వంటి చిన్న ఊర్లో కాకుండా మద్రాసు వంటి మహానగరానికి వెళ్తే, పైకి రావడానికి ఇంకా ఎక్కువ అవకాశాలు లభిస్తాయని మరి కొద్ది రోజులకే ఆయన చెన్నయ్ కు ప్రయాణం కట్టారు. ప్రకాశంగారి 'స్వరాజ్య'లోను, తాపీవారి 'జనవాణి'లోను, గూడవల్లి వారి 'ప్రజామిత్ర'లోను అప్పుడప్పుడు పనిచేసి తొలి రోజులు వెళ్లమార్చినా – 1938లో “ఆంధ్రప్రభ”లో న్యూస్ ఎడిటర్గా చేరిన తర్వాతగాని ఆయనకొక స్థాయి చిక్కలేదు. 1942లో ఆయన దాని సంపాదకత్వ బాధ్యతను స్వీకరించి, పూర్తిగా స్థిరపడ్డారు.

చెన్నయ్ నుంచి, భారతదేశంలోని ఇతర ప్రాంతాల నుంచి మాత్రమే కాక, విదేశాల నుంచి వచ్చే పత్రికలను కూడా నిరంతరం చదువుతూ ఉండే నార్లవారు ఆయా పత్రికల పోకడలను, అలంకరణ, తీరుతెన్నులను, విమర్శనాపద్ధతులను సమగ్రంగా ఆకళింపు చేసుకొని ఆ కొత్త

వరవడులన్నిటినీ "ఆంధ్రప్రభ"లో ప్రవేశ పెట్టారు. అంతకు ముందున్న తెలుగు పత్రికల స్వరూపం తెలిసిన వారికిగాని, నార్లవారు తీసుకొచ్చిన మార్పులు ఎంత విప్లవాత్మకమైనవో అర్థంకాదు.

అంతవరకు పత్రికలలోని శీర్షికలు matter of fact గా ఉండేవి. ఉదాహరణకు 1947 ప్రారంభంలో ప్రధాని నెహ్రూ పూనికపై ఢిల్లీలో ఆసియా రాజ్యాల మహాసభలు జరిగినాయి.

దేశంలోను, ప్రపంచంలోను ఎంతో సంచలనం కలిగించిన ఆ వార్తకు "ఢిల్లీలో ఆసియా రాజ్యాల సభలు ప్రారంభం" అన్నట్టుగా ఇతర పత్రికలు శీర్షికలు పెడితే, నార్లవారు "ప్రబుద్ధ ప్రదీప్త ప్రాచ్య ప్రపంచం" అనే శీర్షికను 72 పాయింట్ టైపులో పెట్టి ప్రచురించారు. ఆ వార్తపై రాయబోయే ఎడిటోరియల్లోని భావం 50వ వంతు శీర్షికలోనే వచ్చేసిందన్న మాట!

అలాగే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో "జయజయ భారత జనయిత్రి దివ్యగాత్రి" అన్న పెద్ద శీర్షిక పెట్టి దానిక్రింద "చిరదాస్య తిమిరాలను చీల్చుకుంటూ భారత స్వాతంత్ర్య భానూదయం" అని ప్రచురించారు. గాంధీగారు పోయినప్పుడు "నాడు ఏసుక్రీస్తు శిలువకు బలి–నేడు గాంధీజీ తుపాకీకి బలి" అని పతాక శీర్షిక పెట్టారు. మరునాడు గాంధీజీ దహన సంస్కారం జరిగిన వార్తను నేను రాసి దానికి "స్వర్గసీమకు భారతావని నీరాజనం" అన్న శీర్షిక పెట్టి చూపించాను.

ఆయన పదిక్షణాలు ఆలోచించి, ఐడియా బాగానే ఉందిగాని, జనానికి సులభంగా అర్థంకాదని దానిని కొట్టేశారు. తర్వాత భారతావనిలో గాడాంధకారం. స్వర్గధామంలో దివ్య ప్రభలు" అన్న శీర్షిక క్రింద దానిని ప్రచురించారు. మరి జిన్నా పోయినప్పుడు "కరాచీలో కయిదే అజం కాలధర్మం" అని సింపుల్ గా రాసి ఊరుకున్నారు.

ఘుమఘుమ లాడే శీర్షికలెన్నింటినో పెట్టి వారి మన్ననలను పొందిన నేనొకసారి గంగానదికి వరద వచ్చి కాశీ వీధులలోకి నీరు పారడం వల్ల కొన్నిచోట్ల జనం పడవలపై తిరుగుతున్నారన్న వార్తకు "గంగానదీ జలాలలో కాశీనగరం తెప్పతిరునాళ్ళ రాజవీధులలో పడవలపై పౌర విహారం" అనే శీర్షిక పెట్టి పంపించాను. ఆయన ఎంతో సంతోషిస్తారని నా ఆశ. వెంటనే నన్ను ఆయన పిలిచి, "శీర్షిక ఆకర్షణీయంగా ఉండడమేకాదు. అది వార్తలోని విషయానికి తగినట్టుగా కూడా ఉండాలి. అక్కడ జనం వరదతాకిడికి చస్తుంటే, మనమిలా చమత్కారంగా హెడ్డింగులు పెట్టుకోవడం వారిని వెక్కిరించడం అన్నమాట. ఇది bad taste హెడ్డింగు మార్చండి" అన్నారు.

ఇలా శీర్షికల విషయంలో మాత్రమేకాక పత్రికలో ప్రకటించబడే ప్రతి చిన్న విషయంలోను కూడా ఔచితికి భంగం కలగకుండా ఆయన జాగ్రత్త పడేవారు.

ఒకసారి ఒక రచయిత తన వ్యాసంలో అమృతాంజనం ద్వారా ధనార్జన చేసిన నాగేశ్వరరావుగారు “ఆంధ్రపత్రిక”ను నెలకొల్పి దానిని సద్వినియోగపరచారని రాశారు. "కృష్ణా పత్రిక” కోర్టు ప్రకటనలవల్లనే ఎక్కువ రాబడి వస్తుందని రాశారు. పేజీప్రూఫ్లో ఈ విషయాలు చూచిన నార్లవారు చిందులు తొక్కుతూ ఆ వ్యాసం కంపోజింగ్ కు ఇచ్చిన వారిని పిలిచి ఎడిట్ చేసేటప్పుడు ఈ అంశాలు ఎందుకు తీసెయ్యలేదని కోప్పడ్డారు.

వారికోపానికి కారణం ఆ రోజుల్లో ఒక జోక్ ఉండేది. "ఆంధ్రపత్రిక"ను పంపించి, అది చదివితే వచ్చే తలనొప్పి పోవడానికి అమృతాంజనం విక్రయిస్తున్నారని, అలాగే కృష్ణారావుగారి ఎడిటోరియల్స్ కోసం కృష్ణా పత్రికను కొనేవారు. ఈ కోర్టు ప్రకటనలు చూడలేక చస్తున్నారనీ అందువల్ల అటువంటి వెటకారానికి అవకాశాలిచ్చే వార్తలను పత్రికలో ప్రచురించరాదని వారి ఆదేశం.

ఆయన పత్రికా కార్యాలయంలో పనిచేసేది ఏడెనిమిది గంటలే అయినా నిజానికి 24 గంటలూ ఆయనకదే ధ్యాస. ఏ కారణం వల్లనైనా పత్రిక ముద్రణ త్వరగా పూర్తి అయితే, ఆయన మమ్మల్ని ఇంటికి వెళ్ళనిచ్చేవారు కాదు. "ఏ చర్చిల్ పోయినట్లో వార్త వస్తుందేమో అయిదింటి వరకు చూసి వెళ్ళండి" అనేవారు నవ్వుతూ.

పై చెప్పిన విషయాలను బట్టి, నార్ల వారంటే మంచి శీర్షికలు పెట్టి పత్రికను అలంకరించడంలో మాత్రమే ఎక్స్పర్టు అని భావించడం పొరపాటు. సంపాదకీయ రచనలో కూడా వారు సిద్ధహస్తులని, వాటిలో ఎన్నో ఉత్తమ సాహిత్యస్థాయికి చెందినవి ఉన్నాయని – పుస్తక రూపంలో వెలువడ్డ ఆయన వ్యాసాల సంకలనం చూస్తే తెలుస్తుంది. గాంధీజీ పోయినప్పుడు “హంతకులెవరు?” అన్న శీర్షిక క్రింద ఆయన వరుసగా రాసిన సంపాదకీయాలు చదివి వేటూరి ప్రభాకరశాస్త్రిగారంతటి వారు “మీకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను” అని రాశారు. "మీ లేఖను ఆశీర్వచనంగా భావిస్తున్నాను" అని సమాధానమిచ్చారు నార్లవారు.

కొన్ని సందర్భాల్లో ఆయన రాసిన సంపాదకీయాలు వాదోపవాదాలకు దారి తీసేవి. జంకూ గొంకూ లేకుండా వాటిని ఆయన ఎదుర్కొనే వారు. ఆ పట్టులో వారి రచనా సంవిధానం బాణాకర్ర తిప్పుతున్నట్టుగా ఉండేది. ఎవరైనా వారిపై రాయి విసిరితే, అది కర్రకు తగిలి, తిరిగి విసిరిన వారి నెత్తినే పడుతుంది!!

సంపాదకీయ రచన వరకు తన సిద్ధాంతాలను, విశ్వాసాలను అనుసరించి పోయినా, ఇతర విషయంలో పాఠకుల అభిప్రాయాలకు, అన్యుల భావాలకు కూడా అవకాశమిచ్చేవారు నార్లవారు.

జ్యోతిష్యంలో ఆయనకెంత మాత్రం నమ్మకం లేదు. కాని తమ పత్రికలో వారఫలాలు విధిగా ప్రకటించేవారు. ఉగాదినాడు ఒక పేజీలో పంచాంగం కూడా ప్రకటించేవారు.

తనవద్ద పనిచేసేవారిలో ఎవరికి ఏ యే అభిరుచులన్నాయో గుర్తించి, అవకాశం వచ్చినప్పుడు వారికి తగిన ప్రోత్సాహమిచ్చేవారు. అలా 1950లో "ఆషామాషీ" శీర్షిక కింద నా చేత ఎన్నో వ్యాసాలు రాయించారు. "చెప్పే తీరు చమత్కారంగా ఉన్నా, చెప్పదలచుకున్న విషయం గంభీరార్ధ స్ఫోరకంగా ఉండాలని, నాలుగు జోకులు గుదిగుచ్చి ఒక వ్యాసం తయారు చేసినట్లు ఉండరాద"ని, ఆనాడు వారిచ్చిన సందేశం ఇప్పటికీ నాచెవిలో మార్మోగుతూనే ఉంటుంది.

ఏ విషయంపైనైనా ఒక గంటలో స్వతంత్ర రచన చెయ్యగలగడం, ఏ వార్తకైనా యథోచిత ప్రాధాన్యమిచ్చి ఆకర్షణీయమైన శీర్షిక పెట్టడం, రమ్యంగా పత్రికను తీర్చిదిద్దడం, అర్ధరాత్రి, అపరాత్రి లేపినా కలం ఆడించడానికి సిద్ధం కావడం – ఇవన్నీ నార్లవారి పుణ్యమా అని నాకు అబ్బిన విద్యలు. జర్నలిజం నుంచి నిష్క్రమించి, గ్రంథ ప్రచురణ వృత్తిలోకి మారతానని చెప్పి ఉద్యోగానికి రాజీనామా ఇస్తే – వద్దని చెప్పి, దానిని ఏడాదిపాటు పెండింగులో ఉంచిన ఉదారుడు. చివరకు విధిలేక ఆమోదించారు. ఆయన మాట ఆనాడు వినకపోవడం పొరపాటో, గ్రహపాటో ఇప్పటికీ నాకు తెలియదు!

నార్ల వారిని “కవి”, “నాటక కర్త”, “రచయిత" (పొయెట్, ప్లేరైట్, ఎస్సేయిస్ట్) అని చాలా మంది ప్రస్తుతిస్తూ ఉంటారు. నా దృష్టిలో ఆయన నూటికి నూరు పాళ్ళు జర్నలిస్టు. నిజానికి సిసలైన జర్నలిస్టులో – కవీ, నాటకకర్తా, రచయితా ఈ ముగ్గురూ అంతర్లీనమై ఉంటారు – పంచభూతాలలో ప్రతిదానిలోను తక్కిన నాలుగు భూతాలు లీనమై ఉన్నట్లు!

మొదట చెప్పిన కోట సుబ్బారావుగారు, ముట్నూరి కృష్ణారావుగార్లతో పాటు జర్నలిస్టుగా నాకు శిక్షణ ఇచ్చి నలుగురిలో నిలబెట్టిన నార్ల వారికి కూడా నేను వైజ్ఞానికంగా ఋణపడి ఉన్నవాణ్ణి. ఈ ఋషి ఋణం తీర్చుకోగలిగేది కాదు. వారికిదే నా అక్షర తర్పణం. సులోచనగారూ, తాతారావుగారూ కాలం చేశారు.

‘ఉదయం’ దినపత్రిక సౌజన్యంతో

నార్లవారి పరిణామం

– ఎన్. ఇన్నయ్య

ముసలితనం ముంచుకొస్తుంటే చాదస్తం ముదరడం చాలామందిలో చూస్తున్నాం. నార్ల వెంకటేశ్వరరావు ఇందుకు భిన్నంగా ఎదురీది హేతువాదిగా రానురాను పరిణితి చెందారు. అనేక మందికి ఈ విషయంలో ఆయన మార్గదర్శకులే.

నార్ల పూర్వీకులు 19వ శతాబ్దిలో బ్రిటిష్ సైన్యాలకు ఆహారాది సరఫరాలు కంట్రాక్టు పద్ధతిపై చేసేవారు. ఆ విధంగా వారు ప్రవాసంపోయి మధ్యప్రదేశ్లో స్థిరపడ్డారు. వి.ఆర్. నార్ల 1907లో జబ్బల్పూర్లో పుట్టారు. 8 సంవత్సరాల పాటు అక్కడే ఉన్నందున ఆయన తండ్రి కవుతరం కదలివచ్చే నాటికి, నార్లకు మాతృభాష హిందీయే. కృష్ణా జిల్లా కౌతరంలో ప్రాథమిక, మాధ్యమిక విద్యలో తెలుగు ఇంగ్లీషు నేర్చుకున్నారు. చెరుకువాడ నరసింహం పంతులుగారు అక్కడే ఉపాధ్యాయుడుగా ఉన్నందున, నార్లపై చిన్నప్పుడే బ్రహ్మసమాజ ప్రభావం పడింది. గుంటూరులో ఇన్టర్, కాకినాడ, బందరులో బి.ఏ. చదువుతున్నప్పుడు బ్రహ్మసమాజ ప్రభావం ఎక్కువైంది. కాకినాడలో నార్ల, మరికొందరు కలసి వ్రాత పత్రికను నడిపారు. బందరులో నార్ల ఆనాడే భారతి రచనలు ఆరంభించారు. కృష్ణా పత్రిక, భారతిలో వ్యాసారాలు రాశారు. గన్నవరపు సుబ్బరామయ్య నాయకత్వాన, వ్యాస రచయితలకు 25 రూపాయలు పంపేది. నాటి రూపాయి విలువ వలన అది చాలా పెద్ద మొత్తమే. కృష్ణాపత్రిక ముట్నూరి కృష్ణారావు సంపాదకత్వాన ఎవరికీ డబ్బిచ్చేదికాదు.

ఇన్టర్, బి.ఎ. చదువుల మధ్య స్వాతంత్ర్యోద్యమ కారణంగా నార్ల చదువుకు అంతరాయం కలిగినా, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణ చేశారు. అప్పటికే టెర్రరిస్టు ముఠాలో పనిచేసి బాధలుపడ్డారు.

'నేటి సంస్థానాలు' అనే గ్రంథం నార్ల తొలి రచన. బాగా శ్లాఘపాత్రమైంది కూడా. నాటి రష్యా విప్లవ ప్రభావంలో రాశారు. అది బ్రిటిష్ ప్రభుత్వ నిషేధానికి గురైంది. జర్నలిజంలో స్థిరపడదలచిన నార్ల మద్రాసు చేరుకొని ఉద్యోగాన్వేషణ చేశారు. 'ప్రజాబంధు' సంపాదకుడు ఎన్.జి. ఆచార్య ఆయన్ను అతిధిగా అట్టిపెట్టి ఆదరించారు. ఎన్.జి. రంగా చెన్నయ్ లో నార్లను వెంటబెట్టుకొని ఇండియన్ ఎక్స్ప్రెస్ సంపాదకుడు సంతానానికి పరిచయం చేశారు. చివరకు పాములపాటి కృష్ణయ్యచౌదరి సిఫారసుపై జస్టిస్ పత్రికలో పని నేర్చుకోడానికి మాత్రం వీలైంది.

'సమదర్శిని', 'భారతి', 'ప్రజామిత్ర'లకు వ్యాసాలు రాస్తూ, 1935లో స్వరాజ్యలో చేరారు. 1936లో తాపీ ధర్మారావు సంపాదకత్వాన వెలువడే 'జనవాణి'లో చేరారు. తరువాత నార్ల ప్రజామిత్రలో పనిచేశారు.

1938 ఆగస్టు 1న ఆంధ్రప్రభ న్యూస్ ఎడిటర్ గా చేరిన నార్ల 1942లో ఆ పత్రిక సంపాదకుడై 1958లో బయటకు వచ్చేవరకూ తిరుగులేని ప్రభావాన్ని చూపారు. 1960 నుండి 1976 వరకూ ఆంధ్రజ్యోతి సంపాదకుడుగా ఉంటూ 1970 నుంచి హైదరాబాద్ లో స్థిరపడ్డారు.

చెన్నయ్ లో కొత్తగడ్డ (నాటికలు), 'మాటామంతీ', 'పిచ్చాపాటీ', 'నార్లమాట' వంటి రచనలు చేశారు. విజయవాడలో 'జాబాలి', 'హరిశ్చంద్ర', 'సీతజోస్యం' నాటకాలు రాశారు. వీటికి సుదీర్ఘమైన పీఠికలు రాసి, ఇతిహాసాల, పురాణాల గుట్టు బట్టబయలు చేశారు. అలాంటి నాటకాలు ఇంకా రెండు ప్రచురితం కావలసి ఉంది.

హైదరాబాదు వచ్చే వరకూ నార్ల ఇంగ్లీషు రచనలపై అట్టే దృష్టి పెట్టలేదు. పుస్తకాలు సేకరించడం, చదవడం, సెమినార్లకు వ్యాసాలు రాయడం, విదేశ పర్యటనలు చేయడం, రాజ్యసభ సభ్యుడుగా అనుభవాన్ని సంతరించుకోవడమే సరిపోయింది. హైదరాబాదులో కుదురుగా తన భావాలకు ఇంగ్లీషు రచనల ద్వారా ఇక నిర్దుష్టమైన రూపాన్నిచ్చారు. అప్పటికీ ఆయన బ్రహ్మసమాజం, కాంగ్రెసు భావాన్ని వదిలించుకొని, హేతువాదిగా, మానవతావాదిగా, నాస్తికుడుగా ఆవిర్భవించారు.

వీరేశలింగం, వేమన, గురజాడలపై ఆంగ్లంలో చిన్న పుస్తకాలు నార్ల రాయగా కేంద్ర సాహిత్య అకాడమి వారు ప్రచురించారు. ఇవి ఇతర భారతీయ భాషల్లోకి అనువదించబడడంతో, పునర్వికాస కర్తలను పరిచయం చేసినట్లయింది. ఈ మోనోగ్రాఫ్లలో నార్ల భట్రాజీయం రాయలేదు. వారి జీవిత విశేషాలను, రచనల విశ్లేషణను, వారి భావాల ప్రభావాన్ని పరిశీలించారు. గుణ దోషాలు రెండూ చూపారు. తరువాత గత 40 సంవత్సరాలుగా నార్ల తన ఆలోచనలను, అనేక విషయాల గురించిన తన మనోభావాలను డైరీలలో రాస్తూ పోయారు. వాటిని క్రోడీకరించి, గాడ్స్, గాబ్లిన్స్ & మెన్ అనే గ్రంథంగా రూపొందించారు సుప్రసిద్ధ హ్యూమనిస్టు సుషీల్ ముఖర్జీ. ఈ గ్రంథాన్ని మినర్వా అసోసియేట్స్ పేర ప్రచురించారు. అలాంటి ఆలోచనా స్రవంతినే మరో గ్రంథంగా హైదరాబాదులో 'మేన్ అండ్ హిజ్ వరల్డ్' అనే శీర్షికతో సైంటిఫిక్ సర్వీసెస్ వారు ప్రచురించారు. ఈ పుస్తకాలు చదివి ఎం. వి. కామత్ వంటి ఛాందస జర్నలిస్టులు మండిపడుతూ రివ్యూలు రాశారు. నార్లకు కావలసిందే అలాంటి రియాక్షన్స్. కామత్ సమాధానం చెప్పలేక తిట్లకు దిగాడు న్యూస్ టైంలో,

మైసూరు యూనివర్సిటీలో 'పావర్టీ ఆఫ్ ఇండియన్ ఇన్టలెక్చువల్' అనే పేరిట రెండు ఉపన్యాసాలిచ్చారు. భారతదేశం ప్రాచీన కాలంలో యాజ్ఞవల్క్యుడి బదులు ఉద్దాలకుడి పంథాను అనుసరిస్తే మనకు శాస్త్రీయ మార్గం అలవడేదని నార్ల అందులో అభిప్రాయపడ్డారు. అలాగే ఆధునిక యుగంలో రామమోహనరాయ్ బదులు డిరోజియోను అనుసరిస్తే పునర్వికాసం గట్టిగా వచ్చేదన్నారు.

పాశ్చాత్యలోకం భౌతికమనీ, మనం ఆధ్యాత్మికులమనీ ఉండే మిధ్యా భావాన్ని ఖండిస్తూ నాగార్జున యూనివర్సిటీలో ఉపన్యాసాలిచ్చారు. కర్మ, పునర్జన్మ అనేవి మనపాలిట ఘోర శాపాలైనవనీ, అవి పోతేగాని కులం పోదనీ ఉస్మానియా యూనివర్సిటీలో ఉపన్యాసాలిచ్చారు. ఇవి కూడా చిన్న గ్రంథాలుగా వెలువడినవి.

చనిపోకముందు నార్ల చాలా ఓపికగా, శ్రద్ధగా గీతపై ఒక పరిశోధనాత్మక గ్రంథాన్ని పూర్తిచేశారు. ఇందులో కొన్ని భాగాలు 'రాడికల్ హ్యూమనిస్ట్', 'సెక్యులరిస్టు'లలో ప్రచురిత మయ్యాయి. ఛాందసులు మరోసారి భగ్గుమనే ఈ గ్రంథం హేతువాదులకు చాలా ఉపయోగం. ప్రామాణికంగా గీతలో ఏమేరకు వాస్తవం ఉన్నదీ, అందులో పుక్కిటి పురాణం ఎలాంటిదీ అనే విషయాలు చూపారు. ఇదేవిధంగా పురాణాలపై మరొక రచనకూడా పూర్తిచేశారు.

40 సంవత్సరాల జర్నలిస్టు జీవితంలో నార్లగారు 20 వేల పుస్తకాలను సేకరించి, భద్రపరచి, కేటలాగు తయారు చేయించారు. ఇందులో తెలుగు రెండువేలే. ఇంగ్లీషు పుస్తకాలలో యుద్ధం, ప్రపంచ డ్రామా, భారతీయతత్వం, మతం, హేతువాదం, మానవతావాదం, భారతీయ చింతనాపరుల రచనలు, కళలు, సంస్కృతిపై గ్రంథాలు ఉన్నాయి. నార్ల గ్రంథాలయంలో జీవించేవారని సంజీవదేవ్ వ్యాఖ్యానించారు. ఈ పుస్తకాలు ఆధారంగా ఇంకా పరిశోధకులు హేతువాదంపై విస్తృతంగా పరిశీలన చేయాలని ఆయన ఆకాంక్షించారు.

రాష్ట్రంలో సాహిత్య, లలితకళా అకాడమీల స్థాపనకు కృషిచేసిన నార్ల, వాటి దిగజారుడు తనం చూసి, పునర్ వ్యవస్థీకరించాలని సూచించారు. అందుకు ఆయనపై కాకులు వలె పొడవడానికి స్వార్ధపరులు లేచారు. సామెతలు తయారుచేయడంలో నార్ల సాహిత్య అకాడమికి తోడ్పడ్డారు.

నార్లగారికి రాగద్వేషాలు తీవ్రస్థాయిలో ఉండేవి. మతం పేరిట నటించే వారిని మరీ అసహ్యించుకునేవారు. జర్నలిజంలో కూడా రంగా, ప్రకాశం, గోపాలరెడ్డి, సంజీవరెడ్డి, బ్రహ్మానంద రెడ్డిలపై ధ్వజమెత్తి ప్రజల్ని చైతన్యవంతుల్ని గావించారు.

ఎం.ఎన్.రాయ్ చనిపోయినప్పుడు ఆంధ్రప్రభలో నార్ల సంపాదకీయం రాయలేదు. 1938లో చెన్నయ్ లో జరిగిన ఒక సంఘటనతో ఖాసా సుబ్బారావును పేపరుతో కొట్టబోయినంత పనిచేసిన రాయ్ పై నార్ల ద్వేషం పెంచుకున్నారు. ఆంధ్రప్రభలో రాయ్ కి సంబంధించిన వార్తలు ప్రచురించేవారు కాదు. ఆవుల గోపాలకృష్ణమూర్తి గుంటూరు సభలో వ్యాఖ్యానిస్తూ, "ఎవడో టొంపాయ్ చనిపోతే ఒక వటవృక్షం కూలింది, తార రాలింది అని సంపాదకీయం రాసే నార్ల, ఎం.ఎన్. రాయ్ చనిపోతే రాయలేక పోయాడన్నారు. ఈ విషయం తెలిసి నార్లగారు ఎం.ఎన్. రాయ్ రచనలన్నీ తెప్పించుకొని చదివి, మరుసటి ఏడాది చక్కని సంపాదకీయం రాశారు. రానురాను ఆయన ఎం.ఎన్.రాయ్ తత్వంతో సన్నిహితుడై Caste Complex అనే పుస్తకాన్ని రాయ్ కి అంకిత మిచ్చారు. అలాగే రాడికల్ హ్యూమనిస్టులకు సన్నిహితుడై ప్రేమనాథ్ బజాజ్, నిరంజనధర్, తార్కుండేలకు తన రచనలు అంకితం చేశారు. వీరందరితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం, కలసి చర్చలు చేయడం ఒక విశేషం. ఇటీవలే శిబ్ నారాయణ్ రే హైదరాబాదు వచ్చినప్పుడు నార్ల ఇంటిలో విందుచేసి, సుదీర్ఘ చర్చలు జరిపారు.

నార్ల ఎందరో జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చారు. మరెందరో రచయితల్ని ప్రోత్సహించారు. సెక్యులరిస్టు, హేతువాద, హ్యూమనిస్టు ఉద్యమ సమావేశాల్లో పాల్గొనడం ఉపన్యాసాలివ్వడం నార్ల చేసిన కృషిలో ఒక భాగమే. అనుభవాలు, జ్ఞాపకాలు నార్ల ఎన్నో చెప్పేవారు. అందులో వ్యక్తులతో పరిచయాలు, చేదు నిజాలెన్నో ఉన్నాయి.

హేతువాది మాసపత్రిక సౌజన్యం

గమనిక : డాక్టరు ఇన్నయ్యగారి పరిచయం 28 వ పేజీలో చూడవచ్చు.

మంచి మిత్రులు – నార్ల

– వేగుంట కనకరామబ్రహ్మం

"శరీరానికి వ్యాయామం ఎంత ముఖ్యమో మనసుకు పఠనం అంత ముఖ్యం" – స్టీలె

పై సూక్తి ప్రముఖ పత్రికా సంపాదకుడు, కవి అయిన నార్ల వెంకటేశ్వరరావుగారికి ఎంతగానో అన్వయం అవుతుంది. వివిధ విషయాలపై ఆయన చదివి ఆకలింపు చేసుకున్న గ్రంథాలు అపారం, బహుశః ఆయనకున్నంత పెద్దదయిన స్వంత గ్రంథాలయం ఆంధ్రదేశంలో మరెవ్వరికీ ఉండదేమో! ఆంధ్రదేశంలోనే కాదు భారతదేశంలో కూడా అరుదని చెప్పవచ్చు. పైగా ఆ గ్రంథాలన్నీ విశిష్టమైనవి. విషయ సమగ్రతను సంతరించుకున్నవి. కొన్ని లక్షల రూపాయల విలువైనది ఆ గ్రంథ సముదాయం.

అన్ని విషయాలపై అంతటి గ్రంథ సముదాయాన్ని చదివిన నార్ల ఒక విజ్ఞాన ఖని. గహనమయిన విషయాలను చదివి అర్థం చేసుకోవటం ఒక ఎత్తు. వాటిని విమర్శనా దృష్టితో, విచక్షణా భావంతో, శాస్త్రీయ విజ్ఞానంతో, హేతువాదంతో మేళవించి మంచి రచనా సామర్థ్యం కలిగి ఉండటం ఒక ఎత్తు. అందువల్లనే పత్రికా సంపాదకుడిగా ఆయన ఎంతగానో రాణించాడు. ఆయన సంపాదకీయాలు సాంఘిక ప్రయోజనాన్ని ఎంతగానో సాధించి ప్రగతి పధమునకు బాటలు వేస్తూ ఉండేవి. శక్తి ఒక్కొక్కప్పుడు రాష్ట్ర రాజకీయ గతిని కూడా మార్చి వేసిన సందర్భాలు కలవంటే అతిశయోక్తి కాదు. ఆయన ప్రతి సంపాదకీయం ఒక మినీ కావ్యం. ఆ భాష, ఆ భావం, ఆ విషయ విశ్లేషణ, ఆ చెప్పే తీరు ప్రతి చదువరి గుండెల్లోకి చొచ్చుకుపోయి ఒక కొత్త ఊపిరిని పోస్తూ, కొత్త రక్తం ఎక్కిస్తూ ఉండేది.

"పత్రికొక్కటున్న పదివేల సైన్యమ్ము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్ష లేదు పత్రిక లేకున్న' – నార్ల

పూర్వం కవులు ప్రచ్ఛన్న శాసనకర్తలు (Poets are unacknowledged legislators) అని పేరు గాంచారు. ఈనాడు పత్రికా సంపాదకులకు అది చెల్లుతుంది. ఆ సంగతే "వెయ్యి తుపాకుల కంటె మూడు ప్రతికూల పత్రికలకు ఎక్కువ భయపడతా" నన్నాడు నెపోలియన్.

"పత్రికల బలమే ప్రజల బలం. ఆ బలాన్ని పత్రికలకు రాజులు కూర్చలేదు. సామంతులు కూర్చలేదు. శ్రీమంతులు కూర్చలేదు. ప్రజలే కూర్చారు.

ప్రజలు కూర్చిన బలాన్ని పత్రికలు ప్రజల సేవకే వినియోగించటం కాదా" అని ఒకప్పటి బ్రిటిష్ ప్రధాని డిజరేలి అన్నారు. "పత్రికలు లేకుండా ప్రభుత్వాన్ని నడపటమా, లేక ప్రభుత్వం లేకుండా పత్రికలు నడపటమా అనే ప్రశ్న వస్తే నామట్టుకు నేను ప్రభుత్వం లేకుండా పత్రికలు నడపటానికే నిర్ణయిస్తాను" అని అమెరికా ప్రెసిడెంటు జఫర్సన్ అన్నాడు. పత్రికల శక్తిని గుర్తించినంతనే దేశ రక్షణ దృష్టితో వాటి ప్రాధాన్యత స్పష్టపడుతుంది.

నార్ల పత్రికా సంపాదకుడిగా తనకుతానే సాటి. ఆయన సంపాదకీయాలు ఉద్రూత లూగించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తవి. విజ్ఞానాన్ని ఇనుమడింప చేస్తవి. అవి వివేచనా పటిమను పెంపొందించటంతో బాటు హృదయ వైశాలాన్ని పెంపొందించ గలవు. జర్నలిజంలో ఆయన కృషి అనన్యం. పత్రికా ప్రపంచంలో ఎన్నో క్రొత్త మాటలను సృష్టించాడాయన. ఆయన చేతిలో వ్యావహారిక భాష కావ్యభాషగా రూపొందింది. ఆంధ్రభాషకు తన సంపాదకీయాల ద్వారా వన్నెచిన్నెలు తెచ్చాడు. ఆయన చేసిన ఒక అనువాద వ్యాసాన్ని చూసి ప్రముఖ విద్యావేత్త, మేధావి అయిన కట్టమంచి రామలింగా రెడ్డిగారు "నేనయితే ఇంత బాగా చేయలేను" అని ప్రశంసించాడు.

పత్రికా సంపాదకులలో ఆయన అచ్చం పల్లెటూరివాడు. పల్లెటూరి పలుకుబడి ఆయనలో అధికం. ఏ కొత్త శబ్దం వినపడ్డా వెంటనే నోట్ చేసుకోవటం ఆయన ప్రత్యేకత. ఆయనలో తెలుగు నుడికారపు సొంపులు కోకొల్లలు. ఆనాడు దినపత్రికలు అనేకం ఉండేవి. అయితే నార్ల సంపాదకీయం కోసం ఆంధ్రలోకం ఆతృతతో ఎదురుచూస్తూ ఉండేదంటే అసత్యం కాదు. ఆయనలో మరొక విశేషం. అంతర్జాతీయ విషయాలను అనుక్షణం అర్థం చేసుకోవటం తేటతెల్లంగా తెలియజేయటం.

వెంకటేశ్వరరావుగారి దేశభక్తికి, పలుకుబడికి, మానవత్వానికి ప్రబల నిదర్శనం 1945–55 లలో ఎన్నో లక్షల రూపాయలను తూర్పు కోస్తా తుపాను, రాయలసీమ క్షామం, గోదావరి వరద బాధితులకు తమ పత్రిక ద్వారా విరాళాలు సేకరించుటే. పత్రికా ప్రచారం, గౌరవం సంపాదకుని విమల వర్తనంబట్టి కూడా ఉంటుంది. ఇందులోనూ వీరు ప్రసిద్ధులయిన వారే. ప్రతిరోజూ వచ్చే దూషణ భూషణలను గుర్తించక ప్రజాభిప్రాయాన్ని సువ్యక్తం చేయటంలోను, దాన్ని తీర్చిదిద్దటంలోను ఆయన నిత్యజాగృతిని కలిగియుండటం గమనించదగ్గ విషయం. "Above all is war, There is no greater truth than this." అనేది ఆయన సిద్ధాంతం. ఆయన ఆఖరు శ్వాస విడిచేవరకు ఆ సిద్ధాంతాన్ని వదలలేదు.

మనదేశ స్వాతంత్ర్య సమరంలో మన పత్రికల పాత్ర చాలా ప్రముఖమైంది. స్వాతంత్ర్యానంతరం కూడా నార్ల తన సంపాదకీయాల ద్వారా ప్రజల్లో జాగృతి కలిగించి ప్రజాస్వామ్యానికి అండగా నిలచి

అధిక కృషి చేశాడు. అది నిజంగా ఆనందించ తగింది. అభినందించ తగింది. అంతేకాదు వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమలు, సాహిత్యం, పత్రికలు,పల్లెలు, పట్టణాలు, విజ్ఞాన జగత్తు కళాజగత్తు, మహాపురుషులు, మహిళల జీవితాల పరిచయం, కార్టూనులు, మంచి పుస్తకాల పరిచయాలు మొదలైన ఎన్నో శీర్షికలను దైనిక పత్రికలో ఏర్పరచిన ఘనత కూడా ఆయనదే.

నార్ల కేవలం పత్రికా సంపాదకుడు మాత్రమేకాదు కవి, కథకుడు, వ్యాస రచయిత, నాటక కర్త, విమర్శకుడు, కళాప్రియుడు కూడా. అంతేకాదు స్వాతంత్ర్య సమరయోధుడు కూడా. కారాగార క్లేశం ననుభవించుటయేగాక లాఠీదెబ్బలు కూడా తిన్న బాధితుడు. ఆయన విద్యార్థి దశలోనే రాసిన "స్వదేశ సంస్థానములు" ఎందరి మన్ననలనో పొందింది.

ఆయన కవిత్వానికి "మా వూరు", "నార్లవారి మాట", "జగన్నాటకం", "నవయుగాల బాట నార్లమాట" నిదర్శనాలు, నాటికలకు "కొత్తగడ్డ" "సీత జోస్యం", "జాబాలి" ప్రసిద్ధి. వ్యాసాలకు, విమర్శలకు "మాటా-మంతీ", "పిచ్చాపాటీ", "మూడు దశాబ్దాలు" అనే పేర్లతో వచ్చిన సంపాదకీయాలు చెప్పుకో దగ్గవి. ఆంగ్లంలో రచించిన "వేమన", "వీరేశలింగం", "Gods, Goblins and Men" మొదలయినవి ఎంతగానో ప్రఖ్యాతి గాంచినవి. ఆయన ఆంగ్ల రచనలను ప్రముఖ ఆంగ్ల రచయితలు కె.పి.యస్. మీనన్, కృష్ణ కృపలానీ, డి. ఆంజనేయులు వంటివారు బాగా మెచ్చుకుంటూ ఉండేవారు.

ఆయన రచనల్లో నవ్యత అన్నిటా ఉన్నా "వాస్తవమ్ము నార్లవారి మాట", "నవయుగాల బాట నార్లమాట" నిజంగా ఆంధ్ర సాహిత్యానికి ఒక నూతన అలంకారాన్ని చేకూర్చినవి. ప్రజలలో చైతన్యాన్ని కలిగించే రచనలు అవి నిజంగా ఆలోచిస్తే.

ప్రబంధ యుగంలో ప్రభవించినదాన్ని అధిగమించి అసంభవానికి, హేతువాదానికి ప్రాధాన్యతనిచ్చి నిత్యసత్యాలను నిపుణతతో చెప్పిన మహాకవి వేమన. ఆయన పరమపదించి ఎంతకాలమయిందోగాని ఆయనలో వికసించిన సౌజన్యపు పద్యాలు ప్రతి ఆంధ్రుని హృదయంలోను పద్యరూపాల్లో వాటి సౌరభాల్ని ఇప్పటికీ గుభాళింప జేస్తున్నాయి. ఇంకముందు కూడా అవి వసివాడే అవకాశం లేదు. తెలుగు సాహిత్యమున్నంత వరకు అవి అజరామరం.

వేమన ముద్ర నార్లపై అధికంగా పడినట్లు కనిపిస్తుంది. వేమన అప్పటి తనకాలానికి అన్వయించే జీవితసత్యాలను, నీతులను తన పద్యాలలో పొదిగితే నార్ల అధునాతన కాలానికి అన్వయించే అనుభూతులను, నీతి సూత్రాలను తన మాటల్లో మలచి పద్యాలల్లారు.

ప్రతిపద్యం అరటిపండు ఒలిచి నోటికందించినట్లు చేసిన ఆయన రచనా పాటవం అమోఘం. జాతి, మత కులాది భేదాల కతీతు లయిన ప్రాజ్ఞులు నార్ల రాసిన ఈ పద్యాలను పిల్లల పాఠ్యపుస్తకాలలో వేమన, సుమతి పద్యాల వరుసలో స్థానం ఇవ్వగలరు.

ప్రతి మానవునికి ఉంటాయి మెదడు, గుండె. అయితే అవి అన్నీ ఒక స్థాయిలో ఉంటాయా? పల్లెపదాన్ని ఈసడించే పండిత ప్రకాండులున్నారు. ప్రబంధాల్ని చదవలేని పామరులు ఉన్నారు. కాని నిష్పాక్షికంగా చూస్తే ఇద్దర్నీ స్పందింపజేస్తుంది ఈయన కవిత్వం. ఉభయుల మెదడుకు పనిపెడుతుంది ప్రతి పద్యం.

"నిత్యనైమిత్తికాల నుండి నిరంతర సత్యాల వరకు ప్రత్యంశం ప్రవచించాలి మహాకావ్యం" అని అన్నాడొక మహాకవి ఈమధ్య. ఆ లక్షణాల సమ్మేళనంతో అతిశయించే ఈ రెండు గ్రంథాలు మహాకావ్యాలే నిజంగా.

ఆయన ఆస్తికుడు కాదు, నాస్తికుడు కాదు. సంశయవాది. Agnostic, హేతువాది. మానవతావాది. పైన చెప్పినట్లు మానవుడు ఆయనకు ముఖ్యం, హేతువు ఆయనకు పట్టుకొమ్మ. ప్రశ్నకు ఆయన ప్రాధాన్యత ఇస్తాడు.

ప్రశ్న నుండి "ప్రశ్న ప్రభవింప కున్నచో
నరుని జ్ఞానపరిధి పెరుగబోదు
ప్రశ్న లేని బ్రతుకు పసరంబు బ్రతుకురా" అంటాడు. అంతేకాదు.

ప్రశ్నలేని స్థితికి పయనించినంతనే
సమసిపోవు నరుని జ్ఞానతృష్ణ
శాంతి యొదగునంత స్థాయిత్వమబ్బురా" అనికూడా అంటాడు.

"పరమపూజనీయ గురుపాదులార్గురి
చెప్పమన్న పేరు చెప్పవచ్చు!
ఎందు, కెప్పు, డేమి, ఎచ్చ, టెట్లు, ఎవరు"అని వ్రాక్కుచ్చాడు.

ఇలా ప్రశ్నలే గాక జీవితంలో మెలిగే విధానాలు కూడా చెప్పకపోలేదు.
"సుందరాంగియైన, సురకాంతయైనను
నెయ్యమెరుగకున్న కొయ్యబొమ్మ
అందగత్తెకంటె అనురాగవతి మేలు". అని మాత్రమేకాదు.

"నరుడు లేక నారి చరితార్థ కాలేదు
నారి లేకనరుడు క్రూరుడవును
నలువ కలలపంట నారీనరుల జంట"
అంటూ మానవజీవన సమగ్రతను ఎంతో హృద్యంగా చెప్పాడు. ఇట్లా ఎన్నో. ఎన్నెన్నో?

రచనా శిల్పం ఒక గొప్ప కళ. ఆ కళా ప్రయోజనం రసస్ఫూర్తి, అభ్యుదయం, విశ్వజనీనతగా ఉండాలి. అవన్నీ నార్ల రచనలలో ప్రస్ఫుటంగా కనబడుతూ ఉంటాయి.

నార్ల నాకు మంచి మిత్రులు. విజయవాడలో ఉన్నప్పుడు అప్పుడప్పుడు వట్లూరులో గల మా ఇంటికి వస్తూ ఉండేవారు. ఆయన హైదరాబాదు వెళ్ళిన తరువాత బంజారా హిల్సులో నిర్మించుకున్న ఆయన ఆవాసం "లుంబిని" ఒక నిలయం అనే కంటే "ఒక బుక్ మ్యూజియం" అంటే సమంజసమేమో? ఆయన ఆహ్వానంపై ఒక పర్యాయం రెండురోజులు ఆయనకు అతిధిగా ఉన్నప్పుడు ఆయన సాహిత్య రచనలను ఎన్నింటినో చదివి వినిపించేవాడు. అనేక విషయాలపై చర్చలు జరుపుకుంటూ ఆనందంగా గడిపాం. ఆ మధురక్షణాలన్నీ ఇప్పుడు స్మృతులుగా మిగిలిపోయాయి. ఆయన మరణానంతరం ఆయన పత్రికా ప్రపంచానికి, సాహితీ లోకానికి సాంఘిక చైతన్యానికి, దేశ స్వాతంత్ర్య సముపార్జనకు చేసిన సేవలకు రావలసినంత గణన రాకపోవటం విచారకరం.

వేగుంట కనకరామబ్రహ్మం *(1918-2000). పశ్చిమగోదావరి జిల్లా, వట్లూరు గ్రామవాసి. సహకార రంగం విశేషంగా కృషి చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు కార్యదర్శిగా, అధ్యక్షులుగా పనిచేశారు. సాహితీ ప్రియులు, సాహితీ పోషకులు. కొన్ని కవితలు, పలు వ్యాసాలు రాశారు. అభిమాన విషయం. నార్లవారికి సన్నిహిత మిత్రులు.*

బళ్ళారిలో – నార్ల

– జానమద్ది హనుమచ్ఛాస్త్రి



1948లో నార్లవారు టెక్నో గాలి బాలసుందరరావు, కిన్నెర మాసపత్రిక మాజీ సంపాదకులు కప్పగంతుల మల్లికార్జునరావు హంపి క్షేత్రం చూడాలని మద్రాసు నుంచి వస్తూ బళ్ళారిలో దిగారు.

ప్రముఖ పండితుడు, కవి, భాస్కరాచార్య రామచంద్రస్వామిని చూడాలని వారి ఇంటికి వచ్చారు. స్వామి, నార్లవారి ఆంధ్రప్రభ సంపాదకీయాల పట్ల ఎంతో ఆసక్తి చూపుతుండేవారు.

బళ్ళారిలో తెలుగువారి పరిస్థితుల గురించి చర్చించుకున్నారు. తెలుగువారి సంఖ్య ఎక్కువ. కాని వ్యాపారం ప్రధానంగా కన్నడిగులైన వీరశైవ ప్రముఖులచే జరిగేది. మహమ్మదీయుల జనాభా గణింపదగినదే. బ్యాలెన్స్ ఆఫ్ పవర్, మహమ్మదీయులదే. రాజకీయ, సాంస్కృతిక వ్యవహారాల గురించి మాట్లాడారు.

స్వామివారి సూచన మేరకు, నార్లవారి బృందాన్ని బళ్ళారి మునిసిపల్ ఛైర్మన్ వద్దకు తీసుకెళ్ళాను. ఛైర్మన్ ముందూరు గంగప్ప ప్రముఖ వ్యాపారి. పెద్దగా చదువుకున్నవారు కాదు. వ్యాపార దక్షుడేకాని, రాజకీయ వ్యవహారాలు అంతగా తెలియని వారు. భాషా ప్రయుక్త రాష్ట్ర విభజనలో బళ్ళారి పరిస్థితి, ఏమిటని నార్లవారు ఛైర్మన్ ను ప్రశ్నించారు. తెలుగువారు ఎక్కువగా ఉన్నా, కన్నడిగులు మహమ్మదీయులు ఒకటై బళ్ళారి కర్ణాటకలో భాగం కావచ్చునేమో అనుమానం వ్యక్తపరచారు. అంతటితో వారితో మాట్లాడటం చాలించి అక్కడి నుండి బయలుదేరి మునిసిపల్ గెస్ట్ హౌస్ చేరారు. ఛైర్మను కు రాజకీయ వ్యవహారాలు బొత్తిగా తెలియవంటూ నవ్వుకున్నారు. అప్పుడే నార్లవారితో నాకు పరిచయం కలిగింది. మరుసటి రోజు వారు హంపి వెళ్లారు. తర్వాత వారిని కలుసుకునే అవకాశం కలుగలేదు.

ఆంధ్రప్రభ, సంపాదకీయాలు నాకు నిత్యపారాయణంగా ఉండేవి. వాటి పఠనం వల్ల, నా పత్రికా వ్యాసాలకు స్ఫూర్తి లభించింది.

వారి తెలుగు పత్రికారంగానికి వినూత్న చైతన్యాన్ని ప్రసాదించినవారు నార్ల. సంపాదకీయాలు, సమకాలీన రాజకీయాలకే పరిమితం కాలేదు, మంచి పుస్తకాల గురించి, దేశ విదేశ కవుల గురించిన సంపాదకీయాలు పాఠకుల్లో ఎంతో ఆసక్తిని కలిగించేవి. తెలుగులో, ఇంగ్లీషులో, వారు చక్కని కవితలు, దేశ విదేశాల చరిత్రలు, నాటికలు, వ్యాసాలు రచించారు.

నార్లవారు గొప్ప వ్యక్తికాదు, గొప్ప రచయిత 'జర్నలిజంలోని ఆనందం' అనే వ్యాసంలో వారు జీవితాన్ని విశ్లేషించిన తీరు అనన్యం.

"నిశితంగా ఆలోచిస్తే, నిశ్చలంగా పరిశీలిస్తే జీవితంతో సన్నిహిత సంబంధం లేనిది మానవ సంఘంలో, సంస్కృతిలో ఏదీ లేదు. మన సారస్వతం జీవితానికి అర్థకల్పన. మన సంగీతం జీవిత మాధుర్య వ్యక్తీకరణ, మన నృత్యం జీవితానంద ప్రదర్శన, మన చిత్ర, శిల్ప కళలు, జీవిత సౌందర్యాన్వేషణ, మన వైజ్ఞానిక శాస్త్రాలు జీవిత రహస్య పరిశోధన, మన మతాలు జీవిత లక్ష్య నిర్దేశం, ఇహాన్ని దాచి పరం కోసం పరితపిస్తున్న వారైనా కోరుతున్నది అశాశ్వతమైన ఈ జీవితం స్థానంలో శాశ్వతమైన మరొక జీవితాన్నే!!

"దైనందిన జీవితానికి దర్పణమే జర్నలిజం" అన్నారు నార్లవారు.
(వేగుంట కనకరామబ్రహ్మం పదవీ విరమణ చేసిన సందర్భంగా, వారి మిత్రులు, అభిమానులు ప్రచురించిన, విశిష్ట వ్యాససంకలనం 'కానుక' నుండి)

జానమద్ది హనుమచ్ఛాస్త్రి, కడప ప్రభుత్వ కళాశాలలో ఇంగ్లీషు లెక్చరరుగా పదవీ విరమణ చేశారు. కడపలో సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయ భవనం నిర్మించేందుకు అనితర సాధ్యమైన రీతిలో అవిరళ కృషి చేశారు. మా సీమ కవులు, బళ్ళారి రాఘవ, సి.పి. బ్రౌన్, కన్నడ కస్తూరి, కన్నడ సాహిత్య సౌరభం తదితర గ్రంథాలు ప్రచురించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ డిగ్రీ అందుకున్న ధన్యజీవి.

నార్ల ఇల్లే ఒక గ్రంథాలయం

–వెలగా వెంకటప్పయ్య

పుస్తకాలు సేకరించడం, భద్రంగా దాచటం, రాజులు, రాణులు, మంత్రులు, శ్రీమంతుల కాలం నుంచీ ఉంది. వెంకటగిరి, చల్లపల్లి, ముక్త్యాల, పిఠాపురం, విజయనగరం రాజులు చక్కని గ్రంథాలయాలు పోషించారు. సాధారణ వ్యక్తులలో, పత్రికా రచయితలలో గ్రంథాలు సేకరించిన వారు బహు అరుదు. ఐనా సి.వై. చింతామణి, ఎం. చలపతిరావు, వట్టికోట ఆళ్వారుస్వామి, నార్ల వెంకటేశ్వరరావు, ఎ.బి.కె. ప్రసాద్ – ఉత్తమ గ్రంథాలను సేకరించిన పత్రికా రచయితలలో ముఖ్యులనే చెప్పాలి. ఇతరులు సేకరించిన సంకలనాలలో గుంటూరులో లంకా సూర్యనారాయణగారిది అతిపెద్ద సంకలనం. అందరిలో నార్ల సేకరించిన గ్రంథాలు అనేక రీతుల ప్రత్యేకత గలవి.

పుస్తకాలు కొనడంలో తనకున్న సరదా గురించి నార్లవారు సొంత పుస్తకం అనే వ్యాసంలో (చూడండి : కొత్తా–పాతా, 1975. పుట 86) ఇలా రాస్తారు. "పుస్తకాలు కొనడమంటే నాకు చెడ్డ సరదా. జేబులో డబ్బులున్నా లేకపోయినా మంచి పుస్తకం కనబడగానే బేరం చేస్తాను. అది పదే పదే పనిబడ గల పుస్తకం కావచ్చు. ఒకసారి చదివిన తర్వాత మరి పనికిరానిది కావచ్చు. అయినా దాన్ని కొనేదాకా మనసు రెపరెపలాడుతుంది. అప్పు చేసికూడ పుస్తకాలు కొనడం తరచూ జరుగుతూ ఉంటుంది. ఉప్పు, పప్పు, గుడ్డగుడుసు, మందూ మాకూ అవసరాలు గూడా మరచిపోయి పుస్తకాలు కొనడమూ, తర్వాత పస్తాయించడమూ మామూలైపోయింది. ఎప్పటికప్పుడు పుస్తకాల షాపుల వైపుకు మరి వెళ్ళరాదని అనుకుంటాను. కాని ఏం లాభం? ఉదయానే 'ఇక కల్లు ముట్ట'నని ఒట్టు వేసుకొని సాయంత్రం కాగానే కల్లుపాకలో దూరే త్రాగుబోతు మాదిరిగా మళ్లీ నాలుగైదు రోజుల నాటికే పుస్తకాల షాపులో ప్రత్యక్షం" అంటూ తన్ను తాను ఘనంగా సమర్థించుకుంటారు. మధురకవి నాళం కృష్ణారావుగారు చెప్పినట్లు "పుస్తకమ్ములు గలిగిన పూరిగుడిసెయందు నిరుపేదకాపునై యుందుగాని, పుస్తకంబులు లేనట్టి భూరి సౌధమందు చక్రవర్తిగ నుండ నభిలషింప" అన్నట్లుగానే చిన్న ఇల్లయినా పుస్తకాలున్న ఇంట్లో ఉండడానికి నార్ల ఇష్టపడతారు.

నార్లవారు పౌరగ్రంథాలయాన్ని ధర్మసత్రంతో ఒకచోట పోల్చుతారు. ఎంత బాగున్నా ధర్మసత్రంలో శాశ్వతంగా ఉండలేంగదా చిన్నదైనా మన గూడు మనం కట్టుకోవాలి అలాగే మన గ్రంథాలయం మనం ఏర్పరచుకోవాలి. సొంత గ్రంథాలయ ప్రయోజనాన్ని గురించి నార్లవారే అదే వ్యాసంలో ఇలా చెబుతారు. (పుట. 87) "ఎరవు పుస్తకం వల్ల కలిగే ఆనందం బహు స్వల్పము"ని స్టార్లీ

బాల్డ్విన్ అన్నాడు. ఈ అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. సొంత పుస్తకాన్ని, ఒక్క బిగిని చదివెయ్యవలసిన అగత్యం ఉండదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎంత కావాలంటే అంతే తాపీగా చదువుకోవచ్చు. ప్రారంభించిన తర్వాత విడవకుండా చదివించే పుస్తకమైతే ఏకతాకీని దాన్ని పూర్తిచేసి, తిరిగి కోరినప్పుడు కోరిన భాగాలు చదువుకొని మధుర స్మృతులను మార్కు చేసుకోవచ్చు. పుస్తకాన్ని చదువుతూ ఉండగా తోచిన భావాల్ని మార్జిన్లో రాసుకోవచ్చు. ఇదేమీ కాక పుస్తకం విసుగు కలిగించినా, అసహ్యాన్ని పుట్టించినా, కోపాన్ని తెప్పించినా దాన్ని విసిరి గిరాటు కొట్టొచ్చు. అదే ఎరువు పుస్తకమైతే ఇలా చెయ్యగలమా? అంటూ సొంత గ్రంథాలయంపై హక్కును ప్రయోజనాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెబుతారు.

ప్రసిద్ధ పత్రికా సంపాదకులుగా, రచయితగా, వ్యాసకర్తగా, నాటక కర్తగా 1940–1980 మధ్య కాలంలో నార్ల అగ్రస్థానం ఆక్రమించారు. మచిలీపట్నం, చెన్నయ్ , విజయవాడ, హైదరాబాదు లలో ఉద్యోగరీత్యా పని చేశారు. రాజ్యసభ సభ్యులుగా ఢిల్లీతో సంబంధం ఉంది. ముఖ్యంగా అధిక భాగం విలువైన జీవితం గడపడం, ప్రముఖ పత్రికలైన ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి దిన పత్రికలకు సంపాదకులుగా ఉండడం, అవసరానికి ఆదుకునే మంచి మిత్రులు ఉండటం, ప్రతి మంచి పుస్తకం సేకరించి భద్రపరచాలనే తపన, చదవాలనే ఉత్సాహం, ఆవేశం, ఆలోచించే గుణం నలభై ఏళ్ల కాలంలో ఇరవై వేల పుస్తకాలు సేకరించేట్లు చేసింది వారే ఒకసారి అన్నారు. 'రోజుకో పుస్తకం సేకరిస్తున్నా'నని సేకరించిన ప్రతి పుస్తకాన్ని చక్కగా బైండు చేయించి, సొంతగా చేయించిన అందమైన బీరువాలలో అందంగా, విషయాలవారీగా సర్దుకొనే శక్తి వారికొక్కరికి ఉంది. వారి ఇంట్లో ఏ గదిలో చూసినా (వంట ఇంటిగది, మేడమెట్ల క్రింద భాగం, కారు గ్యారేజితో సహా) బారులు తీరిన పుస్తకాల బీరువాలే. గ్రంథాలయంలో ఉంటున్నారా అనిపిస్తుంది. వారిల్లే గ్రంథాలయం. గ్రంథాలయమే వారిల్లు. రెండూ వేరుకాదు. ఐతే ఇంతకాలం కంటికి రెప్పలాగా పుస్తకాలను కాపాడిన విదుషీమణి, నార్ల ధర్మపత్ని సులోచనగారు. పేరులోనే ఉండే ఆ మంచి కళ్లు నలభై ఏళ్లపాటు పుస్తకాలను చల్లగా చూశాయి. సేకరించడం నార్లవారి వంతైతే వాటిని భద్రపరచడం సులోచనగారి వంతు. అందుకే ఈ గ్రంథాలయం యావద్భారతంలో పండితులను, పరిశోధకులను, పుస్తక ప్రియులను, పుస్తక చోరులను, పాతపుస్తక విక్రేతలను ఆకర్షించింది.

నార్ల సేకరణలు ప్రధానంగా ఆంగ్లభాషలోనే ఉన్నాయి. తన చెంతకు వచ్చిన తెలుగు పుస్తకాలను మిత్రులకు బహుమతి ఇచ్చేవారు, లేదా బదులుగా ఇచ్చేవారు. తనకు అవసరంలేని గ్రంథాలయశాస్త్ర గ్రంథం తనవద్దకు వస్తే నాలాటి వారికి పంపేవారు. అంటే ఒక పద్ధతి ప్రకారమే వారు పుస్తకాలు సేకరించినారనడానికి ఉదాహరణ మాత్రం చెప్పాను.

నార్లవారికి కొన్ని అభిమాన విషయాలు, కొందరు అభిమాన రచయితలు ఉన్నారు. ఆ పుస్తకాలు సేకరించారు. బౌద్ధం, జైనం, జర్నలిజం, సామాజిక శాస్త్రాలు, చరిత్ర, చిత్రకళ, హ్యూమనిజం, తత్త్వశాస్త్రం వారి అభిమాన విషయాలు. గాంధీ, నెహ్రూ, ఎం.ఎన్. రాయ్, ఆల్డస్ హక్స్లీ, మిల్టన్, బెర్నార్డ్ షా , ఇబ్సన్, కవిరాజు, వీరేశలింగం, వేమన, గురజాడ అభిమాన రచయితలు గనుక వీరి పుస్తకాలు పూర్తి సెట్లు ఉన్నాయి. ఈ శతాబ్ది రెండోపాదంలో ఆలోచనా పరులను పెంచిన థింకర్స్ లైబ్రరీ సిరీస్, మోడరన్ లైబ్రరీ సిరీస్, నటేశన్ సిరీస్, ఎవిరిమాన్స్ లైబ్రరీ సిరీస్, పెలికన్, పెంగ్విన్ పుస్తకాలు చాలాభాగం సేకరించారు. అంతేగాక భారతదేశ చారిత్రక, సాంఘిక, రాజకీయ పరిస్తితులను తెలుసుకోడానికి ఉపయోగించే Letters from Madras (1848) ఆనందరంగం పిళ్లే డైరీలు, ఇంపీరియల్ గజెటీర్, బ్రిటీష్ వాళ్ళు తయారు చేసిన జిల్లా గజెటీర్లు – దాదాపు అన్నీ ఉన్నాయి. వీటికి తోడు ఎన్నో విజ్ఞాన సర్వస్వాలు, ఎన్నో నిఘంటువులు ఈ సంకలనానికి ప్రత్యేక అలంకారాలు. భగవద్గీత, కృష్ణభక్తిపై ఎన్నో అరుదైన గ్రంథాలున్నాయి. చిత్రకళ, శిల్పకళపై ఎంతో విలువైన గ్రంథాలు, చిత్రాలు, శిల్పాలు ఈ గ్రంథాలయంలో ఉన్నాయి. ఈ సంపదను డబ్బురూపంలో లెక్కించడం కష్టం. చూసి ఆనందించడానికి రెండుకళ్ళు చాలవనిపిస్తుంది. ఈ గ్రంథాలయంలో అనేకదినాలు గడుపుతూ కొత్త విషయాలు తెలుసుకుంటూ ఈతిబాధలు మరచిపోవచ్చు. ఇంత మంచి గ్రంథాలను సేకరించిన నార్లవారిని మాత్రం ముందుతరాలవారు మరచిపోరు.

19-20 శతాబ్దాల సామాజిక, ఆర్థిక, సాంఘిక పరిస్థితులపై పరిశోధన చేసేవారు ఈ గ్రంథాలయాన్ని ఒక్కసారి చూస్తే ఎన్నో క్రొత్త విషయాలు ఆకళింపు చేసుకోవచ్చు. ఈ గ్రంథాలయాన్ని నార్ల కుటుంబం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి అప్పగించింది. నేడు ఈ గ్రంథాలు అందరి ఉపయోగార్థం అచట లభిస్తున్నాయి.

డాక్టరు వెలగా వెంకటప్పయ్య గారు; *రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖలో మూడు దశాబ్దాలకు పైగా గ్రంథపాలకులుగా, కార్యనిర్వహణాధికారిగా అనుభవం. గ్రంథాలయ, సమాచార విజ్ఞాన రంగాలలో సుమారు అరవై గ్రంథాలు, ఇరవై సంచికలు, ఆరు వందల వ్యాసాల ప్రచురణ. ప్రభుత్వం, యూనివర్సిటీలు, అకాడమీలు, గ్రంథాలయ సంఘాలు నియమించిన పలు నిపుణుల కమిటీలలో సభ్యత్వం. వారి కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రా యూనివర్సిటీ, తెలుగు యూనివర్సిటీ, పలు సంస్థల నుంచి అవార్డులు, గౌరవాలను అందుకున్నారు. అయ్యంకి వెలిగించిన గ్రంథాలయ జ్యోతిని మరోతరానికి అందించిన క్రియాశీలి.* ★

భావనా వీధులలో నార్లవారి పయనం

– ఆవుల సాంబశివరావు



Justice A. SAMBASIVA RAO
1980 - 83

నార్ల ప్రాయకంగా భావుకుడు, భావ ప్రచారకుడు. ఆది నుండి ఆయనకు భావాలమీద, వాటి బలం మీద నమ్మిక ఎక్కువ. భావాలు ఉద్యమాలుగా పెరిగి మానవుణ్ణి చరిత్రగతిని ఎంతగా మార్చినది, చరిత్ర చదివి, చిన్ననాటనే తెలుసుకున్నాడు.

భావాలు మానవుల దృష్టికెక్కాలంటే, వాటి ప్రచారం ఒకటే సాధనని కూడా గ్రహించాడు. కనుక తాను నమ్మిన ఆలోచనల్ని పదిమందికీ అందించడం లేత వయసులోనే ఆరంభించాడు.

అందుకు స్ఫూర్తి కృష్ణాపత్రిక నుండీ, దాని సంపాదకుడు ముట్నూరి కృష్ణారావుగారి నుండి వచ్చాయి. స్వరాజ్య ఉద్యమానికి కృష్ణాపత్రిక, కృష్ణారావుగారు ఇచ్చిన ఊతం, ఊపు చూడగలిగాడు. తెలుగువారు వాటితో ఎంత ప్రభావితులైంది తెలుసుకున్నాడు. దానిని బట్టి తన బాటను నిర్ణయించు కున్నాడు.

నార్ల నవయువకుడైనప్పటికి 1930, 1931లోని ఉప్పు సత్యాగ్రహం గాంధీగారి నాయకత్వం మనదేశాన్ని ఉర్రూతలూగించిన సంఘటనలు. తొలి రచనలు నార్ల స్వాతంత్ర్యోద్యమం మీదనే సాగించారు.

ఉప్పు సత్యాగ్రహం వీగిపోవడం, స్వాతంత్ర్యోద్యమం ఆగిపోవడం ఆనాటి భారతయువతకు ఎంతో అశాంతిని కలిగించాయి. అప్పటికి రష్యాలోని బోల్షివిక్ ఉద్యమం విజయవంతం కావడం, సోషలిస్టు రాజ్యం ఏర్పడ్డం జరిగాయి. కమ్యూనిజం, సోషలిజం చాలా మంది యువతీ యువకుల్ని ఆకర్షించాయి.

నార్లలోనూ ఈ ప్రభావం గట్టిగా రగిలింది. బూర్జువా వర్గానికి ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతీకలుగా నిలిచిన స్వదేశీ సంస్థానాలు, వాటి ప్రభువులు నార్లలో జుగుప్సను రేకెత్తించారు. దాని ఫలితంగా నార్లవారి 'స్వదేశీ సంస్థానాలు' రచన వచ్చింది.

మారుతున్న రష్యాను పరిశీలించ మొదలుబెట్టాడు. దానిని బట్టి 'నేటి రష్యా' అనే వారి పుస్తకం వెలువడింది.

ఈ సన్నివేశాలను బట్టి ప్రజాసామాన్యం ప్రముఖం నార్ల గుర్తించాడు. గాంధీ నాయకత్వం క్రింద పట్టణాల నుండి పల్లెలకు సోకిన జాతీయోద్యమం, లెనిన్ నేతృత్వంతో సామాన్య రష్యన్ కార్మికులు, ప్రజలు సాగించిన విప్లవోద్యమం నార్లలో కొత్త మలుపులు తెచ్చాయి. భావాలు ప్రజల మధ్యలోకి, మస్తిష్కాలకు, పాకాలంటే వారికి తెలిసే భాషలోనే భావ ప్రచారం జరగాలి. అందుకు క్లిష్టమయిన గ్రాంథిక భాష పనికిరాదు. వ్యవహారంలో ఉన్న భాష అవసరం. నార్ల శక్తివంతుడైన వ్యావహారిక భాషావాది అయినాడు.

తన మూలతత్వం భావ ప్రచారం అయినప్పుడు, పుస్తక, వ్యాస రచనతోపాటు, నార్ల పత్రికారచయిత కావడం సహజ పరిణామం.

పత్రికారచన చేబట్టగానే ఆయన అందులో సిద్ధహస్తుడైనాడు. ఆంధ్రప్రభ వారి సంపాదకత్వంలో ఆంధ్రుల అభిమాన పత్రిక కావడం అందరం ఎరిగిందే. అందులో నుండి వైదొలగి ఆంధ్రజ్యోతిని ఆరంభించడం, వారి మార్గదర్శకత్వాన ఆ పత్రిక ఆంధ్రులలో జ్యోతిర్గమయ మార్గాన జిజ్ఞాసను రేకెత్తించడం చరిత్ర ప్రసిద్దమయిన విషయాలు.

రాజకీయం, మతం, ఆచారం, అధికారం, మనుషుల మనసుల్ని "బందెలదొడ్డి"లో కట్టివేయడం. ఆ చెరనుండి మేధస్సును విడపించ వలసిన అవసరం నార్లవారు గుర్తించారు. ఆ గుర్తింపు వారిలో మౌలికమయిన మార్పును, పరిణామాన్ని తెచ్చిపెట్టింది.

మానవుని భావనా స్వేచ్ఛను, మానసిక స్వేచ్ఛను, అరికట్టేవి ఏవైనా – సంప్రదాయమయినా, మతమయినా, రాజకీయ మయినా, అధికారమయినా – దేనినయినా ఎదిరించడమే, వాటితో పోరాడడమే తన కర్తవ్యంగా నార్ల నిర్ణయించుకున్నాడు. ఆ ఆశయంతో పుంఖాను పుంఖాలుగా రచనలు చేశాడు. ఇంగ్లీషులో, తెలుగులో, గద్యంలో, నాటికలో, నాటకంలో, వ్యాసంలో, విమర్శలో, మానవ వికాసోద్యమాన్ని తన నిరంతర వ్యాపకంగా, కర్తవ్యంగా కొనసాగించాడు. చాలా ప్రామాణిక రచనలు చేశాడు. ★

జస్టిస్ ఆవుల సాంబశివరావు, (1917–2003). గుంటూరు జిల్లా, మూల్పూరులో జన్మించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, ఆంధ్ర విశ్వకళాపరిషత్ వైస్ ఛాన్సలర్, ఆంధ్రప్రదేశ్ ప్రధమ లోకాయుక్తగా కీర్తిగన్న ప్రసిద్ధులు, మానవతావాది, హేతువాది. జీవితమంతా విలువలు పాటించిన సజ్జనులు. వీరు స్థాపించిన జస్టిస్ ఆవుల సాంబశివరావు, జయప్రదాదేవి ట్రస్టుద్వారా పలు సేవా కార్యక్రమాలు నేటికీ జరుగుతున్నాయి. నార్లవారికి సన్నిహితులు.

నవ్యుడు నార్ల

– నగ్నముని

ఈ దేశంలో పెద్ద చదువులు చదువుకున్న గొప్ప వారిలో 'మేతావులు', 'మేధావులు' అని రెండురకాల వారున్నారు. మెతుకులు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాల భావాలకు అనుకూలంగా బొజ్జతో ఆలోచించే వారు 'మేతావులు'. బొజ్జకోసం ఆలోచించడం, బొజ్జతో ఆలోచించడం ఈ రెండూ ఒకటే వీరి దృష్టిలో ఇదొక రకం. రెండోరకంవారు సమాజాన్ని గురించి మెదడుతో ఆలోచిస్తారు. సమాజం ఇంత అస్తవ్యస్తంగా ఎందుకు ఎదుగుతున్నదా? అని మథన పడతారు. మందుకోసం ఆలోచిస్తారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వ భావాల్ని నిర్భయంగా ఎండగడతారు. వీరే మేధావులు. ఈ రెండో రకంలోనివారు నార్లవారు.

చాలా ఆలస్యంగానే అయినా చాలా సహజంగానే కలుసుకున్నాను నేను నార్లవారిని.1970 కి ముందు సంగతి. విజయవాడలో ఓ సాహితీ సభలో ఉపన్యాసం ఇవ్వడానికి వెళ్లాను. ఉపన్యాసం అయిపోయింది. మిత్రులతో టీ తాగుతూ కబుర్లు ఆడడం కూడా అయిపోయింది. అప్పుడే అర్ధరాత్రి 12 గంటలు కావస్తోంది. ఇంతలో మిత్రుల్లో ఒకరు దగ్గరలోనే 'ఆంధ్రజ్యోతి' పత్రికాఫీసు; ఇతర మిత్రుల్ని కూడా కలుసుకుందామన్నారు. వెళ్లాం. నార్లవారింకా తమగదిలోనే ఉన్నారని, రాసుకుంటున్నారనీ చెప్పారు. లోపలికెళ్లాను. 'రండి, రండి. అర్ధరాత్రి 12 గంటలు మీ సమయం కాబోలు' అని నవ్వారు, కూర్చోమని కుర్చీ చూపిస్తూ. ఆరోజుల్లో దిగంబర కవుల సంపుటాలు అర్ధరాత్రి 12 గంటలకు ఆవిష్కరింపజేసేవాళ్ళం. అదీ ఆయన అన్నదానిలో చమత్కారం. కాసేపు సాహిత్య విషయాలు ముచ్చటించుకున్నాక తాముంటున్న ఇంటి గుర్తులు చెప్పి ఉదయమే కాఫీకి ఆహ్వానించారు.

జీవితం గురించీ, సాహిత్య రాజకీయ పత్రికా రచన గురించి, ఆయనకు ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. ఆంధ్రరాష్ట్రంలోని అత్యంత చారిత్రాత్మకమైన సంఘటనల్ని అతి దగ్గర నుంచి చూసి ఉండడం వలన, ఆయన మాటలు కటువుగా ధ్వనించేంత నిష్కర్షగా ఉండడం సహజం. అందులో ఆయన అంతర్మథనాన్నే నేను ఎక్కువగా చూశాను.

కొన్నేళ్ళ తర్వాత ఆయన్నెప్పుడు చూడాలన్నా హైదరాబాద్లో ఆబిడ్స్ ప్రాంతంలో ఆదివారాలు ఉదయం పది గంటల తర్వాత ఫుట్పాత్ మీద పెట్టుకొని అమ్మే పాత పుస్తకాల దుకాణాల దగ్గర చాలా హాయిగా వీలయ్యేది. పుస్తకాలు ఆయనకి ఆరోప్రాణం కాదు; పంచ ప్రాణాలున్నూ. పాత పుస్తకాలమ్మే ముస్లిం దుకాణదారులకు ఆయన అతిత్వరలోనే ఆత్మబంధువు అయిపోయారు.

'నార్లవారు' హైదరాబాద్ వచ్చాక మాకు ఎవరూ పాత పుస్తకాలు అమ్మడం లేదు' అనేవారు నా మిత్రులు కొందరు కాంపిటేషన్ ఫీలవుతూ.

ఆ తర్వాత – అంబేద్కర్ మనుధర్మశాస్త్రాన్ని దహనం చేసి యాభై ఏళ్లు గడిచిన సందర్భంలో ఏర్పాటు చేసిన మహాసభలో ఇద్దరం ఉపన్యసించాం. నా ఉపన్యాసం తర్వాత 'మీరు అప్పుడప్పుడు మా ఇంటికి వస్తూ ఉండాలి, మనం మాట్లాడుకోవాలి' అన్నారు నార్ల. నా అభిప్రాయాన్ని ఆయన ఆదరించిన పద్ధతి అది అనుకున్నాను. ఆ తర్వాత మరో మూడు నాలుగు సభల్లో మేం ఉపన్యసించాం గాని, ఇదంతా ఒక ఎత్తు. నా మనసులో స్థిరంగా నిలబడి పోయింది మరొకటి.

ప్రముఖ ఫ్రెంచి తత్వవేత్త, ఎగ్జిస్టెన్షియలిస్టు ఝాపోవ్ సార్త్ర మరణించారనే వార్త తెలిసింది. హైదరాబాద్ లోని 'సృష్టి' అనే ఆధునిక సాహితీ వేదికవారు ఏర్పాటు చేసిన సార్త్ర సంస్మరణ సభకు నార్లవారిని సభాధ్యక్షులుగా ఆహ్వానించడానికి వారింటికెళ్ళాను.

'సార్త్ర పుస్తకాలు నేనెప్పుడో చదివాను. ఇప్పుడు గుర్తులేవు; మీరు మరీ పట్టుబడితే ఒకటి రెండు పుస్తకాలు చదివి వస్తాను. కానీ న్యాయం చేస్తాననే నమ్మకం లేదు. వీలయితే నన్నొదిలేయండి' అన్నారు. పిలిస్తే తడవుగా పిడకనుంచి పిడుగు వరకు దేనిమీదనైనా ఒకే రకంగా మాట్లాడేస్తామనేవారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయిన ఈ రోజుల్లో 'నాకు ఎగ్జిస్టెన్షియలిజం గురించి గుర్తులేదు, తెలుసుకుని మాట్లాడతాను' అని చెప్పే నిజాయితీ ఎంత మంది మేధావుల్లో ఉంటుందో నాకు అనుమానమే.

పత్రికలు ప్రజలు చదవాలనే తపనతో పత్రికా రంగంలో ఆయన తీర్చిదిద్దిన మార్గం, సమాజ విమర్శకుడిగా, విశ్లేషణాకర్తగా ఆయన చేసిన రచనలన్నింటా కాంతి వెదజల్లుతూ కనబడే లక్షణం హేతువాదం. ఈ దృష్టే ఆయన్ని మామూలు పండితుల నుంచి, నానారకాల ఆధునికుల నుంచి, మేధావుల నుంచి వేరు చేసి ప్రత్యేక వ్యక్తిగా నిలబెడుతున్నది.

దేవుణ్ణి సైతం ఓట్లుగా మార్చుకుని ప్రజలపై పెత్తనం చేసే ప్రభుత్వాలను పాతిపెట్టి మనుషుల్ని బ్రతికించుకుని దేవుడిపై ఆధారపడని సమాజం నిర్మించుకునే మార్గంలో నార్లవంటి ఆలోచనాపరుల అవసరం ఎంతైనా ఉంది.

'ఉదయం' దినపత్రిక సౌజన్యంతో

నగ్నముని దిగంబర కవులలో ప్రసిద్ధులు. తెలుగు కవితను కొత్తపుంతలు తొక్కించిన కవిపుంగవులు. అసలు పేరు మానేపల్లి హృషీకేశవరావు. ఆధునిక మహాకావ్యంగా కొనియాడబడిన కొయ్యగుర్రం వీరి రచనే.

తెలుగుజాతి వారి ఋణం తీర్చుకోలేనిది

– వేటూరి సుందరరామమూర్తి

అది 1957 సంవత్సరం ...!

అప్పుడే నాకు జరిగింది పత్రికారంగంలో అక్షరాభ్యాసం... నాచేత ఓనమాలు దిద్దించింది స్వర్గీయ నార్ల వెంకటేశ్వరరావుగారు! వారి సన్నిధికి నన్ను చేర్చింది ముక్త్యాల రాజాగారు!

పత్రికల భాషకు సరికొత్త వ్యాకరణం, సంపాదకీయాలకు సరికొత్త ఛందస్సు, పాత్రికేయుల వృత్తికి సరికొత్తధ్యేయం ఏర్పరచినవారు నార్లగారు!

పత్రికల్లో వ్యావహారిక భాషను, పల్లీయుల స్థాయికి, పామరుల స్థాయికి తేవడంతోపాటు తెలుగు పత్రికను ఒక నిత్యావసర వస్తువుగా, అది చదవకపోతే పొద్దుగడవని స్థాయికి కూడా తెచ్చిన ఘనత నార్లగారికే దక్కుతుంది!

జాతీయోద్యమ ప్రభావం, పత్రికల ద్వారా మారుమూల గ్రామాలకు వ్యాపింపజేసిన మహనీయుడు నార్ల!

ఆయనకు కులంలేదు గుణం తప్ప... మతం లేదు మార్గం తప్ప... దేవతల్లో సరస్వతికి ఆలయం, అర్చన లేదనుకునేవాళ్ళకు – ఆయన ఇల్లు, ఆయన జీవితం సమాధానం ఇస్తాయి!

పత్రికలు శిష్టవ్యావహారికంతో చదువుకున్న కొందరికే ఉపయోగపడుతున్న రోజుల్లో, గౌరవ వాచకాలు, బహువచనాలు మొదలైన అడ్డంకుల్ని తొలగించి, తనలో తను ప్రతిమనిషి అనుకునే ప్రథమావిభక్తులు, ఏకవచనాలు, పత్రికలకు దించిన ఘనత నార్లగారిదే!

ఉప్పుముట్టుకుని, బ్రిటిష్ సింహాసనాన్ని వొణికించిన మహాత్మునివలె, మౌలికమైన ఈ నుడికారాలతో ప్రజా హృదయాలను చూరగొన్నారు నార్లగారు!

ఉదాహరణకు... వస్తారు, ఉద్ఘాటించారు, ఆయనన్నారు వంటివి తొలగించి 'ఉద్ఘాటించాడు', అన్నాడు వంటి ప్రయోగాలతో సగటు మనిషికి పత్రికను సన్నిహితం చేసినవారు నార్లగారు!

మహాత్ముడు మరణించినప్పుడు ఆయన బొమ్మకింద “నాడు ఏసుక్రీస్తు శిలువకు బలి – మరిరాడు' అనీ రాయడం ద్వారా ప్రజల్లో నేడు మహాత్ముడు తుపాకీకి బలి” అనీ 'ఇంక లేదు పెల్లుబికించిన శోకావేశం మరపురానిది! –

శీర్షికలు, పతాక శీర్షికలు, సంపాదకీయాలు, వ్యాఖ్యలు, విమర్శలు, నిత్యసంగ్రామంగా, నిర్మాణాత్మకంగా సాగించినవారు నార్ల!

వ్యక్తిని బట్టి వాడేపదాల మార్పు కూర్పు, చేయడంలో ఆయన సిద్ధహస్తుడు! "హార్బర్ నియోజక వర్గంలో ప్రకాశం పంతులుగారి పరాజయం...” అదే కళావిషయంలో.. “అమలాపురంలో రెవెన్యూ మంత్రి కళా ఓటమి" ఇద్దరూ ఓడినా ఎవరి గౌరవం వారిదే, ఎవరికి ఇవ్వలసిన మర్యాద వారిదే. అంతేకాదు విమర్శనీయుడైన వ్యక్తి నామధేయాన్ని కూడా ఆయన మార్చి బొద్దుకోసి పెట్టిన పేరునే వాడడం, అనేకమంది ఆగ్రహానికి గురికావడం కూడా జరిగింది!

నేను కొత్తగా వారి శిష్యరికంలో పాత్రికేయుడిగా కలం పట్టినప్పుడు నాకు చెప్పిన మొదటి మాట... వార్తలు రాసేటప్పుడు ఆంగ్ల పద్ధతి మనకి పనికిరాదు. ఎవరు, ఏమిటి, ఎప్పుడు, ఎక్కడ అనేది వారి పద్ధతి. ఏమిటి, ఎప్పుడు, ఎవరు అనేది మన పద్ధతి! అని... దీనికో ఉదాహరణ...

The Prime Minster Mr. Nehru told the Lok Sabha today that India will not tolerate any aggression on Indian territory by Pakistan." దీనికి తెలుగు తర్జుమా:

“పాకిస్థాన్ మనభూభాగంపై ఎట్టి దురాక్రమణకు తలపడినా భారతదేశం ఇకపై సహించేది లేదని నేడు లోక్సభలో మాట్లాడుతూ" ప్రధాని నెహ్రూ ఉద్ఘాటించారు.

ఇంకో ముఖ్యమైన అంశం పత్రికా ముఖానికి ఆహార్యం... గాంధీజీ మరణించిన రెండవ రోజు దూరతీరాలకు నడచి వెళ్లిపోతున్న గాంధీజీ చిత్రంతోపాటు పెట్టిన పతాక శీర్షిక ఇది!

“భారతావనిలో గాడాంధకారం... స్వర్గధామంలో దివ్యప్రభలు" నాటి జనమానసిక స్థితికి ఆ శీర్షిక దర్పణంగా మిగిలి పోయింది! అలాగే ప్రకాశంగారు మరణించినప్పుడు జ్యోతిని వెలిగిస్తున్న ఆయన బొమ్మతోపాటు 'ప్రకాశవిహీనమై పోయిన ఆంధ్రప్రదేశ్' అనే శీర్షిక మరపు రానిది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో!

ఫజలాలీ కమిషన్ తీర్పును పతాకశీర్షికగా 'తుంగభద్ర నీళ్ళు ఆంధ్రులకు... కోలారు బంగారం కన్నడిగులకు' అని ఆయన వ్యాఖ్యానించారు!

సాంఘిక న్యాయంకోసం నిరంతర సంగ్రామం జరిపిన మహావీరుడు నార్ల! ఆయన చదివినది సింధువైతే, రాసింది బిందువనే అనాలి! బహుశా ఈ జన్మకిది చాలు అన్నట్లు క్లిష్ట సమయంలో తెలుగు పత్రిక ద్వారా జాతిని ఉత్తేజపరచిన మహా వైతాళికుడు నార్ల! పత్రికలపై ఈగవాలినా ఆయన సహించేవారు కారు!

విజయవాడ రేడియో సాహిత్యగోష్ఠి జరిగినప్పుడు విశ్వనాధవారి విపరీత వ్యాఖ్యలకు ఆయన విరుచుకుపడ్డతీరు ఇందుకు నిదర్శనం. "భావప్రకటన స్వాతంత్ర్యం మా జన్మహక్కు, రాజ్యాంగం దాన్ని పూర్తిగా భద్రపరచేవరకు విశ్రమించము" అన్నది ఆయన నినాదం!

కవిగా నార్ల నాస్తికానికి, ఆస్తికానికి బద్ధుడుకాని బౌద్ధుడై, లుంబినిలో ఇల్లుకట్టుకున్నాడు. ఆ ఇంటి గోడలు పుస్తకాలు. ఆయన సిరులు, సంపదలు పుస్తకాలు! ఆయన ఇహపరాలు పుస్తకాలు, ఆయన స్నేహితులు పుస్తకాలు. ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు పుస్తకాలు!

ఆయన తనువు చాలించలేదు. చదవడం చాలించారు! ఆ పుస్తకాలు మిగిల్చి చదవమని శాసించారు. ఆయన మనకు వారసత్వంగా మిగిల్చింది అనంతమైన అక్షరనిధి! ఆయనకిదే నా అంజలి!!

జాతీయోద్యమానికేమి, స్వరాష్ట్రసాధనోద్యమానికేమి నడుంకట్టిన వారివెనక కలంపట్టి ఊపునీ, ఉత్తేజాన్ని కలిగించిన ధన్యజీవి నార్ల. ఆయన సంపాదకత్వంలో వెలువడిన దినపత్రికలు తెలుగుతల్లి రాసుకున్న డైరీలు. ఆంధ్రుల సాంఘిక రాజకీయ చరిత్రకు గుర్తుగా మిగిలిన అక్షర శాసనాలు. ఆయన సంపాదకీయాలు రచయితలు, అందునా పత్రికారచయితలు కాగోరేవారు విధిగా అధ్యయనము చేయవలసిన పాఠాలు.

నార్లగారి వ్యక్తిత్వం అనేకమందిపై అనితర ప్రభావం చూపింది. ఆయన వేషధారణ, సిగరెట్ కాల్చేపద్ధతి, నిర్లిప్తతో నీరసమో తెలియని మేధావిత్వపు నెమ్మదితనం మెల్లగా మాట్లాడటం, చేతిలో పుస్తకాలు – ఈరకంగా చాలామంది ఆయనను అనుకరిస్తేగాని ఎడిటర్ కాలేమనుకున్న సందర్భాలున్నాయి.

__వేటూరి సుందరరామమూర్తి.__ యోగులు, సాధకులు, వాఙ్మయ పరిశోధకుల వంశంలో జన్మించారు. పత్రికా విలేఖరిగా పనిచేశారు. రేడియోలో కూడా తన వాణిని వినిపించారు. సినిమా పాటకు కొత్త ఊపును ప్రసాదించిన ద్రష్ట. కావ్యసార గుణగ్రహీణ రాయంచ. వయస్సు శరీరానికి కానీ వారి కలం మాత్రం ఇంకా ప్రౌఢ నిర్భర వయః పరిపాకంలోనే ఉంది. వీరి కృషికి గుర్తింపుగా నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసింది. వీరి ఇటీవలి రచన 'కొమ్మ కొమ్మకో కోయిల' విశేష ప్రచారాన్ని అందుకుంది. వీరు నార్లవారికి సన్నిహితులు.

మేధావి, రసజీవి – నార్ల



– సంజీవదేవ్

పూవు విరజిమ్ముతుంది తావిని; జాబిల్లి వెదజల్లుతుంది వెన్నెల్ని;



ఇంద్రధనుస్సు ప్రదర్శిస్తుంది రంగుల ఇంద్రజాలాన్ని, వీటన్నిటినీ ఆనందిస్తాడు మనిషి; వీటన్నిటినీ ఆలోచిస్తాడు మనిషి. ఆనందించే సమయాన ఆలోచనవస్తే ఆనందం కుంటుపడుతుంది; అదే విధంగా ఆలోచించే సమయాన ఆనందం రేకెత్తినా కూడా ఆలోచనకు ఆటంకం కలుగుతుంది. అంటే, ఆనందించే వ్యక్తి ఆలోచించలేడనీ, ఆలోచించే వ్యక్తి ఆనందించలేడనీ అర్థంకాదు. రెండు వ్యాపారాలూ ఒకేసారి జరగవని, రెండూ ఒకేసారి జరగటం ఉంటే ఏదీ కూడా సమగ్రంగా జరగదు.

ఇంద్రధనుస్సు ప్రదర్శించే రంగుల్ని ఆనందిస్తున్న సమయాన ఆ రంగులు ఏవిధంగా ప్రత్యక్ష మయ్యాయి. ఏయే రంగులు కలసి ఏ రంగు అయింది. ఏ రంగుల కిరణాలు ఎంత దైర్ఘ్యాన్ని కలిగి ఉన్నాయి. ఏ రంగు ఏమి ఫలితాన్నిస్తుంది అన్న ఆలోచనరాదు. ఆయాలోచన వస్తే ఆనందించటం అనేది ఆలోచనగా మారిపోతుంది. తాదాత్మ్యంమీద తర్కం ఆధిపత్యాన్ని వహిస్తుంది. అనుభూతి హేతువాదంగా రూపాంతరం చెందుతుంది. సంశ్లేషణ విశ్లేషణగా మారుతుంది. హృదయం మేధగా రూపొందుతుంది. పరియవసానం, సహృదయుడు సమీక్షకు డవుతాడు. అంటే రసానుభూతి పనిచేయదు.

అందుకే, దేని సమయంలో దాని వ్యాపారాన్నే సాగనీయాలి. కాని రెంటినీ కలిపి ఒకేసారి సాగిస్తే రెండూ కూడ తమ స్వీయ సత్తాలను కోల్పోతాయి.

ఈ రెంటికి ఉన్న తారతమ్యం వల్ల చాలామంది వ్యక్తులు రసజీవితంలో మేధావిగాను, మేధావి జీవితంలో రసజీవిగాను ఉండలేక పోతుంటారు. ఎక్కువమంది ఇటువంటి వారే. ఇటువంటివాడు కానివారు కూడా లేకపోలేదు నార్లవారు ఇటువంటివారు కారు.

నార్లవారు మేధావి, రసజీవికూడ. అయితే, వారిలో ఏది ప్రధానమూ అంటే మేధయే ప్రధానం అనటంలో అతిశయోక్తి లేదు. ఇటువంటి విలక్షణ వ్యక్తి జీవితాన్ని రచించటం ఏమంత సులభమైన పనికాదు. చాలామంది గొప్పవారి చరిత్రలు రచించిన గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు నార్లవారి జీవిత చరిత్రను కూడా రచించారు. నార్లవారు ప్రధానంగా మేధావి కనుక "నవ మేధావి నార్ల" అయింది ఈ పుస్తకం పేరు.

ప్రతివారికీ ఒక బహిరంగ జీవితం, ఒక అంతరంగ జీవితం ఉంటాయి. బహిరంగ జీవితం వృత్తికి సంబంధించి ఉంటుంది అధికంగా, అంతరంగ జీవితం ప్రవృత్తికి సంబంధించీ, చాలామంది వృత్తులకూ ప్రవృత్తులకూ పోలికలుండవు. కొందరి వృత్తి వ్యవసాయంగా ఉంటుంది.

ఇంకొందరి వృత్తి వ్యాపారంగా ఉంటుంది. మరికొందరి వృత్తి సైనికోద్యోగం అయి ఉంటుంది. ఇంకా కొందరి వృత్తి అధ్యాపన అయి ఉంటుంది. పత్రికా సంపాదకత్వం అయి ఉంటుంది. అయినప్పటికీ వీరందరి ప్రవృత్తి మేధాజీవితానికి సంబంధించినదై ఉండవచ్చు. అధ్యాపనా, పత్రికా సంపాదకత్వమూ మిగతా వృత్తులకంటే మేధావి జీవితానికి ఎక్కువ సన్నిహిత సంబంధం కలిగి ఉంటాయి. కనుక ఇటువంటివారి వృత్తికీ ప్రవృత్తికీ అవినాభావ సంబంధం అన్నంత సన్నిహిత సంబంధం ఉంటుంది. నార్లవారి జీవితం అంతే, వారు పత్రికా సంపాదకులు కనుక వారి వృత్తీ ప్రవృత్తి కూడా మేధకు సంబంధించినదే. కనుక నార్లవారి బహిరంగ జీవితానికి అంతరంగ జీవితానికి సార్ధక్యం తక్కువ.

వేంకటసుబ్బయ్యగారు రచించే జీవిత చరిత్రల్లో ఒక విశిష్టత ఏమంటే కథానాయకుని గురించి తాము స్వయంగా తక్కువచెప్పి కథానాయకుని స్వీయ పదాల్లో ఎక్కువ చెప్పిస్తారు. ఒక వ్యక్తి తనను గురించి తాను తెలుసుకోవటం కష్టం. కాని ఒక వ్యక్తిని గురించి ఇతర్లు తెలుసుకోవటం కష్టతరం. కాబట్టి ఒక వ్యక్తిని గురించి ఆ వ్యక్తి స్వంత మాటల్లోనే చెప్పిస్తే, బయటపడని విషయాలు అనేకం ఎక్కువ విస్పష్టంగా బయటపడతాయి. ఇందువల్ల ఇవి జీవిత చరిత్రలైనప్పటికీ కొంత స్వీయ చరిత్ర వాసన కలిగి ఉంటాయి. ఎక్కువ మంది భావించినట్లుగా ఇది గ్రంథకర్తకు సులభమైన పనికాదు. సందర్భాను సారంగా తమ కథానాయకుడు చెప్పిన వాక్కులనన్నిటినీ సేకరించి ఉచిత స్థానాల్లో అతికించాలి. ఇది మేధతో కూడుకొన్న పని కానప్పటికీ శ్రమతోను, గవేషణతోను కూడుకొన్నదని, అందువల్ల ఇటువంటి రచనల్లో గ్రంథకర్త మౌలిక ప్రతిభను ప్రదర్శించాల్సిన అవకాశాలు, అవసరాలు తక్కువ ఉంటాయి.

అయినప్పటికీ గ్రంథకర్త అవకాశం కలిగినప్పుడల్లా కథానాయకుని గురించి తమ స్వీయ దృష్టులను ప్రసరింపచేస్తూనే ఉంటారు. నార్లవారిని గురించి ఈ గ్రంథంలో గ్రంథకర్త వచిస్తారు. "జాతికి మైకం కమ్ముతున్నపుడు మత్తు మబ్బులను విడగొట్టే శక్తిశాలి. దేశం ఆదమరచి నిద్రపోతున్నప్పుడు ఆపదవస్తే ఆదుకొని మేల్కొల్పే సంరక్షకుడు వీరి రచనలలో అసాధారణమైన గుణములలో ముఖ్యమైంది భావతీవ్రత. అవి అంత తీవ్రంగా ఉండుటకు కారణం అవి వారి స్వంతమగుటయే. భావాలు ఎప్పుడు సహజంగా స్వంతమగునో అప్పుడే భాషకు ఒక విధమైన ప్రవాహశక్తి, బిగువు, బలము కలుగును".

గొర్రెపాటివారి రచనారీతిలో వ్యవహారిక శైలి ప్రధానమైనప్పటికీ అప్పుడప్పుడు గ్రాంథిక ప్రయోగాలు దొర్లుతుంటాయి. వ్యావహారికశైలిలో 'ము' కు బదులు సున్నను ఉంచటం పరిపాటి. కాని వేంకటసుబ్బయ్యగారు 'ము'ను ఎక్కువగా వాడి సున్నను తక్కువగా వాడుతుంటారు. వీరేకాదు, ఇంకా కొందరు రచయితలు కూడా ఈ రీతినే అనుసరిస్తుంటారు. వ్యావహారిక శైలిలో సున్నను. మాత్రమే ఉపయోగించాలి కాని 'ము' ఉపయోగించరాదనే ఆంక్ష ఏమీలేదేమో, సున్ననూ, 'ము'నూ కూడా ఉపయోగించినపుడు ఏకవచనంలో అంతగా భేదం వినిపించదు కాని బహువచనంలో కొంత భేదం వినిపిస్తుంది. విషయం' అనేదాని బహువచన ప్రయోగం 'విషయాలు' అయినపుడు 'విషయము' అనేదాని బహువచన ప్రయోగం 'విషయములు' అవుతుంది. ఇవేకాక గ్రంథకర్త తమ రచనలో మరికొన్ని గ్రాంథిక ప్రయోగాలు చేయటానికి అలవాటు పడివున్నారు. కొందరు విమర్శకుల దృష్టిలో ఈ మిశ్రమశైలి ఉపయుక్తమైందికాదు. ఏదో ఒక విధానాన్నే వాడాలి కాని రెండు విధానాలను వాడటం సమంజసంకాదని, మరికొందరు ఈ మిశ్రమ విధానాన్ని అసమంజసం

గ్రాంథిక, వ్యవహారిక ప్రయోగాల వైవిధ్యాన్ని అలావుంచి గ్రంథకర్త రచించే మిగతాశైలిని పరిశీలిస్తే అది చాల సరళశైలి. అర్థాన్ని గుప్తపరచక వ్యక్తపరిచే శైలి. విస్పష్టశైలి అని తేలుతుంది. నార్లవారు మిశ్రమ స్వభావానికి చెందినవారు అని పైనే చెప్పుకొన్నాం. వారిలో ఆలోచన ఎంతవుందో ఆవేశం కూడా అంత ఉంది. నిర్లిప్తమైన, నిష్పాక్షికమైన, పట్టుదలనుంచి స్వతంత్రమైన స్వభావం నార్లవారిలో ప్రధానం కాని ఈ స్వభావానికి విరుద్ధమైన స్వభావం కూడ వారిలో అవసరమైనపుడు తలెత్తుతుందనేది కూడ అసత్యంకాదు. ఇటువంటి ద్వంద్వ స్వభావం కొందరు సామాన్య మానవుల్లోను, కొందరు మేధావుల్లోను, ప్రపంచమంతటా అన్ని కాలాల్లోనూ గోచరిస్తూనే ఉంది. కేవలం హేతువాదం అనేది దానికి అవసరమైన తరుణాల్లోనే కొందరి జీవితాల్లో ఉపయోగంలోకి వస్తుంది కాని అది మానవుల స్వభావాల్ని మార్చటంలో విజయవంతం కాలేదు. సాధారణంగా నార్లవారి భావాన్ని నార్లవారి మాటల్లోనే చాలాచోట్ల గ్రంథకర్త పరికిస్తారని ఇదివరకే తేలింది.

ఆ భావాలు చాలా విలువైనవి రాజకీయాలకు సంబంధించినవైనా, సామాజికాలైనా, సాంస్కృతికాలైనా నార్లవారు అభివ్యక్తపరచే భావాలు విలక్షణంగా ఉంటాయి. ఇటువంటివాటిని సేకరించటంలో గ్రంథకర్త విశేష నైపుణ్యం చూపేరు. నార్లవారు అంటారు. "ఆధునిక కాలంతో వెలువడిన రచనలన్నీ ఆధునిక సాహిత్యం కావు, కాలేవు. ఆధునిక దృష్టిగలది మాత్రమే ఆధునిక సాహిత్యం" ఇవి ఎంతో సత్యమైన పలుకులు. ఆధునికతకు గీటురాయి కాలం కాక ఆధునిక దృక్పథం మాత్రమే. ఆధునిక కాలంలో ప్రాచీన సంప్రదాయంలో రచించే రచయితలు అనేకమంది ఉన్నారు. అంత మాత్రాన వారు రచించింది ఆధునిక సాహిత్యం అవుతుందా మరి? ఆధునిక దృష్టితో రచించింది మాత్రమే ఆధునికం.

నార్లవారి నుంచి మరో ఉదాహరణ "కొందరు రచయితలు భారతీయత పేరున జాత్యహంకారాన్ని, మతమౌఢ్యాన్ని బలపరచడానికి ప్రయత్నిస్తుండగా మరికొందరు ఆధునికత్వం పేర అరాచకత్వాన్ని ప్రోదిచేస్తున్నారు. "ఇవి ఎంతో నిష్పాక్షికమైనట్టి, భారసామ్యంతో కూటినట్టి నిత్య సత్యాలు. అటు సంప్రదాయకుల అతి, ఇటు ఆధునికుల అతి రెండూ కూడ గర్హనీయాలే. సాంప్రదాయికత, ఆధునికత, ఈ రెంటిలో ఏది మానవతకు హానికలిగించినా అది గర్హనీయమే అనే దృక్పథాన్ని సామాన్యులు మొదలు మేధావులవరకూ కలిగి ఉంటే మానవ సమాజం మహిమాన్వితమవుతుంది. భావదాస్యం అణగి పోతుంది. సమ్యగ్దృష్టి వికసిస్తుంది.

జీవిత చరిత్రలను రచించటం, స్వీయచరిత్రలను రచించుకోవటం ఒక విధమైన లలితకళ. వాస్తవాలను చూపుతూనే ఆ వాస్తవ చిత్రణకు ఒక సుగంధాన్ని అంటించాలి. జీవిత చరిత్ర, స్వీయచరిత్ర కూడ మానవజీవితాల చరిత్రలే జీవితాల్లోని విశేషాన్ని, జననాన్ని, పెరుగుదలను, మరణాన్ని చిత్రిస్తాయి జీవిత చరిత్రలు. మరణాన్ని తప్ప మిగతా విషయాల్ని చిత్రిస్తాయి స్వీయ చరిత్రలు స్వీయ చరిత్రలో తాను ఎప్పుడు చనిపోయిందీ తెలియచేయటానికి వీలుండదు. తాను చనిపోయి ఉంటే స్వీయచరిత్ర రచన జరిగి ఉండదుగా : ఇతర్ల జీవిత చరిత్ర వ్రాసే సమయాన ప్రధానంగా తీసుకోవలసిన జాగ్రత్త రచయితకు తన కథానాయకుని మీద ఉండే అభిమానం వల్ల ఆయనలో లేని గొప్పతనాన్ని జీవితచరిత్రలో ప్రదర్శించకుండా ఉండటం కథానాయకునిలో ఉన్న గొప్ప గుణాన్ని జీవిత చరిత్రలో ప్రదర్శించకుండా ఉండరు కాని లేని గొప్ప గుణాన్ని కూడ ప్రదర్శించటంలో ఉత్సాహం చూపుతారు. ఈ విధంగా రచిస్తే అది మంచి జీవిత చరిత్ర కాదు.

జీవితచరిత్రలో ఒక వ్యక్తి జీవితంలోని సంఘటనలను గురించి రచించటం ఎంత ప్రధానమో ఆ వ్యక్తిభావాలను, స్వభావాలను, ప్రభావాలను గురించి రచించటం అంతకంటె ఎక్కువ ప్రధానమైంది.

ఘటనా ప్రాధాన్యాన్ని గురించి రచించటం సులభం, స్వభావాలను గురించి రచించటం అంత సులభంకాదు. వ్యక్తిలోని స్వభావాలను గురించి రచించటాన్నే చరిత్ర చిత్రణ అంటారు. ఇటువంటి చరిత్రచిత్రణను గ్రంథకర్త అక్కడక్కడ మృదువుగా చేశారు... "అన్నిటినీ అర్థం చేసుకోగలవాడు మానవుడు. కాని మానవుణ్ణి అర్థం చేసుకోటం అన్నిటికంటే క్లిష్టతర విషయం. కొందరుమాయమర్మం లేకుండా సూటిగా ఉంటారు. ప్రవర్తిస్తారు. మాట్లాడుతారు. నార్ల ఈ కోవకు చెందినవాడు; లోపల వెలుపల ఒకేలాగుంటాడు ఇది పిల్లల మనస్తత్వం".

నార్లవారు కొన్ని ఆంగ్ల పదాలకు స్వయంగా కొన్ని తెలుగుపదాలను సృష్టించినట్టు కూడా గ్రంథకర్త రచించారు. 'యునైటెడ్ నేషన్స్'కు ఐక్యరాజ్యసమితి' అని 'నాన్ అలైన్డ్"కు "అలీన"అనే దాన్ని నార్లయే సృష్టించాడు." ఈ అనువదించబడిన పదాలు రమ్యంగా ఉన్నాయి. చాలా పారిభాషిక పదాలను ఆంగ్లం నుంచి అనువదించకుండా ఆంగ్లపదాలనే వాడటం నార్లవారికిష్టం అనిపిస్తుంది" "ఎడిటర్" అనే పదాన్ని 'సంపాదకుడు' అనే పదంలోకి అనువదించకుండా తెలుగులో కూడా 'ఎడిటర్' అనే వాడతారు. నిజానికి ఎడిటర్ అనే దానికి సంపాదకుడు అనేది సరైన అనువాదం కాదేమో అనిపిస్తుంది.

నార్లవారి రచనాశైలిని గురించి గ్రంథకర్త అంటారు. "నార్లవాక్యాలు ఎప్పుడూ చలాకీగా పరుగులు పెడుతుంటాయి. ఎక్కడా ఆ నడకలో డొంక తిరుగుడు లేదు. ఆ శైలికి ఆయాసం. ఆర్భాటం లేదు. ఉన్నదల్లా ఆకర్షణ మాధుర్యం, ఉత్తేజం ఒక్కొక్కసారి ఎంత ఉద్వేగాన్ని రెచ్చగొడుతుందో అంత కన్నీరు వొలికిస్తుంది."

అవును అందుకే నార్లవారి స్వభావంలో శాంతి, క్రాంతి రెండూ సమానంగా గోచరిస్తుంటాయి. కాని సంతోషకరమైన విషయమేమంటే శాంతి, క్రాంతి మాత్రమేకాని క్లాంతి గోచరించదు. క్లాంతి గనుక ఉంటే శాంతికీ, క్రాంతికీ కూడ హాని జనిస్తుంది.

నార్లవారు గొప్ప నిబంధకర్తమాత్రమే కాక, నాటక రచయిత కవికూడ నిబంధరచనకు తగినంత వాస్తవవాదం అవసరం. నాటకరచనకు వాస్తవవాదానికి తోడు కల్పనా వాదంకూడ అవసరం ఒక కవితారచనకు వాస్తవ వాదాన్ని వదలకుండానే తగినంత కల్పనావాదం అవసరం. ఈ మూడు విధాల రచనలు చేసే వ్యక్తి బహిర్ముఖి (Extrovert) గా అంతర్ముఖి (Introvert)గా కూడ ఉండవలసిన అవసరం ఉంటుంది.

అంతర్ముఖులుగా ఉండే వారంతా ఆస్తికవాదులుగా ఉండాలనేది మిథ్యా విశ్వాసం. బహిర్ముఖి తనకు బయటున్న ప్రపంచానికి ఎక్కువ విలువ ఇస్తే అంతర్ముఖి తనలో ఉన్న ప్రపంచానికి కూడ తగిన

విలువనిస్తాడు. అంతేకాని ఈ రెండు దృక్పథాలతో ఆస్తికవాదానికి కాని నాస్తిక వాదానికి కాని సంబంధం లేదు. అందుకే గ్రంథకర్త నార్లవారిచేత పలికిస్తారు. "నేను ఆస్తికుడను కాను, నాస్తికుడను కాను. నాది 'యాగ్నాస్టిక్ దృక్పథం" హిందువుగా జన్మించినా, నన్ను నేను హిందువుగా భావించుకొనను మానవతే నామతం. కులదైవం (పర్సనల్ గాడ్) లో నాకు నమ్మకం లేదు. పూర్వజన్మలో కాని, పునర్జన్మలో కాని నాకు విశ్వాసం లేదు. హేతువాదాన్ని నేను అభిమానిస్తాను. దానికి పరిమితులున్నవని నాకు తెలుసు. మానవ జీవితంలో "ఇంట్యూషన్"కు స్థానం ఉందని నేను అంగీకరించకపోను. కాని హేతువాద పరీక్షకు నిలువలేనిదాన్ని సత్యంగా నేను స్వీకరింపజాలను".

నార్లవారు హేతువాదిగా ఉంటూనే హేతువాదానికి వ్యతిరేకమనబడే ఇంట్యూషన్ (స్వతః స్ఫురణ లేక బోధి) ను త్రోసిపుచ్చకపోవటం ఒక గొప్ప సమన్వయ దృక్పథం. రెండు పరస్పర వ్యతిరేక దృక్పథాల్ని ఒకే వ్యక్తిలో ఇముడ్చుకోవటం సమన్వయదృష్టిలో మాత్రమే అవుతుంది. కాని అసంబద్ధ దృష్టికాని, మానసికారోగ్యం లోపించిన దృష్టికాని కాదు. అన్ని దేశాల్లోని అన్ని కాలాల్లోని గొప్ప దార్శనికుల్లో ఇటువంటి పరస్పర వ్యతిరేక దృష్టుల సమన్వయం గోచరిస్తుంది. అదే నార్లవారిలో కూడ గోచరిస్తుంది. నిజానికి హేతువాదం బుద్ధికి చెందింది. బుద్ధికి మించిన గ్రహణశక్తిని బోధి అన్నారు. బుద్ధి అంటే "ఇంటెలెక్ట్" అనీ, బోధి అంటే "ఇంట్యూషన్" అనీ, విశ్వవిఖ్యాత ఆంగ్ల దార్శనికుడు బెర్ట్రాండ్ రస్సెల్ బుద్ధివాది. సుప్రసిద్ధ ఫ్రెంచ్ దార్శనికుడు హెన్రీ బెర్గ్సన్ బోధివాది. అంటే ఇంట్యూషన్ వాది.

అందుకే బెర్గ్సన్ను రస్సెల్ వ్యంగ్యంగా విద్రూపపరచాడు. "Intuition is common to birds, beasts and Bergson" బోధి అనేది పక్షులకూ, పశువులకూ, బెర్గసన్ కూ ఒకటేనట: నిజానికి పక్షుల్లోను, పశువుల్లోను ఉండేది "ఇన్ స్టింక్ట్" మాత్రమేకాని "ఇంట్యూషన్" కాదు. కాని రస్సెల్ దృష్టిలో ఆ రెంటికీ ప్రధానమైన భేదం లేదు. ఆధునిక మనో వైజ్ఞానికుని దృష్టిలో కూడా "ఇంట్యూషన్" అనేది "ఇన్ స్టింక్ట్"ను గొప్పచేసి చూపటం (Sublimation) మాత్రమేనని. ఆ విధంగా చూచినా కూడ ఇంట్యూషన్ అంటే సానపట్టనిది కాక సానపట్టిన '"ఇన్ స్టింక్ట్" అని తేలుతుంది. దీన్నే ఇంగ్లీషు మాటల్లో అనాలంటే Crude instinct is instinct while the refined instinct is intuition అనవచ్చునేమో!

ఏది ఏమైనప్పటికీ మొత్తం మీద నార్లవారి దృక్పథంలో బుద్ధీ, బోధీ రెండూ సహజీవనం చేస్తుంటాయి. అందువల్ల ఒకదానిలోని కొరతను మరొకటి పూరించి వారి దృష్టిని సమగ్రదృష్టిని చేసింది. ఈ మానసిక సమన్వయం బుద్ధిచాలా గొప్పది. సందేహం లేదు; దానికందనివి చాలా తక్కువే ఉంటాయని ఆ తక్కువగా ఉన్నవాటిని అందుకొనే శక్తి బోధికి ఉంటుందని ఒక విశ్వాసం.

గొర్రెపాటి వేంకటసుబ్బయ్యగారు రచించే జీవితచరిత్రల్లో తమ కథానాయకుల్ని ఇతర గొప్ప వ్యక్తులతో పోల్చి అనుశీలించటం ఒక అలవాటుగా వస్తూంది. ఈ గ్రంథంలో నార్లవారిని వేమనతో పోల్చి అనుశీలన చేశారు. ఇటువంటి పోలికల అనుశీలనలో సామ్యాలను మాత్రమే కాక భేదాలను కూడ చూపటం జరుగుతూంటుంది. ఇది చాలా మంచి లక్షణం. ఈ సందర్భంలో గ్రంథకర్త అంటారు. "వేమన కవిత్వానికి అధికబలం సమకూర్చింది ఆయన హాస్య ప్రకృతి, ఆయన హాస్యమున కొంత కటుత్వం ఉన్నా, నొప్పించ కుండా నవ్వించేది కావలసినంత ఉంది. నార్ల రచనలో హాస్యముకన్న హేళన ఎక్కువ. వీరి రచనల వ్యాప్తికి కారణం వీరి కవితాధార, నీతులు, స్త్రీ సందర్భంలో వీరి అభిప్రాయములు పరస్పరభిన్నాలు. "సతులు జపతపమ్ము చేయసాగితే, పురుషులేలనింక పుడమిలోన పాపమెంచవలదు పట్టిశిక్షింపుడు" "ఆడుదనగ రోత" ఈ మాదిరిగా స్త్రీలను తనకాలంలో అందరూ నిందించినట్లే నిందించాడు వేమన. ఆ ధోరణిలో నడువక "నలువ కలలపంట నారీనరుల జంట" అన్నారు నార్ల.

గ్రంథకర్త వేమనలోను నార్లవారిలోను ఉన్న ప్రపార్ధక్యాన్ని ఎత్తిచూపటం ఎంతో సమంజసంగా ఉంది. ప్రముఖ సంఘసంస్కార భావాలుగల వేమన తన కాలంలోని రీతి రివాజులన్నిటినీ విమర్శించి స్త్రీ స్వాతంత్ర్యాన్ని గుర్తించాడు; స్త్రీ ప్రగతిని ఆక్షేపించాడు. ఆయన కాలంనాటి పద్ధతి అదీ అని మనం సరిపెట్టుకోటానికి వీలులేని లోపం ఇది. ఆయన కాలంనాటి పద్ధతుల నెన్నో నిందించిన వేమన స్త్రీల దుస్థితిని ఎందుకు నిందించలేదో మరి! స్త్రీల దుర్గతిని నిందించకపోగా పైగా స్త్రీల ప్రగతిని నిందించాడు! ఈ వైఖరి నార్లవారి కవితలో విరుద్ధరూపం తాల్చటం ముదావహం. ఇంత మాత్రాన వేమన గొప్పదనానికి భంగము వాటిల్లదు. కొంత వరకు వేమన కవితాఛాయల్లోనే తాము నడిపిన "నార్లవారిమాట" అనే కవితాగ్రంథంతో ఈ క్రింది కవితతో ముగింపు చేస్తారు. వేమన మీద వారికెంత శ్రద్ధాసక్తులో విదితమవుతాయి.

విశ్వకవివి నీవు వేమన యోగీంద్ర;
నిత్యసత్యమోయి నీదువాక్కు;
నీవు దయదలంచి దీవించుచో –
ఔను వాస్తవమ్ము నార్లవారిమాట."

ఇంత సవినయంగా ఎవరిపట్లా నార్లవారు ఇంతవరకూ పలికినట్లు జాడ తెలియదు! నార్లవారి కవితలు కేవలం రసజగత్తుకు కాక నైతిక జగత్తుకూ, కొంత వరకు వ్యావహారిక జగత్తుకూ చెంది ఉంటాయి. కేవలం Didactic Poetry అనబడే నీతిబోధక కవితలు మాత్రం కావు అవి. కేవలం నీతిబోధక కవితకు విశ్వసాహిత్యంలో అంతగా గొప్ప స్థానం లేదు.

వేమన నాటి సామాజిక నీతికి నార్లనాటి సామాజిక నీతికీ బుద్ధికీ పూర్వం ఉన్న శాక్యరాజులనాటి సామాజిక నీతికీ వేమన నాటి సామాజిక నీతికి మధ్య ఉన్నంత విపరీతమైన ప్రబేధం లేకపోయినా కొంత ప్రబేధం ఉంది. బుద్ధునికి పూర్వపు శాక్యరాజులు తమస్వంత తోబుట్టువులనే వివాహం చేసుకొనేవారు. ప్రాచీన ఈజిప్టు రాజులు కూడ అంతే. వేమన కాలానికి నార్ల కాలానికీ లైంగిక మూల్యాల్లో (Sex values) చాలా తారతమ్యం ఏర్పడింది. నేడున్న లైంగిక స్వేచ్ఛ నాడు లేదు. సిగ్మండ్ ఫ్రాయిడ్ విస్తరింపచేసిన 'మనోవిశ్లేషణ' లేక సైకో అనాలసిస్ మూలంగా నేటి సమాజంలో చాలావరకు లైంగిక స్వేచ్ఛ వృద్ధి అయింది. వేమన నాడు లైంగిక స్వేచ్ఛను పాపదృష్టితో చూచేవాళ్ళు, ఆ దృష్టికి అలవాటుపడ్డ వేమన బహుశా అందుకనే తన కవితలో స్త్రీని చిన్నచూపు చూచి ఉంటాడు.

గ్రంథకర్త ఈ గ్రంథంలో నార్లవారి జీవితంలోని వివిధ దశలనూ, ప్రవేశించిన రకరకాల మార్పులనూ, జీవితంలో అనుభవించిన కష్టసుఖాలనూ వారు రచించిన వ్యాసాలు, నాటకాలు, నాటికలు, కవితలు, విమర్శలు మొదలైనవాటినీ గురించి చెపుతూ వాటన్నిటినీ కూడా చాలావరకు క్లుప్తంగా ఇందులో ప్రకటించారు.

నార్ల జీవితాన్ని గురించి ఒకమాటలో చెప్పాలంటే అది సంప్రదాయ శృంఖలాలనుంచి నవ్యస్వేచ్ఛకు పయనించే పడవ, పాతభావాలనుంచి నూతన భావాలకు పయనించటంలో చాలా బాధలుంటాయి. తాను పెరిగిన సంప్రదాయాన్ని వదలి నవ్యభావధారలో ప్రవహించాలంటే ఎంతో సాహసం, సహిష్ణుత కావాలి. అందుకే విలియమ్ జేమ్స్ అంటారు. "There is no pain in the world like the pain of a new idea." నూతన భావం లాంటి బాధాకరమైంది ఈ ప్రపంచంలో మరొకటి లేదట! కవి లక్షణాల్లో కాలానికెదురీదటం కూడ ఒకటి అంటారు నార్లవారు.

"కవికె చెల్లునోయి కాలానికి కెదురీత
వాస్తవమ్ము నార్లవారిమాట."

కాలానికెదురీదటం అంటే సాంప్రదాయిక బంధనలనుంచి బయట పడటమే; తన కాలానికి వెనక ఉండకపోగా, తనకాలంలో కూడ ఉండక తన కాలానికంటే ముందుండటమే కాలానికి ఎదురీదటం. ఈ విధంగా కాలానికెదురీదిన కష్టజీవులే జీవితంలో ఉన్నత స్థాయినందుకో కలిగేరు. కాలప్రవాహంలోపడి కొట్టుకపోయేవాళ్ళు ప్రవాహంలో పడి ఎంతదూరం ప్రవహించినా కూడ ఇదివరలో ఎక్కడున్నారో అక్కడే ఉండిపోతారు. స్వార్థాన్ని అధిగమిస్తేనేకాని నూతనత్వాన్ని అందుకోలేడు మానవుడు. నవ్యత అనేది నిజంగా ఒక నిస్వార్థతే. స్వార్థం అనేది ఒక భౌతిక బంధన. నిస్వార్థం అనేది ఒక చైతన్య స్వేచ్ఛ.

నార్లవారి గుణగణాలను గురించి గ్రంథకర్త అతిశయోక్తులను విసరకుండా ఉన్నదున్నట్లు వచించారు. లేని గుణాలను చొప్పించటం కంటే ఉన్న గుణాలను వదిలేయటం ఎంతో ఉచితం. కాని గ్రంథకర్త నార్లవారిలో ఉన్న గుణాలను కూడ ఏమీ వదలినట్లు లేదు! లేని గుణాలను చొప్పించక, ఉన్న గుణాలను వదలకపోవటమే నిజమైన జీవితచరిత్ర రచన. అయితే ఎంతమంచి మనిషిలోనైనా చెడ్డగుణాలు లేకుండా ఉంటాయా? ఎంత చెడ్డ మనిషిలోనైనా మంచి గుణాలు లేకుండా ఉంటాయా? ఇది వేరే విషయం. అసలు మంచి చెడులను కొలిచే కొలబద్ద ఏమిటి ఇది కూడా వేరే విషయం.

ఎందుకు జీవిత చరిత్రలు వ్రాయటం? ఎవరి జీవిత చరిత్రలు వ్రాయాలి? ఎవరు వ్రాయాలి జీవిత చరిత్రలను? జీవించేవారందరి జీవితచరిత్రలు వ్రాయాలా? జీవించేవారి జీవితాలన్నిటికీ చరిత్ర లుంటాయా? ప్రతిరచయితా జీవితచరిత్రను వ్రాయగలడా? మామూలు మనుషుల జీవితాలకంటే ఒక మనిషి జీవితం విశిష్టరీతిలో ఉన్నపుడు ప్రతిభావంతంగా ఉన్నపుడు మహోజ్వలంగా ప్రకాశిస్తున్నపుడు, ఆ వ్యక్తి జీవితంమీద రచయితకు విలువ ఉన్నపుడు, ఆకర్షణ ఉన్నపుడు ఆ వ్యక్తి జీవితచరిత్రను రచిస్తాడు. జీవితచరిత్రల కథానాయకులు రాజకీయ వేత్తలు కావచ్చు. ఆర్థిక వేత్తలు కావచ్చు. సమాజికవేత్తలు కావచ్చు. తత్వవేత్తలు కావచ్చు. సాహితీవేత్తలు కావచ్చు. కళాకారులు కావచ్చు. ఇంకెవరైనా ప్రత్యేక వ్యక్తులు కావచ్చు. మిగతావారి జీవిత చరిత్రలు చదవటానికి కొంత ఎండుగా ఉంటాయి. తత్త్వవేత్తల, సాహిత్యవేత్తల, కళాకారుల, పర్యాటకుల జీవిత చరిత్రలు చదవటానికి రసవంతంగా ఉంటాయి. నార్లవారి లాంటి జీవిత చరిత్రలు మిశ్రమానందాన్ని కలిగిస్తాయి.

ఎవరు రాయాలి జీవితచరిత్రలను అనే ప్రశ్నకు జవాబు కొంచెం కష్టమైందే? రచించ చేతయిన వారంతా ఏ ఇతర రచనలైనా చేయొచ్చు కాని జీవిత చరిత్రలను రచించటానికి మాత్రం అర్హులుగా ఉండరు. జీవిత చరిత్రలను రచించే రచయితకు సాహితీ నైపుణ్యం ఉంటే మాత్రమే చాలదు. ఇంకా ఇతర ప్రతిభలు కొన్ని ఉండాలి. ఎదటి మానవుని ఆకృతినీ, ప్రకృతినీ కూడ అర్థం చేసుకొనే శక్తి, ఎదటివారి జీవితాల్లోని ఘటనా ప్రాధాన్యాన్ని గ్రహించ కలిగి, అభిమానాలమీదా అతిశయోక్తులమీద సంయమాన్ని కలిగి ఉండాలి; దూషించటానికీ భూషించటానికీ అలవాటుపడి ఉండరాదు:

ఇతర్ల ఆలోచనలను సమాలోచన చేయకలిగి ఉండాలి; తన కథానాయకుణ్ణి తన మాటలద్వారా సంతోషపెట్టాలనే ప్రలోభననుంచి విముక్తులై ఉండాలి; జీవితంలో మనోవైజ్ఞానిక దృష్టిని పెంచుకొన్నవారై ఉండాలి.

మరి ఈ జీవిత చరిత్రను రచించిన రచయితలో పైన పేర్కొన్న అర్హతలన్నీ సంపూర్ణంగా ఉన్నాయా అని అడిగితే సంపూర్ణంగా ఉన్నాయని చెప్పినా అసత్యం చెప్పటమే అవుతుంది.

అసలు లేవని చెప్పినా అసత్యం చెప్పటమే అవుతుంది; అసలు లేవా అనే ప్రశ్నకు ఉన్నాయి అనే జవాబు వస్తుంది. సంపూర్ణంగా ఉన్నాయా అనే ప్రశ్నకు అనుమానంగా జవాబివ్వాలనిపిస్తుంది. సంపూర్ణం అనే వరకు ప్రతివ్యక్తిని గురించీ సందేహం ఏర్పడుతుంది. కారణం ఏ వ్యక్తిలో కూడ ఏ విషయంలోనూ సంపూర్ణత ఉండదు. సంపూర్ణత అనేది నిఘంటువుల్లో మాత్రమే ఉంటుంది కాని జీవితంలో ఉండదు. ఎక్కువ సంపూర్ణత, తక్కువ సంపూర్ణత అనేవి మాత్రం ఉంటాయి. ఒకరి శక్తిని మరొకరిదానితో పోల్చి నప్పుడు, వానికంటే ఆమె ఎక్కువ సంపూర్ణమైంది అనవచ్చు. అదేమాదిరి ఆమెకంటే అతను తక్కువ సంపూర్ణుడు అనవచ్చు. ఈ అర్థంలో ఈ గ్రంథకర్త కొందరికంటే ఎక్కువ సంపూర్ణుడు; మరికొందరికంటే... ... ... : జీవితం సాపేక్షం.

'నవమేధావి నార్ల'లోని కథానాయకుడు సుప్రసిద్ధుడు, దాన్ని రచించిన రచయిత సుప్రసిద్ధుడు. ఒక సుప్రసిద్ధుని మరో సుప్రసిద్ధుడు రచిస్తే ఆ రచన కూడ సుప్రసిద్ధంగా ఉండి తీరుతుందా! ఏమో. అందరి విషయంలో ఏవిధంగా ఉంటుందో తెలియదు కాని ప్రస్తుత విషయంలో మాత్రం అది సుప్రసిద్ధంగా లేకపోదు. చెడ్డవిమర్శకు అందని రచనంటూ ఉండదు. "ఇందులో ఈ మాటలు లేకుండా ఉంటే ఎంత బాగుండేదో, వీటికి బదులు మరో మాటలుంటే ఇంకా ఎక్కువ రమ్యంగా ఉండేది" అని కొన్ని రచనల్ని గురించి కొందరు విమర్శకులు చేసే ఊహాగానానికి హద్దులుండవు.

జీవితానికి ఒక కొసను జననం, మరోకొసను మరణం, జననమరణాల మధ్య ఉన్న దాన్ని జీవితం అంటాం. జననాన్నుంచి బయలుదేరి మరణాన్ని అందుకొనే ప్రయాణాన్ని జీవితం అని పిలుస్తాం. ఈ ప్రయాణానికి అనేక బాటలు. కొందరి జీవితాలు పూలబాటల మార్గం పయనిస్తే మరికొందరి జీవితాలు ముళ్ళ బాటలమీద పయనిస్తాయి. లోతుగా పరికించి చూస్తే పూలబాటలు పూర్తిగా పూలబాటలు కావు. ముళ్ళబాటలు పూర్తిగా ముళ్ళబాటలు కావు. పూలబాటలు అనే వాటిలో ఎక్కువ పూలూ, తక్కువ ముళ్ళూ ఉంటాయి. ముళ్ళబాటలు అనే వాటిలో ఎక్కువ ముళ్ళూ తక్కువ పూలూ ఉంటాయి. కొందరి జీవితాలు పూలబాటలో నడకను ప్రారంభించి ముళ్ళబాటలో ప్రవేశించినవి ఉన్నాయి. మరికొందరివి ముళ్ళబాటలో ప్రారంభించి పూలబాటలో ప్రవేశించినవి ఉన్నాయి. పూలబాటలో ప్రారంభించి పూలబాటలోనే ప్రవేశించినవి. ముళ్ళబాటలో ప్రారంభించి, ముళ్ళబాటలోనే ప్రవేశించిన జీవితాలు కూడా ఉన్నాయి.

నార్లవారి జీవితం ముళ్ళబాటలో ప్రారంభించి పూలబాటలో ప్రవేశించి, పూలబాటలోనే ఆ పూలలోనుంచి ఎప్పుడైనా ఒక పదునులేని ముల్లు తేలికగా గ్రుచ్చుకొంటే నడుస్తుంది. గ్రుచ్చుకోవచ్చు, గ్రుచ్చుకోకపోవచ్చు.

'నవమేధావి నార్ల' ఈ ముళ్లబాట నుంచి పూలబాటకు పయనించిన ప్రయాణగాథయే. ఆ బాటలలో పయనించిన వారొకరు; ఆ పయనాన్ని గురించి పాఠకులకు తెలిపినవారు మరొకరు. ఒక నిపుణ జీవిత చరిత్రకారుని ద్వారా అక్షరాల్లోకి రూపొందటం తక్కువ విశేషమైన పనికాదు; ఒక మేధావికి అక్షరాల్లో రూపం ఇవ్వటం అంతకంటే తక్కువ విశేషమైన పని అసలే కాదు. ఉభయులూ ధన్యులు.

ఏ రచనైనా రచించబడిన సమయంలో కాక పాఠకుల హృదయాల్లో సజీవరూపం దాలుస్తుంది; రచించబడిన సమయాన అది నిప్పు; పాఠకుల హృదయాల్లో అది జ్వాల అవుతుంది. జ్వాలయే అసలైన సాహిత్యం. స్రష్ట సహృదయునిలో వెలిగించిన సజీవజ్వాల అది!

సూర్యదేవర సంజీవదేవ్ *(1924–1999) సుప్రసిద్ధ కళా విమర్శకులు. సాహిత్యవేత్త. గుంటూరు జిల్లా, తుమ్మపూడి గ్రామంలో నివసించారు. అనువంశీయత, దృఢతర దీక్ష, నిరంతర కృషితో పలుభాషలలో అపారమైన పరిజ్ఞానం సంపాదించారు. వీరి ఆంధ్రాంగ్ల రచనాశైలిలో ఒక ప్రత్యేకత ఉంటుంది. తెలుగులో తెగిన జ్ఞాపకాలు, పరిచయ స్రవంతి, ఇంగ్లీషులో బ్లూ బ్లూమ్స్, హర్ లైఫ్ వంటి రచనలు ప్రచురించారు. రసజీవిగా జీవనం సాగించారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు నుంచి గౌరవ డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు.★*

నవీన ఋషి – నార్ల

– ఎన్.ఆర్. తపస్వి

ఆధునిక యుగంలో జీవిస్తూ కూడా ఆదిమ యుగాలకే ప్రాతినిధ్యం వహిస్తుంటారు ఎందరో. కాలం చెల్లిన ఆచారాలు, ఆధారంలేని అంధ విశ్వాసాలు, వంశపారంపర్యంగా సంక్రమించిన కులమతోన్మాదాలు, పౌరాణిక ధోరణులు వీరి ఆలోచనలను నిత్యజీవితాలను శాసిస్తుంటాయి.

విజ్ఞాన శాస్త్రం ప్రసాదించిన ఫలితాలను అనుభవిస్తూనే దాన్ని తూలనాడటానికి వెనుకాడరు. జిల్లెళ్ళమూడి అమ్మనో, జీసస్ బొమ్మనో, మసీదు దిమ్మనో ఆరాధిస్తూ అశాస్త్రీయ అయోమయ భావాలను ప్రచారం చేస్తూ పామర సంఘం ప్రశంసలు పొందుతుంటారు. దిగులు, చింత లేని పని. ఏమీ నేర్చుకోవలసింది లేదు; నేర్పవలసింది లేదు. పూజలు, పునస్కారాలు, తీర్థయాత్రలు, మతబోధలు, జీవన్ముక్తి.

ఇందుకు విరుద్ధంగా కొందరు తమ చుట్టూ ఉన్న సమాజంలోని అవిద్య, అజ్ఞానం. అశాస్త్రీయ భావనలు అనాచారాలు గమనిస్తారు. వాటికి కారణాలు అవగాహన చేసుకుంటారు. తాము ఆరోహిస్తూ ఇతరులను కూడ జ్ఞాన శిఖరారోహణకై ప్రోత్సహిస్తారు. ఇటువంటివారే ఆదర్శ జీవులు. వైతాళికులు, సంస్కర్తలు, నవీన ఋషులు.

పత్రికా రచయితగా, కవిగా, సంస్కర్తగా త్రివిక్రమావతారాన్ని ప్రదర్శించిన వి.ఆర్. నార్ల అటువంటి నవీన ఋషుల్లో అగ్రగణ్యుడు. ఎటువంటి ముసుగులూ, లొసుగులూ, దొసగులూ లేని మహోన్నత జీవితం ఆయనది.

జీవిక కోసం పత్రికా సంపాదకుడుగా వృత్తినెంచుకున్నా ఆయన జీవితం వేరు. తన ఆదర్శాలకూ అభిప్రాయాలకూ క్షతి కలిగే క్షణాలలో ఆయన జీవనోపాధిని సైతం తృణప్రాయంగా త్యజించారు. అధికారానికి ప్రలోభాలకూ, ఎన్నడూ ఆయన తల ఒగ్గలేదు.

గ్రంథపఠనం ఆయన విషయంలో అగమ్య వ్యసనంగా మారిపోయింది. తెలుగులో ఇంగ్లీషులో మానవ సంస్కృతి నాగరికతలకు చెందిన అన్ని విభాగాలకు చెందిన గ్రంథాలను జీవితాంతం అధ్యయనం చేస్తూనే కాలం గడిపిన నిరంతర విద్యార్థి ఆయన. 20 వేల గ్రంథాలకు పైగా ఆయన 'హోమ్ లైబ్రరీ'లో ఉండేవి.

ఆయనకు శిల్ప చిత్రకళలు మరొక ఆకర్షణ. జీవితకాలంలో ఎన్నో శిల్పాలను చిత్రకళా ఖండాలను ఆయన సేకరించారు. అవన్నీ కళాదృష్టితో సేకరించినవే కాని ఆయన మరో విగ్రహారాధకుడు కారు. అలా ఒకే సమయంలో విగ్రహాభిమాని, విగ్రహ విధ్వంసకుడూ (Iconoclast) కూడా అయ్యారు.

విజ్ఞాన శాస్త్ర విభాగాలకు విరుద్ధంగా కాల్పనికమైన సృష్టివాదం, చరిత్ర, మానుషశాస్త్రం మొదలైనవి ప్రచారం చేసే మతాలు పురాణాల పట్ల ఆయనకు సానుభూతి లేదు. వాటిని సాంతం విసర్జిస్తే తప్ప మానవునికి ఆధునికత అలవడదని ఆయన నొక్కి చెప్పారు తన రచనల ద్వారా. సత్యం, వాస్తవం అంటే ఆయనకు ప్రాణం. అందుకే తన భావప్రసారానికి మాధ్యమంగా ఎన్నుకున్న పద్యానికి మకుటం "వాస్తవమ్ము నార్లవారి మాట" అని ఎన్నుకున్నారు. భావాలలో నవ్యాధునికత, భాషపై అధికారం, నానుడులు, సామెతలపై చొరవ ఆయనను ఆధునిక వేమనగా మార్చివేసినాయి.

దేశ చరిత్రలు, రష్యన్ కథానువాదాలతో మొదలైన ఆయన రచనా వ్యాసంగం, గేయాలు, నాటికలు, శతక కవిత్వం, వ్యాసాలుగా మహాప్రవాహంగా సాగిపోయింది. తెలుగులో ఇంగ్లీష్ లో కూడా

ఆయనకు విలక్షణమైన శక్తిమంతమైన సొంత గద్యశైలి ఉంది. రచయితగా ఆయన పేరు ప్రచురించకున్నా అది ఆయనను పట్టియిచ్చేటంత స్వకీయమైనది.

నిర్భీకత, తాను కనుగొన్న సత్యాల పట్ల అచంచల విశ్వాసం నార్ల ముఖ్య లక్షణాలు. ప్రసిద్ధ వ్యక్తులలోని దోషాలను విమర్శించడంలో ఆయన కఠోర వైఖరి ప్రదర్శిస్తారు. గాంధీ నెహ్రూలను సైతం ఆయన లక్ష్యం చేయరు.

శ్రీశ్రీ మహాప్రస్థానం కవితా సంకలనంలో 'దేశచరిత్రలు' ఖండికలోని "తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?" అనే ప్రసిద్ధ పంక్తులకు మూలంగా, బెర్టోల్ట్ బ్రెస్ట్ కవితలోని ఈ పంక్తులను ఎత్తిచూపారు ఆయన.

Who built the seven gates of Thebes? *(గ్రీసు దేశపు నగరపు ఏడు ద్వారాలను నిర్మించిందెవరు)*

అలాగే Thomas Hardy నవల నొకదానిని యథాతథంగా తెనిగించి ఆ విషయం ఎక్కడా ప్రకటించకుండా దాన్ని తన స్వీయరచనగా ప్రచురించిన చలం వైఖరిని కూడా ఆయన నిరసించారు.

Non-alignment policy అనే మాటకు 'అలీన విధానం' అని ఆయన చేసిన అనువాదం పత్రికారంగంలో ఆశాకిరణం. అటుపై ఎన్నో పదాలను, పదబంధాలను పత్రికారచనకు అందించి కొత్త వడినీ, ఒరవడినీ భాషకు అభ్యాసం చేశారాయన. ఆయన వంటి ఉద్దండ పండితులు పత్రికా రంగంలో నేడు లేరు. కనుకనే నేటి పత్రికల భాష మేధస్సు, మేథస్సు, 50వ దశకం, 60వ దశకం, ఆపన్నహస్తం, అతలాకుతలం వంటి అపశబ్దాలతో భ్రష్టమై పోయింది. సంస్కరించడానికి మరో నార్ల అవతరించాలా?

ఈయన జీవిత చరమాంకంలో చేపట్టి, దిగ్విజయంగా పూర్తిచేసిన తార్కిక తాత్విక రచన 'The Truth about the Gita' ఆయన సర్వోత్తమ రచన (Magnum Opus) గా భావించవచ్చు.

హిందూమతస్థులు ప్రామాణికంగా భావించే పవిత్ర గ్రంథం, ప్రపంచ వ్యాప్తంగా కోటాను కోట్ల ప్రజలనూ, మేధావులను ప్రభావితులను చేసిన ధార్మిక గ్రంథం, ఆధునిక మనోవైజ్ఞానిక సిద్ధాంత గ్రంథంగా, అఖండ కీర్తినార్జించిన మహాగ్రంథం 'గీత'ను నార్ల అపురూప మేధతో, అనన్య తార్కిక ప్రజ్ఞతో, అద్భుత వైజ్ఞానిక దృష్టితో శవపరీక్షకు గురిచేసి అదొక విషగ్రంథంగా నిరూపించారు.

దుర్మార్గాలనూ, దౌష్ట్యాలనూ, తిరస్కరించేవారు, మానవత్వాన్ని అభిమానించేవారు మూఢ విశ్వాసాలను నిరసించేవారు, మనిషి మనిషిగా జీవించాలనీ, మనీషిగా రూపొందాలనీ ఆశించే విద్యావంతులైన మనుషులంతా చదివి జీర్ణించుకోవలసిన అపురూప గ్రంథం అది!

ఆ గ్రంథం – శ్రీశ్రీ భాషలో చెప్పాలంటే... "అగ్ని సరస్సున వికసించిన వజ్రం" ఆ గ్రంథంలో అమరుడై జీవించే నవీన ఋషి నార్ల!

నడకుర్తి రామ్ తపస్వి *తెనాలి ప్రాంతంలో, గోవాడ గ్రామంలో జన్మించారు. కవిభూషణ నడకుర్తి వెంకటరత్నకవి వద్ద బాల్యం నుండీ సంస్కృతాంగ్లాంధ్ర భాషా సాహిత్యాల అధ్యయనం. అనంతర కాలంలో బహుముఖ ప్రజ్ఞానిధి డాక్టరు సంజీవదేవ్ సాన్నిహిత్యంలో తత్త్వశాస్త్రం, లలితకళల పరిశీలన చేశారు. పోస్టల్ శాఖలో 40 సంవత్సరాలు ఉద్యోగం నిర్వహించి 2008లో పదవీ విరమణ చేశారు. పద్య, గేయ రచనలో, ప్రకృతి చిత్రకళలో, కూచిపూడి నాట్యంలో, సంగీతంలో ప్రవేశం ఉంది.*★

ఆపదలో అండ

– గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

పత్రికా సంపాదకులు ధూషణ భూషణలకు గురిగావడం సహజం. కాని, సర్వజన వంద్యమైన కార్యాలు నార్లవారు చేశారు.

వాటిలో కొన్ని తూర్పు కోస్తా తుఫాను బాధితుల నిధి, రాయలసీమ క్షామం, గోదావరి వరదలు వచ్చినప్పుడు ఆంధ్రప్రభ సంపాదకులుగా ఆయన చేసిన సేవలు మహత్తరమైనవి.

కొందరు పత్రికా సంపాదకులు దేవాలయ మరమ్మతులకు కొన్ని నిధులు వసూలు చేసిన సంగతి పత్రికా పాఠకులకు తెలిసిందే. అది అంతా వారు తాము పరసాధనానికి సోపానంగా గ్రహించి చేసి ఉండవచ్చు.

ఆంధ్రప్రభ సంపాదకులుగా నార్లవారు తోటి మానవుల్లో మానవత్వం రేకెత్తించి, బాధితులకు తమ వ్యాస పరంపరలద్వారా సాయపడటం, వారి లేఖనాశక్తికి, చిత్తశుద్ధికి, విమల వర్తనకు ప్రబల నిదర్శనం.

భాగవతంలో ధ్రువుడు చివరికిలా భగవంతుని ప్రార్థించాడు.

"సత్యహం, కామయే రాజ్యం, నస్వర్గం నపునర్భవం కామయే దుఃఖ తప్తానాం, ప్రాణినాం ఆర్తినాశనం."

"నేను రాజ్యం కోరను, స్వర్గం కాని, మోక్షంకాని నా కవసరం లేదు. దుఃఖతప్తులైన ప్రాణుల బాధా నాశనమే కోర్తాను". అని అన్న ధ్రువుని మాట నాకు జ్ఞాపకం వస్తుంది. ఈనాటి యుగధర్మం మానవత్వమే దేవుడు. సాంఘిక సేవే దాని మతం.

ఆంధ్రప్రభ 1945 లో వచ్చిన తూర్పు కోస్తా తుపాను నిధికి రు. 34,430-10-2 రాయలసీమలో 1952లో ఏర్పడిన క్షామనిధికి రు. 3,08,348-4-1 గోదావరి వరద బాధితుల నిధికి రు. 84,69,481-12-6 న్నూ వసూలైనవి. ఈ అంకెలు 13-1-1953 వరకు జరిగిన వసూళ్ళు మాత్రమే. మొత్తం మీద పది లక్షల వరకు వసూళ్ళు చేయగలిగాడు. ఇది సామాన్య విషయం కాదు.

రాయలసీమకేమి, గోదావరి ప్రాంతానికేమి, పత్రికా ప్రతినిధులను బంపి అచ్చటివారు సేకరించిన భోగట్టాతో పత్రికలో ప్రకటించడం, ఏ గ్రామంలో ఎంత ఇచ్చినది, తిరిగి పత్రికలో ప్రచురించడం, ఈ విధంగా ఎంతో ఆవేదనతో కృషి చేశారు.

ఒక తాగుబోతు, తానైదునాళ్ళు తాగుడు మాని, అయిదు రూపాయలు పంపుతూ, తన బోటివారు కూడ తనవలె చేయమని వ్రాయటం గమనించదగిన విషయం.

రావుబహదూర్ కె.జి. బాబూరావు అనే రిటైర్డ్ జడ్జి బందరు నుండి నూరు రూపాయల చెక్కు పంపుతూ, "మీ పత్రిక చదివి పట్టలేక పంపుతున్నా" నని రాశాడు.

మద్రాసు నుండి కొప్పరపు సుబ్బారావు 19-3-1953న *"జోహారులు"* అన్న మీ వ్యాసం చదివి, "మీకు జోహారులర్పిస్తున్నాను. ఈ మాదిరి వ్యాసాన్ని ఏ తెలుగు పత్రికలోనూ చదివి యుండలేదని" రాశారు.

డబ్బేగాక ఇలా ప్రశంసలు కూడా ఎన్నో పొందారు. ఈ నిధి వసూళ్ళ సందర్భంలోనే ఈ మొత్తాన్ని ధర్మ సంస్థ రామకృష్ణ మిషన్ ద్వారా పంపిణీ చేయించుట మరొక ప్రశంసనీయ విషయం.

రాయలసీమవారు, ఈ సాయాన్ని మనస్సులో ఉంచుకొని "మీకు, రామకృష్ణ సంస్థ ప్రతినిధులకు సన్మానం చేస్తాము, వారంగీకరించారు. మీరు తప్పక రండి" అని కోరారు. దానికి జవాబుగా "స్వాములకు మానావమానాలు సమానం, వారితో పోల్చవద్దు నన్ను, నేను రా జాలను" అన్నారు వెంకటేశ్వరరావుగారు.

ఇంతకు ఆయన Philosophy of life think for yourself, live for others. "స్వతంత్రంగా ఆలోచించు, పరులకొరకు జీవించటమే ప్రధానాశయం"

(నవమేధావి నార్ల – గ్రంథం నుంచి పునర్ముద్రణ)

పండిత గొర్రెపాటి వెంకటసుబ్బయ్య *(1898–1982) కృష్ణా జిల్లా ఘంటసాల గ్రామంలో జన్మించారు. జాతీయోద్యమంలో, గ్రంథాలయోద్యమంలో కృషి చేశారు. కారాగారశిక్ష అనుభవించారు. ఆచార్య రంగా, రైతుపెద్ద గొట్టిపాటి బ్రహ్మయ్య, డాక్టరు సి.ఆర్. రెడ్డి, కాశీనాధుని నాగేశ్వరరావు తదితరుల జీవిత చరిత్రలు రాశారు. మన జమీందారులు, ఘంటసాల చరిత్ర రాశారు. వీరు నిత్య విద్యార్థి, నిత్య పథికుడు. నార్లవారికి సన్నిహితులు.*★

బహుముఖ ప్రజ్ఞాశాలి, ధీశాలి : నార్ల

– త్రిపురనేని హనుమాన్ చౌదరి



తెలుగునాట గత 125 సంవత్సరాలుగా సంఘసంస్కర్తలూ, సాహితీవేత్తలూ, మేధావులూ, రాజకీయ నాయకులూ (కొందరు మాత్రమే), పత్రికా సంపాదకులూ తమతమ రంగాల్లో తమ జ్ఞానాన్నీ, పాండిత్యాన్ని ఉపయోగించి, ప్రజలను చైతన్యవంతులుగా, కార్యోన్ముఖులుగా, నీతి (Policy)

నిర్ణేతలుగా తయారు చేస్తూ వచ్చారు. వీరిలో, అనుదినం లక్షలాది మందిని ఉద్దేశించి, ఉద్బోధించి, ప్రతిభావంతం చేసేవారు పత్రికారంగంలోని వ్యాసరచయితలూ, వార్తా విశ్లేషకులు, సంపాదకీయ రచయితలూ. ఇంగ్లీషు మాధ్యమ పత్రికారంగంలో ప్రఖ్యాతి చెందిన తెలుగువారు కోటంరాజు రామారావుగారు, చలపతిగారు, ఖాసా సుబ్బారావు గార్లు ప్రముఖులు. తెలుగు భాషా పత్రికారంగంలో ప్రముఖులు ముట్నూరి కృష్ణారావుగారు, సురవరం ప్రతాపరెడ్డిగారు, నార్ల వెంకటేశ్వరరావుగారు. వీరందరిలో నార్లవారికి నిరుపమాన విశిష్టత ఉంది.

నార్లవారు కేవలం సంపాదకీయాలు రాయడంలోను, సంఘటనలను, వార్తలను విశ్లేషించడంలోనే నిష్ణాతులు గారు; వారికొక చారిత్రక అవగాహన. సామాజిక దృష్టి ఉన్నాయి. వ్యక్తి, సమాజ సమగ్ర ప్రగతికి, మనకెటువంటి విద్య కావాలి? ఆలోచన, విమర్శనాశక్తిని ఎలా అలవరచుకొని, పెంపొందించుకోవాలి; కాలాంతరంలో విజ్ఞానం, సాంకేతికంలోని అభివృద్ధులు జీవనశైలిలో, సమాజ వ్యవస్థలో, వివిధ దేశాలమధ్య సంబంధాల్లో ఎటువంటి మార్పులు తీసుకు వస్తున్నాయి; సాహిత్యం, వారసత్వాలు, పరంపరలు ఏవిధంగా మనలను ప్రభావితం చేస్తున్నాయి? ఇలాంటి అనేకానేక విషయాలను ఎంతో అధ్యయనం చేశారు నార్లవారు. వారి ఇల్లు ఒక గ్రంథాలయం; వేలాది పుస్తకాలకు నిలయం. తత్త్వశాస్త్రం, సాహితీ సమాలోచన, చరిత్ర, సాంఘిక, రాజకీయ, ఆర్థిక సిద్ధాంత గ్రంథాలు, పత్రికలు వారి స్నేహితులు.

వీటన్నిటినీ అధ్యయనం చేసి, సమకాలీన సమస్యలను, చారిత్రక సమ్యక్ దృష్టితో వారు విశ్లేషిస్తూ ఉండేవారు. కనుక, నార్లవారు ఆచితూచి సంభాషించేవారు. వారి రాతలు కూడా గంభీరంగాను, ఆలోచనాచోదకంగానూ ఉండేవి. సంపాదకీయాలు చాలాసార్లు ప్రశ్నలతో కూడి ఉండేవి; ఆయనతోబాటు మనలను కూడా ఆలోచింపచేయడమే ఆయన ఉద్దేశం. ఉదాహరణకు, మద్రాసు నుండి జిల్లాలు వేరయి, నూతనంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడబోతోంది. దాని రాజధాని ఎక్కడ ఉండాలి అనే అంశం చర్చనీయాంశం; ఆవేశపూరిత ఆంశం ఐనది. ఈ విషయం మీద నార్లవారు వరుసగా చాలా సంపాదకీయాలు రాశారు; పాఠకులను సమగ్రాలోచనకు పురికొల్పి, బహుజనోగ్య నిర్ణయానికి దారి చూపతలచారు. ఆ ప్రయత్నం నిరుపమానమైనది. నార్లవారు ఆరువేలకు పైగా సంపాదకీయాలు రాశారు. ఇన్ని సంపాదకీయాలు రాసినవారు ప్రపంచంలోనే అరుదు.

నార్లవారు వ్యాసకర్త కూడా వ్యాసం రాయడంలో సంపాదకీయ రచనలకన్నా ఎక్కువ స్వాతంత్ర్యం ఉంటుంది. వారి అభిప్రాయాలను నిర్భయంగా వెలిబుచ్చవచ్చు. నార్లవారలా సాహసోపేతంగా చేశారు. మచ్చుకు కొన్నింటిని ఉదహరిస్తే మీరు హర్షించగలరు. 18-7-1977

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో వారి మాటలు; "మనదేశం నుంచి బ్రిటిషు వారు మూడు దశాబ్దాలనాడు వైదొలగినా, మనలోనుంచి మన దాస్యబుద్ధి వైదొలగినట్టు లేదు. లేకపోతే ఒక మహాతల్లి (ఇందిరాగాంధి) మన దేశాన్ని మన పాలిట ఒక పెద్ద చెరసాలగా మార్చగలిగి ఉండేదా? ఆమె ద్వితీయ పుత్రరత్నం తల్లిని మించి మనను గడగడలాడించి ఉండగలిగేవాడా?" నార్లవారు బ్రతికి ఉంటే మూడు దశాబ్దాలు కాదు; ఆరు దశాబ్దాల తర్వాత కూడా, మెట్రిక్యులేషన్ కూడా చదవని, ఒక విదేశీ వనితకు భజన చేస్తూ, ఆవిడను భారత భాగ్యవిధాత్రిగా భజిస్తూ, ఆవిడకు, ఆమె పట్టభద్రుడు కాని కొడుకును యువరాజుగా భావిస్తూ, కోట్లమంది భారతీయులు దాస్యం చేస్తుంటే నార్లవారు ఏమి రాసుండేవారో!

ఇంకా ముందుకు పోయి నార్ల రాశారు. "బ్రిటిష్ దాస్యం 1947లో మనకు వదిలినా, తరతరాలుగా మనలను క్రుంగదీస్తున్న మానసికదాస్యం మాత్రం మనను వదలలేదు". అందుకే విజాతీయ రాజకీయ, మత విశ్వాసాలకు, అర్థం నిర్వచనం లేని సెక్యులరిజం, సోషలిజం లకు దాసులమై భారతీయతనే కోల్పోతున్నాం. ఈ కాలంలో మన రాష్ట్రంలో అన్ని పార్టీల నాయకులు పరమతస్థుల వేషాలూ, టోపీలు ధరించి, వారి శైలిలో సలాములు కొడుతూ, వారికి గులాం గిరీ చేయు ప్రకటనలనూ, వాగ్దానాలను గమనించి నార్ల వారెంత సూటిగా, ఘాటుగా వారిని విమర్శించేవారో! "తాను దేశాన్ని పరిపాలించిన కాలంలో నెహ్రూ మన దాస్యబుద్ధిని పెంచాడు... గాంధీ హత్య తర్వాత, పటేల్ నిర్యాణం తర్వాత, దేశా నాయకత్వంలో తనకు ఎదురాడగలవారు మరి మిగలకపోవడంతో ఆయనలోని నియంతృత్వ లక్షణాలు క్రమంగా పైకి పొటకరించాయి.

"ఆ లక్షణాలు అనువంశికమైనాయి. దాస్యబుద్ధి, భజన పరత్వం ఎంతగా పెరిగాయంటే మన రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాల్లో నలభై పైచిలుకు ప్రణాళికలు రాజీవ్, ఇందిరా పేర్ల నామకరణం అయ్యాయి. నార్లబోటి పరిశీలక, సాహసిక పాత్రికేయుడుగాని, సంపాదకుడుగాని లేకపోవడం వల్ల వంశభజన, దాస్యబుద్ధి పెరుగుతూనే ఉంది.

నార్లవారు 18 ఏకాంకిక నాటికలు రాశారు. వాటిలోని ఇతివృత్తులు బీదరైతుల దుస్థితి, మూఢనమ్మకాలు, సంసారిక, సామాజిక రుగ్మతలు. 1940వ దశకంలో సామాన్య రైతు ఏళ్ల తరబడి అప్పట్లో ఉండే జీవితాన్ని "పైపంట"లో చిత్రించారు. భార్య చిరిగిపోయిన చీర బదులు క్రొత్తదాన్ని కోరుకున్నా, వయసు వచ్చిన కూతురు ఏ చిన్న నగను చేయించు నాన్నా అని ప్రాధేయ పడినా, ప్రతి సంవత్సరం, రైతుది ఒకే జవాబు : ఈ ఏటిపంట అప్పు తీరుతుంది; పై పంట అమ్మినప్పుడు భార్యకు చీర, ముద్దుల కూతురుకు నగ కొని పెడతానంటాడు. ప్రతి ఏటా అదేమాట. అప్పుడు పైపంట మీద ఆశతోనైనా బ్రతికేవారు. స్వతంత్ర, సోషలిస్ట్ భారతంలో అరవై ఏళ్ల "ప్రగతి" తర్వాత బడుగురైతు పై

పంట మీదకూడా ఆశ పెట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నాడు. ఈ దైన్యాన్ని నార్లవారు ఏవిధంగా చిత్రించేవారో!

తెలుగునాట వేమన, బద్దెన (సుమతీ) శతకాలు, తరతరాల జీవితపు అనుభవాల ద్వారా సంతరించుకున్న జ్ఞానాన్ని, మూడుపంక్తుల ఆటవెలది, తేటగీతి పద్యాలలో మనకు ప్రసాదించాయి. నార్లవారు సమకాలీన ప్రజాస్వామ్యం చేతలను తమ "నవయుగాలబాట నార్లమాట" అనే శతకశైలి పద్యాలలో హృద్యంగా వర్ణించారు. మన మంత్రులు, నాయకులు ఎలా వ్యవహరిస్తున్నారో, నార్లవారి వాణిలో చూద్దాం ; వేమనను జ్ఞాపకం చేసే పద్యం :

పనసతొనలకంటే, పండుమామిడికంటె
పానకమ్ముకంటె, పాలకంటే
పంచదారకంటె పదవియే తీపిరా!

ఎన్ని భ్రష్టాచారారోపణలున్నా, ఎంత తెగమింగినా నిరూపించండంటారే కాని, ఉడుములా పదవినంటి పెట్టుకునే ఎంతమంది మంత్రుల్ని చూస్తున్నాం.

నల్లడబ్బు వాడునాయకుడైనచో
నిజము చచ్చు, సంఘనీతి చచ్చు
తెలివిచచ్చు, అన్ని విలువలు చచ్చురా!

ఎం.పీ అవ్వాలంటే పదికోట్లు ఖర్చుపెట్టవలసి వచ్చినప్పుడు, నల్లడబ్బే వాడాలికదా! అలా "ప్రజాప్రతినిధి" అయినవాడు ప్రజలను కూడా నలుపు చేయడూ?

శాసనసభలోన ఆసీనుడైనంత
మాననీయుడైన మనువుకాడు
ఎద్దునెక్కినంత ఈశుడు కాడురా!

మనం, అమిత కృష్ణవర్ణపు ధనవ్యయంతో, ఎం.ఎల్.ఎ., ఎం.పీ. అయి మంత్రి పదవి గైకొన్న వానిని "గౌరవనీయు"లని సంబోధించడం ఎంత సమంజసం?

మంత్రి మిత్రుడైన మరుచూపులేకుండ
కొల్లగొట్టవచ్చు నెల్లజనుల

మంత్రి మిత్రుడైన మంత్రిత్వమేలరా?
మంత్రి దారిజూప, మంత్రి పెండ్లముదోయు
మంత్రి కొడుకు దోయు, మామదోయు
మంత్రిబావమరది మరి ఇంతదోయు.

మనమనుదినం అనుభవిస్తున్న ప్రజాస్వామ్యంలో మంత్రుల, వారి బంధువుల ఘనకార్యాల నెలా వర్ణించేవారు నార్లవారు!

కనకపు సింహాసనమున
శునకముగూర్చుండబెట్టి శుభలగ్నమునం
దొనరగపట్టముగట్టిన (డెమోక్రసీ అగునుగాక)
వెనుకటిగుణమేల మానుర సుమతీ

అనే బద్దెన పద్యానికి, మరికొన్ని పదాలను పైవిధంగా జోడిస్తే మన ప్రస్తుత పాలకుల బండారం తేటతెల్లమౌతుంది.

నార్లవారు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన జీవితాంతపు అధ్యయనశీలి; ఆలోచనాపరుడు; విశ్లేషకుడు; బోధకుడు. వారి వైదుష్యం విశాలమైంది; గంభీరమైంది. ఆంగ్లంలో, తెలుగులో సాహిత్యాన్ని గురించి, రాజకీయ సిద్ధాంతాలను గురించి, నాయకుల్ని గురించి, రాజకీయాలను గురించి, పురాణేతిహాసాల గాధలను గురించి, అంతర్జాతీయ సంబంధాలను, సమస్యలను గురించి, ఇలా ఎన్నెన్నో విషయాలను గురించి వారు చదివేవారు; విమర్శనాత్మకంగా, బోధకంగా వాటిని గురించి రాసేవారు. ఆయన కేవలం పాత్రికేయుడూ, సంపాదకుడు మాత్రమే కాదు; ప్లాటో, అరిస్టాటిల్, సోక్రటీస్ వంటి పరిశోధక బోధకుడు. మన మహర్షుల వంటి ద్రష్ట. పత్రికా రంగంద్వారా సామాజిక స్పృహను పెంచదలచు కుంటున్న యువతకు మార్గదర్శకుడు. నిరంతర అధ్యయనం ద్వారా నిష్ణాతులయ్యారు. తమదైన శైలిలో సామాన్య ప్రజలకు జటిలమైన విషయాలను, అర్థమయ్యేట్లు రాసిన వ్యాసకర్త, సంపాదకుడు. దేశభాషలందు తెలుగులెస్స అని, తెలుగుకు ప్రాచీన భాషా హోదాను తెప్పించుకున్నామని గర్వపడే వారు, ఇంగ్లీషు పదాలను వాడకుండా మాట్లాడటం, రాయడం నార్లవారినుండే నేర్చుకోవాలి.

వారి ధైర్యాన్ని, భావ దాస్యరాహిత్యాన్ని, అలవరచుకోవాలి. వారి సన్నిహిత సాంగత్యం నాకు టెలికాం రంగంలో మార్పులు తీసుకువచ్చే ఉద్యమంలో ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఆ మహనీయుని గొప్పతనానికి పరీక్ష, వారి జీవితం, కృషి, బాట ఎంతమందికి స్ఫూర్తినిచ్చింది అనే.

చివరిగా నార్లవారి రచనలన్నీ పలుపండితుల సహకారంతో పన్నెండు సంపుటాలలో ప్రచురించిన డాక్టరు కొల్లి శారదను, వారి సోదరి డాక్టరు మీనాక్షి నార్ల, డాక్టర్ శరత్ బెల్లప్రవలు లను మనసారా అభినందిస్తున్నాను.

***డాక్టరు త్రిపురనేని హనుమాన్ చౌదరి**, వీరు కృష్ణా జిల్లా, అంగలూరులో జన్మించారు. సుప్రసిద్ధ హేతువాది. త్రిపురనేని రామస్వామి చౌదరిగారికి వరుసకు మనుమలు. భారత టెలికమ్యూనికేషన్ శాఖలో అత్యున్నత పదవులు, అతి సమర్థతతో, చిత్తశుద్ధితో చేసి పదవీ విరమణ చేశారు. దేశవ్యాప్తంగా పబ్లిక్ టెలిఫోన్ బూతులను ఏర్పాటును ప్రోత్సహించడంలో కీలక పాత్ర వహించారు. హైదరాబాదులోని ప్రజ్ఞాభారతి సంస్థకు అధ్యక్షులు. వీరి కృషికి గుర్తింపుగా హైదరాబాదు, జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసింది. నార్లవలె బహుముఖ ప్రజ్ఞాశాలి. విశుద్ధ వర్తనులు, మేధావి.*★

ప్రముఖ పాత్రికేయులు

– నందూరి రామమోహనరావు



కలమే నా కత్తి అని చాటువు. అదే పేరిట స్వీయ చరిత్ర రాసుకున్నారు ప్రముఖ జర్నలిస్టు కోటంరాజు రామారావు. నార్లవారి కలం ఝళిపించిన కత్తిలాగానే పనిచేయలేదు. తెలుగులో మున్నెన్నడూ వినిపించని మృదు మధుర స్వరాలను కూడా పలికించిన కలమది. అదొక వేణుగానం. వీణా నాదం. అంతేకాక విపత్కర పరిస్థితి తటస్థించినపుడల్లా శంఖారావం గావించి యావత్ భారత ప్రజానీకాన్ని ప్రతిఘటనకు సమాయత్తం చేసిన కలం అది.

ప్రముఖ జర్నలిస్టు, ఎడిటరు, కవి, వ్యాసకర్త నాటక రచయిత అయిన నార్లవారి పూర్తి పేరు నార్ల వెంకటేశ్వరరావు. 1908 డిసెంబరు 1న ఆయన జన్మించారు. అయితే ఆయన పుట్టింది ఆంధ్రలో కాదు. మధ్యప్రదేశ్లోని సాగర్లో గత శతాబ్దంలో ఎప్పుడో ఆయన పూర్వీకులు అక్కడకు వలస వెళ్ళారు. అయితే ఆయన తండ్రి లక్షణరావుగారు మళ్ళీ తెలుగు గడ్డకు తిరిగి వచ్చేశారు. కృష్ణా జిల్లాలోని కౌతరం గ్రామానికి వారు తిరిగి వచ్చేటప్పటికి నార్ల కేవలం ఏడేళ్ళ

పిల్లవాడు. ఆ విధంగా గ్రామీణ వాతావరణంలో ఆయన పెరిగారు. ఆయన ఆలోచనా ధోరణిపైన రచనా వ్యాసంగంపైన ఆ వాతావరణం ఎంతగానో ప్రభావితమైంది.

మచిలీపట్నం, కాకినాడ, గుంటూరు పట్నాలలో ఆయన విద్యాభ్యాసం సాగింది. ఆయన కాలేజీ జీవితం కూడా అక్కడే గడిచింది. ఆయన కుటుంబానికవి గడ్డు రోజులు. దానివల్ల చదువుకు ఎంతో కష్టపడవలసి వచ్చింది. చివరకు ఎలాగో సంపన్నుడైన ఒక బంధువు సహాయంతో తన చదువు పూర్తి చేశారు.

కాలేజి విద్యార్థిగా ఉన్నప్పుడే ఆయనపై జాతీయ ఉద్యమ ప్రభావం పడింది. దేశభక్తి ప్రబోధిత వ్యాసాలను వివిధ పత్రికలకు పంపడం కూడా అప్పుడే ఆరంభమైంది. 'బ్రిటిష్ రాజ్'ను దుయ్యబడుతూ కరపత్రం వేశారని ఒకసారి పోలీసులు చిత్తం వచ్చినట్టు కొట్టారు. 1930-31 కాలంలో విప్లవకారులు బృందంతో కూడా ఆయన సంబంధాలు పెట్టుకున్నారు.

ఆంధ్రలో ప్రజాదరణ పొందిన ఆయన తొలి రచనల్లో 'నేటీవ్ స్టేట్స్ ఆఫ్ ఇండియా' అనేది ఒకటి ‘రష్యా టుడే’, ‘ది పాలస్తీనా క్వెశ్చన్' అనేవి కూడా ఆ దశలో చేసిన రచనలే. రష్యన్ భాషలో ప్రసిద్ధి గాంచిన చిన్న కథలను తెలుగులోకి అనువదించి ఒక సంకలనంగా ప్రచురించారు. విద్యాభ్యాసానంతరం ఉద్యోగం వెతుక్కుంటూ నార్ల చెన్నయ్ వెళ్లారు. అప్పుడు అది ఉమ్మడి రాష్ట్ర రాజధాని. స్వర్గీయ ప్రకాశం పంతులుగారు స్థాపించిన దినపత్రిక 'స్వరాజ్య' ఎడిటోరియల్ సెల్లో ఆయన కొంత కాలం పనిచేశారు.

ఆ తరువాత ఎన్నో పత్రికలలో మారుతూ చివరకు రామ్నాథ్ గోయంకా పెట్టిన కొత్త పత్రిక 'ఆంధ్రప్రభ'లో చేరారు. 1942లో ఆయన 'ప్రభ' ఎడిటర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. జాతీయవాద తెలుగు జర్నలిజంలో ఒక మహత్తర కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది.

తెలుగు జర్నలిజం నేడు శాఖోపశాఖలుగా విస్తరించిందంటే అది నార్ల పెట్టిన భిక్షయే అని చెప్పకతప్పదు. వార్తా పత్రిక తీరు తెన్నులను విప్లవాత్మకమైన రీతిలో మార్చివేసిన ఖ్యాతి నార్లవారిదే. తెలుగులో ఎన్నో కొత్త పదాలకు ఆయన రూపకల్పన చేశారు. సామాన్యునికి సైతం అర్థమయ్యేటట్లు వ్యవహారిక భాషలోనే ఆయన రాశారు. తన సిబ్బంది చేత రాయించారు. ఆయన వాడే పదాలు సులభమైనవేకాని, వాడియైనవి. వ్యంగ్యాన్ని జోడించిన రచన శైలి ఆయన చెప్పదలచుకొన్న దానిని స్పష్టంగా చెప్పడంలో ఆయన భాషా శిష్టం ద్యోతకమవుతుంది. చదవాలనిపించే రీతిలో

సంపాదకీయాలు రాసిన ఖ్యాతి నార్లకే దక్కుతుందని ప్రతి ఇంటా ఆయన పేరు వినిపిస్తూన్నదని మాజీ రాష్ట్రపతి వి.వి.గిరి కూడా శ్లాఘించారు.

ఆయన తన హయాంలో ఆంధ్రప్రభ దినపత్రికను ప్రజాసేవకు చక్కని సాధనంగా మలిచారు. దేశ స్వాతంత్ర్య సాధన, వరద బాధితులకు, కరువు బాధితులకు సహాయం, భాషా ప్రయుక్త రాష్ట్రాల వంటి అనేకానేక ఉన్నత లక్ష్యాల సాధనకు బ్రహ్మాండమైన ప్రచారోద్యమం సాగించిన దిట్ట. తనకు న్యాయమని తోచిన దానిని నిర్భయంగా రాసిన సాహసి ఆయన. ఫలానా విధంగా రాస్తే ఏమవుతుందోనని ఎప్పుడూ ఆయన జంకలేదు. పూర్వం హైదరాబాదు సంస్థానంపై పోలీసు చర్య జరగక ముందు 1948లో రజాకార్ల అత్యాచారాలను దుయ్యబడుతూ ఆయన రాసిన సంపాదకీయాలు నిజామ్‌కు ఆగ్రహకారణమైనాయి. హైదరాబాదు సంస్థానంలో కనిపించరాదనే నిషేధానికి సైతం ఆ పత్రిక అందుకే గురయింది. ఆంధ్రలో కమ్యూనిస్టులే ఇక పాలనాధికారాలను చేపడుతున్నారనే యావన్మంది అనుకొన్న 1955 మధ్యంతర ఎన్నికల తరుణంలో కమ్యూనిస్టు పార్టీపై ఆయన సాగించిన యుద్ధం మరపురానటువంటిది. నిజంగా ఆయన తన కలాన్ని మరోసారి కత్తిగా ఝుళిపించిన కాలమది.

ఆ మధ్యంతర ఎన్నికలలో కాంగ్రెస్ విజయసాధనకు ఆయన నిజంగానే విజయసారధిలా వ్యవహరించారు. యావన్మంది గుర్తింపు పొందిన వాస్తవం అది. 'ఇండియన్ ఎక్స్ ప్రెస్' ఆంధ్రప్రభ మేనేజిమెంటుకు వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో కార్మికుల సరసన నిలిచారు. శైశవదశ నుంచి ఏ పత్రికనైతే రక్తం ధారపోసి మహోన్నత సంస్థగా తీర్చిదిద్దారో ఆ సమ్మెతో ఆయన నిష్క్రమించ వలసి వచ్చింది.

అసంఖ్యాకమైన మిత్రులు, అభిమానుల సహాయసహకారాలతో 1960లో విజయవాడలో ఆయన 'ఆంధ్రజ్యోతి' వెలిగించారు. 1962వ 1967వ సంవత్సరాలలో జరిగిన ఎన్నికలలో మళ్ళీ ఆయన కాంగ్రెస్ తరఫున నిలచి ప్రచారోద్యమం సాగించారు.

1969లో పెల్లుబికిన ప్రత్యేక తెలంగాణా ఉద్యమకాలంలోను 1972లో పెల్లుబికిన ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలోనూ కూడా ఎంతోమంది పాఠకుల ఆగ్రహానికి గురవుతూ కూడా సమైక్యరాష్ట్రం కోసం అచంచలంగా నిలచిన వ్యక్తి ఆయన.

1958లో అసెంబ్లీ నుంచి రాజ్యసభకు ఎన్నికైనారు. 1964లో కూడా మళ్ళీ ఆ స్థానానికి ఎన్నికైనారు. అనారోగ్యమే లేకుంటే ఆ సభలో మరింతగా సమర్ధవంతంగా ఆయన తనపాత్ర

నిర్వహించగలిగి ఉండేవారు. రాజ్యసభలో ఆయన ప్రసంగించిన సందర్భాలు కొద్దిగానే ఉన్నా, చెప్పతలచుకున్న విషయాన్ని స్పష్టంగా, వాడిగా చెప్పడం ద్వారా యావత్తు సభను ఆకట్టుకున్నారు.

కేంద్ర సాహిత్య అకాడమి, కేంద్ర లలితకళా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీవంటి అనేక సాంస్కృతిక సంస్థలలో సభ్యుడిగా ఉండి ఆయన ఎనలేని సేవచేశారు. 1954లో తొలిసారిగా విదేశీపర్యటన జరిపారు. ఆ తరువాత 1958లో పారిస్ జరిగిన యునెస్కో 10వ మహాసభలకు భారత ప్రతినిధి వర్గసభ్యుడుగా ఆయన హాజరైనారు. 1961లోనూ, 1964లోను కూడా ఆయన విదేశాలు పర్యటించి వచ్చారు. 1975లో అమెరికా సందర్శించారు. దాదాపు పశ్చిమ, తూర్పు యూరప్ దేశాలన్నిటిలోనే కాక దూరప్రాచ్య దేశాలైన జపాన్, హాంకాంగ్, కంబోడియా, వియత్నామ్, థాయ్లాండ్, ఇండోనేషియా మొదలైన దేశాలను కూడా ఆయన సందర్శించారు.

నార్లవారు కేవలం జర్నలిస్టు, ఎడిటర్ కాదు. సృజనాత్మకమైన రచయితగా కూడా ఆయన స్థానం ఆయనకు ఉంది. సరికొత్త ఆలోచనా ధోరణికి ఒరవడి పెడుతూ ఆయన చేసిన రచనలు ఎన్నో ఉన్నాయి.

రెండు పద్యసంపుటాలు, ఏకాంకికల సంకలనం, హాస్యమిళిత వ్యాస సంపుటాలు రెండు మొదలైనవి ఆ కోవకు చెందినవి. పౌరాణిక గాధలను తీసుకొని హిందూమత మౌఢ్యాలను ఎండగడుతూ ఇటీవలనే ఆయన ఐదు ఏకాంకికలు రాశారు. గత మూడు దశాబ్దాలలో ప్రఖ్యాతి గాంచిన ఆయన సంపాదకీయాల సంకలనం కూడా వెలువడింది.

ఇంగ్లీషు జర్నలిజాన్నే ఎంచుకుని ఉంటే స్వర్గీయ ఖాసా సుబ్బారావు, కోటంరాజు రామారావుగార్ల వలె ఆ రంగంలో ఒక ప్రత్యేకస్థానాన్ని ఆయన సాధించి ఉండేవారు. ఆయన కలం తెలుగువలెనే ఇంగ్లీషులోనూ పరుగెడుతూ ఉంటుంది. ఆయన ఇంగ్లీషులో రాసిన ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జీవిత చరిత్ర. వేమన మోనోగ్రాఫ్ లను భారత సంస్కృతి సంప్రదాయాలపై రాసిన వ్యాస సంకలనాన్ని కేంద్ర సాహిత్య అకాడమి వారు ప్రచురించారు.

ఆంధ్రప్రదేశ్ సస్య విప్లవ సాధనకు కూడా ఆయన తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించారు. తైచుంగ్, నేటివ్-1 ఇ.ఆర్. 8 వంతు అధిక రాలుబడి వంగడాల గురించి 'ఆంధ్రజ్యోతి' ద్వారానే ముందు ఆంధ్ర రైతాంగానికి తెలిసింది. ఆంధ్ర రైతాంగం ఇక వాటిని అందిపుచ్చుకుంది.

తెలుగులో ఆయన ఒక ఉన్నత శైలిని ప్రవేశపెట్టారు. తెలుగు గద్యం కొత్త పుంతలు తొక్కి ఆధునిక రూపం సంతరించుకున్నదంటే దానికి ఆయన చేసిన సేవ కూడా గణనీయమైంది.

ఏ విధంగా చూసినా ఆధునికతకు ఆయన ప్రతీక. కుల, మత తత్వాలకూ మత మౌఢ్యాలకూ వ్యతిరేకంగా సంపాదకీయాల ద్వారా, ఇతర సృజనాత్మక రచనలద్వారా ఆయన నిర్విరామ పోరాటం సాగించారు. అన్ని రంగాలలో ఆధునిక పద్ధతులు నెలకొల్పడానికి పోరాడిన యోధుడు ఆయన.

ఆయన అభిరుచులు విస్తృతం, విభిన్నమైనవి. ఆయన కళాప్రియుడు. ఆయన సేకరించి పెట్టుకున్న గ్రంథసంపదే ఆయన మహదాస్తి. ఆయన భద్రపరచుకున్న గ్రంథాలు ఎంతలేదన్నా 20–25 వేలమధ్య ఉంటాయి. రాష్ట్రంలో మరేవ్యక్తికి అంతటి గ్రంథాలయం లేదని చెప్పవచ్చు. అపురూపమైన పురాతన గ్రంథాల నుంచి సరిక్రొత్తగా మార్కెట్ చేరిన తాజా పుస్తకాల వరకు అన్నిరకాలు ఆయన గ్రంథాలయంలో సాక్షాత్కరిస్తాయి. నాటక, రాజకీయ జీవిత చరిత్రల పఠనంలో ఆయనకు అమితాసక్తి.

ప్రధాన వ్యాసంగం, రచయితగా, యోధుడుగా స్వతంత్రమైన ఆలోచనాశక్తి గల వ్యక్తిగా, నిర్భయుడైన మేధావిగా అత్యంత గౌరవప్రపత్తులు పొందిన బహుకొద్దిమంది ఆంధ్రులలో ఆయన ఒక్కరు.

(హైదరాబాదు నుంచి ప్రచురించిన రాజధాని దినపత్రిక నుంచి పునర్ముద్రితం)

నందూరి రామమోహనరావు– *తెలుగునాట సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు, రచయిత, కవి, అనువాదకులు. వీరు కొంతకాలం ఆంధ్రపత్రిక దినపత్రికలో పనిచేసి, ఆంధ్రజ్యోతి దినపత్రిక, విజయవాడ నుంచి ప్రారంభించిన తొలిరోజుల్లోనే సంపాదకవర్గంలో చేరారు. నార్లవారి అనుయాయులుగా పత్రికా రచనలో తగు నిపుణత సంపాదించారు. నార్ల రాజీనామా చేసిన అనంతరం వారు దాదాపు దశాబ్దం పైగా అదే పత్రికకు సంపాదకునిగా కొనసాగి, నార్ల పెట్టిన వరవడికి మెరుగులు దిద్దారు. మార్క్ ట్వేన్, ఛార్లెస్ డికెన్స్ తదితరుల ఆంగ్ల నవలలను అపురూపంగా తెలుగులోకి అనువదించారు. విశ్వరూపం, విశ్వదర్శనం, నరావతారం, భారతీయ చింతన వారి ప్రసిద్ధ రచనలుగా గుర్తింపు పొందాయి.*★

విశిష్ట సంపాదకుడు – నార్ల

– ఆవుల గోపాలకృష్ణమూర్తి



నార్ల వెంకటేశ్వరరావుగారి పేరు తెలుగునాట ప్రజలలోకి బాగా ఇంకిన పేరు 'నార్ల' అంటే చాలు, నార్ల రచయిత. కాని రచయితగా కాదు నార్ల ప్రతిష్ఠ : నార్ల కవి, కవిగాగాదు నార్ల ప్రతిభ, నార్ల నాటక నాటికా రచయిత. నాటక నాటికా రచయితగా గాదు నార్ల పేరు. నార్ల సంఘసంస్కరణాభిలాషి, సంఘ సంస్కర్తగా గాదు నార్ల నిలవడం. నార్ల విమర్శకుడు, విమర్శకుడుగా గాదు నార్ల పాదుకొన్నది. నార్ల సంపాదకుడు సంపాదుకుడుగానే కాదు నార్ల తెలుగుల వెలుగు.

సంపాదకత్వం చౌకబారు వ్యాపారం కాదు. సంపాదకత్వం ఒక విద్య; ఒక చదువు. ఒక జీవితం. మీసాలమీద తేనెలాంటిది కాదు సంపాదకత్వం : ప్రగాఢ విశ్వాసప్రపూరితం. "సంపాదకుడు" అన్నది పేరు ముందు చేరినంత మాత్రాన అతడు సంపాదకుడు కాడు, బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఉన్నవాడే నిజమైన సంపాదకుడు కాగలడు. తెలుగుదేశం ప్రతిభోపేతులైన అనేకులైన సంపాదకుల్ని కన్నది, పత్రికా రచనకు తెలుగువాడు పురిటిగడ్డ, సురవరం ప్రతాపరెడ్డి, చింతామణి, –ముట్నూరి కృష్ణారావు. ఖాసా సుబ్బారావు. కోటంరాజు రామారావు. కోటంరాజు పున్నయ్య, కుందూరి ఈశ్వరదత్తు, లంక సుందరం. సి.వి. హనుమంతరావు. న్యాపతి నారాయణమూర్తి, చల్లా సోదరులు, దేశోద్ధారక నాగేశ్వరరావుగార్ల పేర్లు వరవడిగా వస్తాయి. నార్ల ఆ కోవలోనివాడు, అంతేగాక, వారిలో చాలమందికన్న నార్ల గణ్యమైన సంపాదకుడు.

సంపాదకుని కర్తవ్యం విశిష్టమైనది. ప్రజలలో అవసరమైన విజ్ఞాన చైతన్యాలను వెదజల్లాలి. ప్రజల అవసరాలను, కోర్కెలను ప్రభుత్వానికి నివేదించాలి. ప్రభుత్వ సక్రమ విధానాలను ప్రజలకు ఎరుకపరచి ప్రభుత్వాన్ని విజ్ఞానయుతం చేస్తూ, ప్రజల కోర్కెల మన్ననకు మరల్చాలి. ప్రభుత్వాన్ని ప్రజలకు, ప్రజల్ని ప్రభుత్వానికి తెలియపరచి, తెలియజెప్పి, పనులు ప్రజాస్వామ్య పంథాలో నడిచేటట్టు చేసే మధ్యవర్తిగా సంపాదకుడు మనగలగాలి, సంపాదకుని పని "సంపాదన" కాదు. అన్వయం, సమన్వయం.

సంపాదకుడు ఒక నాయకుడు. అతడు పార్టీ నాయకుని యంత చిన్నవాడు కాదు. పార్టీ నాయకుడు సంకుచితవాది. కేవల స్వార్థి. సంపాదకుడు దర్శకుడుగా పనిచేయాలి. మీమాంసకుడుగా సత్యాన్వేషణ చేయాలి, కవిగా రచన సాగించాలి, నిజానికి దార్శనికుడు చేసినంత పని చేయాలి. సంపాదకుడు సమాజాని కొక డాక్టరు వంటివాడు. అందుకే ఒక పత్రికకు ఒకడే సంపాదకుడుగా వుండి, ఆయన సర్వజ్ఞుని పోజు

పెట్టడం అన్యాయం, కొంతకు కొంత ఆత్మవంచన. అందుకే అనేకులైన సంపాదకులుండాలి. ఆయా విషయాల్ని వారుపరిశీలించి, వ్యాఖ్యానించవచ్చు.

అట్టి మహత్తర కర్తవ్యాన్ని నిర్వహించడంలో సంపాదకుల అంతస్తులు బోధపడుతూ ఉంటాయి. సర్వతోముఖులైన సంపాదకులు. కార్యభార నిర్వర్తనలను దీక్షతో దక్షతతో చేయగలరు. కానినాడు, కాని కథనమే అవుతుంది.

నార్ల దక్షుడైన సంపాదకుడు. బహుముఖ ప్రజ్ఞకలవాడు. ఆంధ్రదేశంలో నార్ల కున్నంత స్వంత గ్రంథజాలం బహుశః మరెవ్వరికీ లేదేమో! ఉంటే వారిని గురించి మనం గర్వపడదాం. లేకుంటే చింతిద్దాం. నార్లకు గ్రంథాలయం ఉండడమే కాదు. ఆయనకు ఆ గ్రంథాలన్నింటితో పరిచయం కూడా ఉంటుంది. వాదనకు గాని వాటి అవలోకనకు గాని జాస్తిగా ఉంటుంది. ఇంటి నిండా పుస్తకాలు గిరాటు వేసినట్టు ఉంటాయి. పుస్తకాల్ని పొంది ఉంటమే గాక వాటి ప్రయోజనాన్ని గూడా నార్ల పొందుతాడు. ఆ పొందికలను మనకు అందిస్తాడు.

నార్ల సంపాదకుడుగా తెలుగు మాగాణంలో మూడు దశాబ్దాల నుండి కృషి చేస్తున్నారు. బందరులో ఉండి 'కృష్ణాపత్రిక'లో గిలికినా, మద్రాసు 'ప్రజామిత్ర'లో పత్రికా రచనలో ప్రక్రియలను పొందినా 'ఆంధ్రప్రభ'లో న్యాపతివారి సరసన తన విజృంభణ మొదలిడినా, 'ఆంధ్రప్రభ'లో తానుగా మలచి, ప్రజ్వలించినా నార్లలో నిత్యం పెరిగే మనీషిని చూస్తాం, "ఆంధ్రప్రభ" తానుగా తానే "ఆంధ్రప్రభ" లేనాదీనావస్తను పొంది తాదాత్మ్యం నొందగలశక్తి నార్లది. అతని పని అతనికొక దీక్ష.

సంపాదకుడుగా నార్ల గొప్పతనం 'మేకప్' గదిలోకి వెళ్లినప్పుడు. పేజీ తర్వాత పేజీని 'ఫీచరింగ్'తో నింపేటప్పుడు చూడాలి, అదొక మరగా, యంత్రంగా ఉంటాడు. 'పేజీ మేకప్'లో నార్లకు నార్లే సాటి, అతనద్వితీయుడు. సంపాదకీయ రచన సంపాదకుని వరవడుల్ని తెల్పుతుంది. ఆయన అంతస్తుల్ని నిర్ణయిస్తుంది. ఆయన పోకడల్ని వెలార్చుతుంది.

సంఘ నాయకత్వానికి ఆయనకు గల అర్హతలను నిర్ణయిస్తుంది. సంపాదకీయ రచన అదొక కళ. బాగా రాయబడ్డ సంపాదకీయం మంచి సాహిత్యంలో చేరగలదు. అట్టి గట్టి సంపాదకులు అరుదు. దేశవ్యాప్త ఖ్యాతినార్జించిన సంపాదకులందరు, సంపాదకీయ రచనలో ఒకొక్క రీతిని, గమనాన్ని గడించినవారే.

సంపాదకీయ రచయితగా నార్ల కొన్ని వరవడుల్ని పెట్టుకున్నాడు, మొదలు పెట్టగానే ఇది నార్ల సంపాదకీయమని తెలుస్తుంది. భాషా విషయక విశిష్టత కనబడుతుంది. గిడుగువారు కోరుకున్న 'శిష్టజన' (?) వ్యవహారికం ఈ రచనలో కనబడుతుంది. గ్రామీణ నుడికారం తగులుతుంది. మరొకటి భావశబలత, అసందిగ్ధ రీతి ఉండి విషయ ప్రాధాన్యతకన్నా, దృక్పథ ప్రాధాన్యత హెచ్చు ఉంటుంది.

సంపాదక రచయితగా, 'కాంపెయిన్స్' నడిపే గుణం నార్లలో ఉంది. ధైర్య సాహసోపేతుడైన సంపాదకుడే అవి చేయగలడు. అందులో ధీరోదాత్తులమీద కత్తికట్టడం తేలిక కాదు. 'ప్రజాస్వామ్యం – ఒకటి, రెండు ... పది ... దాకా ప్రకాశం పంతులు మీద దాడి జరిపిన సంపాదకీయ గుచ్ఛం, రాజమండ్రిలాంటిచోట "ఆంధ్రప్రభ"ను తగులబెట్టారు. వేలాది బెదిరింపు ఉత్తరాలు వచ్చినై. పత్రిక "సేల్స్" తగ్గునేమోనన్న భయం – ఇది పత్రికా లోకానికి ప్రాణం – కలిగింది.

కాని నార్ల పట్టువదలని గరిమ చూపాడు. మరొకసారి 'ఆచార్య రంగా'ను గోగినేని రంగనాయకుల్ని చిత్రించాడు. గొడవ రేగింది. చేసినది ఉచితకార్యం కాదు. కాని పట్టువీడలేదు, యధార్థాలు వ్యక్తం కాగా, తిరిగి 'గోగినేని రంగనాయకుల్ని 'ఆచార్య రంగా' చేసి, పుద్యమాన్ని ఉపసంహరించారు. ఇంకొకసారి – సంస్కృతమే సంస్కృతి అన్న నినాదాన్ని మతశక్తుల్ని ఘుమాయింప ప్రారంభించారు. "సంస్కృతి అన్న సంపాదకీయ మాలిక మొదలు పెట్టింది. ఒకటి... నాలుగు ... పన్నెండు... దాకా వెళ్ళింది. అదొక పుస్తకమే నార్ల చదువు, సంస్కారం దీక్ష, చారిత్రక, శాస్త్రీయ దృక్పథాలు కనపడతై, కదలినవారు లేరు. అదిలింపజాలినవారు లేరు. ఎన్నికలలో 'కమ్యూనిస్టుల' మీద అలాగే దాడి సాగించారు.

కాక, రాయలసీమ కరువు వస్తే, రామకృష్ణ మిషన్ వారికి అప్పగించి, కార్యాన్ని సాధించాలని, 'నిధి' పెట్టి, నాటకాల్ని ప్రోత్సహించి, ఎంతో సోదర మానవబాధా నివృత్తికై కృషి చేశారు. గోదావరి వరదలైనా అంతే మానవతా రీతుల్ని ప్రోదిచేసి పోషించుకోవాలన్న ప్రయత్నం ఉంది.

సహనం సంపాదకుని భాష 'పత్రిక' మంచి పత్రిక అయితే – సంఘానికి అద్దం వంటిదిగా ఉండాలి. కాక, పార్టీ, వర్గ, ముఠా భావుకతలకే ప్రాధాన్యత ఇస్తే అది 'పత్రిక' కాదు. ఆ జాగ్రత్త సంపాదకుడి పునాది. ఈ పూనిక వెలుగును బట్టి పత్రికకు, సంపాదకునికి ప్రాశస్త్యత వస్తుంది. అందుకని సంపాదకునికొక దృక్పథం ఉండరాదని కాదు. కాని పత్రిక మీద పులమరాదని. "బాలెన్స్" పత్రికకు ప్రాణప్రదం 'ప్రభ' వీడి 'జ్యోతి'ని చేపట్టిన ఘట్టాలు నార్ల సంపాదక జీవితంలో అత్యంత క్లిష్టమైనవి. తన వ్యక్తిత్వాన్ని, సహచరుల ఉనికిని భంగపరచని రీతులలో నడిచి, సంపాదకులకు వలసిన నైతికవర్తన చూపాడు.

సంపాదకుని ప్రతిభ, అతని క్రింద మెరికలవంటి వారు ఎంత మంది ... తయారయ్యారో దానిని బట్టి గూడా ఉంటుంది. అందులో కూడా తెలుగునాట నార్లకు మించిన వారెవరూ లేరు.

నార్ల సంపాదకుడుగా. తెలుగు జనంలో, వారి మనస్సులలో ఇంకిపోయిన మనిషిని. అది నార్లకున్న స్థానాన్ని రుజువు చేస్తుంది. అది గణనీయమైన స్థానం.

పత్రిక ప్రజల కొరముట్టు, ఆ కొరముట్టును వాడే సారధి సంపాదకుడుగా అట్టి సంపాదకుడుగా నార్ల విశిష్ట స్థానాన్ని సంపాదించాడు. ఆయన చరితార్థుడు.

('నాలో నేను' – నుండి పునర్ముద్రితం)

ఆవుల గోపాలకృష్ణమూర్తి *(1917-1966) గుంటూరు జిల్లా, మూల్పూరులో జన్మించారు. తెనాలిలో ప్రముఖ న్యాయవాదిగా, హేతువాదిగా, మానవతావాదిగా త్రిపురనేని రామస్వామిగారికి అనుయాయిగా ప్రసిద్ధికెక్కారు. 1954-55 తెనాలి పురపాలక సంఘానికి అధ్యక్షులయ్యారు. కవిరాజు పద్ధతిలో శతాధిక వివాహాలు చేశారు. వందలాది వ్యాసాలు రాశారు. పలు పత్రికలు నిర్వహించారు. వీరు నిర్వహించిన పత్రికలలో సమీక్ష చాలా విశిష్టమైన మాసపత్రికగా ఆరోజుల్లో గుర్తింపు ఉండేది. అమెరికా ప్రభుత్వం ఆహ్వానం మేరకు ఆ దేశాన్ని సందర్శించారు. ఎం.ఎన్. రాయ్ రాడికల్ హ్యూమనిజాన్ని ప్రచారం చేశారు. చక్కని వ్యక్తిగా, విమర్శకులుగా రాణించారు.*★

ఆ రోజుల్లో ఆంధ్రప్రభ – నార్ల

– జి. కృష్ణ

ఈ దేశ ఆంధ్రప్రభను 1942కు మునుపే ఎరిగిన వాళ్లకంటే నేను చిన్నవాడిని. ఇతిహాసంలో 1942 ముఖ్య సంవత్సరం. ఆ ఏడాది ప్రారంభమైంది నాకొక విధమైన బహిరంగ జీవితం. నేను కాలేజి విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నికయ్యాను. అప్పట్లో కాలేజీలు తక్కువ. అందువలన విద్యార్థి సంఘాల ఎన్నికల వార్తలు కూడా చాలా తక్కువ. ఆ వార్తలు నేను ఉపాధ్యక్షుడుగా వెలయించడానికి అప్పట్లో పత్రికలకు జాగా బెడద ఉండేది కాదు. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభలలో పడ్డాను. ఏదో ఒక సందర్భంలో నా పార్టీ వైఖరిని గురించి మాట్లాడాను. అప్పట్లో క్విట్ ఇండియా ఉద్యమం ప్రధానం. నేను బహుశా కొంత బాగానే ఉపన్యసించేవాడినేమో! లేక – ఆంధ్రప్రభ విలేఖరి శ్రీ సోమయాజులు తన జాతీయ దృక్పథం వలన నన్ను మెచ్చి, నాకు ఊతమివ్వవచ్చు అనుకున్నాడేమో! నేను ఏవేవో అంశాలను విశదీకరించానని అతడు వార్త వేశాడు.

అంతే నా స్నేహితులు కొందరు విశదీకరణలు కూడా చేస్తున్నావా అని ఆక్షేపణకు దిగారు. నేను అంత పెద్దవాడిని కాలేదు అని మొత్తుకున్నా వాళ్లు వినరు. ఒక అధ్యాపకుడు కూడా నాతో సరసాలాడ నారంభించాడు. “ఏమోయ్! విశదీకరించావా? ఉద్ఘాటించకపోయావా?" అని – ఉద్ఘాటన అనేది ఆంధ్రప్రభ వాళ్లకు “గట్టిగా చెప్పడానికి” పర్యాయపదం. ఆపైన కొన్నాళ్లకు నేను జైలులో పడగా, అందరూ ఇక నేను ఉద్ఘాటిస్తూ మాట్లాడవచ్చునని ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. అప్పట్లో పత్రికలలో పడే వార్తలను చదివేవాళ్ళు ఉండేవారు. ఈకకు ఈక, తోకకు తోక పీకి పరీక్షించేవారు. అచ్చు తప్పులను కూడా పరామర్శించి, అవి శీలాలో, అశ్లీలాలో సాహితీ రసికుల వలే చర్చించేవారు. ఇప్పుడు అచ్చు తప్పులు అంత ఆత్మీయ పరామర్శకు నోచుకోవడం లేదు.

ఆంధ్రపత్రికలో "ఉద్ఘాటనలు" ఉండేవి కావు. వాళ్ళు కొన్ని విభక్తుల ప్వుగా వాడేవారని నాకు గుర్తు. సంధులు కూడా ఆంధ్రప్రభలో కంటే ఎక్కువే చేసేవారు. విసంధి వలన పాఠకుల శబ్దజ్ఞానం అచ్చున పడేసేవారు. జనాలు రెండూ చదువుకునేవారు. ఉదాహరణ ఒకటి ఇస్తే, ఈ శైలుల ప్రత్యేకత విదితం అవుతుంది. వెంకమ్మను గురించి పుల్లయ్య ఇట్లా విశదీకరించాడు అని ఆంధ్రప్రభ రాస్తే, ఆంధ్రపత్రికలో 'వెంకమ్మ గూర్చి పుల్లయ్య ఇట్లు ప్రసంగించెను" అని రాసేవారు. ఈ "కూర్చి, గురించీ" అనే విభక్తులు సాహితీ రసికులకు తప్పక చిరునవ్వు తెప్పించేవి. ఏమిటో... భాషకు అశ్లీలం ఏమిటి?... మనిషి ప్రవర్తనలో ఉంటుంది అదంతా. మనిషిని మనిషిగా ఎవ్వడూ పత్రికకు ఎక్కించలేదు. పెద్ద మనుషులు చేయలేని పని.

ఇంతకూ నేను రెండుసార్లు జైలులో పడినప్పటికీ, నాకు ఉద్ఘాటించేటంతటి హెూదా ఇప్పటికీ రాలేదు. కాకపోతే ఎవ్వడో "విశదీకరించాడు, విపులీకరించాడు, వివరించాడు" అని రాయడంతో పాటు, వీటికి పరాకాష్ఠగా 'ఉద్ఘాటించాడు' అని కూడా రాసే నౌకరు హెూదా మాత్రం 1946 నుంచి కలిగింది. 1959లో ఆంధ్రప్రభలో చేరాను కానీ, అప్పటికి "ఉద్ఘాటన" వాడకం నుంచి నిష్క్రమించుకుంది. శబ్దాలు కూడా, మనుషులవలే కొన్నాళ్ళు వెలిగి ఆ పైన కొండెక్కుతాయి కదూ.

ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ దాదాపు పోటీ పత్రికల వలే నడిచేవి. తత్వం ఒకటే... వ్యక్తీకరణలలో తేడాలుండేవి. అంటే రెండూ కాంగ్రెస్ వారికి మద్దతునిచ్చేవే... ఒకరు ఒక ముఠాకు మద్దతు ఇస్తే, ఇంకొకరు ఇంకొక ముఠాకు మద్దతు. రచయితల ఎన్నికలో కూడా, వారు మన్నించని వారిని వీరు, వీరు మన్నించని వారిని వారు, ఆత్మీయంగా చూసుకునే వారనాలి. ఆంధ్రపత్రిక వారికి హితులు ఎక్కువ. ఆంధ్రప్రభ వారికి స్నేహితులు ఎక్కువ అని వర్ణిస్తే ఎవ్వరూ నొచ్చుకోనక్కరలేదు.

ఆంధ్రప్రభ ప్రత్యేకతను తెలియజెప్పేటందుకు ఒక ఉదాహరణ ఎవరో నలుగురు ఒక సందర్భంలో ఉపన్యసించారు. పాకాల వెంకటరాజమన్నార్, సముద్రాల రాఘవాచార్యులు, రాయప్రోలు సుబ్రహ్మణ్యం, నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడారని గుర్తు. ఆ కార్యక్రమం వార్త ఆంధ్రపత్రికలో పడింది. మర్నాడు ఆంధ్రపత్రిక వార్తను పఠనీయంగా సంక్షిప్తం చేసి, తీర్చిదిద్ది చక్కటి శీర్షిక ఇచ్చి దీనిపైన సంపాదకీయం రాశాడు నార్ల. సంగతి సందర్భాలు చూడగా ఆ వార్తను ఆంధ్రప్రభ వాళ్లే స్వయంగా తెచ్చుకుని, దాని ప్రాధాన్యాన్ని గ్రహించి సంపాదకీయం కూడా రాసినట్లు పాఠకులు అనుకొనక తప్పదు. నలుగురు ఉపన్యాసకుల బొమ్మలూ వేశారు.

నేను చాపల్య వశాత్తూ నార్లకు ఫోన్ చేసి “సార్! వార్త ఎట్లా వేయాలో మీరు చక్కగా ఆదర్శం చూపారు. దాని ప్రాధాన్యాన్ని కూడా తెలియజెప్పారు” అని అభినందించాను. ఆయన "కంగ్రాచ్యులేషన్స్! మీ రిపోర్టును చూసే కదా వ్రాశాం” అన్నారు.

అదేమో! నేను నార్లవారి ఎదుట పడితే, ఆయన నన్ను గుర్తించేవాడు కాదు. టెలిఫోన్లోనే మా ఆప్యాయత.

ఆంధ్రప్రభ వాళ్లకు కొత్త, నిక్కచ్చి, తెలుగు శబ్దాలంటే మోజు ఉండేది. మంచి ఉప సంపాదకులు ప్రభలోనూ ఉండేవారు. పత్రికలోనూ ఉండేవారు. కానీ ప్రభ ప్రత్యేకత ఏమంటే అక్కడి సంపాదకునికి ప్రకటనా సౌలభ్యం కల శబ్దాలు అంటే మోజు ఉండడం అనిపిస్తుంది.

కొన్ని ఏళ్ల తర్వాత పరిస్థితులు కొంత తారుమారైనాయి. నేను ప్రభలో పనిచేయసాగాను. విద్వాన్ విశ్వం మళ్ళీ ఇక్కడే. మంచి వార్తగానీ, వ్యాసంగానీ నేను రాస్తే, మర్నాడు విద్వాన్ విశ్వం నన్ను పిలిచి "ఇదిగోనోయ్! నార్ల ఫోన్ చేశాడు. నువ్వు రాసింది బాగుందన్నాడు. ఫోన్ చేసి థాంక్సు చెప్పు" అనేవాడు. ఒక పర్యాయం ఇలాగే ఫోన్ చేయగా ఆయన “అదేమిటి కృష్ణాగారూ! మీరు ఇంగ్లీషులో అంత వివరంగా బాగా రాసి, ప్రభకు ఎగనామం పెట్టారు?” అని వేరే ధోరణి చూపాడు. మీరు నేను ప్రభలో రాసిన దాన్ని మెచ్చారని విద్వాన్ విశ్వం చెప్పాడే అనగా "అవుననుకోండి! అదేం తృప్తి?" అన్నాడు నార్ల.

ఇది ఎందుకు చెప్తున్నానంటే, శబ్దం, వాక్యం సరిగా ఉండడానికి ప్రభవారు కృషి చేసేవారని విదితం చేయడానికే. ఒకరోజున నార్ల స్నేహితుడు జె.వి. సోమయాజులు, మాటల సందర్భంలో "మీరు నార్లను కలవండి, ఆయనకు మీరు అండర్ స్టడీగా కావాలట" అన్నాడు. రెండు మూడు రోజులు తాత్సారం చేసి, నార్లగారి వద్దకు వెళ్లాను. మంచి విసుగులో ఉన్నాడు. “వస్తే వచ్చేయండి.

మళ్ళీ ఈ కలవడం, మాట్లాడడం దేనికి?" అన్నాడు. ఆ తర్వాత పరిస్థితులు అనుకూలించలేదు. ఆపైన నేను ప్రభలో చేరినా, ప్రభ పూర్వంలాగా ఉండాలని పెద్దలు కొందరు ఫిర్యాదు పూర్వకంగా మందలింపులు జారీ చేయించినా, నూతన కాలానికి అనువుగానే రూపొందింది. ఒక్కొక్క చోట ఒక్కొక్క మనిషి వలన, ఒక్కొక్క సందర్భంలో, పనికి రాణింపు వస్తుంది.

"పని మనది... సంస్థ వేరొకరిదైనా” అనే మానసిక స్థితి అవసరం. ఎవడి కోసమనో మన పనితనాన్ని చెడగొట్టుకొనలేము. "పనితనం వెనకపట్టింది... నాకు ఉత్సాహం పోయింది... నేను

కృతజ్ఞతలనాకర్షించని పని చేస్తున్నాను" అని ఎప్పుడైతే అనుకోసాగాడో, అప్పుడు మూలపడిన పనిముట్టే అవుతాడు. నేను యువకుడుగా ఆంధ్రప్రభ పనితనానికి ఉదాహరణగా చెబుతున్నాను.

(– ఆంధ్రప్రభ దినపత్రిక, 30–4–1988 సౌజన్యంతో)

జి. కృష్ణ *(1924–2000) తెలుగు జర్నలిజంలో విలువలకు ప్రాధాన్యతిచ్చి, చివరివరకూ నిష్ఠతో వృత్తి కొనసాగించిన సీనియర్ పాత్రికేయులు. చదువు పూర్తయ్యాక 'గాంధీ'జీ పిలుపునందుకొని 'క్విట్ ఇండియా' ఉద్యమంలో చేరి 1943లో అరెస్టయ్యారు. అడివి బాపిరాజుగారి 'మీజాన్' పత్రికలోనూ, ఖాసాగారి, "ఫ్రీప్రెస్", ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభతో వీరికి సంపాదక వర్గ సంబంధం ఉంది! 'ఏ హిస్టరీ ఆఫ్ తెలుగు పీపుల్ అండ్ ధేర్ కల్చర్', కొమర్రాజువారి జీవితం, గఫార్ ఖాన్ జీవితం, 'గాంధీ' మొదలైన గ్రంథాలు ఆంగ్ల, ఆంధ్ర భాషలలో రాశారు. వీరి సేవలకు గుర్తింపుగా శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వీరి చివరి రచనలలో "అప్పుడు – ఇప్పుడు" అపూర్వమైన రీతిలో సాగిన అసాధారణ రచన.★*

నార్లవారి సంపాదకీయాలు

– ఘట్టమరాజు

నార్ల వెంకటేశ్వరరావు పొట్టకూటికి కాకుండా 'జీవిత సాఫల్యానికి ఒక సాధన'గా జర్నలిజం చేపట్టాడు. "నా సంపాదకీయ బాధ్యతలకు సంబంధించినంత వరకు నాకు మిత్రులు లేరు, శత్రువులు లేరు. ప్రజానాయకులైన వారిని, ప్రభుత్వ నాయకులైన వారిని, వ్యక్తిగతమైన రాగ విద్వేషాలతో ఎంతమాత్రం నిమిత్తం లేకుండా, వారి వర్తనను బట్టి, వారి విధానాలను బట్టి సమర్థించడానికో విమర్శించడానికి నేను ఉద్యమిస్తాను" : (కదంబం 136–137 పేజీలు).

"విశ్వమానవ దృష్టి, శీలసంపద, ధర్మాభినివేశం లేనివారు ఏమైనా కావచ్చుగాని, ఉత్తమ శ్రేణి సంపాదకుడు కాలేడు" (మూడు దశాబ్దాలు – పీఠిక – 13వ పేజీ) నార్ల ఆత్మసాక్షిగా సంపాదకీయాలు వెలువరించాడే కాని యజమానుల అభిప్రాయాలకు అనుగుణంగా ఎప్పుడూ కలం వాడలేదు. 1946లో ఉమ్మడి మదరాసులో సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు రాజాజీని కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ నాయకునిగా ఎన్నుకోమని గాంధీజీ కోరారు. ప్రజల అండదండలేమో ప్రకాశంకే. మద్రాసు నుండి వెలువడే పత్రికలన్నీ మహాత్ముని మాటలే 'మమ' అంటూ వర్ణించాయి. కాని "ఆంధ్రప్రభ" సంపాదకుడిగా నార్ల మాత్రం గాంధీజీ విజ్ఞప్తిని తీవ్రంగా నిరసించాడు. ప్రజాభిప్రాయాన్ని కాదని, ఎవరు

కూడ పెత్తందారీ వహించరాదని గట్టిగా అన్నది నార్ల ఒక్కడే. నార్ల అభిప్రాయానికి ఎంతో సంతోషిస్తూ ప్రకాశం పంతులు "ఆంధ్రప్రభ" నిజంగా "దివ్యప్రభ" అని స్తుతించాడు. కాని ప్రకాశం నాయకత్వంలో ప్రభుత్వం ఏ ప్రగతి సాధించలేక పోయేసరికి నార్ల ఘాటుగా ఐదు సంపాదకీయాలు రాశాడు. ప్రకాశం, ఆయన అనుచరులు అగ్గిమీద గుగ్గిలం అయిపొయ్యారు. తన మంత్రివర్గం పడిపొయ్యేలోగా ఆంధ్రదేశంలో విరివిగా ఉపన్యాసాలిస్తూ ప్రకాశం పంతులు నార్లవారి సంపాదకీయాలను "పంచ మహాపాతకాలు"గా ఆయన్ను "పంచమహా పాతకుడి" గా వర్ణించాడు. నార్ల పై తిట్టును చిరునవ్వుతో స్వీకరించాడే కాని ప్రకాశాన్ని కస్సుమనలేదు, బుస్సుమనలేదు.

ఒకమారు ఓ పెద్దమనిషి ముట్నూరి కృష్ణారావుతో మాట్లాడుతూ "మీ పత్రికలో ఎక్కువగా మీ అభిప్రాయాలే కాని 'న్యూస్' ఉండదేమండీ" అని అన్నాడు. అందుకు కృష్ణారావుగారు "మా పత్రిక "న్యూస్ పేపరు" కాదండీ, "వ్యూస్ పేపరు" అని బదులిచ్చారట. నార్ల 'ఆంధ్రప్రభ'ను, 'ఆంధ్రజ్యోతి'ని దివ్వ వార్తావాహికగా తీర్చిదిద్దటంతో పాటు, అభిప్రాయవేదికగా కూడ రూపొందించాడు. గ్రామీణ విశేషాలతోబాటు, విశ్వవార్తల వరకు అందిస్తూ, నార్ల పత్రికలను 'నడుస్తున్న చరిత్ర'గా మలిచాడు. సరళంగా, సూటిగా, శక్తిమంతంగా వెలువడే వాక్యాల్లో నార్ల తెలుగు పాఠకులకు సమకాలిక చరిత్ర బోధించటంతోపాటు, మానవ సంస్కృతీ పరిమళాన్ని పసందుగా అందించాడు. నార్ల సంపాద కీయాలు పాఠకుల్లో ఉత్కంఠత కలిగిస్తాయి. ఆద్యంతం చదివింపచేస్తాయి.

"స్వాతంత్ర్య భానూదయవేళ" శీర్షికతో ఆగస్టు 6, 1947 నుంచి వరుసగా ఆగస్టు 15 వరకు తొమ్మిది సంపాదకీయాలు నార్ల రాసిన తీరు అమోఘం. "మరి తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు గడిస్తే చాలు – భారత స్వాతంత్ర భానూదయం జరుగుతుంది". (ఆగస్టు 6 నాటి సంపాదకీయ తొలిమాటలు). మరి ఒక పగలు. ఒక రాత్రి గడిస్తే చాలు – కేవలం 24 గంటలు నడిస్తే చాలు – స్వాతంత్ర్య భానూదయం జరుగుతుంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు పారతంత్ర్య గాఢాంధకారంలో గడిపిన పిమ్మట మరి 24 గంటల లోపల స్వాతంత్ర్య కాంతి పుంజాలను చూడగలమని విశ్వసించడం కష్టమైన పనే! అయినా, చీకటి నుంచి వెలుగులోకి మనం అడుగిడుతున్న మాట నిజం". ((ఆగస్టు 14) మొదట పాఠకుల్లో ఉత్సాహం ఉరకలు వేసేలా రాసి, ఉద్వేగం, ఉత్కంఠ పెంపొందించి, క్రమంగా వెన్నుతట్టి, గమ్యం చేరుకొంటున్నావు, గస తీర్చుకొమ్మంటున్నాడు సంపాదకుడు. "దాస్యాంధకారం తొలగింది; స్వాతంత్ర్య భానూదయం జరిగింది. మన పారతంత్ర్య శృంఖలాలు ఝుళ్లుమని తెగిపోయాయి; తిరిగి మనం స్వతంత్ర్య ప్రజలమైనాము. ఘోర జాతీయ కళంకం తొలగింది. ఇక మనం దివ్య ప్రభలతో వెలుగొంద వచ్చు." అంటూ నార్ల స్వతంత్ర భారతంలో స్వేచ్ఛా వాయువుల్ని పీల్చుకొనే

ప్రజల్ని అభినందిస్తూ, ఉజ్వల భవిష్యత్తు ఆకాంక్షిస్తున్నాడు. "అంతేకాదు-ఇతోధిక కృషికే కాని విశ్రాంతికి ఇది సమయం కాదు. ద్విగుణీకృత ధీరతకే కాని విరామానికి ఇది తరుణం కాదు.

ప్రపంచ ప్రధాన రాజ్యాల శ్రేణిలోనిలిచినప్పుడే-కాదు-ఆ శ్రేణిని అధిగమించినప్పుడే - మనకు విరామం, అప్పుడే మనకు విశ్రాంతి!" (ఆగస్టు 15, 1947) -

స్వతంత్ర పౌరులకు కర్తవ్య బోధ చేస్తున్నాడు సంపాదకుడు. ఈ సంపాదకీయాల్లో నార్ల పాఠకులకు స్నేహితుడుగా, తత్త్వవేత్తగా, మార్గదర్శిగా సాక్షాత్కరిస్తున్నాడు.

నార్ల సమకాలీన సాంఘిక సమస్యలను ప్రజల దృష్టికి తెచ్చేందుకు, అవసరమైనప్పుడు పరుష పదజాలాన్ని వాడుతూ సంపాదకీయాలు రాసేవాడు. వస్త్ర సమస్యపై "అంతులేని దోపిడి" అంటూ నార్ల రాసిన సంపాదకీయం ఆయన వేదనకు, ఆవేశానికి సాక్షి. "దారులు కొట్టేవారే బందిపోటు దొంగలు కారు, వర్తక వ్యాపారాల పేరుతో ప్రజల కడుపు కొట్టేవారు కూడా బందిపోటు దొంగలే. కోరలున్నవారే రాక్షసులు కారు, దొంగ లాభాల కోసం ప్రజల రక్తమాంసాలను పిండేవారు కూడా రాక్షసులే". *(మూడు దశాబ్దాలు పేజీ 87)*

నార్లవారి సంపాదకీయాలు లోతైన అధ్యయనానికి, సునిశితమైన పరిశీలనకు ఉదాహరణలు. "ఏది దేవాలయం?" అనే సంపాదకీయం చూడండి! "ఒకప్పుడు దేవాలయం హిందూ సంఘ జీవితానికి కేంద్రం, ఊరు మధ్యనే కాక, బ్రతుకు మధ్యలో అది నిలిచి ఉండేది.

కానీ, ఈనాడో?

అది బ్రతుకు మధ్య నుంచి దాని చివరికి ఇప్పుడు కదిలింది. పదిమంది కడుపు కొట్టి, వారి బ్రతుకు బుగ్గిచేసి మూటకట్టిన పాపపు సొమ్ములో ఇప్పుడది కొంత భాగాన్ని పంచుకుంటున్నది."
(మూడు దశాబ్దాలు పేజీ 113)

పవిత్రమైన దేవాలయాలు పరమార్థాన్ని కోల్పోయి ప్రాపంచిక లంపటాల్లో ఎలా తగుల్కొన్నాయో పై మాటలు విశదం చేస్తాయి.

భారత భాగ్యవిధాతలైన "నేటి నాయకుల" స్వరూప స్వభావాలను నార్ల ఎంతచక్కగా వివేచించారో చూడండి! "ఈనాడు మన సంఘ నాయకులే, ప్రజానాయకులే, ప్రభుత్వ నాయకులే అంధ

విశ్వాసాలకు అగ్రతాంబూలాన్ని పుచ్చుకుంటున్నారు. మూఢ భక్తి మార్గం వెంట ముందు వరుసలో నడుస్తున్నారు.

ఏ యోగి కనబడినా, సాగిలబడతారు. ఏ స్వామి ఎదురైనా, వీరు సాష్టాంగ నమస్కారాలు చేస్తారు; పీఠాధిపతుల వద్ద వీరు పడిగాపులు కాస్తారు, అడుగడుగుకు వీరికి అమ్మలు, అమ్మమ్మలే తారసిల్లుతూ ఉంటారు. అవతార పురుషులే సాక్షాత్కరిస్తూ ఉంటారు."


(మూడు దశాబ్దాలు– పేజీ 358)

పురాణాలు మన అజ్ఞానాన్ని మరింత పెంపొందించి, సంఘంలో అవినీతికి, అన్యాయానికి ప్రోత్సాహం కలిగిస్తాయని నార్ల దృఢవిశ్వాసం. అందువల్లే నార్ల మన రామాయణ భారత భాగవతాలను పురాణాలను చారిత్రక దృష్టితో చదివి, విశ్లేషించి ఇవన్నీ కట్టుకథలని, తమ స్తానమానాలు, సిరిసంపదలు పదిలపరచుకోవడానికి పురోహితవర్గం పన్నిన కుట్ర తప్ప మరేమీ కాదని ఢంకా భజాయించి చెప్పారు. బాబాలు – రాణీల చరిత్ర కాక సామాన్యుని సాంఘిక చరిత్రను చదవమని పాఠకులకు మరిమరి చెప్పాడు నార్ల. పాఠకుడి జ్ఞానపరిధిని విశాలం చేసేందుకై తెలుగు, ఇంగ్లీషు భాషల్లో వెలువడ్డ హేతుబద్ధ రచనలను పరిచయం చేసి తృప్తి చెందాడు నార్ల.

"నోరు విప్పితే ఏదో ఒక అబద్దపు కూత కూయని రాజకీయవాదులు దేశంలో ఈనాడు ఎందరున్నారు? మంత్రి పదవి మొదలుకొని, బంట్రోతు పనివరకు లంచాల గడ్డి తిననివారు ఎందరున్నారు? వర్తక వాణిజ్యాలలో చిన్న, పెద్ద పరిశ్రమలలో వీలైనన్ని దగుల్బాజీ పనులు చేయని వారెందరున్నారు? చివరికి విద్యాలయాల ప్రాంగణంలోకి కూడా, న్యాయస్థానాల ప్రాకారాల్లోకి కూడా చొచ్చుకుపోలేదా?" అంటూ డెబ్బయ్యవ పడిలో కూడా ఆవేశంతో ఊగిపోతూ పాఠకుల్ని ప్రశ్నిస్తాడు.

తెలుగు జర్నలిజానికి నార్ల నవ్యపథం

– రావెల సాంబశివరావు



జాతి మైకంలో పడినప్పుడు దాని మత్తును విడగొట్టే శక్తిశాలిగా నిలిచి, దేశం ఆదమరచి నిద్రిస్తున్నప్పుడు ఆపద ముంచుకొస్తే మేల్కొని ఆదుకొనే మంచి మనిషిగా మనుగడ సాగించి, బతుకుబాటలో రానున్న తరాల కోసం ఆశయాల చలువ పందిళ్ళు అమర్చిన శ్రేయోకాముకునిగా జీవించి, నిర్భయంగా ఆలోచించి, నిష్కర్షగా రాసి, నీతిగా నడిచి, ప్రజాస్వామ్యపు అస్పష్ట భావాలకు సుస్పష్ట రూపాన్ని దిద్ది తెలుగు పత్రికలకు ఒక నూతన పరిణితిని అందించిన వైతాళికుడు నార్ల వెంకటేశ్వరరావు.

ఆంగ్లంలో వేలకొలది గ్రంథాలు పఠించినా తెలుగులో రాసేటప్పుడు తెలుగులోనే ఆలోచించి, తెలుగు నుడికారంతో తెలుగుదనం ఉట్టిపడేటట్లు రాసి తెలుగువారిలో కదలిక తెచ్చిన గొప్ప సంస్కర్తగా లోకం ఆయన్ని గుర్తించింది.

వీధికొకస్వామి, ఊరికొక బాబా, వాడకొక అవతార పురుషుడూ పుట్టుకొస్తూంటే అటువంటి వాళ్ళ కోసం వేలాదిగా వేలంవెర్రిగా విద్యాధికులే పడిగాపులు కాసే దృక్పథం మారాలని వెన్ను చరచి, కళ్ళు తెరిపించి, "నరుని వృద్ధి కంటే చరమ లక్ష్యము" లేదని చెప్పి "పత్రికొక్కటున్న పదివేల సైన్యం"గా భావించి ప్రజల సరసన నిలిచి పోరాడిన యోధుడు నార్ల.

వార్తలోని వాస్తవికతకు ముప్పు వాటిల్లకుండా, వ్యాఖ్య విలసనాన్ని వ్యక్తిగతం చేసి, స్వేచ్ఛాయుతం చేసి ఆయన సాకిన తెలుగు జర్నలిజం బ్రతికి బట్టకట్టింది, ఒళ్లు చేసింది.

ప్రభుత్వం వంటి పెద్ద ప్రకటనదారుని కూడా తప్పుదోవ పట్టవద్దని హెచ్చరిస్తూ వెనుకాడకుండా ముందుకు సాగింది.

కొత్త పాతల మధ్య, ప్రాక్పశ్చిమాల మధ్య, జాతీయ అంతర్జాతీయతల మధ్య సంఘర్షణ కొనసాగుతున్నప్పుడు కన్ను చెదరక, అడుగు తప్పక, గుండె అదరక, నిశ్చలంగా నిలిచి కొత్తపాతల మేలు కలయికను సాధించేందుకు ప్రాక్పశ్చిమ సంస్కృతుల సమన్వయాన్ని లక్ష్యంగా పెట్టుకొని, జాతీయ అంతర్జాతీయతల వైరుధ్య విలుప్తికి కృషి చేస్తూ వ్యక్తి స్వాతంత్ర్యాన్ని పదిలపరచగల సమిష్టి

సంక్షేమానికి పునాదులు వేసిన విశిష్ట వ్యక్తి నార్ల. అటువంటి వారి జీవితం నలిగిన బాట కాదు. అడుగడుగునా అడ్డంకులే. వాలు ప్రయాణం కాదు, అంతా ఎదురీతే!

1908 డిసెంబరు, 1న మధ్యభారతంలోని జబల్పూరులో జన్మించిన నార్ల బాల్యం అదే ప్రాంతంలోని సాగరు పట్నంలో గడిచింది. ఆర్థికంగా బాగా చితికిపోయిన వారి కుటుంబం 1914లో నార్ల మాతామహుల గ్రామం కౌతవరం చేరింది. ప్రాథమిక విద్య ఆ గ్రామంలోనే ఎస్.ఎస్.ఎల్.సి. గుడివాడలో పూర్తి చేశారు.

బిడ్డ విద్యాబుద్ధుల కొరకు ఆయన తల్లి మహలక్ష్మమ్మగారు ఒంటి మీదున్న ఒకటి రెండు నగలు కూడా ఒలిచి ఇచ్చింది. 30 సంవత్సరాలు మధ్యప్రదేశ్లోని 'కట్నీ' పట్టణ పురపాలక సంఘ అధ్యక్షులుగా పనిచేసిన ఆయన పెదతండ్రి వెంకటరామన్నగారి చేయూత లేకుంటే చదువులకు స్వస్తి పలకవలసి వచ్చేదే.

1930లో ఇన్టర్మీడియట్ పరీక్షలో కేవలం తెలుగులోనే కృతార్థుడై కూర్చున్నా ఆయన అసమాన ప్రతిభకు అది అడ్డంకుగా నిలవలేదు. తరువాత బి.ఏ. పూర్తిచేశారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. చదవాలన్నది తీరని కోర్కెగానే మిగిలిపోయింది.

మేనమామ కొల్లి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుకువాడ నరసింహం పంతులుగారు నార్ల పసిమనసుకు బ్రహ్మ సమాజం రుచి చూపించారు. కాకినాడ, పి.ఆర్. కళాశాలలో వేమూరి రాధాకృష్ణారావు, పెద్దాద రామస్వామిగార్లు అందించిన శిష్యవాత్సల్యంతో బ్రహ్మ సమాజ భావాలు బలపడ్డాయి.

"ఓ మానవుడా! విను. అన్నిటి కంటే గొప్ప సత్యం మానవుడు. మానవుని మించిన మరొక గొప్ప సత్యం లేదు". అని చెప్పిన చండీదాస మహాకవి పలుకులు చెవికెక్కాయి.

మానవ చరిత్రలో యుద్ధాలు, క్షామాలు వచ్చిన రోజులు మాత్రమే దుర్దినాలు కావనీ, ఆత్మ వికాసానికి కలిగిన అవరోధాలు ఆర్థిక రాజకీయ దాస్యాల కంటే హానికరమైనవిగా భావించి మతం విడిస్తేగాని మానవత్వం ఏర్పడదని నమ్మి దేవుణ్ణి త్రోసివేసి మానవుణ్ణి జీవితరంగంలో ప్రధాన కార్యకర్తగా నిలిపిన గొప్ప మానవతావాది నార్ల.

ఆయన ఆస్తికుడూ కాదు, నాస్తికుడూ కాదు. ఆయనది 'యాగ్నోస్టిక్' దృక్పథం. హిందువుగా జన్మించినా తనని తాను హిందువుగా భావించుకొనడు. పూర్వజన్మలో గాని, పునర్జన్మలోగాని ఆయనకు విశ్వాసం లేదు, ఆయన సంపూర్ణ విశ్వాసం మానవత పట్లే.

సామాన్య మానవుని స్థితిగతులు మెరుగు పరిచేందుకు విద్యార్థి దశలోనే ఆయన "సోదర సమితి"ని స్థాపించారు. 1928-30 మధ్య కాలంలో భోగం మేళాలను వ్యతిరేకిస్తూ ఆ సమితి సభలూ, సమావేశాలూ నిర్వహించింది. ఆ రోజుల్లో కాకినాడ పరిసర ప్రాంతాలలో తుఫాను బాధితులకు సహాయం అందించారు ఆ సమితి సభ్యులు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. లాఠీదెబ్బలు తిన్నారు. జైలుకెళ్ళారు. "మాతృభూమి" లిఖిత మాసపత్రికను నిర్వహించారు. 1932లో బి.ఎ. చదువుకునే రోజుల్లో వేసవి సెలవుల్లో "కృష్ణాపత్రిక"కు ఉప సంపాదకులుగా పనిచేశారు.

నార్లది అచ్చయిన తొలి రచన ఒక లేఖ. అది మద్దూరి అన్నపూర్ణయ్యగారి సంపాదకత్వంలో నడుస్తున్న "కాంగ్రెస్" పత్రికలో ప్రచురణ జరిగింది. మరపురాని ఆనాటి ఉల్లాసమయ భావన వంటిది తరువాత తరువాత సంపాదకులుగా ఆయన ఎందరికో పంచగలిగారు.

ఇంగ్లీషు జర్నలిజంలో ప్రవేశించాలనే బలమైన కోర్కెతో 'ఇండియన్ ఎక్స్ ప్రెస్"లో చేరేందుకు ప్రొఫెసర్ రంగా ద్వారా చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. జీతభత్యాలు లేని ఉద్యోగం రామస్వామి మొదలియార్ సంపాదకత్వంలో వెలువడే "జస్టిస్" పత్రికలో దొరికింది. నెల తిరక్కుండానే అది ఊడింది.

ఆంగ్ల పత్రికల్లో ఉద్యోగానికి గాలింపు ఒకవైపు కొనసాగుతూనే ఉంది. మరో వైపు "సమదర్శిని", "భారతి", "ప్రజామిత్ర" వంటి పత్రికలకు వ్యాసాలు రాయడం జరుగుతూనే ఉంది. 1935లో చాలీచాలని జీతంతో "స్వరాజ్య" పత్రికలో చేరి ఆకలి తీర్చుకోలేకపోయినా జర్నలిజంలో మెలకువల్ని ఆకళింపు చేసుకోగలిగారు.

"స్వరాజ్య" పత్రిక మూలపడటంతో 1936లో తాపీ ధర్మారావుగారి సంపాదకత్వాన నడిచే ప్రజాపార్టీ పత్రిక "జనవాణి"లో న్యూస్ ఎడిటర్ గా చేరారు.

అభిప్రాయ భేదాల వల్ల అక్కడా ఎక్కువ కాలం నిలువలేదు. తరువాత "ప్రజామిత్ర" వారపత్రికలో ఒక సంవత్సరకాలం అసిస్టెంట్ ఎడిటరుగా పనిచేశారు.

24-4-1938 చెన్నయ్ లో నార్ల వెంకటేశ్వరరావు, చెరుకూరి సులోచనల రిజిష్టరు మారేజి జరిగింది. వారి అన్యోన్య దాంపత్యంలో మంత్రాల అవసరం కనపడలేదు.

1938 ఆగస్టు 1 చెన్నయ్ నుంచి ప్రచురించే ఆంధ్రప్రభ దినపత్రిక న్యూస్ ఎడిటరుగా ప్రవేశించి ప్రధాన సంపాదకత్వం చేపట్టి 1959 వరకు దిగ్విజయంగా నిర్వహించారు. 1952 ఆగస్టు 15న "ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రికను ప్రారంభించారు. తనతో పనిచేసే సిబ్బంది హక్కుల రక్షణకై 12-5-1959న "ఆంధ్రప్రభ" ఉద్యోగాన్ని కాలదన్నారు. 1960 జులై 2న "ఆంధ్రజ్యోతి"ని వెలిగించారు.

తొలి తెలుగు దినపత్రికను ఆంధ్రదేశానికి అందించింది కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారే అయినా ప్రజాభిప్రాయ ప్రకటనకు దినపత్రిక ఒక శక్తివంతమైన వేదికగా మార్చిన ఖ్యాతి నార్లవారికే దక్కుతుంది.

చిన్న చిన్న వాక్యాలు, చిన్న చిన్న పేరాలు, పొందికగా రాయటం ఎ.జి. గార్డియర్ నుండి పునికి పుచ్చుకున్నట్లుంటుంది. నుడికారంతో నిండిన లయబద్ధమైన శబ్దాలు, సొగసైన భావనలు ఒక ఆకర్షవంతమైన శైలిని సమకూర్చి పెట్టాయి.

ఆయన మాటల్లో నంగితనం ఉండదు. నీళ్ళు నమలటం ఉండదు. డొంక తిరుగుడు తనం ఉండదు. అంతా ముక్కుసూటి వ్యవహారమే. కుండబద్దలు కొట్టే తత్వమే. విల్లు వదలిన బాణాల వలె ఆయన మాటలు సూటిగా, వాడిగా, వేగంగా గమ్యాన్ని చేరతాయి. ఆయన పెంపకంలో విమర్శ సంయమనాన్ని పాటించి హుందాతనాన్ని అలవర్చుకుంది. విధ్వంసం వైపు దారి తీయక బాధ్యతా యుతంగా, నిర్మాణాత్మకంగా ముందుకు సాగింది.

విమర్శించటమే కాదు, ప్రతి విమర్శల్ని తట్టుకొనటం కూడా ఆయనకు వెన్నతో పెట్టిన విద్యే. తిట్టేవారు తెలివిగా, లజ్జగా తిడితే మెచ్చుకునేందుకు సిద్ధమేనంటారు నార్ల. ఇతరులు చెబుతున్నదాన్ని తాను విద్వేషిస్తున్న దాన్ని చెప్పేందుకు ఇతరులకన్న హక్కును కాపాడేందుకు తన ప్రాణాలొడ్డ టానికయినా సిద్ధపడే తత్వం నార్లది.

లాభదాయకమైనదిగా తోచని పక్షం వైపు మొగ్గే వ్యక్తి వలె కాక గెలిచిన పక్షమే గొప్పది అనక "కేవలం భుక్తి కోసం కాక, వ్యక్తిగత ప్రాబల్య ప్రాభవాల కోసం కాక కొన్ని విలువల కోసం, ఆ విలువల ద్వారా జీవిత సాఫల్యం కోసం పి.వి. స్కాట్ వలె, హెచ్. డబ్ల్యు. ఎం.హ్యూమ్ వలె పత్రికా సంపాదకత్వాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించారు. పత్రికకు శీర్షికలు నిర్ణయించటం, పతాక శీర్షికలు

తీర్చిదిద్దడం, పేజీల మేకప్, కార్టూన్ల ప్రచురణ వంటి విషయాలలో ఈయన ప్రయోగాలు మిగిలిన పత్రికలకు మేలు బంతులయ్యాయి. తెలుగు జర్నలిజంలో ఎన్నో నూతనాంశాలకు శ్రీకారం చుట్టారు నార్ల.

ఆయనకు 'మూడ్' రావాలంటే ఆఫీసులో కూర్చుని మూడు నాలుగు సిగరెట్లు కాల్చాలి! చిన్న కాగితాలు ముందుండాలి. ఏ మాత్రం అలికిడి తగలకూడదు.

సంస్కరణోద్యమాన్ని జర్నలిస్టుగా, కవి, నాటకకర్తగా, వ్యాస రచయితగా కడదాకా కొనసాగించారు. ఆంధ్ర సాహిత్యాన్ని జాతీయస్థాయికి చేర్చిన ప్రజ్ఞాశాలి. మన దేశంలో చదువులు పెరుగుతున్నా సంస్కారం పెరగటం లేదనీ, నగరాలు పెరుగుతున్నా నాగరికత పెరగటం లేదనీ చెప్పి గ్రంథాలతో స్నేహం చేస్తే ఆ కొరత తీరగలదన్నారు. ఎందరినో అసూయకు గురిచేసే గొప్ప స్వంత గ్రంథాలయాన్ని సమకూర్చుకున్నారు.

సాంకేతిక శాస్త్రాల సహాయం లేందే అజ్ఞానం నుండి, మూఢ విశ్వాసాల నుంచి, దారిద్ర్యం నుంచి మానవుని కాపాడలేమన్నారు. "కులాలు పొమ్మంటే పోవు... సాంకేతిక శాస్త్ర అభివృద్ధి సంఘాన్ని మార్చివేయగల"దన్నారు. రైతుబిడ్డగా "కొత్త గడ్డ"లో రైతుల ఆర్థిక స్థితిగతులే కాక వారి ఆశలు, ఆశయాలు, ఇబ్బందులు అద్భుతంగా కళ్ళకు కట్టించారు. వడ్డీ వ్యాపారి, వర్తకుడు, ప్రభుత్వం కలిసి కనపడని దెబ్బలు రైతును ఎలా కొడతారో వివరించారు.

పురాణేతిహాసాల నుండి ఇతివృత్తాలను స్వీకరించి వాటికి నూతన వ్యాఖ్యలు "జాబాలి" నాటకం ద్వారా తమ విశ్వాసాల కోసం కష్టాలను ఆహ్వానించలేని, ప్రాణాలను అర్పించలేని విస్తృత వర్గానికి చెందిన సామాన్యుడిగా జాబాలిని మన ముందుంచారు. హరిశ్చంద్రుణ్ణి సత్యదూరునిగా నరకంలో నిలబెట్టారు. హిరణ్యకశ్యపుని హత్య వెనుక రహస్యాన్ని ఛేదించారు. ద్రౌపది సంభాషణా చతురతకు "పంచరాత్రం" అద్దం పట్టింది.

జార్జి బెర్నార్డ్ షా వలె, త్రిపురనేని రామస్వామి వలె వచన నాటకాలకు విపులమైన పీఠికలు రాసి పాఠకునికి ఆలోచించే అవకాశం కల్పిస్తారు నార్ల.

ఆయన "పిచ్చా-పాటి" రాసినా, 'మాటా-మంతి" చెప్పినా అవి ఆయన అధ్యయన శీలతకు, అనుభవాలకు, భాషా శిల్పానికి మచ్చుతునకలుగా నిలిచాయి. "నార్లవారి మాట" వాస్తవమై అలరారింది. నిండు నూరేళ్ళు బ్రతకాలని కోరుకుంటూ ఆయన 51వ జన్మదినాన్ని "హాఫ్ వే" అంటూ

'గోల్డెన్ బుక్'ను మిత్రులు అందించారు. 1985 నాటికే ఆయనకు నూరేళ్ళు నిండాయి! అయినా పత్రికా ప్రపంచంలోనూ, సాహితీ రంగంలోనూ ఆయన కీర్తి అజరామరం.

(గుంటూరులోని పట్నాయక్ ఆర్ట్ గ్యాలరీలో ప్రసంగం ఆసభకు ప్రొఫెసర్ కొమ్మారెడ్డి రాజారామ మోహనరావుగారు అధ్యక్షులు. ఆనాడు నార్ల రచనలన్నింటినీ సంపుటాలుగా తీసుకురావాలని సూచించి అది కార్యరూపం దాల్చేట్లు చేసిన ఆయన స్మృతికి చిహ్నంగా ఈ వ్యాసం)

రావెల సాంబశివరావు: *1941 జులై రావెల సాంబశివరావు గుంటూరు జిల్లా, తుళ్లూరులో15న జన్మించారు. 1999 జులై 31న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిజిష్ట్రారుగా పదవీ విరమణ చేశారు. బాల సాహిత్య సృజనకర్తగా, సాహిత్య సమీక్షకునిగా కృషి చేసిన వీరు అనువాదకర్తగా ఇటీవల గుర్తింపు పొందుతున్నారు. వీరి ప్రసంగాలు ఆకాశవాణి ద్వారా ప్రసారితాలు. హేతువాద రచనలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అవార్డు అందుకున్నారు.★*

పత్రికా రంగంలో తెచ్చిన మార్పు

– గొర్రెపాటి వెంకటసుబ్బయ్య



గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

ఆంధ్రపత్రిక దైనందిన రాజకీయ వార్తలు ప్రచురించడంలో శ్రద్ధ చూపింది గాని, ఆకర్షవంతమైన శీర్షిక లుంచడంలో, వార్తలు ఆకర్షణీయంగా రూపొందించడలో, పత్రికకు క్రొత్త రూపు రేఖలు సంతరించడం లో వలసినంత శ్రద్ధ చూపించినట్లు మనకు తోచదు.

నార్లవారు విద్యార్థి దశ నుంచి పత్రికలతో సంబంధం కలిగి ఉన్నారు. విద్యార్థి దశలోనే "మాతృభూమి" అనే లిఖిత మాసపత్రికను స్థాపించారు. నార్లకు బాల్యం నుంచి పత్రికా రచనపై మమకారం కద్దు.

"జనవాణి" తెలుగు పత్రికా ప్రపంచంలో నార్ల విప్లవాత్మకమైన కృషి గావించారు. పత్రిక పతాకశీర్షికతో, అంతర్జాతీయ వార్తా వ్యాఖ్యలతో వెలువడటానికి కారకుడు నార్లయే. దీనితో తెలుగు దినపత్రిక స్థాయి ఒకమెట్టు పైకి ఎక్కిందని చెప్పాలి.

వార్తలను సేకరించడం ఒక ఎత్తు, వాటిని ఆకర్షణీయంగా ప్రచురించడం ఒక ఎత్తు. ప్రచురణలో ఏ వార్తకు ఎంత ప్రాముఖ్య మివ్వాలో, ఏ శీర్షిక నుంచాలో ఈ విషయాలన్నిటా నార్ల కడు మెలకువతో గమనిస్తూ "ఆంధ్రప్రభ" స్థాయిని పెంపొందించాడు. "ఆంధ్రజ్యోతి"లో ఇంగ్లీషు పత్రికల లోని "వార్తలోని వ్యక్తి" శీర్షికతో ప్రముఖ వ్యక్తుల జీవిత చిత్రణ, సంక్షిప్తరూపంలో, ఆకర్షణీయంగా, ప్రచురించడం అందరికీ విదితమే.

ప్రత్యేకించి మొదటి పేజీలో పతాక శీర్షికలను పెట్టడంలో ప్రసిద్ధుడు. ఆయన 'స్టోన్' దగ్గర నిలబడి పేజీలను అమర్చడంలో, కార్టూన్లు ప్రచురించడంలో, ఆయన పెట్టిన ఒరవడే మిగిలిన పత్రికలకు మార్గదర్శకమైంది. పత్రికను కళాత్మకంగా, ఆకర్షణీయంగా అమర్చడం కూడ ఆయనకు గల ఒక విశిష్టత.

సంపాదకీయ రచనలలో ఆయన ప్రసిద్ధుడు. నార్ల విదేశాలలో అనేక పత్రికా సంస్థలను సందర్శించి, ఆ పత్రికా సంపాదకులతో, పత్రికా ప్రచురణలోని మెలకువలను గూర్చి, అనేక నూతన విషయాలను స్వీకరించారు. మన పత్రికా ప్రచురణలకు, మొట్టమొదటి నుంచి కూడ ఆంగ్ల పత్రికల ఒరవడినే మనం స్వీకరించిన సంగతి అందరకు తెలిసిందే.

"డెయిలీ ఎక్స్ ప్రె స్" "డెయిలీ మెయిల్" మొదలగు పత్రికలను అనుసరిస్తూ పత్రికారంగంలో ఆయన ప్రసిద్ధుడైనాడు. మన తెలుగులో రక రకాలైన "తెలుగు" లున్నాయి. ఇందులో "బైబిలు తెలుగు" ఇది అంతా తెలుగే, గాని ఆవగింజంత తెలుగు నుడికారమైనా ఇందులో ఉండదు.

పూర్వం సంస్కృతం చదువుకున్నవారు, తెలుగులో గ్రంథ రచనలు చేసిన కొందరు కూడ. తెలుగు నుడికారాన్ని నాశనం చేశారు.

అట్లాగే, ఇంగ్లీషు నేర్చిన కొందరు పత్రికా సంపాదకులై, ఇంగ్లీషులో ఆలోచించి, తెలుగు రచనకు పూనుకున్నారు. అందువల్ల తెలుగు నుడికారం పాడైంది.

నార్ల మొట్టమొదట, కృష్ణాపత్రిక సంపాదకీయాలన్నీ, బాగా అవగతం చేసుకున్నాడు. ఆ పోకడలు శ్రద్ధగా గమనించారు.

తరువాత "జనవాణి" సంపాదకులైన తాపీ ధర్మారావుగారి వ్యాసరచనా పద్ధతి గమనించారు. అసలు ఆయనకు ఎ.జి. గార్డినర్ గురువు. ఆయన వ్యాసరచనా పద్ధతి బాగా అలవరచుకున్నారు. చిన్న చిన్న వాక్యాలు-చిన్న చిన్న పేరాలు, పొంకంగా రాయడం, ఆయన పద్ధతి.

నార్ల ఆంగ్లం బాగా చదివినా, తెలుగు నుడికారం బాగా అలవడింది. ఇలా రాస్తేగాని, సాధారణ ప్రజకు సులభగమ్యంగా ఉండజాలదని, వ్యావహారిక భాషలో వ్రాయడం సాగించారు. వ్యావహారిక రచనలో, ఈయనదొక ఆకర్షవంతమైన శైలి.

తెలుగులో లేని "యొక్క" అనే శబ్దప్రయోగం అనేక మంది ప్రకాండ పండితులు కూడ ఉపయోగించడం మనకు తెలుసు. నార్లవారి శైలిలో పరిశోధించి వెదికినా ఈ "యొక్క" ప్రయోగం కానరాదు. తన వద్ద పనిచేసే ఉపసంపాదకులకు "యొక్క" తెలుగు నుడికారానికి బొక్క పొడుస్తుందని ఆయన హెచ్చరిస్తూ ఉంటారు. అలాగే "చేయబడింది, వ్రాయబడింది" అనే "బడు" ప్రయోగాన్ని కూడా ఆయన తన పత్రికలో నిషేధించారు.

ప్రతి జాతికి, ఒకశైలి ఉంటుంది. ఆ జాతి మాట్లాడే భాషా సంప్రదాయాలకు అనుగుణమైన ఒక విధమైన పద సంవిధానమే శైలి.

"గోధే" మహాకవి తన పాండిత్యం చూసుకొని తన విచిత్ర భావనా శక్తి చూసుకొని గర్వపడలేదు. జర్మన్ భాషలో వ్రాసే పద్ధతి తెలిసి ఉండడమే ఆయన ఆత్మ విశ్వాసానికి ప్రబల కారణం. ఆయన రచనల్లో చాలా భాగం, జర్మన్ జాతీయాలతో నిండి ఉండి అనువాదాలకు నీలు లేకుండా ఉంటుంది.

"సజీవమైన జర్మన్ భాష మాట్లాడడం నేర్చుకున్నందువల్ల నాకు సర్వత్ర కవిత్వం గోచరమౌతున్నది" అన్నాడాయన. తెలుగు భాష, నానుడి తెలిసినవారిలో నార్ల అగ్రగణ్యుడు. అందుచేతనే ఆయన పత్రికలకు, ఇతర రచనలకు మిక్కిలి ప్రజాదరణ.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ఆయన ప్రధాన సంపాదకత్వంలో "పదబంధ పారిజాతము" అనే రెండు సంపుటాలను ప్రచురించారు. నుడికారాలు– పలుకు బళ్లు – జాతీయాలని వివరించే పదబంధాలన్నీ అకారాదిగా కూర్చి, అర్థవివరణాలతో, ప్రయోగపద్ధతుల ఉదాహరణాలతో కూర్చిన, ఒక గొప్ప నిఘంటువు వంటిది. ఇది వారి సృజనాత్మక రచన గాక పోయినా, ప్రాజ్ఞులైన విశిష్ఠవ్యక్తులు గావించు నిఘంటు నిర్మాణాలవంటి బృహత్తర కృషి.

శబ్దార్థానికి భిన్నమైన విశేషార్థమున్న పదము కదా! పదబంధము ఇందులో నుడికారాలను సేకరించడం కూడ జరిగింది.

దారీ – తెన్ను, మాటా–మంతి, పిచ్చా –పాటి, దారి–డొంక నిజానికి తెలుగు భాషకు, ప్రత్యేకతను సౌష్ఠవాన్ని, లాలిత్యాన్ని చేకూర్చినవి, ఈ జంట మాటలన్నది నిజం.

పై విధంగా నిర్విరామ కృషితో, పరిశీలనా దీక్షతో ఆధునిక వార్తా పత్రికలకు ఉండవలసిన అన్ని హంగులను ఆయన పత్రికలలో ప్రవేశపెట్టాడు.

ఆంధ్రప్రభలో నార్ల

– గొర్రెపాటి వెంకట సుబ్బయ్య

1938 ఆగస్టు 1న "ఆంధ్రప్రభ దినపత్రికకు నార్లవారు "న్యూస్ ఎడిటర్"గా ఉద్యోగాన్ని స్వీకరించారు. 1942 మధ్యలో దీనికి ప్రధాన సంపాదకత్వాన్ని చేపట్టి 1959 వరకు నిర్వహించారు. వీరు ప్రభకు ప్రధాన సంపాదకత్వాన్ని చేపట్టేముందు దీని సర్క్యులేషన్ 5000 కాగా వీరు విడిచిపెట్టేనాటికి 15 రెట్లు పెరిగింది. నిజంగా వీరి సంపాదకత్వం ఎంత గొప్పదో ఇదే రుజువు చేస్తోంది.

ప్రాంతీయంగా గాని, జాతీయంగా గాని, అంతర్జాతీయంగా గాని, ఏ దృక్పథంతో చూసినా, 1942–59 మద్యకాలం చరిత్ర ఎంతో ప్రాముఖ్యం కలిగింది. రెండవ ప్రపంచయుద్ధం, క్విట్ ఇండియా ఉద్యమం, లార్డు పెథిల్ లారెన్స్ నాయకత్వం క్రింద వచ్చిన రాయబారం. 1946లో జరిగిన జనరల్ ఎన్నికలు. ప్రకాశంగారి నాయకత్వంలో మద్రాసు ప్రభుత్వం ఏర్పడటం, సంవత్సరానంతరం, ప్రకాశంగారిని నాయకత్వం నుండి తొలగించడం, ఇండియా నుండి వైదొలగిపోవడానికి అట్లీ మహాశయుడు చేసిన ప్రకటన. రాజ్యాంగ సభ నిర్మాణం, దేశ విభజన, నైజాంపై పోలీసు చర్య, స్వతంత్ర భారతదేశ రాజ్యాంగ నిర్మాణం, దాని ఆమోదం, మద్రాసు నగరంతో వేర్పాటు సందర్భంగా ఆంధ్రులు పడిన నిరాశ. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర నిర్మాణాందోళన – పొట్టి శ్రీరాములుగారి ఆమరణ నిరాహారదీక్ష, వారి మరణానంతరం జరిగిన దౌర్జన్యకాండ, ప్రకాశంగారు ముఖ్యమంత్రిగా మంత్రివర్గం ఏర్పాటు, ఒక సంవత్సరానంతరం ప్రకాశంగారి మంత్రివర్గ పతనం, మధ్యంతరపు ఎన్నికలు, కాంగ్రెసుకు అఖండ విజయం, బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రిత్వం క్రింద క్రొత్త ప్రభుత్వం ఏర్పాటు, హైదరాబాదు సంస్థానం రద్దు, ఆంధ్రప్రదేశ్ అవతరణ, నీలం సంజీవరెడ్డిగారు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టడం లాంటి మహత్తర సంఘటనలు 1942–59 మధ్యకాలంలో జరిగాయి. ఆయా సంఘటనల సమయాలలో "ఆంధ్రప్రభ" ప్రముఖపాత్ర వహించి, వార్తలందించడంలో, వివేచనతో విమర్శించడంలో, దక్షతతో వ్యాఖ్యానించడం వల్ల నార్లవారి సంపాదకీయ వ్యాసాలతో తన సార్ధకతను చాటుకొంది.

ద్వితీయ ప్రపంచ సంగ్రామ సమయంలో జరిగే ఒడిదుడుకులు పాఠకులకు సులభంగా, సుకరంగా అర్థమవటంకోసం యుద్ధప్రాంతాల చిత్ర పటాలు, ప్రచురించడమేగాక, యుద్ధనైపుణ్యాన్ని గూర్చి, వ్యూహరచనల మీద ఆంధ్రప్రభలో వ్యాసాలు ప్రచురించేవారు. ఈ విషయాలు పాఠకలోకాన్ని విజ్ఞానవంతం చేశాయి. ఈ విషయాలను గూర్చి ప్రధాన పత్రికా సంపాదకుడుగా తాను అవగాహన చేసుకొనేందుకు నార్లవారు ఎన్ని వందల గ్రంథాలు పఠించారో ఎన్ని వేల గ్రంథాలు పరికించారో వారికే తెలియాలి. ఇంతేకాదు యుద్ధపాఠశాలలకు వెళ్ళి దర్శించారు. మరతుపాకులు చేపట్టారు, టాంకులు నడిపారు, బాంబులు విసిరారు, ఆర్కోణం సమీపాన జరిగిన సైనిక విన్యాసాలను కళ్ళారా చూశారు. బర్మాలో జపానుపై మొదట విజయం సాధించిన వారిలో కొందర్ని నార్లవారు ప్రత్యక్షంగా చూశారు. ఈ సమయంలో నార్లవారు చూపిన ప్రతిభ ప్రత్యేకతలు, యుద్ధవార్తలు ప్రకటించడానికి వాడిన పదజాలం అసాధారణమైంది. ఆంగ్లభాషలోని retreat అనే పదానికి 'తిరోగమనం' అనీ, encirclement అనేదానికి "దిగ్బంధం" అని refugee అనేదానికి "కాందిశీకుడు" అని తూచి, ఏర్చి, కూర్చి, పద ప్రయోగాలు చేయటం వీరి ప్రత్యేకత.

కాంగ్రెసు 'క్విట్' ఇండియా తీర్మానం ప్రవేశపెట్టిన తరువాత, వార్తలపై ప్రీ–సెన్సార్షిప్ పెట్టాలని ప్రభుత్వం తలపెట్టినదానికి నిరసనగా కొన్ని మాసాలపాటు ఆంధ్రప్రభను మూసివేశారు. ఇందుకు తాము తీసుకొన్న నిర్ణయాన్ని తెలియచేయటానికి వ్రాసిన ప్రధాన సంపాదకీయం దేశ భక్తిపూరితమై ప్రతి పాఠకుని ఉత్తేజపరిచింది. పత్రిక పునర్ముద్రణ ప్రారంభించిన తరువాత క్విట్ ఇండియా తీర్మానాన్ని గురించి ప్రతిభావంతమైన రచనను చేశారు.

1946 లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రం జనరలు ఎన్నికలు జరిగిన తరువాత, ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా సి. రాజగోపాలాచారిని కాంగ్రెసు శాసనసభా పార్టీ నాయకుడుగా ఎన్నిక చేయాలని మహాత్మాగాంధీ కోరారు. అప్పుడు మద్రాసులో ఉన్న పత్రికా సంపాదకులందరిలో నార్ల ఒక్కరే గాంధీ అభిప్రాయానికి వ్యతిరేకతను ప్రకటించారు. ప్రజాభీష్టాన్ని కాదని, వారి అభిప్రాయానికి విరుద్ధమైన వ్యక్తిని ప్రజాప్రతినిధిగా నియమించే అధికారం గాంధీజీకి లేదని నిస్సంకోచంగా ధారావాహికంగా సంపాదకీయాలు రాశారు. శాసనసభలో అధిక బలమున్న ప్రకాశం పంతులు అతి ధైర్యంగా తన అభిప్రాయాన్ని ప్రకటించిన నార్లను స్తుతించారు. ఆయన "ఆంధ్రప్రభ" యధార్థంగా "దివ్యప్రభ" అన్నారు.

ప్రజానాయకుడు ప్రకాశంగారు అనుకున్న ఆయనగారి పరిపాలనా వ్యవహారం పట్ల నార్లకు అసంతృప్తి కలిగింది. 1947 ఫిబ్రవరి 12 నుంచి వరుసగా అయిదు సంపాదకీయాలు, "ప్రజా

ప్రభుత్వం" అనే శీర్షికతో ప్రచురించారు. ఇవి ప్రకాశంగారికి, ఆయన అనుచరులకు శాపవచనాలుగా పరిణమించాయి. మంత్రివర్గం పతనమైంది. ఇది పతనం కాకపూర్వం తాను నిర్వహించిన ప్రతి ఉద్యమంలోను ఇచ్చే ఉపన్యాసాలలో ప్రత్యేకించి ఈ అయిదు సంపాదకీయాల ప్రసక్తి తెచ్చేవారు.

భీమవరం, పాలకొల్లు, రాజమండ్రి మున్నగు పట్టణాలలోను, ఇంకా అనేక ప్రదేశాలలో, "ఆంధ్రప్రభ" పార్సిల్సును లాక్కొని తగులబెట్టడం కూడా జరిగింది. ఒక పాఠకుడు కోపం పట్టలేక, నార్లను తిడుతూ జాబు రాశాడు. అందులో నార్లవారిని "పంచమహాపాతకుడు"గా ఆయన అభివర్ణించాడు. తన చిరకాల సంపాదకానుభవంలో తనను నిందిస్తూ రాసిన లేఖలో ఇదంటే నార్లకు మహా ఇష్టం.

రజాకారులను గురించి, వారి దారుణ ఘాతుక కృత్యాల గూర్చి విమర్శిస్తూ నార్ల సంపాదకీయాలు రాశారు. అప్పుడు, నైజాంప్రభుత్వం "ఆంధ్రప్రభ" తమ సరిహద్దులు దాటి రాకుండా నిషేధించింది. ఈ పని నార్లవారిని మరింత రెచ్చగొట్టింది. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ, వాటిని ఉల్లంఘించి రహస్యంగా "ఆంధ్రప్రభ"ను పంపిణీ చేయటం జరిగింది.

వీరి సంపాదకత్వంలో ఈ పత్రిక 72,000 వరకు సర్క్యులేషన్ పెరిగింది. నిజాం ప్రభుత్వం "ఆంధ్రప్రభ" మీద కక్ష బూనింది. ఈ పత్రిక పుచ్చుకొన్న ప్రతి పౌరుని అరెస్టు చేసింది. అయినప్పటికీ ప్రజలు ప్రభుత్వాన్ని లెక్కచేయకుండా ఆంధ్రప్రభను ఆదరించారు.

మద్రాసులో ఆంధ్రుల హక్కులపట్ల ఒక నిర్దుష్టమైన ప్రగాఢ నిర్ణయం ఉండుటవల్ల నార్ల వారిని మరోమారు అపఖ్యాతి వరించింది. మద్రాసు రాజధానిలో నుండి ఆంధ్రరాష్ట్ర అవతరణకై పొట్టి శ్రీరాములుగారు ఆమరణ నిరశన వ్రతాన్ని పూనారు. తుదకాయన 15-12-1952 న స్వర్గస్తులయ్యారు. ఆయన మృత శకటాన్ని ఆంధ్రప్రభ కార్యాలయం ఎదుట 15 నిమిషాలు ఆపి, "నార్ల డౌన్ డౌన్" అంటూ ప్రజాసమూహం ఆకాశం ప్రతిధ్వనించే నినాదాలు చేసింది. ఇతర ప్రాంతాల వారికి కూడా ఇదే వరవడి అయింది. ఆంధ్రదేశమంతా రైలు పెట్టెలమీద సీమసున్నంతో నార్లవారిని నిందిస్తూ రాశారు. చాలా చోట్ల "ఆంధ్రప్రభ" పార్సిల్సు తగుల బెట్టారు.

(పండిత గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారి రచన నవమేధావి నార్ల నుంచి పునర్ముద్రితం)

ఆంధ్రప్రభ తొలి దశాబ్దం – నార్ల



ఆగస్టు 15న భారత స్వాతంత్ర్య దినోత్సవం. ఇదే "ఆంధ్రప్రభ" జన్మదినోత్సవం కూడా. ఈ సంయోగం "ఆంధ్రప్రభ" అదృష్టభాగ్యం.

పదేండ్లు నిండి పదకొండవ సంవత్సరంలో నేడు "ఆంధ్రప్రభ" పాదం పెడుతున్నది.ఇది ఒక వ్యక్తి జీవితంలో ముఖ్య సంఘటన కావచ్చు గాని, పత్రిక జీవితంలో దానికి ప్రత్యేక ప్రాముఖ్యం కలదా? అనే ప్రశ్న ఈ సందర్భంలో అసమంజసమైనది కానేరదు. పత్రిక ఆయుర్దాయానికి ఒక పరిమితి లేదు. నిజాన్ని తప్పకపోతే, నీతిగా నడిస్తే, నిర్భీకంగా ప్రవర్తిస్తే, కాలాన్నిబట్టి పరివర్తనం చెందుతుంటే, నిత్య నూతనత్వాన్ని ప్రదర్శిస్తుంటే, మానవ సేవ చేస్తుంటే, అన్నింటినీ మించి ప్రజా బాహుళ్యం ప్రేమాభిమానాలకు పాత్రమౌతుంటే, అది అమరజీవి.

పైగా, పత్రిక జీవితంలో బాల, కౌమార, యౌవ్వన వృద్ధాప్యాలనే, చతుర్విధ దశలు లేవు. పుట్టుకతోనే ప్రౌఢత్వాన్ని ప్రదర్శించే పత్రికలు కొన్ని ఉంటాయి. జననమొందిన వెంటనే జరాభారాన్ని ప్రదర్శించేవి మరికొన్ని ఉంటాయి. కొన్నేళ్ళలో గతించినా, లోకానుభవంలో పండిపోయినవి మరికొన్ని ఉంటాయి.

వ్యక్తి జీవితం పరిమితమైనదికాగా, పత్రిక జీవితం అనంతమైనది కావచ్చు – అన్య విధాల కూడా ఈ జీవితద్వయ విధానాలలో భేదం కానరావచ్చు కాని, రెండింటికీ సమానంగా వర్తించే ఒక పరమ సత్యం కలదు. "పౌరుష జ్ఞానకీర్తుల బరగెనేని జన్మము ఒకపూటయైన జాలు" అనేది వ్యక్తులకు వలె పత్రికలకు కూడా సమానంగా వర్తిస్తుంది.

ఈ దృష్టి నుంచి చూస్తే, "ఆంధ్రప్రభ" తొలిదశాబ్దాన్ని గడిపి, ద్వితీయంలో ప్రవేశించడానికి – ఒకసారి ఆత్మపరిశోధన చేసుకొనడానికి,అవకాశంగా వినియోగించడం తప్ప, అన్య ప్రాధాన్యం లేదు.

గడిచిన శతాబ్దం, మన దేశ చరిత్రలో నేమి, ప్రపంచ చరిత్రలోనేమి, అపూర్వమైనదనే చెప్పవచ్చు.

ఒక యుద్ధప్రారంభం, దాని సమాప్తి ఈ దశాబ్దంలోనే జరిగింది.

ప్రపంచ యుద్ధంలో పరాజయం వల్ల మూడు అగ్రరాజ్యాలు (జర్మనీ, ఇటలీ, జపాను)లు హతమారి పోవడం యుద్ధంలో జయించికూడా రెండు మహా రాజ్యాలు (బ్రిటన్, ఫ్రాన్సు)లు చితికి పోవడం, ఈ సంఘటనద్వయం ఫలితంగా ఇతఃపూర్వపు ప్రపంచ వ్యవస్థ పూర్తి పరివర్తనం చెంది, రష్యా అమెరికాలు రెండు మాత్రమే ప్రపంచ ప్రధాన రాజ్యాలుగా నిలవడం ఈ దశాబ్దంలోనే జరిగింది.

బ్రిటీష్, ఫ్రెంచ్, డచ్ సామ్రాజ్యాల శక్తి ఉడిగిపోగా ప్రాచ్యజాతిలో నూతనశక్తి దీప్తులు వెల్లివిరియగా, ఆసియాఖండం మొత్తం స్వాతంత్ర్య భాగ్యాన్ని పొందడం, ఈ దశాబ్దంలోనే.

శాంతి, భద్రతల సంరక్షణ మాత్రమే – పోలీసురాజ్యంగా వ్యవహరించడమే – ప్రభుత్వ ధర్మం కాదని, ప్రతి పౌరునికి కూడు, గుడ్డ ఇవ్వలేనిది, చదువు సంధ్యలు చెప్పలేనిదీ ఒక్కమాటలో, మానవుడు మానవుని వలె జీవించడానికి తగు పరిస్థితులు కల్పించలేనిది, ప్రభుత్వమనే పేరుకైనా తగదనే భావం పరిఢవిల్లింది ఈ దశాబ్దంలోనే.

ఒక కొత్తశక్తి, – ఒక మహాశక్తి – పరమాణుశక్తి అని మా తాత్పర్యం – ప్రభవించడమేమి, ప్రపంచశాంతి, అన్యథా ప్రపంచ విధ్వంసన అనే సమస్య ఉత్పన్నం కావడమేమి ఈ దశాబ్దంలోనే జరిగింది.

హింస విశ్వాంతకరూపాన్ని ధరించిన సమయంలోనే, ప్రపంచ చరిత్రలోనే తొలిసారిగా ఒక దేశం (ఇండియా) కేవలం అహింసద్వారా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొనడం ఈ దశాబ్దిలోనే.

ప్రపంచ చరిత్ర నుంచి దేశ చరిత్రను అందుకొనగా, అహింస ద్వారా స్వాతంత్ర్యాన్ని పొందినా, కలకాలం వరకు మనం సిగ్గుపడవలసినంతగా, భాతృహత్యలేమి రక్తపాతమేమి సంభవించడం సయితం ఈ దశాబ్దంలోనే. ఇంతకంటే ఘోరాతిఘోరమైన, సంఘటన గాంధీజీ దారుణ హత్య కూడా ఈ దశాబ్దిలోనే.

కల్లోలాన్ని గడచి, రక్తపాతాన్ని అధిగమించి, దాదాపు శిధిలాల నుంచి నూతన భారత – స్వతంత్ర భారత సౌధం క్రమంగా ఒక రూపాన్ని ధరించనారంభించడం ఈ దశాబ్దిలోనే.

అది జాతీయ రంగమైనా, అంతర్జాతీయరంగమైనా, పాతభావాలెన్నో గతించడం, కొత్తవి ప్రభవించడం, పాత వ్యవస్థలు పునాదులతో కదలడం, కొత్తవి రూపొందడం, ఒక్క మాటలో పాతశకం పోయి, కొత్తదాని ప్రాంగణంలో మానవుడు నిలవడం ఈ దశాబ్దంలోనే.

అపూర్వమైన ఈ దశాబ్దంలో 'ఆంధ్రప్రభ' తనకు సంబంధించినంతవరకు సముచిత పాత్రను నిర్వహించగలిగిందా?

ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరాన్ని ఏవిధంగా చెప్పడం?

పత్రికా ప్రపంచంలో "ఆంధ్రప్రభ" అత్యధికమవడం ఇందుకు ప్రత్యుత్తరమా?

1942 నాటి "క్విట్ ఇండియా" మహోద్యమ సందర్భంలో "ఫ్రీ సెన్సార్షిప్" నిరంకుశత్వాన్ని సహించనొల్లక తాత్కాలికంగా ప్రచురణను విరమించినదనడం ఇందుకు ప్రత్యుత్తరమా?

నిజాం, మైసూర్, తిరువాన్ కూర్ నిరంకుశ ప్రభుత్వాలచే ఒకప్పుడు నిషేధింపబడిందని, నేడుకూడా మొదటిదానిలో నిషేధం కలదని చెప్పడం ఇందుకు ప్రత్యుత్తరమా?

నేడు 'ఆంధ్రప్రభ కాదు దివ్య ప్రభ' అని ప్రశంసించే రాజకీయ ప్రముఖులే, రేపు స్వార్థచింతను, అనుభవశూన్యతను, ఆరోపించడం ఇందుకు ప్రత్యుత్తరమా?

ఏమైనా ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరాన్ని చెప్పవలసింది పాఠకలోకమే. పత్రిక చెప్పగలిగింది తను నమ్మిని విషయాన్ని తాను వ్రాయనని మాత్రమే.

ఆంధ్రప్రజకు ఇంతవరకు చూపిన సమధికాదరాభిమానాలకు కృతజ్ఞత తెలుపుతూ, ఇకమీద మరింతగా పాత్రం కాగలననే ఈ శుభసమయంలో "ఆంధ్రప్రభ" ఆశిస్తున్నది.

(1943 ఆగస్టు 15న ప్రచురించిన ప్రత్యేక వ్యాసం)

తెలుగు పత్రికా నౌకకు దిక్సూచి

– కొండుభట్ల రామచంద్రమూర్తి



శ్రీశ్రీ వంటి మహాకవి శ్రీశ్రీ ముందు ఎవరూ లేరు, ఆయన తర్వాతా ఎవరూ లేరంటూ కొందరు చేసిన తీర్మానంపై తర్జనభర్జన జరిగిన సందర్భాలు ఉన్నాయి. నార్ల వెంకటేశ్వరరావు వంటి మేటి సంపాదకుడు ఆయనకు ముందూ, వెనుకా ఎవరైనా ఉన్నారా లేదా అన్న అంశం పైన చర్చ జరిగిన దాఖలా లేదు. తెలుగు పత్రికా సంపాదకుడుగా నార్లకు దీటైనవారు ఆయనకు ముందు కానీ ఆయన తర్వాత కానీ ఎవరూ లేరు. సంపాదక వ్యవస్థను సమున్నత స్థాయిలో నిలిపిన అసాధారణ ప్రతిభావంతుడు నార్ల. ఆయన జీవితకాలంలోనే సంపాదక వ్యవస్థ ప్రాధాన్యం తగ్గుముఖం పట్టిన మాట వాస్తవం. ఆయన తర్వాత మారిన పరిస్థితులలో సంపాదక మండలి పత్రికా వ్యవస్థలో కేవలం ఒక విభాగంగా, తక్కిన విభాగాలతో సమానంగా కుంచించుకుని ఒదిగిపోయి మిగిలి పోయింది. కనుక తెలుగు రాజకీయంలో నందమూరి తారకరామారావు లాగానే పత్రికారంగంలో నార్లను 'ఒకే ఒక్కడు'గా అభివర్ణించవచ్చు. పత్రికలు ఉంటాయి. సంపాదకులుగా కొందరు నియుక్తులవుతారు. కానీ ఒకానొక సంపాదకుడికోసం పత్రికను నెలకొల్పిన ఒకే ఒక సందర్భం 'ఆంధ్రజ్యోతి' ఆవిర్భావం. 'ఆంధ్రప్రభ' నుంచి వైదొలిగి సంపాదకత్వం వహించడానికి చేతిలో పత్రిక లేకుండా 'నిరుద్యోగి'గా ఉన్న నార్లకోసం కొందరు ముఖ్యులు పూనుకొని పెట్టిన పత్రిక అది. ఆయన ఔన్నత్యానికీ, ప్రాబల్యానికి నిలువెత్తు

నిదర్శనం. స్వాతంత్ర్య పూర్వపు సమాజానికీ, స్వాతంత్ర్యానంతర సమాజానికీ పటిష్ఠమైన వారధి నార్ల. ఆధునిక భారత ఇతిహాసంలోని చారిత్రక దశలో ఆయన ఒక వెలుగు వెలిగారు. అటువంటి కాలమాన పరిస్థితులు మళ్ళీ రావు. అటువంటి సంపాదక శిఖరాన్ని మళ్ళీ చూడలేం. నార్లకు ముందు కానీ తర్వాత కానీ ఆయనకు దీటైన సంపాదకుడు లేడని నిర్ధారించడం అందుకే.

'ఆంధ్రప్రభ' సంపాదక బాధ్యతలను నార్ల 1942లో స్వీకరించిన నాటికి తెలుగు పత్రిక పుట్టి నూరేళ్ళు వర్ధిల్లింది. ముట్నూరి కృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కాశీనాధుని నాగేశ్వరరావు, తాపీ ధర్మారావు, జి.ఎస్. ఆచార్య వంటి మేటి సంపాదకులు తెలుగు పత్రికా రంగాన్ని అప్పటికే సుసంపన్నం చేశారు. ఒక దినపత్రిక సంపాదకత్వాన్ని నిత్యసంగ్రామంగా నిర్వహించి దానికి సమున్నతమైన స్థాయినీ, అసాధారణమైన అస్తిత్వాన్నీ సమకూర్చిన బహుముఖ ప్రతిభాశాలి నార్ల.

గోరాశాస్త్రి మాటల్లో చెప్పాలంటే 'కేవలం సత్వగుణ ప్రధానంగా, అచ్చతెలుగులో చప్పచప్పగా ఉన్న పత్రికా రచనలో వాడినీ, వేడినీ సృష్టించి, తెలుగు నుడికారంలో ఎంత 'కారం' ఉందో తెలియజెప్పిన వాడు' నార్ల. పత్రికా రచనలోనూ, పత్రిక రూపకల్పనలోనూ కొత్త పుంతలు తొక్కి తెలుగు పత్రికారంగాన్ని మేలు మలుపు తిప్పిన ద్రష్ట ఆయన. శైలిలో, నూతన శీర్షికావిష్కరణలో, పుటాలంకరణలో, సమాచార వితరణలో, రాజకీయ, సామాజిక పరిణామాలపైన సూదంటి వ్యాఖ్యానంలో కొత్తబాటలు వేసిన వైతాళికుడు. పత్రికా రచనలో సారస్వతపు జిగినీ, నుడికారపు సొగసులనూ, జాతీయాల సౌరభాన్నీ రంగరించిన రసజ్ఞుడు. తెలుగు దినపత్రిక స్వరూప స్వభావాలను సమూలంగా మార్చివేసిన సంపాదకుడు. 'కాగడా', 'జనవాణి'తో తాపీ ధర్మారావు ప్రారంభించిన వ్యావహారిక భాషా ఉద్యమాన్ని నార్ల 'ఆంధ్రప్రభ', 'ఆంధ్రజ్యోతి' ద్వారా సమర్థంగా కొనసాగించారు. భావితరాలకు దిశానిర్దేశం చేశారు. 'తెలుగులో ఆలోచించి, తెలుగు నుడికారంలో తెలుగుదనం ఉట్టిపడేటట్టు రాయగలిగినప్పుడే తెలుగువారిలో మనం కదలిక పుట్టించగలం' అని ఆయన తోటి జర్నలిస్టులకు ఉద్బోధించారు. తెలుగుపట్ల ఇంతటి మమకారం లేకపోతే కోటంరాజు రామారావు, మానికొండ చలపతిరావు, కుందూరి ఈశ్వరదత్తు, ఖాసా సుబ్బారావులాగా నార్ల కూడా ఢిల్లీకో, లక్నోకో వెళ్ళి ఆంగ్ల పత్రికల సంపాదకుడిగా కీర్తి గడించేవారు.

నార్ల బహుముఖీనుడు. స్వాతంత్ర్య సమరయోధుడు. పత్రికారచయిత. కవి. నాటక రచయిత. అనువాదకుడు. పరిశోధకుడు. మేధావి. అత్యున్నత చట్టసభలో సభ్యుడు. హేతువాది. ఇన్ని రంగాలలో అభినివేశం ఉన్న వ్యక్తి మరొకరు కనిపించరు. అన్ని రంగాలపైనా తనదైన ప్రత్యేక ముద్ర వేసిన

ప్రజ్ఞాశాలి మరొకరు లేరు. ఒక పత్రికా సంపాదకుడికిన్ని తేజోవంతమైన పార్శ్వాలను ఊహించడం కూడా కష్టమే. ఎన్ని రకాల సాహిత్య ప్రక్రియలలో నార్ల తన ప్రతిభను చాటుకున్నప్పటికీ తెలుగు పత్రికారంగానికి ఎనలేని సేవ చేసిన సంపాదకుడిగానే భావితరాలు ఆయనను గుర్తుపెట్టుకుంటాయి.

నికార్సయిన పత్రికా సంపాదకుడికి నిర్వచనం నార్ల. సంపాదకుడు (ఆయన ఈ మాట ఉపయోగించేవారు కాదు. ఎడిటర్ అనే రాసుకునేవారు, పిలిపించుకునేవారు. ఎడిటర్ అనే ఇంగ్లీషు మాటకు సంపాదకుడు అనే తెలుగు అనువాదాన్ని ఆయన ఆమోదించలేదు.) అంటే ఏమిటో, సంపాదకుడి స్థానం ఏమిటో యాజమాన్యాలకూ, సమాజానికీ తెలియజెప్పడానికి ఆయన శత విధాలుగా ప్రయత్నించారు. అన్ని సమస్యలపైనా ఎడిటరుకు అవగాహన ఉండాలనీ, నిశ్చితాభిప్రాయం ఉండాలనీ, అభిప్రాయాన్ని నిర్భయంగా, నిస్సంకోచంగా, సూటిగా ప్రకటించాలనీ ఆయన విశ్వాసం.

తెలంగాణ ఉద్యమం పతాక స్థాయిలో ఉన్నప్పుడు ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ సంపాదకీయం రాసినా, అత్యయిక పరిస్థితి విధించడాన్ని నిరసిస్తూ సంపాదకీయం రాయకుండా ఆ స్థానాన్ని ఖాళీగా వదిలి వేసినా, చివరికి యాజమాన్యంతో విభేదాల కారణంగా సంపాదక పదవికి రాజీనామా చేసినా,

పూర్వ యజమానిని దుయ్యపడుతూ జీవిత చరమాంకంలో నిప్పులు కక్కే రచనలు చేసినా నార్లలో స్వతంత్రుడైన (నిరంకుశుడా?) రచయిత దర్శనమిస్తాడు. హేతుబద్ధంగా ఆలోచించాలనీ, సామాజిక పరిణామాలను శాస్త్రీయ దృష్టితో పరిశీలించాలనీ, మానవతావాదిగా జీవించాలనీ, పురాణాల దుష్ప్రభావం నుంచి ప్రజలను బయటపడేయాలనీ, కులవ్యవస్థను రూపుమాపాలనీ ఆరాటం. ప్రజలలో భావవిప్లవం రాకపోతే ఎన్ని పంచవర్ష ప్రణాళికలు ఎంత జయప్రదంగా అమలైనా నిజమైన అభివృద్ధి సిద్ధించదని వాదన. తాను నమ్మిన విషయాన్ని శక్తిమంతంగా చెప్పడంలో నార్ల అద్వితీయుడు. ఆయన రచనలో సూటిదనం, గడుసుదనం, వ్యంగ్యం, చమత్కారం, లోకజ్ఞత, సమయజ్ఞత సమపాళ్ళలో ఉండేవి. నీళ్ళు నమలడం ఆయనకు చేతకాదు. మర్యాదలు పనికిరావు. ముక్కు మీద గుద్దినట్టు రాయడం ఆయన ప్రత్యేకత. 'బుద్ధి చెప్పువాడు గుద్దితేనేమయా' అన్న వేమన అభిప్రాయాన్ని అక్షరాలా అమలు చేసిన పత్రికా రచయిత ఆయన. 'ఎడిటరైన వాడు బిడియము చూపుచో ధాటి తగ్గు వృత్తి ధర్మమందు, కడుపుకూటి రాత కక్కుర్తి రాతరా' అంటూ తోటి రచయితలనూ, భావి సంపాదకులనూ హెచ్చరించిన యోధుడు నార్ల. ఆయనకు సంపాదకత్వం వారసత్వంగా వచ్చింది కాదు. అహరహం శ్రమించి, కఠోర తపస్సు చేసి సాధించుకున్నది. కష్టించి పనిచేసే స్వభావం, వృత్తిపట్ల అపారమైన గౌరవం, గర్వం ఆయనను సమున్నత స్థానంలో నిలిపాయి. 'విరామమెరుగని రాక్షసుడు నార్ల' అని ప్రఖ్యాత సంపాదకుడు ఖాసా సుబ్బారావు అభివర్ణించడానికి కారణం అదే. నార్ల నిరంతర

అధ్యయనశీలి. సత్యాన్వేషి. సంపాదకీయాలలో 'మేము' అని రాయడం ద్వారా సంపాదకుడికి ప్రత్యేకమైన గౌరవాన్ని ఆపాదించే ప్రయత్నం ఉంది. సంపాదకీయంలో వెలిబుచ్చే అభిప్రాయాలు ఒక్క సంపాదకుడివే కావనీ సంపాదక మండలివనీ చెప్పాలన్న అభిలాష కూడా ఉంది. గాంధీ నిర్యాణం చెందినప్పుడు 'ఆంధ్రప్రభ'లో మహాత్ముడి చిత్రం కింద 'నాడు ఏసుక్రీస్తు శిలువకు బలి, నేడు మహాత్ముడు తుపాకీకి బలి' అనీ, 'ఇక లేడు, మరి రాడు' అనీ నార్ల రాసిన వాక్యాలు తెలుగు పత్రికా రచనలో కొత్త ఒరవడికీ, ఉరవడికి శ్రీకారం చుట్టాయి. ఈరోజు తెలుగు పత్రికలలో, టీవీ న్యూస్ ఛానళ్లలో కనిపిస్తున్న మెరుపులన్నిటికీ మూలం అదే. గాంధీజీ కాలం చేసినప్పుడు నార్ల రాసిన సంపాదకీయం నాటి పాఠకుల కంట తడిపెట్టించి ఉండాలి. నెహ్రూ అస్తమించినప్పుడు 'ఆంధ్రప్రభ' ప్రచురించిన సంపాదకీయాన్ని చదివి వేటూరి ప్రభాకరశాస్త్రి సంపాదకీయ రచయితకు నమస్కారం చేశారంటే ఆయన ఎంతగా చలించిపోయారో ఊహించుకోవచ్చు.

నార్లకు బలహీనతలు లేవని కాదు. ఆయనలో ఆత్మాశ్రయ ధోరణి తరచుగా ఆధిపత్యం చేసిన మాట నిజమే కావచ్చు. తాను అభిమానించేవారిని ఆకాశానికెత్తుతూ, వ్యతిరేకించేవారిని పాతాళానికి తొక్కుతూ రచనలు సాగించారన్న ఆరోపణా లేకపోలేదు. 'ప్రజాస్వామ్య సామ్యవాదాన్ని (డెమొక్రాటిక్ సోషలిజం) విశ్వసిస్తూనే కమ్యూనిస్టులపైన (1955) దాడి చేసిన వైనం సరేసరి. కానీ ఆయన శక్తిమంతమైన వ్యక్తిత్వం ముందు ఈ ప్రతికూలాంశాలు నిలువజాలవు. ఒక పత్రికా సంపాదకుడికి ఉండవలసిన మంచి లక్షణాలలో అత్యధిక భాగాన్ని పుణికిపుచ్చుకున్న వ్యక్తి నార్ల. నవ్యతనూ, నాణ్యతనూ మేళవించి తెలుగు పత్రికారంగానికి శోభ తెచ్చిన సంపాదకుడు ఆయన. జాతి, వర్ణ, మత, కుల, వర్గ విభేదాలకు అతీతుడైన మానవుడిలాగా మానవీయ వ్యవస్థకోసం పరితపించిన విశ్వజనీన రచయిత. సాటిలేని మేటి సంపాదకుడు. రచయితలకు, ముఖ్యంగా పత్రికా రచయితలకు చిరస్మరణీయుడు, స్ఫూర్తిప్రదాత, తెలుగు పత్రికా నౌకకు దిక్సూచి.

కొండుభట్ల రామచంద్రమూర్తి. *చిరకాలంగా తెలుగు పత్రికారంగంలో నవ్యపథాన్ని అన్వేషిస్తున్న పత్రికా రచయిత. చిరకాలంగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో సంపాదకత్వం వహించి, ఆ పత్రికను మునుపెన్నడూ లేని రీతిలో నవ్యపథంలో తీర్చిదిద్దారు. ఆంధ్రుల అభిమాన పత్రికగా రూపొందించారు. గత సంవత్సరం ఆంధ్రజ్యోతి దినపత్రిక నుంచి ఉద్యోగ విరమణ చేసిన పిదప హెచ్.ఎం. టి.వి. ప్రధాన సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు. నార్ల అనుయాయులుగా ఉన్నారు. నార్ల భావాలను, విధానాలను అర్థంచేసుకుని ప్రభావితులైనవారిలో వీరు ఒకరు. పత్రికా రంగంలో వీరి కృషికి గుర్తింపుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాన్ని ఇచ్చారు.* ★



సాహిత్యవేత్తగా నార్ల

– నాగళ్ల గురుప్రసాదరావు



బహుముఖప్రజ్ఞ కలిగిన నార్ల వెంకటేశ్వరరావుగారు (1908–1985) ప్రసిద్ధికెక్కిన పత్రికా సంపాదకుడు. దైనందిన సమస్యలను గూర్చి, భారతదేశం ఎదుర్కొన్న చావుబ్రతుకుల సమస్యలను గూర్చి వారు రచించిన సంపాదకీయాలు ఆనాటి పాఠకులను విజ్ఞాన వంతులను చేసి వారికి ముందుకు సాగిపోదగిన తిన్నని బాటను చూపాయి.

వాటిల్లో భాషాభావాల దాంపత్యం ముచ్చటగా ఉండేది. నార్ల ప్రజాభాషకు ప్రాణం పోశారు. మాండలికాలకు మర్యాద దక్కునట్లు చేశారు. వారన్నట్లుగా దైనందిన సమస్యలను గూర్చి వ్రాసిన సంపాదకీయాలు మరుసటిరోజుకు చద్దికూటి క్రింద జమ కావచ్చు. అయినవి కూడా. కాని భారతజాతి తాడో పేడో తేల్చుకోవలసిన ప్రొద్దు దాపురించినప్పుడు నార్ల రచించిన సంపాదకీయాలు ఈనాడు కూడా చదవదగినవే. ఇప్పుడు కూడా వాటిల్లో వారు చెప్పిన మాటలు తలదాల్చదగినవే. పతనమైన ఈనాటి భారతదేశాన్ని చూసినప్పుడు ఇకముందు కూడా ఆ మాటలకు విలువ ఉంటుంది. సందేహం లేదు. నార్ల దూరదృష్టి కలిగిన నవయుగ మేధావి.

నార్ల కేవలం పత్రికా సంపాదకుడే కాడు. ఉపజ్ఞతో ఆలోచనామృతంగా ఉండే సాహిత్యాన్ని సైతం సృష్టించిన కావ్యకర్త కూడా. వారు ఏకాంకికలకు నవీనాంధ్ర సాహిత్యంలో సుస్థిరస్థానం ప్రాప్తించేటట్లు చేశారు. పురాణేతిహాసాల్లోని కథలను తీసికొని కొత్త పోకడలతో వ్యాఖ్యానం చేస్తూ నాటకాలు సృజించారు, గేయాలు రచించారు. నవయుగ వేమనగా "నవయుగాలబాట" సృష్టించారు. కాలక్షేపపు కబుర్లా అని భావించే రచనల్లో కూడా జ్ఞాన ఆలోచనలను ప్రేరేపించే నిజాలు చాటారు. విజ్ఞానాలను ప్రసాదించే వ్యాసకర్తగా, గ్రంథసమీక్షకుడుగా రాణించారు. సభల్లో చర్చాగోష్ఠుల్లో,

విశ్వవిద్యాలయాల్లో చేసిన ప్రసంగాల్లో భారతీయ సంస్కృతి బండారం బయటబెట్టారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ వెంకట అప్పారావు, వేమన – ఈ ముగ్గురు భారతీయ సాహిత్య నిర్మాతలను గూర్చి ప్రామాణిక గ్రంథాలు రచించారు. కన్యాశుల్కాన్ని సంక్షిప్త పరిచారు. "Gods, Goblins and Men", "Man and his World" అనే రెండు ఆంగ్ల రచనలూ సర్వతోముఖమైన నార్ల ఆలోచనలకూ, అభిప్రాయాలకూ, సారస్వత సాహిత్య పఠనకూ దీపం పట్టున్నాయి. వారు ఆంగ్లాంధ్ర భాషల్లో రచనలు గావించి "ఉభయ రచయితలకు మిత్రు" డయ్యారు.

ఇంత ఎక్కువగా ఇన్ని రకాల రచనలు చేసిన నార్ల మనస్తత్వం, హృదయ ప్రవృత్తి ఎటువంటివి? ఈ రెండింటినీ వారి రచనలు ప్రతిబింబిస్తున్న మాట నిజమే. అయితే మనస్సునూ, హృదయాన్నీ శాసించే శక్తులుంటాయని మనం మరచిపోగూడదు.

ఆ శక్తులే విశ్వాసాలనీ, సిద్ధాంతాలనీ మనం చెప్పుకోవచ్చు. ఈ రెండూ రచయిత జీవితాన్ని, దానిని ఆధారం చేసుకుని అవతరించే సాహిత్యాన్నీ పరిపాలిస్తుంటాయి. నార్ల తన విశ్వాసాలనూ, సిద్ధాంతాలను ఆవిష్కరిస్తూ చెప్పిన మాటలు ఉదహరిస్తే వారి వ్యక్తిత్వం ఎటువంటిదో మనకు తేటతెల్లమవుతుంది. వారు ఈవిధంగా తన్నుగూర్చి చెప్పారు.

"I am a rationalist and a humanist. I have faith in man and his progress. He may often err; he may be guilty of such barbarities as racialism, Communalism and Casteism; he may even indulge in such Colossal crimes as the two global wars that ravaged the world in my own lifetime; he may at times feel, as he is doing now, utterly bewildered and lost; but nothing can shake my faith in human perfectibility and human progress".

Without this faith man's life would be no better than that of any, animal......'

(Traditional Indian Culture & Other Essays, Preface)

హేతువాదీ, మానవతావాదీ అయిన నార్ల గుణదోషాల మిశ్రమ ప్రకృతి గల మానవుని పట్ల అచంచల విశ్వాసం ప్రదర్శించారు. మానవుడే ప్రపంచ వృత్తానికి కేంద్రబిందువనీ, అతని పురోగతికి అతడే మూలకారకుడనీ వారు దృఢంగా విశ్వసించారు. మానవుడే సంస్కృతి సృష్టికర్త. ఆ సంస్కృతి లక్షణాలెటువంటివో వారే స్పష్టంగా వివరించారు.

(...... Culture is that which helps the inner growth of man, conditioning at the same time his reactions to, and relationships with, the outside world, and through the man in the aggregate putting its own desk and unmistakable stamp on the social, national or martial group to which he belongs......" *(Ibid, page 4.)*

"It is not easy to define culture, but broadly it is that intangible thing which makes man more tolerant, more liberal, more kind, more unselfish, more given to higher impulses and aspirations, and altogether a better man" (Gods, Goblins and Men, Page 38.)

సాహిత్యం సంస్కృతిలో ప్రధాన భాగం అని మనం మరచిపోగూడదు. సంస్కృతి ప్రయోజనాల్లో చాలవరకు సాహిత్యం వల్లనే లభిస్తాయనడం అతిశయోక్తి కాదు.

గ్రంథ, నార్ల జ్ఞాన ప్రపంచం బహుధా విశాలమైంది. వారి పఠనాభిలాషకు పొలిమేరలు లేవు. గ్రంథాలు సేకరించి, వాటిని ఆమూలాగ్రంగా చదవడం వారికి నిత్యకృత్యమైంది.

"To live with great books is to roam over the past, to commune with the present and envision the future".

"The larger the number of books you possess the greater is the number of master spirits whom you have at your beck and call, to stimulate your mind to refine your emotions, to sharpen your sensibities, to stritch your perceptions and to give a direction, a purpose and a meaning to your life".

"Books that are meant to kill time also kill your good laste and finer sensibilities." *(Man and his World, Pages 100, 125)*

ఈ అభిప్రాయాలు నార్ల పఠనానుభవాన్ని సూచిస్తున్నాయి. వారు పాశ్చాత్య సాహిత్య గ్రంథాలను కూలంకషంగా పఠించారు. ఆంధ్రానువాదరూపంలోనయినా, పురాణేతిహాసాలనూ, సంస్కృత సాహిత్యాన్నీ సవిమర్శకంగా చదివారు. వీటిని గూర్చి వారు రాసిన సంపాదకీయాలు, వెల్లడించిన అభిప్రాయాలూ నా మాటలకు తార్కాణాలు. వావిళ్లవారు ప్రకటించిన యథామూల

రామాయణాను వాదాన్ని వారేవిధంగా చదివారో, చదివినప్పుడు తనకు తోచిన అభిప్రాయాలను, ఆయా పుటల్లో ఎలా రాసుకున్నారో నాకు ఎరుకే. రామాయణంలోని ప్రధాన పాత్రలను గూర్చి వారు ఈవిధంగా నిర్ణయాలు చేశారు. రామాయణ పతనానికి ఫలములే "జాబాలి", "సీతజోస్యం". డాక్టర్ జి.వి. కృష్ణరావు భావించినట్లుగా నార్ల రూపకతత్త్వజ్ఞుడు.

నార్ల ప్రాచీనాంధ్ర సాహిత్యాన్నీ, నవీనాంధ్ర సాహిత్యాన్నీ తలస్పర్శిగా పఠించారు. వారు రచించిన వ్యాసాల్లో ప్రాచీన కావ్యాల్లోని పద్యాలూ, చాటువులూ ఎన్నో చూస్తాం. వారు లోతుగా చదివి, తన అభిప్రాయాలను అక్కడక్కడా లిఖించిన కళాపూర్ణోదయ కావ్యాన్ని నేను చూశాను. 'తిక్కన్న పేరు తెలుగు జాతి మహాకవికే చెల్లింది" (కదంబం, పుట 138) అని వారు నిగ్గుతేల్చారు. అయినప్పటికీ వారు ...

To a critical and unconventional mind Rama is not 'the best among men'. Bharata has greater nobility, and Lakshmana is certainly more lovable. And towering over every other character in the RAMAYANA is Sita, the embodiment of beauty, charm and grace of frankness and courage, of dignity and nobility; and she and not Rama, is the best of human beings". *(Gods, Goblins and Men, Page 135)*

ఒకసారి నేను వారితో మాట్లాడుతున్నప్పుడు ఆ "మహాకవిని" విమర్శించారు. వారి విమర్శకు కారణమయిన ఘట్టం విరాటపర్వం మొదటే ఉంది. ఆ ఘట్టంలో పాండవులూ, ద్రౌపదీ, విరాటరాజు కొలువులో ఏరూపంతో చేరాలో నిర్ణయించుకున్నారు. అయితే వారు ఈ నిర్ణయాలు చేసుకున్నప్పుడు వంటలవారూ, మహాసాధ్యకులూ, ద్రౌపది పరిచారికలూ, ఇంద్రసేనాది సారథులూ వారి దగ్గరనే ఉన్నారు. వీరందరిముందూ అజ్ఞాతవాస విషయం చర్చకు రావడం నార్లకు సముచితమనిపింపలేదు. అందువల్ల "తిక్కన ఏమంత గొప్ప మనస్తత్త్వ శాస్త్రవేత్త? పాండవులు భార్యతోపాటు మత్స్యరాజాస్థానంలో ఉన్నారనే రహస్యం అక్కడ ఉన్నవారిలో ఎవరైనా బయటపెడితే ఏం జరిగేది?" అని అన్నారు. నేను "ఈ ప్రకరణంలో తిక్కన అభ్యంతర పరివారంబు" అని ప్రయోగించాడు. అందువల్లనే విశ్వాసపాత్రులైన దాసీదాసజనులదగ్గర అజ్ఞాత వాసాన్ని గూర్చి చర్చించడం సంభవించింది" అని అన్నాను. వారు నవ్వారే తప్ప ఇంకేమీ అనలేదు.

సంస్కృతాంధ్రల్లోని సారస్వతాన్నీ, సాహిత్యాన్నీ స్వయంగా చదవడమే కాకుండా, వాటిని పరిశోధించి ప్రాచ్య పాశ్చాత్య పండితులు రచించిన ఉత్తమ గ్రంథాలను కూడా నార్ల లెస్సగా

పరిశీలించారు. వారు రచించిన ఆంగ్లాంధ్ర రచనల్లో వారి పరిశీలనలనూ, సమీక్షలను మనం చూడవచ్చు. ఉదాహరణకు ఎన్.జి. కంతవాలా పరిశోధన గ్రంథం "కల్చరల్ హిస్టరీ ఫ్రం ది మత్స్య పురాణ"ను చూపవచ్చు *(కదంబం, పుట 147).* ఈ రకమైన పరిశోధన గ్రంథాల్లో భారతీయ సారస్వత సాహిత్యాలను "పాడిందే పాడరా" అనే ధోరణిలో కాకుండా, విమర్శించేవి అయితే నార్లకు నచ్చుతాయి.

అయితే ఆ విమర్శకుల రాతల్లోని సత్యాసత్యాలను గుర్తించడానికి మూలగ్రంథాలను ఒక్కొక్కసారి పాఠకులు పరిశీలింపవలసి ఉంటుంది. అలాంటి పరిశీలన చేయడానికి నార్లకు సమయం చిక్కలేదు. దీనికి ఉదాహరణగా డి.డి. కోశాంబి సంస్కృత వ్యాకరణాన్ని గూర్చి, ఎ.బి.కేత్ దొరగారు సంస్కృతాలంకార శాస్త్రాన్ని గూర్చి చెప్పిన మాటలు తార్కాణించి నార్ల ఆ రెండు శాస్త్రాలను గురించి చేసిన నిర్ణయాలను పేర్కొనవచ్చు. *(Gods, Goblins and Men, Page. 178)* సందర్భం వచ్చింది కాబట్టి ముందుగా రెండు మూడు మాటలు చెప్పాలి. సంస్కృత వ్యాకరణాన్నీ, సంస్కృతాలంకార శాస్త్రాన్ని ప్రశంసించిన ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసులు ఎందరో ఉన్నారు. ఆ రెండు శాస్త్రాల గ్రంథాలను తను మాతృభాషలకు అనువదించుకున్న పాశ్చాత్య పండితులూ ఉన్నారు. నార్ల వారి గ్రంథాలను కూడా చదివి ఒక నిర్ణయానికి వచ్చినట్లయితే బాగుండేది. పాణినితో సంస్కృత వ్యాకరణ రచన ఆగిపోలేదు. కాత్యాయనుడు మొదలైనవారు దానిని విస్తృతపరిచే ప్రయత్నాలు చేశారు. చారిత్రక కారణాల వల్ల దాని పెరుగుదల ఆగిపోయింది. ఇక అలంకారశాస్త్రమంటారా? నాయికా నాయక విభేదాల గుణదోషాల – శబ్దార్థాలంకారాల పట్టికలే అలంకార శాస్త్రాలుగావు. అతి ప్రధానమైన "కావ్యాత్మ" విచారం వాటిల్లో ఉంది. రస–ధ్వని సిద్ధాంతాలకు కాలక్షతి లేదు. అలంకార శాస్త్రాన్ని ఎదుట బెట్టుకొని కావ్యాలు రచించిన కవులకు ఎవరూ పెద్దపీట వేయలేదు. వారి కావ్యాలు సాహిత్య చరిత్రకెక్కడానికి మాత్రమే పనికివచ్చాయి. వ్యాకరణాలంకార శాస్త్రాలనుగానీ, సాంఘిక శాస్త్రాలను గానీ పట్టుకొని వేళ్లాడుతూ, అవి వేదతుల్యాలని సంభావించే అవివేకులు అన్ని కాలాల్లోనూ, అన్ని దేశాల్లోనూ ఉంటారు. పాశ్చాత్య దేశాలకు సంబంధించిన సాహిత్యాన్నీ, కళాసాహిత్య సిద్ధాంతాలను కాచి వడపోసిన నార్లకు ఈ సత్యం అనుభవానికి అందనిదేమీ కాదు. వాటి విమర్శ వారి రచనల్లో కావలసినంత ఉన్నది.

చాలామంది సాహిత్య పరులమాదిరిగా వికర్ణుడు కర్ణుని కొడుకు కాదు అని నార్ల అనుకున్నారు *(కొత్తా–పాతా, పుట 226).* వికర్ణుడు ధృతరాష్ట్రుని కుమారుడు. మానవతావాదీ, హేతువాదీ, నవీనతావాదిగా పేరుగాంచి, జీవించినంతకాలమూ వేలకొలది వివిధ గ్రంథాలు చదివి, విజ్ఞాన నిధి అయినవారూ, ఆంగ్లాంధ్ర సాహిత్యాల్లో అవధులు లేని వ్యుత్పత్తి ఆర్జించి, ఆంధ్రాంగ్లాల్లో విభిన్న సాహిత్య ప్రక్రియలు రచించినవారూ, నవీనాంధ్ర సాహిత్యాన్ని సుసంపన్నం చేసినవారూ అయిన నార్ల "సాహిత్యవేత్త" అని అనుకోవడం అవిచారమూలకం కాదు. వారి రచనలే వారిని సాహిత్యవేత్తగా

నిరూపిస్తున్నాయి. అంతేకాదు, ఆ రచనల్లో ఎడనెడా నార్ల సాహిత్యసిద్ధాంతాలు గోచరిస్తున్నాయి. వాటిని ప్రామాణికాలుగా భావించి సాధనాలుగా చేసుకుని సాహిత్యవేత్త అయిన నార్లను దర్శింపవచ్చు. కావ్యాల సమూహమే సాహిత్యం. కావ్యం భిన్నభిన్న ప్రక్రియల రూపంలో ఉంటుంది.

సాహిత్యం, సంగీతం మొదలైన లలితకళలకు ప్రజల జీవితంతో అవినాభావ సంబంధం, ఉన్నదని నార్ల సిద్ధాంతం. ప్రజల బాహ్యాభ్యంతర జీవితాలను వర్ణించి, వాటికి ఒక రూపం, ఒక గమ్యం నిర్దేశింపగలిగినవీ, ఒక అర్థాన్ని కలిగింపగలిగినవీ, ఒక సార్థక్యాన్ని సమకూర్చగలిగినవీ లలితకళలే *(కదంబం, పుట 117).*

కూటికీ గుడ్డకూ గూటికీ కొదువలేని, ఆర్తికి ఆలయంగాని నూతన వ్యవస్థ అవతరించాలంటే, శాంతి సౌభ్రాత్రాలకు నిలయమైన నూతన సమాజం రూపొందాలంటే సాహిత్య సంస్కృతి రంగాలలో నవచైతన్యం తప్పక కానరావాలి. ఇది మన దేశవిషయంలోనే కాక, సర్వదేశాల విషయంలోనూ తిరుగులేని నిజం. సర్వ కాలాలకు సమన్వయించే సత్యం. ఐరోపా దేశాలు మధ్యయుగం నుండి నవయుగంలో ప్రవేశించడానికి ముందే సాహిత్య కళా–సంస్కృతిరంగాల్లో నవ వికాసాన్ని పుష్కలంగా అనుభవించాయి. భారతదేశంలో కూడా నూతన వ్యవస్థ ఆవిర్భవించడానికి ఆవశ్యకాలైన శక్తినీ, విశ్వాసాన్నీ సమకూర్చే మహాకవులూ, వాగ్గేయకారులూ, కళాకోవిదులూ ముందుకు రావాలి *(కదంబం, పుట 113.)*

సాహిత్యానికి సరిహద్దులు లేవు. దేశాల, భాషల పొలిమేరలు దానిని బంధింపలేవు. హోమర్, వాల్మీకి విశ్వమహాకవులు. కాళిదాసు, షేక్స్పియర్ ప్రపంచ నాటక కర్తలు. సాహిత్యం జాతి మత – వర్ణాది భేదాలను అతిగమించినట్టిది. మిల్టన్ రచించింది క్రైస్తవ మతకావ్యం. రామాయణ కథలతో భవభూతి నాటకాలు రచించాడు. ఇద్దరి కావ్యాలనూ అన్నిదేశాలవారూ చదివి ఆనందిస్తున్నారు. అయితే కొన్నిదేశాల సాహిత్యాలు మనలను త్వరగా ఆకర్షిస్తాయి. దీనికీ కారణం ఆసాహిత్యాల సృష్టిని ప్రేరేపించిన సామాజిక స్థితిగతులూ మన సాంఘిక పరిస్థితులూ సమానంగా ఉండటమే *(కదంబం. పుట. 94)*

సాహిత్యమంటే శిష్టసాహిత్యం మాత్రమే కాదు. కొన్నేండ్ల క్రిందటిదాకా అనాదృత వాఙ్మయంగా అణగారిన జానపద సాహిత్యం కూడా ఏ జాతిసాహిత్యంలోనైనా పెద్ద భాగమే. అందుచేత సామాన్య ప్రజల జీవితాలను ప్రతిబింబిస్తూ, జానపద సాహిత్య ప్రక్రియలై, తరతరాల నుండి మనకు సంక్రమించిన తుమ్మెదపదాలు కోతపదాలు, రోకటిపాటలు, పెండ్లిపాటలు, భోజన పాటలు మొదలైనవి

సేకరించి కాపాడుకోవాలి. ఇవి సంగీత, సాహిత్య కళలకు రెండింటికీ ప్రయోజనకరం. *(కదంబం, పుట 117).*

కాలానుగుణంగా సాహిత్యం రూపొందుతుంది. రాజులు కాలం నాడు వారి, వారి ఆస్థాన పండితుల అభిరుచులకు తగినట్టుగా సాహిత్యం జనించింది.

ఈసాహిత్యంలో పురాలకు తప్ప పల్లెలకు చోటులేదు. సామాన్య ప్రజలు కనబడరు. కనబడినప్పుడు మూర్ఖులుగానో, జారచోరులుగానో ఉంటారు. ప్రాచీన కవులు యుగధర్మాన్ని గుర్తించి, తదనుగుణంగా రచనలు కొనసాగించారు. ఇందువల్ల మనం వారిని “నిరసించరాదు సరికదా నెత్తిని పెట్టుకోవాలి. రాజరికం ఆనాడు ప్రగతి శక్తి అని మనం గుర్తుంచుకోవాలి. అయితే మనది ప్రజాస్వామ్య యుగం. ఈ యుగానికి అనుగుణమైన సాహిత్యం ఈనాడు ఎలమీదికి రావాలి. రావాలంటే కవులు సామాన్య ప్రజల జీవితాలతో మమేకం కావాలి. ప్రజాభాష ప్రయోగించాలి. బెర్నార్డ్ చెప్పినట్టు కొత్తచూపు లేనిదే కొత్త సాహిత్యం రాదు". *(1950 లో మంచిర్యాలలో చేసిన ప్రసంగం, కదంబం పుటలు 39-48).*

ఏది కవిత్వం? ఏది కావ్యం? కావ్యం వల్ల కలిగే ప్రయోజనాలు ఏవి? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి అన్నిదేశాల్లోనూ, అన్ని కాలాల్లోనూ ప్రసిద్ధికెక్కిన సాహిత్య శాస్త్రవేత్తలు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ ప్రయత్నాలు భారతదేశంలో గాఢమైన చర్చలకు దారితీశాయి. చివరకు జగన్నాథ పండితుడు చెప్పిన "రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దమే కావ్యం" అనే నిర్వచనం ఎదురులేనిదయింది. నవయుగ సాహిత్యవేత్త అయిన నార్ల కూడా ఈవిధమైన చర్చలు చేశారు. గద్యపద్య భేదాలను చక్కగా వివరించారు. వారు చెప్పిన మాటలివి.

"Giving new shades of meaning to words new cadences to language, new edges to sensibilities, new glimpses of truth and generally bibifying life – this is the true mark of great party.

Unseen beauties, unheard melodies, unfelt emotions, uncalled experiences, ungrasped meaning of life, making all these and much else manifest to us – that is the function of truly great poetry.

Prose that conveys more than one meaning is bad prose. Poetry that fails to imply a hundred meanings is bad poetry.

Poetry is the best medium for refining our sensibilities; an equally good medium for shapening our intellect is prose. Only a great master can use either of them to serve both the purposes, but such masters are extremely rare". *(Man and his World, Page 80)*

కవిత్వానికీ పాండిత్యానికీ ఉన్న సంబంధాన్ని గూర్చి ప్రాచీనకాలం నుండి మొన్న మొన్నటిదాకా వాదాలు జరిగాయి. ఆలంకారికులు చేసిన 'రీతి' చర్చలు దీనితో ముడిపడినట్టివే. రీతికి బదులుగా ఇప్పుడు "శైలి" అనే పదాన్ని వాడుతున్నాం. రసోచితమైన శైలి కావ్యసౌందర్యాన్ని పెంచుతుందని వారి సిద్ధాంతం. శృంగార, కరుణ రసాలరీతి వేరు. వీర, రౌద్ర రసాలశైలి వేరు. అసందర్భంగా పాండిత్య ప్రకర్ష చూపిన కవులను అలంకార శాస్త్రవేత్తలు తూర్పారబట్టారు.

"నార్లవారి సిద్ధాంతాలు ప్రాచీనాలంకారికుల చర్చలకు పూర్తిగా భిన్నం. అవి నవయుగానికి ప్రజాస్వామ్య యుగానికి అనుకూలంగా ఉన్నాయి. కవిత్వం చదివిన వెంటనే అర్థం గావాలని వారి తీర్పు. "కవిత మహా సున్నితమైన ప్రాణి. దానిపై పాండిత్యం బరువు పడితే, అది అప్పచ్చిలా నేలకు అంటుకుపోతుం" దనీ, "కవితాపాండిత్యాలలో కలకాలానికీ కవితకే నాచోటు" అని స్పష్టంగా చెప్పారు. ద్రౌపది కీచకునికి తన భర్తల పరాక్రమాన్ని గూర్చి చెప్పినప్పుడు తిక్కన దీర్ఘ సంస్కృత సమాసంతో కూడిన "దుర్వారోద్యమ బాహువిక్రమ... ' అనే పద్యాన్ని రచించాడు. కీచకుడు ద్రౌపదిని పరాభవించటం చూచిన భీముని రూపాన్ని వర్ణిస్తూ రచించిన పద్యంలో కవిబ్రహ్మ "నితాంత దంతపీడన రోదాస్యరంగ... ..." అనే సమాసాన్ని కూర్చాడు. ఈ తీరు నార్లకు నచ్చలేదు. కాని కుంతి సహదేవుణ్ణి ద్రౌపదికి అప్పగించునప్పుడు "కడు పసిబిడ్డ, వీడొకటి కాదవునా నెరుగండు..." అని పొడిపొడి తెలుగుమాటలతో తిక్కన రచించిన చంపకమాల వారిపాలిటికి కవితాసువాసనలు గుభాళింపజేసింది.

"ప్రబంధాలలో అక్కడొక పంక్తిలో, ఇక్కడొక పద్యంలో పెల్లుబికేకవిత్వం నాకు జానపద గేయాలలో ప్రత్యక్షరంలోను దివ్యదర్శనమిస్తుంది" అని నార్ల అన్నారు. వారెంతదూరం పోయారంటే ...

"పెద్దనామాత్యుని మనుచరిత్ర తాళపత్రగ్రంథరూపంలో ఉండగా చెదపట్టిపోయి మనకు దక్కకుండా పోయినా నేను శోకించి ఉండేవాడినికానుగాని, తొలకరికి పడుచుపిల్ల –

"తొలకరి ఒకమబ్బు తొంగిచూచింది
మబ్బులో ఒకమెరపు మెరసిపోయింది

అని బావను తలచుకొని పాడేపాట కాలగర్భంలో కలిసిపోతే మాత్రం ఎంతో విచారపడే వాడిని.” అని ఖరాఖండిగా చెప్పారు. *(కొత్తా-పాతా, పుటలు 106-110)*

ఇక్కడ ఒకటి రెండు మాటలు చెప్పాలి. రకరకాల భావాలు వెల్లడించటానికి మానవుడు రకరకాలుగా మాటాడతాడు. ప్రేమ, కోపం, ఉత్సాహం మొదలైన భావాలను వ్యక్తీకరించే సమయంలో మానవులు ఉపయోగించే పదాలూ, వాటిని వ్యక్తీకరించే విధానమూ భిన్నంగా ఉంటాయని పరిశీలింప గలిగిన వారికందరికీ తెలియని గుట్టు కాదు. అన్ని సందర్భాలలో మానవుడు ఒకే తీరుగా మాటాడటం అతని స్వభావానికే విరుద్ధం. కవితా శిల్పవేత్తలయిన కవులు రసోచిత శైలిని ప్రయోగిస్తారు. అస్థానఫలితంగా ఏ కవి అయినా సంస్కృత పాండిత్యాన్ని ప్రదర్శిస్తే దానిని మెచ్చుకొనేవాడు శిల్పరహస్యం తెలియని బాలిశుడని ఉపేక్షించడం మంచిది.

గేయకవిత్వంలో పాండిత్య ప్రకర్షకు అవకాశమే లేదు. దానిని చదివిన వెంటనే రసానుభూతి పొందగలం. మఱి కథాకావ్యాల స్థితి వేరు. వీటిల్లో విభిన్న సందర్భాలూ, ఆ సందర్భాల్లో పరిపరి విధాలుగా భాషించే పాత్రలూ పొడుకొంటాయి. అక్కడ రసానుగుణమైన రీతి తప్పదు.

జానపద సాహిత్యంలో వీరకథలున్నాయి. వాటిల్లోని వీరరస సన్నివేశాలు చదివేవారికి వెంటనే బోధపడతాయి. కాని రసానుభూతి కలగదు. గాయకుడు పాడుతూ అభినయిస్తాడు కాబట్టి ప్రేక్షకులకు నిరాలస్యంగా వీరరసానుభూతి సిద్ధిస్తుంది. శిష్ట – జానపద సాహిత్యాలలోని శ్రవ్యకావ్యాల లక్షణాల గతులు వేరుగా ఉంటాయి.

నవీన కాలానికి అనుగుణంగా సాహిత్యం ఆవిర్భవించాలని నార్ల అభిప్రాయం. అనగా నవీనత్వానికి భాషాభావాలు నిలయం కావాలి. ఒక రచయిత వర్తమానకాలంలో జీవిస్తూ ఉండవచ్చు. అంతమాత్రాన అతడు నవీనుడు కానేరడు. అతనికి ముచ్చిలిగుంటలో కన్నులుండవచ్చు. అతని బుద్ధి భూతకాలం వైపు పోతూ ఉండవచ్చు. నార్ల తనయాంగ్లాంధ్ర రచనల్లో ఐదారు చోట్ల నవీనుణ్ణి గూర్చీ, నవీనత్వాన్ని గూర్చి వివరించారు.

"You are not a modern man simply because you are living in the modern age or because you are using the industrial products of that age; being modern has more to do with the modes of your thought, with the cultural values which you cherish and, above all, with the earnestness of your faith, not in a perfect God, but in the perfectability of man".

"....Modernism implies a clear break with customs, conventions, beliefs, traditions, in a word, with all that is absolete. But every such break need not necessarily be modern. Two instances for this are pop art and hippiedom. The first is a clear, even a biolent, break with traditional art, and the second, with the traditional way of life. Yet, both are, in form as well as in spirit, definitely aberrant, and they cannot therefore be accepted as a welcome departure from the past.

Modernism in its connect historical sense is something that is national, scientific, democratic, eagaltarian, and humanistic......" *(Gods, Goblins and Men, Pages 4, 36, 37)*

"......For progress there should be a constant break with tradition. The process need not always be sudden or violent. But whether sudden or gradual, violent or peaceful, there should be a clear break with tradition. In other words, either through revolution or reform modernity should constantly replace tradition... ..." *(Man and his World, Page 96).*

ప్రాచీనులు ప్రతిభా, వ్యుత్పత్తి, అభ్యాసమూ కావ్య కారణాలన్నారు. వ్యుత్పత్తి అంటే పాండిత్యమూ, లోకజ్ఞానము. భాష మీదా, కావ్యం రచించడానికి అవసరమైన శాస్త్రాలమీదా మంచి పట్టు కలిగియుండటం పాండిత్యం. లోకజ్ఞానం అంటే ఇహలోకానికి సంబంధించిన విషయాల పరిజ్ఞానం. ప్రాచీన కవుల వ్యుత్పత్తి చాలా గొప్పది. వారు స్వభాషయందూ, ఆవశ్యకమైన, తమకాలం నాటి శాస్త్రాలయందూ గొప్ప చొరవ ఉన్నవారు. దీనికి వారి కావ్యాలే సాక్ష్యాలు. నవీన రచయితలకు కూడా వ్యుత్పత్తి అత్యావశ్యకమే. సమకాలిక విషయాలకూ అక్కర కలిగిన శాస్త్రాలకూ సంబంధించిన విజ్ఞానాన్ని వారు తప్పక సంపాదించాలి. ఈ సత్యాన్ని నార్ల గుర్తించారు. సమకాలిక రచయితల వ్యుత్పత్తి రాహిత్యాన్నీ ఎత్తిచూపారు.

"Unfortunately the world of our writers is narrow; hence their contact with life is narrow. They know nothing or almost nothing of war, of seafaring, of adventurous travel, of mountaineering, of big game hunting, of international trade and commerce, of high finance, of the stock exchange, of

the art and craft of high diplomacy, of the underworld and its crime, of a thousand and one other things which lend colour, variety and complexity to life and make it now comic, now tragic, now ironic and tantalizing. And so they write of the only life they know, that is, the life of the stay–at–home middle class.

On the rare occasions when they venture to step out of their tiny little world, they falter and stumber, and make themselves indiculous". *(Gods, Goblins and Men, Pages 97,98)*

ఒకనాటి బెజవాడ, నేటి విజయవాడ సముద్రతీరంలో ఉన్నదని తన రచనలో ప్రస్తావించిన ఒక నవీన రచయిత భౌగోళిక పరిజ్ఞానం ఎటువంటి ఖండనకు గురయిందో నార్ల సంపాదకుడుగా ఉన్ననాటి “ఆంధ్రజ్యోతి" దినపత్రిక సంచికలు తిరగవేస్తే తెలుస్తుంది.

"లంకాపురిలో ఒక వాల్మీకి ఉంటే, రామాయణం ఏరూపాన్ని ధరించేదో!" *(కదంబం, పుట 142)* అని నార్ల అనుమానంతో కూడిన ప్రశ్న వేశారు. దీనివెనుక ఒక సాహిత్యసత్యం దోబూచులాడుతుంది. కవి దేశ కాలాలను బట్టి, అభిమానాన్ని బట్టి, అవసరాలను బట్టి కావ్యం రూపొందుతుంది. అతని అంతరంగం దానిలో అంతటా ప్రతిబింబిస్తుంది. చివరిమాట చెప్పాలంటే కవి ఆత్మీయతకు కావ్యం అద్దం పడుతుంది.


గమనిక : 1975–84 మధ్య నార్లగారి గ్రంథాలను విడివిడిగా ఆయా ప్రచురణ సంస్థలు ప్రకటించాయి. ఈ వ్యాసంలో నేనుద్ధరించిన వారి వాక్యాల అభిప్రాయాల పుటల సంఖ్య ఆ గ్రంథాలను అనుసరించి చూపాను.★

***నాగళ్ల గురుప్రసాదరావు**. వీరు జాతీయోద్యమానికి పురిటిగడ్డయిన గుంటూరు జిల్లా, కావూరు గ్రామంలో జన్మించారు. విజయవాడ, పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పదవీ విరమణ చేశారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠ కార్యదర్శిగా అపూర్వమైన, అనితర సాధ్యమైన రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలను అందిస్తున్నారు. సాహిత్యంలో 100కు పైగా వ్యాసాలు, 300కు పైగా గ్రంథ సమీక్షలు రాశారు. ఇద్దరు తెలుగు మహాకవులు, శాలివాహనుడు, కేంద్ర సాహిత్య అకాడెమి వారికి "తుమ్మల సీతారామమూర్తి" వీరి రచనలు. విమర్శలో తత్త్వదర్శనం తప్ప స్వప్రయోజనం కనిపించనీయని ఆదర్శ విమర్శకులు. నార్లకు సన్నిహితులు.★*

"ఎదల నేలు కవికి ఎదురెందులేదు"

నార్లమాట నవయుగాల బాట

–డాక్టర్ కడియాల రామమోహనరాయ్



నార్ల వెంకటేశ్వరరావుగారు కవిత్వసీమలోకి చాలా ఆలస్యంగా అడుగు పెట్టారు. ప్రముఖ దినపత్రిక 'ఆంధ్రప్రభ' సంపాదకునిగా విఖ్యాతి గడించిన తర్వాత నాటికలు, వ్యాసాలు రచించి రచయితగా ప్రసిద్ధులైన తర్వాత ఆణిముత్యాలవంటి పద్యాలు రచించారు. 1908లో జన్మించిన నార్ల తన తొలి కావ్యసంపుటి 'నార్లమాట'ను 1956లో ప్రచురించారు.

తెలుగులో ఆధునిక కవిత్వం భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం అనే రెండు మహాప్రవాహాలు తెలుగు సాహిత్యాన్ని రసప్లావితం చేస్తున్న సమయంలో నార్ల ఆ రెండింటిలో దేనితోను మమేకం కాలేదు.

లోక కవి వేమన నార్లవారి అభిమాన కవి. "ఏ ప్రమాణాలతో పరిశీలించినా వేమన మహాకవి అన్నది పరమ సత్యం. ప్రజాభిమానాన్ని ప్రసిద్ధిని బట్టి చూసినప్పుడు ప్రాచీనాంధ్ర కవులందరిలో వేమనను మించిన మేటికవి లేదు. అసంఖ్యాక ప్రజానీకంతో ప్రజల భాషలో మాట్లాడిన ప్రజాకవి వేమన. '*వాస్తవమ్ము నార్లవారి మాట* 'మకుటంతో వేమన పద్యరీతిలో నార్ల తన కావ్యసంపుటిని వెలువరించారు. తరువాత తన పద్యాల మకుటాన్ని 'నవయుగాల బాట నార్లమాట' అని మార్చి మరికొన్ని పద్యాలు రచించారు. వెయ్యి పద్యాలు రాయాలనుకున్నారుగాని 835 పద్యాలు మాత్రమే రచించారు.

నార్ల మానవతావాది; అనేక దేశ విదేశ భాషల సాహిత్య తత్త్వాలను అధ్యయనం చేసినవారు. సుదీర్ఘ సమాస భూయిష్ఠమైన కవిత్వం ఆయనకు ఇష్టం లేదు. తేటమాటలతో సుబోధకంగా సుందరమైన శైలిలో పద్యరచన చేయటం నార్లవారికి ఇష్టం. హేతువాదమూ, మానవతా ఆయన కవితకు రెండు కళ్లు.

వేమనలాగే నార్లవారి పద్యాలు కూడా "చిటుకలో ముగింపగల చిన్న పలుకులు; అచ్చతెనుగు పద్యపు నడక, గుండుదెబ్బ వలె గురితప్పని చిక్కని చెక్కిన మాటలు. నోరుగల తెలుగు వారందరును నేర్వదగినవి.

నార్లవారి పద్యాలలో లోకజ్ఞత, చమత్కారం, గడుసుదనం, వ్యంగ్యం, హేతువాదం, నీతి బోధ పుష్కలంగా ఉన్నాయి. సమాజంలో ఉన్న మతం, కులం, స్వేచ్ఛ, సమత, సైన్సు, శీలము, సోషలిజము లాంటి అంశాలపై వీరికి స్వతంత్రమైన అభిప్రాయాలున్నాయి. వాటిని లాగి విడిచిన ఎదలు నేలు కవికి ఎదురెందులేదు.

బాణంలాగ గుండెకు తగిలేటట్లుగా చెప్పగల నేర్పు ఉన్నది. "బుద్ధి చెప్పువాడు గుద్దితే నేమయా!" అని వేమన అన్నట్లు నార్లకూడ లోకరీతిని నీతిని చెప్పేటప్పుడు కొన్నిచోట్ల ముక్కుమీద గుద్దినట్లు చెప్పారు.

స్వేచ్ఛా సమానత్వాలు నార్లవారికి ప్రియతమమైనవి :
"గెలుచుకొన్న పిదప నిలుపుకొన్నదె
స్వేచ్ఛ నియతిలేని స్వేచ్ఛ నిప్పుతో చెర్లాట" అన్నారాయన.
"స్వర్గలోకమందు పారతంత్రము కంటె
నరకమందు స్వేచ్ఛమెరుగు సుమ్మ

ఈడులేదు స్వేచ్ఛ కీరేడులోకాల" అనే భావం మిల్టన్ మహాకవి Better to reign in Hell than to serve in Heaven" అన్న తలపును జ్ఞాపకం చేస్తుంది.

"అంతరంగమందు అంతరించిన స్వేచ్ఛ
బాహిరిల్లగలదెబ్రతుకునుండి
ఊటలేనిబావినీటి తో తొణకునా?"
అనే పద్యంలో సొగసుగా విన్పిస్తుంది.

ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భంగం వాటిల్లటాన్ని నార్ల తాను సంపాదకుడిగా ఉండగానే అనుభవించారు. 1975లో ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఆత్యయిక పరిస్థితిని విధించినపుడు పత్రికా స్వేచ్ఛను, సభను దీర్చు హక్కును ప్రజలు కోల్పోయారు. 'నవయుగాల బాట' మూడవ కూర్పు పీఠిక (1984)లో నార్ల ఆనాటి పరిస్థితిని గూర్చి "పోయిన పదేళ్లలో నా మానవతా వాదాన్ని పరీక్షకు పెట్టిన సన్నివేశాలకు లెక్కలేదు. అవి వ్యక్తిగతమైన సన్నివేశాలే కాదు, సంఘపరమైనవి కూడ. అవి నా మనస్సును కలతపరచాయి. నా హృదయాన్ని గాయపరచాయి. నా కళ్ళకు నిద్రను దూరం చేశాయి. నాలోని ప్రతి రక్తాణువులోను అగ్నికీలలను రగిల్చాయి" అని తన ఆవేదనను వెల్లడించారు.

"ఈ విశాల ధాత్రినేయొక్కనరుడైన

దాస్య బాధలోన దవిలియుండు
విశ్రమింపరాదు స్వేచ్ఛానురక్తులు” అని నార్ల ప్రబోధించారు.

“సర్వజనుల పట్ల సమదృష్టి సమత”. సత్యయుగము కొరకు వగచి ప్రయోజనం లేదు. శక్తియుక్తులలో అందరూ సమానులు కానందున సమత చెల్లదను మాట చౌకమాట” సమత లేని జగతి యమలోక సమము” అని నార్ల భావిస్తారు.

తన కవితలో నార్ల అడుగడుగునా ప్రజాస్వామ్యం పట్ల మక్కువ ప్రకటించారు. "ప్రజల రాజ్యమన్న ప్రతిహతిలేదురా!" అంటారాయన.

అర్హత లేకపోయినా పదవి పొందిన అల్పులు మిడిసిపడటం చూస్తూనే ఉన్నాం.

"పదవితోనె చెల్లు పదవి తెచ్చుఘనత
పిదప మిగులునోయి మొదటిరూపు
తోలుబొమ్మశోభ తూరుపారకముందె" నన్నారు. తోలుబొమ్మతో పోలిక పదవులు స్థిరమని భ్రమిస్తే వారికి తగిన చురక.

"ఆత్మనమ్మిపదవి నార్జించుమానిసి
పదవి నిలుపుకొనగ ప్రభుత నమ్ము
పదవి బానిసీడు ప్రజలనే తెగనమ్ము" నన్నారు.

స్వతంత్ర భారతదేశంలో పదవి నిలుపుకోవటానికి నాయకులు ఎంతటి దురాగతానికి పాల్పడినా ప్రజలు ఏమీ చెయ్యలేక మౌనప్రేక్షకుల్లాగ మిగిలిపోతున్నారు.

నాయకుడు ప్రజల మనిషి అయితే ప్రజలు అతన్ని తప్పకుండ అనుసరిస్తారనే అంశాన్ని నార్ల

"ప్రజలతోడ లంకె నిజముగా నున్నచో
నేతననుసరించి జాతి నడచు
సూదిననుసరించి సూత్రము నడవదా?” అని కడు చక్కని పోలికతో తెలిపారు.

మన ప్రజాస్వామ్యంలో మంత్రి పదవికున్న 'గ్లామర్' అంతా ఇంతా కాదు. అవిద్యావంతులు, కులంబలంతో చెలామణి అవుతున్నవారు, పచ్చి దొంగలు, దోపిడికాండ్రయిన మంత్రులను సన్నిహితంగా పరిశీలించిన నార్లమంత్రులను కొలిచే ప్రజల అవివేకాన్ని, అజ్ఞానాన్ని నిరసించారు.

"మంత్రుల కెదురేగి మల్లెపూలను జల్లి
పూజసేయనేల పొగడనేల
మంత్రుల నగయెవరు? మనకు భృత్యులు కారె?

చవటకూడ తాను సర్వజ్ఞుడైనట్టు
మంత్రియయ్యేనేని మాటలాడు
పదవి యబ్బినంత పాండిత్యమబ్బునా?".

అల్పబుద్ధులైన మంత్రులను వారి తాబేదార్లను తెగనాడటంలో నార్ల అసభ్యమైన పదాలనుపయోగించటానికి కూడ వెనుదీయలేదు.

"సిగ్గుయెగ్గులేని చీము నెత్తురులేని
నీచజనులు దేశనేతలైన
పచ్చికూళమంత్రిపదవి కొరకు
అవని చంకనైన ఎగబడినాకురా!
పదవికొరకు సకలపాపాల కొడిగట్టు
వెంటనడచువారు పెంటకుక్కలుకారె?

నార్లవారికి ఆదర్శమైన వేమన పద్యాలలో కూడా అక్కడక్కడ అసభ్యమైన పదాలు పాఠకులను ఇబ్బంది పెడతాయి.

హిట్లర్, ముస్సోలినీ లాంటి నియంతలను దృష్టిలో పెట్టుకొని నార్ల కొన్ని పద్యాలలో నియంతలను ఆక్షేపించారు ...

"ఏ నియంతనైన ఖూనీని సేయగా
బాకులేల? చేతి బాంబులేల?

ఎక్కిరింతచాలు, ఎగతాళి చాలురా!" అన్నారు ఛార్లీ చాప్లిన్. హిట్లర్ను ఎగతాళి చేయటం నార్లవారి పద్యం చదివినవారికి తప్పక జ్ఞాపకం వస్తుంది.

కులమతాలు మన సమాజాన్ని పట్టిపీడిస్తున్న జాడ్యాలని నార్ల తలచారు. "కులము దడులు కట్టు, కులము గోడలు పెట్టు", "మానవతకె కులము మచ్చను దెచ్చు"నన్నారు.

కులము కుళ్ళు అన్నిచోట్లకు పాకినదంటూ చీమలలో బాపనచీమలు, కాకులలో మాలకాకులుండటాన్ని తెలిపి కులతత్వాన్ని నిరసించారు.

"అంటరానితనము వెంటాడు దేశాన
సిగ్గు చేటుకాదె చెప్పుకొనుట

నైతిక బలమేదొజాతికి కలదంచు" అనే పద్యంలో భారతీయ సంస్కృతి గొప్పదని గర్వించే వారిని ఆత్మవిమర్శ చేసుకోవలసిందని హెచ్చరించారు.

"బ్రతుకు విడిచి బ్రహ్మ పదమేదొలేదు"
"నరుని విడిచివేతె నారాయణుడులేదు"

"మానవతను మించు మతములేదు" అని నార్ల ప్రగాఢంగా విశ్వసించారు. మతాల కతీతమైన మానవతనే ఆయన ప్రబోధించారు.

"గతకాలము మేలువచ్చుకాలము కంటె" అనే భావనను నార్ల తీవ్రంగా వ్యతిరేకించారు.
"అంటరానివాడ! అంటుపొందు, బా! బంచు
హెచ్చరించు స్థితికితెచ్చెనొకని
పాత సంఘమెంత పాపిష్టి సంఘమో!" గుర్తించాలన్నారు.

మరణానంతర జీవితాన్ని నార్ల నమ్మలేదు. నరునిలోనె స్వర్గ నరకాలున్నాయి గాని వేరెక్కడ లేవన్నారు. అమరలోక సౌఖ్యాలను తలచుకొని ఉవ్విళ్ళూరటం సరికాదన్నారు.

"అమరలోకవాసులని మిషలైనచో
కలల నెటు వారు కాంచగలరు?
కలలులేని బ్రతుకు వెలవెలబోవదా?" అని మానవలోకమే కోరదగినదన్నారు.
"ఆత్మకల్ల దాని అమరత్వమును కల్ల
మనసు నిజము దాని మహిమ నిజము
మనసు మహిమ వలన మనుజుడు పుట్టెరా!"

అని నార్ల ఆత్మను గూర్చి తన అభిప్రాయాన్ని స్పష్టంగా తెలిపారు. "ఆత్మ నిత్యమనుచు పలికెవారిని అజ్ఞానులుగా పరిగణించారు.

ప్రతి అంశాన్ని పరిశీలించి సత్యాసత్యాలను తెలుసుకోవాలని నార్ల అభిప్రాయం. “ప్రశ్న లేక ప్రగతి ప్రశ్నార్ధకమ్ము" అంటారాయన.

"పత్రికొక్కటున్న పదివేల సైన్యము
పత్రికొకటున్న మిత్రకోటి”

ప్రజకు రక్షలేదు పత్రికలేనిచో” అనే నార్లవారి పద్యం బాగా ప్రచారంలోకి వచ్చింది. పత్రికల శక్తిని గూర్చి మరి ఏ కవీ ఇంత బాగా చెప్పలేదు.

“వర్తమాన జగతి పరివర్తనాలపై
స్వేచ్ఛతోడ వ్యాఖ్యసేయనట్టి”

ఎడిటరెందుకోయి ఏటిలో గలపనా?" అనే మాటను ఎడిటర్లు, పాఠకులు ఎల్లకాలం గుర్తుంచుకోవాలి.

“కావ్యమొకటిచాలు కలకాలమున్నచో
పద్యమొకటెచాలు బ్రతికెనేని”

పాదమొకటిచాలు పసగలదైనచో" ఈ పద్యంలో భావం గంగిగోవుపాలు గరిటెడైనను చాలు" పద్యంలో లాంటిది. నా కవితలలో మాటల కూర్పు ఇంపైనది, మళ్ళీ మళ్ళీ తలచుకొనదగినది.

నార్ల వారి సుభాషితాలలో –

“చరిత యనగకాదు సామ్రాజ్యకీర్తన
చరితయనగకాదు సమరగాథ

చరితయనగ సకల నరజాతి ప్రగతి రా!" అనేది శ్రీశ్రీగారి 'దేశచరిత్రలు' అంత దీప్తిమంతమైనది కాదుగాని ఆ గీతంలో స్ఫూర్తి ఇందులో కూడ ఉన్నది.

నార్లవారు ప్రయోగించిన “చూరినీళ్ళతోడ ఏరులు నిండునా?, ఉత్తగోనెసంచి ఎత్తుగా నిలుచునా? పొంతకుండనీళ్లు కొంతైన కాగునా?” మొదలైన ఉపమానాలు పండితపామరు లిరువురినీ అలరించాయి.

"తిక్కకొంతలేక తెలుగువాడెటులౌను
తెలుగుతనములేదు తిక్కలేక"

తెలుగుజాతికవియె తిక్కనామాత్యుడు" పద్యంలో నార్లవారి చమత్కారం మరీమరీ తలచుకొనదగినది.

లోకనైజాన్ని తెల్పటంలో నార్ల నేర్పుచూపారు.

"అప్పు నడిగిచూడు మన్నదమ్ములనైన
నీకు తెలియదేని రూకవిలువ"

రూక నీడలోనే లోకాలు నిల్చురా!" మానవ సంబంధాలు డబ్బుతో ముడిపడి ఉంటాయనే సత్యాన్ని పై పద్యంలో నార్ల అలవోకగా తెలిపారు.

"పెద్దబాలశిక్ష హద్దుతో నిలిచిన
విద్దెయెంతదాని విలువ యెంత"

వేదపాఠకునికుండు విజ్ఞానమెంతరా?" అనే పద్యంలో వేదం చదువుకున్నామని విర్రవీగేవారి జ్ఞానం స్వల్పమేనని కుండబద్దలుకొట్టి మరీ చెప్పారు.

మార్క్సిజాన్ని కాదని సోషలిజాన్ని నెత్తికెత్తుకోవడం నార్లవారి ఆలోచనాధోరణిలో ఒక వింతపోకడ :

"వర్గకలహమొకటే స్వర్గమార్గము కాదు
ప్రగతిలేదు రక్తపాతమందె
మావోఅన్నయొకడెమార్గదర్శికాడు"
సోషలిజము వర్గభేషజమ్ముల చంపు
సోషలిజము సంఘశోభపెంచు
సోషలిజము నరుని క్షోభలద్రుంచురా?"

నార్లవారు నెహ్రూగారు ప్రవచించిన 'డెమొక్రాటిక్ సోషలిజమ్' సమాజసమస్యల పరిష్కారానికి సరైన మార్గంగా తలచారు. కాని ప్రజాస్వామ్యం కూడ ఒక్కొక్కసారి నియంతృత్వ పోకడలు పోగలదని ఇందిరాగాంధీగారి 'ఎమర్జెన్సీ' కాలంలో తెలుసుకున్నారు.

తెలుగు మాటలు ఉపయోగించటానికి వీలున్న సందర్భాలలో కూడ నార్లవారీ పద్యసంపుటి లో సైన్సు, సోషలిజము లాంటి ఇంగ్లీషు పదాలను యథేచ్ఛగా ఉపయోగించారు.

నార్లవారి పద్యాలలో కొన్ని పాదాలు – "ముండ ముండె మేలిముసుగు వేసినా" – లాంటివి అపశ్రుతులుగా తోస్తాయి.

ఆధునిక సమాజపు పోకడలను వైవిధ్యభరితంగా విశిష్టరీతిలో తేల్చిన నవయుగాల బాట నార్లమాట తెలుగుజాతికి వెలుగుబాటను చూపిన ఉత్తమ కావ్యం.

జగన్నాటకం(గీతాలు:గేయాలు) 1957 నార్లవారి గీతాలు గేయాల సమాహారం 'జగన్నాటకం'. వారికి కోకిలే కాదు కాకికూడ కావ్య వస్తువే 'కాకసప్తకం' ఒక విలక్షణ గీతం. "వాలింది ఒక కాకి – వగలాడి ఆ కాకి– ముత్తయిదువటు – ముద్దుగా కూర్చుంది – పలుకరిస్తున్నట్లు పలుమార్లు కూసింది – చనువుగా వంటింటి చాయలకు చేరింది – చేతితో విదలింప చెంగునే పోయింది వాలింది ఒక కాకి వగలాడి ఆ కాకి" అంటూ కాకి కదలికలను సున్నితంగా ఆహ్లాదకరంగా వర్ణించారు.

జనన మరణాల చక్రనేమి క్రమాన్ని నార్లవారు 'ద్వంద్వాతీతం'లో అద్భుతంగా చిత్రించారు.

"వెలుగు వెనుక నెయిరులు ఇరుల వెనుకనె వెలుగు
అటు చూడు ఉదయసంధ్యా శోభ!
ఎండలోనెవాన! వానలోనెయెండ
ఇటు తిరుగు ఇంద్రచాపం సొబగు!
బ్రతుకువన్నెంటిమృతి! మృతినీడనె బ్రతుకు
వినవోయి! పురిటింటికేరింత!"

అభ్యుదయ కవిత్వ ప్రభంజనం తగ్గుముఖం పట్టిన దశలో నార్ల మానవతావాదం అంతర్లీనంగా వినిపించే గీతాలు, గేయాలు రాశారు.

"ఏమిలోపం మబ్బుకన్నెకు? ఏల శోకం మేఘబాలకు?"(మబ్బుకన్నె) అని మబ్బుతో మాటలాడే కవి భావన రసజ్ఞులను సున్నితంగా తాకుతుంది.

"పిచ్చివూహలేవో రెచ్చిపోవు నాలో
రొట్టెకె కాళ్ళుంటె పట్టెడు మెతుకులకే

అల్లాడే దీనుల ఇల్లు చేరునేమో!" అనే మాటలలోని ఋజుత్వం తప్పకుండ గుండెలకు తగులుతుంది.

'జగన్నాటకం' లో గీతాలు, గేయాలు ఆలోచింపజేసేవి; ఆహ్లాదపరచేవి; మంచిని పెంచేవి. నార్లవారి కవిత చదివినప్పుడు పైరగాలికి కెరటాలుగా కదిలిన పంటచేను కళ్లముందు కదలాడుతుంది.



కడియాల రామమోహనరాయ్. *గుంటూరులోని జె.కె.సి. కళాశాల విశ్రాంత తెలుగు విభాగాధిపతి. సహృదయులైన విమర్శకులుగా పేరుపొందారు. గత 20 ఏళ్ళుగా వెలువరిస్తున్న సాంవత్సరిక కవితా సమీక్షలు వారి అధ్యయన తత్పరతకు అద్దం పడుతుంది. యు.జి.సి. తరఫున రెండు మేజర్ ప్రాజెక్టులు నిర్వహించారు. '20వ శతాబ్దిలో తెలుగు కవిత్వం', 'తెలుగు కవితా వికాసం' లను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారు ప్రచురించగా, 'సహృదయ' సంపుటి విశాలాంధ్రచే ప్రకటితం. మనసా, వాచా, కర్మణా సద్విమర్శవైపు పయనించే క్రాంతదర్శి. సాహిత్యంలో అన్ని ప్రక్రియలపై విశేష పరిజ్ఞానం గలవారు. మంచి చదువరి. మంచి మిత్రులు.*★

జాబాలి – తత్త్వ సమీక్ష

– ఆకురాతి పున్నారావు



శ్రీరాముని ధర్మవిరుద్ధ మాటలకు కోపించిన జాబాలి

నవీనకవి దృష్టి లో కథాంశం ప్రాచీనమైనా ఏరూపం ధరించవచ్చో తెలియజేసే నాటిక ఇది. ప్రాచీన ఇతివృత్తాన్ని గ్రహించిన నవీనులు తమకాలానికి అనుగుణంగా దాన్ని ఒకింతమార్చి తీర్చిదిద్దడం సామాన్యలక్షణమే. అయితే ఈ నవీనుల్ని మాత్రం సమకాలికులు సామాన్యంగా వెంటనే ఆమోదించరు. కారణం, వారి కల్పనలు అహేతుకాలూ, అసుందరాలూ కావడంగాదు. కేవలం వారు సమకాలికులు కావడమే. తమతోపాటు జీవిస్తూ, చరిస్తూ ఉండి తమకంటే భిన్నంగా ఒక విధంగా ఉన్నతంగా ఆలోచించగలగడం సమకాలికులు సహించ లేకపోవచ్చు.ఇలాంటి స్థితి –‘ సమకాలికుల్ని నిరాదరించడం’ అన్నది ఎప్పుడైనా ఎక్కడైనా మానవ సమాజంలో ఉన్న అలవాటేనేమో! కాకపోతే నేటి మన 'కవికులగురువు' గొప్ప భారతీయ నాటకాల సృష్టికర్త అయిన కాళిదాసు తన కాలాన తనకృతిని కేవలం నవీనమన్న కారణాన తిరస్కరించవద్దని ఇలా అంటాడు –



"పురాణ మిత్యేవ నసాధు సర్వమ్★ నచాపి కావ్యం నవమిత్యపద్యమ్।
సన్తః పరీక్ష్యాన్యతరద్ భజన్తే★ మూఢః పరప్రత్యయనేయ బుద్ధిః”

– *మాళవికాగ్నిమిత్ర ప్రస్తావనా*

(పాతదైనంత మాత్రాన అంతా మంచిదికాదు. కొత్తదైనంత మాత్రాన చెడ్డదీకాదు, బుద్ధిమంతులు రెండింటినీ పరీక్షించి (మంచిని) స్వీకరిస్తారు; మూఢులు ఇతరుల నమ్మకాలను బట్టి తామూ నడుస్తారు.)

ఇక నాటకాల ప్రసక్తికి వస్తే తెలుగులో ప్రాచీనకాలాన అసలు నాటకాలే లేవు. సంస్కృత వాఙ్మయాన్ని తెనిగించే అలవాటున్న మన ప్రాచీనులు అక్కడి నాటకాల్ని గూడ ప్రబంధీకరించి అనువదించారే తప్ప నాటకాల్ని నాటకాలుగా గాదు. ఉదా : అభిజ్ఞానశాకున్తలాన్ని పిల్లలమర్రి పిన వీరభద్రన శృంగార శాకుంతలంగా రాశాడు.

ఆధునిక కాలాన పాశ్చాత్య సాహితీ ప్రభావంతో కావచ్చు తెలుగులోనూ నాటకాలు వచ్చాయి. పౌరాణికాలు అధికంగా, సాంఘికాలు అల్పంగా మొదట్లో, బహుశః సామాజికుల అభిరుచి దానికి హేతువు. సాహిత్యంలోని ఈ దృశ్య ప్రక్రియ ద్వారా సాంఘిక జాగృతికై యత్నించడం కందుకూరి వీరేశలింగంగారితో ప్రారంభమైనట్లు చెప్పవచ్చు. ఆయన తరువాత ఆ ధోరణి కొంత మందగించినట్లు కనిపించినా మొత్తంమీద కొనసాగుతూనే ఉన్నట్లే భావించవచ్చు. కన్యాశుల్క వరవిక్రయాలు ఈ ధోరణికి శాశ్వతచిహ్నాలుగా నిలిచి ఉంటాయి.

తరువాత భారతీయ సమాజంలోని అన్ని వర్గాలవారు చదువుకొనడం ప్రారంభించిన తరువాత, వారిలో ఇంతకాలం చదువులకు సంస్కారాలకు దూరంగా ఉంచబడిన అధిక సంఖ్యాకులలో కొందరు ప్రాక్తన గ్రంథ సముదాయాన్ని పరిశీలనా దృష్టితో అధ్యయనం చేయడం మొదలైనది. ఆ అధ్యయన ఫలితంగా ఈ నవీన పరిశీలకులు కొన్ని నూతన దృక్పథాలను ఆ పాత గ్రంథాల నుండే, ఆ పాత సంఘటనల నుండే, ఆ పాత పాత్రలనుండే వెలువరించే అవకాశమున్నట్లు గ్రహించగలిగారు. ఆ గ్రహింపు కలిగినవారిలో నార్ల వెంకటేశ్వరరావుగారు అగ్రగణ్యులు. ఆయన వాల్మీకి రామాయణాన్ని కేంద్రంగా చేసుకుని నవీన దృక్పథాన్ని ఆవిష్కరించడానికి చేసిన సఫలీకృత ప్రయత్నాల్లో ఈ 'జాబాలి' నాటిక ఒకటి. ఇలాంటిదే 'సీత జోస్యం' కూడ. పరిశోధక పండితుల ఆమోద ముద్ర పొందిందన్న విషయం విజ్ఞ ప్రపంచం ఎరుగును.

వాల్మీకి రామాయణంలోని అయోధ్యాకాండలోని 108, 9వ సర్గలు ఈ చిన్న నాటికకు మూలం. దీనిలో కవిధ్యేయం పురోహిత వర్గ దుర్మార్గాలను ప్రకటించడం. ఈ వర్గంవారు ప్రపంచంలో ఎక్కడున్నా, ఎప్పుడైనా వారి పద్ధతి ఒకటే – తమ సుఖ సంతోషాలు, భోగభాగ్యాలు ముఖ్యం. సమాజంలోని అత్యధిక సంఖ్యాకులైన ఇతర వర్గాల అందరి ప్రయోజనాలు, తమ కొందరి ప్రయోజనాల ముందు తీసికట్టే! సంస్కృతంలోని ఒక సుప్రసిద్ధ బుద్ధ సూక్తికి 'పేరడీ'గా చెప్పాలంటే "కతిపయ

హితాయ, కతిపయ సుఖాయ" (కొందరి క్షేమం కోసం, కొందరి సుఖం కోసం) అన్నది వారి లక్ష్యం. బుద్ధసూక్తి "బహుజన హితాయ బహుజన సుఖాయ" (అత్యధికుల క్షేమం కోసం, అత్యధికుల సుఖం కోసం) ఇటీవల ప్రభుత్వ ఆదరానికి పాత్రమై విద్యావంతులకు అందరికీ సుపరిచితమై ఉంది. ఈ నాటికలో ఇతివృత్తంగా చెప్పదగినది బహుస్వల్పం. ఇతివృత్త ప్రతిపాదన ఇక్కడ కేవలం కవి భావాల ఆవిష్కృతికి ఒక ఆధారం మాత్రమే.

జాబాలి రాముని ఒక ఏకాంత ప్రదేశానికి పిలిపించి తన భావాలను, పురోహిత వర్గ స్వరూప స్వభావాల బాహిరఆచ్ఛాదనం తొలగించి చూస్తే అగుపించే యథార్థమైన అభిప్రాయాలను వెలువరిస్తాడు.

ఆ వెలువరించే క్రమంలో రాముని హృదయ స్పందనను ఆవిష్కరించే మాటలు దొర్లడం, అలాగే స్వయంగా పురోహితవర్గానికే చెందినా జాబాలి తన వర్గస్వభావానికి అతీతంగా మానవీయతకు సమీపంగా ఆలోచించడం నాటిక చదువుచున్నంతసేపూ మనం గమనిస్తాం.

అలాగే నాటిక అన్నారు గాబట్టి చిరు కదలికలైనా ఉండాలి. అప్రయత్నంగా వసిష్ఠుని రాకను గురించి జాబాలి తొట్రు పడటం, వయసా అనుభవంలో చిన్న రాముడు (వాల్మీకాన్ని బట్టి రాముడు వనవాస సమయానికి 17 ఏండ్లవాడని కవి సాధికారికంగా నిర్ణయించగలిగారు) జాబాలి కొత్త మాటలకు చలించి వాటిని ఆమోదించ లేక తన పాత సంస్కారంతో తనలో తాను కూరుకొని పోయినట్లు ప్రవర్తించడం – వంటివి ఉన్నాయి.

స్వవర్గ సహజమైనదిగాక, మానవీయమైన నీతి నిజాయితీ పుష్కలంగా ఉన్న జాబాలి రామునికి ఏకాంతంగా భౌతికవాదాన్ని బోధించబోతాడు. ఏకాంతంగా ఎందుకంటే – బయట పడితే తనకూ తన వారికీ బ్రతుకు తెరువు పోవచ్చు, భౌతికవాదం పురోహితవర్గం దృష్టిలో (బయటకు మాత్రమే నిజానికి నిజమైన భౌతికవాదులు వారు) నీచమైనది, పరిత్యాజ్యమైనది, హేయమైనదీను.

రాముని వయస్సూ అనుభవమూ చిన్నవి గాబట్టి జాబాలి ఈ రహస్య సంభాషణకు ఉపక్రమిస్తాడు. ఒకవేళ 'కథ అడ్డం తిరిగి' తాను దోషిగా పరిగణింపబడే దుర్దశే ప్రాప్తిస్తే, వెంటనే తాను రాముని శీల పరీక్షార్థం ఈ బోధనం (పురోహిత వర్గం దృష్టిలో నాస్తికవాదం) చేశాననీ, పరీక్షలో రాముడు నెగ్గాడనీ మందహాస పూర్వకంగా ప్రకటించేసి విపత్తు నుండి విముక్తుడు గావచ్చు. అలాంటి సందర్భాన రాముని అర్భకత్వం తనకు రక్షగా ఉపకరిస్తుందని అతని ఊహ.

అలా కాకుండా రాముడు నిజమైన స్వకీయమైన వివేకంతో తన బోధనలోని యాధార్థ్యాన్ని గ్రహించగలిగితే తన లక్ష్యం నెరవేరినట్లే. రాముడూ, అతనిని నమ్మి పూజించే ప్రజాసమూహమూ ఈ ఉభయులూ పురోహిత వర్గ ప్రాబల్యం నుండి బయటపడి సుఖపడతారు – ఇదీ అతని ఆలోచనలోని మరో పార్శ్వం.

అయితే జాబాలి ఊహలోని మొదటి భాగమే నిజమై పెద్ద అనర్థం ఎదురుగా దాపురించ బోయింది. తాను భయపడుతున్నట్లుగా రాముని వెదుకుతూ కుల పురోహితుడూ, ఆ వర్గ ప్రయోజనాల ఏకైక సంరక్షకుడూ ఆయన వశిష్ఠుడు తమ చెంతకు రానే వస్తాడు. అపుడు జాబాలి కూడ తనకు జన్మసిద్ధమైన వాక్ నైపుణ్యంతో "అబ్బే ఏమీ లేదు. ఈ కుర్రవాణ్ణి ఒక పట్టు పట్టి చూశాను. మనఃస్థైర్యాన్ని పరీక్షించాను. గట్టివాడే, పరీక్షలో నెగ్గాడు" అన్నట్లుగా మాట మార్చిడి|

కార్యక్రమంతో, ఆ వృద్ధ మహా పురోహితుని స్వభావం గుర్తెరిగినవాడు గాబట్టి, ఆయన్ని బాగా పొగిడి తాను ప్రమాదం నుండి బయటపడతాడు. అంతేకాక ఆ వశిష్ఠ నంతటివాని నోటి నుండి గూడ "ఇతడు చిరకాలంగా మా సన్నిహిత వర్గంతో ఉంటున్నాడు. ఇతడు నాస్తికుడు కాడు" అనిపించుకుంటాడు. ఈ చాకచక్యం నార్ల కల్పన గాదు. మూలంలోనే "జాబాలి రపి జానీతే లోకస్యాస్య గతా–గతిమ్" (వాల్మీక–అయోధ్య–110–1) అనే జాబాలి శీల ప్రస్తుతి కనిపిస్తుంది.

రామాయణంలో మనకు కనిపించే కథలో జాబాలి రామునికి నాస్తిక మత బోధనం చేసినట్లు ప్రత్యేక ఉపశీర్షికతో ఉంది. అయితే అతడు పురోహిత వర్గ స్వభావానికి విసిగి దానిపై రోతపుట్టి దానికి ఎదురుతిరగడమో, రాముని ఎదురు తిప్పబోవడమో చేసే వ్యక్తిత్వమున్న వాడుగా మాత్రం వాల్మీకంలో మనకు జాబాలి అగుపించడు. ఆ పనిని నాటికాకర్త చేశారు.

అలాగే రామాయణంలో జాబాలికి వశిష్ఠుడంటే పురోహిత వర్గ ప్రయోజనాల ఏకైక రక్షకుడు అనే అవగాహన ఉన్నట్లు లేదు. ఆ పనీ నాటికాకర్తదే. అందువల్లనే నాటికలో జాబాలి రామునితో రహస్యంగా సంభాషిస్తాడు. సంభాషిస్తూ గూడ, మధ్య మధ్య పులి రాకను శంకించే లేడిలాగా ఉలికిపడుతూ ఉంటాడు. ఎక్కడ 'వశిష్ఠుల వారు' తన నిజ స్వభావం కనిపెడతారో హఠాత్తుగా వచ్చిపడి – అని.

అదేవిధంగా రామాయణం రాముని వయస్సును వివరించదు. ఈ సందర్భాన ఆ పని నార్ల చేశారు. కారణం ముందు చెప్పినదే. ఎదురు తిరిగితే ఆ కుర్రవాణ్ణి ఊరకే మభ్యపెట్టవచ్చు.

అయితే నాటికలో రాముడు, జాబాలి చేసిన ఈ మభ్యపాటుకు లొంగినట్లు లేదు. మానసికంగా వికలుడై నిజానిజాల అన్వేషణలో వ్యగ్రుడై కింకర్తవ్యతా విమూఢుడైనట్లు కనిపిస్తాడు.

రామాయణంలో వశిష్ఠుడు రాముని శారీరక మానసిక చేష్టా సర్వస్వాన్ని నిరంతరం కనిపెట్టి చూచే వృద్ధ పురోహితునిగా కనిపించడు. ఆ అవసరం వాల్మీకికి లేదు. ఇక్కడ నాటికా కర్తకు ఆ అవసరమున్నది. వశిష్ఠుని స్వరూప స్వభావాలు పూర్తిగా వ్యక్తీకరించాలి. అందుకే కావడానికి వశిష్ఠుడు జాబాలి కంటె పదేళ్ళు పెద్దవాడే అయినా అతనికంటె దృఢంగా ఉంటాడు. చెల్లుబడికి తిరుగులేదు గాబట్టి 'ఆ ధీమా' అతని అన్ని కదలికలలోనూ వ్యక్తమౌతుంటుంది మరి!

రామాయణాన్ని వాల్మీకికృతమైన దానిని పరిశీలించిన వారికెవరికీ (ఆరాధించేవారికి గాదు) ఈ నాటికలోని ప్రతిపాదనలు గాని, వ్యక్తిత్వాలు గాని కేవలం ఊహా కల్పితాలు అనిపించవు. అన్నీ దాదాపు వాస్తవాలే. 'దాదాపు' అనే పదం ప్రయోగించ వలసి రావడమెందుకో ఈ వ్యాసంలోనే మొదట వివరించబడింది.

అయితే ఇక్కడ మనస్సు చివుక్కుమనే అంశం, వాల్మీకి రామాయణంలో ఏమిటంటే, రాముని నోట బుద్ధుని చోరుడని నిందింపించడం! ఇది ఎంతగా అసందర్భమో అంతగా అనవసరం కూడా. ఒకవేళ రాముడు చారిత్రక వ్యక్తే అయి ఉంటే, అతనికి బుద్ధుడు అర్వాచీనుడు, నిన్న మొన్నటి వాడు. ఒక అర్వాచీనుని ఒక ప్రాక్తన మానవుడు పనిగట్టుకొని తిట్టడం దీనిని వాల్మీకి రామాయణ ప్రక్షేపకారులు అవివేకానికి తుది దశగా మనం భావించి ఉపేక్షించవచ్చు.


నిజానికి ఈ పురోహిత వర్గానికి స్వప్రయోజనా కాంక్షముందు భూతదయగాని, సమాజంలోని అత్యధిక సంఖ్యాకుల హితసుఖాలుగాని బొత్తిగా కొరగావు.

ఎవరెలా పోయినా, లోకమంతా నిండు చీకటిలో శాశ్వతంగా ఉండిపోవలసి వచ్చినా ఆ వర్గంవారు చింతించరు, దయ తలచరు. ఆ దుష్టవర్గ స్వభావమే ఆ కారణంగా ఆ జ్ఞాన దయాసింధువును తిట్టించి ఉంటుంది. రామాయణంలో వారి దృష్టిలో బుద్ధుడొకడే వారి వర్గ ప్రయోజనాల ఏకైక భంజకుడు, అతని బోధనలూ, మతం హేతు ప్రభవాలు. నిరాధారంగా నిర్హేతుకంగా ఆ అగాధ వ్యక్తి ప్రసంగించడు. అందుకే అతని బోధనలకు అంతటి విశ్వజనీనత, శిరోధార్యత్వం. ముఖ్యంగా వృద్ధ పురోహితులు మాట ఏమిటోగాని, యువజనమంతా అతని నవీన బోధనలకు, హేతు పూర్వక ఆలోచనా విధానానికి శిరస్సులు వంచి నమస్కరించారు. మల్లంపల్లి సోమశేఖరశర్మ 'ప్రశాంత విప్లవం' ప్రకారం ఆ కాలాన, ఆ బుద్ధుడు భూమిపై నడయాడి 'బహుజన హితాయ, బహుజన సుఖాయ' అంటూ ఆలోచనాత్మకమైన బోధనలు ఊరూరా తిరిగి చేసేవేళ కుర్రకారు ఆ మహావ్యక్తి ఆకర్షణకు

లొంగిపోయి కాషాయాంబరాలు ధరించి శిరోముండనాలు వహించి బౌద్ధభిక్షువులుగా వందల వేల సంఖ్యలో మారిపోయారు. ఈ దుర్వార్యమైన మహావిప్లవాన్ని నిరోధించ లేక తాత్కాలికంగా తల ఒగ్గినా, అనంతర కాలాన అదను చూసి ఆ బౌద్ధాన్ని, ఏ ధర్మం తొట్టతొలుత తమ జన్మసిద్ధ ఔన్నత్యాన్ని ప్రశ్నించిందో, యజ్ఞయాగాల పేర తాము జరిపే దురంత దారుణ జంతు హింసను ఎదిరించిందో, ఆ మతాన్ని ఈ దేశం నుండి జన్మభూమి నుండి నిష్క్రమింపజేసిగాని ఆ పురోహిత వర్గం విశ్రమించ లేదేమో అనిపిస్తుంది. బహుశః ఆ ప్రతీకార దుశ్చర్యలలో భాగమే ఈ అసందర్భ ప్రక్షేపాల నిక్షేపాలు కావచ్చు. లేకపోతే 'యథాహి చోరః సతథాహి బుద్ధ స్తథాగతం నాస్తిక మత్ర విద్ధి" అనే మాట రాముని నోట రావలసినపని లేనేలేదు.

నిజానికి చార్వాకాన్ని బౌద్ధం ఖండిస్తుంది; తిరస్కరిస్తుంది సర్వధర్మ సార సంగ్రహాన్ని బట్టి చూస్తే. (ఏకాకినీ ప్రతిజ్ఞా హి ప్రతిజ్ఞాతం న సాధయేత్' – అంటూ చార్వాకులు అనుమాన ప్రమాణాన్ని అంగీకరించకపోవడాన్ని పరిహసిస్తుంది బౌద్ధం) అయినా ఈ పురోహితులు కావాలనే బౌద్ధాన్ని నాస్తికంగా చార్వాక అభిన్నంగా ప్రచారం చేశారు. దేశంలో అత్యధిక సంఖ్యాకులు విద్యావిజ్ఞాన వంచితులయినపుడు పురోహిత వర్గంవారి ఆగడాలకు అంతం లేదు; ఎదురూ లేదు మరి!

చివరగా వెంకటేశ్వరరావు జాబాలి నోట పలికించిన "ప్రజలను కొల్లగొట్టి తమకు దోచి పెట్టాలని ధర్మశాస్త్రాలను రాసి పెట్టింది వశిష్ఠులవారు గాదా?



వైదిక ధర్మాలు సడలినా, వైదిక కర్మలు సమసినా, నా బ్రదుకు తెరువు పడిపోదా? వృషభాషలను, మత్తేభాలను మేపినట్లు తమను మేపకపోతే దుర్గతులు తప్పవని భయపెట్టటంలోనే ఉంది నాయనా! పురోహితుల కపటం! ఇంద్రాది దేవతలకు హవ్యాల పేరుతో, పితృ దేవతలకు కావ్యాల పేరుతో వారు తమ పొట్టలు నింపుకుంటారు. ఇంటివద్ద బిడ్డలు తిండితింటే, పొరుగూరులో ఉన్న తండ్రి కడుపు నిండుతుందా? భావి సౌఖ్యాలను ఇతరులకు ఎరగాజూపి, ప్రస్తుత సౌఖ్యాలను తాము అనుభవించడం ఆ వర్గం ప్రత్యేకత! ఆ సౌఖ్యాను భూతికే వైదిక కర్మల పేర వారు ధన కనక వస్తు వాహనాలను కాన్కలుగా స్వీకరిస్తారు. ధర్మశాస్త్రాలన్నీ వర్గ ప్రయోజనాల రక్షణకే పుట్టినవి. మానవులుగా మనకున్న ఆలోచనా శక్తిని మనం వినియోగించుకొనకపోతే జంతువులలో జత కామా?"

– వంటి వాక్యసముదాయానికి వాల్మీకంలోని –

"దాన సంపననాహ్యేతే గ్రస్థా మేధావిభిః కృతాః"

యజస్వ దేహి దీక్షస్వ తపస్త వ్యస్వ సంత్యజ
సశాస్త్రిపరమిత్యేతద్ కురుబుద్ధిం మహమతే!
ప్రత్యక్షం యత్తదా విష్ఠ పరోక్షం పృష్ఠతః కురు
సతాంబుద్ధిం పురస్కృత్య సర్వలోక నిదర్శనీం
రాజ్యం సత్వం నిగృహ్లిష్వ భరతేన ప్రసాదితః
యదిభు కమిహోన్యేస దేహ మన్యస్య గచ్చతి
దద్యాత్ ప్రవసతఃశ్రాద్ధం న తత్ బధ్యశనం భవేత్?"*(వాల్మీకం – అయోధ్య – 108)*

వంటి శ్లోకాలు ఆధారం. ఇవే నాటికాకర్త ఆలోచనలకు మూల భూమికలు, వీటిని కొన్నింటిని మరికొంచెం పొడిగించి కొన్నింటికి తాత్పర్యార్థాలు లాగి జాబాలి అభిప్రాయాలుగా నాటికాకర్త నిరూపించగలిగారు. ★

డాక్టర్ ఆకురాతి పున్నారావు. *ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులుగా పదవీవిరమణ చేసిన అవిశ్రాంత సాహితీ ప్రియులు, అభ్యసించింది, విశేషాధ్యయనం చేసి, బోధించినది కూడా వ్యాకరణాంశాలే. పరిశోధనా పర్యవేక్షణలో ఎంతోమంది, పిహెచ్.డి., యం.ఫిల్ పట్టా పొంది వివిధ విద్యాలయాల్లో పనిచేస్తున్నారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు దువ్వూరి వీరభద్రయ్య స్మారక బహుమతి గ్రహీత. అఖిలభారత ప్రాచ్య విద్యా సదస్సు, విశ్వ సంస్కృత పరిషత్తు మొదలైన 9 సంస్థలలో పాల్గొన్నారు. అఖిలభారత ప్రాచ్య విద్యా పరిషత్తు, ప్రపంచ సంస్కృత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ ప్రాచ్య విద్యా పరిషత్తు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పాఠ్య ప్రణాళిక నిర్ణాయిక సంఘంలోను సభ్యులు, సహృదయ మిత్రులు.*

అనుబంధం :



కొత్త కోణంలో రామాయణం

నార్లగారి పౌరాణిక నాటకాల్లో 'జాబాలి' మొదటిది. రామాయణం కల్పిత కావ్యం. సమయానుకూలంగా పూజారీ వర్గం దానిలో ఎప్పటికప్పుడు కొత్త కథలు, కథనాలు దోపుతూనే వచ్చింది. కల్పిత గ్రంథాల్లో పాత్రలు కూడా కల్పితాలే కదా? కాని, వాల్మీకి రామాయణంలో జాబాలి పాత్రను దూర్చడం వెనుక పెద్ద కుట్ర ఉంది.

బౌద్ధ ఉధృతి, ప్రచారం బాగా ఉన్న రోజుల్లో ప్రజలు బౌద్ధానికి ఆకర్షితులవుతున్న రోజుల్లో ఆ ప్రవాహాన్ని అడ్డుకోడానికి పూజారీవర్గం జాబాలి పాత్రను ప్రవేశపెట్టి, అతని చేత నాస్తికత్వాన్ని పలికించింది. ఎందుకంటే బౌద్ధం వైదికానికి వ్యతిరేకమనేది జగద్విదితం. వేదాలు ప్రతిపాదించిన యజ్ఞయాగాది క్రతువుల్ని, జీవహింసను బౌద్ధులు తీవ్రంగా నిరసించారు. అందుకే వైదికం వారికి నాస్తికులనే ముద్ర వేసింది. రెండో శతాబ్దిలోని మనుస్మృతి వేదాలను ఆమోదించనివారి నందరినీ నాస్తికుల క్రింద జమ కట్టింది. (*నాస్తికో వేదనిందకః మను 2-11*). ఇక్కడ బౌద్ధం నాస్తికమా, ఆస్తికమా అన్న ప్రశ్నరాదు. ఏ మతాలూ తమకు భిన్నమైన ఆలోచనా విధానాలను మన్నించవు. అందునా హిందూమతం వంటి కులగుల మతం అసలే సహించదు. ఆ అసహనం వల్లనే "యథాహిచోర స్తథాహిబుద్ధస్తథాగతం నాస్తిక మత్రవిద్ధి" అని వాల్మీకంలో రాముడిచేత అనిపించింది. దీన్నే ఆంధ్ర వాల్మీకి వాసుదాసు "చోరునట్టివాడు సమ్ముబుద్ధుడు నాస్తికుండును తథాగతుండు" అని తెలుగు చేశాడు. కేవలం బుద్ధుడంటే 'బుద్ధి గలవాడు' అని అపార్థం చేసుకుంటారనే అభిప్రాయంతో గౌతమబుద్ధుడని పర్యాయపదమైన 'తథాగత" పదాన్ని కూడా కావాలని ప్రయోగించినట్లు అర్థం చేసుకోవాలి. రామాయణ కథ జరిగిందనుకున్న నాటికీ, బౌద్ధం బయలుదేరే నాటికీ మధ్య ఎంతకాలం జరిగింది? ఎంతో దుర్బుద్ధితో బుద్ధుణ్ణి విష్ణువు అవతారంగా కథలల్లినా, రాముడికీ, బుద్ధుడికీ మధ్య

కృష్ణావతారం ఒకటి ఉందికదా? మరి రాముడు బుద్ధుణ్ణి చోరుడనీ, నాస్తికుడనీ నిందించడం ఎలా జరిగింది? అంటే బౌద్ధాన్ని, నాస్తికత్వాన్ని దూషించడానికే వాల్మీకంలో జాబాలి ఎపిసోడ్ దూర్చడం జరిగిందని తేలుతుంది. కచ్చితంగా అందుకే నార్ల తన తొలి పౌరాణిక నాటకానికి జాబాలిని కథావస్తువుగా ఎన్నుకున్నారని పిస్తుంది.

నార్ల నాస్తికులు. రామాయణ జాబాలి కూడా నాస్తికులు. పురోహితుల చేతిలో బొమ్మగా మారి పుణ్యలోకాల భ్రమలో పడవద్దని రాముణ్ణి జాబాలి హెచ్చరిస్తాడు. అదంతా నాస్తిక బోధ అని రాముడు కొట్టివేస్తున్న తరుణంలో వసిష్ఠుడు రంగంలో ప్రవేశిస్తాడు. ఆయన బ్రహ్మర్షి, రుషి కులగురువు, రాజగురువు కూడా.

అతను రాగానే జాబాలి ప్లేటు ఫిరాయించి రాముడి విశ్వాసాన్ని పరీక్షించాననీ, అతనే నెగ్గాడనీ అంటాడు. జాబాలి చేత అలా నాస్తికత్వాన్ని నీరు గార్పించకుంటే బాగుండేదని గోరా వంటి నాస్తికులు అభిప్రాయపడినట్లు పీఠికలో నార్ల పేర్కొన్నారు. కాని, ఆ కాలాన్ని బట్టి అలా చిత్రించడమే సరైనది. ఆనాటి మతం చాల బలమైనది. మత నాయకులు చాలా చాలా బలమైనవారు. ప్రజలందరి మనస్సులూ వారి స్వాధీనంలోనే ఉన్నాయి. అలాంటి స్థితిలో తమ నాస్తికతను బయటపెట్టడానికి అందరూ సాహసించలేకపోవచ్చు. అలాంటి పాత్రగానే జాబాలిని చిత్రించారు నార్ల. గెలీలియో నాస్తికుడు కాకపోయినా, బైబిలుకు విరుద్ధంగా, వాస్తవికతకు నిబద్ధంగా చెప్పినందుకు మతస్థులతనికి 'భూలోక నరకాన్ని చూపించారు. భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతున్నది కాని, సూర్యుడు భూమి చుట్టూ తిరగడం లేదనే వాదననే గెలీలియో సంవాదంగా పుస్తక రూపంలో ప్రకటించాడు. అందుకు క్రైస్తవ మత న్యాయస్థానం అతన్ని బంధించి, తన వాదాన్ని బహిరంగంగా ఉపసంహరించు కోమన్నది. ప్రాణభయంతో గెలీలియో ఉపసంహరించుకున్నా, జీవితాంతం దాకా కారాగార నిర్బంధం తప్పలేదు. మతాధిపతులు ఎంతటి అసహనాన్ని ప్రదర్శించగలరో 17వ శతాబ్దిలో జరిగిన ఈ సంఘటన రుజువు చేస్తుంది. అది స్పృహలో మెదలడం వల్లనే, నార్ల జాబాలిని అలా చిత్రించారు. అలాకాక, ఉపసంహరణకు అంగీకరించక బ్రూనోవలె మతస్థుల చేతుల్లో సజీవ దహనానికి తలొగ్గితే, పురాణ కాలానికి అది సరిపడేది కాదు. ఆ బానిస సమాజంలో అలా సాహసించగల వారుండేవారని భావించడం సరికాదు.

గెలీలియో ఉపసంహరించుకున్నా, భూమి సూర్యుడి చుట్టూనే తిరుగుతోంది. జాబాలి వెనుకడుగు వేసినా, నాస్తికత్వం సత్యంగానే వెలుగుతోంది. భారతంలో కూడా చార్వాకుణ్ని దుర్యోధన సఖుడుగా చిత్రించి పూజారీ వర్గం వధించిన కథ ఉంది. చార్వాకుడు హత్య గావించబడినా, అతడు నిలదొక్కిన భౌతికవాదం, నాస్తికత్వం చావలేదు.

(నార్ల రచనలు 3వ సంపుటం. రావిపూడి వెంకటాద్రిగారి పీఠిక, కొత్తకోణంలో పురాణాల పరిశీలన నుంచి పునర్ముద్రితం)

కొత్తగడ్డ – నాటికల విశ్లేషణ

– ఆచార్య ఎస్. గంగప్ప



ఇరవయ్యో శతాబ్దం లో వెలసిన నవ మేధావుల్లో వి.ఆర్. నార్లగారు– ప్రసిద్ధిగాంచిన నార్ల వెంకటేశ్వరరావుగారు– తెలుగువారు కావడం విశేషం. పత్రికారంగానికి సాహిత్యం గౌరవం తెచ్చిపెట్టిన ఘనులని ప్రశంస పొందడం మరీ విశేషం. సామాజిక, రాజకీయ, సాహిత్య విమర్శకులుగా, కవిగా, వ్యాసకర్తగా, నాటక నాటికా కర్తగా, కథా రచయితగా సుప్రసిద్ధులు. సమగ్ర సమాజాభ్యున్నతిని కోరిన అభ్యుదయవాది; నిరంతర అధ్యయనశీలి. వీరు సంపాదకీయాలకు ఒక విశిష్టతను చేకూర్చిన పత్రికాధిపతులు.

ఇలాంటి మహనీయుల శతజయంత్యుత్సవాలు జరుపుకోవడం తెలుగు జాతికి గర్వకారణం. వారి ఆంధ్రాంగ్ల రచనలన్నింటిని పన్నెండు సంపుటాలుగా వెలువరించారు. సంపాదకత్వం వహించిన మిత్రులు డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారు. ముద్రణకు సహకరించినది నార్ల పుత్రిక డాక్టర్ కొల్లి శారద, నార్ల కుటుంబ సభ్యులు. నార్లవారి సంపూర్ణ గ్రంథావళి పాఠకాళికి అందుబాటులో కొచ్చాయి. అందులో రెండో సంపుటంలో కొత్తగడ్డ, మాటా మంతీ, పిచ్చాపాటి, కొత్తా పాత చేర్చడం జరిగింది. ఈ సంపుటానికి 'నవతరాల మేధావి నార్ల' పేర నాచేత ముందుమాటలు రాయించి నాకెంతో గౌరవం గూర్చడం జరిగింది. నార్లవారి 'కొత్తగడ్డ' నాటికలకు ఒక ప్రత్యేకత ఉంది. ఆ విశ్లేషణ కంటే ముందు తెలుగులో నాటకం, నాటికల ఉత్పత్తి వ్యాసాల గూర్చి క్లుప్తంగా తెలుసుకుందాం.

మంది మార్బలం, తెరలో రంగస్థలం, హంగులతో కళాత్మకమైన ప్రదర్శన యోగ్యమైన దృశ్య కళానాటకం. అందుకే కావ్యం రెండు విధాలనీ, ఒకటి శ్రవ్యం, రెండోది దృశ్యమనీ అంటారు. చదివి, చదివించుకొని కావ్యానందం పొందవచ్చు. కానీ దృశ్యకావ్యం ప్రదర్శించినపుడే చూచి ఆనందించగలం. రంగస్థలంపై ప్రదర్శించినపుడే నాటకం జీవిస్తుంది. అందుకేనేమో తెలుగులో నాటకాలు ఆలస్యంగా వచ్చాయి. 1860లో కోరాడ రామచంద్రశాస్త్రిగారి 'మంజరీ మధుకరీయం' రచితం. 1880 లో కందుకూరి వీరేశలింగంగారి రెండు అనువాద నాటకాలు రత్నావళి, చమత్కార రత్నావళి రాజమండ్రిలో మొట్టమొదట ప్రదర్శితం.

అదే సంవత్సరం వారి వ్యవహార ధర్మబోధిని ప్రహసనం ప్రదర్శితం. అదే సంవత్సరం వావిలాల వాసుదేవశాస్త్రిగారు 'నందకరాజ్యం' అనే సాంఘిక నాటకం రచించారు. ఆ వెనుక 1872 లో వారే 'జూలియస్ సీజర్' నాటకాన్ని అనువదించగా, కొక్కొండ వెంకట రత్నం పంతులుగారు 'నరకాసుర విజయ వ్యామోగము' ను సంస్కృతం నుంచి అనువదించారు. తదనంతరం వీరేశలింగం, గురజాడ, ధర్మవరం, కోలాచలం, చిలకమర్తి, పానుగంటి, బలిజేపల్లి, కాళ్లకూరి, తిరుపతి వేంకటకవులు మొదలుకొని అనేకులు రచించిన నాటకాలు మూడు పూవులుగా పరిమళించి, ఆరు కాయలుగా రంగస్థలంపై ప్రదర్శనకు నోచుకొని ప్రేక్షకహృదయాలను ఆనందసంద్రంలో ముంచెత్తాయి. జాతీయోద్యమ స్ఫూర్తితో, హేతువాద మానవతా దృక్పథాలతో నాటకాలు వెలిశాయి. నాటకాల్లో వ్యావహారిక భాషకు ప్రాధాన్యం హెచ్చింది. అద్యతనకాలంలో జీవితంలో వేగం హెచ్చింది; మనిషి యంత్రంలా తయారయ్యాడు. దాంతో స్వల్ప కాలంలోనే ఆనందం పొందాలనే కోరిక కలిగింది. ఖండకావ్యం, కథానిక, నవలిక మొదలైన చిన్న రచనల ప్రాధాన్యం హెచ్చింది. అదే రీతిగా నాటిక ఏకాంకికలు రచితం కాసాగాయి. ఈ నాటికా, ఏకాంకికలు గూడా పాశ్చాత్య భాషల్లోను అధ్యతనయుగంలో మాత్రమే వచ్చాయి. సంస్కృత దశరూపకాల్లో వ్యామోగం, ఉత్కృష్టకాంకం, ప్రహసనం, బాణం, వీధి – అనేవి ఏకాంకికలు. ప్రహసనం కందుకూరి మొదలు కొందరు నాటక కర్తలు రచించారు. కానీ వీటి ప్రభావం కంటే పాశ్చాత్య ప్రభావంలోనే తెలుగులో ఏకాంకికలు, నాటికలు వెలువడ్డాయి. ఈ ఏకాంకిక, నాటికలను రెంటిని సమానార్థకంగానే వాడుతూ వచ్చారు. కళాత్మకమైన ఏకాంక, నాటికా రచయితల్లో రాజమన్నారు, చింతా దీక్షితులు, చలం, నార్ల, ఆత్రేయ ప్రముఖులు; వీరి పూర్వులు; సమకాలికులు, విశ్వనాథ కవిరాజు, భమిడిపాటి కామేశ్వరరావు, తల్లావఝ్జుల, ముద్దు కృష్ణ, శ్రీపాద మొదలైనవారు. తరువాత మల్లాది, జి.వి. కృష్ణరావు, బుచ్చిబాబు మొదలైనవారు. ఈ రచయితల్లో సామాజిక స్పృహ మెండుగా ఉండి, పాఠకులను, ప్రేక్షకులను చైతన్యవంతుల్ని చేయాలన్న ఆకాంక్ష విశిష్టంగా గోచరిస్తుంది. వీరందరిలోకి నార్లవారి 'కొత్తగడ్డ' నాటికలు ఒక నూతన వరవడిని సంతరించుకొని ఎక్కువగా స్వభావవాదంతో పల్లెటూరి వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ, ఆనాటి తెలుగుసీమ ప్రజల మనోభావాలకు అద్దం పట్టేలా ప్రత్యేకతతో ఒప్పుతున్నాయి. వీరితో పోల్చదగ్గవారు రాజమన్నారు, జి.వి. కృష్ణరావు.

నా భావనలో నార్లవారి రచనలన్నింటికి కొత్తగడ్డ నాటికలు తలమానికం. కొత్తగడ్డ సంపుటిలో 17 నాటికలున్నాయి. ఇవన్నీ సాంఘికాలే. అందునా గ్రామీణ జీవన విశ్లేషణ ప్రాముఖ్యం వహించినా, నాగరిక జీవన విధానాన్ని చూపించే నాటికలూ ఉన్నాయి. కొత్తగడ్డ 1942లోనే ముద్రితం. ఈ నాటికా సంపుటిని బాలశౌరిరెడ్డిగారు 'నయాధర్తీ' అనే పేరుతో హిందీలోకి అనువదించి బయటివారికి పరిచయం చేయడం జరిగింది.

ఆనాటి తెలుగువారి జనజీవన విధానాన్ని వాస్తవీకరించిన నార్ల వారి కృషి అమోఘం. భాషా సాహిత్యాల పరంగానే కాక, రంగస్థల ప్రయోగంలోను ఈ నాటికలు ప్రత్యేకతను సంతరించుకున్నాయనడంలో సందేహం లేదు. ఇవి చాలావరకు గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబించే నాటికలైనా, కొన్ని నాగరిక జీవనాన్ని, మరికొన్ని పాశ్చాత్య నాగరికతా ప్రభావంతో, గ్రామీణాభివృద్ధి, చదువు మూలంగా మారుతూన్న జీవితాలను వివరించేవి ఉన్నాయి. టెక్నిక్ అంటే నాటక రచనా ప్రయోగాల్లో పాశ్చాత్య రీతులను అనుసరించినవి కొన్ని ఉన్నాయి. జాతీయ భావాలతో కూడిన నాటికలున్నాయి.

నాటకం లేదా నాటికలో రచయిత గొప్పదనం ఆయా ఇతివృత్తాలు, పాత్ర చిత్రణ, సంఘటనలు, సన్నివేశాల కల్పన, తగిన రీతిలో సంభాషణలు, అందుకు తగిన భాషతో ప్రయోగించి నప్పుడే విజయం సాధిస్తుంది. తత్కర్తకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చి పెడుతుంది. అందుకు నార్లవారి కీర్తికి కారణం కొత్తగడ్డ నాటికలన్నీ; విశ్లేషణాత్మకంగా పరిశీలించినప్పుడు ఇవన్నీ స్పష్టమవుతాయి.

కొత్తగడ్డ నాటికల సంపుటిలోని పదిహేడింటిలో తొమ్మిది నాటికల్లో రైతు జీవన వైవిధ్యాన్ని ప్రముఖంగా చిత్రించారు నార్లవారు. ప్రత్యేకించి కృష్ణా జిల్లా పల్లెటూళ్లలోని మామూలు రైతులు, పంటలపై ఆధారపడి జీవించే ప్రజల స్థితిగతులను, మనస్తత్వాలను, ఆనాటి వనరులను, క్రమంగా వస్తూన్న మార్పులను, సామాజిక, ఆర్థిక, రాజకీయాది స్థితిగతులను, రైతులు ఆశనిరాశలను, పండిన పంటల ననుసరించి ఈ నాటికల్లో చూడగలము.

'కొత్తగడ్డ' నాటికలన్నింటిలో ప్రముఖంగా కనిపిస్తుంది. ఈ నాటికల సంపుటికి ఈ పేరుతోనే నామకరణం చేయడం విశేషం. ఈ నాటికలోని పాత్రలకు ప్రత్యేకమైన పేర్లు లేవు. రైతు, రైతుభార్య, రైతు కొడుకు, మనుమడు. ఇవి పాత్రలు. పల్లెటూళ్లో రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో తాతా మనుమళ్ళ అనుబంధంతో నాటిక ప్రారంభం.

మారుతున్నకాలంలో మనుజుల్లోని పాతతరం, కొత్తతరం మధ్య భావసంఘర్షణ చూపించారు నార్లవారు కొత్తగడ్డలో. సంసారం పెరుగుతూ ఉంటే భూమి తరుగుతూ ఉంది. ఆస్తి పెంచుకోవాలన్న కోరిక కూడా వెళ్లబుచ్చుతాడు. అదీ వారి ఊర్లో పొలాలు చౌక గనుక, తమకున్న రెండెకరాల పొలం అమ్మి అక్కడ 20 ఎకరాలు పొలం కొని బాగుపడాలంటాడు. ఉన్న ఊరు కన్నతల్లి లాంటిదనీ, ఉన్న ఊరు వదలి కొత్తగడ్డకు వెళ్లడానికి తండ్రి అంగీకరించడు. కానీ మనవడి గురించి ఆలోచిస్తాడు. మొదట భీష్మించుకున్నా, తాను కష్టపడి పనిచేసే రోజులు పోయాయి. గనుక కొడుకు మాటనంగీకరిస్తాడు. కష్టమొచ్చినా, సుఖమొచ్చినా, చల్లని తల్లి – ఈ ఊరే మనల్ని కడుపులో పెట్టుకు కాపాడింది. దీన్ని విడిచి

పెట్టక తప్పదట్రా? గడ్డమీద పుట్టాను; ఇక్కడే పెరిగాను, ఇక్కడే మట్టికూడా అయిపోదామనుకున్నా. కొత్తగడ్డమీద అడుగెట్టాల్సి ఒస్తుందని కలలోనైనా అనుకోలేదు ... ఇంతవరకు నన్నెవ్వరు లొంగదీయలేదు. ఈనాడు *(మనుమని వీపు చేతితో తడుతూ)* ఈ పసికందు లొంగదీస్తున్నాడు...సరే! రేపు ఈ భూషయ్యకు బేరమివ్వు" ఇది రైతు సమాధానం. ఆనాటి రైతు స్థితిని వివరించే నాటిక ఇది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని రైతులు ఉన్న కొద్ది భూమిని అమ్మివేసి, దూరంగా వెళ్లి చౌకగా పొలాలు కొని వ్యవసాయం చేయనారంభించిన పద్ధతిని సుమారు 1930, 1940ల ప్రాంతంలోనే జరిగినట్లు నార్లవారు చిత్రీకరించారు. ఇది తదనంతర కాలంలో బాగా కొనసాగిన విషయం మనకు తెలిసిందే.

మరో రైతు దీన స్థితిని 'పైపంట' నాటికలో చిత్రించారు నార్లవారు. పైపంట జీవిత ఖండం. ఇక్కడ గూడా పాత్రలకు పేర్లు లేవు. రైతు, అతని భార్య, అతని కొడుకు, అతని కూతురు, సెట్టి, షాహుకారు పాత్రలు. పంట ఇంటికి వస్తే రైతుకు పండగ. ఎండనక, వాననక ఆరుగాలం కష్టించగా వచ్చిన పంట అమ్మితేగాని సంసారం సాగదు. ఈ నాటికలో పంట డబ్బు రాగానే కొడుకు ఎద్దులకు మువ్వలు కొనాలనీ, ముద్దుల కూతురుకి నల్లపూసల గొలుసు కొనిపెట్టాలనీ, భార్యకు రెండు కట్టుకోకలు కొనాలనీ భావిస్తూ ఉండగా, మునసబు కరణాలు శిస్తు పూర్తిగా కట్టమనీ, కోమటి సెట్టి తన అప్పు చుప్తాగా తీర్చమనీ, షాహుకారు నోటు పూర్తిగా చెల్లించమనీ పట్టుపట్టడంతో రైతు కుటుంబంలో నిరాశే మిగిలింది. కానీ పైపంటకు అందరి కోరికలు తీరుద్దామని రైతు ఆశాభావాన్ని ప్రకటిస్తాడు. ఇంతైనా రైతు బీద బిక్కీ అంటే ఎంతో దయగలవాడని నాటికాంతంలో నార్లవారు నిరూపించారు. రైతు ప్రజలందరికీ అన్నదాత గదా! "రైతు – దేహీ అంటూ వాకిట్లోకి వచ్చినవాణ్ణి కసరికొట్టగూడదే! ఏదీ లే! బద్ధకించబోకు, నాలుగు గింజలేసిరా!

రైతు – నోటితో లేదనడం దేనికి? చేత్తో లేదను. ఈ కాస్తకే మనకు దరిద్రం రాదులే? పొట్టకు తిన్నది మిగలదు. నలుగురికి పెట్టిందే మిగిలేది! నామాట విను, లే! *(బిచ్చగానితో)* ఆగవోయ్! ఆగు! వొస్తున్నారు!" – ఇది రైతు ధార్మిక బుద్ధి. రైతుల జీవితాల్లోని కడగండ్లు, ఇబ్బందులు ఇందులో వర్ణితం. బాకీదార్ల హజం, పంటపంటకు గిరాకీ తగ్గిపోవడం, డబ్బు విలువ అధికం కావడం – అయినా పంట పండించే రైతు ధర్మాత్ముడనీ వర్ణితం. రైతు జీవితానికి ఈ నాటిక నార్లవారి చిత్రణలో అద్దంపడుతుంది.

'ప్రారబ్ధం' విషాదాంత నాటిక. ఇందులో లక్ష్మయ్య రైతు. అతని భార్య మాణిక్యమ్మ. కొడుకు కృష్ణమూర్తి; కూతురు కమల, డాక్టరు, బండివాడు పాత్రలు. లక్ష్మయ్య పూర్వాచార పరాయణుడు. నామధారణతో భగవన్నామ స్మరణతో అతని నిత్యకృత్యం ప్రారంభం. ఎంతో మారినా అతనిలో మార్పులేదు. అంతా ప్రారబ్ధంగా నమ్ముతాడు.

ఆధునిక యుగంలో విద్యావైద్య రంగంలో ఎంతో ప్రగతి కలుగుతూండగా హేతుబుద్ధితో దాన్ని పట్టించుకోకుండా ప్రతి విషయాన్ని ప్రారబ్ధంగా భావించే లక్ష్మయ్య కూతురుకు నూతన వైద్యం చేయించక ఆచార్యులిచ్చే గుళికలతో కాలం గడిపి కూతురు కమలను చంపుకొంటాడు. 'ఇదంతా నా చిన్నప్పుడు చూసిన అంశమే. ఇవాళ్ళ అమావాస్య కదూ' 'హైరానా పడదా' అంటాడు భార్యతో కూతురు జబ్బు వికటించిందంటే. అతనికి డాక్టర్ల మీద నమ్మకం లేదు. మూఢవిశ్వాస పరుడు. కొడుకు కృష్ణమూర్తి ఉద్యోగి. వచ్చి డాక్టరుకు చూపించిన ఆలస్యమైంది గనుక కమల దక్కలేదు. తండ్రిని నిందిస్తాడు. అయినా అన్నిటికీ ప్రారబ్ధమంటాడు లక్ష్మయ్య. సమాజానికి లక్ష్మయ్య లాంటి ఛాందసులు హాని చేస్తారని మారిన కాలానుగుణంగా మనం మారవలసి ఉందని నార్లవారు చక్కటి సందేశాన్ని అందించారు. ఈ నాటికలో నామధారణా సమయంలో లక్ష్మయ్య దైవస్మరణ సందర్భంగా కూతురు జబ్బు విషయం భార్య చెబుతున్నా పట్టించుకోకపోవడంలో నార్లవారు హాస్యాన్ని అందించారు.

'శకునపక్షి' నాటికలో రామయ్య పల్లెటూరి గృహస్థు. అతని భార్య మహాలక్ష్మమ్మ. వెంకటరావు అతని కొడుకు. సీతాపతి బావమరది. ఇతడే సామెతల వ్యక్తి. ప్రతి మాటకు సామెత చెబుతాడు. అతడే శకునపక్షి. సీతాపతి ఒక గుంటనక్కలాంటివాడు. నార్లవారు ఈ పాత్రనోట అనేక సామెతలు పలికించారు. మహాలక్ష్మమ్మ దగ్గర తానేదో మంచివాణ్ణని కర్రపెండలం, మజ్జిగ సంపాదించుకోబోయి అపశకున పక్షిలా మాట్లాడి భంగపడతాడు. ఈ నాటికలో హాస్యం పోషించారు నార్లవారు. వారి సంభాషణకు చక్కటి ఉదాహరణ :

సీతాపతి : రామయ్య బావా! 'బ్రహ్మకైనా ఉండు రిమ్మతెగులు' అన్నారు. నేనన్నాది పొరపాటే. నువ్వు దాన్ని మనసులో పెట్టుకోబాకు. మరి నేనెళ్లొస్తాగాని, నామాట మరచిపోబోకుసుమీ!

రామయ్య : అబ్బే! వీల్లేదు సీతాపతీ! మాది మాకే చాలదు.

సీతాపతి : 'దంచినమ్మకు బొక్కిందే కూలి', సర్లే! ఇంకొక పుగాకు తునకైనా ఇలా పారేయ్!

రామయ్య : ఇందాక చెయ్యి జారింది చాల్లే!

సీతాపతి : నాకు తెలుసుగానీ సంగతి, 'ఎక్కడైనా బావగాని, వంగతోట దగ్గర మాత్రం బావకాదు'. మరి నేనెళ్లొస్తాగాని లక్ష్మమ్మా! నీవొళ్లు కాపాడుకో! అసలే బక్కప్రాణం. రేపొద్దునుంచి మజ్జిగనీళ్ళకు పిల్లవాణ్ణి పంపుతామమ్మా! ఇలా మహాలక్ష్మమ్మ : ఒక్కగేదె పాడి. అబ్బే మాకే తిన్నగా ఇల్లు గడవడంలేదు. సహజసిద్ధంగా సాగుతుంది నార్లవారి సంభాషణా రచన.

'వెలుగునీడలు' నాటిక గ్రామీణ జీవితఖండం. వెంకయ్య సన్నకారు రైతు. ఆయనతల్లి నరసమ్మ, భార్య రత్తమ్మ; కొడుకు గోపాలరావు. ఈ పాత్రలతో నడుస్తుందీ నాటిక. ఇందులో కాలాను గుణంగా వస్తున్న మార్పులు కొత్తపాతల వివరణ రైతుకుటుంబంలో స్పష్టంగా వర్ణితం. సన్నకారు రైతు ఆనాడు ఎలా కష్టపడ్డాడో ఇందులో మనం గమనించగలం. ఆనాటి చదువురీతిని గోపి చదువు తెలుపుతుంది. దీపపు బుడ్డి ముందు పుస్తకాలు పరచుకోవడం ఆనాటి స్థితి, విద్యుత్తులేని కాలంలో అన్ని పల్లెటూళ్లలోనూ ఇదేస్థితి.

గ్రామాల్లో ప్రజలకు సౌకర్యం కలిగించాలన్న కోరికతో ప్రగతిమార్గంలో నడిపించడం కోసం మారుమూల పల్లెటూళ్లకు రోడ్లువేసి, వంతెనలు కట్టి అప్పుడే ప్రారంభమైన రవాణా కోసం బస్సులు నడపడం పాతమీద కొత్తరీతిని తీసుకొని రావడం గమనించగలం. కొత్త పద్ధతి వలన పల్లెప్రజల్లో ఎన్నో మార్పులు వస్తాయి. కొత్త అలవాట్లు అబ్బుతాయి. ప్రశాంత జీవితంలో కల్లోలం రేగినట్లు పాతతరం వాళ్లు భావిస్తారు. కానీ రవాణా సౌకర్యాలు రావడం వల్ల వ్యాపారాభివృద్ధి, నాగరక జీవనం పెరుగుతాయి. పల్లెటూళ్ల నుంచి పట్టణాలకు రాకపోకలు పెరుగుతాయి. దుకాణాలు, హోటళ్లు, కాఫీ, టిఫిన్లు పెరుగుతాయి. ఇవి పాత కొత్తల సంధికాలంలో జరిగే అంశాలు. పల్లెటూరి పాల నుంచి పట్నం కొత్తను కలిపే 'వంతెన' నాటిక. మారుతూన్న నాగరిక సమాజాన్ని చూపించేదే 'వంతెన'. నార్లవారి గొప్పరచన. మార్పుకోసం చేసే పనులు మంచి కోసమని నాటికలో సమర్థించారు నార్లవారు. వంతెన వచ్చాక కొడుకు ఇంటిపట్టున ఉండక తిరుగుతున్నాడనీ, అందుక్కారణం వంతెన అనీ, వంతెన నిర్మాణం చేసిన భూషయ్యను అప్పయ్య నిందిస్తాడు 'ఊరే నాశనమై పోతున్నది' అంటూ.

భూషయ్య : అయితే, అప్పయ్య బావా! నిన్న పొద్దున నువ్వు తూర్పు చెరువు గట్టున ఏమిటి చేయిస్తున్నావ్?

అప్పయ్య : ఆఁ! ఏంలేదు. చెరువు నీళ్లన్నీ పసరెక్కి పోయాయని, తూము తెరిపించి కాల్వలో నుంచి కొత్త నీళ్లు ...

భూషయ్య : ఆఁ! నేను చేయించిందీ అంతే! పాత వసార నీళ్లన్నీ కొట్టేసినా, కొత్తనీళ్లెంట వొండురాదూ? చెత్తాచెదారం కొట్టుకురాదూ? తాగుతామా? కొత్తనీళ్లెంట వచ్చే వొండు తిరిగి, మంచినీళ్లు తేరుకోడానికి కొంత కాలం పట్టదూ?" అలాగని పసరు నీళ్లే చెత్తా చెదారం పోయి, అని ...

వంతెన వల్ల కొంత చెడ్డ జరిగిన రవాణా సౌకర్యాలు పెరిగి వ్యాపారాభివృద్ధి జరుగుతుందని వివరించారు. ఈ 'వంతెన' నాటికలో అప్పయ్య పల్లెటూరి రైతు, అతని భార్య కోటమ్మ.

అతని కొడుకు చలపతి. పొన్నమ్మ ఇరుగుపొరుగు ఇల్లాలు. భూషయ్య ఊరి పెత్తందారు – పాత్రలతో సాగుతుంది. క్రమపరిణామాన్ని నార్లవారు చక్కగా చిత్రీకరించారు.

'భంగపాటు నాటిక'లో వెంకట్రామయ్య పల్లెటూరి రైతు; రాజేశ్వరి అతని కూతురు. సత్యనారాయణ అల్లుడు; నాగేశ్వరరావు మేనల్లుడు. చింతాలు, భీమన్న పాత్రలు. ఇందులో ఆనాటి పల్లెటూరి వాతావరణం చక్కగా చిత్రితం. వెంకట్రామయ్య పల్లెటూరి రైతు – అయినా మిక్కిలి నేర్పరి. అల్లుడు సత్యనారాయణ మద్రాసులో పత్రికాఫీసులో పనిచేస్తున్నట్లు – పత్రిక మూతపడినా – నటిస్తూన్న విషయం గ్రహిస్తాడు వెంకట్రామయ్య. అదే భంగపాటు. మేనల్లుడు నాగేశ్వరరావు ఈ విషయం చెప్పబోగా నివారిస్తూంటాడు అల్లుడు. ఆనాటి వాహనం ఒంటెద్దు బండి. చాలా సహజరీతిని రైతు జీవితం పల్లెటూరి వాతావరణంలో వర్ణితం.

'ఏకాభిప్రాయం' నాటిక గ్రామీణ రాజకీయాలను చిత్రించే నాటిక. ఎత్తుకు పైయెత్తులు, జిత్తులమారితనం, కక్షలు కార్పణ్యాలు పల్లెటూరి రాజకీయాల్లో స్పష్టం. ఇందు ఈశ్వరరావు, రామబ్రహ్మం, వెంకటాద్రి, సుబ్బన్న, ప్రసాదరావు, జానకి రామయ్య, బిల్లు కలెక్టరు పాత్రలు.

పల్లెటూరి వాతావరణంలో రాజకీయాలకు అద్దం పడుతూందీ నాటిక. ఈశ్వరరావు ఏదైన ఊరికి మంచిచేయాలని భావిస్తాడు. కానీ ఇతరులు ఒకడిపై మరొకడు రాజకీయం చేస్తూ తానే గెలవాలన్న కోరికతో పడనీయరు. చివరికి సాగిన సంభాషణ ముగింపు ఈ విషయం స్పష్టం చేస్తుంది.

జానకిరామయ్య : ఆఁ! నీకు తెలియవులేరా పల్లెటూరి వ్యవహారాలు!
ఈశ్వరరావు : సుబ్బన్న కూడా సరిగా ఇదేమాట అనిపోయాడు సుమా! మీ ఇద్దరికీ అన్నీ
బేధాభిప్రాయాలే అయినప్పటికీ, ఒక్క విషయంలో మాత్రం ఏకాభిప్రాయం ఉన్నట్టుంది.
జానకి రామయ్య : ఏ విషయంలో?
ఈశ్వరరావు : వొర్ధి శుంఠకింద నన్ను లెఖ్ఖ కట్టడంలో! – అనే ఏకాభిప్రాయం. స్పర్ధలు, పొత్తులపై
ఎత్తులు చక్కగా చిత్రించారు నార్లవారు.

'ఆశాపాశం' అనే నాటిక గ్రామీణ వాతావరణంలోని చివరి నాటిక. భూషయ్య మోతుబరి రైతు. మాధవరావు అతని కొడుకు. వీరభద్రయ్య పైకి పెద్దమనిషి; కృష్ణమాచార్యులు పౌరాణికుడు;.

వెంకటశాస్త్రి జ్యోతిష్యుడు ఇందులోని పాత్రలు. భాగవత పఠనం సాగుతూ ఉంటుంది. ఆశాపాశం చాలా దీర్ఘమైందని సామాజిక స్థితులతో సమన్వయించారు నార్లవారు.

'కానీ నీతీ నిజాయితి లేని వారిని కొడుకైతే మాత్రం' కాపాడాలన్న తాపత్రయం తనకు లేదనీ తన కొడుకు మాధవరావుకు దురాశ పీడిస్తూందని అంటాడు భూషయ్య ధర్మబుద్ధితో.

ఈ పై నాటికలో గ్రామీణ వాతావరణంలో రచించిన నాటికలు. కాగా నాగరిక జీవనాన్ని చిత్రించిన నాటికలో రెండు : అవి : ద్రోహం, అర్ధాంగి; మరొకటి సెమీ నాగరకంగా చిత్రించిన నాటిక ఇంటిగుట్టు. తేమలో కునారిల్లుతూ నానావస్థపడి కొడుకును చదివిస్తూంటుందో తల్లి. చాలా ఆడంబరాలకు పోయి చివరికి ఆస్పత్రిలో మిత్రులు చేర్చగా చూడడానికి వచ్చిన తల్లిని చూసిన మిత్రులు నిర్ఘాంతపోతారు. విద్యార్థి చౌదరిపాత్ర ద్వారా 'గోవా' నాటికలో చాలా చక్కగా కళ్లకు కట్టినట్లు చిత్రించారు నార్లవారు. అదేవిధంగా సహవిద్యార్థుల మనస్తత్వాలను స్పష్టం చేశారు.

ఇలాగే 'అర్ధాలు' నాటికలో రెండే పాత్రలు. ప్రొఫెసర్ రాధాకృష్ణ, మిసెస్ శ్యామలా రాధాకృష్ణ. ఆ నాటికే చదువుకొన్న భార్యాభర్తలు వీరు. వారిలో కలత తలెత్తడం, అనుమానం పెనుభూతం కావడం జరిగింది. చేస్తున్న ఉద్యోగం వదలిపెట్టడం వల్లనే తన ఆర్థిక స్తోమత పోయిందనీ, ఇతరులపై తాను ఆధారపడుతున్నానన్న అపోహతో తన్నవమానిస్తున్నాడన్న భావనలో కోల్పోయిన ఆర్థిక స్తోమతను సాధించుకోవడం కోసం శ్యామల ఉద్యోగం కోసం దరఖాస్తు చేయడంతో ముగుస్తుందీ నాటిక. ఇందులో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమనే అంశాన్ని శ్యామల పాత్ర ద్వారా వివరించారు నార్లవారు.

'ఇంటిగుట్టు' నాటికలో బ్యాంక్ గుమస్తా శివరావు అవసరమైన ఆడంబరాలకు పోయి తనకంటే పెద్ద ఉద్యోగులైన మిత్రులనబడేవాళ్లను పార్టీకి పిలిచి, వారు రాకపోగా అంతా దండగ చేసుకొని ఆడంబరాలకు పోయి అవమానితుడవుతాడు. అప్పుడప్పుడే ఉద్యోగుల మనస్తత్వాల్లో వస్తున్న మార్పులను వివరించారు నార్లవారు. ఈ సందర్భంలోనే పేర్కొనదగ్గ మరో నాటిక 'ఆడబ్రతుకు': పెళ్లీడు వచ్చిన సుందరి, తల్లి సీతమ్మ, మేనత్త రాజమ్మ, నాయనమ్మ రంగమ్మ – అన్నీ స్త్రీ పాత్రలే. ఈ నాటికలో ఆనాటికి సినిమా ప్రభావం ప్రజలమీదున్న విషయాన్ని తెలిపే 'సుమంగళి', 'స్వర్గసీమ' సినిమా పాటలో నార్లవారు ఉపయోగించుకున్నారు. గ్రామఫోన్ రికార్డులొచ్చాయి. ఆనాటి ఆర్థిక స్థితిగతులు నాటికలో చూడగలము. అప్పుడే కట్నాల బెడద ప్రారంభమవుతుంది. అన్నిటికీ డబ్బు ప్రధానం. అందం, చదువు అక్కర్లేదు అవసరం లేదు. కట్నాలే ముఖ్యమని తల్లి సీతమ్మ చేత చెప్పించారు. 'డబ్బుతోనే ప్రేమలైనా, చుట్టరికాలైనా' – అనే మాటలు ఆనాటికే బలం పుంజుకొన్న సమాజాన్ని నార్లవారు చిత్రించారు.

నవ కవులపై చక్కటి చమత్కార వ్యంగ్య రచన 'భావకవి' నాటిక. సమాజంలో ప్రారంభ మవుతున్న స్వార్థపర శక్తులమూలాన అవినీతి జడలు విప్పుతూన్న తీరుతెన్నులను 'దొంగ దొర' నాటికలో నార్లవారు చక్కగా వివరించారు.

ఇది టెక్నిక్ పరంగా నార్లవారు సాధించిన నాటకీయత. స్టేజీమీద ఒకే పాత్ర – దానిలో నాటికను నడపడం జరుగుతుంది. ఇదేరీతిగా మరో నాటిక దాంపత్యం. అయితే ఇక్కడ భార్యాభర్తలు రెండు పాత్రల్లో స్టేజిమీద ఉన్నా ఒక్క పాత్ర భార్య మాత్రమే సంభాషిస్తుంది. ఇదో టెక్నిక్, ఇందుకే పేర్కొన్న ఆడబ్రతుకు నాటిక లైట్ ఆన్ ఆఫ్ లతో సీన్ మారినట్లు చక్కటి టెక్నిక్ ప్రయోగించడం జరిగింది. ఈ విధంగా తదనంతరకాలంలో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు నాటికా ప్రదర్శనలో కూర్మా వేణుగోపాలస్వామిగారు అనుసరించిన విధానం 'వెలుగునీడలు' నాటికను ఆంగ్లంలోని హెరాల్డ్ భాషిన్ రచించిన 'ది డంబ్ అండ్ ది బ్లయిండ్' అనే ఏకాంక నాటిక ప్రభావం ఉందని నార్లవారే పేర్కొన్నారు. కాగా చివరినాటిక జీనజ్వాల మాతృదేశభక్తి ఇందులోని ముఖ్యాంశం. కథ వార్సాలో జరిగిన అంశం. 1939 రెండో ప్రపంచ యుద్ధ ప్రారంభంలో పోలెండు స్వాతంత్ర్యం కోసం తాతతోపాటు మనుమడు పడిన ఆవేదన. కుమారుడు అంతకు ముందే ప్రాణాలర్పించాడు. తల్లి హృదయావేదనను స్పష్టం చేశారు నార్లవారు.

ముందే పేర్కొన్నట్లు నార్లవారు నాటికా రచనలో సిద్ధహస్తులున్న విషయం స్పష్టం. నార్లవారితో పోల్చదగిన నాటికాకర్తలు ప్రముఖంగా ఇద్దరు. నగర జీవనం – అందునా స్త్రీల సమస్యలు తీసుకొని చక్కటి నాటికలు రచించి రాణించినవారు రాజమన్నారుగారు. వారి 'నిష్ఫలం', 'ఏమి మగవాళ్లు?' ప్రసిద్ధ నాటికలు. అలాగే హేతుబుద్ధితో మానవతా దృక్పథాన్ని వెలువరించినవారు డాక్టర్ జి. కృష్ణరావుగారు. వారి ప్రముఖ నాటికలు 'భిక్షాపాత్ర', 'యాదవ ప్రళయం', ఓ ధమ్మలం.

ఈ విధంగా ప్రత్యేకించి పల్లెటూరి వాతావరణానికి, రైతు జనజీవన విధానాలకు, మారుతూన్న సామాజికార్థిక రాజకీయాల పరిస్థితులకు, మారుతూన్న విలువలకు, ధన ప్రాధాన్యానికి, మానవ మనః ప్రవృత్తులకు అద్దంపట్టేలా ఎక్కువ నాటికలు రచించిన నార్లవారు వివిధ దృక్కోణాల నుంచి సమాజాన్ని సందర్శించి ఈ కొత్తగడ్డ నాటికలు రచించి విశిష్ట నాటికాకర్తగా నిరూపించుకున్నారు. దీనికి తోడు నాటిక ప్రదర్శనలో అద్భుతమైన 'టెక్నిక్' తీసుకరావడానికి యత్నించిన తీరు ప్రశంసనీయం. అలాగే ఆనాటి తెలుగు పలుకుబడి, నుడికారాలు, సామెతల తియ్యదనాన్ని నాటికలో చక్కగా పొదిగించి సాహిత్య గౌరవం తెచ్చారు నాటికలకు. ఆధునిక యుగంలో.

నాటిక రచనలో స్వభావవాదానికి (Realism) ఒక ప్రాముఖ్యముంది. పల్లీయజీవిత వర్ణనలో నార్లవారు స్వభావవాదాన్ని వాడుకున్నారు. పల్లీయుల జీవిత ప్రతిబింబం నార్లవారి నాటికలో ముందే పేర్కొన్నాను. జానపదులలోని స్వార్థాలు, ఈర్ష్యాసూయలు, ఛాందసం, మూర్ఖత్వం, సంకుచితభావాలు. మొదలైన వాటిని సహజంగా చిత్రించి, వారిలో సహజమైన మంచితనాన్ని, నిష్కపటతను చక్కగా

చిత్రించి, తీర్చిదిద్దారు తమ 'కొత్తగడ్డ' లోని నాటికలను. ఇంతటి వైవిధ్యమూ, తన్మూలంగా అనల్ప శిల్పకల్పనతో గూడిన నాటిక రచనలోని విశిష్టత నార్లవారికే దక్కింది.

ఉపకరించిన గ్రంథాలు :

1.నార్ల రచనలు, 2 సాంఘిక నాటికలు, వ్యాసాలు (కొత్తగడ్డ, మాటామంతీ, పిచ్చాపాటి, కొత్తా–పాతా) – 2004. సంపాదకులు : డాక్టర్ వెలగా వెంకటప్పయ్య.
2 కొత్తగడ్డ : నార్ల వెంకటేశ్వరరావు, 1947
3 తెలుగు నాటకం : డాక్టర్ ఎస్. గంగప్ప, 1985
4 తెలుగు నాటకం – సామాజిక చైతన్యం. ఆచార్య ఎస్. గంగప్ప, 2005
5 ఆధునిక తెలుగు నాటకం, గండవరపు సుబ్బరామిరెడ్డి, 1989

ఆచార్య ఎస్. గంగప్ప; *1936లో అనంతపురం జిల్లా, నల్లగుండ్రాలుపల్లిలో జననం.*

"కోలాచల శ్రీనివాసరావు నాటక సాహిత్యం"పై పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టా పొందారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో తన ఆచార్యత్వంలో 27 పిహెచ్.డి.లు, 20 ఎం.ఫిల్ డిగ్రీలకు పర్యవేక్షణ కావించారు. ఆంధ్రదేశంలోనే కాకుండా, దేశంలోని మరెన్నో విశ్వవిద్యాలయాల్లో వివిధ సాహిత్య, పరిశోధన శాఖలలో వీరు పొందిన సభ్యత్వం లెక్కకు మించినవి. ఇప్పటికి తెలుగు సాహిత్యంపై 73 పుస్తకాలు ప్రచురించి, మరెన్నో గ్రంథాలు ముద్రణకు తయారు కావించిన మహోదయులు. నార్ల కుటుంబానికి మిత్రులు.★

స్వదేశ సంస్థానాలు : రచయితగా తొలి విజయం

– నాగసూరి వేణుగోపాల్



"ఆధునికాంధ్ర వాఙ్మయానికిది అమూల్యమూ, అపూర్వమూ అయిన ఆభరణం. ఈ పుస్తకం చదివిన వారు నిజంగా ఉలికి పడకుండానూ, సిగ్గు పడకుండానూ, జలదరించుకోకుండానూ, క్రోధమూర్తులు కాకుండానూ, గగ్గోలు పడకుండానూ, చివరికి ఏడవకుండానూ ఉండలేరు. ఇలాంటి పుస్తకాలే ఇప్పుడు తెనుగువారికి కావాలి..." ఈ మాటలను కొద్దిగా పరిశీలిస్తే ఇవి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రివని ఇట్టే చెప్పగలం. 'ప్రబుద్ధాంధ్ర' లో ప్రచురింపబడిన సమీక్షలోని మాటలివి.

మరి ఏ పుస్తకం గురించి? దాని పేరే; **'స్వదేశ సంస్థానాలు'** గ్రంథకర్త : నార్ల వెంకటేశ్వరరావు, ప్రకాశకులు : నార్లవారు, కవుతరం (పోస్టు), కృష్ణా. ప్రథమ ముద్రణ : శ్రీముఖ కార్తీకం, మరి ఈ పుస్తకం గురించి అప్పట్లో 'ది హిందూ' పత్రిక ఏమి రాసిందో తెలుసా?... "Unsparing and relentless criticisms. Sincere and passionate book" ఈ పుస్తకం చేతికందగానే కృష్ణా పత్రిక సంపాదకులు ముట్నూరి కృష్ణారావు పత్రికలో తన ప్రధాన వ్యాసాలలో ఒకదాన్ని ఈ పుస్తక సమీక్షగా మలిచారు.

పాతికేళ్లు నిండని యువకుడు, బి.ఏ. కూడా పూర్తిచేయని యువకుడు అయిన నార్ల రాసిన తొలి పుస్తకం ఇది.. 1908 డిసెంబరు 1న జన్మించిన నార్ల 1933 నవంబరు / డిసెంబరు ప్రాంతంలో 'స్వదేశ సంస్థానాలు' పుస్తకం వెలువరించాడు. ఒక పుస్తకం విజయవంతం కావాలంటే ఆ పుస్తకం స్పృశించే విషయం, చెప్పే దృక్పథం, వివరించే విధానం లేదా శైలీ, చివరిగా ఇప్పటి పరిభాషలో మార్కెటింగ్ – అంశాలను ఆకళింపు చేసుకోవాలి. అంటే ఎక్కువ మందికి సంబంధించిన అంశం గురించి, ఎక్కువ మందికి లాభపడే దృక్పథంలో, ఎక్కువ మందికి ఆసక్తి కలిగించే శైలిలో ఉండటం. వీటికి తోడు పుస్తకానికి సరైన ప్రచారం – అర్థవంతమైన రీతిలో ఉంటే అది తప్పక విజయవంతమవుతుంది. నేపథ్యంలో ఆ పుస్తకం వెలువరించిన రచయిత ప్రతిభకు దర్పణంగా ఉంటుంది.

దేశ విస్తీర్ణంలో మూడోవంతు, జనాభాలో ఐదోవంతు ప్రాతినిధ్యం గలవి అప్పట్లో సంస్థానాలు. హైదరాబాదు సంస్థానం ఇటలీ దేశం వైశాల్యంతో పోల్చవచ్చు.

అలాగే మైసూరు సంస్థానం, ఐర్లాండు దేశంతోను, బికనీరు సంస్థానం గ్రీసు దేశంతోను, జయపూరు సంస్థానం స్విట్జర్లాండు దేశంతోను పోల్చవచ్చు. అప్పటికే కాశ్మీరు, ఆళ్వారు సంస్థానాల్లో జరిగిన తిరుగుబాట్లు వార్తల్లో ఎక్కాయి. ప్రతి సంస్థానంలో పరిస్థితి దారుణంగా ఉంది. జనాభా దాదాపు ఏడుకోట్ల మంది *(పుస్తకం ప్రచురింపబడే నాటికి).* మరి వీరి గురించి సంస్థానాధీశులు ఎలా పట్టించుకున్నారో, ఎలా హింసించారో పుస్తకం చెబుతుంది. కాంగ్రెస్ సంస్థ దీని గురించి పట్టించుకోవడం లేదని రచయిత అన్నారు. సంస్థానాధీశులు బ్రిటీషు వారికి అనుకూలం కనుక వారి దుష్పరిపాలనను బ్రిటీషు వారు పట్టించుకోవడం లేదని 'ఉపసంహారం' అధ్యాయంలో పేర్కొన్నాడు. స్వదేశ సంస్థానాలను గూర్చి పట్టించుకోకపోవడం... "సంతాపకరమే కాదు – ఆత్మహత్యాసదృశ్యము కూడా!" అని పుస్తకం రెండవ పేరాలోనే అన్నాడు. వారి కాంక్షల పట్ల సానుభూతి ప్రకటించడం మన సామాన్య ధర్మం అన్నాడు. వారికి గుండె దిటవు కల్పించడానికి, "ధర్మనిర్వహణ ప్రబోధమునకే" ఈ రచన. రెండవ పేజీలో మరో మాట అన్నాడు. “భారత భావి భాగ్యోదయానికి ముందు స్వదేశ సంస్థానాలు అడ్డుతగులవలసియున్నవి కాబోలును". పరిశీలించండి. ఇది 1933 చివర్లో అన్నమాట. ఈ మాట తర్వాత చరిత్రగా మారింది. సంస్థానాధీశుల రాజకీయ ఎత్తుగడలు ఒక్కసారి గుర్తుచేసుకోండి. హైదరాబాదు నిజాంపై 1948 పోలీసు చర్య పరాకాష్ట!

ఉపక్రమణిక తర్వాత మొదటి అధ్యాయం 'మహారాజులు'. ఈ వ్యాసంలోని తొలి వాక్యం – “పరిపాలకుని జీవన క్రమము ననుసరించియే యాతని పరిపాలన విధానముండును”. అందువల్ల వారి జీవన విధానం వివరించి పరిపాలన గురించి వివరించే ప్రయత్నం జరిగింది. రాజుగారికి భార్యల సంఖ్య ఎక్కువ. అందువల్ల రాకుమారులకు సవతి తల్లుల నుంచి ముప్పు ఉండకపోదు. అందువల్ల బాల్యం నుండే వారు అనుమానాస్పద వ్యక్తుల మధ్య ఉండాల్సి వస్తుంది. వారి రక్షణ మాత్రం పరమ విశ్వాసపాత్రుల చేతిలో నడుస్తుంది. వారు బాల రాకుమారుని ‘తండ్రీ’, ‘ప్రభూ’, ‘దేవా’ అని సంబోధిస్తూ ఉంటారు. తర్వాత పరీక్షలు లేని ప్రత్యేక పాఠశాలలో చదువు సాగుతుంది. “దాస దాసీ జనులొకప్పుడు తెలివి తక్కువగ జేసిన ముఖస్తుతిని, వీరిప్పుడు చాకచక్యంతో నిర్వర్తింతురు. ఇది సామాన్య విషయమా?" అని రచయిత అంటాడు. విద్యాలయంలోనే త్రాగుడు వంటి గుణాలబ్బుతాయి కానీ చదువు అంటదు. అంతేకాదు “సుఖ సంకటము లంటెను”.

“ఇట్లు విద్య (అవిద్య?) ముగిసిన పిమ్మట రాకుమారుని యువరాజ్య పట్టాభిషిక్తుని గావింతురు. అటు పిమ్మట వివాహ...” అని రచయిత నార్ల ఆ అధ్యాయం చివర్లో అంటాడు. అంటే అది బహువచనం అన్నమాట. అదే సమంజసం, సత్యం కూడా తర్వాతి అధ్యాయం మొదలవుతుంది. – అని

"సుబ్బి పెండ్లి, వెంకి చావుకి వచ్చిన ”దన్నట్లు అంటూ నార్ల రాకుమారుని పెళ్లి ప్రజలకెంత సమస్యో వివరిస్తారు. స్వయంగా కష్టపడి ఏర్పాట్లు చేయాలి; ఎద్దులు, బళ్ళు పంపాలి; అవసరమైతే చెంబు, చేంతాడు ఇవ్వాలి. ఇది చాలక “ఏడు కొండల వాని ముడుపులా” వివాహ సుంకం కట్టాలి. ఇక పెళ్ళి తర్వాత రాజుల పరిస్థితి ఏమిటి? దీనికి 'బొంబాయి క్రానికల్' పత్రికలో ఒక రాణి రాసిన ఉత్తరంలోని కొన్ని భాగాలను అనువదించి అలాగే ప్రచురించాడు.

ఈ ఉత్తరం కొన్ని భాగాలే దాదాపు నాలుగు పేజీలుగా మనకు అచ్చులో దర్శనమిస్తాయి. ముగింపు ఇలా ఉంటుంది.

"మీరు దక్షిణాఫ్రికాలో ఉన్న భారతీయుల దుస్థితికై వగయుచున్నారు. మీరు మీ యభాగ్య సోదరీమణుల కరుణా ఆక్రందనం వినరా?" ఇది స్పందించే మనిషిని తీవ్రంగా స్పందింపచేస్తుంది. ఇటువంటి స్పందనే వార్లను ఈ రచనను చేయించింది. తర్వాతి అధ్యాయం 'విలాసలీల' – "సంస్థానాధీశులు బహుపత్నీకులే కాదు – ఘోర వ్యభిచారసక్తులు కూడా" – అంటూ మొదలౌతుంది. అంతకు ముందు 'చాంద్' హిందీ మాసపత్రిక ప్రచురించిన భోగలాలసత గాథలను రచయిత పేర్కొంటారు. ఈ వివరాలు చదివితే జుగుప్స కలుగుతుంది. శ్రీపాదవారి అభిప్రాయం మరలా ఒకసారి చదువుకోండి – బోధపడుతుంది.

కేవలం పత్రికలు ప్రచురించిన గాధలు మాత్రమే కాక 1932లో రచయిత మిత్రుల సందర్శనార్థం బెనారస్ విశ్వవిద్యాలయం వెళ్ళినపుడు – సంస్థానాధీశుల పతిత జీవితం గురించి స్వయంగా విన్నారు. సంస్థానాధీశులు ఇట్టి ఏహ్యకార్యాల్లో వినియోగించుకునే క్రమంలో – వార్తా పత్రికల్లో ప్రకటన చూసి, మోసపోయిన ఒక రచయిత గురించి పేర్కొంటాడు.

మొత్తం పుస్తకం 105 పేజీలు 17 అధ్యాయాలుగా ఉంది. అంటే అధ్యాయం సగటున అరేడు పేజీలు! అయితే 'వ్యభిచారము' అనే అధ్యాయం అత్యధిక పుటలు – అంటే 12 పుటలు సాగింది. అంతకు ముందు అధ్యాయాలు 'వివాహము', 'విలాస లీల' కూడా దాదాపు 12 పుటలున్నాయి. ఈ మూడు అధ్యాయాలలో విషయం విశృంఖల భోగలాలసత. అంటే అంత పుస్తకంలో దాదాపు నాలుగోవంతు రాజుగారి కామ కలాపాల వివరాలు ఆక్రమించాయి.

నిజానికి వారి జీవితం మొత్తం ఆక్రమించింది ఇవే! వీటికి ఆధారంగా 'లండన్ వీక్లీ డిస్పాచ్'లో జె.డబ్ల్యు. బ్లే కు రాసిన అంశాలు, 1925 జనవరి 24న 'కృష్ణాపత్రిక' ప్రచురించిన విషయాలు. అలాగే 1925 జనవరి 17 'కృష్ణాపత్రిక' అందించిన సమాచారం, 1933 సెప్టెంబరు 17 'ప్రిన్సిలీ ఇండియా' రాసిన గాథలు, 'గాబా' రచయిత రాసిన ఘోరదురంతాలు ఇలా జుగుప్స, క్రోధం కలిగించే అంశాలు రాస్తూ చివరికి 'మానవులను గూర్చియేనా? లేక... లేక...' అంటూ సందేహపడతారు నార్ల!

వ్యభిచారం తర్వాత స్వంత ఖర్చులు, దుర్వ్యయం, శాసన సభలు, సంస్థానోద్యోగులు, న్యాయ విచారణ, పన్నులు, బేగారి, విద్యాసౌకర్యాలు, వైద్యసహాయం, వాక్స్వాతంత్రం, తీర్పు – అనే అధ్యాయాలు సాగుతాయి. ఇటలీ దేశపు ఆదాయం (అప్పట్లో) 20 కోట్ల పౌండ్లు. అందులో 1/70 వంతు మాత్రమే మైసూరు సంస్థానం ఆదాయం. అయినా మైసూరు మహారాజు స్వంత ఖర్చులకు ఇటలీ దేశాధినేత కన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువ తీసుకునేవారు. 'వేటకగు పైకమును ఫారెస్టు డిపార్ట్ మెంట్ పేర ఖర్చు వ్రాయుచున్నారు. వేశ్యలకు ఖర్చు (గాబా ఛలోక్తిగా నన్నట్లు) హోం డిపార్టుమెంటు లెక్కలలో చేర్చుచున్నారు" అంటూ మన సంస్థానాధీశుల ఖర్చుతో ఇంగ్లాండు, బెల్జియం, ఇటలీ, డెన్మార్క్, జపాను, నార్వే దేశాధినేతల ఖర్చును నార్ల పోల్చి వివరాలు, అంకెలు ఇచ్చారు.

'దుర్వ్యయము' అనే అధ్యాయంలో ఖర్చుల వివరాలు ఇచ్చి – "ఈ లెక్కలను జూచినప్పుడు పెండ్లాము మెడలోని పుస్తెనమ్మి, శిస్తును చెల్లించు రైతు పడు చిత్తక్షోభ, హృదయవేదన..." అంటూ రాశాడు. అలాగే "శాసన సభలు" అనే అధ్యాయంలో ఛటర్జీ రాసిన రాజపుత్రస్థాన సంస్థాన వ్యాసం గురించి పేర్కొన్నాడు. అలాగే రచయితే 'భారతి' మాసపత్రికలో రాసిన వ్యాసం గురించి కూడా చెప్పాడు.

"మీ లేఖలో నుల్లేఖించిన ఇద్దరిని తేవలెను. వారు చాలా అందంగా ఉండవలెను. నాకు నచ్చిన వారిని తేగలిగినచో మీరు నా విశ్వాసపాత్రులైన సేవకులని భావింతును..." ఇది ఒక మహారాజుగారు దివానుకు స్వయంగా రాసిన ఉత్తరంలోని విషయం. ఇక సంస్థానోద్యోగులు ఎలా ఉంటారో ప్రజలను ఎలా పీడిస్తారో మనం ఊహించవచ్చు. ఇక న్యాయవిచారణ ఎలా ఉంటుంది? అలాగే 'పన్నులు' అనే అధ్యాయంలో చాలా వివరాలు ఇస్తాడు రచయిత. ఆళ్వారు సంస్తానంలో 16 సంవత్సరాలలో జనాభా ఒక లక్ష తగ్గినా ఆదాయం రెట్టింపు ఎలా అవుతుంది? ఎంత పీడన ఉంటుంది? రచయిత చాలా వివరాలు ఇచ్చి – పాఠకునికి ఆశ్చర్యం కలిగిస్తాడు. విద్యా సౌకర్యాలు, వైద్య సహాయం, వాక్స్వాతంత్ర్యం గురించి వివరంగా రాస్తాడు.

తర్వాత 'తీర్పు' అంటూ ఒక అమెరికా రచయిత, 'న్యూస్ క్రానికల్' సహాయ సంపాదకుడు, భారత శాసనసభ్యుడు రంగయ్యర్, అలాగే కల్నల్ పోవెల్ – గార్ల అభిప్రాయాలు పేర్కొని రచయిత

“ఇంతమంది జడ్జీలు తీర్పు చెప్పిన పిదప, నేను ప్రత్యేకంగా రాయదగింది వేరేదియు నుండదు గదా!" అంటూ ముగిస్తాడు.

ఇక ‘ఉపసంహారము’లో "సంస్థాన ప్రజలైనను, సంస్థానేతరులైనను నేడు భారతీయుల కందరికొకటే ధ్యేయము. అది స్వపరిపాలన. ఒకటే పద్ధతి అది శాంతి పద్ధతి. ఒకటే పరీక్ష : అది అగ్ని పరీక్ష...” అంటూ ముక్తాయింపు వాక్యాలు చెబుతాడు.

ఇక్కడ రచయిత నార్ల కృషిని వివిధ రకాలుగా గమనించాలి. నైజాం సంస్థానం నార్ల ఉన్న కృష్ణా జిల్లాకు పొరుగునే ఉంది. "ఎందుకొచ్చిన సమస్య?” అనే పలాయన వాదం ఇష్టపడే వాడయితే ఈ పుస్తకం రాసి ఉండేవాడు కాదు. ఆ రకంగా మంచి ధైర్యమున్న రచయిత అని చెప్పక తప్పదు. దేశ, విదేశ పత్రికల నుంచి, పలు ఆంగ్ల గ్రంథాలను సైతం అధ్యయనం చేసి సమాచారం సేకరించు కున్నాడు. తన ఉత్తరదేశ పర్యటనలో తెలిసిన విషయాలను పరీక్షించినాడు. అందుబాటులో ఉన్న సమాచారంతో 'భారతి' మాసపత్రికలో కొన్ని వ్యాసాలు ప్రచురించాడు. 1933 ఆగస్టులో వెలువడిన పత్రికా వార్తలను సైతం కలిపి 1933 నవంబరు / డిసెంబరు (శ్రీముఖ కార్తీకం) లో పుస్తకం వెలువరించడం సులువు అయిన విషయం కాదు. పుస్తకం వెలువడగానే ముట్నూరుగారికి ఇవ్వడం, దాన్ని ఆయన పత్రికాముఖంగా శ్లాఘించడంతో పుస్తకం బాగా అమ్ముడుబోయినట్లు, ప్రశంసలు పొందినట్లు తెలుస్తోంది.

నార్ల రచయితగానే కాక, ఇతర విషయాలలో కూడా చొరవ ఉన్న వ్యక్తి అని చెప్పాలి. 2001లో నాకు లభ్యమైన 'స్వదేశ సంస్థానాలు' పుస్తకం జిరాక్స్ ప్రతే నా దగ్గర ఇప్పుడు ఉంది. అయితే ఆ పుస్తకానికి అంతకుమించిన ప్రత్యేకత ఉంది. 10-12-1933 తేదీతో నార్ల వెంకటేశ్వరరావు 'ఫర్ ఫేవర్ ఆఫ్ ఒపీనియన్' అంటూ డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డికి రాసిన పుస్తకం అది. అప్పటికి కట్టమంచివారు లబ్ధ ప్రతిష్టులు. వారి అభిప్రాయం కొరకు పుస్తకం పంపాలనుకోవడం – ఔత్సాహిక రచయిత నార్ల విషయంలో మంచి చొరవే అని చెప్పాలి.

“అంకితం :అమ్మకూ, నాయనకూ” అని రాశారు. అందులో ఆశ్చర్యం లేదు. తర్వాత ‘కృతజ్ఞుడను’ అంటూ “ఈ గ్రంథ రచనకు నన్ను ప్రోత్సహించినట్టియు, దీని ముద్రణకు నాకు తోడ్పడినట్టియు మిత్రులందరికి"ని అని ప్రకటించుకున్నాడు. నార్ల బాల్యం, విద్యాభ్యాసం అంత సజావుగా సాగలేదు. ఆర్థిక సమస్యలు అడుగడుగున బాధించాయి. మరి తొలి పుస్తకాన్ని సొంతంగా ప్రచురించుకోవడం ఎలా సాధ్యపడింది? ఇది ఆశ్చర్యం కలిగించే విషయమే! వివరాలలోకి వెడితే అతని కార్యసాధన, చొరవ బోధపడుతుంది.

మద్రాసు మూర్ మార్కెట్టులో ఒకచోట భుగ్గన్ రచించిన "ఇండియన్ ప్రిన్సెస్ అండర్ బ్రిటిష్ ప్రొటెక్షన్" అనే పుస్తకం చూశాడు. అంతకు ముందు స్వదేశ సంస్థానాల గురించి పత్రికల్లో వచ్చిన వ్యాసాల కటింగులు నార్ల దగ్గర ఉన్నాయి. అందువల్ల ఆసక్తి కలిగి ఆ పుస్తకం కొనాలనిపించింది. ఆ పుస్తకం వెల ఒక రూపాయి (అప్పట్లో బస్తా వడ్లు మూడు రూపాయలు). అయితే డబ్బులే లేవు. తన వెంట ఉన్న వాడ్రేవు జగ్గరాజును పుస్తకం కొనిపెట్టమని అడిగాడు. అలా జగ్గరాజు కొని ఇచ్చిన పుస్తకం, తన వద్ద ఉన్న పేపరు కటింగుల ఆధారంగా పుస్తకం రాశాడు. అయితే చాలామంది అనుకున్నట్టు హెచ్.హెచ్. గేబా రాసిన పుస్తకం తమ ముందు చదువలేదని నార్ల పేర్కొన్నాడు. మరో విషయం ఏమంటే ఈ పుస్తకం నార్ల పుస్తకం కంటే రెండు, మూడు వారాల ముందే వెలువడిందని కూడా నార్ల అన్నాడు.

బి.ఏ. చదువుతూ నార్ల రాసిన పుస్తకం ఇది. వేయడానికి డబ్బు లేదు. బయటకు ప్రచురణకు ఇవ్వాలని తనకు తోచలేదని నార్ల *(1980లో)* ఒక పరిచయంలో చెప్పాడు. కొంతమంది స్నేహితులతో పదిరూపాయలు చొప్పున ఇవ్వకూడదా పుస్తకం రాస్తాను అన్నాడు. దాంతో పదిమంది మిత్రులు తలో పదిరూపాయలు చొప్పున ఇచ్చారు. ఆ వందరూపాయలతో 112 పేజీల పుస్తకం తయారైంది. అంటే కేవలం ప్రింటింగు ఖర్చులే కాకుండా, బెజవాడలో కొన్ని రోజులుండి బెజవాడ ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాల యందు ప్రూఫులు దిద్దుకుంటూ, హోటలు ఖర్చు పెట్టుకోవడానికి కూడా ఆ వందరూపాయలే సరిపోయాయి. పుస్తకం ఖరీదు ఎనిమిది అణాలు. పుస్తకం వెలువడ్డాక మిత్రులకు 20 లేదా 30 కాపీలు – ఆర్థిక సాయానికి ప్రతిఫలంగా ఇచ్చాడు. వారు ఆ పుస్తకాలు అమ్ముకుని, తమ డబ్బులు తాము తీసుకున్నారు. ఆరు నెలల్లో కాపీలు అయిపోయాయి. ఫలితంగా ఈ పుస్తక ప్రచురణ వల్ల 100, 150 రూపాయలు మిగిలినట్టు నార్ల చెప్పుకొన్నారు.

సాహసోపేతమైన విధంగా విషయాన్ని ఆలోచనా విధానాన్ని ఎన్నుకోవడం విశేషం. దానికి అందుబాటులో ఉన్న పత్రికలు, పుస్తకాల ద్వారా ప్రోగుచేసుకుని పుస్తక రచనకు దిగడం సరైన వ్యూహం. అంతకు మించి మిత్రుల సాయంతో పుస్తకం ప్రచురించి, వారికి పుస్తక ప్రతులు ఇవ్వడం మరింత ముదావహం.

ఇక పుస్తకంలో వాడిన భాష సరళ గ్రాంథికం. అయితే ఆ శైలిలో వెటకారం, వ్యంగ్యం, పదును పుష్కలంగా ఉన్నాయి. ఉదయం రోజును సూచిస్తుందని ఆంగ్లంలో ఓ మాట ఉంది. అదే రకంగా నార్ల ప్రతిభా పాండిత్యాలను ఈ తొలి పుస్తకం చెప్పకనే చెబుతుంది.★

నిషేధానికి గురైన నేటి రష్యా

– నాగసూరి వేణుగోపాల్

"క్రూర కుటిల కఠోర సంఘాన్ని రూపుమాపి, ఉచ్ఛ, నీచ, శ్రీమంత – నిరుపేద మొదలైన కృత్రిమ భేదముల కెడమని, నూత్న విశ్వ వ్యాప్త మానవ సంఘమును నిర్మించుటకై చేయబడు ప్రయత్నమే సామ్యవాదము. ఈ ప్రయత్నమునకే లెనిన్ జీవించెను; దీనికొరకే పెక్కు క్లేశముల ననుభవించెను. తుదకు దీనిలోనే మరణించెను!..."

ఈ మాటలు నార్ల వెంకటేశ్వరరావుగారివి అని అంటే నేడు ఈ శైలికి ఆశ్చర్యం – కలుగవచ్చు. ఇంకా చూడండి.

"... రాజనీతిజ్ఞునికుండు మహాదూరదృష్టిని, మత ప్రబోధకునికుండు గాఢ విశ్వాసమును; పరిపాలకునికుండు విపుల కార్యదక్షతను, మాంత్రికుని కుండు ప్రబల వశీకరణ శక్తిని, వీరవరుని కుండు అశేష ధైర్యస్థైర్యములను ఏక మయమున గలిగిన పురుష పుంగవుడొకడు రష్యాలో లేకపోలేదు. అతడే లెనిన్!..."

1934 జులైలో వెలువడిన నార్ల రెండవ పుస్తకం, తెలుగులో రష్యా గురించి వచ్చిన తొలి పుస్తకం, "నేటి రష్యా" ప్రవేశికలోని వాక్యాలు ఇవి. 1914–1918 మధ్యకాలంలో మొదటి ప్రపంచ యుద్ధం సంభవించింది. 1917 అక్టోబరులో రష్యాలో విప్లవం (అక్టోబరు విప్లవం) జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాల గురించి ఆసక్తి మొదలైంది. 1920లో భారత రాజకీయాలలో గాంధీజీ ప్రవేశంతో కొత్త మలుపు సాధ్యమైంది. వార్తాపత్రికలు ప్రాచుర్యంలోకి అపుడపుడే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రష్యా గురించి ఆసక్తి సహజమే! సామ్యవాదం గురించి ఆరాధన కూడా అర్థవంతమే.

సోషలిజము వేద సూక్తమై చెల్లక
వర్ధమాన మౌనె వసుధనేడు?
సోషలిజమె నేటి సుశ్లోక మతమురా!
నవ యుగాల మాట నార్ల బాట!

1954లో రాసిన ఈ పద్యం 1974, 1984 ఎడిషన్లలో చక్కగా ఉండిపోయింది. మకుటం మారింది కానీ పద్యం మారలేదు. సామ్యవాదం, స్వేచ్ఛ, సమానత్వం మీద నార్లకు అంత గురి, అంత విశ్వాసం, అంత ఆసక్తి!

1934లో రష్యాలోపల సమాజం ఎలా ఉంది, అంతకు ముందు ఎలా ఉండేది – అని పోల్చి అక్కడక్కడ భారతదేశ పరిస్థితిని పోలుస్తూ రాయబడింది – 'నేటి రష్యా' పుస్తకం. "నేడు ఆ రష్యాలో ప్రజలే యుద్ధ మొనర్చుచున్నారు. యుద్ధం జరుగుచున్నది రణావనిని గాదు, జీవిత క్షేత్రమున! దీని ధ్యేయము శత్రుజన విధ్వంసనము కాదు, – నూతన మానవ సంఘ ప్రతిష్ఠా పనము!! ఈ యపూర్వ యుద్ధములో సామ్యవాద పక్షీయులే నాయకులు! పదునారు కోట్ల రష్యను ప్రజలే సైనికులు!!..." *(ప్రవేశిక)*

"... కారల్ మార్క్సు సిద్ధాంతముల ప్రకారమే ఫ్యాక్టరీలు, రైల్వేలు, బ్యాంకులు మున్నగు ఆధునిక పారిశ్రామిక జీవన సంస్థలన్నియును పరిపూర్ణముగ నభివృద్ధి నందిన దేశముననే గాని, సామ్యవాదము జయప్రదము కాజాలదు. ఇట్టి సంస్థలు కేవలము నామమాత్రముగ నున్నప్పుడే – సాటిలేని పరిస్థితులను బట్టి – రష్యా ప్రజలు సామ్యవాదము స్వీకరించుట తటస్థించినది. తత్కారణముగ వారు విజయమును బడయగల్గుట మహాకష్టము..." *(ప్రవేశిక)* అంటూ పుస్తకం నేపథ్యం గురించి వివరిస్తూ రచయిత నార్ల తన ప్రవేశికను ఇలా ముగిస్తాడు.

''...ఈ కష్టములన్నియు రష్యను ప్రజలకు తెలియనివి కావు. వీని నతిక్రమించుటకై వారు మహోత్సాహులై కృషి సలుపుచున్నారు. వారి కృషిని గూర్చి సర్వమును తెలిసికొనుట మన విధి. ఏలనన నేడు ప్రపంచములో రెండే యుద్యమములున్నవి. అవి సామ్య, పూజీ వాదములు. ఇద్దరే నాయకులున్నారు. వారు లెనిన్, ముస్సోలినీలు. ఈ రెండు యుద్యమములలో దేనినో ఒక దానిని, ఈ ఇద్దరు నాయకులలో నెవరినో యొకరిని జహ్వరలాల్ పండితుడు నుడివినట్లు – మన మనుసరించి తీరవలెను. లేనిచో కాలసాగర గర్భమున లీనమై పోగలవు – ఇప్పటికే సగము చచ్చియున్న మన దేశమును, మన జాతియు, మన సభ్యతయు!"

దీనితో రచయిత పుస్తకం ఎందుకు రాశారో, ఏ కోణంతో రాశారో – విశదమవుతుంది.

"నార్ల వారు కవుతరం కృష్ణా" ప్రచురణ కర్తలుగా బెజవాడ ఆంధ్రవాణీ ముద్రాక్షరశాలలో జూలై 1934లో ప్రచురింపబడిన ఈ పుస్తకంలో 104 పేజీలు ఉన్నాయి. ప్రవేశిక, తర్వాత 11 అధ్యాయాలు, చివరన అనుబంధముగా – 'రాజ్యాంగ విధానము'తో పాటు లెనిన్, స్టాలిన్, ట్రాట్స్కీ, లిట్వినాఫ్ గార్ల ఫొటోలు కూడా ఉన్నాయి. రష్యా సమాజం గురించి చెప్పడానికి ఎన్నుకున్న అంశాలు అధ్యాయాలుగా ఇలా ఉన్నాయి. సామ్యవాది, కార్మికులు, మత విధ్వంసనము, స్త్రీ స్వాతంత్ర్యము, సాంసారిక జీవనము, పడుపువృత్తి, కుటుంబ విచ్ఛిన్నము, ప్రణాళిక, విద్యావ్యాప్తి, జైళ్ళు, పరిశిష్టము.

రచయిత పాతిక సంవత్సరాల యువకుడు. బందరులో బి.ఏ. చేస్తున్న నవ పాత్రికేయుడు. "అప్పుడు నేను రష్యా వెళ్ళిన వాడిని కాదు. చూచిన వాడిని కాదు – అవన్ని (పుస్తకాలన్ని) చదివి 'నేటి రష్యా' పుస్తకం వ్రాశాను" అయనే 1980లో రికార్డు చేసిన ఇంటర్ వ్యూలో అన్నాడు.

ది న్యూ రష్యా, లెనిన్ అండ్ గాంధీ, టెన్డేస్ దట్ షుక్ ది వరల్డ్, ఎ షార్ట్ హిస్టరీ ఆఫ్ ది వరల్డ్, హ్యూమానిటీ అప్లూటెడ్, న్యూ రష్యా, రోడ్స్ టు ఫ్రీడం, ది ప్రిన్సిపల్స్ ఆఫ్ రివల్యూషన్, లైఫ్ అండర్ ది సోవియట్స్, రిలిజియన్ అండర్ ది సోవియట్స్, రష్యన్ ఉమెన్, ది ఫ్యూచర్ ఆఫ్ మోరల్స్, రియల్ సిచువేషన్ ఇన్ రష్యా, రష్యా టుడే అండ్ టుమారో, సోవియట్ రష్యా, ట్వల్వ్ స్టడీస్ ఇన్ సోవియట్ రష్యా మొదలైన దాదాపు 35 పుస్తకాలు అధ్యయనం చేసి ఈ పుస్తకం రాసినట్టు తెలుస్తుంది.

సామ్యవాదం మీద, ఆనాటి రష్యా సమాజం మీద ఎటువంటి అభిప్రాయాలున్నాయో రచయిత మాటలనే పరిశీలిద్దాం.

మరణింపలేక, మరణింప లేక మరణించినాడు. ఇట్లు మరణించి, సామ్యవాద పునర్జన్మ నెత్తినాడు. ఇప్పుడతనికి తల్లిలేదు; తండ్రి లేదు; బంధుమిత్రులు లేరు. తన వలె యాతనా పూర్వకముగ మరణించి, సామ్యవాదులుగ పునర్జన్మ నెత్తినవారే ఆప్తులు. తక్కిన వారెల్లరు పరాయివారు. కేవలం పరాయివారు మాత్రమే కాదు – భీకర శత్రువులు. వారిని నిస్సంకోచముగ రూపుమాపవలసినదే! నిస్సందేహముగ విధ్వంస మొనర్పవలసినదే! (పుట 14)

బాధ్యతను గ్రహింప గలవారేని అతడు (కార్మికుడు) సామ్యవాదమును విజయవంతమొనర్చి సర్వ ప్రపంచమునకు – సర్వ ప్రపంచమునకే కాదు. సమస్త కాలమునకు కూడా మార్గ దర్శకుడు కాగలడు! లేనిచో ఏ హిట్లరో, ఏ ముస్సోలినీయో తలెత్తుట కవకాశమిచ్చి, ఆత్మ వినాశనమును తెచ్చుకోగలరు!! (పుట 26)

మహా పుణ్యక్షేత్రము బహు పురాతనమైనది – వైభవమునకు, విలాసమునకు, విజ్ఞానమునకు వన్నె కెక్కినది – కెల్ నగరము పేదలకు పెన్నిధానము! భక్తులకు బృందావనము! కష్టజీవులకు కల్ప వృక్షము (పుట 27)

కర్షకుని చిత్తవృత్తిని పంచవర్ష ప్రణాళిక పూర్తిగా మార్చివైచినది. నేడతడు సమిష్టి వ్యవసాయ సంఘములలో చేరుటకు, క్రొత్త వ్యవసాయ పద్ధతుల నవలంభించుటకును, రేయింబవలు కష్టించి పనిచేయుటకు ముందడుగు వేయుచున్నాడు (పుట 77).

స్వలాభమునకై వ్యక్తి పరముగ జరుపబడు వ్యాపారము (Private trade) ను చంపియు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించియు, సైనిక బలమును కూర్చియు ప్రణాళిక చేసిన లాభము కూడా సామాన్యమైనది కాదు. *(పుట 77)*

మరి నాలుగేండ్లకు చదువురాని వాడు ఒక్కరైనను రష్యాలో మిగులబోరని సోవియటు ప్రభుత్వము వారు చెప్పుచున్నారు. జరిగిన విద్యావ్యాప్తిని బట్టియు, జరుగుచున్న దానిని బట్టియు మనము 'ఔ' ననవలెను గదా! (పుట 84)

ఒక్క రష్యాలో దప్ప మరెచ్చటను ఈ (జైళ్ళ గురించి సత్సంకల్పమునకు తావులేదు. ఉండుట కవకాశము సయితము లేదు. ఇది పూర్తిగా గాకున్నను, కొంత వరకైనను అత్యుక్తియని బావింతురేమో? ముమ్మాటికిని కాదు (పుట 85)

రష్యను జైలును చూచినచో? పంట భూములు, పరిశ్రమాగారాములు, పాఠశాలలు, గ్రంథాలయములు మున్నగు వానితో విలసిల్లు చక్కని కాలనీ జ్ఞప్తికి వచ్చును. (పుట 88) వీటిని పరిశీలిస్తే అప్పటి రష్యా సమాజం గురించి నార్లగారి ఆలోచనా విధానం సులువుగా బోధపడుతుంది. మరి ఇంతగా సామ్యవాదాన్ని, సామ్యవాద సమాజాన్ని గౌరవించే నార్ల, తర్వాత ఎందుకు అంత 'కమ్యూనిస్టు వ్యతిరేకి'గా ముద్ర పొందారో ముందు ముందు అధ్యయనం చేస్తే గాని అవగతం కాదు. ఇది ఆసక్తి కలిగించే విషయం కూడా అవుతుంది.

ఇక రెండు విషయాలలో నార్లకు ప్రత్యేక అభిమానం ఉన్నట్లు కనబడుతుంది. స్త్రీ సామాజిక పరిస్థితి, మతం ఈ రెండింటి గురించి చాలా వివరంగా రాయడమే కాక, వాటిని మన దేశంతో పోల్చి స్పందిస్తాడు కూడా! స్త్రీ స్వాతంత్ర్యము, సాంసారిక జీవనము, పడుపు వృత్తి, కుటుంబ విచ్ఛిన్నము – అనే నాలుగు అధ్యాయాలలో – అంటే పుస్తకంలో మూడో వంతు వివరిస్తాడు. రచయిత కూడా భావనాత్మకంగా స్పందించినట్టు కనబడుతుంది. "వత్సరముల తరబడి పంజర నిబద్ధమై యున్న కీరము స్వేచ్ఛ లభించినప్పుడు సయితము రెక్కలను విప్పుకొని, విశాల వినీల వినిర్మలాకాశపథమున కెగసిపోవ వెరచును గదా!..." అని ఒక చోట (పుట 40) నార్ల రాస్తాడు. స్త్రీల ఓటు హక్కు నుంచి పొగత్రాగడం దాకా చర్చిస్తాడు. అంటే సాంఘిక, ఆర్థిక విషయాల ప్రస్థావన తప్పకుండా ఉంటుంది. పురుషాధిక్యత, వివాహము, విడాకులు, కుటుంబ విచ్ఛిన్నము – ఇలా వివరంగా చర్చించాడు. ఈ విషయాలు ఇప్పుడూ ఆసక్తి కలిగిస్తాయి.

మతం గురించి ఇలా అంటాడు ...

''... ఏ వ్యక్తి కావ్యక్తి ఆస్తికుడైనను మానవ కళ్యాణమునకు ప్రతిబంధకము వాటిల్లదు, కాని, ఆస్తికులు కొందరు కలసి, ఏదైన కూటము స్థాపించి నంతనే ప్రమాదము సంఘటిల్లును. ఇందుకు వివిధ మతముల చరిత్రయే నిదర్శనము. పూర్వ కాలమున కాదు ఇప్పటికిని మతముల కారణముగ నిట్టి ఘోరములు జరుగుచునే యున్నవి. మతవిద్వేషముల వలననేగదా, మన దేశమున హిందూ, మహమ్మదీయ కలహములు పొసగుట! ఇతర పశువులను చంపినపుడు రాని పాపము ఒక్క ఆవును చంపినప్పుడు మాత్రమే చుట్టుకొనునా? ఇతర స్థలములలో వాద్యముచేసినపుడు వాటిల్లని దోషము, కేవలము మసీదుల ముందు చేసినప్పుడే ఊడిపడునా? ... మొత్తము మీద అందరి దృష్టియును వెనుకకే! వెనుకటి కాలమును మించిన కాలము లేదు! వెనుకటి ప్రవక్తలను మించిన ప్రవక్తలు లేరు! ప్రాక్తనమంతయు వీరికి తేజోమయము! ఆధునిక మంతయును దరిద్రాతి దరిద్రము! భవితవ్యమంతయును ఘోరాంధకార బంధురము! నిన్నటి కన్న నేడు, నేటి కన్న రేపు, రేపటి కన్న ఆపై దినమును మానవ జాతిని మరొక యడుగు ముందునకు వేయించవలెనని వారు లక్షింపలేరు. అందుకు తగిన ప్రయత్న మెట నుండి వచ్చును?

మానవ దృష్టిని వెనుకకు మరల్చి మతము లొనర్చుచున్న ఈ మహోపకారము కన్న నష్టదాయక మైనది వేరొండుగలదా గూఢచారదళము పౌరులను హింసించినట్లే గ్రామములలో 'చర్చి' హింస పెట్టుచుండెడిది. దౌర్జన్య ప్రయోగము వలన మతములు చావకపోగా, వానికి లేని ప్రాబల్యము వచ్చునని నిరూపించుటకిట్లే ప్రపంచ చరిత్ర నుండి మరి పెక్కు నిదర్శనములు జూపవచ్చును. ఇవన్నియు తెలియనివారు గాకపోవుటచే సామ్యవాదులు సాధ్యమైనంత వరకు దౌర్జన్య రహిత విధానములనే యవలంభించిరి. పద్ధతులేవైననేమి? రష్యాలో నేడు మతమునకు తావు లేకుండ పోయినది! ఇట్టి సౌభాగ్యము ఈ దౌర్భాగ్య భారతవర్షమున కెప్పుడు''.

'నేటి రష్యా' పుస్తకం కారణంగా నార్లగారు ఎం.ఏ. చదవడం మానుకున్నారని తెలుసు కోవడం విషాదం. బి.ఏ. చదువుతుండగా బెనారస్ వెళ్ళినపుడు – అక్కడి విశ్వవిద్యాలయానికి వచ్చి ఎం.ఏ. చేయాలని ఆశపడ్డాడు నార్ల. 1933 చివర్లో ప్రచురించిన 'స్వదేశ సంస్థానాలు' పుస్తకం బాగా అమ్ముడుపోయి వంద, వందయాభై రూపాయల దాకా మిగిల్చింది. దాంతో మరో పుస్తకం రాసి, మరలా రెండు మూడు వందలు వస్తే – ఆ డబ్బుతో బెనారసులో ఎం.ఏ. చేద్దామని రచనకు ఉపక్రమించాడు. బందరులో సుబ్బారావు అనే మిత్రుడి దగ్గర రష్యాకు సంబంధించిన చాలా పుస్తకాలు ఉండేవి. వాటిని అరువుగా తీసుకుని, అధ్యయనం చేసి 104 పుటల పుస్తకం రాశాడు. మొదటి పుస్తకం లాగానే మిత్రులతో అప్పు తీసుకుని పుస్తకం వేద్దామని భావించాడు నార్ల. అయితే మొదటి పుస్తకం సాధించిన విజయం చూసిన నార్లగారి తల్లికి ఒక ఆలోచన వచ్చింది. కొడుకు సామర్థ్యం మీద అంత నమ్మకం. కూతురి గాజులు తీసుకెళ్లి అమ్మి పుస్తకం వేసుకోమంది.

మరలా లాభం వచ్చాక చెల్లికి గాజులు చేయించమంది. అలాగే అన్నాడు నార్ల. అయితే పుస్తకాన్ని ప్రభుత్వం నిషేధించింది. పుస్తకాల ప్రతులు ఉన్నవారు ఉంచుకుంటే ప్రమాదమని పుస్తకాలని నాశనం చేశారు. ఫలితంగా నార్ల చెల్లెలి గాజులు పోయాయి. నార్ల తన బెనారస్ ఎం.ఏ. గురించి ఆలోచన మానుకున్నాడు.

స్వదేశ సంస్థానాలు, నేటి రష్యా – ఈ పుస్తకాల అంశాలు సంచలనం కలిగించేవి. సాధారణంగా పిరికివారు స్పృశించే విషయాలు కావు. రచయితగా కలం ఝుళిపించడానికి ధైర్యం ఉండాలి. ఎనిమిది నెలల్లో వెలువడిన పుస్తకాలు కనుక శైలిలో చాలా పోలిక ఉంది. శిష్ట వ్యావహారిక భాష వాడారు. ధారాళమైన భావప్రవాహం ఉంది. తగిన పరిశోధన ఉంది, ప్రణాళిక ఉంది. అధ్యాయాలు ప్రారంభించడం, ముగించడం వంటి విషయాల్లో కూడా ఈ రెండు పుస్తకాలలో చాలా సామ్యాలు కనబడతాయి.

ఈ పుస్తక రచన నార్లకు విషాదం మిగిల్చినా మరో రకంగా ఆయా పుస్తకాల అధ్యయనం కారణంగా ఆలోచన విస్తృతమై, అవగాహన పెరిగి ఉండాలి. దిశా నిర్దేశనం జరిగి ఉండాలి.★

నాగసూరి వేణుగోపాల్. *చిన్నవయసులోనే తెలుగు జర్నలిజానికి బహుముఖాలుగా సేవచేస్తున్న వీరు ఆకాశవాణి ఉద్యోగి. తన, తనతర్వాత తరంవారిలో సైన్సు, పర్యావరణం, సాహిత్యం, మల్టీమీడియా మొదలైన పలు విశేషాలు అవగాహన కావించడానికి అనునిత్యం కృషి చేస్తున్నారు. భారత వైజ్ఞానిక వైతాళికులు, సైన్సు వీక్షణం, సైన్సు క్యాలెండర్, టి.వి. ముచ్చట్లు, ప్రకృతి – వికృతి వీరు వెలువరించిన గ్రంథాలు. విజయవాడ, ఆకాశవాణి కేంద్రం నుండి తెలుగు సాహిత్యంలో 100 ఆణిముత్యాల్లాంటి గ్రంథాలను 'శత వసంత సాహితీ మంజీరాలు' పుస్తక పరిచయ శీర్షికకు బహుజనాదరణ లభించింది. తదుపరి ఈ ప్రసంగాలు ముద్రితమైనాయి.* ★

గమనిక : *ఈ రెండు వ్యాసాలను జి. మాల్యాద్రి, జనవిజ్ఞాన వేదిక వారి సౌజన్యంతో ప్రచురించాం.*

భావ విప్లవకారుడు నార్ల : సీతజోస్యం

– పాపినేని శివశంకర్



భారతదేశంలో రెండు మహేతిహాసాలు రామాయణ భారతాలు. క్రీస్తుపూర్వం రచించ బడిన ఆ రెండు గ్రంథాలకు కాలక్రమంలో ఇతిహాస ధర్మం, చారిత్రకత తొలగిపోయి, మత స్వభావం ఆపాదించ బడింది. వాటి ద్వారా వర్ణాశ్రమ ధర్మాలు సమర్థించబడ్డాయి. భూస్వామ్య, రాజరిక వ్యవస్థ సమర్థించ బడింది. శ్రీరామ, శ్రీకృష్ణులు భారత సమాజంలోని ఆనాటి రాజరిక వ్యవస్థలలోని మంచి చెడ్డలకు ప్రతీకలు. అయితే రానురాను పురాణ వాఙ్మయ కర్తలు రామకృష్ణుల చారిత్రక లక్షణం స్థానంలో దైవలక్షణం ప్రతిష్ఠించారు. ఎప్పుడైతే రామకృష్ణులు దైవస్వరూపులయ్యారో దైవ వర్తనని మానవ మాత్రులు ప్రశ్నించే అవకాశం లేకుండా పోయింది. "రామో విగ్రహవాన్ ధర్మః" అయ్యాడు. కనుక రామాయణంలో తాటక, వాలి కథ మొదలుకొని, దండకాటవిలో రాక్షసహననం, అగ్నిపరీక్ష, సీత పరిత్యాగం వంటి ఏ పనులను ప్రశ్నించేది లేదు. అంతా దైవ లీలావిలాసమే.

అయితే ఆధునికయుగం మనిషికి గొప్ప భౌతిక, ఆధి భౌతిక పరిశీలనా సాధనాలను ప్రసాదించింది. విజ్ఞాన శాస్త్రాభివృద్ధి క్రమక్రమంగా దైవ విశ్వాసాన్ని సవాలు చేసింది. ప్రజాస్వామిక దృక్పథం మానవతావాదం, సామ్యవాదం, హేతుపరిశీలనా దృష్టి ఆధునిక మానవుడి కళ్లు తెరిపించాయి. సరికొత్త చారిత్రక పరిశోధనలు, మానవ వికాస శాస్త్ర పరిశోధనలు భారతీయ చరిత్ర మీద, ప్రాచీన సమాజగతి మీద కొత్త వెలుగులు ప్రసరించాయి. సమస్త ప్రాచీనతని పునర్మూల్యాంకనం చేయాల్సి వచ్చింది. రాహుల్ సాంకృత్యాయన్, డి.డి. కోశాంబి, ఆర్.జి. భండార్కర్, హెచ్.డి. సంకాలియా, రోమిలా థాపర్ మొదలైన పరిశోధకులు భారతీయ ప్రాచీన చారిత్రక, సామాజిక గతిని గురించి సంప్రదాయ విశ్వసాలకు భిన్నంగా వినూత్న ప్రతిపాదనలు చేశారు.

ఇటువంటి ఆలోచనాధార నుంచే తెలుగునాట హేతువాద నాస్తికోద్యమాలు బయల్దేరాయి. 'హేతువాద కవితకు ఆద్యుడు' అయిన కవిరాజు త్రిపురనేని రామస్వామి పురాణ సాహిత్యం మీద సమగ్ర విమర్శ చేశారు. ఒకవైపు పురాణాలైన గ్రంథమాలలు వెలువడుతున్న కాలంలోనే పౌరాణిక వ్యతిరేక భావజాలం తెలుగునాట వృద్ధి చెందింది.

ఈ నేపధ్యభూమిక మీద ఖడ్గధారణ చేశారు నార్ల. భగవద్గీత, ఉపనిషత్తులు, పురాణ సాహిత్యం మొదలుగా భారతీయ ప్రాచీన సంస్కృతిని అధ్యయనం చేశారు.

పాశ్చాత్య తాత్వికతనీ అవగాహన చేసుకున్నారు. గాంధీవాదంలోని జాతీయతను, నైతిక పార్శ్వాన్ని అంగీకరిస్తూనే మతాన్ని రాజకీయాలతో ముడిపెట్టటాన్ని వ్యతిరేకించారు. నెహ్రూ దృక్పథంలోని లౌకికతత్వాన్ని, ఆధునిక దర్శనాన్ని అంగీకరించారు. ఎం.ఎన్.రాయ్ నవ్యమానవతావాదాన్ని అభిమానించారు. భారతీయ సమాజాన్ని స్వాతంత్ర్యోద్యమ దశనుంచి ఆధునికతవైపు నడిపించడానికి ఒకవైపు పత్రికా రచయితగా, మరోవైపు సాహిత్యకారుడుగా విశ్రాంతి లేని కృషి చేశారు. సాహిత్య రంగంలోను అతి మిత వాదాలను, మిత అతి వాదాలను విమర్శించారు. ఒకవైపు విశ్వనాథ పురాణ వైర భావజాలాన్ని, మరోవైపు చలంలోని విశృంఖల స్వేచ్ఛని వ్యతిరేకించారు. భారతీయ సంస్కృతిలోని అనుకూల, ప్రతికూల పార్శ్వాలు రెండింటినీ సమగ్రంగా పరిశీలించారు. అందులోని ప్రగతి వ్యతిరేక లక్షణాల్ని ఖండించటానికి హేతువే ఆయుధంగా నాటక రచన చేపట్టి, పునర్మూల్యాంకనం చేశారు.

రామాయణ భారతాలైనా, అష్టాదశ పురాణాలైనా, వాటి ప్రధానోద్దేశాలు కుల వ్యవస్థను పరిరక్షించడమే; ఫ్యూడల్ సంఘాన్ని సుస్థిరం చేయడమే. అందువల్ల ప్రస్తుత ధోరణిలో వాటి ప్రచారం సాగితే, ప్రస్తుత రీతిలో వాటిపట్ల భక్తిశ్రద్ధలు ప్రబలడం జరిగితే, నవసమాజ నిర్మాణం, నూతన ధర్మ సంస్థాపన కేవలం శుష్కనినాదాలుగానే మిగిలిపోవడం తథ్యం. దాదాపు 1500 సంవత్సరాలపాటు మన మానసిక వికాసానికి, మన సాంఘిక పురోగతికి రామాయణ భారతాల ప్రభావం ఒక తీవ్ర ప్రతిబంధకంగా నిలిచింది. ఆ ప్రతిబంధకాన్ని ఇకనైనా తొలగించుకొనకపోతే,మనం ఆధునిక యుగంలో ప్రవేశించలేం" అని తన పురాణవిమర్శ గ్రంథాల్లో ఒకటైన 'సీతజోస్యం' పీఠికలో అన్నారు నార్ల.

ఇతిహాస పౌరాణిక వాఙ్మయంలోని కులవ్యవస్థ, భూస్వామ్య విలువలు, అశాస్త్రీయత – ఇవన్నీ ఆధునికతకు అవరోధాలుగా గుర్తించారు నార్ల. మనలో 'భావ విప్లవం' రానంత వరకు సమాజంలో ప్రగతి అసంభవమని భావించారు. ఈ ఆధునిక మానవతా భావనే నార్ల శోధనకు చోదన. తన విస్తృతాధ్యయనంలో నార్ల "మన రామాయణ, భారతాలు ప్రధానంగా కథలే, గాథలే, కావ్యాలే, పురాణాలే! అవి చరిత్రలు కావు, కానేరవు". అని తేల్చుకున్నారు. కాబట్టి వాటిని యథాతథంగా విశ్వసించకుండా లోచూపుతో వాటిలోని వాస్తవాంశాన్ని వెలికితీయటానికి ప్రయత్నించారు. అందుకోసం ఆ పౌరాణిక పాత్రలే ఎదురుబొదురుగా నిలబెట్టి, ఒక సంఘర్షణ చిత్రించి, మరుగునబడ్డ

సత్యాన్ని రంగస్థలం మీదికి రప్పించారు. ఆ క్రమంలో వెలువడ్డవే జాబాలి, సీత జోస్యం, నరకంలో హరిశ్చంద్రుడు, పంచరాత్రం మొదలైన నాటకాలు.

నార్లవారు రచించిన రామాయణ నాటికల్లో 'జాబాలి' మొదటిది. 'సీతజ్యోసం' రెండవది. మొదటి నాటకం పీఠికలో నార్ల రామాయణంలో మౌలికాంశాల్ని విశ్లేషించి తన ప్రతిపాదనలు చేశారు. సీతజోస్యం నాటకానికి కూడా విపులమైన పీఠిక రాశారు.

"నా రెండు పీఠికలలో ఏదీ మీకు నచ్చక పోవచ్చు. నా రెండు నాటకాలలో దేన్నీ మీరు మెచ్చకపోవచ్చు. అంతే జరిగితే, అందుకు నేనెంతమాత్రం బాధపడను. నాకు కావలసింది మీ ఆమోదం కాదు, మీలో ఆలోచన; నేను కోరేది మీ ప్రశంస కాదు, మీలో జిజ్ఞాస. ఎప్పటికప్పుడు పాత విషయాలను కొత్త దృష్టితో చూడ్డానికి మనం ప్రయత్నించాలి. పాత విన్యాసాలను కొత్త పరీక్షలకు పెట్టుకోవాలి, పాత గాథలకు కొత్త వ్యాఖ్యానాలను చెప్పుకోవాలి. అప్పుడు గాని మనలో కొత్త ఆలోచనలు రేకెత్తవు; అప్పుడుగాని మనలో కొత్త చైతన్యం పెల్లుబకదు. అప్పుడుగాని కొత్త తేజస్సుతో, ఓజస్సుతో ఒక జాతిగా మనం ముందుకు సాగలేం".

ఇతిహాస పరిశీలనలో నార్లవారి దృష్టికోణం ఎటువంటిదనే ఆసక్తి కలుగుతుంది ఎవరికైనా, "నాది ఆర్య, ఆర్యేతర దృష్టి కాదు; బ్రాహ్మణ, బ్రాహ్మణేతర దృష్టి అసలే కాదు. అవి సంకుచిత దృష్టులు... జాతి, మత, కుల, వర్గ విభేదాలన్నీ సమసిపోవాలి... మానవునికి, అతడి మానవతకు పట్టాభిషేకం జరగాలి ఇదే నా ఆరాటం, ఇందుకే నా పోరాటం" అన్నారు నార్ల. 'ఆర్య ఆర్యేతర, బ్రాహ్మణ – బ్రాహ్మణేతర దృష్టి కోణం నుంచి త్రిపురనేని రామస్వామి వంటి హేతువాద కవులు ఇతిహాసాల్ని పునః పరిశీలించారు. అంతకన్న తన దృష్టి విశాలమైనదని నార్ల భావన. ఇటువంటి దృష్టికోణంతో 'సీతజోస్యం' పీఠికలో 1 రామాయణగాథకు చారిత్రకాధారం, 2 రాముని వనవాస ప్రాంతం, 3 రాక్షసుల మూలాలు, 4 ఋషుల మూలాలు, 5 రామాయణ కాలంనాటి ఆయుధాలు అనే అయిదు అంశాల్ని విపులంగా చర్చించారు.

రమేష్ చంద్రదత్, వింటర్ నిట్జ్, సి.వి. వైద్య, వేబర్, తైలాంగ్, శ్రీనివాస అయ్యంగార్, సంకాలియా మొదలైన పండితుల రచనలన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నార్ల రామాయణంలో నూటికి 75 వంతులకు పైగా పుక్కిటి పురాణమే అని తేల్చారు. రాముడు వింధ్య పర్వత ప్రాంతం దాటి ఇవతలకు రాలేదన్నారు. రావణుని లంక, ఈనాటి శ్రీలంక ఒకటి కాదన్నారు. దండకారణ్యానికి వ్యవసాయం విస్తరించటంలో రాముడి పాత్ర ఉందన్నారు. అన్నిటిని మించి – రామరావణ యుద్ధం రెండు జాతులమధ్య సంఘర్షణ అనటం కన్న, ఆహారోత్పత్తి వ్యవస్థకు (Food Production

Economy), ఆహారసేకరణ వ్యవస్థకు (Food Gathering Economy) సంఘర్షణ అనటమే సమంజసమని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన ఆలోచనా ప్రేరకమైంది. గంగానది లోయకు చెందిన ఆహారోత్పత్తి వర్గాలకు వింధ్య పర్వత ప్రాంతాలలోని ఆహార సేకరణ వర్గాలకు మధ్య జరిగిన సంఘర్షణే రామరావణ యుద్ధం కావచ్చునని ప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు రోమిలా థాపర్ రాశారు. అదే అభిప్రాయం నార్ల గ్రహించారు.

రావణుడి లంక వింధ్య పర్వత పరిసరాలలోనే ఎక్కడో ఒకచోట ఉన్నట్టు నార్లవారు నమ్మారు. ఎమ్.వి.కిచే, పరమశివ అయ్యర్, హెచ్.డి. సంకాలయా, డి.ఆర్. మన్కడ్ వాదాలను తన నమ్మకానికి ఆధారాలుగా స్వీకరించారు. వానర సేనలు వింధ్య పర్వత పంక్తిని దాటినట్టు, నర్మదానదిని దాటినట్టు రామాయణం చెప్పటం లేదు. లంకాపురి సముద్రతీరాన త్రికూట పర్వతంపై ఉన్నట్టుగా రామాయణం వివరిస్తుంది. అయితే సింహళం ఉత్తర తీరంలో ఒక్క పర్వతమైనా లేదు. ఇటువంటి ఆధారాలతో నార్ల తన నమ్మకాన్ని బలపరచుకున్నారు.

రాక్షసులు ఏదో ఒక తెగకు, లేదా ఒకే ప్రాంతానికి చెందినవారు కారని నార్ల భావించారు. రాముడు నిషాద జాతికి చెందిన ఒక తెగతో యుద్ధం చేసి ఉండాలని నిర్ధారణకు వచ్చారు.

రామాయణంలో తగిలే విశ్వామిత్రుడు, భరద్వాజుడు, అత్రి, శరభంగుడు, అగస్త్యుడు మొదలైన ఋషులు యజ్ఞయాగాదుల పేరుతో దండకారణ్యంలో విశాల ప్రాంతాలను దగ్ధం చేశారని, ఆశ్రమాల పేరుతో దండకారణ్యంలో వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పారని నార్ల భావన. అప్పటికి దండకారణ్యంలో ఉన్నవాళ్లు ఆహార సేకరణ వ్యవస్థకు చెందినవాళ్లు. ఈ రెండు వ్యవస్థల మధ్య సంఘర్షణలో ఋషులు రాముడి సహాయం అర్థించారు.

ఇక రాముడికున్న విల్లమ్ములకు బదులుగా రాక్షసులు రాళ్లు, చెట్లు, రోకళ్లు, గదలు, గొడ్డళ్లు, ఖడ్గాలు మొదలైన వాటిని వాడినట్లు నార్లవారు చెప్పారు. రాక్షసులకు ఆయుధబలం తక్కువ కనుకనే వారు 'గెరిల్లా' యుద్ధ పద్ధతులను అవలంభించి ఉంటారని భావించారు.

ఈ విధమైన నార్ల పరిశీలనకు చరిత్ర, మానవ వికాస శాస్త్రం (Anthropology), హేతువాదం మొదలైన అంశాలు దోహదం చేశాయి. కోటానుకోట్ల భారతీయులకు గల విశ్వాసాలు తన అవగాహనకు అడ్డు రాలేదు. నార్లవారి అవగాహన స్థూలంగా హేతుపరిశీలన, మానవతా వాదం అనే అంశాలపై ఆధారపడి ఉంది.

నాటక వస్తువు :

'సీతజోస్యం' రెండంకాల నాటకం. కథాకాలం క్రీ.పూ. 10వ శతాబ్దం అనుకోవచ్చు. స్థలం జన్మస్థానంలో సుతీక్ష మహర్షి ఆశ్రమం. నాటక ప్రారంభంలోనే సీత లక్ష్మణుడితో మాట్లాడుతూ సూర్యవంశరాజుల పూర్వ మహిమలని కల్పిత కథలుగా కొట్టిపారేస్తుంది. అక్కడికొక యోజనం దూరంలో ఉన్న మహర్షులు తమ ఆశ్రమం పావనం చేయమని అడిగితే రాముడు వెళ్లాడు. ప్రవాస కాలాన్ని ప్రశాంతంగా ముగించుకొని వెళదామనుకుంటే 'మునిమ్రుచ్చులు' కారడవులనుంచి మనను బయటపడనిచ్చేటట్టు లేరని సీత భయపడుతుంటుంది. అంతలో వాలఖిల్య మహర్షి తన శిష్యుడు యాగానంద స్వామితో ఆశ్రమానికి వస్తాడు. తమ యజ్ఞయాగాలకు విఘ్నం కలిగిస్తున్న రాక్షసుల దశావతారాల నుంచి తమకు విముక్తి కలిగించమని రాముడిని అర్థించటానికి ఆ మహర్షి వచ్చాడు. అయితే అన్యాయంగా రాక్షసుల సీమల్లోకి చొరబడి వారి బ్రతుకులను బుగ్గి చేస్తున్నది మీరేనని సీత ఋషులను నిందిస్తుంది. అడవులను కాల్చడానికే వాళ్లు హోమగుండాలను వెలిగిస్తున్నారని, అలా అడవులను ధ్వంసం చేస్తే రాక్షసుల బ్రతుకులే ధ్వంసం అవుతున్నాయంటుంది. ఋషులు రాముడు వచ్చేవరకు ఆ ఆశ్రమంలోనే వేచి ఉంటామని చెప్పి నిష్క్రమిస్తారు.

రెండవ అంకంలో రాముడు ప్రవేశించి ఋషుల ప్రార్థనను అంగీకరిస్తాడు. "తమ వెంట నేను తప్పక వస్తాను, తమ హోమగుండాలను చల్లార్చుతున్న రాక్షసులను వధిస్తాను" అని వాగ్దానం చేస్తాడు. "ఈ ముని మ్రుచ్చులు మిమ్ము ముఖస్తుతిచేసి, మీతో అమాయకులైన ఆటవికులను అన్యాయంగా చంపిస్తున్నారు" అని సీతవారించినా రాముడు వినలేదు. "అగ్ని హోత్రుడు పావనం చేయని భూములు ఆర్యులైనవారికి నివాసయోగ్యాలు కావని మన ధర్మశాస్త్రం చెబుతున్నది. ఆ శాస్త్రానుసారంగానే మన ఋషులు ఈ జనస్థానంలో తమ పుణ్యాశ్రమాల సంస్థాపనార్థం ఏవో కొన్ని ప్రాంతాలను అగ్నిహోత్రుని సహాయంతో పావనం చేయవలసి వస్తున్నది" అని రాముడు వాదిస్తాడు. అయితే నిర్మానుష్యమైన దండకారణ్య ప్రాంతాలెన్నో ఉండగా ఈ జనస్థానానికే మునులెందుకు రావాలని అడిగిన సీత ప్రశ్నకు రాముడి వద్ద జవాబు లేదు. శరణుజొచ్చిన వారికి రక్షణనివ్వడం నా క్షత్రియ ధర్మమని రాముడన్నప్పుడు అయోధ్యలో చేసిన ప్రతిజ్ఞకనుగుణంగా "మునివలె జీవించనప్పుడు మునివేషం మాత్రం దేనికి?" అని సీత ప్రశ్నిస్తుంది. దండకారణ్యంలో సురక్షిత ప్రదేశం కొరకై మరింత దక్షిణానికే వెళ్లమని ఋషులు చెప్పడం వెనక కపటం ఉందని సీత అంటుంది, రాముడి సహాయంతో చివరికి మొత్తం దండకారణ్యాన్నే తాము వశపరచుకోవచ్చునని ఋషుల పన్నాగమని చెపుతుంది. అయినా రాముడు వెనుదిరగలేదు.

వనవాసం ముగిసేవరకు ఆయుధవిసర్జన చెయ్యమని సీత కోరినా రాముడు వినడు. ఆటవికులకు ప్రాణభిక్ష పెట్టమని భర్త పాదాలు పట్టుకొని ప్రార్థించినా రాముడు ఆమె కోరిక మన్నించ లేదు. "అవసరమైతే నేను నిన్ను విడుస్తాను. లక్ష్మణుని విడుస్తాను. నా ప్రాణాలనైనా విడుస్తాను; ఋషులకిచ్చిన మాట మాత్రం తప్పను. ఆడినమాట తప్పితే మా వంశగౌరవం మంటగలుస్తుంది" అంటాడు రాముడు. "మీరంతటి వారే! మీ వంశగౌరవానికి బలిగా ఎప్పుడో, ఒకప్పుడు ఏ నట్టడివిలోనో నన్ను దిక్కులేని దాన్నిగా మీరు దిగవిడుస్తారు!!" అని అభిమానం, కోపం, దైన్యం ముప్పిరిగొనగా సీత పలుకుతుంది, రాముడి చురచుర చూపులతో నాటకం ముగుస్తుంది. సీత జోస్యం భవిష్య వాస్తవమని తదనంతర రామాయణ కథ మనకు చెపుతుంది.

ఈ నాటకంలో ప్రధానపాత్ర సీతే. రాముడు కాదు. నార్లవారి సీత స్వతంత్రమైన ఆలోచనా శీలం గలది. ధర్మాధర్మ విచక్షణ గలది. సహధర్మచారిణి అయినంత మాత్రాన భర్తమాటను జవదాటరాదనే సంప్రదాయ భక్తి విశ్వాసాలు గల స్త్రీ కాదు. తను నమ్మిన విషయాన్ని భర్తకు అప్రియమైనా ధైర్యంగా చెప్పగలది. వంశ ప్రతిష్ట అనేది కేవలం డొల్ల అని ఆమె అభిప్రాయం. మునులనైనా ప్రశ్నించగల సహేతుక దృష్టి గలది సీత.

పాత్ర కల్పన :

'సీత జోస్యం' నాటకం చదివినాక రామాయణ ప్రియులకు, భక్తులకు అనేక సందేహాలు గుప్పున మనస్సులో కలగటం సహజం. నార్ల ఆ నాటకాన్ని మద్రాసులో మిత్రబృందానికి చూపించినప్పుడు ఒక పండితమిత్రుడు చిరుకోపంతో 'ఈ సీత మాదృష్టిలోని సీత కాదు" అన్నాడు. అందుకు నార్ల సమాధానం ఏమిటంటే "ఈమె మీ దృష్టిలోని సీత కాకపోవచ్చుగాని, వాల్మీకి దృష్టిలోని సీత" అని, "వాల్మీకి సీతనే యథాతథంగా నేను నా నాటకంలో ప్రవేశపెట్టాను" అన్నారు నార్ల. వాల్మీకం ప్రకారం "సీత నోట నాల్కలేని పతివ్రతా శిరోమణి" కాదు. 'ఆయుధమెక్కడ, అరణ్యవాసమెక్కడ?' అని ఆమె మగని ప్రశ్నిస్తుంది. శస్త్రములు చేపట్టటం వల్ల పాపబుద్ధి కలుగుతుందని భర్తను హెచ్చరిస్తుంది. 'పగ లేకనే యొక్కనిని జంపుట' మహాపాతకమని అంటుంది.

నాటకంలోని పాత్ర చిత్రణ విషయంలో పాఠకులకు ఎదురయ్యే సందేహాలకు మూల రామాయణంలోనే కొన్ని జవాబులు దొరుకుతాయి.

నార్లవారి సీత లక్ష్మణుని, ఇనవంశ గత వైభవ మహిమని, మునుల ప్రవర్తనను పరిహాసం చేస్తుంది. ఇదెంతవరకు సమంజసం? ఆమెకు అటువంటి స్వభావం ఉందా? ఉందనే రామాయణం చెపుతుంది. అరణ్యకాండ, 62వ సర్గలో సీతను గురించి ఈ వ్యాఖ్యానం చేస్తాడు.

"అవగచ్ఛామి తేశీలం పరిహాసప్రియం ప్రియే"

(నీ స్వభావము నాకు తెలియును. నీకు పరిహాసముపై ప్రీతి మెండు) దీన్ని బట్టి సీత స్వభావాన్ని నార్ల సరిగానే పసిగట్టినట్టు తెలుస్తుంది.

పతివ్రతామ తల్లి అయిన సీత మునుల భావాలకు విరుద్ధంగా, దండకారణ్యంలోని రాక్షసులకు అనుకూలంగా, రాముడిని ధిక్కరిస్తూ మాట్లాడుతుందా అనేది ఇంకో సందేహం. ఈ సందర్భంలోను నార్లవారు మూల రామాయణాన్ని ఏమాత్రం అతిక్రమించలేదని తెలుస్తుంది. సుతీక్ష మహర్షి ఆశీస్సులతో దండకారణ్యాలకు ప్రయాణం చేయడం తనకిష్టం గాదని రామాయణ సీత స్పష్టంగా చెపుతుంది.

"న కథంచన సాకార్యా గృహీత ధనుషా త్వయా
బుద్ధిర్వైరం వినా హంతుం రాక్షసాన్ దండకాశ్రితాన్
అపరాధం వినా హంతుం లోకాన్ వీర! న కామయే"

(ధనుర్ధారివైన నీవు దండకారణ్యమునందలి రాక్షసులయెడ ఎట్టి వైర భావమూ లేకుండా ఓ వీరా! నిరపరాధులైన వారిని చంపదలంచుట ఏవిధముగను యుక్తము కాదు గదా? వారిని చంపుట నాకు సమ్మతము గాదు)

అగ్ని సంబంధం వలన ఆ వస్తువునందు మార్పు కలిగే విధంగా శస్త్రధారణ వలన మనుషుల బుద్ధులు మారుతుంటాయని, కలుషితమవుతాయని సీత చెపుతుంది.

"క్వచ శస్త్రం క్వచ వనం క్వచ క్షాత్రం తపః క్వచ
వ్యావిద్ధ మిదమస్మాభిః దేశధర్మస్తు పూజ్యతామ్"

(శస్త్రధారణమెక్కడ? వనవాస మెక్కడ? క్షత్రియ ధర్మమెక్కడ? తపోవృత్తి యెక్కడ? ఇవియన్నియును పరస్పర విరుద్ధములు. ఇప్పుడు మనము వనవాసముననుంటిమి. కనుక మనము వనజీవన ధర్మమైన తపః ప్రవృత్తినే కలిగియుండ వలెను)

అరణ్యకాండ 9వ సర్గలోని పై ఉదాహరణల వలన సీత చాల స్పష్టంగా రాముడి అభిప్రాయాన్ని వ్యతిరేకించిందని, రాక్షస వధ అధర్మమని వాదించిందని అవగతమవుతుంది. ఇందులో నార్లవారి స్వకపోల కల్పన ఏదీ లేదు. కాకపోతే రామాయణ సీత అన్నీ చెప్పిన తర్వాత రాముడికి ధర్మం గూర్చి బాగా తెలుసని, కాబట్టి లక్ష్మణుడితో బాగా ఆలోచించి తన ఇష్టానుసారం చెయ్యమని అంటుంది.

రాముడు సీతను ఎంతగా ప్రేమించినా, ఆ ప్రేమ ఆయన పితృభక్తిని మించింది కాదు, ఆయన బ్రాహ్మణాభిమానాన్ని మించింది కాదు, ఆయన భ్రాతృవాత్సల్యాన్ని మించిందికాదు, వంశ గౌరవాన్ని గురించి ఆయన పట్టుదలకు మించింది కాదు" అని పీఠికలో నార్లవారు వ్యాఖ్యానించారు. నాటకం చివర సీత ఆటవికులకు ప్రాణభిక్ష పెట్టమని అడుగుతుంది. వారి సతులకు మాంగల్యభిక్ష, తనకు మనశ్శాంతి భిక్ష పెట్టమని రాముడి రెండు పాదాలు పట్టుకుని ప్రార్థిస్తుంది. అప్పుడు రాముడు "అవసరమైతే నేను నిన్ను విడుస్తాను; ఋషులకిచ్చిన మాట మాత్రం తప్పను. ఆడినమాట తప్పితే మా వంశగౌరవం మంటగలుస్తుంది" అంటాడు. ఆ వ్యాఖ్య, ఈ సంభాషణ చదవగానే రామభక్త హనుమానులు వంటివారికి సహజంగానే అది రాముడి పట్ల ఘోరమైన అపచారమనిపిస్తుంది. నాటకశిల్పవేత్తలకు ఒక ధీరోదాత్తుడి నోటివెంట వచ్చిన అనౌచిత్యమనిపిస్తుంది.

అయితే ఈ సంభాషణ కూడా నార్లవారి సొంత పైత్యం కాదు. అక్షరాల రామాయణంలో ఉన్న భావాన్నే ఆయన తర్జుమా చేశారు. ఏ విధంగా?

"అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే! స లక్ష్మణామతు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః" *(ఓ సీతా! మాటను నిలబెట్టుకొనుటకై నా ప్రాణములనైనను ఒడ్డెదను. అంతేగాదు, అందులకై నిన్నును, లక్ష్మణుని సైతం పరిత్యజించుటకు వెనుకాడను. ఎట్టి పరిస్థితులలోను చేసిన ప్రతిజ్ఞను మాత్రం విడువను. అందునా బ్రహ్మజ్ఞానులైన బ్రాహ్మణులకు ఇచ్చిన మాటను ఎన్నడు మరువనే మరువను)*

ఇవి అరణ్యకాండ పదవ సర్గలో శ్రీరాముడి మాటలు *(నార్లవారు 11వ సర్గగా పేర్కొన్నారు).* వీటిని బట్టి రాముడు భార్యా సోదరులకన్న బ్రాహ్మణులకిచ్చిన మాటకెంత ప్రాధాన్యం ఇస్తున్నాడో అర్థమవుతుంది. ఇనవంశ గౌరవానికి బలిగా ఎప్పుడో ఒకప్పుడు రాముడు తనను ఏ నట్టడివిలోనో దిక్కులేని దాన్నిగా తనను దిగవిడుస్తాడని సీత చెప్పిన జోస్యానికి ఆధారం ఇక్కడే ఉంది. కాబట్టి నాటకంలో నార్ల చేసిన ప్రతి కల్పన వెనక చక్కని హేతువు ఉందని పాఠకులు విశ్వసించగలరు.

గొప్ప హేతుప్రజ్ఞతో పాటు ఒకింత అసహనం కూడా నార్లలో ఉందేమో అనిపిస్తుంది. మేధావుల్లో సహజంగా ఉండే ఈ అసహనాన్ని అర్థం చేసుకోవచ్చు.

తమ దర్శన నైశిత్యంతో కనుగొన్న సత్యాన్ని సమాజమో, సాటి వ్యక్తులో తేలిగ్గా అంగీకరించే వాతావరణం లేనప్పుడు, లేదా ఊహించనంత వ్యతిరేకత ఉన్నప్పుడు వాళ్లలో వెంటనే కలిగేది అసహనమే. బహుశ నార్లలోని ఈ అసహనమే, సీత పాత్రలో కూడా ఆవరించి ఉండాలి. 'సీత జోస్యం'లో సీతపాత్ర ఆవిష్కరణే రాముడిని 'ఇనవంశోద్భవ ప్రభువులు' అనే వెటకారంతో మొదలవుతుంది. మొదటి నుంచి చివరిదాక ఈ గుణాన్నే ప్రదర్శిస్తుంది సీత. తమ ఇంటికి వచ్చిన మునుల్ని, లక్ష్మణుని, చివరికి రాముడిని హేళన చేస్తూ ఆమె మాట్లాడే మాటలన్నీ ఆమె అసహనాన్నే తెలియచేస్తాయి. మాటల్లో అతి వ్యంగ్యం ప్రదర్శిస్తుంది సీత. అది ఎదుటివారిని తేలిగ్గా గాయపరుస్తుంది. 'ఆయనకు నేనంటే లక్ష్యమా? నా మాటంటే లక్ష్యమా?' అంటూ రాముడిపై నిష్ఠూరమాడుతుంది.

కళారూపంలో ఒక పాత్రకు చెందిన వ్యంగ్యాతిరేకం లేదా వెటకారం రెండు రకాల పనులు చేస్తుంది. ఒకటి ఎదుటి పాత్రల వ్యక్తిత్వాన్ని ప్రత్యక్షంగా కించపరచటం, రెండు – తన వ్యక్తిత్వాన్నే పరోక్షంగా కించపరుచుకోవడం, ఈ రెండో అంశం మరింత ప్రమాదకారి. నాటికలో సీత ఎదటివాళ్లని వెటకరించే కొద్ది చూపరుల దృష్టిలో *(అది కథలో వాళ్లుకావచ్చు, ప్రేక్షకులో చదువరులో కావచ్చు)* తను కూడా చులకన అవుతుంది, చిన్నబోతుంది. నాటిక చివరలో చూపగలిగిన పరిణతి మొదటినుంచి చూపగలిగితే సీతపాత్ర మరింత గాంభీరంగా రూపొందేది. ఈ సందర్భంలో హేతువాద రచనలకు ఆద్యుడైన త్రిపురనేని రామస్వామి రచనలు పరిశీలించవచ్చు. త్రిపురనేని రచనల్లో పాత్రలు మితిమీరిన వ్యంగ్యాన్ని, వెటకారాన్ని ఆశ్రయించవు.

సీతారాముల ప్రవాసమంతా ప్రకృతి ఒడిలోనే సాగింది. కనుక వాళ్ల సంభాషణ మధ్యలో ప్రకృతి సౌందర్యాస్వాదన కూడా చూపించారు నార్ల. అటవీ ప్రకృతి సౌందర్యగరీమ రాముడిని మహా కవిని చెయ్యగలిగిందని సీత అంటుంది.

వాలఖిల్య మహర్షి శిష్యుడు యోగానందస్వామి పాత్రను హాస్యస్ఫోరకంగా చిత్రించారు. ఆ చిత్రణ ఒకవంక ఆ మునుల అవివేకాన్ని ప్రకటిస్తుంది. మరొక వంక ప్రేక్షకులకు ఆహ్లాదం కలిగిస్తుంది.

'సీతజోస్యం' పై వివాదం

'సీత జోస్యం' గ్రంథాన్ని 1981లో వచ్చిన ఉత్తమ తెలుగు రచనగా భావించి కేంద్ర సాహిత్య అకాడమి బహుమతి ప్రకటించింది. ఇది సాహిత్యరంగంలో ప్రతిష్టాత్మక పురస్కారం. ఈ పురస్కారం పొందిన తొలి తెలుగు నాటకం సీత జోస్యమే. దీన్ని నార్ల అంగీకరించారు. అయితే సాహిత్య అకాడమి ప్రచురించే Indian Literature ద్వైమాస పత్రిక మే–జూన్ 1982 సంచికలో 'సీతజోస్యం'పై ఒక

సమీక్ష వచ్చింది. అకాడమిలో పనిచేసే ఒక సబ్ ఎడిటరే (డి.ఎస్.రావు) ఆ సమీక్ష చేయడం గమనార్హం. "ఓ ఆరితేరిన పాత్రికేయుడు అత్యంతాకర్షణీయమైన పాండిత్యాన్నంతా గుప్పిస్తూ, తన పాత్రల రూపకల్పనను సమర్థించుకుంటూ, ప్రజాదరణ పొందిన అతి సున్నిత దేవతామూర్తిపై నాటకాన్ని రాశాడు" అని సమీక్షకుడు మొదలు పెట్టాడు. ఇతిహాసాల విషయంలో నార్ల ముందుగానే కొన్ని చారిత్రక నిర్ణయాలు చేసుకొని, వాటి ఋజువుల కోసం ఇరవయ్యవ శతాబ్దపు టార్చిలైటు సహాయంతో ఆ చీకటి మలుపుల్లోకి ప్రయాణించినట్టు భావించాడు. ఋషుల ప్రతినిధులుగా రామలక్ష్మణులు, ఇద్దరు మునులను, ఆదిమ వాసుల ఏకైక ప్రతినిధిగా సీతను నిలిపి చిత్రించారు. సీతవైపు నార్ల మొగ్గు ఉంది. అయితే నార్ల పనితనం సీత పాత్రను కిందికి దొర్లించింది. ఇతిహాస నాయకుల ఆయుధాల మహిమను హేళన చేస్తూ నార్ల చేసిన వాదన కళాశాల చర్చలలో కుర్రకారు చేసే వాదనలాగా ఉంది. "రామరావణ యుద్ధం ఒక స్త్రీ విషయమై కాదు, ఆహారోత్పత్తి, ఆహార సేకరణ, ఆర్థిక వ్యవస్థల మధ్య సంఘర్షణగా భావించుకొని, నార్ల ఇటు అభియోక్తగానూ, అటు తీర్పరిగానూ ద్విపాత్రాభినయం చేశారు. ఆయన పనల్లా ఆదిమవాసుల కోపు గాయటమే". ఈ గ్రంథాన్ని ముక్కలు ముక్కలుగా చింపకుండా కేంద్రసాహిత్య అకాడమి మూడేళ్లలో వచ్చిన మిక్కిలి ఉత్కృష్టమైన రచనగా ఎన్నిక చేయటాన్ని సమీక్షకుడు తప్పుబట్టాడు.

ఈ విమర్శకు అదే పత్రికలో నార్ల సమాధానం ఇచ్చారు. సీత పాత్రలోని విమర్శనాత్మక ధోరణికి సాక్ష్యంగా రామాయణం అయోధ్య కాండలోని ముప్పయ్యవ సర్గని గుర్తు చేశారు. హరప్పా, ఆర్య సంస్కృతుల మధ్య గల తేడాపాడాలను వివరించారు. ఆ తర్వాత అకాడమికి ఒక లేఖ రాస్తూ నార్ల ఈ మొత్తం వ్యవహారంలోని అనౌచిత్యాన్ని ప్రశ్నిస్తూ పురస్కారాన్ని తిరస్కరిస్తున్నట్టు తెలిపారు. ఇది నార్లలోని స్వాభిమానాన్ని, తన అభిప్రాయాల పట్ల తనకు గల పట్టుదలను తెలియజేస్తుంది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఒక పురస్కారాన్ని కేవలం ఒక అనాలోచిత విమర్శ కారణంగా తిరస్కరించడం నార్లకే చెల్లింది. సర్వ స్వతంత్రమైన తన ఆలోచనా స్వేచ్ఛను కోల్పోకుండా పత్రిక రచనలో ప్రభుత్వాలనే ధిక్కరించిన సాహసికి ఈ అకాడమి పురస్కార తిరస్కారం పెద్ద విషయం కాదు.

కేంద్ర సాహిత్య అకాడమి ఈ గ్రంథానికి పురస్కారం ప్రదానం చేసేటప్పుడు ఈవిధంగా పేర్కొంది : "కండగల హేతువాద రీతిలో, సులభ గ్రాహ్యమైన సహజశైలితో, సంప్రదాయబద్ధం కాని పద్ధతిలో పాత్ర చిత్రణ చేసి, సరికొత్త పద్ధతిలో రామాయణ ఇతివృత్తాన్ని తీర్చిదిద్దినందువల్ల 'సీతజోస్యం' తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిందని భావిస్తున్నాం". అటువంటి గ్రంథాన్ని అదే సంస్థ పక్షాన ప్రచురించే పత్రికలో చీల్చి చెండాడడం ఘోరమైన అనౌచిత్యం. అదలా ఉంచితే అకాడమి తన పట్ల ప్రవర్తించిన అవివేకమైన తీరుకు నార్ల స్పందన వివేకపూరితంగా, సంస్కార పూరితంగా ఉంది.

20వ శతాబ్ది నవమేధావి నార్ల. ఆధునికతకు ప్రతినిధి, అంధ విశ్వాసాలకు వ్యతిరేకి. నార్ల భావజాలంతో ఎవరైనా విభేదించవచ్చు. కానీ తన ప్రతిపాదనలకు ఆయన చూపించే హేతువును ఎవరూ కాదనలేరు. ఎన్నో ప్రశ్నల్ని, సందేహాలను రేకెత్తించే నార్ల సాహిత్యం తెలుగు జాతిలో రావాల్సిన భావ విప్లవానికి దోహదం చేస్తుంది. నార్ల సాహిత్యం ఇప్పటికీ తన సమకాలీనతను కోల్పోలేదు.★

పాపినేని శివశంకర్ *కవిత్వం, కథ, విమర్శ రంగాలలో విశిష్టమైన కృషి చేస్తున్నారు. మానవ సంబంధాల తాత్వికత వీరికి ఇష్టమైన సాహిత్య వస్తువు. 'సాహిత్యం – మౌలిక భావనము' వీరి పరిశోధనాంశం. మట్టిగుండె, సగం తెరిచిన తలుపు అనే కథా సంపుటాలు, స్తబ్ధత–చలనం, ఒక సారాంశం కోసం, ఆకుపచ్చని లోకంలో, ఒక ఖడ్గం–ఒక పుష్పం అనే కవితా సంపుటాలు ప్రచురించారు. 1990 నుండి వాసిరెడ్డి నవీన్ తో కలిసి కథా సంకలనాలు వెలువరిస్తున్నారు. గుంటూరు జిల్లా, తాడికొండ బి.ఎస్.ఎస్. బి. కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేస్తున్నారు. తెలుగునాట గల సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులలో వీరొకరు.* ★

సీత జోస్యం : మరికొంత సమాచారం



1. సీత జోస్యం గ్రంథాన్ని సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ 1981–82లో ఉత్తమ గ్రంథంగా ఎంచి సాహిత్య అకాడమి బహుమతి ప్రకటించింది. సాహిత్య రంగంలో ఇది ప్రతిష్టాత్మకమైన పురస్కారం.

తదుపరి సాహిత్య అకాడమి ప్రచురించే Indian Literature ద్వైమాస పత్రిక మే–జూన్ 1982 సంచికలో సమీక్ష ప్రచురిస్తూ నార్ల చారిత్రక విమర్శనాదృష్టిని తప్పుపట్టారు. *(ఈ విమర్శకు తెలుగు అనువాదం అనుబంధం–2 లో చూడవచ్చు)*

2 ఈ విమర్శపై నార్ల స్పందించి తన రీజాయిండర్ను పంపగా అదే పత్రిక జులై–ఆగస్టు 1982 సంచికలో ప్రచురించింది.*(ఈ విమర్శకు తెలుగు అనువాదం అనుబంధం–2 లో చూడవచ్చు.)*

3 ఈ సాహిత్య అకాడమి అవార్డుపై గుల్బర్గా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హో.మా. నాయక్ స్పందనకు తెలుగు అనువాదం అనుబంధం –3లో చూడవచ్చు.

4 సాహిత్య అకాడమి అవార్డు తిరస్కృతిపై నార్ల వివరణ అనుబంధం-4లో చూడవచ్చు.

5 మైసూరు యూనివర్సిటీకి చెందిన డాక్టర్ హెచ్.ఎస్. సుజాత సీత జోస్యం గ్రంథాన్ని కన్నడంలోకి 'సీతేయ భవిష్య" పేరుతో అనువదించగా, అనువాద విభాగంలో సాహిత్య అకాడమి బహుమతి లభించింది.

6 ఈ గ్రంథాన్ని Seetha's Destiny పేరుతో బెంగుళూరుకు చెందిన ప్రొఫెసర్ పి.ఎస్. శ్రీధరమూర్తి ఇంగ్లీషులోకి అనువదించారు.

7 ప్రొఫెసర్ పి.ఎస్. శ్రీధరమూర్తిగారు జాబాలి గ్రంథాన్ని కూడ ఆంగ్లంలోకి అనువదించి The Last Word on Ramayana పేరుతో అచ్చు వేశారు.

గమనిక : Sahitya Akademi ని ఆ సంస్థ ‘ సాహిత్య అకాడమి’ అని తెనుగించింది.

అనుబంధం - 1

గ్రంథ సమీక్ష : (ఇండియన్ లిటరేచర్ - ఇంగ్లీషు ద్వైమాసిక పత్రిక 3-1982)
సీత జోస్యం; నార్ల వెంకటేశ్వరరావు; నవోదయ పబ్లిషర్స్, విజయవాడ;
పుటలు : 143+12+54 వెల రూ. 15-00

నాటకకర్తలు తమ అభిప్రాయాల్ని విశదపరుస్తూ లఘు నాటకాలను సుదీర్ఘ పీఠికలతో ప్రచురించటంలో కాని, పురాణేతిహాసాల ఆధారంగా నాటక రచన గావించడంలోగాని కొత్తదనం ఏమీ లేదు. అయితే ఓ ఆరితేరిన పాత్రికేయుడు అత్యంతాకర్షణీయమైన పాండిత్యాన్నంతా గుప్పిస్తూ, తన పాత్రల రూపకల్పనను సమర్థించుకుంటూ, ప్రజాదరణ పొందిన అతి సున్నిత దేవతామూర్తిపై 54 పుటల నాటకాన్ని రాసి, దానికి రెండు అనుబంధాలు తోడైన 129 పుటల పీఠికను పొందు పరచి నప్పుడు అది తప్పక పాఠకుల దృష్టిని ఆకట్టుకుంటుంది. పైగా అకాడమి పురస్కారాన్ని పొందిన తొలి తెలుగు నాటకం అది కావడం మరింత విశేషం.

నార్ల భావనలో రామాయణంలో నాల్గింట మూడు వంతులు కాల్పనికం; మిగిలిన నాలుగవ వంతులో చారిత్రక ఆధారం ఏదన్నా ఉన్నా అది అన్ని రాజకుటుంబాల మాదిరే సింహాసనం కోసం కుతంత్రాలు, కుమ్ములాటలు; రాముడు అసలు వింధ్యను దాటింది లేదు; రావణుడు గోండుల రాజు గానీ లేదా మరో ఆదిమ జాతి నాయకుడుగానీ అయ్యుండాలి; రావణుడి కాలం నాటి లంక, నేటి లంక

ఒకటి కావు; రామ రావణ యుద్ధం అనేది ఆహారోత్పత్తి చేసే ఆర్థిక వ్యవస్తకూ, ఆహారాన్ని ఏరుకు తెచ్చుకునే ఆర్థిక వ్యవస్థకూ మధ్య సంఘర్షణే, దండకారణ్యంలో వ్యవసాయాన్ని విస్తృతపరిచే విషయంలో రాముని పాత్ర ఉన్న కారణంగా, అతని భార్య పేరు సీత కావటంతో వేదాల సీత రామాయణ సీత అయ్యింది. ఈ అభిప్రాయాలకు నార్ల మౌలికతను సంతరింపజేయటం లేదు; రామాయణ సాహిత్యాన్నంతా అవలోకనం గావించి, గొప్ప హేతుబద్ధమైన సారాంశాలను ఎంపిక చేసుకుని తన పద్ధతిలో విస్తృతమైన వాదనలు వినిపించాడు.

అసలు సిసలైన వాల్మీకాన్ని గుర్తించడంలోని ఇబ్బందుల్ని నార్ల గుర్తించారు. తదనంతర కవులు చేసిన మార్పులు చేర్పులు, ఆ ప్రక్షిప్తాలనుండి మూల రచనను వేరుపరచడం దాదాపు దుస్సాధ్యమన్నారు. ఆ కారణం చాలు ఈ ఇతిహాసానికి సంబంధించి ఏ మతపరమైన, సామాజికపరమైన, ఆర్థిక లేదా రాజకీయపరమైన వ్యాఖ్యలు అయోమయ పరిచేందుకు అది విశ్వాసమైనా విశ్వాస రాహిత్యమైనా పిడివాదం మన నరనరాల్లో ప్రవహిస్తుంది. నార్ల నిశితంకాని, స్పష్టంగా లేని, ఒప్పించ నేర్పు కొరవడిన వాదనలు ఒక్కో పర్యాయం తన ప్రతిపాదనల్నే దెబ్బతీస్తాయి. ఉదాహరణకు 97వ పేజీలో "మనపై రామాయణ ప్రభావం తగ్గనంత వరకు మనమధ్య బాబాలు, భగవాన్లు; అమ్మలు అమ్మమ్మలు తలెత్తుతూనే ఉంటారు; మూఢ మార్గం వెంట మనను నడుపుతూ, నిలువుదోపిడీ చేస్తూనే ఉంటారు. మళ్ళీ 131వ పుట చూచేట్లయితే "రామాయణం భారతాలైనా, అష్టాదశ మహాపురాణాలైనా వాటి ప్రధానోద్దేశాలు కుల వ్యవస్థను పరిరక్షించడమే, ఫ్యూడల్ సంఘాన్ని సుస్థిరం చేయడమే". ఇటువంటి పిడివాదం వల్ల ఆయన్ని కాదనే వారికే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. అంతే తీవ్రతతో వాళ్లు నార్లవంటి వాళ్లే రామరాజ్యం రాకుండా అడ్డుకుంటున్నారని అనగలరు.

హరప్పా నాగరికత నిర్మాతల్ని దురాక్రమణదారులైన ఆర్యులు ఒక చోటు నుండి మరో చోటుకు తరమటంతో వాళ్లు క్రమంగా తమ కౌశలాన్ని పోగొట్టుకున్నారంటారు నార్ల. ఒక నాగరికత శిఖరాగ్రం నుండి క్రిందికి పడిపోవటానికి నాలుగైదు తరాలు చాలంటారు. అదీ లిఖితపూర్వకంగా సమాచారాన్ని భద్రపరిచేందుకు లిపి లేని రోజుల్లో అయితే రెండు, మూడు తరాలు చాలు. (పుట 77). ఆర్యేతర నాగరికతా ప్రాభవాన్ని చాటిచెప్పేందుకు నార్ల చక్కటి నచ్చజెప్పే ధోరణిని చేపట్టారు. కాని ఇతిహాస నాయకులు ధరించిన మహిమగల ఆయుధాల్ని హేళన చేస్తూ భారతీయులు పరాయి దురాక్రమణదారులైన దారస్, అలెగ్జాండర్లతో తలపడినప్పుడు భారతీయుల వద్ద అటువంటి ఆయుధాలు ఉంటే మరి దురాక్రమణదారులెలా వాళ్లను ఓడించ గలిగారంటూ చేసిన వాదన కళాశాల చర్చలలో కుర్రకారు చేసే వాదనలా ఉంది.

ఆయన అంతకుముందు తాను చేసిన వాదన ప్రజలు నాలుగైదు తరాల కాలంలో క్షీణదశకు చేరుకుంటారనేది మరచి పోవటమే గాకుండా ఇతిహాసం ఒక సాహితీరూపంగా నిలిచే ప్రమాణాన్ని కూడ లక్ష్యపెట్టలేదు. ఇదంతా రామాయణ మహాభారత కాలాల నాటి నాయకులు ఉపయోగించిన ఆయుధాల శక్తినో, మహత్తునో ధ్రువీకరించేందుకు చెప్పటం కాదు; రాసిన కాలాల పట్ల కూడ అంగీకారం లేని మౌఖిక ఇతిహాసాల విషయంలో ఒక పండితుడు ముందుగానే కొన్ని నిర్ణయాలు చేసుకొని వాటి ఋజువుల కోసం ఇరవయ్యవ శతాబ్దపు టార్చిలైటు సహాయంతో ఆ చీకటి మలుపుల్లోకి ప్రయాణించడంలో ఎదురయ్యే కనుపించని గోతుల్ని ఎత్తి చూపేందుకే.

రామరావణ యుద్ధం ఒక స్త్రీ విషయమై కాదు, ఆహారోత్పత్తి ఆహార సేకరణ ఆర్థిక వ్యవస్థల మధ్య సంఘర్షణగా భావించుకొని నార్ల ఇటు అభియోక్తగానూ అటు తీర్పరిగానూ ద్విపాత్రాభినయం చేసారు. ఆయన పనల్లా ఆదిమవాసుల కోపు గాయటమే వాళ్ళు ఏయే వేషాల్లో ఉన్నా – ఋషుల ముసుగులోని ఇంద్రజాలికులు కానీ, వ్యవసాయదారులు కానీ, రాజుల ముసుగు వేసుకున్న దేశ బహిష్కృతులు కానీ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా ఆదిమవాసులపై పడే దెబ్బకు సిద్ధమవ్వటమే. దశరథ జాతక కథలలో *(అవి బుద్ధుని శిష్యుల అభూత కల్పనలని ఆయన భావిస్తారు)* రమా పండితుడు తన సోదరి సీతను వివాహమాడటంలో అభ్యంతరం చెప్పనప్పుడు నార్ల ఆనాడు అమలులో ఉన్న నైతిక సామాజిక కట్టుబాట్లను అనువర్తింప చేయడంలో నిష్పాక్షిక ధోరణి అవలంభించినట్లే. కానీ ఋషుల జన్మల విషయంలోని అశ్లీల కథల విషయానికి వచ్చేప్పటికి పురాతన సమాజానికి ఇరవయ్యవ శతాబ్దపు నాటి భారతీయ సమాజపు వివేచనతో కూడిన దారుణమైన లైంగిక విశృంఖలత్వాన్ని అనువర్తింపచేసి అసహ్యించు కోవడం జరిగింది. (పుట 87).

పైగా అరాచకవాదుల్ని శాంతికాముకులుగా చిత్రించేందుకు నార్ల చాల కష్టపడవలసి వచ్చింది. పార్లమెంటు సభ్యునిగా తాను పర్యటించిన అండమాన్, కార్ నికోబార్ దీవులలో నివసించేవాళ్లను ఉదహరించారు. బిషప్ రిచర్డ్సన్ తమ భాషలో యుద్ధాన్ని తెలియజేసే పదమే లేదని తనకు చెప్పటం జరిగిందన్నారు. *(పుట 110).* కాని దానికి ముందు పేజీల్లోనే నార్ల దక్షిణ అండమాన్ కు చెందిన ***'జరవ'*** జాతిని గూర్చి చెప్పటం జరిగింది; జరవలు నరమాంస భక్షకులు కాదుగాని ఒంటరిగా కనిపించే కొత్త వాళ్లను సైతం బాణాలు వేసి చంపుతారు. ఆ మరణాలను అడ్డుకునేందుకు పోలీసు తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయవలసివచ్చింది. అయినా నార్ల దృష్టిలో ఆదిమ జాతులకు చెందినవారు శాంతి ప్రియులే. రామాయణపు దండకారణ్యంలోని నిషాదులు బిషప్ చర్డ్సన్ వంటి శాంతిప్రియులైన ప్రజలయ్యుంటారేమోనని ఆయన విస్తుబోతారు.

సుదీర్ఘమైన పీఠిక తరువాత ఐదు పాత్రలతో రెండంకాల నాటకం ప్రారంభమౌతుంది. అప్పటికి పాఠకుడు నాటక రచయిత ఇష్టాయిష్టాలకు అనుకూలంగానో, ప్రతికూలంగానో దురభిమానాన్ని పెంచుకుంటాడు – రామునికో సీతకో కాదు నార్లకు భక్తుడైతే తప్ప అతను ఆయన మాయలో చిక్కుకోడు. ఆహారోత్పత్తికి చెందిన ఆర్థిక వ్యవస్థకూ, ఆహార సేకరణకు చెందిన ఆర్థిక వ్యవస్థకూ మధ్య సంఘర్షణ ఒక ప్రక్క రాక్షసులకు వ్యతిరేకంగా రామలక్ష్మణుల సంరక్షణలో ఇరువురు ఋషులనూ, మరోపక్క ఆదిమవాసుల ఏకైక ప్రతినిధిగా సీతనూ నిలిపి చిత్రించారు. పావులు కదపటంలో సీత వైపు మొగ్గు ఎక్కువగా చూపబడింది ఒక స్త్రీకి అభిముఖంగా నార్ల సీతను వాల్మీకి చిత్రించిన విధంగానే చిత్రిస్తున్నానని ఎంతగా చెప్పుకున్నా సీత నార్లకు బాకా ఊదింది. సీతను అందగత్తెగా, మనోల్లాసినిగా, హాస్యప్రియగా, ఆత్మస్థైర్యం కల దానిగా చిత్రించిన మేరకు వేదనలో మునిగిన పడుచుగా అనేకులు వేసిన ముద్ర నుండి ఆమెను రక్షించ గలిగారు. కానీ, ఆయన సీతను మొరసుగా, వాగ్వివాదిగా, తగవులాడిగా చిత్రించినపుడు మాత్రం తన వాదాన్ని తానే మరచిపోయారు. నార్ల నాటకంలో రాముడు పొగడ్తలతో పొంగిపోయేవానిగా; లక్ష్మణుని మానసిక దుర్బలునిగా ఋషులు అసంబద్ధులుగా చిత్రించబడ్డారు. ప్రత్యర్థుల పసలేని వాదనలకు వ్యతిరేకంగా సీత దృఢమైన వాదనలు నిలిపి నార్ల మరీ అయాచిత గౌరవాన్ని కల్పిస్తూ ఆమె పాత్ర చిత్రణకు రూపకల్పన చేశారు. విషయం ఆధునికం కానివ్వండి ప్రాచీనం కానివ్వండి, రాజకీయం కానివ్వండి, సాహిత్యం కానివ్వండి, సిగ్గుమాలిన అయాచిత గౌరవ రూపకల్పనలు విషయానికి మంచికంటే చెరుపే ఎక్కువ చేస్తాయి. రాముడు ఋషులకు వాళ్లను రాక్షసుల నుండి కాపాడతానని ఇచ్చిన మాటను సర్వశ్రేష్ఠగా భావిస్తాడు. తాను ఇచ్చిన మాటను నిలపుకోలేకపోతే కులగౌరవం కుప్పకూలుతుంది; కనుక దానిని నిలబెట్టుకునేందుకు అవసరమైతే సీతను, లక్ష్మణుణ్ణేమి ప్రాణాన్ని సైతం త్యజించగలడు. అవును రాముడంతటి వాడేనని సీత నమ్ముతూ ఎప్పుడో ఒకసారి, ఎక్కడో ఒకచోట కుటుంబ గౌరవం కోసం తనను కారడవుల్లో అనాథగా వదిలేస్తాడని జోస్యం చెబుతుంది. అనేక సంవత్సరాల పరిశోధనల ఫలితంగా పండితులు సీతాపరిత్యాగాంశం గల ఉత్తరకాండ వాల్మీకిది కానే కాదని తరువాత చేర్చ బడినదనే నిర్ణయానికి రావడం జరిగింది. అలాంటపుడు నార్ల సీత వాల్మీకి సీత కాదు.

నార్ల 'సీత జోస్యం' షా 'సెయింట్ జోన్'ను స్ఫురణకు తెస్తుంది. నాటక రచయిత లిరువురూ విగ్రహారాధనకు వ్యతిరేకులట. సంప్రదాయబద్ధం కాని వాళ్ల అభిప్రాయాల్ని గట్టిపరిచేందుకు సుదీర్ఘ పీఠికలు రాస్తారు. సీత, జోన్ ఇద్దరూ కనబరిచే తెలివితేటలూ నిర్మొహమాటం వాళ్ళ పెద్దలకు సుఖాన్నివ్వవు. షా మేధావితనం జోన్‌కు పునరుత్థానాన్ని సంతరింపజేస్తే నార్ల పనితనం సీతను క్రిందికి దొర్లించింది.

తన ముందుమాట చివరలో నార్ల ఆశించిందేమంటే తన పుస్తకాన్ని కొన్ని పేజీలు చదివిన తరువాత ఎవరైతే చింపి పోగులు పెట్టకుండా ఉంటారో వాళ్ళు రాముడు సీతల మధ్య ప్రశంసింపదగినవారు సీతయే గాని రాముడు కాదని తనతో ఏకీభవిస్తారని. ఇంకో చోట ఎక్కడో ఆయన చెప్పేదేమంటే తన పుస్తకం భక్తిపరుల కోసం కాదని, అవగాహనాపరులైన పాఠకుల కోసమని – దాన్ని ఎంతగా పదే పదే చెప్పడం జరిగిందంటే హేమ్లెట్ లోని రాణి మాటల్ని వేరొకరు ఇలా వల్లె వేసేంతగా – “ఈమె మరీ ఎక్కువగా నిరసించినట్లు అన్పిస్తూంది”.

పుస్తకాన్ని ముక్కలుగా చింపి వేయటానికి భిన్నంగా భారత జాతీయ సాహిత్య అకాడమి గత మూడేళ్ళలో తెలుగు సాహిత్యంలో మిక్కిలి ఉత్కృష్టమైన రచనగా ముల్వురు న్యాయ నిర్ణేతల సంఘ సిఫారసులకు అనుగుణంగా ఎంపిక చేసింది. ఆ న్యాయ నిర్ణేతలు ముల్వురు – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అధ్యక్షులు (బి. గోపాలరెడ్డి), ఒక సుప్రీం కోర్టు న్యాయాధీశుడు (జస్టిస్ ఓ. చిన్నపరెడ్డి) ఒక కళాశాల ఉపాధ్యాయుడు (అమరేంద్ర). ఇప్పుడు నార్ల తనను కవ్విస్తున్నారనే సంక్లిష్ట భావనను తొలగించుకొనగలరని ఆశిద్దాం.

(**గమనిక**: *ఈ సమీక్షలో వివరించిన పుటల సంఖ్య సీత జోస్యం తొలిముద్రణ లోనివి.*) డి.యస్. ఆర్.

అనుబంధం – 2

సంపాదకుని లేఖలు

గ్రంథ సమీక్ష : (ఇండియన్ లిటరేచర్ – ఇంగ్లీషు ద్వైమాసిక పత్రిక 4-1982)
సీత జోస్యం (ఒక ప్రత్యాక్షేపం)

మహాశయా,

మే-జూన్ 1982 నాటి మీ పత్రికలో నా నాటకం “సీత జోస్యం”పై డి.యస్.ఆర్. గారి సమీక్షకు సమాధానంగా నేను చెప్పదల్చినదంతా ఏమంటే ప్రతికూలంగా ఉన్న సమీక్షను, అది విషపూరిత మైనదైనా సరే స్వాగతించగలను కానీ ఆకతాయి పద్ధతిని మాత్రం కాదు. మీ సమీక్షకుణ్ణి అంశాల వారీగా ఖండించే సమయం గానీ, ఉద్దేశ్యం గానీ నాకు లేదు. ఆయనలోని చారిత్రక, భౌగోళిక అవగాహనా లేమిని, ఆ మాటకొస్తే అసలు వాల్మీకి రామాయణ అవగాహనా రాహిత్యాన్ని పట్టి చూపేందుకే నేను పరిమితమౌతాను.

మొదటగా చారిత్రక అంశాన్ని స్పృశిస్తాను. గొణుక్కుంటానైనా సరే డి.యస్.ఆర్. గారు నేను ఆర్యేతర (హరప్పాకు చెందిన నాగరికతను పూర్వవైభవ ప్రాపకానికి తగిన వాదం చేసినట్లుగా అంగీకరించారు. ఆర్యులు భారతదేశాన్ని జయించవచ్చి వలస లేర్పరచుకున్న నాటి పాక్షిక ఆటవిక దశను చాటేందుకు కూడ నా వాదనలో నేను వెనుకబడింది లేదు. ఓడించబడిన హరప్పన్లు కొండల్లోకి, కోనల్లోకి నెట్టబడగా గతంలోని వాళ్ల ప్రతిభలన్నీ అది యుద్ధకౌశలంగానీ, శాంతియుత జీవనం గానీ బహుకొద్ది తరాలలోనే కోల్పోయారు; కాలక్రమేణా విజేతలైన ఆర్యులు వాటిని అమితంగా అలవర్చుకున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో హరప్పన్లను, ఆర్యులను ఒకే గాటన కట్టనందుకు అసంగత్యాన్నో, కాలేజీ చర్చల్లో పాల్గొనే యవ్వనారంభ దశ కుర్రకారు మనస్తత్వాన్నో నాకు అంటగట్టి, నిష్పాక్షికంగా ఆలోచించగల వారెవరైనా నన్ను నిందించగలరా? ఏం చేద్దాం ... పతనమైన నాగరికతను పరిఢవిల్లుతున్న దానితో సమతూకంతో చూసే పరిపక్వత డి.యస్.ఆర్.గారి వలె బహుశా నాకు లేదేమో!

ఇక భౌగోళిక స్థితిని గూర్చి ఒక మాట. జరవులు పోర్టయిర్క ఆనుకుని ఉన్న అండమాన్ దీవుల్లో నివసిస్తారు. నేను ప్రత్యేకించి పేర్కొన్న నైకో బారియన్లు పోర్ట్ బ్లెయిర్కు దక్షిణంగా 150 మైళ్ల దూరంలో ఉన్న కార్ నికోబార్ లో నివసిస్తారు. ఇప్పటికీ పోర్ట్ బ్లెయిర్కూ కార్ నికోబార్ క్కూ మధ్య సముద్ర మార్గం గుండా ఎక్కువగా విస్తరించి ఉండే వర్షఋతువులో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. ఇటువంటి స్థితిలో జరవలు, నికోబారియన్లు భిన్నంగా ఉండడంలో డి.యస్.ఆర్. ఆలోచించినట్లు వింత ఏముంది?

మన ప్రధాన భూభాగంలో కూడ కొద్ది వందల మైళ్ల దూరంలో నివసించే ఆదిమజాతి తెగల్లో కూడ ఒక తెగకూ మరో తెగకూ మధ్య అలవాట్లలో, ఆచారాలలో, వ్యక్తిగత స్వభావాలలో తేడా మనం గమనించడం లేదూ?

డి.యస్.ఆర్. చెప్పినట్లు నేను సీతను “మొరుసుగా, వాగ్వివాదిగా, తగవులాడిగా” చిత్రించాననే దానిని అంగీకరించవలసివస్తే ఆయన వాల్మీకి కృతిని అసలు చదివి ఉండడనీ, ఒకవేళ చదివినా ఏదో పైపైన తిరగవేయడం జరిగి ఉంటుందనే తన తప్పును తాను అంగీకరించ వలసి ఉంటుంది. సీత కొంచెం రెచ్చగొట్టబడితే చాలు తన నాలుకతో ఎవరినైనా సరే చీల్చి చెండాడ గలదు. డి.యస్.ఆర్. గారు, అయోధ్యాకాండ ముప్పయ్యవ సర్గని తిరగెయ్య గలిగితే అందులో సీత తన భర్తను "రూపంలోనే మగడు (చేతల్లో మాత్రం) మగనాలి”. అంతటితో ఆగకుండా ఆమె అతణ్ణి తన భార్యను ఇతరులకు “అప్పగించే” ఒక “నటుని”తో పోల్చుతుంది. ఇక లక్ష్మణుని నిందించడంలో అంతకంటే ఆమె క్రూరం కాదనుకుంటేదురుసు.

డి.యస్.ఆర్. గారు కావాలనుకుంటే అరణ్యకాండ 45వ సర్గను చూసి ఋజువు పరచుకోవచ్చు. వాల్మీకి రామాయణాన్ని ఆంగ్లంలోకి అనువదిస్తూ విఖ్యాత సంస్కృత పండితుడు యం.యన్. దత్తు సీత లక్ష్మణుని అన్నమాటలకు బ్రేజన్ (సిగ్గుమాలిన) అనే విశేషణాన్ని వాడారు. అయినా సరే డి.యస్.ఆర్. గారు (సీతకు సంబంధించి) సిగ్గుమాలిన అయాచిత గౌరవాన్ని ప్రదర్శించాననే అభియోగం నాపై మోపారు.

ముమ్ముందు డి.యస్.ఆర్.గారు రామాయణ ఇతివృత్తంపై వచ్చిన ఆధునిక కృతుల్ని *(ఆధునికం స్ఫూర్తిలో అనుకోండి)* వ్యంగ్య ధోరణితో ఖండించాలనుకుంటే ఆయన ముందుగా కనీసం ఒక్కసారైనా వాల్మీకి రామాయణం చదవవలసి ఉంది. అదీ నిశితంగా అధ్యయనం చేయవలసి ఉంది.

తమ సమీక్ష ముగిస్తూ డి.యస్.ఆర్. గారు నన్ను గేలి చేసేందుకు షేక్స్పియర్ను మెడ బట్టుకుని ఈడ్చుకొచ్చారు. వాయనం తిరిగి ఇస్తున్నట్లు నేనూ షేక్స్పియర్ మాటల్నే ఉటంకించినా:

"ఓరి అజ్ఞాన భూతమా, నీ వెంతటి కురూపివి!" – *వి.ఆర్. నార్ల*

అనుబంధం – 3

కొన్ని సంబంధిత అంశాలు

కొంతకాలం క్రితం (1982 నాటికి కేంద్ర సాహిత్య అకాడమిని విమర్శించి కుష్వంత్ సింగ్ వార్తల్లో కెక్కాడు. ఇప్పుడు అకాడమి తన తప్పిదం కారణంగా వివాదంలో చిక్కుకుంది.

గత సంవత్సరం (1981) అకాడమి ఆమోదించిన 22 భాషలకుగాను 21 భాషలకు సంబంధించి వార్షిక పురస్కారాలను ప్రదానం చేసింది. తెలుగులో వి.ఆర్. నార్లగారి "సీతజోస్యం"కు పురస్కారం లభించింది. 1979 లో ప్రచురింపబడిన ఈ కృతి (పబ్లిషర్: నవోదయ పబ్లిషర్సు, విజయవాడ) 1978–79–80 సంవత్సరాల కాలంలో ప్రచురించబడిన అత్యుత్తమ గ్రంథంగా కేంద్ర సాహిత్య అకాడమి నియమావళికి అనుగుణంగా ఎంపిక చేయబడింది.

పురస్కారాలు ప్రదానం చేసే సందర్భంగా ఈ పుస్తకం ఇలా ప్రశంసింపబడింది:

"కందగల హేతువాద రీతిలో, సులభ గ్రాహ్యమైన సహజ శైలితో, సంప్రదాయబద్ధం కాని పద్ధతిలో పాత్ర చిత్రణ చేసి, సరికొత్త పద్ధతిలో రామాయణ ఇతవృత్తాన్ని తీర్చిదిద్దినందువల్ల "సీత జోస్యం" తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిందని భావిస్తున్నాం".

గోవాలోని పనాజీలో జరిగిన పురస్కార ప్రదానోత్సవానికి నార్ల వచ్చేందుకు వ్యక్తిగతమైన ఇబ్బంది అడ్డుగా నిలిచింది. ఆ సందర్భంగా ఆయన రాసిన లేఖలో సాహితీకారునిగా తన ఆశయాలను, ఉద్దేశ్యాలను ఉల్లేఖించారు "మంచి ప్రపంచంలో ఉత్కృష్ట మానవుల కోసం నా జీవన పోరాటం, అన్వేషణలలో ఒక భాగమే ఈ సీత జోస్యం".

అదే సందర్భంగా ఆయన తన నాటకాన్ని గురించి అందులోని సుదీర్ఘమైన పీఠికను గురించి చెప్పిన విషయం కూడా అంతే ముఖ్యమైనది.

"నా నాటకం, మరీ ముఖ్యంగా దానికి నా విస్తృత పీఠిక, రెండు విషయాలను స్పష్టం చేస్తాయి. మొదటగా రామాయణ గాథకు అసలు చారిత్రక ఆధారం అనేది ఉంటే అది ఒక ప్రక్కన ఆహారాన్ని సేకరించుకుని కాలం గడిపే సామాజిక ఆర్థిక వర్గానికీ, మరో ప్రక్క ఆహారాన్ని ఉత్పత్తి చేసే సామాజిక ఆర్థిక వర్గానికీ మధ్య సంఘర్షణకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇక రెండవ విషయం – ఈ ఘర్షణలన్నీ వింధ్య పర్వతశ్రేణికి ఉత్తరంగా ఉన్న ఏదో ప్రదేశంలో జరిగినవే గాని ఆ పర్వతశ్రేణికి దక్షిణంగా మాత్రం కాదు. ఇవి నా పరిశోధనల ఫలితాలు కావు. ఇంతకు ముందే ఇతరులు ఇలా చెప్పడం జరిగింది. నేను చేసిందేమంటే దానిని విస్తృతపరచటమే; రామాయణం నుండి ఋజువులు చూపటమే. నేను విగ్రహారాధకుణ్ణి కాను. నా నాటకమూ భగవదారాధనకు వ్యతిరేకమే".

ఈ కృతిలోని నార్ల భావాలు యం. వెంకటశేష అయ్యంగారు కన్నడంలో రచించిన "ఆదికవి వాల్మీకి", "శ్రీరామ పట్టాభిషేకం" చదివిన వారికి ఆసాంతం కొత్తగా అన్పించవు. అటువంటి ప్రయత్నాలు ఇతిహాసాన్ని సంప్రదాయబద్ధంగా చదవడంగాక సరైన పద్ధతిలో అధ్యయనం చేసేందుకు ఉద్దేశించినట్టివి. దైవత్వమని విశ్వసించే విషయాలలో మానవ వ్యవహారాలను ఎత్తిచూపే ఉద్దేశ్యమే ఇటువంటి రచనలలో కనిపిస్తుంది.

"సీతజోస్యం" సాహిత్య అకాడమి పురస్కారం పొందిన తొలి ఏకైక తెలుగు నాటకం. 54 పుటల నాటకానికి నార్ల 130 పుటల పీఠికను రాసి మనకు జార్జి బెర్నార్డ్ ను జ్ఞప్తికి తెస్తారు. నార్ల పాండిత్యాన్ని ధ్రువీకరించే ఈ ముందుమాట రాసేందుకు లోతైన అధ్యయనం కోసం పద్నాలుగేళ్లు వెచ్చించవలసి వచ్చిందని తెలుసుకున్నాం. నార్ల రచనలు ఎప్పుడూ లోతైన ఆలోచనలతో, పరిశోధనాత్మక వివరాలతో కూడుకొని ఉంటాయి.

వి.ఆర్. నార్లగా వినుతికెక్కిన నార్ల వెంకటేశ్వరరావుగారు హేతువాదులలో మన దేశపు ఆలోచనాపరుల్లో ప్రసిద్ధులు. పేరెన్నికగన్న రచయితగా, కవిగా, నాటకకర్తగా, వ్యాసశిల్పిగా, విమర్శకునిగా పాతిక పైచిలుకు గ్రంథాలకు కర్తృత్వం వహించారు. ఈయన రచనలు పలు భారతీయ భాషల్లోకి అనువదించబడినాయి. పిరికితనం ఎరుగని ప్రావీణ్యత గల పాత్రికేయుడీయన. 1942 నుండి 1959 వరకు "ఆంధ్రప్రభ", 1960 నుండి 1977 వరకు "ఆంధ్రజ్యోతి" దినపత్రికలకు ఈయన సంపాదకులు. ఈయన రాజ్యసభ సభ్యులుగా రెండు పదవీ కాలాలు పూర్తి చేశారు. సాహిత్య అకాడమి, లలితకళా అకాడమి, నేషనల్ బుక్ ట్రస్టు వంటి పలు సంస్థలతో, వ్యవస్థలతో ఈయనకు సంబంధాలున్నాయి. ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర, నాగార్జున విశ్వవిద్యాలయాలు ఈయనకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి సత్కరించాయి. 1958లో యునెస్కో సాధారణ సభలో ఈయన భారతదేశ ప్రతినిధి.

నార్ల సాహితీ ప్రియుడు. లేత వయస్సులోనే స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకున్న వాడు. అజ్ఞానానికి, మూఢనమ్మకాలకూ, నియంతృత్వానికీ వ్యతిరేకంగా పోరాడే అవిశ్రాంత యోధుడు. ఈ ధోరణి భౌతికమైన నష్టాలకు గురిచేసినా ఈయన ఏ సందర్భంలోనూ తల దించింది లేదు. తన నమ్మకాల, విశ్వాసాల సాధనలో ఏ రకమైన త్యాగానికై నా వెనుకాడింది లేదు. కొందరు గేలిచేయజూచినా తమ భావ ప్రకటనలో ఆయన చలించింది లేదు.

"ఇండియన్ లిటరేచర్" అనేది కేంద్ర సాహిత్య అకాడమి సాధికారిక ద్వైమాసిక పత్రిక. దాని ఎడిటర్ కేశవ మల్లిక్. కేంద్ర సాహిత్య అకాడమి అధ్యక్షులు (ఉమాశంకర్ జోషి), ఉపాధ్యక్షులు (వి.కె. గోకక్), కార్యదర్శి (ఆర్.ఎస్. కేల్కర్) దాని సంపాదక కమిటీలో సభ్యులు. సాహిత్య అకాడమిలో ఉద్యోగిగా ఉన్న డి.యస్.రావు అనే ఆయన ఇటీవల ప్రచురితమైన ద్వైమాసికలో (మే-జూన్ 1982. సంపుటం 25. నెం3, పుటలు 122-126) "సీత జోస్యం" గ్రంథాన్ని సమీక్షించారు. "సీత జోస్యం"ను షా "సెయింట్ జోన్"తో సరిపోల్చి షాలోని ప్రత్యుత్పన్నతి జోన్‌లో కొత్త జీవాన్ని అందిస్తే నార్లలోని బుద్ధికుశలత సీతకు అన్యాయం చేసిందన్నారు. నార్ల చెప్పిందే తిప్పి చెబుతూ డి.యస్.రావు అన్నదేమంటే – ఈ పుస్తకాన్ని ముక్కలు ముక్కలుగా చింపకుండ కేంద్ర సాహిత్య అకాడమి దీనిని

తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసే రచనగా పేర్కొంటూ పురస్కారానికి ఎంపిక చేసింది. తన దాడిని కొనసాగిస్తూ నార్ల తనను కవ్విస్తున్నారనే భావనను మానుకోగలరనే ఆశాభావాన్ని ప్రకటించటం జరిగింది.

సాహిత్య అకాడమి ప్రచురించే పత్రికలో అటువంటి అననుకూలమైన విమర్శ చోటు చేసుకున్నందుకు నార్ల బాధపడటం సహజమే. ఈ తప్పిదాన్ని సాహిత్య అకాడమి అంగీకరించని పక్షంలో తన పురస్కారాన్ని తిరస్కరించాలనే నిర్ణయానికొచ్చారు నార్ల. అకాడమి తరఫున, సంపాదక మండలి పక్షాన కార్యదర్శి ఆర్.ఎస్. కేల్కర్ నార్లను క్షమించమని కోరడం జరిగింది. అకాడమిని ఇరుకునబెట్టే ఏ చర్యా చేపట్టవద్దని ఆయన నార్లను కోరాడు. సంపాదకుడు తప్పుచేయడం జరిగిందనీ ఇంతటితో ఇక ఆ వివాదానికి తెరదించడం జరుగుతుందనీ కేల్కర్ చెప్పడం జరిగింది. ఈ విషయంలో అకాడమి తనని తానే పరిహసించుకున్నదనీ, విమర్శించేవారికి తామే స్వయంగా సమాచారాన్ని అందించి నట్లయ్యిందన్న నార్ల చివరకు కార్యదర్శి సూచనను మన్నించటం జరిగింది. అకాడమికి తెలియకుండా జరిగిన ఇటువంటి అసమర్థ ఉదంతాన్ని ఇంకా పెంచి పెద్ద చేయడంలో తనకు ఉత్సుకత లేదని నార్ల అన్నప్పుడు ఆయన సరైన నిర్ణయాన్ని గైకొన్నారని మనం అంగీకరించాల్సి ఉంటుంది.

ఈ ఉదంతం చాలా ప్రశ్నల్ని రేకెత్తిస్తుంది : నార్ల వంటి హేతువాది విమర్శను తట్టుకోలేడా? అకాడమి ఉద్యోగికి విమర్శించే హక్కు లేదా? తీవ్రమైన విమర్శలు అకాడమి ప్రచురించే పత్రికలో కన్పించగూడదా? అనేవి. అయితే ఈ ప్రశ్నలన్నీ ప్రస్తుత ఉదంతానికి సంబంధించి అప్రస్తుతాలు. ఇక్కడ ప్రధాన సమస్య ఔచిత్యానికి సంబంధించింది. సంపాదకుడు రాత ప్రతుల్ని క్షుణ్ణంగా పరిశీలించ కుండా, తన వివేచనకు పని కల్పించకుంటే వచ్చే ఫలితాలకు ఇదొక మంచి ఉదాహరణ.

ఇటీవల నార్ల నాకు రాసిన జాబులో ఈ విషయాన్ని చర్చించారు : "నా పుస్తకం చర్చించబడటం నేనెంతగానో కోరుకునే విషయం. విమర్శల్ని నేనెంతగానో స్వాగతిస్తాను. ఒకటి రెండు తెలుగు దినపత్రికలు ఈ నాటకంపై ఘాటైన విమర్శలు గుప్పించాయి. నేను వాటిని స్వాగతిస్తాను. అటువంటి చర్చలు మన కృతి ఏమేరకు కళకళలాడుతూ ఉంటుందో, అది ఎంతటి శక్తివంతమైనదో శోధించేందుకు ఉపకరిస్తాయి. ఏ అకాడమి అయితే ఆ పుస్తకానికి అద్వితీయమైన గౌరవాన్ని కల్పించిందో ఆ అకాడమి ప్రచురించే పత్రికలోనే ఆ అకాడమిలో పనిచేసే ఉద్యోగే తుంటరి విమర్శలు చేయడాన్ని నేను వ్యతిరేకిస్తాను. ఆ విమర్శకుడే అదే విమర్శ వేరే చోట చేసి ఉంటే నేను అభ్యంతరం పెట్టి ఉండేవాణ్ణి కాదు. నాకు ఈ ఉదంతమంతా హేతురహితంగానూ, హానికరంగానూ కనిపిస్తుంది".

నార్ల అభిప్రాయాలు స్పష్టంగానే ఉన్నాయి. ఈయన నిర్ణయం పరిశుద్ధమైనదే, ఈయనను బాగా ఎరిగివున్న వారూ, ఈ ఉదంతం తెలిసినవారూ ఈయనను నిశ్చయంగా తప్పుపట్టలేరు.

“ఇండియన్ లిటరేచర్" అదే సంచికలో అదే డి.యస్.రావు 1981వ సంవత్సరానికి ఆంగ్ల శాఖలో సాహిత్య అకాడమి పురస్కారాన్ని పొందిన జయంత్ మహాపాత్ర సృజన “రిలేషన్ షిప్” అనే పుస్తకంపై చేసిన విమర్శ ఏమంటే – పుస్తకం చిన్నదైనా అది ప్రజ్వలింపజేసే వివాదాలు అపరిమితంగా ఉంటాయి. ఈ విషయంలో మహాపాత్రగారు ఎటువంటి నిర్ణయం గైకొన్నారో ఇంకా తెలియరాలేదు. నార్ల లేవదీసిన అభ్యంతరాలు ఇక్కడా సమానంగానే వర్తిస్తాయి. “ఇండియన్ లిటరేచర్" సంపాదకుడు ఆంగ్లకవితా సృజనకర్త. ఆయన కొంచెం ఔచిత్యాన్ని ప్రదర్శించి ఉంటే అకాడమి అటువంటి ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొనాల్సి వచ్చేది కాదు. -డాక్టరు హా.మా. నాయక్

మాజీ వైస్ ఛాన్సలర్, గుల్బర్గావిశ్వ విద్యాలయం

అనుబంధం – 4

నేనెందుకు సాహిత్య అకాడమి పురస్కారాన్ని తిరస్కరించాను?

రమారమి గత అర్ధ శతాబ్దిగా భావస్వేచ్ఛకై, భావ ప్రకటనా స్వేచ్ఛకై పోరాడిన నా వంటి వానిని వాటికి శత్రువుగా చిత్రింపబూనటం నిజంగా చాలా నిందార్హం. నా తెలుగు నాటకం “సీత జోస్యం” పురస్కారం స్వీకరించేందుకు ముందుగా ఇచ్చిన అనుమతిని కాదన్న సందర్భంలో దానికి కారణం నా రచనల పట్ల ప్రతికూల విమర్శలు కానేకాదని మాటిమాటికి వివరించి చెప్పినా నాపై దుర్భాషల వర్షం కురిపించే వాళ్లు దానిని తమకు అనుకూలమైన విధంగా పెడచెవిని పెడుతున్నారు. నా నిర్ణయం సరైనదా? కాదా? అనే విషయాన్ని తేల్చి చెప్పేందుకు ఈ వివరాలన్నీ ప్రజల ముందుంచుతున్నందుకు నన్ను మన్నిస్తారనుకుంటాను.

తెలుగులో నా నాటకాన్ని 1981వ సంవత్సరపు పురస్కారానికి ఎంపిక చేసిన తరువాత, ఆ పురస్కారాన్ని ప్రదానం చేసే అకాడమిలోనే పనిచేసే ఒక సబ్ ఎడిటర్ నన్నూ, నా నాటకాన్నీ అప్రతిష్టపాలు చేస్తూ ఓ నాలుగు పేజీల విమర్శ రాయడమే గాకుండా అంతకంటే దారుణంగా ఆ విమర్శను ఆ అకాడమికి చెందిన ఇండియన్ లిటరేచర్ మే–జూన్ పత్రికలో ప్రచురించారు.

"భారతీయ సంస్కృతి ఇరవయ్యవ శతాబ్దపు ముంగిట జీవనం సాగిస్తున్నావారు". “ఆక్షేపించబడుతున్నాననే భ్రమలో బతుకును వెళ్ళమారుస్తున్నవారు”.

"ముందుగా ఒక అభిప్రాయానికి వచ్చి దానికి తరువాత కారణాల కోసం వెతికేవారూ", "తిరుగుబాటు భావాన్ని పాదుకొల్ప దల్చుకున్నవారు".

"ప్రతిదానికీ అభ్యంతరాలు చెప్పే స్త్రీ" "ఇంకా ఎదగని ఓ కళాశాల వాగ్వివాది" "ఒక దురావేశపరుడు" వంటివి ఈ సమీక్షలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నాపై విసిరిన విశేషణాలు. పైగా ఇటువంటి సమీక్ష విమర్శనాత్మకమైనదేగాని పరుషమైనది కాదని వర్ణించుకున్నారు.

ఇటువంటి చర్య ఔచిత్యాన్ని నేను ప్రశ్నించినప్పుడు ఆ పత్రిక సంపాదకులు అది ఒక కళంకాన్ని ఆపాదించే చర్యేనని అంగీకరించారు. ఆయన ఇంకో అడుగు ముందుకేసి – భావస్వేచ్ఛను కాపాడుకోవడంలో కట్టలు తెంపే ఉత్సాహం ఉరకలు వేసిందన్నారు. అకాడమి కార్యదర్శిగారు తమంత తామే ఇంకా వివరణ ఇచ్చారు; అకాడమి పురస్కారానికి ఎంపిక చేయబడిన కృతిని విమర్శించేప్పుడు అయిష్టతను ప్రకటించడం అంటే అకాడమి ప్రతిష్టను దిగజార్చడమే – అందులోనూ అకాడమి ప్రచురించే పత్రికలో అటువంటి విమర్శ చోటుచేసుకోవడం గాయానికి అవమానపు కారం అద్దినట్లే.

బాధ్యత గల ఆ ఇరువురు కార్యనిర్వాహకుల ప్రకటనలు పరిశీలించిన పిమ్మట ఈ విషయంలో ఇంకేమీ రాయదల్చుకోలేదు. కనుక నేను రెండు షరతులు పెట్టాను : మొదటగా వాళ్లు నష్టపరిహారంగా నా సంక్షిప్త నిరసనను ఆసాంతంగా సరిదిద్దకుండా ప్రచురించాలి. రెండవది ఆ పత్రికలో ఇక ఈ విషయమై ఎటువంటి రాతలైనా ప్రచురిందం తక్షణమే నిలిపివేయాలి. రెండవ షరతు కేవలం అకాడమికి చెందిన పత్రికకే వర్తిస్తుందని నొక్కి చెప్పదలచుకున్నాను. పత్రికా సంపాదకుడూ, అకాడమి కార్యదర్శి, ఇరువురూ కూడ అకాడమి పురస్కారాన్ని ప్రకటించిన పిమ్మట నా పుస్తకాన్ని అప్రతిష్ట పాలు గావించే విధంగా చేసిన విమర్శను ప్రచురించడం పొరపాటేనని అంగీకరించి నందువల్ల ఈ షరతు సమంజసమేననుకుంటాను. తప్పిదాన్ని అంగీకరించిన విషయంలో అటువంటిది తిరిగి జరగరాదని కోరడంలో భావ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వాతంత్ర్యం వంటి విషయాలతో వైరుధ్యానికి తావుండదుకదా.

అకాడమి కార్యదర్శి ఈ రెండు షరతులూ సంపూర్ణంగా పాటింపబడతాయనే నిశ్చితమైన హామీ ఇచ్చినందువల్ల ఈ విషయంలో సంతృప్తికరమైన పరిష్కారమే లభించింది అనుకున్నాను; కానీ అలా అనుకోవడం తప్పని త్వరగానే తెలుసుకున్నాను.

అకాడమిలోని ఓ చిల్లర ముఠా వార్తా పత్రికలలో నాపై బురదజల్లే ప్రచార కార్యక్రమాన్ని పకడ్బందీగా రూపొందించారనే విషయం నిస్సందేహం. ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక అదనపు

సంపాదకీయం రూపంలో నాపై ఓ సవాలు విసిరింది : "రచయితే దాని మంచి చెడుల నిర్ణీత కాగలడా?" ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఈ రచయితే ఇంతకు ముందు ఇలా ప్రస్తావించడం జరిగింది : "అది (విమర్శ) మరో చోట ఎక్కడైనా ప్రచురించబడితే తమకు అభ్యంతరం ఉండేది కాదని ఆయన (నార్ల) అన్నారు." అకాడమి పత్రికలో గాక మరెక్కడైనా నాపై విమర్శకు నేను సిద్ధమేననే నా అభిప్రాయం ఆయనకు తెలిసినప్పుడు రచయితే మంచి చెడుల నిర్ణేత అయ్యే ప్రశ్న ఎక్కడ ఉత్పన్నమవుతుంది?

ఇటీవలే అది అకాడమి అధ్యక్షుని దృష్టికి వచ్చింది. ఆయన కార్యదర్శికి ఒక రహస్య పూర్వక జాబు రాయడం జరిగింది. ఆ జాబులో ఆయనకు ఆ "ఘోర అనౌచిత్యాన్ని అంగీకరించడం కంటే మార్గాంతరం లేదు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే" అకాడమి ఆ గ్రంథానికి పురస్కారాన్నిచ్చి గౌరవించిన సందర్భంగా దానిని గర్హిస్తూ చేసిన విమర్శను అకాడమి పత్రికలోనే ప్రచురించడం ఒక గొప్ప అనౌచిత్యానికి దారితీసింది. దాని ఫలితంగా రచయితకు తీరని అన్యాయం జరిగింది. కానీ...". ఆ "కానీ" అంతకు ముందు సంభవించిన "ఘోర అనౌచిత్యం కొనసాగింపుకు అవకాశం కలుగజేసింది. ఈ విషయంపై చర్చకు అకాడమి పత్రిక తలుపులు తెరిచింది. అధ్యక్షులవారు తమ అభిప్రాయాల సమర్థనకు పాపం వోల్టేర్గాగారి సమాధిని ఆశ్రయించవలసి వచ్చింది. వోల్టేర్ చెప్పింది అధ్యక్షుల వారికి తెలిసిన మాత్రం నాకు తెలియక పోలేదు : "నీవు చెప్పిన దానితో నేను ఏకీభవించను కాని నీవు అలా చెప్పేందుకు నీకున్న హక్కును కాపాడేందుకు నేను తుది వరకు పోరాడతాను". ఒక ఘోర అనౌచిత్యాన్ని తిరిగి ప్రదర్శించే హక్కు కోసం తుది వరకు పోరాడతాననేది వోల్టేర్ ఉద్దేశ్యం కానే కాదు.

ఇంకా వివరాల్లోకి వెళ్ళకుండా నేను చెప్పదల్చుకున్నదిదే; మొదటి నుండి చివరి వరకు ఇది ఒక బాధాకరమైన వృత్తాంతం. ఇంతకూ అకాడమి నన్ను గౌరవించదలిచిందా; గర్హించ దలిచిందా? జవహర్లాల్ నెహ్రూ, రాధాకృష్ణన్, సునీతికుమార్ చటర్జీగార్లు అకాడమికి అధ్యక్షులుగా ఉన్న కాలంలో అకాడమితో నాకు క్రియాశీల సంబంధాలుండేవి. నాకు గుర్తున్నంత వరకు ఎన్నడూ ఏ పురస్కార గ్రహీతనూ అకాడమి తన పత్రిక ద్వారా అపనిందలకు గురిచేయలేదు. అకాడమి నాపట్ల ప్రవర్తించిన తీరుకు పురస్కారాన్ని తిరస్కరించడం మినహా మరో మార్గం లేదంటున్న నాతో స్వాభిమానం గల రచయితలందరూ తప్పక ఏకీభవిస్తారు.

- నార్ల వెంకటేశ్వరరావు

(1-4 అనుబంధాల అనువాదకులు- రావెల సాంబశివరావు).

నార్ల రాసుకున్న ఎలిజీలు

– రావి రంగారావు



చనిపోయిన వాళ్ల మీద కవులు రాసే గేయాల్ని 'స్మృతి గేయాలు' అంటారు. ఒక కవి తాను బ్రతికి ఉన్నప్పుడే చనిపోయాక తనను గురించి నలుగురూ ఏమంటారో భావించుకుని తన మీదే రాసుకున్న గేయాన్ని 'స్వీయ స్మృతి గేయం' అనవచ్చు ననుకుంటాను.

ప్రముఖుడు మొదలైన విశేషణాలు నార్లకు తగిలించాల్సిన అవసరం లేదు. ఈ రోజుల్లో పత్రికల్లో పడుతున్న ప్రతివాడి పేరు ముందు ప్రముఖుడు అనే మాట కనిపిస్తూనే ఉంది. నార్ల అంటే చాలు సహృదయులందరికీ తృప్తితో కూడిన అనుభూతి.

నార్లకు లోకం బాగా తెలుసు. ఆయన కళ్ళ ముందు ఎందరో ప్రముఖులు, మేధావులు, దేశ భక్తులు, మహాకవులు వెళ్ళిపోయారు. వాళ్ళు మరణించిన సందర్భాల్లో ఎందరివో దొంగ ఏడ్పులు, ఆ ఏడ్పుల వెనుక స్వార్థం కోసం పడే తిప్పలు చూశారాయన. "జగన్నాటకం" అనే కవితా సంపుటిలో ఆయన ఏనాడో రాసుకున్న అద్భుతమైన గేయం "నే మరణిస్తే" గేయం ఇలా మొదలవుతుంది.

"నే మరణిస్తే– రాస్తాయండీ రాస్తాయి– కొన్ని పత్రికలైనా
ప్రముఖుం డొక్కడు– పర లోకానికి– పయనించాడని..."

గొప్పవాళ్ళ ఆదర్శాలు, లక్షణాలు ఎవరికీ అవసరం లేదు. కాని ఆ గొప్పవాళ్ళు చనిపోయిన రోజు మాత్రం పత్రికలు, ప్రచార సాధనాలు వాళ్ళ కృషిని గురించి వేనోళ్ళ పొగడుతాయి. బ్రతికున్నప్పుడు ఆయనను కొన్ని పత్రికలు ఎలా నిందించాయో పాఠకులకు బాగా తెలుసు. ఈ సంగతులన్నీ ఆయన ఏనాడో ఊహించగలిగాడు గనుక ఇలా రాసుకోగలిగాడు.

"నే మరణిస్తే – అంటారండీ! అంటారు
నేడు–తెలుగు జాతికే–తీరని నష్టం–వాటిల్లిందని
నోటి మాటగా..."

ఆయన మొగమాటం లేని మనిషి. ఆయన చెప్పే చేదు నిజాలను కొందరు వంట బట్టించు కోకుండా వ్యక్తిగతంగా తట్టిన వాళ్ళున్నారు. రకరకాల పదవుల్లో పలుకుతూ స్వార్థానికి అంకితమై బురద చల్లిన వాళ్ళంతా నోటి మాటగా సంతాప సందేశాలిస్తారని ఊహించాడు.

"నే మరణిస్తే చేస్తారండి చేస్తారు పెక్కు
ఆంధ్ర సభల నా–ఆత్మ శాంతికై
తడయక తెగ బారెడు తీర్మానం..."

మన దేశంలోని కొందరు కుహనా సాహితీ వేత్తలకు కొన్ని 'టెక్నిక్'లు తెలుసు. చనిపోయిన వాళ్ళు ఆదర్శాలు, విలువలు, నైపుణ్యాల గురించి ఏమాత్రం తెలియక పోయినా పత్రికల్లో తమ పేర్లు చూసుకునే కండూతితో పెద్ద పెద్ద సంతాప తీర్మానాలు చేసి పంపుతుంటారు. ఆ చనిపోయిన వాళ్ళు ఎందుకు గొప్ప వాళ్ళయ్యారో తెలుసుకోవడానికి తమ జన్మలో ప్రయత్నించి ఉండరు. ప్రయత్నించరు కూడా. అది వాళ్ళకు అవసరం కూడా. అలాంటి వాళ్ళను అసహ్యించుకుంటాడు నార్ల.

"నే మరణిస్తే వస్తాయి సుమా!
వస్తాయి కొన్ని ప్రకటనలైనా
ప్రజా కోటి నా స్మారక చిహ్నం
స్థాపించాలని... "

గొప్పవాళ్ళ పేర్లు అడ్డం పెట్టుకుని చందాలు వసూలు చేసి స్వాహా చేయడం చాలా మందికి వెన్నతో పెట్టిన విద్య. శ్రీశ్రీ చనిపోయిన తరువాత ఆ పేరుతో ఎందరో ఎన్ని రకాలుగానో డబ్బు వసూలు చేస్తున్నారు.

"నే మరణిస్తే రాను, నిజంగా
రాను సోదెలో కైనా గిర్రున
అయిదారు నెలలు తిరగక ముందే
తెలుగు గడ్డపై..."

చనిపోయిన వాళ్ళ కోసం కొత్తలో నానా రకాలుగా ఆర్భాటం చేస్తారు. తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేరితే చాలు, అప్పటికి ఆ మహానుభావుడు చనిపోయి అయిదారు నెలలు కూడా గడవక ముందే ఆయనను మరచి పోతారు. అటు తరువాత సోదిలోకి కూడా రానివ్వరు.

ఏది ఏమైనా ఒక విలువైన సత్యం ఒకటుంది. దాన్ని ఆయన మరచి పోలేదు. అందుకే ఈ విధంగా ఆ గేయాన్ని ముగించాడు.

"నే మరణిస్తే ఏ నా ఫొటో
ఏ యెదలోనో చక్కని చీకటి
చీల్చగ పెట్టిన దీపము మాత్రమే
దీటుగ నిలుచును నే మరణిస్తే"

ఎవరెన్ని రకాలుగా వేషాలు వేసినా సహృదయులనే వాళ్ళు కొందరున్నారు. వాళ్ళు వెలుతురు మనుషులు. చీకట్లకు బలిగాకుండా తమ హృదయద్వారాల చెంత నార్లవారి సందేశాల్ని కాపలా దీపాలుగా రక్షించుకుంటారనే ఆత్మ విశ్వాసం గేయానికి విలువైన ముగింపు.

తాను చనిపోతే ఈ లోకం ఎలా ప్రవర్తిస్తుందనే అంశం మీద గేయం రాయటం సాహసం. రాసేటప్పుడు ముక్కు సూటిగా ఈ లోకాన్ని విమర్శించడం మహా సాహసం. ఆయన మూర్తి మత్వాన్ని తెలియజేసే "బ్లూ ప్రింట్" ఈ గేయం.

– *'ఆంధ్రప్రభ' దినపత్రిక సౌజన్యంతో*

డాక్టర్ రావి రంగారావు. *మినీ కవితా రంగంలో నిత్యపథికుడు. గుంటూరు జిల్లా, అనంతవరప్పాడు వీరి స్వస్థలం. ఒకప్పటి భావకవితా రాజధాని మచిలీపట్నం ఉద్యోగ స్థలం. ఆంధ్ర జాతీయ అధ్యాపన కళాశాల ప్రధానాచార్యులుగా వారు సంపాదించినది తరగని శిష్య సంపద. మినీ కవిత్వ ఉద్యమ సారధి. కొంత సేపు నాతో గడిపితే మన కవిత్వం రాయిస్తాను" అనే ఆత్మవిశ్వాసం వారి సొత్తు. ముఖం పుల్ల, అగ్గిపెట్టె, కుంకుడు కాయ ప్రసిద్ధ మిని కవితా సంకలనాలు.*

అహం

"అహము" కొంత వలయు ఇహములో జీవింప
"అహము"లోనె జీవమహిమ కలదు:
"అహము" పెంచుకొనుటె అధమాధమమ్మురా!
నవయుగాల బాట నార్ల మాట

"అహము" లేనివాడు మహిలోనె లేడోయి;
"అహము" దాచు నొకడు యశము గోరి;
"అహము" జూప డొకడు అవకాశములు లేక

అవగుణమ్ములైన అలరించు నొకనిలో,
గణన కెక్క డొకడు గుణము గల్గి :
మనిషి విలువ గొల్చు మానదండము లేదు
పంచకావ్య పఠన పాండిత్య మది యెంత?
వేదపఠన గూర్చు విజ్ఞ తెంత?
స్మృతులపఠన గూర్చు జిజ్ఞాస యెంతరా?

రాజ్యసభ సభ్యుడుగా నార్ల

– ఎన్. ఇన్నయ్య





1958 నుండి 1972 వరకూ రెండు సార్లు రాజ్యసభ సభ్యులుగా వి. ఆర్. నార్ల ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు పార్టీ ఆయనను తమ పక్షాన సభ్యుడిగా ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు బెజవాడ గోపాలరెడ్డి, ఎన్.జి. రంగా వ్యతిరేకించారనీ, నీలం సంజీవరెడ్డి అనుకూలత చూపారని రికార్డు చెబుతున్నది. ఇలా తన పేరును వ్యతిరేకించిన దృష్ట్యా ఎన్.జి. రంగాను కొన్నాళ్ళ పాటు నార్ల కావాలని సాధించిన ఘట్టం కూడా ఉన్నది. రంగాకు తల్లి దండ్రులు పెట్టిన పేరు రంగనాయకులు కనుక ఆంధ్రప్రభలో గోగినేని రంగనాయకులు అని కొన్నాళ్ళపాటు వాడారు. రంగా, ఆయన అనుచరులు కూడా ఆ పేరే వాడినంత కాలం కుళ్ళి, కుళ్ళి వాపోయారు. ఆ పేరు తొలగించ వలసిందిగా రామనాథ గోయంకాకు విజ్ఞప్తి చేసుకున్నారు. ఇలా కొంతకాలం ప్రయోగించిన తరువాత మళ్ళీ ఎన్.జి. రంగా అని వాడగా ప్రశాంతత ఏర్పడింది. 1955 లోనే నార్లను కాంగ్రెస్ పార్టీ పక్షాన శాసనసభకు పోటీ చేయవలసిందిగా ఒక ప్రతిపాదన వచ్చింది. దానికి ఆయన అంగీకరించలేదు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన తరువాత నార్ల ఎడిటర్ గా ఉంటూనే ఢిల్లీ వెళ్లి వస్తూండేవారు. తనకు ఇష్టమైన విషయంపై

ఆయన సభలో చర్చలలో పాల్గొన్నారు. అవి పరిమితంగానే ఉన్నవి. అందులో కొన్ని ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

1960 డిసెంబరు 16న రాజ్యసభలో హిందీలోనూ, భారతీయ భాషల్లోనూ అనువాదాల నిమిత్తం నిపుణుల సంఘం వేయాలనే ప్రతిపాదనపై నార్ల చర్చలో పాల్గొన్నారు. అనువాదం అంటే యాంత్రికంగా జరిగే రీతి కాదనీ, మూలం అవగాహన చేసుకుని, మళ్ళీ సృష్టించటం జరగాలనీ నార్ల చెప్పారు. కనుక అనువాద కార్యాన్ని సృజనాత్మక రచయితలకు అప్పగించాలనీ సూచించారు. జపాన్ వలె అభివృద్ధి చెందడానికి వీలుగా ఇండియా కూడా వైజ్ఞానిక పదజాలాన్ని అంతర్జాతీయ ప్రయోగాలు జరుగుతున్న తీరులో యథాతథంగా స్వీకరించాలని చెప్పారు. స్పుత్నిక్ అనే పదం ప్రపంచ వ్యాప్తంగా అంతా స్వీకరించిన తీరును గుర్తు చేస్తూ, ఈజిప్టు కూడా అరబిక్ భాషలతో పాటు అంతర్జాతీయ పద ప్రయోగాన్ని అనుసరిస్తున్నదన్నారు. ప్రజలు కొన్ని సందర్భాలలో అవసరాన్ని బట్టి పదాలను సృష్టిస్తారనీ, విశాఖపట్నం ఓడరేవు త్రవ్వే పరికరాన్ని త్రవ్వోడ అని పనిచేసే కూలీలు వాడి, ఆ పదాన్ని అందరికీ అర్ధమయ్యేటట్లు చేశారనీ చెప్పారు. తెలుగులో రెవెన్యూ పదాలు 90 శాతం ఉర్దూ భాష నుండి వాడుకలోకి తెచ్చుకున్న సందర్భాలను కూడా ఆయన సోదాహరణగా వివరించారు.

బెరూబారి యూనియన్ ప్రాంతాన్ని పాకిస్తాన్‌కు బదిలీ చేసే విషయం చర్చకు రాగా 1960 డిసెంబరు 23న వి.ఆర్. నార్ల పాల్గొంటూ కమ్యూనిస్టులను, ముఖ్యంగా జ్యోతిబసును తీవ్రమైన పదజాలంతో ఖండించారు. నెహ్రూపై కమ్యూనిస్టుల దాడిని ఆయన త్రిప్పికొడుతూ, నెహ్రూ వ్యక్తిత్వాన్ని, గొప్పతనాన్ని సభలో చాటిచెప్పారు. ఉత్తర సరిహద్దులలో చైనాతో ఇండియాకు గల ప్రమాదాన్ని ప్రస్తావించారు. కమ్యూనిస్టులు ప్రజలను హిస్టీరియాలో పెట్టే ధోరణి అవలంభించటాన్ని నార్ల ఖండించారు. ఒకే పార్టీ, ఒకే నాయకుడు ఉండటం ప్రజాస్వామ్య పద్ధతి కాదంటూ, అదే సమయంలో నెహ్రూవంటి నాయకుడు నిర్వహించిన పాత్రను గుర్తించాలన్నారు.

సాలార్జంగ్ మ్యూజియాన్ని గురించి మాట్లాడుతూ వి.ఆర్. నార్ల (1960 డిసెంబరు 15) ప్రపంచ వ్యాప్తంగా 100 మ్యూజియంలు క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత సాలార్జంగ్ మ్యూజియంలో 60‘శాతం వరకూ ఉన్న వస్తువులు చెత్తచెదారంగా ఆయన చిత్రీకరించారు. వాటిని తొలగిస్తే మ్యూజియంకు విలువ ఉంటుందన్నారు. ఈ చెత్త వలన విలువైన వస్తువులకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు.

నాగార్జున కొండపై బౌద్ధ కళాఖండాలను నిక్షిప్తం చేయాలనే ప్రతిపాదనను నార్ల సమర్ధిస్తూ, వాటిని సాలార్జంగ్ మ్యూజియంకు తరలించాలనే ప్రతిపాదనను వ్యతిరేకించారు. హైదరాబాదులోని స్టేట్ మ్యూజియంలోని వస్తువులు కొన్ని సాలార్జంగ్ మ్యూజియంకు పంపించాలనీ, మరికొన్ని వస్తువులు కొనాలనీ, అప్పుడే సాలార్డింగ్ మ్యూజియంకు విలువ లభిస్తుందనీ చెప్పారు. సాలార్జంగ్ కు జోహార్లు

అర్పించటంలో తను వెనుకాడ బోవటం లేదని నార్ల చెబుతూ, మ్యూజియం ఉన్న స్థితి పట్ల తాను నిరుత్సాహపడినట్లు పేర్కొన్నారు.

'భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమ చరిత్ర'ను గురించి వి. ఆర్. నార్ల 1961 మే 5 న రాజ్యసభలో ప్రసంగించారు. చరిత్రలో ఉన్నత, అథమ దశలుంటాయనీ, ఇండియాలో 18వ శతాబ్దం అథమ దశకు చెందినదనీ, అందుకు సిగ్గుపడాల్సిందేమీ లేదనీ చెప్పారు. కొద్దిమంది వర్తకులు సైనిక శిక్షణ కూడా లేకుండా ఇండియాను జయించగలిగారన్నారు. అలాంటి విషయాలన్నీ ఈ చరిత్ర ప్రస్తావించినదనీ, అందువలన ఆ గ్రంథం విమర్శకు గురి కారాదనీ అన్నారు. అక్కడక్కడా కొన్ని లోపాలున్నప్పటికీ, డాక్టర్ తారాచంద్ రాసిన ఈ గ్రంథాన్ని అభినందించక తప్పదనీ నార్ల పేర్కొన్నారు. కొసాంబీ రాసిన భారత చరిత్రకు ఉపోద్ఘాతాన్ని కూడా నిష్పాక్షికమైనదిగా ఆయన ప్రస్తావించారు. వాస్తవాలను గ్రహించాలనీ, భవిష్యత్తుపై దృష్టి పెట్టాలనీ నార్ల నొక్కి చెప్పారు. ప్రొఫెసర్ హుమాయున్ కబీర్ గ్రంథపీఠికలో రాస్తూ తారాచంద్ రాసిన విషయాలకు ప్రభుత్వం బాధ్యత వహించడం లేదని చెప్పడాన్ని కూడా ఆయన విమర్శించారు. చరిత్రను పరిశీలించటంలో మార్క్సిస్టు దృక్పథాన్ని అన్వయించడం తప్పుకాదని, హెరాల్డ్ జె. లాస్కీ కూడా ఈ పద్ధతిని అవలంభించారని నార్ల తారాచందు సమర్థించారు.

పనిచేస్తున్న జర్నలిస్టుల విషయమై వి.ఆర్. నార్ల 1962 డిసెంబరు 11న రాజ్యసభలో మాట్లాడారు. పత్రికలను జాతీయం చేయరాదనీ నియంతృత్వ రాజ్యాలలో తప్ప ఈ పద్ధతి ప్రజాస్వామ్యానికి పనికిరాదనీ ఆయన నొక్కి చెప్పారు. పత్రికారంగంలో రోజురోజుకూ బలపడుతున్న గుత్తాధిపత్యాన్ని కూడా నార్ల ప్రస్తావించి, ఉద్యోగావకాశాలు ఎక్కువగా లభిస్తేనే వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ లభిస్తుందన్నారు పెద్ద పత్రికలలో సమ్మె జరిగినప్పటికీ జర్నలిస్టులు అట్టేకాలం సమ్మెను కొనసాగించలేకపోతున్నారనీ, వారికి మార్గాంతరాలు లేకపోవటమే ఇందుకు కారణమనీ చెప్పారు. చిన్న పత్రికలకు రక్షణ కల్పించే సూచనలు, ప్రకటనల రేట్లు నిర్ణయించటం మొదలైనవి ఆయన తెలియపర్చారు. ప్రభుత్వం రోటరీ మిషన్ల వంటివి చిన్న పత్రికలకు వాయిదా పద్ధతిపై సరఫరా చేయాలన్నారు.

భారత రక్షణ బిల్లుపై జరిగిన చర్చలో వి. ఆర్. నార్ల సుదీర్ఘ ప్రసంగం చేస్తూ, 1962 డిసెంబరు 6న రాజ్యసభలో ప్రసంగించారు. చైనా ఒకవైపున అలీన విధానాన్ని చెబుతూనే పంచశీల సూత్రాన్ని ఉల్లంఘించిన విషయమై నార్ల చైనాను ఖండించారు. కమ్యూనిస్టు పార్టీలు 47 ఉన్నాయనీ, ప్రపంచంలో 13 కమ్యూనిస్టు ప్రభుత్వాలున్నాయనీ, అవేవీ చేయని దురాక్రమణను చైనా ఇండియాపై జరిపిందనీ ఆయన తెలిపారు. సన్ ఎట్ సెన్, చాంగ్ కై షేక్ రాజ్యాధినేతలుగా ఉన్నప్పుడు కూడా చైనా సరిహద్దులు దక్షిణ ఆసియాలో ఉన్నట్లు పేర్కొన్నారని జ్ఞాపకం చేశారు. ఇంగ్లాండు కామన్వెల్త్ దేశాలు, అమెరికా మనకు చేసిన సహాయాన్ని కృతజ్ఞతతో స్వీకరించినా, వాటి సంరక్షణను మనం అంగీకరించరాదని హెచ్చరించారు. రక్షణకు సంబంధించిన అనేక విషయాలు తొందరపడి ఇండియా బయట పెడుతున్నదనీ, ఈ విషయంలో

జాగ్రత్త అవసరమనీ ఆయన సూచించారు. చైనా తన గూఢచారి చర్యలతో, ఏజెంట్లతో సమాచారాన్ని సేకరిస్తుండగా, అలాంటివారికి మనం ఇవ్వగూడని సమాచారాన్ని ఇస్తున్నామని అన్నారు. ప్రభుత్వం చేపట్టే తీవ్ర అధికారాలను విచక్షణతో వినియోగించాలని నార్ల కోరారు.

దక్షిణభారత హిందీ ప్రచార సభను గురించి 1963 ఆగస్టు 29న వి.ఆర్. నార్ల రాజ్యసభలో ప్రసంగించారు. గాంధీజీ తన కుమారుడు దేవదాసును హిందీ ప్రచారకుడిగా చెన్నయ్ పంపిన విషయాన్ని నార్ల ప్రస్తావించి, క్రమేణా హిందీని నిర్బంధం చేయుట ద్వారా దక్షిణాదిలో ఈ సభ ప్రాధాన్యం, ఆర్థిక వనరులు తగ్గిపోతాయని హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీని దక్షిణాది హిందీ యూనివర్సిటీగా మార్చడాన్ని కూడా ఆయన వ్యతిరేకిస్తూ, హిందీ ప్రచారసభ ఈ కార్యక్రమాన్ని చేపట్టవచ్చునన్నారు. హిందీని అభివృద్ధి చేయటంలో దక్షిణాదిలోని వారి సహకారాన్ని స్వీకరించాలని కూడా ఆయన పేర్కొన్నారు. హిందీపట్ల హిందీ మాట్లాడని వారిలో గల మానసిక వ్యతిరేకతను తొలగించడానికి గాను హిందీ అనే పదం బదులు భారతి అని పదప్రయోగం చేయాలన్నారు. హిందూస్థానీ అనే పదాన్ని వాడాలని గాంధీజీ సూచించినప్పుడు హిందీవాదులు వ్యతిరేకతను వ్యక్తపర్చటం నార్ల గుర్తుచేశారు.

అధికార భాషను గురించి 1967 డిసెంబరు 21న నార్ల సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఇంగ్లీషు భాష మనలో స్వేచ్ఛా పిపాసను రేకెత్తించడానికి తోడ్పడినట్లు చెబుతూ నార్ల ఇంగ్లీషు భాషను ఖండించే వారు భారతీయ పునర్వికాస చరిత్రను పరిశీలించాలని కోరారు. హిందీ మాట్లాడేవారిలో కొద్దిమంది అసహనంతో, ఛాందసంతో ఉంటూ ద్వేషానికి గురవుతున్నారని చెప్పారు. ఇంగ్లీషు విదేశీ భాష అనేమాట నిజమే గాని, దక్షిణాదిలో హిందీ కూడా విదేశీ భాషేననే విషయం మర్చిపోరాదనీ, హిందీ వారికది మాతృభాషయితే, దక్షిణాది వారది కష్టపడి నేర్చుకోవాలనీ చెప్పారు. అయినప్పటికీ వారు హిందీ నేర్చుకోడానికి సిద్ధంగా ఉన్నారనీ, కొంత వ్యవధి వారికివ్వాలనీ, హిందీనివారు తక్షణమే నేర్చుకోవాలన్నప్పుడే ఇబ్బంది వస్తున్నదనీ చెప్పారు. హిందీ భాష భారతీయ భాషలలో అంతగా పరిణతి చెందని పిన్న వయస్కురాలనీ గుర్తించాలి. హిందీతో పోల్చితే తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం ప్రాచీన భాషలని అన్నారు.

హిందీ నేడున్న రీతిలో 100 సంవత్సరాల ప్రాయం గల భాష మాత్రమే. హిందీ ప్రాంతంలో ప్రజ భాష, బుందేలీ, మార్వాడీ, మేవాడీ, జైపురి, మాల్వీ, అవధీ, భగేలి, చెత్తిస్ గర్హి, మైథిలీ, భోజ్పురి, మగధి, ఖడీబోలి మొదలైవన్నీ ప్రాంతీయ భాషలు. ఇందులో ఖడీబోలి అనేభాష 100 సంవత్సరాలుగా ప్రాధాన్యతను సంతరించుకున్నది. కనుక ఇది ఎంతో పెంపొందించవలసి ఉన్నది. దీనికి అంతర్జాతీయ స్థాయి రావడానికి చాలా కృషి జరుగవలసి ఉన్నదని నార్ల చెప్పారు. హిందీ నేర్చుకోవడమే దేశభక్తి, జాతీయవాదం అనీ, నేర్చుకోకపోతే జాతి వ్యతిరేకత అనీ హిందీ ఛాందసులు వాదించటాన్ని నార్ల ఖండించారు. రాజాజీ, అన్నాదొరై హిందీని వ్యతిరేకించినా, వారు దేశభక్తులు, జాతీయవాదులు కాకుండా పోలేదన్నారు. హిందీ నేర్చుకోవడానికి వ్యవధి, అవకాశం ఉండాలనీ, హిందీ భాషాభివృద్ధిలో దక్షిణాదివారికి అవకాశం

ఉండాలనీ చెప్పారు. హిందీ నుండి అనేక పదాలు ఇంగ్లీషు స్వీకరిస్తుండగా, హిందీ ఛాందసులు ఒక్క ఇంగ్లీషు పదం కూడా రాగూడదనే ధోరణిని అవలంభిస్తు న్నారని ఆయన చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను అణచడానికి తెచ్చిన బిల్లును గురించి 1968 ఆగస్టు 22 న వి.ఆర్. నార్ల రాజ్యసభలో సావధాన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

అప్పుడు కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. పత్రికాస్వేచ్ఛను అణచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును తెచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. బ్రిటిష్ పాలకులనాటి పత్రికా నియమాలు, నైజాం కాలంలో పత్రికలపై ఆంక్షలు కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన బిల్లుకు సరితూగవని ఆయన చెప్పారు. అంతేకాక బలమైన ప్రతిపక్షం నా మహద్భాగ్యం. పత్రికా స్వేచ్ఛను కూకటివ్రేళ్ళతో తొలగించే ఈ బిల్లు విషయమై 'హిందూ' పత్రిక చేసిన వ్యాఖ్యను కూడా నార్ల సభకు వినిపించారు. పత్రికలపై ప్రభుత్వం విధించే ఆంక్షలు ఒకసారి ప్రారంభమైతే, ఎక్కడ అంతమవుతాయో తెలియదన్నారు. ప్రకటించబోయే విషయాలను ప్రభుత్వం పరిశీలిస్తామనటం కేవలం ముందుగా సెన్సార్ చేయటమేనని ఆయన అన్నారు.

– వి.ఆర్. నార్ల జీవితం–అనుభవాలు, అనే గ్రంథం (1987) నుంచి పునర్ముద్రితం.

అనుబంధం:

రాజ్యసభలో నార్ల

మన రాజ్యాంగచట్టం వివిధ దేశాల రాజ్యాంగాల కలగాపులగం.

మన దేశంలో లోక్ సభ, రాజ్యసభ బ్రిటన్ లోని కామన్స్ సభ, ప్రభువుల సభ ననుసరించి ఏర్పడ్డాయి. అక్కడ పరంపరగా వచ్చే రాజుకు ప్రత్యామ్నాయంగా మనకు ప్రెసిడెంటు ఏర్పడ్డాడు. అక్కడ ముఖ్యమంత్రే ఇక్కడ ప్రధానమంత్రి.

వారికి లిఖిత రాజ్యాంగ చట్టం లేదు. మనదేశంలో గొప్పగొప్ప న్యాయవాదులంతా చేరి ఒక రాజ్యాంగ చట్టాన్ని చేశారు. అయినా ఈ చట్టం ఎన్నో సార్లు సవరింపబడుతూ వస్తున్నది. అక్కడ వారు బలవంతమైన ప్రతిపక్షాన్ని కోరతారు. ప్రతిపక్ష నాయకునకు ప్రధానికున్న గౌరవం, జీతం కూడా ఉన్నది. మనదేశంలో ప్రతిపక్షంలోనివారిని ప్రభుత్వపక్షంలో చేర్చుకోవడం, వారికి తగినంత గౌరవం చూపకపోవడం అందరకు తెలిసిందే.

బ్రిటనులోని ఓటర్లు ఎలక్షను సమయానికి ఎక్కడ ఉన్నా వేలు ఖర్చు పెట్టుకొని ఓటివ్వడానికి వస్తారు. మనదేశంలో ఓటర్లు మొగమాటాలకు, స్వప్రయోజనాలకు అమ్ముడుపోతారు. 'A nation gets the Government what it deserves' ప్రతి జాతి తన స్థాయికి తగినట్టే ప్రభుత్వాన్ని పొందుతుంది. అక్కడ పిలుపు మన ఓటర్లను (మాస్టర్లను) విద్యావంతులను చెయ్యమనే. మనదేశంలో ఓటర్లను విద్యావంతులుగా చేయడంకాక ఆత్మస్తుతి పరనింద.

నేడు పూర్వంవలె గొప్ప పార్లమెంటేరియన్లు తక్కువయ్యారు. స్వార్థపరులు ఎక్కువయ్యారు. దానికి తగినట్టు ఈ పాతికేండ్లలోను చెప్పుకోతగ్గ ప్రతిపక్షం ఏర్పడలేదు.


నార్లవారు 1958 లోను తిరిగి 1964 లోను రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికై మొత్తం పది సంవత్సరాలపాటు సభ్యులుగా ఉన్నారు.

ఆంధ్రజ్యోతి కొత్తగా ఆరంభింపబడుటవల్ల పత్రిక సంబంధించిన పనుల ఒత్తిడి మూలంగాను, అనారోగ్య కారణాల వల్ల ఆ సభాకార్యక్రమాలలో క్రమం తప్పక పాల్గొనే అవకాశం లేకపోయింది. ఢిల్లీలో ఉండగానే ఆయన కాంగ్రెసు పార్టీ "విప్పు" జబ్బుపడి ఆస్పత్రిలో చేరారు. ఈయన కొచ్చిన జబ్బు హృద్రోగం. ఆయనతో అనగా 'విప్పు'తో ఫలాన విషయం మాట్లాడతానంటె మీరు హృద్రోగులు, మాట్లాడరాదు' అని మిత్రులుగా అంటూ ఉండేవారు. ఈ కారణాలన్నింటి వల్ల ఆయన మాట్లాడింది పది పన్నెండు సార్లు అయినప్పటికి ఆయన ప్రసంగాలు సభ్యులకు ఆకర్షించేవిగాను, హృదయస్పర్శ గాను ఉండేవి.

హైదరాబాదులోని సాలార్జంగ్ మ్యూజియంను జాతీయ మ్యూజియంగా మార్చి ఆధునిక పద్ధతుల మీద నూతన భవనాలను నిర్మించడానికి కేంద్రప్రభుత్వంవారు బిల్లును తేవడానికి మ్యూజియం ఎలా ఉండాలని సాలార్జంగ్ మ్యూజియం జాతీయ మ్యూజియం కాదని వాకొన్నారు. దాని సారాంశం.

"మ్యూజియం" లు చిత్రవస్తు ప్రదర్శనశాలలుగా మాత్రమే ఉండి సామాన్య జనుల దిదృక్షను తీర్చి నేత్రపర్వంగాను, విచిత్ర వస్తుశాలలుగా మాత్రంగానే ఉండరాదని, వాటి ప్రయోజనం అంతకంటె విశాలతరమైనదని చరిత్ర పరిశోధనకు, విద్యాబోధనకు పనికివచ్చే లాగ, యుగవిభజనతో, కాల క్రమాన్ని అనుసరిస్తూ, మొహంజాదారో, హరప్పా, నాగరికతలనుండి నేటి వరకు జరిగిన చారిత్రక, సాంఘిక పరిణామాలను తెలియపరచే అమూల్య చారిత్రక సూచికలుగా ఉండవలెనని రాశారు.







कूबड़ वाले बैल की मुहर





అశోకుని కాలం, గుప్తయుగం, హిందూ రాజుల నాడు వచ్చిన మార్పు, తరువాత ఆఫ్ఘనులు, మొగలులు, మహారాష్ట్రులు, బ్రిటీషువారు. ఈ విధంగా వారివారి కాలంలో జరిగిన మార్పులకు, చేర్పులకు గల భేదాలను అవి అలవోకగా ప్రతిబంబించాలని రాశారు. ఆ బిల్లు లోక్ సభలో చర్చకు వచ్చినప్పుడు దీనిలో ప్రధాన విషయాలను శ్రోతలకు వినిపించారు. వీరు రాసిన కొన్ని భాగాలను లోక్ సభలో సభ్యులైన రాజగోపాలాచారి గారి కుమారుడు నరసింహన్ గారు కొన్నింటిని ఉటంకించారు.

ఒక పర్యాయం లోక్ సభలో తారాచంద్ గారు రాసిన "భారత దేశంలో స్వాతంత్ర్యోద్యమ చరిత్ర"ను గూర్చిన చర్చ వచ్చింది. ఆ చర్చ సందర్భంలో నార్లవారిచ్చిన ఉపన్యాసం ప్రొఫెసర్ హుమాయున్ కబీరుగారి ప్రశంసల నందుకున్నది.

మరొకసారి లోక్ సభలో భాషా సమస్యపై జరిగిన చర్చలో వీరు గావించిన ప్రసంగం తీవ్ర వాదోపవాదములకు గురియై సభను రెండుగా విభజించింది. కొందరి బహుళ ప్రశంసలకు పాత్రం కాగా మరికొందరు విమర్శించారు.

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీవారు గావించిన "ప్రెస్ బిల్లుపై నార్లవారు గావించిన ప్రసంగం సభలోపల వెలుపలగూడా స్తుతిపాత్రమైనది.

ఇలా అంటారు నార్ల "బలమైన ప్రతిపక్షం, స్వతంత్రమైన న్యాయాధిపతులు, నిర్భయమైన పత్రికలు ఇవే మన ప్రజాస్వామ్యపు కంచుకోటలు. వీటిలో ఏవి లోపించినా ప్రజాస్వామ్యం విలుప్తం కాగలదు".

ఇక మన రాజ్యసభ అధ్యక్షుని గురించి ఆయన మాటలు గమనించ తగినవి.

"వైస్ ప్రెషిడెంట్ విధులలో ముఖ్యమైంది. రాజ్యసభ సమావేశాలకు అధ్యక్షత వహించడం. దీని నిర్వహణలో సయితం తనను తానే సాటిగా డాక్టర్ రాధాకృష్ణన్ రాణించారు.

నా రాజ్యసభ సభ్యత్వకాలంలో 1958 ఏప్రిల్ నుంచి 1962 ఏప్రిల్ వరకు ఆయన రాజ్యసభకు ఛైర్మన్, ఆయన అధ్యక్షస్థానంలో కూర్చుంటేనే సభామందిరానికి కళాకాంతులు వస్తుండేవి. మాన్యత, ఉదాత్తత, విజ్ఞత, వివేకం, ఘనత, గాంభీర్యం ఆయనతోపాటుగానే సభామందిరంలోకి పాదం పెట్టేవి. ఆయన కన్నెత్తి చూస్తే అదే ఆజ్ఞ. ఆయన చేతితో సంజ్ఞచేస్తే అదే ఆదేశం కంట్రోలు చేస్తున్నట్టు కనబడకుండానే ఆయన క్రమబద్ధంగా సభాకార్యక్రమాన్ని నడిపించేవారు. అయినా ఏ చర్చిలోనో, ప్రార్థనా మందిరం లోనో కానవచ్చే వాతావరణం సభామందిరంలో ఉండేది కాదు. చర్చ మధ్యలో ఛలోక్తులకు ఆయన అవకాశమిచ్చేవారు. సందర్భోచితంగా తాము కూడా కొన్ని ఛలోక్తులను విసురుతూ ఉండేవారు. సభ్యులను నవ్వించేవారు. తాము నవ్వేవారు తలవని తలంపుగా తలయెత్తిన క్లిష్ట సన్నివేశాన్ని సయితం సమయస్ఫూర్తితో ఎదుర్కొనేవారు. పెరిగిన ఉద్రేకాలను ఒక చల్లని మాటతో మెత్తని మందలింపుతో తగ్గించివేసేవారు. రాజ్యసభ నిజంగా "పెద్దల సభ"గా రూపొందింది. డాక్టరు రాధాకృష్ణన్ దానికి వరుసగా పదేళ్ళు అధ్యక్షత వహించినందువల్లనే. ఈ పదేళ్ళలో నాలుగు సంవత్సరాలపాటు దాని సమావేశాలలో పాల్గొనగలగడం నా మహద్భాగ్యం". *(గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారి నవమేధావి నార్ల 1975 నుంచి పునర్ముద్రితమైంది.) గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారి* *పరిచయం 68వ పేజీలో* *ఉంది.* .

నార్ల అక్షర మహా యజ్ఞం

– ఇనగంటి వెంకట్రావు



నార్ల సంపూర్ణ సాహిత్య సేకరణ, ప్రచురణ ఒక బృహత్తర కార్యక్రమం. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ప్రవాహ సదృశంగా సాగిన రచనా వ్యాసంగాన్ని పోగుచేసి సంపుటీకరించే కష్టతరమైన కార్యక్రమం. అలాంటి కార్యక్రమానికి పౌరోహిత్యం నెరపుతున్న డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారు 'నార్ల తొలి రచనలు' పేరుతో వెలువడుతున్న సంపుటానికి ముందుమాట రాయమని నన్ను అడిగారు. వెంకటప్పయ్యగారు ఈ మాట నన్ను అడిగినప్పుడు నాలో కలిగిన మొదటి స్పందన విస్మయం– ఆ తరువాత సంతోషం. విస్మయానికి కారణం నార్ల గారి రచనలకు ఉపక్రమణికలు లేదా పీఠికలు రాయదగిన ధైర్యస్థైర్యాలు, సాహిత్య స్థాయి నాకు ఉన్నాయా అన్న సంశయం కలగడం. మరో కారణం ఆయన విలక్షణ రచనా శైలి కాని, ఆయన జీవితాంతం గాఢంగా నమ్మి ఆచరించిన ఆదర్శాలు, నిశ్చితాభిప్రాయాలు కాని ఏవీ నాకు అలవడినవి కావు. స్వాభావికంగా సైతం ఆయనకు నాకు పోలిక లేదు. మరి ఏమిటి నా అర్హత!

ఆయన వ్యవస్థాపక సంపాదకుడిగా ఉన్న ఆంధ్రజ్యోతితో నాకు దాదాపు మూడు దశాబ్దాల అనుబంధం ఉంది. కష్ట సుఖాలలో పాలుపంచుకున్న అనుభవం ఉంది. విలేకరి స్థాయి నుంచి బ్యూరో చీఫ్ స్థాయికి, కాలమిస్టు స్థాయి నుంచి సంపాదకత్వ స్థాయికి నేను ఎదిగింది ఆంధ్రజ్యోతిలోనే! బహుశ ఈ నేపథ్యమే నన్ను నాలుగు మాటలు రాయమని వెలగావారు నన్ను అడిగేలా చేసిందని అనుకోవాలి. నార్లగారు తెలుగు పత్రికా రంగంలో తొలి మలి తరానికి వారధిలా వ్యవహరించిన మార్గదర్శక సంపాదకుడు కాగా నేను మలితరానికి చెందిన పత్రికా రచయితను. నార్ల ప్రభావం పడని దిన పత్రికలు ఆ రోజులలో తక్కువ! అలాగే పత్రికా రచయితలు కూడా! అలాంటిది ఆంధ్రజ్యోతి పైన, అందులో సుదీర్ఘకాలం పనిచేసిన అనేకులైన జర్నలిస్టుల పైన పడగల ప్రభావం గురించి వేరే చెప్పాలా? ఆయన రచనా శైలిని, వ్యవహార సరళిని ఆకళింపు చేసుకుని అనుకరించడానికి పలువురుపడిన తపన అంతింత కాదు. ఆంధ్రజ్యోతిపై ఆయన వదలి వెళ్ళిన ముద్ర అంత గాఢమైనది. సరే, ఆ రోజులు వెళ్ళిపోయాయి. ఆంధ్రజ్యోతి సుఖాలను, కష్టాలను చవిచూసింది. ఒక దశలో శాశ్వతంగా కొడిగట్టిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంది.

'తమసోమా జ్యోతిర్గమయ' అంటూ ఆంధ్రజ్యోతి ద్వారా తెలుగు వారిలో విజ్ఞాన దీపాలు వెలిగించడానికి శ్రమించిన వ్యవస్థాపకుల కలలు కల్లలు కాకుండా మళ్ళీ కొత్త రక్తం నింపుకుని సరికొత్త వెలుగులను రాష్ట్రం నలుదిశలా విరజిమ్ముతున్నది.

ఈ కష్టకాలంలోనే – కొంతకాలం క్రితం – ప్రెస్ అకాడమీ ఏర్పాటు చేసిన సంపాదకుల సమావేశంలో సందర్భవశాత్తూ నేను ఒకమాట అన్నాను. అది మారిన సంపాదకుల పాత్ర, ప్రాధాన్యతల గురించి జరుగుతున్న చర్చలో ఆంధ్రజ్యోతి గురించి వచ్చిన ప్రస్తావన సందర్భంగానే! – నార్లకోసం ఆంధ్రజ్యోతి పుట్టింది – ఆంధ్రజ్యోతి ఉంది కాబట్టి నేను సంపాదకుడిని అయ్యాను అని నేను ఆనాడు అన్నాను. ఇలా ఎందుకు అనవలసి వచ్చిందంటే – మూడు దశాబ్దాల క్రితం సంపాదకుడికి, ఈనాటి సంపాదకుడికి లంకె పెట్టి పోల్చి పోటీ పెట్టి చూడడం భావ్యం కాదనే ఉద్దేశంతోనే! ఈ మాట అనడంలో ఆత్మన్యూనత కంటే, వాస్తవ ప్రకటన పాలే ఎక్కువ అని నేను నమ్మాను. ఇప్పటికీ నమ్ముతున్నాను. తనను గురించి కాని, ఇతరులను గురించి కాని అభిమాన దురభిమానాలకు, అసూయాద్వేషాలకు అతీతంగా ఆలోచించలేని వాడు, సంఘటనలను, సమస్యలను నిష్పక్షపాతంగా విశ్లేషించి వ్యాఖ్యానించ లేనివాడు ఎప్పటికీ ప్రజలు మెచ్చిన జర్నలిస్టు కాజాలడు. నార్లగారికి సైతం ఈ విషయంలో నిశ్చితమైన అభిప్రాయం ఉంది. అంతటి ఉన్నతంగా ఆయన గురించి ఆలోచించే నాకు నార్ల సంపూర్ణ గ్రంథాల్ని తొలి సంపుటానికి ముందు మాటలు రాసే అవకాశం వచ్చిందంటే, అది విస్మయం కలిగించకుండా ఎలా ఉంటుంది? ఆనందం కలిగించ కుండా ఎందుకు ఉంటుంది? నార్ల సంపాదకత్వం వహించిన ఆంధ్రజ్యోతికి సంపాదకుడు కాగలగడమే అవకాశం, అదృష్టం అనుకుంటే అంతకంటే తీసిపోయేదేమీ కాదు ఈ తొలి సంపుటానికి పరిచయ వాక్యాలు రాసే అవకాశం, అదృష్టం కలగడం! అందుకే వెలగావారు ముందుమాట రాయమన్నప్పుడు విస్మయంతోపాటు ఆనందం కూడా కలిగిందని చెప్పడం! నార్ల వంటి మేధావి, పండితుడు, కవి, రచయిత, పత్రికా రచయిత, హేతువాది, సంస్కరణవాది గురించి రాయడం కంటే ఒక పత్రికా రచయితకు గొప్ప అవకాశం, అదృష్టం మరేముంటుంది?

నార్ల బహుముఖ ప్రజ్ఞ గురించి అందరికీ తెలుసు. నార్ల సంపాదకీయాలను గురించి ఇక చెప్పనే అవసరం లేదు. 1960కి ముందు కేవలం ఆయన సంపాదకీయాల కోసం ఆంధ్రప్రభ కొనేవాళ్ళమని చెప్పేవారు ఈనాటికీ అనేకులు ఉన్నారు. సంపాదకీయం పత్రికకు ఆత్మగా వెలిగినప్పటి రోజులవి. సంపాదకుడే అధికంగా, స్వయంగా సంపాదకీయాలు రాసిన కాలమది. అందుకే నార్ల అన్నారు – "సంపాదకునికి లేని గౌరవం అతని సంపాదకీయాలకు రాదు. విశ్వమానవ దృష్టి, శీల సంపద, ధర్మాభినివేశం లేనివాడు – ఏమైనా కావచ్చు కాని ఉత్తమశ్రేణి సంపాదకుడు కాలేడు". నిత్య సత్యమైన మాట! సంపాదకులే కాదు, పత్రికా రచయితలందరూ ఆత్మశోధన చేసుకుని ఆలోచించాల్సిన మాట.

ఉత్తమ పత్రికాసంపాదకునికి ఉండవలసిన లక్షణాలేమిటో నార్ల మూడు ముక్కల్లో క్లుప్తంగా ఖండితంగా చెప్పారు. సంపాదకుడికే కాదు, ప్రతి పత్రికా రచయితకూ ఉండవలసిన కనీస అర్హతలివి. నార్లమాట ఎంత ధాటిగా, సూటిగా ఉంటుందో, రచన అంతవాడిగా, వేడిగా ఉంటుంది. భావం, భాష రెండూ పదునైనవే. ఇది అరుదైన విషయం. సంపాదకీయానికి ఎనలేని గౌరవాన్ని, ప్రాముఖ్యాన్ని తెచ్చిపెట్టిన తెలుగు పత్రికా సంపాదకులలో అగ్రగణ్యులు నార్ల వెంకటేశ్వరరావుగారు. పత్రిక దాని యాజమాన్యం మాటున సంపాదకుడు, వార్తలు, వ్యాఖ్యల మధ్య సంపాదకీయం చిక్కుకుని విలవిలలాడుతున్న సమయంలో నార్ల తరానికి చెందిన సంపాదకులు లేదా ఆయన ముందరి తరానికి చెందిన సంపాదకులను తల్చుకుంటే, పోల్చుకుంటే వారంతా ఎంతటి మేరు సమానులో అర్థం అవుతుంది. ఒక విధంగా చూస్తే వారంతా అదృష్టవంతులేమో అని కూడా అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది. వారంతా పండితులు; ధర్మాభినివేశం వారిని పత్రికా రచనకు పురికొల్పింది; ముందుకు నడిపించింది. సంపాదకుడే యజమానిగా ఉండడమో లేక సంపాదకుడి నీడగా యాజమాన్యాలు మసలుకోవడమో ఆనాడు జరిగేది.

ఇప్పుడు దేశకాలమాన పరిస్థితులు సంపూర్ణంగా మారిపోయాయి. స్వభావాలు మారాయి, పరిసరాలు మారాయి. ఆధునిక అవసరాలకు, పరిస్థితులకు అనుగుణంగా పత్రికా నిర్వహణ పరిశ్రమస్థాయిని సంతరించుకుంది. సాంకేతికతను సమకూర్చుకుంది. వ్యాపార స్వభావాన్ని అలవరచుకుంది. ఈ మార్పు సంపాదకేతర విభాగాలకు, యాజమాన్యంలోకి మాత్రమే కాదు, సంపాదక విభాగంలోకి సైతం చొచ్చుకుపోయింది. అంటే పత్రికా నిర్వహణ యావత్తూ ఆమూలాగ్రంగా మార్గం మార్చుకుందన్నమాట. నేటి పత్రికలలో వచ్చిన పెద్ద మార్పు వార్తకు ప్రాముఖ్యం పెరగడం! వార్తకు అనుబంధంగా వచ్చే వ్యాఖ్య పట్ల మోజు హెచ్చడం! ప్రాధాన్యతలలో వచ్చిన ఈ మార్పు కారణంగా సంపాదకీయానికి వన్నె తగ్గింది. యథాలాపంగా చూసి తిరగేసే పేజీలలో ఎడిటర్ పేజీ ఒకటైంది. ఎప్పుడో కాని పాఠకుల దృష్టి దానిపై కేంద్రీకరించడం జరగదు. సంపాదకీయాలకు నా ముందు తరంలో గల ప్రాధాన్యం నా తరంలోనే తగ్గింది. ఇప్పుడు మరింత క్షీణించింది. మూడు దశాబ్దాల క్రితమే నార్లగారు ఇలా ఆవేదన చెందారంటే ఇక నేటి పరిస్థితి ఏవిధంగా ఉందో ఎవరైనా ఊహించుకోవచ్చు.

తెలుగు సంపాదకులలో నార్ల బాణీ విలక్షణమైనది. అనితర సాధ్యమైనది. 'నార్లవారి మాట నవయుగాల బాట'. పత్రికా రంగంలో ఆయన వేసిన బాట పలువురికి అనుసరణీయమైనది. ఉత్తమ సంపాదకుడు ఎలా ఉండాలో ఆయన చెప్పిన నిర్వచనం ఆయనకు చక్కగా నప్పుతుంది. సంపాదకుడికి విశ్వమానవ దృష్టి ఉండడాన్ని ప్రథమ అర్హతగా ఆయన భావించారు.

సంకుచిత, స్వార్ధ పూరిత, పురాతన భావాలకు అతీతంగా, సార్వజనీనమైన, సార్వకాలికమైన ఆధునికమైన ఆలోచన, వివేచనలతో కూడిన రచనలు చేయగలిగినప్పుడే సంపాదకుడు సమాజంలో తీర్పరి పాత్రను నిర్వహించగలుగుతాడు, గౌరవపాత్రుడౌతాడు.

అంతేకాదు, విశ్వవ్యాప్తంగా ఎక్కడ ఏమి జరుగు తున్నదో నిరంతరం తెలుసుకునే జిజ్ఞాన సంపాదకుడికి ఉండాలి. విశ్వమానవుడిగా ఆలోచించాలి. తెలుగు పత్రికలకు అంతర్జాతీయ దృష్టి అలవరచిన సంపాదకుడు నార్ల. ఆయన హయాంలో తెలుగు పత్రికలలో అంతర్జాతీయ వార్తలకు ప్రముఖస్థానం ఉండేది.

తెలుగుజాతి సమగ్ర వికాసానికి ఆయన ఆయా సందర్భాలలో, కీలక సమయాలలో తగిన రీతిన స్పందించి తన సునిశిత వ్యాఖ్యలతో, సంపాదకీయాలతో మార్గదర్శకత్వాన్ని నెరిపారు. తెలుగు సంపాదకుడికి అంతర్జాతీయ గుర్తింపు, గౌరవం గడించిపెట్టిన ఏకైక సంపాదకుడు నార్ల అంటే అతిశయోక్తి కాదు. పత్రికారంగంలో ఆయన ఎన్నో వరవడులు దిద్దారు. భాష విషయంలో, పదనిర్ధారణ విషయంలో, పత్రికను తీర్చిదిద్దే విషయంలో ఆయన ఎన్నో కొత్త పోకడలు పోయారు. గ్రాంథిక, వ్యావహారిక భాషావాదాల మధ్య తెలుగు భాష నలిగిపోతున్న దశలో ఆయన పత్రికా భాషకు శ్రీకారం చుట్టారు. తెలుగు వాడకంలో సరికొత్త బాటను వేశారు. పత్రికా భాషను ప్రజల భాషగా మలిచారు. సాధికారతను తెచ్చిపెట్టారు. ఆయన వేసిన బాటలోనే ఆ తర్వాత తెలుగు పత్రికలు పురోగమించాయి.

నార్ల వ్యక్తిత్వంలో, మాటలలో, రచనలలో కనిపించే నిర్భీతి ఎల్లప్పుడూ విస్మయకరంగానే ఉండేది. అది ఎంతోమంది సంపాదకులలో కనిపించే లక్షణం కాదు. ఆత్మగౌరవం విషయంలో కాని, సామాజిక విశ్వాసాల విషయంలో కాని, రాజకీయ ఉచితానుచితాల నిర్ణయం విషయంలోకాని ఆయన ఎన్నడూ రాజీ పడలేదు. వివాదాలకు ఏమాత్రం వెరవలేదు. మొగమాటాలకు లొంగలేదు. ఆంధ్రప్రభ సంపాదకుడుగా ఆంధ్రరాష్ట్రం తొలి దశాబ్దపు పరిణామాలను ప్రభావితం చేయడంలో నార్లది కొన్నిసార్లు నిర్ణయాత్మకమైన పాత్ర. మరికొన్ని సార్లు సంచలనాత్మకమైన పాత్ర. ప్రజాస్వామ్యం పట్ల, పత్రికా స్వేచ్ఛపట్ల, సామాజిక న్యాయం పట్ల ఆయనకు అచంచలమైన విశ్వాసం. ఏది చేసినా ఆత్మసాక్షి మేరకే చేశారు. ఏమి రాసినా ఆత్మప్రబోధం మేరకే రాశారు. సూటిగా రాశారు, ఘాటుగా రాశారు. ఆయన రచనలలో పాండిత్యం, పరిణతి ప్రగాఢంగా ప్రతిఫలించేవి.

నార్ల ఎంతటి ఉన్నతశ్రేణి సంపాదకుడో అంతటి గట్టి సంస్కరణవాది. నార్ల వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని, స్థూలంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. మొదటిది పత్రికా రచన. రెండవది సాహితీ సృజన. మూడవది సంస్కరణ శీలత.

హేతువాదిగా ఆయన రాసిన రచనలు, వాటి పై రేగిన వివాదాలు అనేకం. అయినా అవేవీ సంపాదకుడిగా ఆయన విలువను, ఔన్నత్యాన్ని ఏమాత్రం తగ్గించలేక పోయాయి. మూఢ నమ్మకాలపై నార్ల నిరంతర పోరాటం సాగించారు. సనాతనత్వాన్ని నిరసించారు. తాను సంపాదకత్వం వహిస్తున్న పత్రికల ద్వారానే కాదు, తనకు అందుబాటులోకి వచ్చిన వివిధ వేదికలను అందుకు సాధనాలుగా మలచుకున్నారు. భిన్న ప్రక్రియలలో సాహిత్య సృష్టి చేశారు. చరిత్ర రాశారు. శతకాలు,కవిత్వం రాశారు, నాటక రచన చేశారు. వచన రచన సంగతి ఇక సరే సరి! 'జాబాలి', 'సీతజోస్యం', 'నరకంలో హరిశ్చంద్రుడు' వంటి రచనల ద్వారా పురాణాల విషయంలో తరతరాలుగా పాతుకుపోయిన పాతభావాల స్థానంలో హేతుబద్ధమైన కొత్త ఆలోచనలు ఉద్దీపింప జేసే ప్రయత్నం చేశారు. వ్యంగ్య వ్యాఖ్యలతో శతకాలు రాశారు. ఛందోబద్ధంగా కవిత్వం రాశారు. కవిగా నాటక కర్తగా, శతకకారునిగా, పత్రికా రచయితగా ఏ రచనకు పూనుకున్నా భాషలో సారళ్యం, భావంలో పరిణతి, విషయ వివరణలో పాండిత్యం ఆయన రచనలలో గుభాళిస్తూ ఉండేవి. సంస్కరణాభిలాష ప్రతిఫలిస్తుండేది. ఆయన సంస్కరణవాదం రాజకీయ, సామాజిక రంగాలకు మాత్రమే పరిమితం కాలేదు. భాష భావజాలానికి కూడా విస్తరించింది. ఆధునిక భావజాలాన్ని సమాజంలోకి వెదజల్లిన 'ఉద్యమకారుడు' ఆయన. నిర్భీతిగా ప్రశ్నించి శోధించి సత్యాన్ని నిగ్గుతేల్చే తార్కిక గుణాలను సమాజంలో వ్యాప్తిచేయడానికి ఆయన అనవరతం శ్రమించారు. శక్తివంతమైన తన రచనల ద్వారా నవయుగాల బాటవైపు తెలుగుజాతిని నడిపించడానికి పరిక్రమించారు.★

ఇనగంటి వెంకట్రావు:. *చాలకాలం నార్లగారివద్ద ఆంధ్రజ్యోతి దినపత్రికలో సహసంపాదకులుగా పనిచేశారు. తదుపరి ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులుగా పనిచేసి ఆ పత్రికను నవ్యపథంలో నడిపారు. నిర్భయంగా, నిర్మొహమాటంగా వార్తలు విశ్లేషించడంలో దిట్ట. వీరు ప్రెస్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్కు ఛైర్మన్ గా పనిచేసి, పాత పత్రికలను డిజిటలైజ్ చేయడంలో సఫలీకృతులైనారు. ఎన్టీరామారావు పై వీరి రచన 'ఒక్కడు' విశేష ప్రచారాన్ని పొందింది. మోనికా పబ్లికేషన్స్ తరఫున పలు గ్రంథాలు ప్రచురించారు. ప్రస్తుతం 'పత్రిక' అనే సచిత్ర మాసపత్రికను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.*

అనుబంధం – 1

దటీజ్ డాక్టరు శారద

పుస్తకాలను విశేషంగా ప్రేమించే నార్ల వెంకటేశ్వరరావుగారి పెద్ద కుమార్తె డాక్టరు కొల్లి శారదగారు గుంటూరు నగరపాలక సంస్థకు తొలి మేయరుగా ఉన్న దినాలలో 1997లో తెలుగునాట తొలిసారిగా 30 పాత పుస్తక విక్రయదారుల దుకాణాల సముదాయాన్ని కార్పొరేషన్ ఖర్చుతో నిర్మించారు. ఎన్నో అరుదైన పాతగ్రంథాలు ఇచట లభిస్తాయి. ఆ విధంగా నార్ల అభిరుచులకు పట్టంగట్టారు డాక్టరు శారద.

నార్ల కుమార్తెల ఔదార్యం

కుమార్తెలు పూనుకొని కన్నతండ్రి పేరు, ప్రతిష్ఠలను, యశస్సును శాశ్వతం చేయడానికి జరిగిన సఫల ప్రయత్నం మరొకటి ఇదే సందర్భంలో నాకు గుర్తుకు వస్తున్నది. అది కీర్తిశేషులు నార్ల వెంకటేశ్వరరావుగారి రచనలన్నిటినీ సంపుటీకరించడం. నార్ల తన సుదీర్ఘ రచనా జీవితంలో చేసిన రచనలు అన్నిటినీ సేకరించి ప్రచురించడం అంటే – మామూలు విషయం కాదు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి వంటి రెండు పెద్ద దినపత్రికలకు ఆయన దశాబ్దాల తరబడి సంపాదకత్వం నిర్వహించారు. ఆ హోదాలో సహజంగానే సంపాదకీయాలతో పాటు అనేక రచనలు. ఇవి కాక విడిగా వివిధ ప్రక్రియలలో చేసిన రచనలు. దినపత్రికల భాషకు కొత్త ఒరవడి దిద్దిన ఘనత ఆయనదేనని అందరికీ తెలుసు. అదేవిధంగా తెలుగునాట వినూత్న భావజాలాన్ని వెదజల్లి కొత్త ఆలోచనలు రేకెత్తించి సంచలనం సృష్టించిన ప్రత్యేకత కూడా ఆయనదే!

ఆయన రచనలన్నీ సులభంగా లభ్యంకావు. కనుక వాటిని గురించి ఈ తరానికి బొత్తిగా తెలియదు. తెలుగు జర్నలిజంలో మేరుసమానుడుగా నార్లను ప్రజలు ఈనాటికీ స్మరిస్తూనే ఉన్నారు. కాని సాహిత్యకారుడిగా ఆయన ప్రతిభను ఆయన తిరుగుబాటు భావజాలం కమ్మేసిందేమోనని ఒక్కోసారి అనిపిస్తుంటుంది. విభేదించడానికి వెరవని, వివాదాలలోనూ వన్నెతగ్గని వ్యక్తిత్వాలు పాతతరం వారివి. అలాంటి వారిలో అగ్రగణ్యులు నార్ల. ఆయన రచనలు అన్నింటినీ సంపుటీకరించే బృహత్ప్రయత్నాన్ని ఆయన కుమార్తెలు పట్టుదలతో కొనసాగించి పూర్తిచేశారు. అందుకు పూనిక గుంటూరు మేయరుగా పనిచేసిన ఆయన కుమార్తె డాక్టరు కొల్లి శారద గారిది కాగా, విదేశాలలో నివసిస్తున్న ఇతర కుటుంబ సభ్యులు డాక్టరు మీనాక్షి నార్ల, డాక్టరు శరత్ బెల్ల ప్రవలు సహకారం కూడా అపారం.

– ఇనగంటి వెంకట్రావు. సమిష్టి కృషిగా సాహితీ పోషణ వ్యాసం నుంచి. ఆంధ్రజ్యోతి దినపత్రిక సౌజన్యంతో

అనుబంధం – 2 ఋణపడిన తెలుగు ప్రచురణ

– నవోదయ రామమోహనరావు గారి లేఖ 10-6-2005)



వెంకటప్పయ్యగారూ,

... మిత్రులెవరో చెప్పగా తెలిసి విశాలాంధ్ర బుక్ హౌస్ నుండి నార్లవారి రచనలు మొదటి నాలుగు సంపుటాలు తెప్పించుకుని చూశాను. మీ విశ్వరూపం ఆ పుస్తకాల ముద్రణలో మీరు తీసుకున్న శ్రద్ధ ద్వారా తెలుసుకున్నాను. మీకు మీరే సాటి అనిపించుకున్నారు. ఒక మంచి ప్రాజెక్టు మీ ద్వారా నిర్వహించటం, అదీ ఎంతో అందంగా, తప్పులు లేకుండా (నేను చదివినంతవరకు తప్పులు కనిపించలేదు. తప్పులు ఉంటే నార్లగారు క్షమించరు కదా) తీసుకురావడం చాలా సంతోషం కలిగించింది. మిమ్మల్ని ఎలా అభినందించాలో మాటలు వెతుక్కుంటున్నాను. 12 వాల్యూములూ ఇదే బిగువుతో ఇంత అందంగా తీసుకురండి. తెలుగు ప్రచురణరంగం మీకు ఋణపడి ఉంటుంది.★

తెలుగువారి అక్షర సంపద

– గోపరాజు నారాయణరావు

పత్రికా రచనకు, చరిత్ర నిర్మాణానికి నడుమ రేఖ నామమాత్రంగా కనిపించినా యుగాలు కొన్నయినా ఉన్నాయి. అలాంటి వాటిలో ఒక యుగానికి కర్త – నార్ల వెంకటేశ్వరరావు. నిజానికి ఆ రెండింటి మధ్య విభజన లీలామాత్రమేనని గుర్తించిన పత్రికా రచయిత నార్లవారు. ఇవాల్టి రాజకీయాలే రేపటి చరిత్ర అని, సామాజిక పరిణామాలను ఒక క్రమపద్ధతిలో గుదిగుచ్చడమే చరిత్ర రచన అని, లేదా చారిత్రక ఘటనలలో హేతువును దర్శించడమే చరిత్ర అని చరిత్ర నిర్మాణ పద్ధతులుగా తత్వవేత్తలు చెబుతారు. నార్ల రచనకు అక్షరాలా ఇవన్నీ వర్తిస్తాయి. "నడుస్తున్న చరిత్రకే మరోపేరు జర్నలిజం" అని (మూడు దశాబ్దాలు పీఠికలో) ఆయనే ప్రకటించగలిగారు. నార్ల రచనలో అత్యధిక భాగం సమకాలీన చరిత్ర మీద వ్యాఖ్యానమే. అవి తారీఖులను, దస్తావేజులను ఉటంకించేవో, సంఘటనలను నమోదు చేయడానికి పరిమితమైనట్టివో కాదు.

తేదీ మారితే పత్రికా రచనలకు మిగిలేది పాచి వాసన అనేది నిజమే అయినా, తమ రచనలకు సార్వకాలికమైన గుబాళింపును అద్దిన సంపాదకులూ, పత్రికారచయితలూ లేకపోలేదు. అందులో నార్ల అగ్రగణ్యులు. తాజాగా వచ్చిన 'నార్ల రచనలు' సంపుటాలే ఇందుకు నిదర్శనం. నార్ల పత్రికా రచయిత, నాటకకర్త, కవి, విమర్శకుడు. ఆయన రచనలన్నీ ముద్రణలు, పునర్ముద్రణలు అయినవే.

ఆశ్చర్యం ఏమిటంటే ఆయన సృజనాత్మక రచనలకు మించి పత్రికా రచనలకే ఆదరణ కనిపిస్తుంది. అందుకే రచనలన్నిట్నీ కలిపి '*నార్ల కుటుంబం*' సంపుటాలుగా వెలువరించింది.

ఇవి మొత్తం పన్నెండు సంపుటాలు. వాటి వివరాలు ఇలా ఉంటాయి...

1. **తొలిరచనలు;** నేటి రష్యా, స్వదేశసంస్థానాలు, ఆస్ట్రియా ఆక్రమణ, పాలస్తీనా, జెక్– రాజ్య విచ్ఛేదం.
2. **సాంఘిక నాటికలు;** కొత్తగడ్డ, మాటామంతి, పిచ్చాపాటి, కొత్తా–పాతా, కదంబం, పురాణ వైరాగ్యం.
3. **పౌరాణిక నాటికలు**; సీత జోస్యం, జాబాలి, నరకంలో హరిశ్చంద్రుడు, పంచరాత్రం.
4. **సాహిత్యరచనలు**; వేమన, వీరేశలింగం, గురజాడ, జగన్నాటకం, నవయుగాల బాట, మా ఊరు.
5. **సంస్కృతి, భాష, సాహిత్యం**, సంపాదకీయాలు, వ్యాసాలు, గ్రంథ సమీక్షలు
6. **వర్తమాన సంఘటనలు**; సంపాదకీయాలు, వ్యాసాలు, గ్రంథ సమీక్షలు
7. **జీవిత చిత్రణలు** సంపాదకీయాలు, వ్యాసాలు, గ్రంథ సమీక్షలు
8. WRITINGS ON RELIGION; The Truth About The Gita, An Essay on Upanishads and Gods – Goblins and Men.
9. PLAYS ON RAMAYANA Jabali and Seetha's Destiny (Seetha Josyam)
10. WRITINGS ON CULTURE Traditional Indian Culture and Indian Culture its caste complexion.
11. WRITINGS ON LITERATURE Vemana, Veeresalingam and Gurazada.
12. Miscellaneous Writings Man and His World, Diaries, Letters, Notes and Rajya Sabha Debates etc.,

ఇందులో 3, 4 తెలుగు సంపుటాలకు అనువాదాలే 9, 11 ఇంగ్లీషు సంపుటాలు. మొదటి సంపుటంలో ఛాయాచిత్ర చయనిక చేర్చి, ప్రతి సంపుటానికి వేర్వేరు ప్రముఖుల చేత పీఠికలు రాయించారు. సంపాదకత్వ బాధ్యతను డాక్టర్ వెలగా వెంకటప్పయ్య వహించారు.

– అక్షరాన్ని ఆయుధంగా చేబూనిన నార్ల ఆయుధ కాంట్రాక్టర్ల ఇంట పుట్టడం యాదృశ్చికం. వ్యాపారంలో నష్టపోయి, మధ్యప్రదేశ్ నుంచి కుటుంబం కవుతరం (కృష్ణాజిల్లా) చేరడం, బందరులో చదువు, ఈ మధ్యలో కష్టాలు ఎంతో నాటకీయంగా ఉన్నా నార్ల జీవిత చిత్రణ (మొదటి సంపుటం) ఆసక్తిదాయకంగా సాగలేదు. 17 సంవత్సరాలు ఆంధ్రప్రభకు, మరో 17 సంవత్సరాలు ఆంధ్రజ్యోతికి సంపాదకునిగా అప్రతిహతంగా నిలబడిన నార్ల తొలినాటి జర్నలిస్టు జీవితం ఒడుదుడుకులతో నిండి

ఉండడం ఆశ్చర్యమే. విశ్వనాథ సోదరుడు సెలవు పెట్టగా వచ్చిన ఖాళీలో తాత్కాలికోద్యోగిగా ఆయన జర్నలిజంలో ప్రవేశించారు. 'కృష్ణాపత్రిక', జనవాణి ఆయన జీవితాన్ని మలిచాయి. పత్రికా రచయితగా వృత్తిని ప్రారంభించడానికి ముందే అనుకోకుండా రచయితగా వ్యాసంగం ప్రారంభమై పోయింది. అప్పుడు రాసినవే తొలి సంపుటిలోని దేశ చరిత్రలు, సోవియెట్ రష్యాను పరిచయం చేస్తూ రాసిన చిరు పుస్తకం 'నేటి రష్యా' (1934). అక్కడ జరిగిన రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిణామాలన్నింటికీ కారణం సామ్యవాదమని నార్ల ఇందులో చెబుతారు. భారతదేశపు సంస్థానాల, సంస్థానాధీశుల నీచత్వాన్ని ఆధారాలతో సహా 'స్వదేశీ సంస్థానాలు' (1937)లో చర్చించారు. హిట్లర్ చేసిన 'ఆస్ట్రియా ఆక్రమణ' (1938), అతడే గావించిన 'చెక్ రాజ్య విచ్ఛేదం' (1939), ఇరవై శతాబ్దం ఆరంభంలో 'పాలస్తీనా' (1939) సమస్య స్వరూపం గురించి వాటిలో రాశారు. 1986 లో 'ఉదయం' పత్రిక ప్రచురించిన ఒక అసంపూర్ణ ఇన్టర్వ్యూ కూడా ఉంది. నార్ల కన్ను మూసినపుడు పత్రికలు, ప్రముఖులు రాసిన స్మృత్యంజలులను పునర్ముద్రించారు.

రైతాంగ సమస్యలను, గ్రామాల దుస్థితిని చిత్రించడానికి నార్ల నాటకాన్ని ఎన్నుకున్నారు. – పదహారు నాటికలతో వచ్చిన 'కొత్తగడ్డ' అలాంటిదే. వీటిని రెండవ సంపుటిలో చేర్చారు. ఇంకా, నార్లకు ఎంతో పేరు తెచ్చిన మాటా మంతీ, పిచ్చా – పాటీ, కొత్తా పాతా శీర్షికల కింద వచ్చిన రచనలను కూడా చేర్చారు. ఇవన్నీ జాతీయ, అంతర్జాతీయ సంఘటనల మీద వ్యాఖ్యలు, విసుర్లే.

నార్ల నాస్తికుడు. హేతువాది. ఇందుకోసం ఆయన హిందూ పురాణాలను మథించారు, ప్రశ్నించారు. ఎక్కడైనా మతం విజ్ఞానానికి పెద్ద అవరోధమని ఆయన అభిమతం. మనుషులను విభజిస్తుందని అసహనం. పురాణ కథలతో ఆయన రాసిన జాబాలి, సీతజోస్యం, నరకంలో హరిశ్చంద్రుడు, పంచరాత్రం ద్రౌపది, హిరణ్యకశిపుని హత్య నాటికలు ఈ దృక్పథాన్నే వెల్లడిస్తాయి. మూడో సంపుటం వీటికి కేటాయించారు. ఋషులకోసం సర్వం త్యాగం చేస్తానంటాడు రాముడు, సీతజోస్యంలో చూడబోతే ఆ పురోహిత వర్గం కోసం నన్ను విడిచిపెట్టేటట్టే ఉన్నావని సీత జోస్యం చెబుతుంది. జరిగిందదే. పురోహిత వర్గం మాట విని పరలోక భ్రమ పెట్టుకోవద్దని రాముడికి హితవు చెప్పినవాడు జాబాలి. కుంతి తనమీద పడిన మచ్చను చెరిపేసుకోవడానికి ద్రౌపదికి ఐదుగురు భర్తలను కట్టబెట్టిందని చెప్పే ఉదంతం ద్రౌపది పంచరాత్రం. తన కథా వస్తువులకు నార్ల చాల ఉపపత్తులే చూపుతారు. అందుకే తెలుగు సాహిత్యానికి హేతువాద దృష్టిని కల్పించిన ముగ్గురు మహానుభావులు వేమన, వీరేశలింగం, గురజాడ అంటే నార్లకు అంత గౌరవం. వీరి జీవితం, సాహిత్యాల మీద ఆయన ఎంతో విశ్లేషణ చేశారు. ఇదంతా నాలుగో సంపుటంలో ఉంది. నార్ల బహుముఖ ప్రజ్ఞను పట్టిచ్చేది ఐదో సంపుటి. సంస్కృతం, సంస్కృతి, చిత్రకళ, శిల్పం, భాష, రంగస్థలం, గానం, చరిత్ర రచన, సైన్స్, గీత, ఉపనిషత్తులు వంటి వాటిమీద ఆయన రచనలు ఇందులో కనిపిస్తాయి.

బానిస భారతానికి, స్వాతంత్ర్య భారతానికి వారధి నార్ల. ఈ మధ్యలో జరిగిన అనేక చారిత్రక సంఘటనలను ఆయన దర్శించారు. వాటిమీద స్పందించారు. తన కాలం నాటి వందలాది మంది చరిత్రపురుషులను కలిసి, చూసి అంచనా వేశారు. 1947 ఆగస్టు 15 కు ఆయన రాసిన తొమ్మిది సంపాదకీయాల ధారావాహిక ఒక చరిత్రకారుడు, గొప్ప పత్రికా రచయిత కలిసి ఇచ్చిన ప్రకటనలా ఉంటుంది. 'జాతీయ స్వాతంత్ర్యం అకారణంగా పోదు. అవలీలగా రాదు. అప్రయత్నంగా నిలవదు...' అంటారాయన. స్వేచ్ఛాస్వాతంత్ర్యాల విలువ, అవి లభించిన తీరు, నిలుపుకోవలసిన అవసరం వివరించారు. 'ఒకడికి భోగభాగ్యాలు, మరొకరికి దుర్భర దారిద్ర్యాలు లలాట లిఖితాలని నమ్మేది కాని, చెప్పేది కాని స్వతంత్ర దేశం కాదు' అని కూడా ప్రకటిస్తారు. స్వతంత్ర భారతావనికి ఒక దిశానిర్దేశమే ఇందులో కనిపిస్తుంది. గాంధీ హత్య, హైదరాబాద్ విలీనం, నెహ్రూ మరణం, శాస్త్రీజీ మరణం, ఆంధ్రావతరణ, నాగార్జున సాగరం... ఆ వ్యాఖ్యానం అలా కొనసాగింది. ఇక వ్యక్తుల సంగతి చెప్పనక్కరలేదు. ఒక గెలాక్సీలో ప్రయాణమది. వీటితో నిండి ఉన్న ఆరు, ఏడు సంపుటాలు నార్ల హృదయావిష్కరణ చేస్తాయి. అయితే ఎమర్జెన్సీ మీద తరువాతెపుడో ఆయన ఆంధ్రప్రభ వీక్లీలో రాయడం కనిపిస్తుంది. వీటితో పోలిస్తే ఇంగ్లీషు సంపుటాలకు ప్రాధాన్యం తక్కువే.

నార్ల భాష నాటికీ నేటికీ కరదీపికే. నిండా ఎంతో నిర్భీకత, అంతే నిభాయింపు, కవిత్వం, ఉద్వేగాలతో తొణికిసలాడినా సంపాదకీయానికి ఉంటుందని నమ్మే పదబంధం జారిపోదు. సంపాదకునిగా ఆయన స్థాయి సమున్నతమైనది. ఆయన తొలి పుస్తకం (నేటి రష్యా) గ్రాంథిక భాషలో ఉండడం ఒకింత ఆశ్చర్యమే. అంతటితో అది సరి. అవతల వ్యక్తిలో తాను అంగీకరించలేని అంశాలెన్ని ఉన్నా, చరిత్రలో అతడి స్థానాన్ని నార్ల కచ్చితంగా అంచనా వేస్తారు. ఆయన కమ్యూనిస్టు వ్యతిరేకి. అయినా మార్క్సిస్టు అవగాహనతో చరిత్ర రచన చేసిన డిడి కోశాంబిని అభిమానిస్తారు. హిందూ పోకడలకు ఆయన వ్యతిరేకి. వాటినే ఆలంబనగా చేసుకున్న నాయకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ, డాక్టర్ రఘువీర (జన సంఘ్). అయినా ఒక కోణం నుంచి వీరిని శ్లాఘిస్తారు. విశ్వనాథ సత్యనారాయణ మీద నిందాస్తుతి లాంటి వ్యాసం కనిపిస్తుంది. చాలామంది రచయితలలో లేని నిష్కాపట్యం విశ్వనాథ వారిలో ఉందని నార్ల అంటారు. రాధాకృష్ణన్, జె.పి, మొరార్జీ, లోహియా వంటి వారిమీద సమున్నత జీవిత చిత్రాలు ఇచ్చారాయన. ఎమర్జెన్సీ మీద రాసిన వ్యాసంలో తాను ఇందిరాగాంధీకి చాల సార్లు ఎదురుపడినా "ఆమె మీద ఉన్న అసహ్యం కొద్దీ" ఏనాడూ నమస్కారం చేయలేదని కటువుగానే తన మనసులో మాట బయట పెట్టారు. ఇదే నార్ల నెహ్రూ మీద ఈగ వాలితే మూడోకన్ను తెరిచేవారు.

తన హయాంలోనే సంపాదకునికి, సంపాదకీయానికి విలువ తగ్గిందని నార్ల వాపోయారు. అది మూడు దశాబ్దాల నాటి మాట. ఇప్పుడు సంపాదకుడు సంపాదక మండలిలో ఆరోవేలు అని విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వచ్చిన సంపుటాలు 'నార్ల రచనలు'.

ఒక కోహినూర్, లేదా అలనాటి మణిహారాలు ఈరోజు మనం ధరించలేకపోవచ్చు. అలా అని వాటిని వదిలేయం. అవి మన జాతీయ సంపద. ఈ సంపుటాలు కూడా అంతే... తెలుగువారి అక్షర సంపద.

–డాక్టరు గోపరాజు నారాయణరావు, సీనియర్ జర్నలిస్ట్. 15–3–2005 ఆంధ్రజ్యోతి దినపత్రిక సౌజన్యంతో.

నార్లతో మధురవాణి ఇంటర్ వ్యూ *(వ్యంగ్య రచన)*



– పురాణం సుబ్రహ్మణ్య శర్మ

(మంచం నిండా చుట్టూతా పరుచుకున్న సగం తెరిచీ మూసిన ఇంగ్లీషు తెలుగు పుస్తకాలు. మధ్యలో గోల్డ్ ఫ్లేక్ సిగరెట్టు పెట్టెల మధ్య సిగరెట్ ఆరారగా పీలుస్తూ నార్ల వెంకటేశ్వరరావు. ప్రక్కన కాఫీ కప్పు. సిగరెట్ తో మరో సిగరెట్ వెలిగించబోతుండగా సిగరెట్ లాక్కుని నలిపి కిటికీలోంచి విసిరేస్తుంది మధురవాణి)

మధురవాణి : ఏమిటీ కాల్చడం? గది నిండా పొగ! ఎలా ఆలోచిస్తారు ఇల్లాంటి గదిలో?

నార్ల : మాకు స్టోన్ దగ్గరకు వెళ్ళి నించోగానే ఐడియాలు వస్తాయి. ప్రెస్సులో ఎంత గోలగా ఉంటుందో నీకేం తెల్సు? ఈ గది ఇంకా వెయ్యి రెట్లు బెటరు.

మధుర : సిగరెట్ కాల్చకపోతే రాయలేరా?

నార్ల : ఏమిటో దవడలు పీక్కుపోతాయి. బుర్ర చిట్టెం గట్టినట్లు ఉంటుంది. చెయ్యి ఆడదు సిగరెట్ లేకపోతే.

మధుర : గిరీశంగారు చుట్ట వెలిగించమనే వారు.

నార్ల : చుట్టకు మధ్యలో ఆరిపోయే గుణం ఉంది, సిగరెట్ అలాక్కాదు. నీకు చుట్ట వాసనే ఇష్టమనుకుంటాను.

మధుర : సానిదానికి ఇష్టమేమిటి అయిష్టమేమిటి? సరసులకు ఏది ప్రియమో అది మాకు ప్రియం.

నార్ల : కొంపదీసి నన్ను అందులో చేర్చలేదు గద!

మధుర : అంత అదృష్టమా? మీకు గురజాడ వారి మీద కోపం వచ్చిందని విన్నాను.

నార్ల: అవును. నేను యాంటీ నాచ్. అతగాడు రామస్వామి వెంకటస్వామి అనే వేశ్యలిళ్ళకు వెళ్ళి వాళ్ళ కోపతాపాలూ అలకలూ తీర్చి ఆనంద గజపతిరాజుగారికి వాళ్ళతో గొడవలు లేకుండా మధ్యవర్తిత్వం (అనకూడదుగాని, డాఫరీ) చేశాడట.

మధుర : రామ రామ – వారిద్దరికీ అప్పారావు గారంటే ఎంత గౌరవం? ఎంత భక్తి? వారిని తండ్రిగా చూసుకుని వారికంట పడకుండా జాగ్రత్తగా మసిలే వారు.

నార్ల: వాళ్ళిద్దరూ తాగేవారట. తాగితే ఒకావిడ ఆనంద గజపతిని కూడా లెక్కచేసేది కాదట.

మధుర: అందుకే అటువంటి వేశ్యల బాలికలకు శిక్షణనిచ్చేందుకు విజయనగరం రాజమహేంద్రాల్లో పాఠశాలల్ని నెలకొల్పి సంగీత సాహిత్యాల్లో శిక్షణ నిప్పించే వారని విన్నా.

నార్ల: అందుకే తరవాత వీరేశలింగంగారు ఆడపిల్లలకు స్కూళ్ళు పెడితే అక్కడకు ఉన్నత కులస్థుల పిల్లల్ని పంపేవారు కాదు.

మధుర : శ్రీఆనంద గజపతి మహారాజుల వారి సన్నిహిత మిత్రులుగా ఆస్థాన ఉద్యోగిగా పంతులుగారి మీద చాలా బాధ్యతలు ఉండేవి. అత్త మీద కోపం దుత్త మీద చూపించినట్లు మీరు అప్పారావుగారిని నిందిస్తే ఏమి లాభం?

నార్ల : వీరేశలింగంగారు అప్పారావుగారున్న పొజిషన్లో ఉంటే రిజైన్ చేసేవాడు. కాని సానికొంపలట్టుకు తిరిగేవాడు కాదు.

మధుర : మీరు అప్పారావుగారిని తప్పుగా అర్థంచేసుకున్నారు. ఆయన దృష్టి ఎంతసేపూ నాటక రచయిత దృష్టి. వేశ్యల కొంపలు ఆ పరిసరాలు ఆయన కవి దృష్టితో చూడకపోతే ఆయన కన్యాశుల్కం రాసేవాడు కాదు. వీరేశలింగం పంతులు గారికీ గురజాడకూ ఉన్న ముఖ్యమైన తేడాను మీరు సక్రంగా గ్రహించారు.

నార్ల : మహ చెప్పొచ్చావులే, వంకర అంటూ. ఇబ్సన్ రాసిన 'డాల్స్ హవుస్' నువ్వు చదివావా?

మధుర : మీ నైతిక దృక్పథం జర్నలిజానికి పనికొస్తుందేమో గాని నాటకానికి కాదు. నాటక రచయిత మీద అంత నైతిక బరువును ఎవరూ మోపరాదు. ముని వెంకట సుబ్రహ్మణ్యంగారికి రాసిన ఉత్తరంలో గురజాడ దృష్టి స్పష్టం అవుతుండగా మీరు మా గురువుగారిని మాట తూలడం నే సహించను గాక సహించను.

నార్ల : నీకు చాలా కోపం వచ్చిందే – కోపం తెప్పించడం నాకు వెన్నెతో పెట్టిన విద్య. మంచి ఎడిటర్ ప్రజలకు ఆగ్రహం వచ్చినా తను రాసిన దానికి కట్టుబడి ఉంటాడు.

మధుర : మీకు గురువుగారి మీద సద్భావం లేనప్పుడు ఆయన మీద అకాడమికి మోనోగ్రాఫ్ ఎందుకు రాశారు? అది మీకు ఆత్మవంచన కాదా?

నార్ల : నా మోనోగ్రాఫును చెడగొట్టగలిగినంత తీవ్రమైనవి కావు నా అభ్యంతరాలు. ఆయన జీవితం ఆయనదని జాలిపడ్డాను.

మధుర : అప్పారావుగారు పురుడి పిట్టమాంసం కొద్దిగా ఇష్టపడి తినేవారు. ఆయన రీవారాణి గారి సాన్నిధ్యంలో కోక వైన్ పుచ్చుకునేవారు. ఇవన్నీ మీకు అభ్యంతరాలా? అయినా మీ

అభ్యంతరాలతో ఆయన్ని కొలవడం ఏం మర్యాద!

నార్ల : నైతిక ప్రమాణాలు లేక మనజాతి ఇలా ఉంది.

మధుర : రాజులు జమీందారీల కాలం ఒకలా ఉండేది. విజయనగరాన్ని మాత్రమే సిటీ అనేవారు. రీవారాణి పుణ్యమాని విజయనగరంలో వీధి పంపులు వచ్చాయి. విశాఖపట్నంలో హార్బరు కట్టే జాగాని అప్పారావుగారు స్వయంగా వెళ్ళి చూసివచ్చారు. అలా డైరీలో రాసుకున్నారు.

నార్ల : విశాఖపట్నం అనే చిన్న సముద్రపుటొడ్డు గ్రామాన్ని పద్మనాభ యుద్ధంలో ఓడిపోయి డచ్ వారికి అయిదు వేల రూపాయలకు మీ విజయనగరం వారు అమ్మేశారని చదివినట్లు జ్ఞాపకం.

మధుర : మీరెక్కడ చదివారు? అఁహఁ; మీ చదువు ఏ ఊళ్లో పని...

నార్ల : గుడివాడలో, గుంటూరులో, బందర్లో తర్వాత కాకినాడలో.

మధుర : మీరు మద్రాసు ఎలా వచ్చారు?

నార్ల : నాకు ఇంగ్లీషు జర్నలిజం అంటే ఇష్టం. పత్రికలలో చేరుదామని మద్రాసు వచ్చా. ఎస్.జి. ఆచార్యగారు నన్ను చేరదీశారు. రోజూ నా లాల్చీ జేబులో ఓ పావలా ఉండేది. బస్సు ట్రాం ఖర్చులకు ఆయన నా జేబులో వేసేవారు నాకు తెలియకుండా. నేనింతవాడినయింది వారి చలవ వల్లనే.

మధుర : మీరు తరువాత వారిని గుర్తుంచుకుని అపకారం చేయకుండా ఉంటే–ఉపకారికి అపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ అని కదా, మారిన నీతిసూత్రం. – అదే పదివేలు (నవ్వు)

నార్ల: మనం ఒకరికి ఏదో ఉపకారం చేశాక అది వాడు జీవితాంతం గుర్తుంచుకుని మనకు కృతజ్ఞుడై ఉండాలనుకోవడం పేరాశ. ఇలా ఎందుకంటున్నానంటే, నేను నమ్మి పైకి తీసుకువచ్చిన వాళ్ళెవరూ చివరకు నావెంట లేరు.

మధుర : దానికి మీకు తెలియని అనేక కారణాలుంటాయి. కోపంలో అవి పైకి కనపడవు. పైగా మనది పోయేకాలం. వచ్చేకాలంతో ఉంటారు వాళ్ళు.

నార్ల : కోపం ఒక రసం. కోపం నా మతం. కోపం నా వేదాంతం. అంతేనా నువ్వనేది? మధుర : అవునూ, మీరు ఆంధ్రప్రభలోంచి ఎందుకు బయటకు వచ్చారు?

నార్ల : వర్కర్సు, 'స్టాఫ్' అంతా సమ్మె చేస్తే వారితోపాటు నేనూ రిజైన్ చేసి బయటికి వచ్చేశా!

మధుర : మీరు వెళ్ళిపోయినంత మాత్రం చేత ఆ పత్రిక మూత పడుతుందనుకున్నారా? మీరు వెళ్ళి పోతానని బెదిరిస్తే మీ యజమాని వద్దనలేదట గదా! గత్యంతరం లేక బయటకు రావలసి వచ్చింది. దాన్నే మీరు త్యాగంగా చిత్రించుకున్నారట నిజమా?

నార్ల: పత్రికే ఎడిటర్, ఎడిటరే పత్రికగా నడిపాను. గ్రాంథిక భాష, శిష్ట వ్యవహారికాన్ని కాదని ప్రజల

తెలుగును ప్రవేశపెట్టాను. నా సంపాదకీయాల కోసమే ప్రభ చదివే వారనిపించాను. ఇదేమీ సామాన్యం కాదు.

మధుర : అందుకేగదా, మీతో ఈ కబుర్లు! 'కండువా జర్నలిజం' మీతోనే ఆఖరనుకుంటాను.

నార్ల : 'కండువా జర్నలిజం' ఏమిటి?

మధుర : గుమాస్తా జర్నలిజానికి పూర్వ రూపం, అంటే వ్యతిరేకం. మీ కాలంలో యజమానిని వెనక్కు నెట్టి ఎడిటర్ ముందుకు వచ్చాడు. మీ తరువాత ఆఫీస్ మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్ ఎడిటర్ని మూలకూచోబెట్టి న్యూస్ పేపరు మీద పెత్తనం చలాయించసాగారు.

నార్ల : నీకింత భోగట్టా ఎలా తెలుసు?

మధుర : మీ తర్వాత, గోరాశాస్త్రి తర్వాత ఎడిటర్లెక్కడ ఉన్నారు? ఇప్పుడంతా లిఫ్టిరిగేషన్ కదా! నాకెలా తెలుసునంటున్నారా? గిరీశంగారు ప్రెస్ క్లబ్ కి వెళ్లొస్తుంటారు. వెంకటేశం ప్రెస్ క్లబ్ మెంబర్ కూడా. ఏదో ఇంగ్లీషు పేపరుకి విలేకరిగా ఉంటున్నాడు.

నార్ల: మాకంటే నువ్వే ఎక్కువ న్యూస్ కాన్షస్ గా ఉన్నావు?

మధుర : ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారు. గోగినేని రంగనాయకులు అని వార్త ప్రచురించి మీరు ఎన్.జి. రంగాగారికి వ్యతిరేకి అయ్యారు కొంతకాలం. ఆంధ్రకేసరి ప్రకాశాన్ని తిడుతూ పంచ మహాపాతకాలు అని అయిదు సంపాదకీయాలు రాశారు. పొట్టి శ్రీరాములుగారి ఆమరణ నిరాహార దీక్షను కూడా మీరు సానుభూతితో చూడలేదనుకుంటా. బహుశా ప్రజలకు ఎదురు వెళ్ళడం కూడా మీ జర్నలిజంలో ఒక యెత్తు కావచ్చు.

నార్ల: మన పేపర్లని వ్యతిరేకించి జనం తగులబెడుతూంటే నాకు గొప్ప సంతోషంగా ఉండేది.

మధుర : ఒకటి, వాళ్ళు మూర్ఖులని మీ అభిప్రాయం. రెండు; వాళ్ళు వ్యానును కాని పేపరును కాని తగులబెడుతూంటే మీ 'ఇగో' పెరుగుతుంది. నష్టపోయేది యాజమాన్యమే. మీరు మ్యానేజ్మెంట్లకి ఐరావతంలా మారారు.

నార్ల : స్టోన్ దగ్గర నేను కింగ్ లా ఉండేవాడ్ని. నా ఐడియాస్ అన్నీ అక్కడే వచ్చేవి.

మధుర : మద్రాసులో మెయిల్ టైమ్ కి ఎప్పుడూ అందిచ్చేవారు కాదట. రోజూ టాక్సీ పెట్టి కట్టలు సూళ్ళూరుపేట తీసికెళ్లి అందిచేవారట గదా!

నార్ల : ఏదో ఏడ్చేవారు. నేను అనుకున్నట్లు పేజీ వచ్చేదాకా స్టోన్ దగ్గర కుస్తీ పట్టేవాడ్ని.

మధుర : మాలతీచందూర్ని మీరేకదా డిస్కవర్ చేసింది?

నార్ల : అవును. ప్రమదావనం నేను పెట్టిన శీర్షికే. లతచేత ఊహాగానం రాయించింది నేనే. పురాణాన్ని కూడా రైల్వేల నుండి రిజైన్ చేయించి జర్నలిజానికి తెచ్చింది నేనే. తుర్లపాటి నా అడుగుజాడల్లో నడిచి ఎడిటోరియల్ రాస్తే అచ్చం నేను రాసినట్లుండేది. అంతా నా వరవడే.

మధుర : నండూరి రామమోహనరావుగారు రాస్తే మీరు రాసిందేదో ఆయన రాసిందేదో గుర్తు పట్టడం అసాధ్యంగా ఉండేదట. ఆయనకంత పరకాయప్రవేశం వచ్చునా?

నార్ల: దేశికవితా మండలి గొర్రెపాటి వెంకటసుబ్బయ్య నా జీవిత చరిత్ర రాశాడు. అందులో తను ఉదహరించిన సంపాదకీయాలేవీ నావి కావు, ఏడిచి! అవన్నీ రామ్మోహనరావు రాసినవే.

మధుర : ఆరోజుల్లో మీరు ఏర్పాటు చేసిన ప్రభ ఏజంట్లను అది మానేసి ఇది పుచ్చుకోమంటే అంతా మిమ్మల్ని చూడగానే పారిపోయేవారట గదా! అసలు ఈ "ఆంధ్రజ్యోతి" అనే పేరెట్లా సంపాదించారు మీరు?

నార్ల : ఆంధ్రజ్యోతి అనే వార పత్రికను 1941లో బి.ఎన్. గుప్త అనేవారు ప్రారంభించారు. దానిని నేనే ఎడిట్ చేసేవాణ్ణి. అదిపోయిన కొన్నాళ్లకి అంటే 1945 లో గావును; చక్రపాణిగారు "ఆంధ్రజ్యోతి" అని మంత్లీ పెట్టేరు. ఆ పిమ్మట రాజమండ్రిలో దంటు కృష్ణమూర్తి అనే అతని "ఆంధ్రజ్యోతి' అని అప్పుడప్పుడు వచ్చి ఆగిపోయే దినపత్రిక ఉండేది.

మధుర : అది మీరు కొనేసి ఉంటారు. మద్రాసు నుండి తెలుగు పత్రికల్ని విజయవాడకు తరలించిన ఘనత మీదేనా?

నార్ల : పూర్తిగా మాది కాదు. అంతకుముందే '*ప్రజాశక్తి*' దినపత్రిక కాట్రగడ్డ రాజగోపాలరావుగారి ఆధ్వర్యంలో కాబోలు విజయవాడ నుంచి వచ్చేది. అది కమ్యూనిస్ట్ల దినపత్రిక – ఇది ఆంధ్రుల జాతీయ దినపత్రిక.

మధుర : మీరు అందులోంచి తప్పుకున్నాక ప్రభ చాలా పెరిగిందట, అవునా? చీపురుకట్టని సంపాదకుడుగా పెట్టి పత్రికను నడిపిస్తానని ఆ యజమాని అన్నాడట?

నార్ల : అలా పలికింది వాళ్ళ డబ్బు. పత్రిక పెరగడానికి అనేక కారణాలుంటాయి. మత విషయాలకు ప్రాధాన్యం ఇవ్వక పోవడం, హేతువాదం, గాంధీయిజం, విజ్ఞానం, సైన్స్, పరిశోధన; ఇవి పత్రిక లక్ష్యాలుగా నడిపాను. ఆదర్శాలు కల ఎడిటర్ కు ఆ ఆదర్శాలే సంకెళ్ళు.

మధుర : వాస్తవమ్ము నార్లవారి మాట!

నార్ల : నువ్వు ఫాలో అయ్యావా నా పద్యాలు?

మధుర : అవ్వేం పద్యాలండీ? ప్యూర్ ఇమిటేషన్స్ ఆఫ్ వేమన.

నార్ల: నా కవిత్వం నీకు నచ్చలేదన్న మాట.

మధుర : మంచి ఎడిటర్ తిరుగులేని పేరు తెచ్చుకున్నారు. మళ్ళీ కవిగా కూడా నిలబడాలని ఎందుకో ఆరాటం?

నార్ల : జర్నలిజం క్షణికం – అశాశ్వతం. సాహిత్యంలో నిలబడితే గొప్ప.

మధుర : మీ నాటకాల్లో 'పాంచరాత్రం' చాలా గొప్పది. నిలుస్తుంది. ద్రౌపది అయిదుగురు భర్తలతో ఐదు

రాత్రులు గడపడం అనేది గొప్ప ఐడియా.

నార్ల : మరి నా సీత జోస్యం, నరసింహావతారం మాటో.

మధుర : మీ కొత్తగడ్డలో నాటికలు బావుంటాయి. సీత జోస్యంలో రాముడు చాలా వీక్, నరసింహావతారం కొంచెం కృతకంగా ఉంది. పురాణ కథల్ని అలానే చూడాలిగాని అవి నిజంగా జరిగినవని భ్రమించి వాటికి జవాబు చెప్పాలనుకోవడం, ఇలా కాదు ఇలా జరిగిందని రాయడం అంత అవసరమా?

నార్ల :ఎవరిష్టం వారిది. నాకు బ్రామినిజం అంటే పడదు. బ్రాహ్మలంటే కాదు. అసిస్టెంట్లందరూ వాళ్ళే.

మధుర : నార్ల చిరంజీవి మీకేమవుతాడు?

నార్ల : ఏమీ కాదు, అతనో కమ్యూనిస్ట్ కవి.

మధుర : మీకు కమ్యూనిజం అంటే గిట్టదా?

నార్ల : గిట్టదు. ఒకసారి ఓ కమ్యూనిస్ట్ ప్రబుద్ధుడు అన్నాడు "ఈ భూస్వాముల భార్యల మెడలపై కాడివేసి భూమిని దున్నిస్తాం మేం అధికారంలోకి వస్తే" అని. అప్పుడు నాకు కోపం వచ్చి కార్టూన్లయుద్ధం ప్రారంభించాను. అటువైపు నుంచి విశాలాంధ్రలో రాంభట్ల వేశాడు జవాబుగా కార్టూన్లు.

మధుర : తెలుగు దినపత్రికలలో రాజకీయ వ్యంగ్య చిత్రాన్ని ప్రవేశపెట్టిన ఎడిటర్ మీరేనా?

నార్ల : కార్టూన్ యుద్ధాలెన్నో చేశాను. ఎడిటర్ని ఒక ముఖ్యమంత్రి, మంత్రి, రాజకీయ నాయకుడితో సమానంగా నిలబెట్టాను.

మధుర : భూస్వాముల భార్యల మెడలపై కాడివేసి పొలాలను దున్నిస్తామని ప్రగల్భాలు పలికిన కమ్యూనిస్ట్ లెవరు ఎడిటర్జీ?

నార్ల: మాకినేని బసవపున్నయ్య. మార్క్సిస్ట్ పార్టీ పోలిట్ బ్యూరో మెంబరు. ఆయన కమ్యూనిస్టుల్లో అరిస్టోక్రాట్. గోల్డ్ ఫ్లేక్ సిగరెట్టు తప్ప తక్కువ రకం కాల్చేవాడు కాదు. చలాన్ని శ్రద్ధగా చదవమని కమ్యూనిస్ట్ కేడర్లకు రహస్య సర్క్యులర్ జారీ చేశాడు.

మధుర : చలంగారి మీద అంత మోజెల్లా ఏర్పడిందో?

నార్ల : శ్రీశ్రీ మహాప్రస్థానానికి యోగ్యతా పత్రం ఇచ్చాడు చలం. అది చూసి కమ్యూనిస్టులు చలం మా వాడని చంకలెగరేశారు; మాచకమ్మను చూసి సన్యాసి చంకలు గుద్దుకున్నట్టు.

మధుర : విశాలాంధ్ర వారితో గురజాడ మాన్యుస్క్రిప్టు తగువేమిటి? వివరంగా చెప్తారా?

నార్ల : గురజాడ వ్రాతప్రతులు డైరీలు అన్నీ విశాలాంధ్రవారి వద్ద ఉన్నాయి. అవి గురజాడ వెంకట రామదాసు నుంచి కొన్నారనుకుంటా. ఆ రామదాసు సరైన సాహితీ వారసుడు కాదు. గురజాడ లైబ్రరీ అంతా సెకండ్ హ్యాండ్ పుస్తకాలుగా అమ్మేశాడు విజయనగరంలో. నేను సాహిత్య

అకాడమీకి గురజాడ మీద మోనోగ్రాఫ్ రాస్తూ, ఆ గురజాడ మాన్యుస్క్రిప్ట్లు చూస్తే మంచిదని కాట్రగడ్డ రాజగోపాలరావును అడిగాను ఒకసారి చూస్తానని. ఆయన ఆ ట్రంకు పెట్టెల్ని మా ఇంటికి పంపించాడు భద్రంగా.

మధుర : మీరూ మీ శిష్యుడు పురాణం; విశాలాంధ్ర వారికి వెన్నుపోటు పొడిచారటగదా

నార్ల : నో–నో– అవసరాల సూర్యారావు వాటిని హాండిల్ చేశాడు. బి.య్యే. తెలుగు. ఇంగ్లీషు సరిగా రాదు. అప్పారావుగారు అన్ని డైరీలు, "మైహోన్", "హిజ్ మైనెస్" అని అన్నీ ఇంగ్లీషులోనే రాశారు. అవి అల్లానే ఇంగ్లీషులో అచ్చువేసి ఉండాల్సింది.

మధుర : విశాలాంధ్రవారు ఏం చేశారుట?

నార్ల : ఆ కట్టలన్నీ సూర్యారావు మొహాన పారేశారు. అతను బుడ్డి దీపం వెల్తుర్లో అప్పారావుగారు రాసిన వాటికి కొంత వదిలి కొంత చేర్చి అనువాదాలు చేశాడు. అవన్నీ 'డైరీలు', 'మాటా–మంతీ','కథానికలు','ముత్యాలసరాలు' అంటూ అచ్చయ్యాయి. ఈ పనులన్నీ పూర్తవకుండానే సూర్యారావు పోయాడు.

మధుర : అప్పుడు మీరీ తేనెటీగల తుట్టెను కదిల్చారన్న మాట!

నార్ల: అలా మూలంతో తైపారు వేస్తూ పోతే చాలా దోషాలు కనిపించాయి. ఒకరి రచనలను మూలానికి భిన్నంగా మార్చి అనువదించటాన్ని ఇంగ్లీషులో 'ఫోర్జరీ'లు అంటారు. అప్పటికే సూర్యారావు అనువాదాలు ఆధారంగా ఇంగ్లీషులోకి, రష్యన్ లోకి అప్పారావుగారి రచనలు వెళ్ళి పోయాయి. ఆయనకు తీరని అపచారం జరిగిందని గ్రహించాను.

మధుర : అవును. విశాలాంధ్రవారు సూర్యారావుకి అప్పగించారే కాని ఆ అనువాదాలు ఎలా ఉన్నాయన్నది వారు పట్టించుకోలేదు. అలా మహాకవికి అపచారం జరిగిపోయింది.

నార్ల : సూర్యారావు ఇదంతా తెలిసి చేయలేదు. అతనికి సరిగా ఇంగ్లీషు రాదు; అంతే. బ్రింజాల్స్ అంటే పచ్చిమిరపకాయలు అని రాశాడు. Called on him, called అన్న ప్రయోగాలకి అర్థం తెలియక "His Highness Called him' – "Apparow called on His highness" అన్నదానికి తప్పుగా రాశాడు. డైరీల్లో కొన్ని కొన్ని దాటవేశాడు.

మధుర : కోతికి కొబ్బరికాయ దొరికినట్లు మీకు ఇంత అవకతవకల గ్రంథం దొరికింది. ఐతే, మీరు విశాలాంధ్ర వాళ్ళతో సంప్రదించాల్సింది, ముందుగా,.

నార్ల: నాకు ఓపిక లేక ఈ అవకతవకలు ఫోర్జరీల గురించి నా అసిస్టెంటు పురాణాన్ని దినపత్రికలో వ్యాసాలు రాయమన్నాను. పైగా ఈ డైరీలన్నీ సరిగ్గా మళ్ళీ రాయించటం టైపు చేయించటం ఈ పనులు అవసరమయ్యాయి. ఒక ఆర్నెల్లకి పైగా వాటిమీద నా అజమాయిషీలో, పాటిబండ్ల

సుందరరావు, గొల్లపూడి మారుతీరావు, కె.వి. రమణారెడ్డి, తుమ్మల వెంకట్రామయ్యగార్లు పనిచేశారు అదీ, ఆ క్షాళన కార్యక్రమం.

మధుర : విశాలాంధ్రవారు జవాబులు రాయలేదా? ఊరుకున్నారా?

నార్ల: ఏటుకూరి బలరామమూర్తిగారు పురాణం హెల్పుతోనే 'జవాబు వ్యాసాలు' రాశారు. వీళ్ళంతా స్నేహితులే, విరోధాలేం లేవు మాకు.

మధుర : మీరు ఆంధ్రజ్యోతిలో 'ఫోర్జరీలు' అని కాంట్రవర్సీ లేవదీయడంవల్ల కమ్యూనిస్టులకి కళ్ళెర్రబడ్డాయన్నమాటా?

నార్ల : కన్నెర్రకాకేమీ? నేను వాళ్ళ వద్దనుంచి రాత ప్రతులు తెచ్చి వాళ్ళకన్నే పొడిచానని!

మధుర : మీ గురజాడ మోనోగ్రాఫ్ సంగతేంటి, మరి?

నార్ల: పూర్తిచేశా. పుస్తకం వచ్చింది.

మధుర : కీర్తి మీకూ అపకీర్తి పురాణానికి వచ్చి ఉంటుంది. తడిక తోసిన వాడిదేగదా తప్పు అంతా. (మధురవాణి నార్లవారి లైబ్రరీలో పుస్తకాలను చూస్తూ మాట్లాడుతూ ఉంటుంది. నార్ల పుస్తకాలపై డస్ట్ దులుపుతూ మళ్ళీ అరల్లో సర్దుతూ ఉంటారు.)

మధుర : గ్రంథచౌర్యం మీకు బాగా తెలుసంటారు. నిజమేనా?

నార్ల : ఒక శబ్దాన్ని ప్రయోగించేముందు దాని అర్థం తెలుసుకుని మాట్లాడడం మంచిది.

మధుర : తెలుసుకోడానికి ఇందులో ఏముంది? పుస్తకాలు దొంగిలించడాన్ని గ్రంథచౌర్యం అంటారు కదా!

నార్ల : గ్రంథచౌర్యం అంటే : ఏదైనా ఒక ప్రసిద్ధకవి రచయిత రాసినదాన్ని మరొకరెవరైనా తన పేర ప్రకటించుకున్న తరువాత నాలాటి ఎడిటర్స్ కి దొరికిపోతే గ్రంథచౌర్యం అంటారు. అది తెలుసుకోముందు!

మధుర : పుస్తకాల దొంగల్ని గ్రంథచోరులు అనకూడదా?

నార్ల : నా లైబ్రరీ చూస్తూంటే నీకు మధ్యన వాళ్ళెందుకు గుర్తుకొచ్చారు?

మధుర : ఇవన్నీ మీరు కొన్నవేనా లేక సంగ్రహించి తెచ్చినవా?

నార్ల : నాదగ్గర రెండురూపాయలుంటే ఒకరూపాయి తిండికి ఖర్చుపెట్టి, ఒక రూపాయితో పుస్తకం కొన్నాను.

మధుర : శ్రీశ్రీగారి దగ్గర రెండు రూపాయలుంటే (తాను పస్తుండి) రెండు రూపాయలూ పెట్టి పుస్తకం కొని చదివాడటగా పాపం!

నార్ల : నేను కష్టపడి ఇంత లైబ్రరీ సేకరించాను.

మధుర : తేనెటీగలు మధువును కూడబెట్టినట్లు... అయితే ఇంతకీ ఇవన్నీ కొన్నవేనా అని?

నార్ల: నీకెందుకా అనుమానం?

మధుర : ఇన్ని పుస్తకాలు చదవాలంటే మానవ మాత్రుడివల్ల అయ్యే పనేనా? మీరు మానవులా, కంప్యూటరా?

నార్ల: నేను నీ కంటికెలా కనిపిస్తున్నాను?

మధుర : ఎడిటర్ వేషం వేసుకున్న శ్రీకృష్ణుడిలా ఉన్నారు.

నార్ల : కృష్ణుడేవిటి? భగవద్గీత అంటేనే నాకు పడదు. (నవ్వి) పుస్తకాలు సేకరించటం నా హాబీ. **మధుర**: శ్రీశ్రీగారు; పేదకవి.

నార్ల : అతగాడు నావద్ద సబ్ ఎడిటరుగా కొన్నాళ్ళు ఆంధ్రప్రభలో వెలిగించాడులే ఉద్యోగం. నేను ఎడిటరుగా ఉండగా నామీద వ్యంగ్యరచనలాటిది నాకు తెలియకుండా చేయించి నా పేపర్లో వేశాడు. వెంటనే పీకిపారేశా. అందుకే 'శ్రీ' అంటే విషం; 'శ్రీశ్రీ' అంటే విప్లవం అన్నా అతగాడి షష్టిపూర్తికి.

మధుర : శ్రీశ్రీ అంటే మీకు పడదా? కమ్యూనిజమా, పేదలా; మీకు గిట్టనిది?

నార్ల : అతగాడి పద్యాలన్నీ దేనికో దానికి కాపీలు. ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహాలు, "Where are the snows of yester years" కి కాపీ. 'తాజ్ మహలు నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?' యీ ఐడియా కూడా బోర్టోల్డ్ బ్రెక్ట్ అనే జర్మన్ కమ్యూనిస్ట్ కవి రచనలకు ప్రతిధ్వనులే. బేసిక్ గా అతడికి నిజాయితీ లేదు.

మధుర : రామ రామ! ఎడిటర్లింత నిర్దయగా ఉండగలరని మిమ్మల్ని చూసే గ్రహించాను. మీరు ఎవర్నీ నమ్మరు. ఎవర్నీ గుర్తించరు. అందుకే మిమ్మల్ని *'పెసిమిస్టు'* అన్నాడు మహాకవి.

నార్ల : ఈ ప్రపంచమే నాలాంటి కొందరిని పెసిమిస్టులుగా మార్చేసింది. అంతా వంచనే, అందరూ దొంగలే.

మధుర : మీరు గొప్ప ఎడిటర్ అని అనుకోవడంలో తప్పు లేదు. నిస్సందేహంగా అంతవారే కాని – మీకు కోపంరాకుండా ఉంటే ఒక్కమాట.

నార్ల : అడుగు అమ్మీ! సందేహిస్తావు దేనికి?

మధుర : ఏమీలేదు. మీరు ప్రభలో మానేసినపుడు (అదే, మానేసి ఇవతలకు వచ్చినపుడు) ఆ సర్క్యులేషన్ అంతా మీ వెనకాల వస్తుందనుకున్నారు, అవునా?

నార్ల: అదంతా నేను నా ప్రతిభతో సంపాదకీయాల్తో, శీర్షికల్తో బిల్డప్ చేసినదే.

మధుర : కావచ్చు. ఒక పత్రిక విజయానికి దాని వెనుక ఉన్న యంత్రాంగం యజమానుల డబ్బు కూడా కారణమని మీరు తెలుసుకోలేదు. తెలుసుకున్నా గుర్తించ నిరాకరించారు. అదే తప్పు మీరు ఆంధ్రజ్యోతి విషయంలో కూడా చేశారు.

నార్ల: అంటే నీ ఉద్దేశం?

మధుర : పాటిమానికా తెల్లబియ్యమూ, మీరు వెళ్ళాకే ఆ పత్రికలు అన్నీ కూడా బ్రహ్మాండంగా పెంచుకున్నాయి సర్క్యులేషన్లు.

నార్ల: నేను న్యూస్ కోసం ప్రకటనల్ని పీకించేవాడ్ని. నేను స్టోన్ దగ్గరుంటే మేనేజర్లు గడగడలాడేవారు.

మధురవాణి : మీ రెంతసేపూ మీ ఇమేజికోసం చూసుకున్నారేగాని యజమాని బాగోగులు పట్టించుకోలేదు. ధనికులు మీకు అండగా ఉన్నా, వారికి మీరు అడ్డంగా తయారయ్యారు.

నార్ల : యజమానుల చేతుల్లో పత్రికలు ప్రజలపక్షం వహిస్తున్నట్లు నటిస్తూ వ్యాపారవర్గాల కొమ్ము కాస్తాయి. అదే మన దురదృష్టం. వారి డబ్బు వాడుకోవాలిగాని వారికోసం పనిచేయరాదు.

మధుర : మీరు కాంగ్రెసుని వ్యతిరేకించారు – ఇందిరా కాంగ్రెస్ అంటే పడదు. కమ్యూనిస్టులను మునుపే వ్యతిరేకించారు.

నార్ల: చివరకు ఎన్.టి.ఆర్ని అభిమానించాను; ఉత్తినేకాదు.

మధుర : ఎన్.టి.ఆర్.కు చెప్పి అకాడమిలని రద్దు చేయించడం శాడిస్టిక్ చర్యకాదా? అయినా మీరు ఎడిటరే కాని పండితులూ కవీ కారుగదా బెజవాడ గోపాలరెడ్డిగారు అన్నట్లు.

నార్ల : బెజవాడ గోపాలరెడ్డి మీద కోపంతోనే అలా చెయ్యాల్సివచ్చింది.

మధుర : కోతి పిల్లిచేత పొయ్యిలో పనసగింజలు తీయించినట్లు అయింది చివరకు.

నార్ల : (నవ్వి) స్ట్రాట్ ఫర్డ్ ఆన్ ఆవన్, షేక్స్పియర్ జన్మస్థలంలో ఆయన విగ్రహం మధ్యన పెట్టి చుట్టూ షేక్స్పియర్ మహాకవి నాటకాలలో పాత్రల విగ్రహాలను నిలబెట్టి షేక్స్పియర్ పార్క్ కట్టారు. అలా గురజాడనూ నిన్నూ మధ్యన నిలబెట్టి కన్యాశుల్కంలోని పాత్రలతో ఓ కన్యాశుల్కం పార్క్ ప్రతి ఊళ్ళోనూ నిర్మించాలి.

మధుర : మీరు ఐడియా పురుషులే, కాస్త బుద్ధివంకర గాని, పోనీ సెనిలిటీ అనుకోండి చివరికి.

నార్ల : నీకు ఎందుకో నామీద సదభిప్రాయం లేనట్లుంది.

మధుర : మీరు యాంటీ నాచ్ కదా! గురజాడ, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారూ యాంటినాచ్ కారు. "వేశ్యాకులం ఎందుకోసం పుట్టిందీ" అని చక్కని వ్యాసం రాశారు, మహానుభావులు. ఆయన్నేదో అన్నారట మీరు... (నవ్వు)

నార్ల: ఆయన పంచెలో షర్టుదోపి పైన కోటు వేసుకునేవారు. 'తెలుగుకథకుల్లో కోటీశ్వరుడు మీరొక్కరేనండీ' అన్నా.

మధుర : దానికాయనే వన్నారు?

నార్ల: 'మిగతా దరిద్రుల మాట నన్నడక్కండి' అన్నారు.

మధుర : మీరున్నకాలం కూడా అల్లాటిది. మీరు సాహిత్య కళా రాజకీయ తదితర రంగాలన్నిటా

'జయింట్స్' మధ్య ఉన్నారు. ఇప్పుడంతా లిల్లిపుట్స్.

నార్ల : ఈ మాట ఒప్పుకున్నావుగదా! నా పేచీ అంతా ఏ మోరల్స్ లేని పరిపాలకులూ రాజకీయాలమీదే.

మధుర : ప్రజాస్వామ్యం పోయి అగ్లీ ధనికస్వామ్యం వచ్చింది. నేటి దినపత్రికలూ రాజకీయ పార్టీలూ; ఆశయాలలో భేదాలవల్ల విడిపోవడంకాక, నిస్సిగ్గుగా కులాల వారీ వర్ధిల్లుతున్నాయి. వార్తల్ని అమ్మకపు దృష్టితో రాయిస్తున్నారు. ప్రకటన కర్తల శాసనం పత్రికల మీద చెల్లుతోంది.

నార్ల : దీన్నే మార్కెట్ ఎక్స్ పాన్షన్ అంటున్నారు నకిలీ ఎడిటర్సు.

మధుర : జన్మలో పత్రికల మొహంచూడనివారు పత్రికలు పెట్టి అగ్రశ్రేణిలో వర్ధిల్లుతున్నారు. కదా! దీన్ని మీరేమంటారు?

నార్ల : డబ్బు పెట్టి అన్నీ కొనగల్గుతున్నారంటాను. ఏ విలువలూ లేని వినియోగదారుల సమాజం వచ్చింది. సంస్కృతి, కళలు, సాహిత్యం వేటితో దానికి అనుబంధంలేదు. మన మధ్య తరగతి కూడా అమెరికనైజ్డ్ అవుతోంది పూర్తిగా.

మధుర : గిరీశంగారు అమెరికా వెళ్ళిపోతారట.

నార్ల : గిరీశంలాంటివారు అక్కడ లేరాయేమి?

మధుర : గిరీశంగారు ఎడిటరయితే?...

నార్ల: గిరీశాలూ, వెంకటేశాలూ ఎడిటర్లయితే పూటకూళ్ళమ్మ పబ్లిషరవుతుంది.

మధుర : అంతకంటె ఏమీరానివాళ్ళు పత్రికా సామ్రాజ్యాన్ని ఏలుతుండగా గిరీశానికేమి లోటు వచ్చింది?

నార్ల : నువ్వు చెప్పింది అక్షరాలా నిజం. కొత్తగా పత్రిక పెట్టిన ఒక శ్రీమంతుడు "ఎడిటోరియల్స్ సంపాదకుడే ఎందుకు రాయాలి?" అన్నాడు. కాలేజీ మాస్టర్ల చేత సినిమా రైటర్స్ చేత ఎవరిచేత పడితే వారిచేత రాయిస్తాను ఎడిటోరియల్స్ అని అలాచేశాడ్ట!

మధుర : ధనికస్వామ్యం ప్రతిదాని కంటె sanctity (పవిత్రతను) ధ్వంసం చేసి ఆనందిస్తుంది. అది దాని శాడిజం.

నార్ల: బైబిల్లో సూక్తివినలేదా?

మధుర : ఏవిటిది?

నార్ల : సూది బెజ్జంలోంచి ఒంటె దూరిపోగలదుగాని భగవంతుని సామ్రాజ్యంలోనికి ధనవంతుడు ప్రవేశింపజాలడు.

మధుర : సెక్సు అమ్ముతుందంటే సెక్సు, షేర్లు అమ్ముతాయంటే షేర్లు, రాజకీయాలమ్ముతాయంటే రాజకీయాలు, సినిమా అమ్మితే సినిమా, ఏది అమ్ముడయితే అది ప్రచురించే పత్రికలు వచ్చి ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యం చేశాయి.

నార్ల: అందుకే నా లోపాలు కోపాలు ఎలాటివయినా, నా తదనంతరం నా రెలవెన్స్ అధికమయింది, అది నువ్వు తెలుసుకో.

మధుర : భోజన సందర్భంలో మీకు ఇష్టమైన ఆధరువులు ఏవిటి?

నార్ల : కాల్చిన వంకాయపచ్చడి, పచ్చిపులుసు; ఇవంటే నాకు మహా ఇష్టం. బంగాళాదుంప,పచ్చి బటానీ, టొమాటో, క్యారెట్ మొదలైనవి ఎక్కువ రుచిగలవైనా అవి తింటున్నపుడు తృప్తి తప్ప రియాక్షన్ రాదు. ఇవన్నీ ఎందుకిప్పుడు?

మధుర : మీ ఎడిటోరియల్స్ ఒకప్పుడు అల్లాగుండేవి. మరి మీ గ్రీవియన్స్ ఏవిటి?

నార్ల : మహాకవినని, మహా రచయితనని ఇచ్చకానికైనా నన్ను మెచ్చుకున్నవారు లేరు. ప్రొఫెషన్లోని వాళ్ళే నన్ను కించపరచారు కావాలని.

మధుర : మీకు బాగా నిద్రపడుతుందా? అదే; మీ ఆరోగ్యం బావుండేదా అని!

నార్ల : అదేమి పాపమో, నాకు త్వరగా నిద్రపట్టదు. ఒకసారి పట్టినా ఒకపట్టాన మెలుకువరాదు. అదీ ఓ ఆరోగ్యమేనంటాను.

మధుర : ఎవరి బలహీనతల్ని వారు సమర్థించుకుంటారని గిరీశంగారు అనేవారు. మీరు పరధ్యాసను కీర్తించారు. మీకు అది ఎక్కువా?

నార్ల : ఆలోచనాపరులకి ఏకాగ్రత ఒక (సుగుణం) virtue. ఒక విషయం మీద మనస్సు ఏకాగ్రంగా ఉంటే ఇంకోదాని మీద శ్రద్ధ తక్కువవుతుంది. దాన్నే నువ్వు పరధ్యాస అంటున్నట్టుంది... నిజానికి నాకు పరధ్యాస తరచుగా సంభవించేదే. సిగరెట్ ముట్టించిన వెంటనే పరాకుగా పారవేసి కొత్తదాన్ని ముట్టించడం, కాల్చుతున్న సిగరెట్టుతో కట్టుగుడ్డలు కాల్చుకోవడం నాకు చాలా సార్లయింది. తిండి తిన్నదీ తిననిదీ తరచు జ్ఞాపకం లేకపోవడం నాకు చాలాసార్లయింది. కొన్న గంటలోపల గొడుగుపారవేయటం, రోజున్నర లోపల ఫౌన్టెన్ పెన్ జారవిడవడం నా రికార్డు. పోస్ట్ బిళ్ళలను డబ్బాలోవేసి, ఉత్తరాన్ని వెనక్కి భద్రంగా తెచ్చిందిమాత్రం ఒక్కసారే.

మధుర : పోయిన నిన్న గురించి, పుట్టని రేపుగురించి దిగులు పడక నేటి మాధుర్యాన్ని నేడే గ్రోలాలి. మీరు కలుపుగోలుగా ఉంటారా?

నార్ల : పలకరిస్తేనే తప్ప పలక్కపోవడం నాకు పరిపాటి. ఇంగ్లీషు చదువులవల్ల కొన్ని ఇంగ్లీషు సంప్రదాయాలు వంటబట్టడం ఇందుకు కారణం కావచ్చు.

మధుర : మీరు నాస్తికులూ భౌతికవాదులూ కావడంవలన మీరు నిర్వహించిన పత్రికలు నష్టపోయాయంటారు.

నార్ల : అయినా నేను సంస్కృతికి దూరం కాలేదు. నా భావాలు కొన్నిటిని మాత్రం నాకే పరిమితం చేసుకున్నాను.

మధుర : మీరు ఎడిటర్ గదా – పత్రిక విజయవాడలో ఉండగా అక్కడ్నుంచి బిచాణా ఎత్తేసి

బంజారాహిల్సులో 'లుంబిని'కి వచ్చేసారుట అవునా?

నార్ల : 'లుంబిని' నేను కట్టుకున్న ఇల్లు. సొంత ఇంట్లో ఉండాలని ఎవరికి అనిపించదట?

మధుర : అదే మీరుచేసిన పెద్దపొరపాటు. మీరు లేకుండా పత్రిక వస్తుందని యాజమాన్యానికి సిబ్బందికీ రుజువుచేశారు. ఇక ఎడిటర్ ఒకవయిటెలిఫెంటే కదా –

నార్ల : నా జీవితం చరమాంకం అంతా ఫ్రస్ట్రేషన్తో గడిచింది. బాల్యంలో గూడా చాలా బాధలు పడ్డాను. స్వంతంగా కష్టపడి నా స్థితిని నేనే సాధించుకున్నాను.

మధుర : ఉద్యోగ విరమణ కూడా సంతోషంగా జరగలేదుగా?

నార్ల : మేం చేసింది ఉద్యోగంకాదు. నడిపింది ఉద్యమం. మా సేవల్ని ఎవరూ రూపాయి అణాపైసల్లో, కొలవజాలరు.

మధుర : ఇప్పుడు జరుగుతున్నది అదేలెండి. అప్పుడు గనక అలా జరిగింది; ఈ ఎలక్ట్రానిక్ యుగంలోని జర్నలిజాన్ని చూడకుండా వెళ్ళిపోయిన మీరు ధన్యులు.★

(మిసిమి మాసపత్రిక – అక్టోబరు, నవంబరు 1992 సౌజన్యంతో)

పురాణం సుబ్రహ్మణ్యశర్మ *(1929–2001) తెలుగు పత్రికా రంగంలో సుప్రసిద్ధులు. నార్ల కోరికపై రైల్వే జాబ్ రిజైన్ చేసి ఆంధ్రజ్యోతి వారపత్రికకు ఎడిటర్ గా చేరి, దాన్ని ఉన్నత పథాలలో నడిపారు. చమత్కారంగా రాయడంలో దిట్ట. చలం జీవితం, సాహిత్యంపై పరిశోధనాత్మక రచన చేశారు. 'ఇల్లాలి ముచ్చట్లు' వీరి ప్రశస్థ రచన. వీరి కథ. 'నీలి' ప్రపంచ కథాసాహిత్యంలో చేరింది. కథాసాగరం, కలకానిది, శివకాంత వీరికథా సంకలనాలు.*



ఆంధ్రజ్యోతి రజతోత్సవ సంచికలో నార్ల ప్రస్తావన లేకపోవడం

విజయవాడ నుండి 25 సంవత్సరాలుగా వెలువడుతున్న ఆంధ్రజ్యోతి దినపత్రిక రజతోత్సవం జరుపుకున్నది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీనండూరి రామమోహనరావు సంపాదకత్వాన చక్కనికూర్పుతో అనేక ప్రత్యేక వ్యాసాలతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక సంచిక 1985 జులైలో ప్రచురించారు. ఇందులో కొన్ని సాహిత్యపరమైన వ్యాసాలు శాశ్వతత్వాన్ని ఆపాదించుకుంటున్నవి. ఈ పత్రికను స్థాపించి, 16 సంవత్సరాల పాటు నిర్విరామ సంపాదక కృషిచేసిన కీ. శే. నార్ల వెంకటేశ్వరరావు గురించి ఎలాంటి ప్రత్యేక ప్రస్తావన లేకపోవడం పెద్దవెలితి. అంతేగాక "వెరపు" లేదనిపిస్తున్నది.*(ఉదయం దినపత్రిక 22-7-1985).*

తెలుగుజాతి వెలుగురేఖ 'నార్ల'

–ఎమ్మెస్వీ సత్యనారాయణబాబు, గుడివాడ



సమగ్ర భారత సౌభాగ్యానికి ఊపిరిలూదిన ఓ నార్లా,
తెలుగు జాతికీ వెలుగురేఖవై నిలిచినావు నిలువెల్లా ॥సమగ్ర॥
స్వతంత్ర భారత సంగ్రామంలో వీరసింహమై దూకావూ
స్వరాజ్యమే నా జాతి ధ్యేయమని ఆయుధాన్నే పట్టావూ
జైలు గదుల్లో కత్తికన్నా కలమే పదునని తలిచావూ
ప్రజాహితంతో పాత్రికేయునిగా అక్షర యుద్ధం సలిపావూ ॥సమగ్ర॥
సస్యశ్యామల దేశ ప్రగతికీ నవీనరీతులు వెదికావూ
ప్రతి ఉదయం నీ సంపాదకీయం ప్రజలకు పాఠం చేశావూ
భాషా సంస్కృతి చైతన్యంతో పత్రిక దిశనే మార్చావూ
ప్రపంచమంతా కీర్తించేలా తెలుగుపలుకునే చాటావూ ॥సమగ్ర॥
జనం గుండెనూ జాగృత పరిచే నాటక రచనలు కూర్చావూ
జనుల కోసమే ప్రజాపదవులని పార్లమెంటులో చాటావూ
తెలుగునేలపై మూస పత్రికల బాణీనే కడతేర్చావూ
కొత్త ఆత్మతో ఆంధ్రుల శైలిని అతి జాగ్రత్తగా దిద్దావూ
విద్యకోసం... సజ్జనుల కోసం... ప్రగతి కోసం... 'ప్రభ'ల 'జ్యోతి'కోసం ॥సమగ్ర॥

పత్రికనే ఓ ప్రపంచగతిగా – శక్తియుక్తులే జీవనశ్రుతిగా –
అనుసంధానం చేసినవాడా అలుపెరుగని ఓ కలంవీరుడా
ఆశ్రయించెనూ నీ ప్రతిభకు మూడు డాక్టరేట్లు ముచ్చటగా
ఆదరించెనూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సగర్వంగా
తియ్యనైనా తెలుగుపదాలను కొత్తకొత్తగా పలికావూ ॥సమగ్ర॥
పత్రిక జగతిలో తిరుగులేనీ...ధ్రువతారగా నీవూ వెలిగినావూ
గెలిచినావూ... జాతిసిగలో నిలిచానావూ
దేశఖ్యాతినే నిలిపినావూ... ఆంధ్రజాతినే నడిపినావూ
నాటికీ–నేటికీ–ఏనాటికీ నిలిచిపోయెగా నీ మాటా
'నార్లవారి మాట–నవయుగాల బాట" అనీ. ॥సమగ్ర॥

నార్ల విశ్వమానవ దృష్టి

–డాక్టర్ మండలి బుద్ధప్రసాద్
పశు సంవర్ధక, మత్స్యశాఖామాత్యులు, ఆంధ్రప్రదేశ్.



తెలుగు పత్రికా రంగంలోనే కాదు, భారత పత్రికారంగంలో నార్ల ఒక ధ్రువతార. నింగికెగసిన ఒక తరంగం. పత్రికా నిర్వహణలో వారు ఎదుర్కొన్న సవాళ్ళు, ఎదురు నిలచి విజయం సాధించిన తీరు అనుపమానం. చివరి క్షణం దాకా పత్రికా నిర్వహణలో విలువలు నిలిపిన తీరు అనితర సాధ్యం.

నార్ల గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చారు. గ్రామ ప్రాంత ఏలుబడిని, పదజాలంలో సూటిదనాన్ని బాగా వంటబట్టించుకున్నారు. 'కొత్తగడ్డ' నాటికల సంపుటిలో వారు ప్రయోగించిన భాష ఇందుకు బలమైన సాక్ష్యం. అలాగే తన సంపాదకీయాలు అదే భాషా సౌరభంతో ప్రారంభించి విశేషంగా మెరుగులు దిద్దారు, కొత్త సొబగులు సమకూర్చారు. ఎక్కడా సంకోచింపలేదు, మొహమాటపడలేదు. పత్రికా స్వేచ్ఛకు పట్టం గట్టిన సంపాదకుడు నార్ల. తెలుగు జాతికి వెలుగు రేఖగా నిలిచారు. ఒక ప్రముఖుడు పొరపాటు చేస్తే, కఠిన పదజాలంతో మందలించిన సందర్భాలు, జనహితమైన కార్యం సజావుగా నిర్వహిస్తే – హర్షించిన సందర్భాలు అపారంగా ఉన్నాయి. గాంధీజీ హత్య గావింపబడినపుడు వీరు వరుసగా రాసిన 12 సంపాదకీయాలు ఆర్ద్రతంగా హృదయాలను కుదిపివేస్తాయి.

"అబ్బ ఎంత చీకటి! గుండెలపై ఎంత పెద్దరాయి!! ఊహు! ఇక రాయలేము. చేతినుంచి కలం జారి..." ఇలా మరొకరు రాయలేదు. అలా రాయడం నార్లవారికే చెల్లు.

నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణం ముక్త్యాల రాజాగారి పుణ్యమే. కాని నాగార్జునసాగర్ డ్యాముకు భారత ప్రధాని జవహర్లాల్ నెహ్రూ శంకుస్థాపన చేస్తున్న సందర్భంలో ముక్త్యాలరాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్ కు ప్రభుత్వం నుంచి ఆహ్వానం రాని సందర్భంలో, నార్ల రాసిన సంపాదకీయం మనలను కలచివేస్తుంది. ఇలాటి సంపాదకీయాలు వారి సహస్రాధికం ఉంటాయి. రాయలసీమ కరువు కాలంలో పత్రిక ద్వారా విరాళాలు సేకరించి ఆర్తులను ఆదుకొన్న ఘనత వారిదే.

సాహిత్యవేత్త నార్ల శతజయంతి సందర్భంలో పలు కార్యక్రమాలు ప్రారంభమైనందుకు ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వం అత్యుత్తమ జర్నలిస్టుకు లైఫ్ టైమ్ అఛీవ్ మెంటు అవార్డు క్రింద ఏటా ఒకరికి మూడు లక్షల రూపాయలు పురస్కారం అందజేయనుంది. నార్ల దాదాపు పాతికేళ్ళ పత్రికా రంగంలో గడిపిన విజయవాడలో వారి కాంశ్య విగ్రహం నెలకొల్పే ప్రయత్నం జరుగుతుంది. అంతేగాక విజయవాడలోని కవితా నిలయం (కవి సమ్రాట్ విశ్వనాధ సత్యనారాయణ నివసించిన గృహం) నుంచి కథానిలయం (శ్రీకాకుళంలోని కథా నిలయం గ్రంథాలయం) వరకు సాహితీ యాత్రకు మిత్రులు డాక్టరు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రూపకల్పన చేశారు. నార్ల శతజయంతి సభలు రాష్ట్రంలో పలు పట్నాలలో, నగరాలలో జరపడం వారి కృషికి నిదర్శనం. ఇంతగా ప్రజాదరణ పొందిన నార్ల చిరస్మరణీయులు.★

రచయిత– డా. **మండలి బుద్ధప్రసాద్**. *సంస్కృతీ సంపన్నులు, మాజీ విద్యామంత్రి, మండలి వెంకట కృష్ణారావుగారికి తగిన పుత్రులు. ఒకవైపు రాజకీయరంగంలో ఒక్కోమెట్టు ఎదుగుతూ, తన తండ్రిగారి వలె సంస్కృతీ రంగాన్ని ప్రభావితం చేస్తున్న సజ్జనులు. తెలుగునాట జరిగే ప్రతి సంస్కృతీ సంబరంలో వారి పాత్ర ఘనంగా ఉంటుంది. తెలుగు భాషకు కేంద్ర ప్రభుత్వంచే ప్రాచీన హోదా, గుర్తింపు రావడం వారి కృషి ఫలితమే.*★

నల్ల డబ్బు



సంపద సమకూడ సంస్కృతి రాబోదు,

పదవి ననుసరించి ప్రజ్ఞ రాదు,

ఖర్చు పోయినంత ఖ్యాతియు రాదురా!

నవయుగాల బాట నార్ల మాట

నార్లవారితో నారాయణరెడ్డి



అమెరికాలోని 'హోస్టన్' నగరంలో బైపాస్ ఆపరేషన్లను తట్టుకుని, ఆరోగ్యంగా హైదరాబాదు నగరానికి తిరిగివచ్చిన మిత్రులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి చిన్నపరెడ్డిగారిని పలకరించడానికి నేనూ, జస్టిస్ చలమేశ్వర్ వెళ్లాం. కుశలప్రశ్నల తర్వాత, అమెరికాలోని తెలుగువాళ్లు తమ భాషా సంస్కృతుల్ని కాపాడుకోటానికి పడుతున్న తపనను గూర్చి ముచ్చటించుకున్న తర్వాత, ఇంటికి తిరిగొస్తుంటే అనిపించింది ఆ పక్కనే ఉంటున్న నార్లవారిని చూడాలని.

నేను చూసిన నార్ల రూపం మారినట్టనిపించింది. ఒత్తుగా పెరిగిన మీసంతో, గుబురు గడ్డంతో ఉన్న నార్లను చూసి 'అనారోగ్యంగా ఉన్నారేమో' అనుకున్నాను. అలాంటిదేమీ లేదు. పలకరించడమే తరువాయి, తళతళ మెరిసిపోయాయి, అనేక జ్ఞాపకాలు సాహితీ దీపికలుగా "మీ విశ్వంభర అందింది. నిన్ననే అభినందిస్తూ ఉత్తరం రాశాను. రేపు మీకందుతుంది." అంటూనే, నార్లవారి మాటలు టాల్ స్టాయ్ మొదలుకొని శ్రీశ్రీ వరకూ విశ్వ ప్రస్థానం చేశాయి. అలవోకగా సముద్ర తీరానికి వెళితే ఆణిముత్యం దొరికినట్టు, సరదాగా నార్లతో కబుర్లు చెబుదామని వెళితే బరువైన విషయాలందించారాయన. మధ్యమధ్య నేను ఏదో చెప్పాలని ప్రయత్నించినా, శ్రవణ యంత్రం ఉపయోగించని నార్లవారు చెబుతూనే పోయారు. "రచయిత తాను రాసిందంతా ప్రచురించాలని అనుకోకూడదు. బాగా వడబోయాలి. మిగిలిన సారాన్నే ప్రచురించాలి. ఓనాడు ఓ రచయిత చాలా సంతోషంగా ఉండడం గమనించి, ఆయన భార్య కారణమడిగిందట. అతడన్నాడట – "మరేం లేదు – నిన్న చేసిన రచనలో అనవసరమైన మూడు శబ్దాలను ఇవాళ తొలగించగలిగాను. అందుకే ఇంత పరమానందంగా ఉన్నాను. – అని

ఈ సృజనాత్మక సాహిత్యం వడపోత రెండు రకాలుగా సాగుతుంది. ఒకటి, ప్రచురించే ముందు రచయిత తానుగా చేసేది, రెండోది, ప్రచురణ తర్వాత కాలం చేసేది. ఈ దృష్టిలో చూస్తే "విశ్వనాధ సాహిత్యం మొత్తం కాలపరీక్షకు ఎంతవరకూ నిలుస్తుందో చెప్పలేం." గుణగణాలమాట అటుంచి, కాలం కుత్తుకలోనుంచి బయటపడ్డ గ్రంథాలు చాలా తక్కువగానే ఉంటాయనే అభిప్రాయాన్ని బలపరుస్తూ, నేను 'మనుచరిత్ర'ను ఉదహరించాను.

"అంతటి ఆంధ్రకవితా పితామహుడు, అల్లసాని పెద్దన్న ఒక్క కావ్యమే రాసి చేతులు ముడుచుకున్నాడా? రాసినవన్నీ రాశికి రాలేదేమో?" అన్నాను. అది వినిపించినట్టున్న నార్ల తల ఊపుతూ, తన గొంతును తదుపరి అంశంవైపు విసిరారు.

"టాల్ స్టాయ్ తెలుసుకదా, ఆయన రాత ఏమీ బాగుండదు. పైగా, ఆయన రాసేది కూర్చుని కాదు. గదిలో పచార్లు చేస్తూ – గదిలో గోడకు ఒక డెస్క్ ను అమర్చుకున్నాడు. తాను నిలబడి రాసేందుకు వీలుగా. అలా ఆయన గీచిన చిత్తు ప్రతికి ఆయన భార్య శుద్ధప్రతి తయారు చేసేది. మళ్ళీ చదివేనాడు టాల్ స్టాయ్ మళ్ళీ వడపోత ప్రారంభం. అది మూడు దఫాలుగా జరిగేది. మూడుసార్లూ సాపురాసేది అర్ధాంగి. అంతటితో వడపోత ఆగేదా? ప్రెస్సులో ఇచ్చింతర్వాత కూడా. "ఫలానామాట మార్చండి, ఫలానామాట చేర్చండి" అంటూ వర్తమానాన్ని పంపేవాడు టాల్ స్టాయ్. ఆంగ్లకవి "ఆర్.వై. కిప్లింగ్" ఓసారి అన్నాడట – "రచయితగా తన విజయాలకు కారణం, తానుచేసిన రచనలను వడబోసి పదోశాతం మాత్రమే ప్రచురించడం."

నార్ల గళం నడుస్తూనే ఉన్నది. వార్ధక్యాన్ని బహిష్కరించిన గళం అది. కాగితం మీద పరిగెత్తే ఓపికలేక, కంఠం రూపంలో పలుకుతున్న కలం అది. మా కళ్ళముందు ఫ్రెంచ్ రచయిత 'బాల్జాక్' నిలిచాడు. నార్ల గొంతులో లలితహాస్యం గోళికాయలాడుకుంది. "బాల్జాక్ జీవితంలో అన్నీ సమస్యలే. చుట్టూ అప్పులే. అప్పిచువాళ్ల దాడిని తట్టుకోవడానికి తాను 'ఇంట్లో లేనని' చెప్పించుకునేవాడు. అలా అప్పులవాళ్ళు గేటు దగ్గరినుంచే తిరిగిపోతూ ఉంటే, తాను హాయిగా కొత్త రచనలకు తలుపులు తెరుస్తూ ఉండేవాడు. ఒక్కొక్కప్పుడు ఆయన ఎత్తులు పారేవికావు. గేట్లోకి రుణదాతలు చొరబడిన సంగతి తెలిసి దొడ్డిదారిన పరిగెత్తుకు పోయేవాడు. తన రచనల అచ్చు ఫారాలకు ఆయన స్వయంగా ప్రూఫులు దిద్దేవాడు. అది దిద్దడం కాదు. ప్రూఫుల రూపమే మార్చడం. ఈ పదం అటూ, ఆ పదం ఇటూ, ఈ వాక్యం అటూ, ఆ వాక్యం ఇటూ – ఈ రకంగా ప్రూఫులు కీకారణ్యంలా తయారయ్యేవి. పారిసులో చాలా కొద్దిమంది ముద్రాపకులు ఆయన రచనలు అచ్చువేయటానికి అంగీకరించేవారు. మూడు నాలుగు రెట్లు ఎక్కువ డబ్బు ఛార్జ్ చేసేవారు కూడా".

ఎందుకో నార్ల గొంతు అమాంతంగా బాల్జాక్ నుంచి శ్రీశ్రీ వైపు మళ్లింది. శ్రీశ్రీ లండన్ పర్యటనను ఏర్పాటు చేసిన డాక్టర్ కృష్ణమూర్తిగారి గురించిన ప్రసక్తి వచ్చింది. లండన్, పారిస్, పర్యటనల తర్వాత ఆ ఉద్దీప్తితో శ్రీశ్రీ కొత్తరచనలేమైనా చేశాడో లేదో అంటూ నార్ల శ్రుతి నలభై ఐదేళ్లనాటి స్మృతిగా ధ్వనించింది. "ఆ రోజుల్లో ఏదైనా కొత్తగా రాయాలని శ్రీశ్రీకి అపారమైన తపన ఉండేది.

విశాఖ నుంచి చెన్నయ్ కు "**క్యారమ్**" ఆటల పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన శ్రీశ్రీ వారం రోజులపాటు నా గదిలోనే ఉండేవాడు. ఈ జేబునిండా ఆ జేబునిండా చిన్న చిన్న ఆంగ్ల కవితా సంకలనాలుండేవి. వాటిని బాగా చదివేవాడు. స్వతహాగా ప్రాచీన సాహిత్యంలో గట్టి పాండిత్యం ఉన్న శ్రీశ్రీకి ఇంగ్లీషు కవితలు చదవడంలో కొత్త భావాలను సమర్థంగా వెలువరించే శక్తి ఏర్పడింది. దేశచరిత్రలు' గేయంలోని 'తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు?.. లాంటి అనేక పంక్తులమీద, ప్రముఖ జర్మన్ కవి 'బెన్సోల్ ' రాసిన "ఎ వర్కర్ రీడ్స్ హిస్టరీ" అనే గేయం ప్రభావం ఉంది. ఐతే, ఆ విషయం శ్రీశ్రీ పేర్కొనలేదు.

("నాకు తెలిసినంతవరకూ దేశచరిత్రలు' గీతం పైన మార్క్స్, ఎంగెల్స్ లు రూపొందించిన కమ్యూనిస్ట్ మానిఫెస్టో ప్రభావం ప్రబలంగా ఉంది. "ఏ దేశచరిత్ర చూసినా..." అనే మొదటి పంక్తులు ఈ మానిఫెస్టో కి అనుసృజనలే. ఈ విషయాన్ని గూర్చి ఆధునికాంధ్ర కవిత్వం" అనే నా సిద్ధాంత గ్రంథంలో విపులంగా చెప్పాను. ఇక నార్ల సూచించిన బ్రెఖ్ట్' ప్రభావం గురించి పరిశీలించాలనే జిజ్ఞాస కలిగింది నాకు. నా దగ్గరే ఉన్న బ్రెఖ్ట్ కవితాసంపుటిని తీసుకుని, ఇంటికొచ్చి, ఆయన పేర్కొన్న గీతం చదివాను ఒకటి, రెండు పంక్తులు, దేశచరిత్రలులోని – పంక్తులను పోలి ఉన్నాయి.

ఉదాహరణకు:

"హూబిల్ట్ సెవెన్ గేట్స్ ఆఫ్ ఏ థెన్స్? ది బుక్స్ ఆర్ ఫిల్డ్ విత్ గేమ్స్ ఆఫ్ కింగ్" అన్నప్పుడు తాజ్ మహల్ నిర్మాణం స్ఫురించవచ్చు. బ్రెఖ్ట్ గీతంలో ఉన్న 'కూలీలు', 'బిలాన్' వంటి నగరాలు, భారతదేశాన్ని దురాక్రమించిన 'అలెగ్జాండర్ – ఇవిగో, ఇలాంటివి చదివినప్పుడు, "దేశ చరిత్రలు'లోని 'రాళ్లెత్తిన కూలీలు, హరప్పా మొహంజాదారోలు, సికిందరు" లాంటివి గుర్తుకు రావచ్చు. ఈ ప్రభావాల కేమిగాని, శ్రీశ్రీ 'దేశచరిత్రలు" గీతం, సమస్త దేశ చరిత్రలకు .. చేసిన కవితాత్మక వ్యాఖ్యానం" సి.నా.రె.)

శ్రీశ్రీ గుర్తుకు రాగానే వార్త గొంతుకు చలం తగలడంలో ఆశ్చర్యమేమీలేదు. "ఒక్కొక్క మాటు చలం, డి.హెచ్. లారెన్స్ ని మక్కికి మక్కి అనుసరించాడు. చలం రచనపైన 'బెర్ట్రాండ్ రస్సెల్ " మ్యారేజ్ అండ్ మోరల్స్ ప్రభావం విపరీతంగా ఉంది. అయినా వీళ్ళనెవర్నీ పేర్కొనలేదు చలం. అతని "దేవుడిచ్చిన భార్య" ఏ ఆంగ్ల నవలకు అనుసరణమో విమర్శకులు పరిశీలిస్తే బయట పడుతుంది".

అప్పటికే నార్లతో నలభై అయిదు నిమిషాలు గడిచాయి. ఆ గొంతు జ్ఞాపకాల మోపును మోస్తూనే నిటారుగా సాగిపోతూ ఉంది. మేమున్న గదిలో, ఎడం వైపు గదిలో, కుడివైపు గదిలో, ఆయన పడక గదిలో, బీరువాలలో క్రమశిక్షణకు అలవాటుపడి ఒరిగి ఉన్న గ్రంథాల బృందాలు.

నార్ల మాటలు వింటూ, తను పుటలను తామే తడుముకున్నాయి. ఊపిరాడని పరిస్థితిలో ఉన్నా. వసంతం గుత్తకు తీసుకున్న వాయువుల్ని పిల్చుకున్నాయి. ఎన్ని వేల గ్రంథాలు! ఎన్ని రకాల గ్రంథాలు? చరిత్ర – మతం – సంస్కృతి – కళలు – సాహిత్యం – తత్త్వశాస్త్రం – రాజకీయ శాస్త్రం – ఒకటేమిటి? ప్రపంచ విజ్ఞానాన్ని గదిలో పట్టి చూపించే విలువైన గ్రంథాలవి. ఈ యాభై ఏళ్లకు పైగా ఒక్కొక్క బొట్టును సేకరించగా ఇన్ని మధుకోశాలు తయారైనాయి. జ్ఞాపకాలు పునర్నవన రూపంలో, పూట ఒలికినవి కొన్ని చుక్కలే నార్లలో ఇంకా మిగిలి ఉన్న తేనె కదులుటను చెలియని కట్టలు దాటిస్తే, ఎన్ని విజ్ఞాన మధురిమలు లోకానికి అందుతాయో! నాలో నేను.. ఇలా ఆలాపించుకుంటూ ఉండగా, శ్రీమతి నార్ల గారన్నారు. "మేమీ ఇంట్లో ఉన్నది ఈ పుస్తకాల కాపలా కోసమేనండీ!" అని నార్ల గారి కొడుకులూ, కూతుళ్లూ విద్యారంగంలో చాలా ఎదిగిపోయారు. విదేశాల్లో స్థిరపడ్డారు. బంజారా హిల్స్ "లుంబిని"లో ఇప్పుడుంటున్నది ఈ రోజున డెబ్బయ్ సంవత్సరాల వయసులోకి అడుగడుతున్న నార్లవారూ వారి శ్రీమతిగారు. వారిద్దర్ని చూస్తూ ఉంటే "మనుచరిత్ర"లోని పద్యభాగం మనసులో మెదిలింది – "దేవియన్ దేవరవోలె " అని. ఈ పోలిక పరమ హేతువాది అయిన నార్లకు ససేమీ రుచించకపోవచ్చు. మొదట అన్నట్టు మళ్ళీ పేర్కొంటున్నాను. ఒత్తయిన మీసం, గుబురు గడ్డంతో, శాలువా కప్పుకుని, దళసరి కళ్లజోడులోంచి విశ్వవాఙ్మయాన్ని విలోకిస్తున్న వార్త, ఒక మిత్రుడు అన్నట్టుగా అక్షరాలా ''నాస్తిక బాబా.''

మంచి మిత్రులు.నార్లకుమంచి మిత్రులు

బ్లాగ్ లో నార్ల

నేడు ముద్రిత వాఙ్మయ పరిధి క్రమంగా ఎలక్ట్రానిక్ మాధ్యమంలోకి మారుతోంది. అంతమాత్రాన ఎలక్ట్రానిక్ మీది తుదిదశ కాబోదు. అది ముద్రిత మాధ్యమానికి అనుబంధమే అనేది విజ్ఞుల అభిప్రాయం. ఇటీవల హైదరాబాదులో నార్ల మిత్రులు ఎన్. ఇన్నయ్య తదితరులు http://narlavr.blogspot.com ద్వారా ఇంగ్లీషులో విశ్వవ్యాప్తంగా గల నార్ల అభిమానులు చదువుకోవడం కోసం బ్లాగ్ ప్రారంభించారు. ఇందు నార్లవారి అరుదైన ఫొటోలు, కొన్ని రచనలు ఉన్నాయి. ఇందు అనతికాలంలో నార్ల రచనలన్నీ చేరతాయి.

ట్రెండ్ సెట్టర్:




మాలతీ చందూర్

1952 ఆగస్టు 15వ తేదీ. ఆంధ్రప్రభ వారపత్రిక మొట్టమొదట ఆరంభమయి – తొలి సంచికలు – స్త్రీలకు ప్రత్యేక శీర్షిక 'ప్రమదావనం ఆరంభమయింది. మా దంపతులం నార్ల గారిని కలుసుకున్నాం. నార్ల గారు సిగరెట్ పీలుస్తూ స్టాండ్ దగ్గర నిల్చుని, ఆనాటి పేపరు ఎలయిన్ మెంటుకి సూచనలిస్తున్నారు. నార్ల గారు మితభాషి, అడవాళ్లతో అసలు మాట్లాడరు. నాకు ఆయనంటే భయం.

"ఏం రాయమన్నారు?" అని నా తలొంచి కిందకు రాస్తూ అడిగాను. "మీ ఆడవారికి ఏం కావాలో మీరే ఆలోచించి రాయండి" అన్నారు రెండే రెండు మాటల్తో అలా ఆరంభమయిన ప్రమదావనం – ఎంత పాపులర్ అయిందో మీ అందరికీ తెలుసు. నార్ల గారు ఏనాడూ మీరు. ఇది ఎందుకు రాశారు? ఇది రాయద్దు' అని అనలేదు. నాకు పరిపూర్ణమైన స్వేచ్ఛ ఇచ్చారు. ప్రమదావన శీర్షిక శీర్షికతో నన్నూ, ఆ శీర్షికను ఎదగనిచ్చారు. ప్రతి రచనా రంగం ఎడిటరే ప్రతిది అలా అలా అంటూ రచయితల అభిప్రాయాలకి విలువ ఇవ్వక ఎడిట్ చేస్తుంటారు.. నార్లగారు అలాంటివారు కాదు. రచయితలని ఎదగనిస్తారు. అందుకోసం కొత్త శీర్షికలకు ప్రోత్సాహం ఇచ్చే అపురూప వ్యక్తి.

లత, కోడూరి కౌసల్యాదేవి, ముప్పాళ్ళ రంగనాయకమ్మ, నాకు ఆంధ్రప్రదేశ్లోని రచయిత్రులకు ప్రోత్సాహం ఇచ్చి వారికి తెలుగు సాహిత్యంలో ప్రముఖస్థానం కల్పించిన ట్రెండ్ సెట్టరు నార్లగారు.

మాకు నార్లగారి కుటుంబంతో సన్నిహిత సంబంధం ఏర్పడింది. ప్రమదావనం' పట్ల, Behind every successful man there is a silent woman అంటారు. అది అక్షరాలా నార్ల గారి భార్య సులోచనగారి విషయంలో నిజం. పిల్లల చదువులు – ఇంటి బాధ్యత, అత్తగారు. నార్లగారి పుస్తకాల వ్యసనం. ఆమె ఎంతో సహనంతో భరించేవారు. నార్లగారి లైబ్రరీ గురించి ప్రతివాళ్లూ గొప్పగా చెబుతారు గాని, సులోచనగారు గృహ బాధ్యతలన్నీ అయ్యాక ప్రతి మధ్యాహ్నం కూచుని ఒక్కో పుస్తకం

బయటకి తీసి – పేజీ పేజీని శొంఠిపొడితో తుడిచి – భద్రపరిచేవారు. కొన్నాళ్లు అయ్యాక ఆయన లైబ్రరీకి – ఇల్లు పట్టక పుస్తకాల కోసం పెద్ద ఇల్లు తీసుకుని అందులో కేవలం పుస్తకాల బీరువాలే ఉంచేవారు.

సులోచనగారు– నార్ల గారి ఆంధ్రప్రభ దినపత్రిక, వారపత్రిక ప్రతి అక్షరం చదివేవారు. చదివి అందులో – అభ్యంతరకరమైన విషయాలు ఉంటే ఆయనకు చెప్పేవాడు. ఒకసారి సుఖవ్యాధుల గురించి – ఒక డాక్టరు గారు రాస్తే, ఆమె చదివి వార్ల గారిని అడిగారు. మీ పత్రిక కుటుంబం అంతా చదివే పత్రికనుకుంటున్నారు. ఇది మనింట్లో డ్రాయింగ్ రూమ్ టేబులుమీద ఉంటే – మీ పిల్లలు చదివితే మీరు ఒప్పుకుంటారా?" అని. వెంటనే అటువంటి శీర్షిక ఆపేశారు.

ఇలా ఎన్నయినా చెప్పుకుంటూ పోవచ్చు. ఆయన పిల్లలు – విద్యావంతులై పెరిగి ఇంత పెద్దవారు అయ్యారు అంటే అందుకు సులోచనగారి పెంపకం! పిల్లల చదువుల పట్ల శ్రద్ధ. ఆ పిల్లలు ఈనాడు తండ్రి రాసిన ప్రతి అక్షరం, అతి శ్రద్ధగా పన్నెండు సంపుటాలుగా ప్రింట్ చేయించారు. ఆ సంపుటాలు చదువుకుంటే ఒక మహా మేధావి, ఒక విజ్ఞాన సముద్రంలోకి ప్రవేశించినట్లు ఉంటుంది. నార్లగారు స్పృశించని విషయం లేదు, చరిత్ర, విజ్ఞానం, ప్రాచీన సాహిత్యం, రాజకీయాలు, లంచగొండితనం ఇలా వేలసంఖ్యలో సంపాదకీయాలు రాసి, ఆంధ్ర ప్రజానీకంలో జ్ఞానతృష్ణ, పఠనతృష్ణ పెంపొందించడంలో ట్రెండ్ సెట్టరే నార్లగారు.

(నార్ల జయంతి సభ ప్రసంగ విషయంలో కొన్ని భాగాలు)

మాలతీ చందూర్. *రచయిత్రి నార్ల సంపాదకత్వంలో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో దాదాపు యాభై సంవత్సరాలపాటు నిరంతరాయంగా* ***ప్రమదావనం*** *శీర్షిక నిర్వహించి. మహిళా లోకంలో చైతన్యం, సామాజిక స్పృహ పెంచారు. వీరి నవల 'హృదయనేత్రి' కి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. దేశం నలుమూలలా శతాధిక సత్కారాలు అందుకున్నారు. వీటిలో విశాఖపట్నం లోక్ నాయక్ ఫౌండేషన్ నుంచి అందుకున్న పురస్కారం విశిష్టమైనది.*★

నార్ల సంపాదకీయాలకు కితాబు

– ఎస్.ఆర్. చందూర్



మహిళలలో మనోస్థయిర్యం కల్పించిన 'ప్రమదావనం'

మహాత్మాగాంధీ ఘోరంగా హత్య గావింపబడినప్పుడు నార్ల 1948 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 12 సంపాదకీయాలు వరుసగా రాశాడు. ఈ సంపాదకీయాలను వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చదివి "ఈ సంపాదకీయాలు ఎవరు రాశారో తెలియదుగాని వారికి సాష్టాంగ నమస్కారం చేయ్యొచ్చు అని అన్నారట! అంతకు మించి నార్లకు మంచి కితాబు ఏముంది?

విజయనగరం మహారాజా కట్టించిన విక్టోరియా పబ్లిక్ హాలులోని చెన్నపురి ఆంధ్ర మహాసభ స్టేజి మీద ఏకాంకిక చదువుతున్నారాయన. ప్రదర్శించవలసినది చదివితే రక్తి కడుతుందా? స్వయంగా చదువుకుంటున్నప్పుడు కూడా కథలూ, నవలలూ మాదిరి నాటికలు సాగవే అన్ని సందేహంతోనే విన్నాను. రెండు కోకలు కొనమని కోరుతూ బియ్యం చెరిగి బెడ్డలు ఏరే భార్య శిస్తు కట్టి వస్తున్నపుడు అర్థణా పొగాకు మర్చిపోయి ఎద్దులకి మువ్వలు కొనుక్కొచ్చిన కొడుకు, నల్లపూసల బంగారం గొలుసు కోసం మారంచేసే కూతురు: కిరాణా కొట్టు అసామి, అప్పిచ్చిన షావుకారు – ఇన్నిటి మధ్యా దయాగుణం కోల్పోక, వాకిట్లోని యాచకునికి గుప్పెడు బియ్యం వెయ్యమని భార్యకి చెప్పే గ్రామీణ రైతు కథ. మర్నాడు వారి ఆఫీసుకెళ్లి పత్రికలో చవేసుకుంటానని అదగ్గా వెంటనే ఇచ్చారు. అప్పటికింకా ఏలూరు నుంచి చెన్నయ్ కు పూర్తిగా నూడలేదు.

నార్లవారిని మొట్టమొదట కలుసుకున్నది ఎస్.జి. ఆచార్య ప్రజాబంధు పత్రిక ఆఫీసులో. సంచలనాత్మకమైన నేటి రష్యా, స్వదేశ సంస్థానాలు అప్పటికే వెలువడ్డాయి. ఖద్దరు పంచె, లాల్చీ కాదు –తెల్లపాంటూ, షర్టును. ఆధునిక తెలుగు పత్రికా లోకంలో ఎస్.బి. ఆచార్య ఒక విశిష్ట. వ్యక్తి – ఎందరికో వెలుగు దివ్వె– కడపటి రోజు దాకా, నార్ల పట్ల ఎంతో అభిమానంగా ఉండేవారు. ఇండియన్ ఎక్స్ ప్రెస్ గ్రూపువారు అంటే రామనాధ్ గోయెంకా ప్రారంభించిన "ఆంధ్రప్రభ దినపత్రికకు ప్రథమ సంపాదకులు ఎమ్మెల్సి న్యాపతి నారాయణమూర్తి. 'బాల' రాఘవరావు అన్నగారు.

ఆయన విరమించుకోవడంతో వార్లకి ఆ స్థానం సంపాదకుని పేరు పెద్దక్షరాలతో మొదటి పేజీ మీద వేయడమనేది, 'ఆంధ్రప్రభతో ఆరంభమయింది. మొదట న్యాపతి తర్వాత నార్ల. ఆంధ్రపత్రికది గ్రాంథికమూ, ఆంధ్రప్రభది వ్యావహారికమూను. ముట్నూరి కృష్ణారావు తర్వాత గొప్ప ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావు – ఎవరూ కాదనలేని యదార్ధం జాతీయోద్యమ ప్రభావమూ, ఆధ్యాత్మిక చింతన కృష్ణా పత్రిక ముట్నూరి వానిదైతే, ప్రపంచ రాజకీయాలూ, విశ్వ మానవ దృష్టి సాహితీ శిఖర దీవులూ అవగతం చేసుకున్న నిర్మల హేతువాది నార్ల. జనరల్ స్మట్స్ గురించి ఏడెనిమిది రోజుల పాటు వరసగా సంపాదకీయాలు రాసి, పారకుల చేత చదివింప జేయగలిగారంటే ఆయన పరిధి ఎంత సువిశాలమో అర్ధం చేసుకోవచ్చు.

ఆచంట జానకిరామ్ చేత 'సాగుతున్న యాత్ర' రాయించారు. ఆదివారం వంచికలో వచ్చేది, కొన్ని వారాలయ్యాక 'స్మృతిపథం'లో అన్నారు. గోపీచంద్ చేత 'తత్వవేత్తలు' రాయించారు. నాకున్న సాన్నిహిత్యాన్ని బట్టి నార్లవారిని ఒకరోజు అడిగాను. ఈ వెస్టరన్ ఫిలాసఫర్స్ గురించి తెలుగులో ఎవరు చదువుతారండీ? జానకిరామ్ తన ఆత్మకథలో ఆనాటి రాజకీయ నాయకులు, సాహితీకారులు గురించి చెప్పారు. – అందుకని ఆసక్తితో చదివారు. ఈ తత్వవేత్తలు... నా మాట మధ్యలో ఆపి, "మన రీడర్స్ లో ఐదు శాతం చదివితే సంతోషం కనీసం రెండు మూడు.. శాతమైనా చదవకపోతారా? అని... ఆ అచంచల విశ్వాసంలోనే నవయుగాల బాట ఉంది – వాస్తవమ్మయిన నార్లవారి మాట ఉంది.

సదరన్ లాంగ్వేజెస్ బుక్ ట్రస్ట్ నిర్వాహకులైన కృపానిధికి నన్ను పరిచయం చేసి, అయిదేసి వేల కాపీల – కథామంజరి, నవీన కావ్యమంజరి పబ్లిష్ చేయగల అవకాశం నాకు కలిగించినది నార్లవారే! ఆయన సారస్వత వ్యాసాలు, నాటికలు, సంపాదకీయాలు, సాహిత్య కృషి – ఇలాటివి చెప్పదలచుకోలేదు. ఆయనతో నాకుగల పరిచయ పరిమళాలకే పరిమిత మవుతున్నాను. కొన్నేళ్లపాటు అదివారాలప్పుడు, పైక్రాఫ్ట్స్ రోడ్లోని వారింటికి వెళ్లి, సులోచనగారిచ్చిన కాఫీ తాగుతూ, ఆయనతోబాటు పుస్తకాల బీరువాలు సర్దిన మధుర క్షణాలు, ఎన్నటికీ మరుపురానివి. ఒక్కోసారి మాలతి కూడా వెంట వచ్చేది...

నా కోరికతో ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రమదావన శీర్షిక ప్రారంభమైంది. 'గుత్తివంకాయ'తో వంకాయ కూర. వంటకమైనా, మరొక విషయమైనా, పరిచయ వాక్యాలతో పాఠకుని ఆకర్షించుకొనే టెక్నిక్ అలవరచుకుంది మాలతి, ఈనాటి 'పాతకెరటాలు'లో సైతం.. కథాభాగానికి ముందు, వర్తమానానికి అన్వయమంటే పరిచయ వాక్యాలు ఉంటాయి. ఛార్లెస్ డికెన్స్ మనుమరాలు మోనికా డికెన్స్ నుంచి స్వయంగా నేర్చుకున్న విద్య అది.

మామిడి కాయల సీజనులో ఊరగాయలు నిలవ ఉండే పచ్చళ్లు రకరకాల పప్పులతో పొడులు, అల్లికలు, కుట్లు, ముగ్గులు, గుమ్మాలకు తెరలు, కుట్టు మిషను, పిల్లల పెంపకం, సౌందర్య పోషణ, విదేశాలలోని తెలుగు వనితల లేఖలు, ప్రపంచ నవలాసాహిత్య పరిచయాలు– ఇలాటి వాటితో '**ప్రమదావనం**'' రెండేళ్లు తిరక్కుండా పెద్ద సక్సెస్. ఆ విజయంతోబాటు మాలతీ చందూర్ పేరు పట్ల జెలసీ. నారీలోకాన్ని తిరోగమన మార్గం పట్టిస్తున్నారనీ, వంటింటికి కట్టేస్తున్నారనీ, నాలుగు గోడల. మధ్య బందీని చేస్తున్నారనీ పత్రికలలో విమర్శనాస్త్రాలు. నార్లవారిచ్చిన ధైర్యంతో, స్త్రీకి మాతృత్వంతోబాటు సృజనాత్మకత సహజలక్షణమని సమాధానం.

1959 సమ్మె తర్వాత నార్లగారు, విశ్వంగారు విజయవాడ 'ఆంధ్రజ్యోతి'కి వెళ్లిపోయారు, ''ఆంధ్రప్రభ' కొన్ని వారాలు మూతబడి విజయవాడలో అవతారమెత్తింది. 1960లలో యాజమాన్యం అంటే భగవాన్ దాస్ గోయెంకా ఇతర డైరెక్టరుల తోను గట్టి పరిచయమేర్పడింది నాకు. చివరిదాకా, హైదరాబాదులోని వీక్లీ ఇంకో రెండు నెలల్లో మూసేయనున్నాడని ఒక డైరెక్టరు నాకు స్వయంగా చెప్పేదాకా ఆ అనుబంధం ఉంది. వీక్లీ విజయవాడ నుంచి చిత్తూరు, చిత్తూరు నుంచి మద్రాసు, మద్రాసు నుంచి హైదరాబాదు – ఇలా యాజమాన్యం సులువు చలువులమీద స్థానచలనం పొందుతూండేది. విశ్వంగారు తిరిగి 'ఆంధ్రప్రభలోకి వచ్చి రిటైరయ్యారు. ఎందరు ఎడిటర్లు మారినా, యాజమాన్యానికి మాలతీ చందూర్ వ్యాసాలపై ఎన్ని ఫిర్యాదు ఉత్తరాలు వచ్చినా, 'ప్రమదావనం' నిర్విఘ్నంగా, నిరాటంకంగా సాగడానికి అసలు కారణం వారికి మాపట్ల గల గురీ, నమ్మకము. 1962 నుంచి 1970 దాకా ఆంధ్ర మహిళాసభ సేవా కార్యక్రమాలలో తలమునకలై ఉన్నా, బుధవారంనాడు ఖచ్చితంగా మేటరు వెళ్లేది. సంబంధిత విషయాలు తెలుసుకునేందుకు అప్పుడప్పుడు ఆఫీసు నుంచి ఫోన్ వస్తే వెంటనే వెళ్లి వివరణ చెప్పేవాణ్ణి. ఈ వ్యక్తిగత బాంధవ్యం, ఆ ఫీచర్ విషయంలో పట్టుగొమ్మలా పనిచేసింది. నలభై, ఎనిమిదేళ్ల ప్రమదావనం 'స్వాతి' వీక్లీలో 'నన్ను అడగండి'గా మారింది. మాలతీ చందూర్ ఒకరా, ఇద్దరా అని అడిగినప్పుడు, ఒకరిలో ఇద్దరు, ఇద్దరిలో ఒకరు అని 'గౌరీశంకర్' అర్ధనారీశ్వరత్వం ధ్వనింపజేస్తూ ఆమె కాలమ్ చెబుతూనే ఉంటుంది. తెలుగు పత్రికా ప్రపంచంలో 56 ఏళ్ల పేరు. ప్రఖ్యాతులకు పునాది వేసిన మాన్యచరితులు, చిరస్మరణీయులు నార్ల వెంకటేశ్వరరావుగారు.

రచయిత ఎస్. ఆర్. చందూర్ (చందూర్ నాగేశ్వరరావు గత ఐదు దశాబ్దాలుగా 'ప్రగతి' మాసపత్రికకు సంపాదకులుగా – జయప్రదంగా నిర్వహిస్తున్నారు. శతాధికమైన కథలు. నవలలు రాశారు. కొన్ని ఆంగ్ల నవలలను అనువదించారు. కొన్ని కథాసంపుటాలకు సంపాదకత్వం వహించారు. ముఖ్యంగా తమ ధర్మపత్ని మాలతిని ప్రథమశ్రేణి 'సాహిత్యవేత్త'గా తీర్చిదిద్దారు. నార్ల చెన్నయ్ లో ఉండగా వారికి సన్నిహితులు.★

ఆంధ్ర హోరేస్ గ్రీలి నార్ల




–తుర్లపాటి కుటుంబరావు

పద్మశ్రీ పురస్కార గ్రహీత, సీనియర్ జర్నలిస్ట్,

నార్లకు నేను తొలుత ఏకలవ్య శిష్యుడను. తదుపరి శిష్యుడను. అర్థవంతమైన, ఆకర్షణీయమైన, అనితర సాధ్యమైన సంపాదకీయాలు రాయడంలో దిట్ట. ఇలాటి సంపాదకులు అంతకు ముందు లేరు. తరువాత లేరు. మరెప్పుడైనా వస్తారనే నమ్మకం లేదు. ట్రిపుల్ టైపాయిడ్ వచ్చి 104 రోజులు మంచాన ఉన్న నేను 16 వ ఏట నార్ల సంపాదకీయాలు ఔపోసన పట్టాను. వారి శైలిని పసిగట్టాను. మాధుర్యం చవిచూశాను. విజయవాడ, దుర్గాకళామందిరంలో 1958లో నార్ల స్వర్ణోత్సవం జరిగింది. ఆనాడు నేను ప్రజాసేవ వారపత్రికకు సంపాదకుడుగా పనిచేసేవాడిని. నార్ల సభలో నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, పి.వి. రాజమన్నార్, అక్కినేని నాగేశ్వరరావు మొదలైన ప్రముఖులెందరో పాల్గొన్నారు. ఆనాటి సభలో "ఆంధ్ర హోలేస్ గ్రీలి నార్ల" అని సన్మాన పత్రిక చదివాను. గ్రీనీ జగత్ ప్రసిద్ధమైన న్యూయార్క్ టైమ్స్ దినపత్రిక సంపాదకులు. గ్రీలి తమ సంపాదకీయాలద్వారా ప్రజలను ప్రభావితం చేశారు. నార్ల అలాగే చేశారు. 1960లో విజయవాడ నుంచి ఆంధ్రజ్యోతి దిన పత్రిక ప్రారంభమైంది. ఆ పత్రికలో సబ్ ఎడిటర్ గా చేరమని డాక్టర్. జి. ఎస్. రాజు (సిరీస్ రాజు) గారి ద్వారా కబురు చేశారు. నేను వెంటనే ఆంధ్రజ్యోతి దినపత్రిక సబ్ ఎడిటరుగా చేరాను. నన్ను ప్రోత్సహించి నాచేత కొన్ని. సంపాదకీయాలు రాయించారు. స్వదేశ సంస్థానాలు, రాజ భరణాల రద్దు తదితర సంపాదకీయాలు తొలుత నాచే రాయించారు. అవి వారికి నచ్చలేదు. మరల రాయించారు. గుడ్ అన్నారు.

సంపాదకీయ రచనలో నార్ల చాల నిష్కర్షగా ఉండేవారు. 1946లో గాంధీజీ తన వియ్యంకుడు రాజగోపాలాచారికి మద్రాసు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టాలని చూశారు. నార్ల ఈ పరిణామాన్ని సహించలేదు. ప్రజలు కోరుకునే ప్రకాశం ముఖ్యమంత్రి కావాలని వరసగా సంపాదకీయాలు రాసి, గాంధీజీ చేసే పని తప్పు, బంధుప్రీతి, అని కలం బలం చూపి పెద్దల మనోభావాలకు ఒక మలుపు తిప్పారు. ప్రకాశం ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ప్రకాశం ముఖ్యంగా ఎన్నో పొరపాట్లు చేశారు. "గోంగూర ధర కూడా వేసే అణా ఖరీదా" అని ప్రకాశం ప్రభుత్వంపై ఐదు సంపాదకీయాలు వరసగా రాసి, ప్రకాశం దిగిపోయేందుకు కలం బలం చూపారు. నేను నార్ల మానసపుత్రుణ్ణి. ఈ రంగంలో నా కృషికి గుర్తింపుగా వచ్చిన పద్మకి గౌరవం – నేను నార్ల నుంచి నేర్చుకున్న జర్నలిజం వల్ల వచ్చిందే. ఇది నార్ల పెట్టిన భిక్ష. ప్రజల భాషకు నార్ల పట్టం గట్టారు. నార్ల అక్షర సేనాని. ఆంధ్ర హోరేస్ లీ.(రచయిత పరిచయం రాలేదు)

భావస్వాతంత్ర్య యోధుడు నార్ల



- అక్కిరాజు రమాపతిరావు

కన్వీనరు, తెలుగు సలహా సంఘం, కేంద్ర సాహిత్య అకాడెమి

ఏ విషయాన్ని గురించి అయినా రాస్తున్నప్పుడు, విశ్లేషిస్తున్నప్పుడు, వివేచిస్తున్నప్పుడు, ఇది '**నార్ల రచన**', '**నార్ల సంపాదకీయం**' అనే ముద్ర స్పష్టంగా వ్యక్తం కావడమే ఆయన రచనా విశిష్టత. శైలిగాని, విన్యాసంగాని ఇది నార్ల వరవడి అని ఇట్టే తెలిసిపోతుంది. దేన్ని గురించి చెప్పుతున్నప్పుడైనా సమగ్రమైన విషయ పరిజ్ఞానం, సంపూర్ణమైన అవగాహన, సతార్కికత, సూటిదనం, స్పష్టత, అతివ్యాప్తి, అవ్యాప్తులు లేకపోవడం, అంకిత దృష్టి ఆయన రచనకు అతి సాధారణ లక్షణాలు. కొన్ని విషయాలపట్ల, సంఘటనలపట్ల నార్లకి నిక్కచ్చి అయిన అభిప్రాయాలు, ప్రతిస్పందనలు ఉండవచ్చు. వాటిని ఆయన కప్పిపుచ్చరు. నిర్మొగమాటంగా చెప్పుతారు. ఇది కొందరికి బాగా నచ్చవచ్చు. కొందరికి అంతగా నచ్చకపోవచ్చు.

తెలుగువారి వార, పక్ష, మాస, దైనిక పత్రికలు నలుగురి దృష్టికి వచ్చినవి, కొన్నాళ్లయినా వచ్చినవీ సుమారుగా ఇప్పటికి వంద ఉండవచ్చని అంచనా వేయవచ్చు. వీటిని నిర్వహించిన పత్రికా సంపాదకులలో ఏ నలుగురి పేర్లయినా మనం నాలుగు కాలాలపాటు గుర్తుంచుకోవలసిన పేర్లు చెప్పమంటే అందులో నార్ల పేరు తప్పక ఉంటుంది. అయితే తెలుగు పత్రికా సంపాదకులలో నార్లవంటి బహు విషయ పరిజ్ఞానం కలవారు, అధ్యయనశీలి చాలా తక్కువ మందే కనిపిస్తారు. తన జాతి సత్వర, సర్వతోముఖాభివృద్ధిని రచనలద్వారా లక్ష్యించడంలో, తాదాత్మ్యంతో ప్రతిపాదించడంలో, గత, వర్తమాన, రేపటి సమాజ స్వరూప స్వభావాలను, పరిణామ వికాసాన్ని, క్రమానుగతిని వివరించడంలో, విశ్లేషించడంలో కందుకూరి వీరేశలింగంగారికీ, నార్లకీ కొంత సామ్యం కనపడుతుంది. మానవతావాది, హేతువాదిగా ఆయన భావ విప్లవ స్వాతంత్ర్యాన్ని ప్రచారం చేస్తారు. సతతం కోరుకుంటారు. జాతి సాంస్కృతిక మూలాలను ఆయన కాదనలేదు. అంధ విశ్వాసాలను, అహేతుక సంప్రదాయాలను ఆయన నిరాకరిస్తారు.

అవి పూర్వకాలపునైనా, ఇప్పటి కాలపువైనా ఒప్పుకోరు. గాంధీ, నెహ్రూ, రాధాకృష్ణన్, రవీంద్రుల సాంస్కృతిక సామాజిక మానవతా దృక్పథాన్ని ఆయన ప్రశంసిస్తారు.

ఒకవర్గంకాని, పక్షంకాని లేదా వ్యాపార సంస్థకాని, ప్రచార వ్యవస్థ కాని వ్యక్తిని మరుగుజ్జుగా చేసి వేయని సంఘంలోనే వీటిలో ఏదీ వ్యక్తిపై ప్రాబల్యం వహించి, అతనిని ఒక పక్కకు నెట్టివేయని సంఘంలోనే కళలు వర్ధిల్లగలవు. ఇది మహామేధావిగా, ప్రముఖతత్త్వవేత్తగా, ఖండ ఖండాంతరాలలో సైతం గౌరవిస్తున్న ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టరు రాధాకృష్ణన్ గారు ఇటీవలనే చేసిన హెచ్చరిక. 'మానవాత్మ స్వాతంత్ర్యం క్లిష్టం, సునిశితం, దానికి సంరక్షణ లేకపోతే ఉత్తమ కళావిర్భావం దుస్సాధ్యము' అని కూడా ఆయన ఇదే సందర్భంలో హెచ్చరించారు. ఇవి 1953లో ఆయన ఒక సంపాదకీయంలో రాశారు. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, భాష స్వాతంత్ర్యాన్ని నిరోధించే కమ్యూనిజం అంటే ఆయనకు బొత్తిగా సదభిప్రాయం లేదు. సందర్భం వచ్చినప్పుడల్లా ఈ విషయం ఆయన ప్రవక్తం చేశారు. నార్ల ఆశావాది, మంచికాలం ముందు ఉంది అని సర్వాత్మనూ ఆయన విశ్వసిస్తారు. 'గతకాలం మేలు వచ్చు కాలము కంటెన్' అనే అభిప్రాయాన్ని ఆయన ఒప్పుకోరు.

"ఆధునిక ప్రపంచంలోని రాజకీయ వ్యవస్థలలో భావ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించగలిగింది ప్రజాస్వామ్యం. కాగా దాన్ని పరిహరించేవి నియంతృత్వాలు, ఫాసిస్టు నియంతృత్వమైనా, లేక కమ్యూనిష్టు నియంతృత్వమైనా దానికి తొలి బలి భావస్వాతంత్ర్యమే! అయితే ఫాసిజంకంటే, కమ్యూనిజం రెండు ఆకులు ఎక్కువ చదివింది కాబట్టి భావ స్వాతంత్ర్యాన్ని అపహరించడంలో మొరటుతనం కంటే చాతుర్యాన్ని అధికంగా చూపుతుంది. భావస్వాతంత్ర్యాన్ని కోరే వ్యక్తులలో ధనంతో, గౌరవాలతో కొనివేయగల వారిని అది కొనివేస్తుంది. తన నియంతృత్వాన్ని సమర్పించడమే అభ్యుదయమని, అదే ప్రగతి కాగలదని నిరంతరం ప్రచారం చేస్తూ, తాను సులభంగా కొనివేయలేని. రచయితల, కళాకారుల స్వతంత్రాలోచన శక్తినే అని శిధిలం చేస్తుంది. అప్పటికి కూడా తనకు స్తోత్ర పాఠకులు కాని వారిని ఖైదుచేస్తుంది. లేదా మటుమాయం చేస్తుంది' అని అర్థశతాబ్దం. కిందనే భవిష్యద్దర్శనం చేశారు వార్ల ఇటీవలే మరణించిన రష్యా, రచయిత, గొప్ప ప్రతిభా సంపన్నుడు, జాతీయవాది, దశాబ్దాల ప్రవాసజీవితం, నిర్బంధక్రూర కార్మిక జీవితం గడిపిన అలెగ్జాండర్ సొల్జె నిత్సిన్ జీవనోదంతం నార్ల మాటలను వ్యాఖ్యానిస్తున్నది. ఈ సంపాదకీయంలోనే ఒక మౌలికమైన సందేహం లేవనెత్తారు. 'ఇదేమంటే సంఘానికి, ప్రపంచానికి మార్గదర్శకుడు. కావలసినట్టివాడు కవిగా, కళాకారుడుగా తన ధర్మానికి తిలోదకాలిచ్చుకోవడమే (కదా?!) అట్టివాడు పార్టీ నుంచి 'మార్గదర్శకత్వానికి' అనుదినం వేచి ఉండడం కవిగా, కళాకారుడుగా తన ధర్మానికి తిలోదకాలిచ్చు కోవడమే కదా? అని ప్రశ్నిస్తున్నారు నార్ల.

''ఆస్తిక నాస్తిక వాదాల మంచి చెడ్డలలోకి మనం వెళ్లనక్కరలేదు. కాని భారతీయ చరిత్రకు, సంస్కృతికి, మనస్తత్వానికి విరుద్ధమైన పచ్చి భౌతికవాదం కమ్యూనిజానికి పంచ ప్రాణాలనేదే ఇక్కడ

గమనించవలసిన విషయం.అందువల్లనే కమ్యూనిస్టు వ్యవస్థ భారత జాతి క్రమ వికాసానికి, భారతీయ సంస్కృతి సహజ పరిణామానికి తోడ్పడదని చెప్పడం కమ్యూనిజం భారతజాతీయతకు అనుగుణ మైనదైతే శ్రీరామ, శ్రీకృష్ణులపై లేని గౌరవం కమ్యూనిస్టులకు లెనిన్, స్టాలిన్లపై ఎందుకుండాలి? కాశీ, ప్రయాగలపై లేని ముక్కువ మాస్కో లెనిన్ గ్రాడ్ లపై ఎందుకుండాలి? ఉపనిషత్తులపై, భగవద్గీతపై లేని గురి మార్క్స్, లెనిన్ రచనలపై ఎందుకుండాలి?'' అని ప్రగతి అనే సంపాదకీయంలో అర్ధశతాబ్దికి ముందే ప్రశ్నించాడు నార్ల. "మానవ జీవితంలో మానవత్వపు విలువలను సుప్రతిష్ఠ చేయడమే సంపూర్ణ విప్లవం' అని చెపుతూ, ' ఆ విప్లవం మనస్సులో ప్రారంభం కావాలి. హృదయానికి విస్తరించాలి. రక్తంలో జీవించాలి. జీవితసరళినే పూర్తిగా మార్చివేయాలి. ఒక్కమాటలో, ఈ విప్లవ ఫలితంగా నవమానవుడు రూపొందాలి' అని గొప్పగా చెప్పారు సంపూర్ణ విప్లవం అనే తమ సంపాదకీయ రచనలో. ఇది ఆయన మూడు దశాబ్దాల కిందనే రాశారు.

తెలుగు పత్రికా సంపాదకులలో నార్ల వలె విస్తృత, విశాల సాంఘిక మతధార్మిక రాజకీయ, వివిధ దేశ సామాజికోద్యమ పరిజ్ఞానం కలవారు, ప్రపంచ చరిత్ర తెలిసినవారూ మరెవరైనా ఉన్నారో లేదో అనిపిస్తుంది. ఒక వ్యక్తిని అతడి భావ సంపదను బట్టి, నడవడిని బట్టి, ఆత్మ విశ్వాసాన్ని బట్టి లోకం గౌరవిస్తుంది. అట్లాగే సంఘం కూడా, ప్రభుత్వ పరిపాలన కూడా, దేశచరిత్ర కూడా. ఆయన పత్రికారంగంలో సుమారు ఐదు దశాబ్దాలు తనదైన ప్రత్యేకతను కనపరచారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ యాభై, అరవై సంవత్సరాలలో భారతదేశ చారిత్రక, సామాజిక, ఆర్థిక, నైతిక వ్యవస్థలు ఎటువంటి పరిణామ స్వరూపం పొందాయో తెలుసుకోవాలంటే నార్ల సంపాదకీయాలు, ఆయా సంఘటనలను గూర్చి ఆయన చిన్నచిన్న రచనలు, వ్యాఖ్యానాలు జిజ్ఞాసువుకు ఎంతో అవగాహన కలిగిస్తాయి. ఇప్పుడు జర్నలిజానికి చాలా ప్రభావశీలత ఉంది. గుర్తింపు ఉంది. విలేకరి, సంపాదకుడు కాదలచిన వారంతా నార్ల రచనలను బాగా చదవాలి. ఈ సంవత్సరం నార్ల శతజయంతి సంవత్సరం కూడా. ఆయన స్మృతి తెలుగువారిని చైతన్యవంతం చేస్తుంది. ఆయన విషయావగాహన, శైలి తెలుగువారిని ఉత్తేజపరుస్తాయి.★

***డాక్టరు అక్కిరాజు రమాపతిరావు** (మంజుశ్రీ) కథ, నవలా రచయిత, జీవిత చరిత్ర, సామాజిక పరిణామ సమీక్ష రచయిత, పరిశోధకులు, సద్విమర్శకులు, సాహిత్య చరిత్ర రచయిత. తెలుగు అకాడమీ, డిప్యూటీ డైరెక్టరుగా పదవీ విరమణ చేశారు. దేశ విదేశాలలో పలు సత్కారాలు పొందిన విద్వత్ సంపన్నులు, వినయశీలి. ప్రస్తుతం కేంద్ర సాహిత్య అకాడెమీ తెలుగు సలహా సంఘ కన్వీనరుగా కొనసాగుతున్నారు. నార్లకు హితులు, సన్నిహితులు, సహృదయ మిత్రులు.* ★

నార్లగారి సన్నిధిలో...

– టి. ఉదయవర్లు, సీనియర్ జర్నలిస్ట్

"ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కడై తోచు"... అన్నట్టుగా చైతన్యపూర్వకమైన భావజాలం గల నార్ల వెంకటేశ్వరరావు – కొందరికి మార్గదర్శకుడైన ఎడిటర్, ఆదర్శనీయుడైన రచయిత, మరికొందరికి – సృజనాత్మకమైన కవి, అపార విజ్ఞానం గల విమర్శకుడు, ఇంకా కొందరికి వాస్తవ దృష్టిగల చరిత్రకారుడు, పరిశీలనాశీలం గల నాటక కర్త, హేతువాది, మీదు మిక్కిలి – మానవతావాది. ఇంత బహుముఖ ప్రజ్ఞావంతుడైన నార్లవారు ఆంధ్రసాహిత్యలోకంలో తనకు తానే సాటైన, అసమాన శేముషిగల ఎడిటర్ గానే గుర్తిస్తారు.

పత్రిక మాస్టర్ హెడ్ క్రిందనే పాఠకుల దృష్టిని ఇట్టే ఆకర్షించే ప్రమాణంలో "ఎడిటర్ : నార్ల వెంకటేశ్వరరావు" అని ఉంటే చాలు ఆ పత్రికను కొనుగోలు చేసి తాజాగా ఆయన రాసిన సంపాదకీయాల్ని తాజాగా చదవడానికి ఒకతరం అలవాటుపడిపోయింది.

నేను ఇక్కడ కావాలనే "ఎడిటర్" అని ప్రస్తావించాను. ఎందుకంటే "ఎడిటర్" అనే పదానికి సమానార్థకం – సంపాదకుడు కాదని నార్ల అనేవారు. అందుకే ఆయన ఆ పదం వాడడానికి ఇష్టపడేవారుకాదు, తనను ఎడిటర్ గానే పేర్కొనేవారు. ఈ విషయం ఎందుకు చెబుతున్నానంటే మరీ ఇటీవలి కాలంలో 'సంపాదకుడు' అనే మాటకు అర్థం మరీ మారిపోయింది అనడంకన్నా అక్షరాలా ఆ పదం అర్థవంతమైపోయింది అనాలేమో!

నార్లగారు స్వతహాగా రచయిత, కవి కాబట్టి – ఆయన శైలి తేనియలా ఆకర్షణీయంగా ఉండేది. అచ్చమైన తెలుగు నుడికారంతో, కదను త్రొక్కే జవనాశ్వంలా సాగిపోయేది. చరిత్రకారుడు, నాటకకర్త, కళాహృదయుడు కూడా కావడం వల్ల వాస్తవికత, జీవనతత్వం, సౌందర్యం వాటిలో తొణికిసలాడేది. పరిశోధకుడు, విమర్శకుడు కావడం వల్ల మంచి చెడ్డల బేరీజు, విచక్షణకు ప్రాధాన్యత ఇచ్చేవారు. హేతువాది, మానవతావాది కావడం వల్ల నిర్దేశికత్వం, దేశికత్వం లక్ష్యంగా సాగేవి. అందుకే నార్ల గారు మనకాలంలో, మనం చూసిన ఒక గొప్ప ఎడిటర్. ఇవ్వాళ ఈ బహుముఖ ప్రజ్ఞ ఏ ఎడిటర్లోను లేనందున, ఒకవేళ ఉన్నా, ఆయా పత్రికా యజమానుల కనుసన్నలలో నడుచుకోవలసిన దురదృష్టకర పరిస్థితుల వల్ల నార్లగారి తర్వాత ఎడిటర్లు ఎవ్వరూ నార్లగారి లాంటి ఎడిటర్లు కాలేకపోతున్నారు. నార్లగారి లాగా దిశానిర్దేశం చేయలేరు. నార్ల గారిలాగా ప్రజాభిప్రాయాన్ని మలచలేరు.

నార్ల గారిని నేను తొలుత ఫొటోలో హిట్లర్ మీసంతో చూశాను. కాని నన్ను వారు ఎంపిక చేసి 1968-69 'ఆంధ్రజ్యోతి'లో చేర్చుకునే నాటికి ఒత్తుగా పెరిగిన తెల్లని మీసం, అంతకన్నా నిగనిగ మెరిసే గుబురు గడ్డం వారిది. తలకు మూడు ప్రక్కల క్రిందికి పల్చగా నల్లని తలకట్టు ఉన్నా మొత్తం మీద బట్టతల ఉండేది. నల్లని ఫ్రేమ్ తో దళసరి సులోచనాలు పెట్టుకునేవారు. ఆ వయస్సులో, అంటే తన అరవయ్యోపడిలో కూడా లావుకాకుండా బక్కపలచగానే ఉండేవారు. ఖద్దరు ధోవతి, లాల్చీ వేసుకునేవారు. మరీ చలిగా ఉంటే పైన ఉన్ని వాస్కోట్ వేసుకునేవారు, లేదా శాలువా కప్పుకుని, హైదరాబాద్ బంజారా హిల్స్ లో గల ఎండపొడకు కుర్చీ వేసుకుని ఏదో గ్రంథం చదువుతూ కూర్చునేవారు. సి. నారాయణరెడ్డిగారి మాటల్లో అప్పట్లో ఆయన అచ్చం "నాస్తిక బాబా" లా ఉండేవారు.

నార్ల సంపాదకీయాలు ఏడెనిమిది వందల మూరల నిడివిలో సాగేవి. ఎనిమిదంగుళాల పొడవు, ఐదున్నరంగుళాల వెడల్పు గల స్క్రూస్ పాడ్ పై రాసేవారు. ఎక్కువగా నీలంరంగు బాల్ పాయింట్ పెన్తో రాసేవారు. ఒక్కోసారి ఎర్రసిరా లేదా ఆకుపచ్చరంగు ఫౌన్ టెన్ పెన్ వాడేవారు. సంపాదకీయం రాసే దాదాపు ముప్పావు గంటసేపు ఏకాగ్రత అవసరమయ్యేది. అందుకోసం ఏకాంతం కోరేవారు. ఈ సమయంలోనూ పావుగంట కృత్యాద్యవస్థలో గడచిపోయేది. ముఖ్యంగా సరైన, సరళమైన, సుందరమైన లీడర్. ఎత్తుగడకోసం ఆయన ఎన్నో కాగితాలు.. రాస్తూ, టేబుల్ ప్రక్కనే పెట్టుకున్న బుట్ట నింపేసేవారు. ఎదురుగా టేబుల్ పై రాస్తున్న అంశానికి సంబంధించిన పలు పుస్తకాలు తెరచిపెట్టి ఉండేవి. అనుమానం వస్తే చూసేందుకు వీలుగా ఒక ప్రక్క వరసగా అనేక నిఘంటువులు, విజ్ఞాన సర్వస్వాలు, సామెతలు, పలుకుబళ్లకు సంబంధించిన పుస్తకాలు, మరోప్రక్కన దేశనాయకులైన మహాత్మాగాంధీ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, బాల గంగాధర తిలక్, లాలా లజపతిరాయ్, అంబేద్కర్, రామమనోహర్ లోహియా మొదలైనవారి రచనలు, వేరొక ప్రక్కన రవీంద్రనాథ్ ఠాగూర్, అరవిందుడు, వినోబాభావే, ఎం.ఎన్.రాయ్ రచనలు బారులు తీర్చి ఉండేవి.

అంతేకాదు – ప్రపంచ నాయకుల, శాస్త్రవేత్తల ప్రతిమలు ఆయన గదిలో ముచ్చటగా అలంకరించి ఉండేవి. వాటిలో సోఫోక్లిస్, సోక్రటీస్ మొదలు మార్క్స్ వరకు, నెపోలియన్ మొదలు లింకన్ వరకు, బుద్ధుడు నుంచి ఐన్ స్టీన్ దాకా నమూనా ప్రతిమలు చూపరులకు ఉత్తేజాన్ని కలిగించేవి. అక్కడే రవీంద్రనాథ్ ఠాగూర్ దస్తూరితో ఒక పత్రం అద్దం ఫ్రేమ్ లో బిగించి అలంకరించి ఉండేది. ఆ ప్రక్కనే శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు నార్లను ప్రశంసిస్తూ రాసిన లేఖను ఒక సర్టిఫికెటుగా భావించి ఫ్రేమ్ కట్టించి పెట్టుకున్నారు. ఇంకా మిగతా గదుల నిండా ప్రపంచ సాహిత్యం, శిల్పాలు, చిత్రాలు అలంకరించి ఉండేవి.

ఇలా సరస్వతి పూజామందిరంలా అనుభూతి కలిగించే ఎడిటర్ గదిలో నార్ల కూర్చుని రాసే సంపాదకీయాల దస్తూరి చూస్తే నిజంగానే 'బ్రహ్మరాత' లా ఉండేది. ఒకొక్కసారి ఆయనకే అయోమయం కలిగించే ఆయన దస్తూరి అదేమి చిత్రమోగాని నాకు బాగా పట్టుబడింది. అందుచేత ఆయన రాసిన ఎడిటోరియల్స్ ప్రతిరోజు విజయవాడకు పంపించే బాధ్యత నార్లవారు నాకు అప్పగించారు. అప్పట్లో కేవలం విజయవాడలోనే 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్ ప్రచురించేవారు.

'వేమన 'ఆటవెలది'లను పోలిన 'నవయుగాల బాట' పద్యకృతికి రాముడి కంటె సీత పాత్ర ఉదాత్తమైందని చెప్పే 54 పేజీల నాటిక 'సీతజోస్యం' తోపాటు దీనికి రాసిన 143 పేజీల సుదీర్ఘ పీఠిక, దశరథుని పురోహిత వర్గానికి చెందిన 'జాబాలి' నోట సీతారాముల అసలు సిసలు స్వరూపం రూపుకట్టించిన 30 పేజీల ఏకాంకికకు 67 పేజీల పీఠిక రాశారు. షడ్చక్రవర్తులలో మొట్టమొదటి వాడైన హరిశ్చంద్రుడు నాయకుడుగా రాసిన 55 పేజీల "నరకంలో హరిశ్చంద్రుడు" నాటకం, దానికి రాసిన 53 పేజీల పీఠిక – ఇలా నార్లగారు రాసిన ఒరిజినల్ కు సాపు ప్రతి తయారు చేసేపని నాదైంది. ఇది చూసి ప్రముఖ జర్నలిస్టు పరాంకుశం దామోదరస్వామి 'మావాడు' 'ఎపిక్ గ్రాఫిస్ట్' అని నన్ను పలువురికి పరిచయం చేసేవారు.

దాదాపు ప్రతిరోజు నార్ల గారిని కలిసి మాట్లాడే అవసరం, సన్నిహితంగా మసలే అవకాశం. లభించినందున – "నీ భాష బాగుందోయ్, కళల గురించి ఎక్కువగా రాయి" అని నన్ను ఆయన ఎంతగానో ప్రోత్సహించారు. వారంలో ఎక్కువ రోజులు నార్లగారింటికి వెళ్లేవాడిని. అప్పుడే పి.యు.సి. పూర్తిచేసి, బి.ఏ. సాయంత్రం కళాశాలలో చేరిన రోజులు.. బాగా కుర్రతనం. నార్ల గారికి, వారి శ్రీమతి సులోచనగారికి నేనంటే అమిత ప్రేమ ఉండేది. ఉదయం నార్లగారింటికి వెళ్లగానే, డైనింగ్ టేబుల్ దగ్గర ఆయన ప్రక్కనే కూర్చోబెట్టుకునేవారు. సులోచనగారు కొసరి కొసరి ఇడ్లీలు, వడలు పెట్టి తినిపించేవారు.

ఇక్కడి నుంచి – అటెన్షన్ 'ఎన్నార్' (నండూరి రామమోహనరావు) అని ఎడిటోరియల్ రెండు – మూడు టేక్ లలో పంపితే అక్కడ విజయవాడలో నండూరివారే స్వయంగా దాన్ని తిరిగి రాసి, కంపోజ్ చేయించి ప్రూఫ్ చూసేవారు. ఒక్క తప్పుకూడా కనీసం సంపాదకీయంలో రాకూడదనేది రూలు. ఒకరోజు టేక్ లలో పొరపాటున క్రమసంఖ్య పాటించక ముందునపేరా తర్వాత, వెనక పేరా ముందు అచ్చయ్యాయి. అది గమనించి నార్లగారు మెసేజ్ ఇవ్వడమే ఆలస్యం పొరపాటున జరిగిందని 'ఎన్నార్' రాజీనామా లేఖ పంపారు. దాన్ని నార్లగారు బుట్టదాఖలు చేశారు.

వృత్తి ప్రమాణాలు ఆనాడు అలా ఉండేవి. ఇవ్వాళ ఏముంది? తెలుగు పత్రికల నిండా తప్పులే. తప్పులను గ్రహించేంత వివేకం, విజ్ఞానం కూడా చాలామందికి లేవు.

కొన్నిసార్లు ఇతర రచనల ఒత్తిడివల్ల, పనుల వల్ల లేదా ఏదైనా ఊరెళితే నార్లగారు ఎడిటోరియల్ రాసేవారు కాదు. ఫలానా అంశంపై రాయవలసిందిగా 'ఎన్నార్' కు సూచించేవారు. ఒక్కొక్కసారి పాయింట్స్ ఫోన్లో నార్లగారు చెబితే నోట్ చేసుకుని నండూరివారికి పంపేవాణ్ణి.

నండూరివారు నార్లవారు పెట్టిన ఒరవడిలో, ఆయన విధానాన్ని శైలిని అనుకరిస్తూ రాసేవారు. పాఠకులకే కాదు 'ఆంధ్రజ్యోతి'లో పనిచేసే వారికిని ఏ ఎడిటోరియల్ నార్ల రాశారో, ఏ ఎడిటోరియల్ 'ఎన్నార్' రాశారో తెలిసేదికాదు. అందుకే ఒకసారి ప్రముఖ రచయిత ఎమ్మీయల్ నండూరి వారిని 'ఎన్నార్ల' అన్నారు.

అయినప్పటికీ నార్లవారు రాసిన సంపాదకీయాలు ఆరేడు వేలు, ప్రత్యేక వ్యాసాలు, గ్రంథ సమీక్షలు, ఇతర రచనలు అన్నీ కలుపుకుంటే హీనపక్షం ఇరవైవేల పేజీల దాకా విస్తరించవచ్చు. కాని వాటిలో దొరకని వాటిని వదిలేసి, సేకరించిన వాటిని బాగా వడబోసి, చరిత్ర రచనకు ఏవి ముడిపదార్థాలో, అలాంటివాటినే ప్రచురించాలని నార్లగారు భావించారు.

సంపాదకీయం "అప్పుడే వండి వార్చి, వడ్డించిన అన్నం లాంటిదని నార్లగారు చెప్పేవారు. వంటచేతకాక, దాన్ని సరిగా ఇగరనివ్వకపోయినా, తోప చేసినా, మాడ్చినా, అది గొంతు దిగదని నార్ల అనేవారు. "నేర్పుగా వండితే, మెతుకు, మెతుకు ఒక మంచి ముత్తెంలా మిలమిలా మెరుస్తుంది. ఆవిరులు కక్కుతూ నోరూరిస్తుంది" అని కూడా వారే చెప్పారు.

భారతీయ సంపాదకులలో ముట్నూరి కృష్ణారావు, ఖాసా సుబ్బారావు, బ్రిటిష్ సంపాదకులలో థామస్ బార్న్జ్, జె.ఎ. స్పెండర్, డబ్ల్యు, హెచ్, మ్యాసింగమ్, సి.పి. స్కాట్లను నార్లగారు ఆదర్శంగా తీసుకునేవారు. వారు పాటించిన జీవితపు విలువలను చివరిదాకా ఆచరించడానికే నార్లగారు కృషి చేశారు. ముఖ్యంగా లండన్ "టైమ్స్" ఎడిటరుగా పనిచేసిన బార్న్జ్ లాగా పత్రికల కర్తవ్యం ప్రభుత్వ భజన కాదని నార్లవారు నమ్మారు. ప్రజాభిప్రాయాన్ని పత్రికలు వ్యక్తం చేయాలనీ, ప్రజల యోగక్షేమాలను కాపాడాలని కాంక్షించారు. అవసరమైతే అయనలాగా సంపాదకీయాల్లో తీవ్ర పదజాలాన్ని వాడారు. పరిస్థితులు మారినప్పుడు, అంతకు ముందు తాను వెల్లడించవచ్చునని, అది చపలచిత్తం, అవకాశవాదం కాదని, ఏనాటి పరిస్థితిని ఆనాడు చిత్తశుద్ధితో ఎడిటర్ పరిశీలించాలని నమ్మినవాడు నార్లగారు. ఈ నేపథ్యంలో ఒకవేళ నిలకడలేని వాడన్న నిందకు భయపడకుండా న్యాయమైనదిగా తాము నమ్ముతున్నదాన్ని నిర్భీకంగా రాయాలన్నది నార్ల మాట, బాట. ఈ లక్ష్యాలే జర్నలిస్టులకు శిరోధార్యాలు.

తన సమ్మతి లేకుండా, తనకు తెలియకుండా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ రెండో కుమారుడు సంజయ్ గాంధీ గుంటూరు రాక సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' స్థానిక సంపాదకుడు, దాని అన్య నిర్వాహకులు ప్రత్యేక సంచిక వెలువరించారనీ, అతడిని ప్రశంసిస్తూ సంపాదకీయం రాశారని, నార్లగారు రాజీనామా చేశారు. తాను నమ్మిన జీవిత విలువలకు కట్టుబడే నార్లగారు ఈ విషయాన్ని 1977 ఏప్రిల్ 3న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'కృతజ్ఞతతో సెలవు' శీర్షికన ప్రకటించారు. తనను సంప్రదించకుండా ఇంత జరిగిన తర్వాత 'ఆంధ్రజ్యోతి'లో తనకు స్థానం లేదని, అందులో కొనసాగడం తగదని తోచిందన్నారు. అయితే కొన్ని ప్రత్యేక కారణాల వల్ల తన నిర్ణయాన్ని అమలు పరచడం ఇప్పటివరకు సాధ్యపడలేదు. ఇందుకు విచారిస్తున్నాను" అన్నారు. ఇకమీదట ఎడిటరుగా పనిచేసినా, చేయకపోయినా ఊపిరి ఉన్నంత వరకు తాను నమ్మిన, నమ్ముతున్న జీవితపు విలువలకై పోరాడగలవని మనవి చేశారు.★

టి. ఉడయవర్లు *రచయిత, సీనియర్ జర్నలిస్టు. ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ దినపత్రికల్లో చిరకాలం పని చేశారు. వీరి తారాతోరణం గ్రంథానికి నంది అవార్డు లభించింది. లోకాలోకనం పుస్తకానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ధర్మనిధి పురస్కారం. లభించింది. ఆంధ్రప్రదేశ్ నిర్మాత బూర్గుల రామకృష్ణరావు, 'మాతెలుగు తల్లికి మల్లెపూదండ', 'దేశభాషలందు..' మొదలైన వీరి గ్రంథాలు వెలువడ్డాయి. నార్ల తీర్చిదిద్దిన పత్రికా రచనా సుమం వీరు.* ★

పత్రికా సంపాదకుడు

"నేటి సంఘంలో సంపాదకునికి, అతడి సంపాదకీయాలకు పూర్వపు గౌరవ ప్రతిష్ఠలు లేవు. నా జీవిత కాలంలో సంపాదకుని ప్రతిపత్తి ఇంతగా దిగజారిపోవడం నాకు మరింత బాధాకరం. ఈ శోచనీయ పరిణామానికి నా స్వల్ప పరిధిలో నా బాధ్యత ఏ పాటిదన్న ఆత్మపరిశోధన ఇటీవల నన్ను ఎక్కువగా కుంగతీస్తున్నది... సంపాదకునికి లేని గౌరవం అతడి సంపాదకీయాలకు రాదు. విశ్వమానవదృష్టి, శీలసంపద ధర్మాభినివేశం లేనివాడు ఏమైనా కావచ్చు కాని ఉత్తమశ్రేణి సంపాదకుడు కాలేడు." నార్ల.

నార్ల వారి కొన్ని ప్రసిద్ధ సంపాదకీయాలు

బాపూజీ

ఆవురుమని ఒక్కసారి రోదించ గలిగితే, గుండె బరువు తగ్గవచ్చు.
ఆలోచన తట్టవచ్చు. కలం సాగవచ్చు.

కాని, కన్నీటికి మించిన దుస్సంఘటన, కేవలం గుండెలనే కాకుండా ప్రతి రక్తాణువును భగ్గుమనజేసే విషాదోదంతం. ఆ మంటకు కన్నీటి సముద్రమైనా ఇంకిపోవలసిందే.

బాపూజీకేమి? ఆయన అమృతమూర్తి అమరజీవి. సూర్యచంద్రులు గతులు తప్పనంతవరకు ఆయన మానవ హృదయాలలో జీవిస్తూనే ఉండగలడు. కాని, మన మాటేమిటి?

తండ్రిని చంపుకొనడమా? గురువును పొట్టబెట్టుకొనడమా?
మనం సభ్యమానవులమేనా?

ఈ సిగ్గును మనం ఎలా భరించగలం? ఈ కష్టం నుంచి ఎలా గట్టెక్కగలం? మనకు ఏమి దిక్కు? ఏది దారి?

అబ్బ! ఎంత చీకటి గుండెలపై ఎంత పెద్ద రాయి!!!
ఉహు! ఇక రాయలేము, చేతి నుంచి కలం జారి...

(ఆంధ్రప్రభ 1-2-1948)

వ్యర్థమైన మూడు జీవితాలు రణడే, గోఖలే, గాంధీ

మహదేవ్ గోవింద రణడే శిష్యుడు గోపాలకృష్ణ గోఖలే, గోఖలే శిష్కుడు గాంధీ. వీరు ముగ్గురు నైతిక పునరుజ్జీవన లేనిదే జాతీయ పునరుజ్జీవన లేదని చెప్పినవారే, నైతిక పునరుజ్జీవన సాధనకై తమ బోధనల ద్వారానే కాక, తమ జీవితాలద్వారా కృషి చేసినవారే. వీరి ముగ్గురి బోధనలు నిష్ఫలమైనాయి. వీరి ముగ్గురి జీవితాలు వ్యర్థమైనాయి. ఇవి కటువైన మాటలుగా తోచవచ్చు. కానీ, వీరు ముగ్గురు ఈనాడు మనమధ్య ఉంటే తమ జీవితాలు వ్యర్థమైపోయినట్టు స్వయంగా చెప్పి వుండేవారు!

మున్ముందు మంచిరోజులు రావచ్చునన్న ఆశతో రణరే, గోఖలేలు చనిపోయారు. తన జీవితం చివరి ఘట్టాలలో గాంధీలో అట్టి ఆశ సయితం నిలుప్తమైపోయింది. బ్రతుకుపై తనకు రోత పుడుతున్నట్టు హత్యకు ముందు అనేక పర్యాయాలు ఆయన స్పష్టం చేశాడు. మరణాన్ని ఆహ్వానిస్తున్నట్టు కూడా ఆయన స్పష్టం చేశాడు. అట్టి గాంధీ ఈనాడు మన మధ్య ఉంటే, మరెంతగా ఆయన విలవిలలాడి ఉండేవాడే.

ఈనాడు కల్లకు తప్ప, కపటానికి తప్ప, కాలుష్యానికి తప్ప, నీతికి, నిజాయితికి, నైర్యల్యానికి మన జాతీయ జీవితంలో స్థానం లేకుండా పోయింది. ఈనాడు మోసానికి తప్ప, స్వార్థానికి తప్ప సంకుచితత్వానికి తప్ప ఋజువర్తనకు, నిస్వార్ధానికి, ఉదాత్తతకు మన జాతీయజీవితంలో స్థానం లేకుండా పోయింది. ఈనాడు మిత్రద్రోహం తప్ప, మైత్రి లేదు. ద్వేషం తప్ప, ప్రేమ లేదు, హింస తప్ప అహింస లేదు!. క్రౌర్యం తప్ర కారుణ్యం లేదు. ఒక్క రాజకీయ రంగంలోనే కాదు, సాంఘిక, ఆర్థిక, పారిశ్రామిక వాణిజ్య, విద్యారంగాలలో, అన్యరంగాలలో పరిస్థితులు ఒకే విధంగా ఉన్నాయి. మొత్తం జాతీయ జీవనమే నైతికపు విలువలకు సంబంధించినంతవరకు నికృష్టస్థాయికి దిగజారిపోయింది. ధర్మోపన్యాసాలేమో అవిరళంగా సాగుతున్నాయి. దేశభక్తిని గురించి, ప్రజాసేవను గురించి, నవసమాజ నిర్మాణాన్ని గురించి ధర్మోపన్యాసాలను వినలేక చెవులు చిల్లులు పడుతున్నాయి. మందలో కలిసిపోకుండా చెదురుగా ఎవరో కొందరు ఇప్పటికి కూడా కుడి ఎడమలను పాటించేవారుంటే, ఇప్పటికి కూడా ఉచితానుచితాలు పరిగణించేవారంటే, ఇప్పటికి కూడా చూస్తూ చూస్తూ అవమార్గాన పోవడానికి బిడియపడేవారుంటే – అట్టివారికి బ్రతుకు పైనే జగుప్ప పుడుతున్నది.

అవినీతి బలిసినప్పుడు, అధర్మం పెచ్చు పెరిగినప్పుడు దైవభక్తి హెచ్చడం కద్దు. ఇది అన్ని దేశాలలో జరుగుతుంది, అన్ని కాలాలలో జరుగుతుంది. ప్రస్తుతం మన దేశంలో ఇంతే జరుగుతుంది. ఏవో కూళ్లు కుడిచి ఒక పదవిని సంపాదించినవాడు పెద్ద భక్తుడు! ఎన్ని కొంపలైనా ఆర్పి, నాలుగు డబ్బులు మూటగట్టినవాడు అంతకంటే పెద్ద భక్తుడు! భక్తుల సంఖ్య బట్టి బాబాల సంఖ్య, అమ్మల

సంఖ్య, భగవానుల సంఖ్య పెరుగుతూంది. ఇది కూడా ఈనాడు విశేషంగానే జరుగుతుంది. వయస్సు మళ్ళినవారు, మరెంత కాలమో జీవించబోనివారు ఈ దుష్పరిణామాల నుంచి తమకు త్వరలో విముక్తి రాగలదని ఎలాగో సరిపెట్టుకోవచ్చు. కాని, తమ కుమారుల సంగతి, తమ మనుమల సంగతి ఏమి కానున్నదన్న చింత మాత్రం వారిని ఎంతగానో సంక్షుభితులను చేస్తుంది? అని కటువైన మాటలుగా తోచినా నిజంగానే రణడే, గోఖలే, గాంధీ జీవితాలు వ్యర్థమైనాయి.

(ఆంధ్రజ్యోతి 28-3-1973)



మానవ విజయం

"ఆనాడు జీవించి ఉంటే ...

– ఈ తలంపుతో ఎందరు, ఎన్నిసార్లు, ఎంతగా నిట్టూర్చలేదు?

సుమేరియన్లు అక్షరాలకు తొలిరూపం దిద్దినప్పుడు –

బాబిలోనియన్లు ఒక దానికంటే మహోన్నతంగా మరొక జిగూరత్ ను నిర్మించినప్పుడు–

వేద ఋషులు యజ్ఞవాటికలలో ఋక్కులను రచించినప్పుడు –

హామురాబీ ప్రథమ ధర్మశాస్త్రాన్ని ప్రకటించినప్పుడు –

రామ్ సెసె ది గ్రేట్ గుహాలయాలను ఆబూషింబెల్లో తొలిపించినప్పుడు –

సోక్రటీస్ ఏథెన్స్ వీధులలో యువ బృందంతో తత్త్వ చర్చలు కొనసాగించినప్పుడు –

గౌతమ బుద్ధుడు ధర్మచక్ర ప్రవర్తనను ప్రారంభించినప్పుడు –.
కన్ ఫ్యూసియస్ నాగరిక జీవిత సూత్రాలను విప్పిచెప్పినప్పుడు–
బేరియన్ చక్రవర్తి పరిపాలనలో పర్షియా ప్రభ వెలిగిపోయినప్పుడు–
అలెగ్జాండర్ మూడు ఖండాలలో దిగ్విజయ యాత్రలను జరిపించినప్పుడు –
అశోక చక్రవర్తి శాంతి, కారుణ్య సందేశాలను ప్రపంచానికి చాటినప్పుడు–
ఏసుక్రీస్తు పర్వతాగ్రంపై నిలిచి ధర్మబోధ చేసినప్పుడు–
అజంతా గుహాలయాలలో చిత్రకారులు అలౌకిక సౌందర్య జగత్తును సృష్టించినప్పుడు–
మహమ్మద్ మక్కాలో విజయప్రవేశం చేసినప్పుడు –
కృష్ణదేవరాయలు "భువన విజయం"లో నిండు పేరోలగంలో ఉన్నప్పుడు –
షాజహాన్ తాజ్ మహల్ ను నిర్మించినప్పుడు–
కొలంబస్, వాస్కోడిగామా. డ్రేక్ ప్రభృతులు
గాంధీజీ ఉప్పు సత్యాగ్రహానికై సబర్మతి నుంచి దండికి ప్రయాణమైనప్పుడు–
కొత్త సముద్రమార్గాలను, కొత్త ఖండాలను కనిపెట్టినప్పుడు–
వాషింగ్టన్, జెఫర్సన్ ప్రభృతులు ఫిలడెల్ఫియాలోని "లిబర్టీ హాల్ లో అమెరికా సర్వ స్వాతంత్ర్య ప్రకటన పత్రంపై సంతకాలు చేసినప్పుడు–
ప్యారిస్ పౌరులు "స్వాతంత్ర్యం", "సమానత్వం", ‘‘సౌభ్రాత్రం’’ నినాదాలతో బ్యాస్టిల్ ని నేలమట్టం చేసినప్పుడు –
ఫారడే విద్యుచ్ఛక్తిని కనిపెట్టినప్పుడు –
లెనిన్ "ప్రపంచాన్ని కుదిపివేసిన పదకొండు రోజుల" విప్లవనాయకుడుగా క్రెమ్లిన్ లో పాదం పెట్టినప్పుడు –

ఇట్టి అనేకానేక చారిత్రాత్మక సన్నివేశాలలో తాము జీవించి ఉండలేదని ఎందరు – ఎన్నిసార్లు. –ఎంతగా నిట్టూర్చలేదు? ఈ సన్నివేశాలలో తమకు ప్రత్యేకాభిమానపాత్రమైన దాన్ని తలచుకుని, ఆనాడు జీవించి ఉన్న వారిచే అదృష్టమని ఎంతగా నిట్టూర్చలేదు?

కాని –

నేడు – క్రీస్తు శకం 1969 జులై 21వ తేదీన (చంద్రమండలంపై మానవుడు కాలూనిన రోజు) – జీవించి ఉన్న మనం ఖండఖండాలలో, దేశదేశాలలో జీవించి ఉన్న మనం – ఎవ్వరినీ చూచి అసూయ

పడనక్కర లేదు! కడచిన కాలానికి చెందిన వారెవ్వరో అదృష్టవంతులని, మనం కాదని నిట్టూర్చ నక్కరలేదు.

మానవ చరిత్రలోనే అపూర్వమైన ఒక సంఘటన జరిగిన ఈనాడు జీవించి ఉన్న మన అదృష్టమే అదృష్టం!!

మన ఈ మహాదృష్టాన్ని గుర్తించలేని వాడు మనలో ఎవడైనా ఉంటే, అతడు మూర్ఖులకు శిఖామణి, ఆలోచించడానికి అతడు మెదడు లేనివాడు; ఉప్పొంగిపోవడానికి హృదయం లేనివాడు; తన ముక్కు కొసను దాటి చూడ్డానికి కళ్ళు సయితం లేనివాడు.(అసంపూర్ణం)(ఆంధ్రజ్యోతి22-7-1969) .

నేటికి ఇంతే

(ఆంధ్ర తెలంగాణాలు విడిపోవాలని సామూహిక నిరాహార దీక్షలు, అందోళనలు రోజు రోజుకూ తీవ్రతరం అయ్యాయి. సి.ఆర్.పి. కాల్పులు జరిగాక 15 మంది పైగా మృతి చెందారు. వివిధ పట్టణాలలో కర్ఫ్యూ విధించారు. జనవరి 15వ తేదీన శ్రీ పి.వి. నరసింహారావు మంత్రివర్గం రాజీనామా చేశాక, జనవరి 18 నుండి రాష్ట్రపతి పాలన ఏర్పడింది. ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ కలిసి ఉండాలని నార్లవారు పలుసార్లు విజ్ఞప్తులు చేసినా ప్రయోజనం లేకపోయింది. దీనిపై నార్లవారు విసిగిపోయి సంపాదకీయ వ్యాఖ్యలు మానివేసి ఆ స్థలం ఖాళీగా ఉంచారు).

ఇటు ప్రజలు, అటు ప్రభుత్వం తన హిత వచనాలను త్రోసిపుచ్చుతున్నప్పుడు ఏ పత్రికా సంపాదకుడైనా బాధతో విలవిలలాడడం తప్ప, కన్నీటిని కురిపించడం తప్ప, మరి చేయగలిగింది ఏమి ఉంటుంది? ప్రస్తుతం ఈ పత్రికా సంపాదకుడు చేయగలుగుతున్నది ఇంతే.

నేటికి ఇంతకంటే మరి మేము వ్రాయగలిగింది లేదు. (ఆంధ్రజ్యోతి 21-1-1973)

(భారత రాష్ట్రపతి 26-6-1975) ఉ. 7 గం. నుంచి జాతీయ అత్యయిక పరిస్థితి (ఎమర్జన్సీ) ప్రకటించారు. ఆ తరువాత మూడు దినాలపాటు ఆంధ్రజ్యోతి దినపత్రికలో సంపాదకీయాలు రాలేదు. ఆ స్థలం క్రింది చూపిన రీతిలో ఖాళీగా ఉంచింది).

కాటన్ "పెట్టిన దీపం"



ప్రధాని నెహ్రూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన చేయడానికి వచ్చినప్పుడు ఒక రైతు – ఆయనతో ''ఇది మీరు పెట్టిన దీపమే'' అన్నాడు. నాగార్జునసాగర్ నెహ్రూ పెట్టిన దీపం కాగా, గోదావరి అనకట్ట అంతకు నూరేళ్ళకు ముందు ' సర్ ఆర్థర్ కాటన్' పెట్టిన దీపం. దక్షిణ భారతంలో కాటన్ పెట్టిన పెక్కు దీపాలలో అదొకటి.

కాటన్ అనాడు పెట్టిన దీపం తెలుగు గడ్డకు వెలుగునిచ్చింది; తెలుగు బిడ్డకు అన్నం పెట్టింది. గంగను స్వర్ణం నుంచి భగీరథుడు భూతలానికి తెచ్చినాడన్న పురాణ గాథ నిజమో, కాదోగాని, వృథాగా సముద్రం పాలైపోతున్న గోదావరి జలాలను లక్షలాది ఎకరాల పంటపొలాలకు మళ్లించిన అపర భగీరథుడు మాత్రం నిశ్చయంగా సర్ ఆర్థర్ కాటన్.

ఈనాడు అతి భాగ్యవంతమైన గోదావరి జిల్లా ఒకప్పుడు కరవు కాటకాలకు నిలయమై ఉండేదంటే ఇప్పటి వారికి ఆశ్చర్యం కలగవచ్చు. ఐనను, 1846 వ సంవత్సరానికి ముందు అప్పటిలో దాన్ని రాజమండ్రి జిల్లా అనేవారు) ఆ ప్రాంతం మద్రాసు ప్రెసిడెన్సీలో ఎక్కువ వెనుకబడిన ప్రాంతాలలో ఒకటిగా ఉండేది. అంతేకాదు. అక్కడ వరసగా కరవులే, కాటకాలే! అక్కడి నుంచి వరసగా వలసలే! ! అక్కడి నుంచి ఎక్కడికో కడుపు చేతపట్టుకొని లేచి పోకపోతే వరసగా చావులే!!

బ్రహ్మాండమైన గోదావరీనది ప్రవహిస్తున్న ఆ ప్రాంతం అంతటి దైన్యావస్థలో పడిపోవడం అనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి ఎంతో బాధ కలిగించింది. కరవుకాటకాల నుంచి ఆ ప్రాంతాన్ని సముద్ధరించడానికి మార్గాన్వేషణ జరుగుతుండగా సర్ ఆర్థర్ కాటన్ కు గోదావరిపై ఆనకట్ట నిర్మించడం ఒక్కటే అందుకు తిరుగులేని మార్గమన్న భావం కలిగింది. 1844 లో ఆయనకు కలిగిన ఈ భావం మరి రెండేళ్ళకు క్రియారూపం ధరించింది.

గోదావరినదిపై ఆనకట్ట నిర్మాణం 1846లో ధవళేశ్వరం వద్ద ప్రారంభమైంది. 1852 నాటికి అది పూర్తి అయింది. దానికి మొదట వేసిన ఖర్చు అంచనా చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అది కేవలం 4,75,000 రూపాయలు. పని పూర్తి అయ్యేసరికి ఖర్చు 15,34,000 రూపాయలకు చేరివుండవచ్చు. ఏమైనా, ఈ మొత్తానికి ఈనాడు ఒక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా రాదు. ఆనాడు రూపాయి విలువ అంతటిది; అనాడు కూలిరేట్లు అంత కారుచౌక.

సర్ ఆర్థర్ కాటన్ ఆనాడు అంత కొద్దిపాటి వ్యయంతో నిర్మించిన గోదావరి ఆనకట్ట బ్రిటిష్ ఇండియాలోనే ఇంజనీరింగ్ నైపుణ్యానికి అత్యద్భుతమైన చిహ్నంగా విశేష ప్రశంసలు పొందింది. నిజానికి దానికి ఎవ్వరూ ప్రత్యేకించి యోగ్యతా పత్రాలివ్వనక్కరలేదు. 1852లో పూర్తి అయిన నిర్మాణం నూరేళ్ళకు పైగా చెక్కు చెదరకుండా నిలిచి ఉండడమే దానికి తిరుగులేని యోగ్యతాపత్రం. పన్నెండు లక్షల ఎకరాలకు పంటనీటిని అందించడమే కాక, కాకినాడ నుంచి చెన్నపట్నం వరకు పడవలు నడపడానికి వీలుకలిగించడం దానికి అసలైన యోగ్యతాపత్రం.

1846లో రాజమండ్రి జిల్లా జనసంఖ్య 5,61,041 ఉండేది. 1891 నాటికి అది 20,78,762 పెరిగింది. 1844 లో రాజమండ్రి జిల్లా నుంచి లభించే అన్ని రకాల రెవెన్యూ 17,25,541 రూపాయలు, ఉండేది. 1898 నాటికి ఒక్క ల్యాండ్ రెవెన్యూ మాత్రమే 60,19,224 రూపాయలకు పెరిగింది. ప్రభుత్వం దృష్టి నుంచి చూచినప్పుడు సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన అనకట్టకు ఇంతకు మించిన యోగ్యతాపత్రం ఏమి కావాలి?

అయితే, సృష్టిలో దేనికీ శాశ్వతత్వం లేదు; మానవుడు నిర్మించినదానికి అసలే లేదు. నూరేళ్ళ వరకు చెక్కు చెదరకుండా నిలిచిన ఆనకట్ట ఒక్కొక్క సంవత్సరం గడుస్తున్న కొద్దీ పగుళ్ళు చూపడం మొదలు పెట్టింది. మరమ్మతులకు నానాటికి హెచ్చుగా ఖర్చుచేయవలసి వస్తున్నది. ఏమి మరమ్మతులు చేసినా మరి ఎంతో కాలం అది నిలబడేట్టుగా కనిపించడం లేదు.

'ఆనకట్టకు ప్రమాదం సంభవిస్తే, ఉభయ గోదావరి జిల్లాలకే కాదు, మొత్తం రాష్ట్రానికే తీరని నష్టం వాటిల్లుతుంది. 1966 లో కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల బృందం ఆనకట్టకు ఎగువలో బరాజ్ నిర్మించాలని సూచించింది. ఆ సూచన జరిగిన అయిదేళ్ళకు దానికి శంకుస్థాపన జరుగుతున్నది. ఇంజనీరింగ్ శాస్త్రం అంతగా అభివృద్ధి చెందని పరాయి ప్రభుత్వ కాలంలోనే కాటన్ నివేదిక అందిన రెండేళ్లలోపలనే, ఆనకట్ట నిర్మాణం ప్రారంభం కాగా, ఇప్పుడు మన ప్రభుత్వానికి బరాజ్ విషయమై ఒక నిర్ణయానికి రావడానికి అయిదేళ్లు పట్టింది! అవాంతరాలను లెక్కచేయక, అపనిందలను లెక్కచేయక, ఆనకట్టను కాటన్ ఆరేళ్లలో పూర్తిచేయించాడు.

ఇప్పుడు బరాజ్ కు ఏడేళ్ళు పట్టనున్నదట. అప్పుడు జనకట్టకు పదిహేను లక్షల రూపాయల చిల్లర మాత్రమే ఖర్చు కాగా, ఇప్పుడు బరాజ్ కోసం పెట్టుబడి 26 కోట్ల 60 లక్షల రూపాయలు కానున్నదట!

ఖర్చు ఎంత అయితేనేమి? బరాజ్ వల్ల ప్రజానీకానికి కలగనున్న ప్రయోజనంతో పోల్చితే అదొక లెక్కలోనిది కాదు ఆనకట్టకింద ఎనిమిదిన్నర లక్షల టన్నుల బియ్యం, 160 వేల టన్నుల చెరకు, ఇంకా ఎన్నో పంటలు ఇప్పుడు పండుతున్నాయి. ఈ ఉత్పత్తికి భద్రత కల్పించడమే కాక, గోదావరి బరాజ్ దాన్ని మరింతగా పెంచనున్నది. నిర్మాణం పూర్తికావడానికి ఏడేళ్ళు పడుతుందని ఇప్పటి అంచనా. మరి నాగార్జునసాగర్ వలె కాకుండా ఇది అనుకున్న నాటికి పూర్తి కాగలదని ఆశించవచ్చునా? ధనలోపమని, అదని, ఇతని సాకు చెప్పకుండా ప్రభుత్వం ఈ నిర్మాణాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తుందని ఆశించవచ్చునా. మేము ఆశించినట్లుగా జరుగలేదు. బరాజ్ నిర్మాణంలో తాత్సారం చేసినందున, 1976 జులై 8/9 రాత్రి ధవళేశ్వరం వద్ద ఆనకట్టకు గండి పడింది. (ఆంధ్రజ్యోతి 11-4-1970)

సంస్కృతం – సంస్కృతి – 1

ఇవి కేవలం పర్యాయపదాలైనట్టు, ఇటీవల కొందరు వీటిని వాడుతున్నారు. ఒకే ధాతువు నుంచి పుట్టిన కారణాన, వీటికి కొంత ధ్వని సామ్యం కలదనుకోండి, అంతమాత్రం చేత ఇవి సమానార్థకాలు కాగలవా, ఆహారం, విహారం, ప్రహారం, సంహారం, పరిహారం: వీటికి ధాతువొక్కటే, వీటి మధ్య ధ్వని – సామ్యం సైతం కొంతవరకు లేకపోలేదు. అందుచేత వీటిని పర్యాయాలుగా ప్రయోగిస్తాననే వ్యక్తిని మూర్ఖుని కింద జమకట్టి, లోకం నవ్వదా? కాని, చిత్రమేమంటే, సంస్కృతమే సంస్కృతి అయినట్టు కొందరు వాదిస్తున్నారు. సంస్కృత భాషా ప్రచారమే సంస్కృతి పునరుద్ధరణ కాగలదని ఉద్ఘాటిస్తున్నారు. మరింత ముందుకు వెళ్ళి, సంస్కృతాన్ని యావద్భారతానికి అధికార భాషగా, అనుసంధాన భాషగా నిర్ణయించాలని ప్రచారం చేస్తున్నారు. గత శతాబ్ది ప్రారంభంలోనే రాజా రామమోహన్ రాయ్ ఖండించిన ఈ ప్రచారం. ఈనాటికైనా నిలిచిపోకపోవడం మన సంస్కృతి దౌర్భాగ్యం.

ఏదో ఒక భాషపై ప్రత్యేకాభిమానం ఉండడంలో తప్పు లేదు. అది మృతప్రాయమై ఉంటే దాని పునరుద్ధరణకు దీక్ష వహించడంలోనూ తప్పు లేదు. కాని, ఆ భాషపై మనకున్న ప్రేమ గౌరవాల కొద్దీ సంస్కృతికి అదే విధానమని చెప్పడం తగదు. భాషా ప్రభావం సంస్కృతిపై విశేషంగానే పడుతుంది. కాని, అంతమాత్రం చేత, భాషే సంస్కృతి కాదు. భాషకే కాక, భౌగోళిక, వాతావరణ పరిస్థితులకు సైతం సంస్కృతి స్వరూప స్వభావాల నిర్ణయంలో ఎన్నదగు ప్రాధాన్యం ఉంటుంది.

ప్రాచీన గ్రీస్ చరిత్ర కొరకు పేరొడోటస్ వ్రాసినట్టు ఈజిప్టు దేశమే ''నైల్ నది వరప్రసాదం.'' మన పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఒకానొక సందర్భంలో వివరించినట్టు. అరేబియా సంస్కృతిపై అక్కడి ఎదారుల, అక్కడి ఎండమావులు ప్రభావం వలె, ఇండియా సంస్కృతిపై ఇక్కడి హిమాలయాల, ఇక్కడి మహానదుల ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. హిమాలయాలలో (మన పౌరాణికులు ఊహకల్పన చేసిన) మన కైలాసం ఉన్నది. కైలాస నాధుడు హిమవంతునికి సాక్షాత్తు జామాత. దేవ, గంధర్వ, యక్ష, సిద్ధ, సాధ్య, కిన్నర, కింపురుష, విద్యాధరాంగనలకు హిమాలయ ప్రాంతమే క్రీడాస్థలం.

అక్కడనే అలకాపురి ఉన్నది. ఆ కుబేరపురిలో వియోగ ఖిన్నయై వున్న తన జీవితేశ్వరికీ ప్రవాస భారంతో క్రుంగి కుమిలిపోతున్న రాముడు రామగిరి నుంచి "మేఘసందేశం" పంపించాడు. సింధు, గంగా, యమునలకు జన్మస్థానం హిమాలయాలే. హరప్పా, మొహెంజొదారోలు, ఇంద్రప్రస్థ, పాటలీపుత్రలు, వారణాసి ప్రయాగలు, ఢిల్లీ ఆగ్రాలు– ఆ నదీ తీరాలలోనో, వాటి లోయలలోనో విలసిల్లిన మన జాతీయ సంస్కృతీ కేంద్రాలు. తక్కిన మన నదులకైనా మన జాతీయ సంస్కృతి చరిత్రలో ఇంతకంటే తక్కువ స్థానం లేదు. బౌద్ధ శిల్పకళ మహోన్నత శిఖరాలనందుకొన్నది కృష్ణానదీ పరిసరాలలో. ఆంధ్ర మహాభారత రచనకు "శ్రీకారం" చుట్టబడింది గోదావరి గట్టున. "ఓం "తత్సత్" వ్రాయబడింది పెన్నా నది ఒడ్డున. విజయనగర సామ్రాజ్య సంస్థాపన జరిగింది తుంగభద్రతీరాన. తమిళనాడు గుండానే కాక, తమిళ జీవితాలగుండా కూడా కావేరీ తామ్రపర్ణిలు ప్రవహిస్తున్నాయి. హిమాలయాలు మన దేశాన్ని తక్కిన ఆసియా ఖండం నుంచి వేరు చేస్తున్నట్టే, వింధ్యాచలాలు తక్కిన దేశం నుంచి దక్షిణాపథాన్ని విడగొడుతున్నాయి. ఈ నైసర్గిక ప్రతిబంధకాలకు అతీతమైన జాతీయ సంస్కృతిని ఏవిధంగా రూపొందించుకొనడమనేది ప్రాచీనకాలం నుంచీ మనల నెదుర్కొంటున్న పెద్ద సవాలు.

మన మనఃప్రవృత్తిపై, మన సంస్కృతిపై మన దేశం శీతోష్ణస్థితుల ప్రభావమైనా సామాన్య మైంది. కాదు. మనది ఉష్ణోగ్రత గల దేశం కాబట్టే, చంద్రుడు మనకు ముద్దుల మామ, చందనం, పన్నీరు మనకు ప్రీతిపాత్రమైన వస్తువులు, ఛత్ర చామరాలు మనకు రాజలాంచనాలు. ఈ కారణానే మనకు "చల్లని చూపు", "చల్లని చెయ్యి", "చల్లని ప్రభువు" "నీ కడుపు చల్లగా వుండ" మొదలైన పలుకుబడు లేర్పడినాయి. "పరుగెత్తి పాలు తాగడం కంటే నిలుచుండి నీళ్లు తాగడం మేలు" అనే సామెత మనకున్నదే. ఈ కారణనే ఇట్టి లోకోక్తి మనకున్న తర్వాత "మందయాన", "గజగమన" మన భాషలో ఉత్తమజాతి స్త్రీకి పర్యాయ పదాలు కావడం అబ్బురమా? అధికోష్ణమే మనలను కొంత వరకు అలసులను ఉపేక్షాపరులను చేస్తున్నది: అదే మనలను శాంతస్వభావులను, సహనశీలురను చేస్తున్నది.

ఇన్నివిధాల–ఇంతగా–భౌగోళిక, వాతావరణ పరిస్థితుల ప్రభావం మన సంస్కృతిపై పడుతున్నందున,ఆ పరిస్థితులనే సంస్కృతిగా మనం పరిగణించగలమా?అయినప్పుడు భాషా ప్రభావానికి సంస్కృతి కొంతవరకు లోనౌతుంది. కాబట్టి భాషకు, సంస్కృతికి భేదమే లేదనడం తగునా?

భాషనే సంస్కృతిగా పేర్కొనడం భాషను గురించి, సంస్కృతిని గురించి మనకేమీ తెలియదని చాటుకొనడమే! ఒకరి భాష మరొకరికి పట్టుపడినట్టు, ఒకరి సంస్కృతి మరొకరికి సంక్రమించదు. బ్రిటీష్ వారు దాదాపు రెండు శతాబ్దాలపాటు మన దేశాన్ని పరిపాలించినందుకు, ఇంగ్లీషు భాషతో మనలో పెక్కుమందికి పరిచయమేర్పడింది. కొందరికి దానిలో పాండిత్యం సయితం లభించింది. ఇంత మాత్రంచేత బ్రిటీష్ సంస్కృతి మన వారసత్వమైందా? మన భాషలలో ముఖ్యంగా మన ప్రాచీన భాషలైన **సంస్కృతం**లోను, **పాలీ**లోను మహాపండితులైన సర్ విలియం జోన్స్, హెచ్.టి. కోల్ బ్రూక్ , సర్ ఛార్లెస్ విల్కిన్స్, జేమ్స్ ప్రిన్సెస్, అలెగ్జాండర్ కన్నింగ్ హామ్, ఫ్రెడ్రిక్ ష్లెగెల్, మోనియర్ విలియమ్స్, ఎఫ్. మాక్స్ ముల్లర్, ఎ.ఎ. మాక్డోనెల్, ఏ.బి. కీత్, రీస్ డేవిడ్స్, హెర్మన్ ఓల్డెన్ బర్గ్, మారిన్ వింటర్ విట్జ్, నార్మన్ బ్రౌన్, ఎ.ఎల్. బషామ్, ప్రభృతులలో మన సంస్కృతి జీర్ణించిపోయిందా? మరొక విషయం ఒకే ఇంగ్లీషును మాతృభాషగా కలిగివున్నా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యునైటెడ్ స్టేట్సు సంస్కృతులలో ఎన్నదగు విభేదాలు లేవా? విభిన్న దేశాలలో ఇంగ్లీషు ప్రచారంలో ఉండగా, మన దేశంలో విభిన్న భాషలున్నాయి. చిల్లర మల్లర భాషలను త్రోసివేసినా, ప్రధానమైన దేశభాషలుగా మన రాజ్యాంగం గుర్తించినట్టివే (సంస్కృతం, ఉర్దూల సమేతంగా) ఎన్నుకోబడింది. కాని, బహుళవ్యాప్తిలోకి వచ్చి, ఆ స్థానాన్ని అది ఆక్రమించుకోవడం కనీసం మరి రెండు, మూడు తరాల వరకు సాధ్యం కాకపోవచ్చు. ఏమైనా, సర్వవ్యాప్తమైన జాతీయభాష ఈనాడు మనకు లేకపోయినా, ఒకే జాతీయ సంస్కృతి ప్రస్తుతం. మనకు లేదా?

సంస్కృతి అంటే భాష కాదు సరిగదా. కొందరు సూచిస్తున్నట్టు అదేదో ఆధ్యాత్మిక సంబంధ మైందీ.. కాదు. ఇంతే అయితే, అధ్యాత్మిక దృష్టిలేనివారిని సంస్కృతి విహీనులనవలసివస్తుంది. కమ్యూనిస్టులు నిరీశ్వరవాదులైనంత మాత్రాన మార్క్స్ ఎంగెల్స్, లెనిన్ ప్రభృతులు సంస్కృతి లేనివారని చెప్పగలమా? కమ్యూనిస్టు దేశాలు సంస్కృతికి అర్హత కోల్పయినవనగలమా? సంస్కృతిని ఆధ్యాత్మిక ప్రపంచానికి పరిమితం చేయడం భాషకు మారుగా మతానికీ, లేదా, దార్శనికానికి దాన్ని ఒక పర్యాయపదం చేయడమే.

భాషకు భిన్నమైనట్టే మతానికి, దార్శనికానికి సయితం సంస్కృతి భిన్నం. జీవితానికున్న విస్తృతి, దానికున్న వైవిధ్యం, దానిలో ప్రస్ఫుటమౌతూవుండే విలక్షణత్వం సంస్కృతికీ ఉంటుంది.

అందువల్లనే సంస్కృతిని నిర్వర్తించడం కష్టం. "కల్చర్" అనే ఇంగ్లీషు మాటకు సమానార్థకమైన దాన్నిగా "సంస్కృతి"ని మనం ప్రయోగిస్తున్నాము. అమరకోశంలో ఈ శబ్దం లేదు. బ్రౌణ్యంలో ఇది కనబడదు. "శబ్దరత్నాకరం", "శబ్దార్థచంద్రిక"లను దీనికోసం వెదకడం వృథా శ్రమ, "సూర్యరాయాంధ్ర నిఘంటువు", "వావిళ్ళ నిఘంటువు", "సంస్కృతి" వరకు ఇంకా లేవనే లేదు. తక్కిన మన చిన్న, పెద్ద నిఘంటువులలోకి సయితం "సంస్కృతి" ఎక్కలేదు. అయితే అన్నింటిలోను సంస్కృతము" కనబడుతుంది. ఈ మాటకు ''శబ్దరత్నాకర'' మిచ్చే అర్థం విశేష్యంగా "దేశభాష" అన్య విశేషణంగా చక్కగా జేయబడినది; చక్కజేయ బడినది.

వ్యాకరణ శిక్షితమైనది, పక్వము చేయబడినది. ''శ్రేష్ఠమైనది'' అని. ఈ విశేషణాలలో కొన్ని ''కల్చర్'' కు వర్తిస్తాయి కాబట్టే, "సంస్కృతము" నుంచి సాధించబడిన ఈ కొత్త పదం "సంస్కృతి" త్వరలోనే సర్వజనామోదం పొంది, బహుళ వ్యాప్తిలోకి వచ్చింది. మన తెలుగులోనే కాక హిందీ, బెంగాలీ మొదలైన ఇతర దేశ భాషలలో కూడా ఇది ప్రస్తుతం విశేష ప్రచారంలో ఉన్నది.

"సంస్కృతి" అనే మాట మనకు కొత్తది కాగా, ఆ అర్థంలో "కల్చర్" అనే మాటను ఇంగ్లీషు భాషలో ప్రయోగించడం కూడా ఇటీవలనే ప్రారంభమైంది. ఏ అర్థంలోనూ కల్చర్ ను ఛాసర్ వాడలేదు. షేక్ స్పియర్ కూడా వాడలేదు, మిల్టన్ వాడలేదు: బైరన్, షెల్లీ కూడా వాడలేదు. ఎన్. బెయిలీ 1736లో ప్రచురించిన తన "ఇంగ్లీషు డిక్షనరీ"లో "కల్చర్" సేద్యాన్ని ప్రధానార్థంగా పేర్కొని, 'ఉత్తమవాక్యంతో మానుషిక వికాసానికి, దాన్ని పర్యాయపదంగా ప్రయోగించవచ్చునని సూచించాడు. 1755 లో నిఘంటువును వెలువరించిన శామ్యూల్ జాన్సన్ కూడా దాదాపు ఇంతే చేశాడు. "కల్చర్" అనే పదాన్ని వాడకపోయినా సంస్కరణాపరుని విలక్షణత్వాల విశదీకరణ, విఖ్యాత వ్యాసకర్తలైన ఎడిసన్, స్టీలే రచనలలో కానవస్తుంది. పద్దెనిమిదవ శతాబ్ది ఉత్తరార్ధంలో "వ్యవసాయం మానసిక వికాసం" ఉభయార్థాలలో అక్కడక్కడ చెదురుగా ప్రయోగించాడు. విశేష్యంగా కాక, విశేషణంగా వర్డ్స్ వర్త్ దాన్ని ప్రయోగించాడు.

సంస్కృతి అనే ప్రస్తుతార్థాన్ని "కల్చర్" ను కల్పించిన వారిలో అగ్రగణ్యులైనవారు అమెరికన్ రచయితలలో **ఆర్.డబ్ల్యు ఎమర్సన్**, బ్రిటీష్ రచయిత మ్యాథ్యూ **అర్నాల్డ్** ముఖ్యులు. వీరుభయులు గత శతాబ్దానికి చెందినవారే.

ప్రస్తుతం విశేష ప్రచారంలో గల "ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ" వివరణ ప్రకారం "కల్చర్" కు ఆదిలో గల అర్థం "టిల్లేజ్" (సేద్యం) అని మాత్రమే. తర్వాత తర్వాత భూమి సేద్యానికే కాక, చేపలు, తేనెటీగలు మొదలైన వాటిని పెంచడానికి కూడా అది ప్రయుక్తమౌతూ వచ్చింది.

ఇటు పిమ్మట పరిశోధనాగారాలలో సూక్ష్మక్రిముల పరిపోషణకు సయితం దాన్నే వాడుతూ వచ్చారు. పోతే, "మానసిక వికాసం" అంటూ ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ"లో "కల్చర్" కు పేర్కొంటున్న చిట్టచివరి అర్థం ఇంతకు ముందు నేను వివరించినట్టు మొట్టమొదటిసారిగా 1736 లో బెయిలీ పేర్కొన్నట్టిది. ఫ్రెంచి ఎకాడమీ వారు తమ నిఘంటువు లో "కల్చర్" అనే పదాన్ని లలిత కళల పట్ల, మానసిక వికాసం పట్ల, ఆసక్తి అనే వివరణతో 1762 లో ఓం ప్రధమంగా ప్రవేశపెట్టారు. ఇంచుమించు మూడు దశాబ్దాల తర్వాత (1793 లో జర్మన్ భాషా పండితుడు అడెలూంగ్ తన సుప్రసిద్ధ నిఘంటువు రెండవ ముద్రణలో "కల్చర్" అనే దాని జర్మన్ రూపంలో "కల్చర్"ను నమోదు చేశారు. ఆయన నిర్ణయం ప్రకారం మనసుతో పాటు శరీరానికి స్వచ్ఛతను, శోభను సమకూర్చేదే సంస్కృతి.

దుష్ట ప్రభావం నుంచి దురాచారం నుంచి మనసును సంస్కరించి వ్యక్తిత్వంతోపాటు అతడికి విజ్ఞానదీప్తిని కూర్చేదే సంస్కృతి. ఈ కార్యక్రమంలో మనసుతోపాటు శరీరాన్ని కూడా పేర్కొనడం ప్రత్యేకించి చూడదగు విశేషం. సంస్కరించినట్లు విశదం. ప్రాచీన కాలపు గ్రీసులో శరీర, స్వాస్థ్య, రక్షణను గాని సౌందర్యపోషణను నిర్లక్ష్యం చేసేవారు కాదు. దేహ దౌర్బల్యానికి దారితీస్తుందని వారి విశ్వాసం. వంపులు తిరిగి, వయ్యారాలను కలిగిన మానవకాయం వారి దృష్టిలో ఒక విశిష్ట కళాఖండమే. ప్రాచీనకాలపు యవనుల వలె జర్మన్ లు కూడా శరీరపోషణకు ప్రాధాన్యమిచ్చేవారు!

తక్కిన యూరోపియన్ భాషలలో కూడా ఆదిలో సేద్యానికి పర్యాయపదమైన "కల్చర్'కు కొంచెం వెనక ముందులుగా "సంస్కృతి" అనే నూతనార్థాన్ని కల్పించుకొనడం జరిగింది. ఈ అర్థ విస్తృతి ఎంతో సముచితం. మానవ నాగరికత చరిత్రము "ది స్టోరీ ఆఫ్ సివిలిజేషన్" అనే పేరుతో ప్రతిభావంతంగా వ్రాస్తున్న అమెరికన్ రచయిత, విల్ కూడా వివరణ ప్రకారం ఆదిలో "కల్చర్" వ్యక్తమైంది. "అగ్రికల్చర్" రూపంలోనే, ఇంగ్లీషు నిఘంటువులో నిర్వచనం ప్రకారం "కల్చర్" అంటే కేవలం మానసిక విధానమని మనం అంగీకరించక పోవచ్చు. కానీ, సంస్కృతం" అనే కొత్తపదాన్ని మనం సృష్టించుకోగా, ''కల్చర్'' అనే తమ పాత మాటకు ఇంగ్లీషువారు ఒక కొత్త అర్థాన్ని

అనతికాలం క్రితమే కల్పించుకొన్నారన్న విషయాన్ని అంగీకరించడానికి మాత్రం ఎట్టి అభ్యంతరం ఉండనక్కరలేదు.

మాట కొత్తదైనా, సంస్కృతికి మనం కొత్త కాదు, మనకు సంస్కృతి కొత్త కాదు, సభ్యత, సంస్కారం, నాగరికత – ఈ మూడు మాటలలో లేనిచో ఒక దాన్ని సంస్కృతి స్థానంలో సందర్భోచితంగా ప్రయోగించడం ఇదివరలో మనకు పరిపాటి. కాని సూక్ష్మంగా పరిశీలిస్తే మాత్రం ఈ మూడింటిలో ఏదీ సంస్కృతి స్వరూప స్వభావాలను సరిగా వ్యక్తీకరించలేదని తెలుస్తుంది.

సభ్యత వలె సంస్కృతి కేవలం. సభామర్యాద కాదు. నలుగురి మధ్య నడవడిలో నాజూకుతనం, హుందాతనం మాత్రమే కాదు కూడా, సంస్కృతీపరునిలో విధిగా సభ్యత ఉంటుంది. కాని సభ్యత తెలిసికూడా సంస్కృతీపరుడు కాకపోవచ్చు. సభ్యత పైపై మెరుగు కావచ్చు. అణువణువున తొణికిసలాడ వలసినట్టిది సంస్కృతి.

పోతే, సంస్కారం అనుభూతార్థ స్మృతిని (కొందరి విశ్వాసం ప్రకారం అది పూర్వజన్మ స్మృతి సయితం కావచ్చు) సూచిస్తుంది. లేదా విద్యాబుద్ధుల వల్ల కలిగివున్న మనఃపరిపాకాన్ని సూచిస్తుంది. అద్దైనా వ్యక్తిపరంగానే, జాతిపరంగా కాదు. సంస్కృతిలో ఇమిడివుండేవి వ్యక్తిగతమైన అనుభూతులే కావు: తరతరాల, యుగయుగాల జాతీయ జీవిత ఫలితార్థ మది.

ఇక, మన నిఘంటుకారులు వివరిస్తున్నట్టు నాణ్యమైనదే నాగరికత కాదు; నగర జీవిత విధానంతోపాటు దాని వైభవ విలాసాలు కూడా నాగరికత కిందికి వస్తాయి. అయితే నాగరికత వలె సంస్కృతి కేవలం నగరాలలోనే ప్రభవించదు; వాటి సరిహద్దులకే అది ప్రధానంగా పరిమితమూ కాదు. నాగరికులలోనే కాక, ఆటవికులలో సయితం సంస్కృతి ఉండవచ్చు, వాస్తవానికి వారిలోనే విసర్గమైన సంస్కృతి కానవస్తుందని నమ్మేవారు కొందరున్నారు.

సంస్కృతికి, నాగరికతకు ఇట్టి విభేదాలను మరికొన్నింటిని కూడా చూపించవచ్చు. విద్య. లోపిస్తే, సంపత్తి కొడవడితే నాగరికత వృద్ధి చెందలేదు. సంస్కృతికి వాటితో ఈ విధమైన అవినాభావ సంబంధం లేదు. విద్య సంస్కృతికి దోహదం కూర్చగలదనడం నిశ్చయం" ఐతే, అక్షర జ్ఞానాన్ని విద్యగా భావించరాదు, విద్యావంతుడైన ప్రతి వ్యక్తి విధిగా సంస్కృతీపరుడని భ్రమపడతారు. ఇటీవల వరకు మొత్తం ప్రపంచంలోనే విద్యావ్యాప్తి, విజ్ఞాన ప్రచారం వాగ్రూపంలోనే విశేషంగా జరిగాయి. గౌతమ బుద్ధుడు, సోక్రటీస్, ఏసుక్రీస్తులు పుస్తకాలను రాయలేదు. వాగ్రూపంలోనే తమ ప్రబోధాన్ని వారు కొనసాగించారు. వారి తదనంతరమే వారి శిష్యప్రశిష్యులు వారు చెప్పిన విషయాలను గ్రంథస్థం చేశారు. వేదవేదాంగాలు,రామాయణ, మహాభారతాలు, గ్రంథస్థమైనది కూడా వాటిని చెప్పిన వెంటనే కాదు. పెక్కు దశాబ్దాల తరువాత ఈనాడైనా ప్రపంచ ప్రజలలో దాదాపు సగం మంది నిరక్షరాస్యులే. ఈ కారణాన మానవకోటిలో అర్థబాగాన్ని సంస్కృతి లేనిదాన్నిగా కొట్టివేయవచ్చునా? మిగిలిన అర్థభాగంలో సంస్కృతి తొణికిసలాడుతున్నట్లు తీర్మానించ వచ్చునా? అక్షరజ్ఞానం లేనివారైనా సంస్కృతీపరులు కావచ్చు. ఈ విషయాన్ని వివరించనవసరం లేదు. అక్బర్ విద్యాభ్యాసం అక్షర జ్ఞానాన్ని దాటి వెళ్ళలేదు. శివాజీకి సంతకం పెట్టడమైనా తెలియదు. హైదరాలీ నిశానీ పద్దు. రంజిత్ సింగ్ ఓనమాలనైనా దిద్దలేదు.

అయినా వీరిని సంస్కార హీనులనగలమా? కాగా, సంపత్తికీ, సంస్కృతికి ఎంత తక్కువ సంబంధం ఉంటుందో తెలుసుకోవాలంటే, నల్లబజారులో కొల్లలుగా గడించిన ఏ కొత్త భాగ్యవంతుని చూచినా సరిపోతుంది. సభ్యత. సంస్కారం, నాగరికత ఈ మూడింటి కిందికి సంస్కృతి రాదనడం తేలికే. కాని, అదేమిటో చెప్పడం మాత్రం కష్టం.

(ఆంధ్రప్రభ 17-11-1955)

ఓజియాన్ అశ్వశాలలు

ఓజియాన్ గ్రీక్ పురాణాలలో ఒక రాజు, ఈలియోన్ అనే రాజ్యాన్ని పాలిస్తుండేవాడు. ముప్పది సంవత్సరాలపాటు ఆయన అశ్వశాలను శుభ్రం చేసినవారు లేరట. వాటి నుంచి బయల్దేరిన దుర్గంధం స్వర్గలోకంలోని వారి నాసికా పుటాలనే బ్రద్దలు గొట్టిందట. ఆ శాలలను శుభ్రం చేయడానికి పూనుకొన్న గ్రీక్ పౌరాణిక నాయకుడు మహాబలుడు హెర్క్యులెస్ రెండు జీవనదులను వాటి లోకి మళ్ళించవలసి వచ్చిందట.

ఓజియాన్ అశ్వశాలల కంటే అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని పట్టణాలు. ముప్పది సంవత్సరాల నుంచి కాక, మూడు శతాబ్దాలకు పైగా వీటిని శుభ్రం చేసిన నాథుడు లేడనే చెప్పవచ్చు. రాజధాని నగరాన్ని, మరొకటి, రెండింటిని విడిచిపుచ్చితే, వీటి నుంచి వెలువడే దుర్గంధం స్వర్గలోకాన్ని దాటి, బ్రహ్మలోకాన్ని దాటి, కైలాసాన్ని దాటి, వైకుంఠం వరకు వెళ్ళి క్షీరసాగరంలో పన్నగశాయినే బాధపెడుతున్నదని అనుకోవచ్చు.

ఈ ఓజియాన్ గుర్రపుశాలలు శుభ్రపరచడానికి ఆంధ్రప్రదేశ్ లో నదులు కొరతలేదు. గోదావరి ఉన్నది, కృష్ణ ఉన్నది, తుంగభద్ర ఉన్నది. పెన్నా నది ఉన్నది: వంశధార ఉన్నది. కాగా, కావలసింది హెర్క్యులిస్ మాత్రమే. గ్రీక్ పౌరాణిక వీరుని మహాశక్తిని, దక్షతను మన పురపాలక సంఘాలమంత్రి శ్రీఅలపాటి వెంకట్రామయ్య చూపించగలరా? అంత పని ఆలపాటివారు. చేయ గలిగితే మాత్రం ఆంధ్ర నదిలో ఒక హెర్క్యులిస్ గా ఆయన మిగలడం తథ్యం.

(ఆంధ్రజ్యోతి 23-7-1964)

ఎడిటర్‌గా నార్ల

– డి. ఆంజనేయులు
సీనియర్ పాత్రికేయుడు

అనువాదం: యస్.యస్.రావ్

నార్ల తెలుగు జర్నలిజంలో ఒక గణనీయ శక్తి. స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దంలో అంతకన్నా ఎక్కువ కాలం, రాజకీయ ఆలోచనల పరిణామంలో, ఆంధ్ర ప్రజానీక అవగాహనలో ఆయనంత ముఖ్యమైన పాత్రను ఏ ఒక్క వ్యక్తీ పోషించలేదు. రాజకీయ స్వాతంత్ర్యానికి సంవత్సరాల ముందు, దివంగత ముట్నూరు కృష్ణారావు (కృష్ణా పత్రిక) మినహా ప్రజల అభిప్రాయంపై ఇంతటి ప్రభావం చూపిన మరికొందరు మాత్రమే ఉన్నారు.

కష్టపడకుండా, లేని చోట సృష్టించి, తన హృదయ కోరిక మేరకు దాన్ని మలచడానికి ప్రయత్నించాడు, అతను గ్యాలరీలో ఆడకుండానే ప్రజాదరణ పొందాడు. అన్య శక్తులకు, సాహసోపేత కారకాలకు తక్కువ రుణపడి అధికారం, ప్రతిష్టను సాధించాడు. ఇవన్నీ భారీ అసమానతలకు వ్యతిరేకంగా, చాలా అనుకూలమైన పరిస్థితులలో లేవు.

ఒక జర్నలిస్టును కొన్నిసార్లు హడావిడిగా పెద్దమనిషిగా అభివర్ణిస్తారు , అతను రాజకీయ నాయకుడికి సవతి సోదరుడిగా ముద్ర వేస్తాడు. జనాదరణ పొందిన విలక్షణ జర్నలిస్టుతో నారియాకు ఉమ్మడిగా ఏమీ లేదు– హస్లింగ్ గేట్–క్రాషర్, ఫ్లాషీ గో–గెటర్ , డాషింగ్ డేర్–డెవిల్. స్వభావాన్ని బట్టి కఫం లేనివాడు, అతనికి అంత తేలికైన ఉత్సాహాలు లేవు , గాలులతో త్వరగా స్నేహం చేయడంలో నమ్మకం లేదు. 'కాంటాక్ట్ మెన్' యొక్క హాఫ్–ఫెలో–వాల్–మెట్ మెథడ్స్. ప్రసంగంలో లాకోనిక్, అతను ఆకట్టుకోవాలనుకునే చాలా మందికి సహజంగా వచ్చే వృత్తిపరమైన సర్వజ్ఞత యొక్క విలాస వంతమైన గాలితో సూర్యుని క్రింద ఉన్న అన్ని విషయాలపై ముందుకు సాగడానికి ఉత్సాహం చూపడు. అతను వినడానికి , నేర్చుకోవడానికి, వాల్ట్ చేయడానికి , చూడటానికి సిద్ధంగా ఉన్నాడు. అతనికి మేధావి ఉచ్చులు , గొప్పతనం యొక్క బాహ్య అలవాట్లు కాదు. గొప్పతనం నిశ్శబ్దంగా, వినయంగా ఉంటుంది.

ఆంధ్రప్రభ (గత రెండు దశాబ్దాలుగా, ఆవిర్భవించినప్పటినుండి ఆయన రూపొందించిన) ఏ పాఠకుడూ ఇక్కడ తన మనసును పాఠకుడిలా బాగా తెలుసుకునే సంపాదకుడని గ్రహించలేదు.

ఎడిటోరియల్ కాలమ్‌లు , వార్తల కాలమ్‌లు గొలుసు వార్తాపత్రికల భారీ సెటప్‌లో కూడా దాచలేని వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటాయి. నార్ల రోజువారీ వార్తాపత్రికను ఒక పురాతన పుస్తకంలో భాగంగా చదవడానికి ఉదాసీనమైన షీట్ నుండి, రోజు పని తర్వాత విశ్రాంతి సమయంలో, మన దైనందిన జీవితంలో ఒక అనివార్య అంశంగా చర్చించడానికి , గ్రహించడానికి అవసరమైన ముఖ్యమైనదానిగా రూపొందించారు. ఆయన వాస్తవానికి నాయకులలో సరళమైన, మాట్లాడే తెలుగును ఉపయోగించడం ప్రారంభించి ఉండకపోతే (ప్రధమపీఠం) బహుశా తాపీ ధర్మారావుకే చెందుతుంది)

అతను ఖచ్చితంగా వివాదాల పరిధిని దాటి వోగ్‌ని స్థాపించడానికి సహాయం చేశాడు. వార్తల ప్రదర్శనలో, నార్లవారు ఆంగ్ల వార్తాపత్రికల ఆధునిక సాంకేతికతను , పద్ధతులను సమర్థవంతంగా స్వీకరించాడు. నార్ల తెరపైకి వచ్చి వారి ముఖాన్ని మార్చే ముందు, ఎలాగైనా వార్తలను అందించాలని ప్రయత్నిస్తున్న

తెలుగు వార్తాపత్రికలకు పేజీలను అందంగా తీర్చిదిద్దే కళ వాస్తవంగా తెలియదు.



ఎడిటర్‌గా నార్ల...

డి. ఆంజనేయులు,
సీనియర్ పాత్రికేయుడు

అనువాదం: యస్.యస్.రావ్



ఛాయా చిత్రము: డి.యన్.రావు, నార్ల, సులోచనాదేవి, ప్రసంగిస్తున్న డి. ఆంజనేయులు

నార్ల తెలుగు జర్నలిజంలో గణనీయమైన శక్తి. స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దంలో అంతకన్నా ఎక్కువ కాలం, రాజకీయ ఆలోచనల పరిణామంలో, ఆంధ్ర ప్రజానీక అవగాహనలో ఆయనంత ముఖ్యమైన పాత్రను ఏ ఒక్క వ్యక్తీ పోషించలేదు. రాజకీయ స్వాతంత్ర్యానికి సంవత్సరాల ముందు, దివంగత ముట్నూరు కృష్ణారావు (కృష్ణా పత్రిక) మినహా ప్రజల అభిప్రాయంపై ఇంతటి ప్రభావం చూపిన మరికొందరు మాత్రమే ఉన్నారు.



కష్టపడకుండా, లేని చోట సృష్టించి, తన హృదయ కోరిక మేరకు దాన్ని మలచడానికి ప్రయత్నించాడు, నార్ల గ్యాలరీలో ఆడకుండానే ప్రజాదరణ పొందాడు. అన్య శక్తులకు, సాహసోపేత కారకాలకు తక్కువ రుణపడి అధికారం, ప్రతిష్టను సాధించాడు. ఇవన్నీ భారీ అసమానతలకు వ్యతిరేకంగా, చాలా అనుకూలమైన పరిస్థితులలో లేవు.

ఒక జర్నలిస్టును కొన్నిసార్లు హడావిడిగా పెద్దమనిషిగా అభివర్ణిస్తారు , నార్ల రాజకీయ నాయకుడికి సవతి సోదరుడిగా ముద్ర వేస్తాడు. జనాదరణ పొందిన విలక్షణ జర్నలిస్టుతో నారియాకు ఉమ్మడిగా ఏమీ లేదు– హస్లింగ్ గేట్–క్రాషర్, ఫ్లాషీ గో–గెటర్ , డాషింగ్ డేర్–డెవిల్. స్వభావాన్ని బట్టి కఫం లేనివాడు, అతనికి అంత తేలికైన ఉత్సాహాలు లేవు , గాలులతో త్వరగా స్నేహం చేయడంలో నమ్మకం లేదు. 'కాంటాక్ట్ మెన్' యొక్క హాఫ్–ఫెలో–వాల్–మెట్ మెథడ్స్. ప్రసంగంలో లాకోనిక్, నార్ల ఆకట్టుకోవాలనుకునే చాలా మందికి సహజంగా వచ్చే వృత్తిపరమైన సర్వజ్ఞత యొక్క విలాస వంతమైన గాలితో సూర్యుని క్రింద ఉన్న అన్ని విషయాలపై ముందుకు సాగడానికి ఉత్సాహం చూపడు. నార్ల వినడానికి , నేర్చుకోవడానికి, వాల్ట్ చేయడానికి , చూడటానికి సిద్ధంగా ఉన్నాడు. అతనికి మేధావి ఉచ్చులు , గొప్పతనం యొక్క బాహ్య అలవాట్లు కాదు. గొప్పతనం నిశ్శబ్దంగా, వినయంగా ఉంటుంది.

ఆంధ్రప్రభ (గత రెండు దశాబ్దాలుగా, ఆవిర్భవించినప్పటినుండి ఆయన రూపొందించిన) ఏ పాఠకుడూ ఇక్కడ తన మనసును పాఠకుడిలా బాగా తెలుసుకునే సంపాదకుడని గ్రహించలేదు. ఎడిటోరియల్ కాలమ్‌లు , వార్తల కాలమ్‌లు గొలుసు వార్తాపత్రికల భారీ సెటప్‌లో కూడా దాచలేని వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటాయి.

నార్ల రోజువారీ వార్తాపత్రికను ఒక పురాతన పుస్తకంలో భాగంగా చదవడానికి ఉదాసీనమైన షీట్ నుండి, రోజు పని తర్వాత విశ్రాంతి సమయంలో, మన దైనందిన జీవితంలో ఒక అనివార్య అంశంగా చర్చించడానికి, గ్రహించడానికి అవసరమైన ముఖ్యమైనదానిగా రూపొందించారు. ఆయన వాస్తవానికి నాయకులలో సరళమైన, మాట్లాడే తెలుగును ఉపయోగించడం ప్రారంభించి ఉండకపోతే (ప్రథమపీఠం) బహుశా తాపీ ధర్మారావుకే చెందుతుంది)

నార్ల ఖచ్చితంగా వివాదాల పరిధిని దాటి వోగ్‌ని స్థాపించడానికి సహాయం చేశాడు. వార్తల ప్రదర్శనలో, నార్లవారు ఆంగ్ల వార్తాపత్రికల ఆధునిక సాంకేతికతను , పద్ధతులను సమర్థవంతంగా స్వీకరించాడు. నార్ల తెరపైకి వచ్చి వారి ముఖాన్ని మార్చే ముందు, ఎలాగైనా వార్తలను అందించాలని ప్రయత్నిస్తున్న

తెలుగు వార్తాపత్రికలకు పేజీలను అందంగా తీర్చిదిద్దే కళ వాస్తవంగా తెలియదు.




వార్తల ప్రదర్శనలో నార్లవారు ఆంగ్ల వార్తాపత్రికల ఆధునిక సాంకేతికతను, పద్ధతులను సమర్థవంతంగా స్వీకరించారు. పేజీ అలంకరణ కళాత్మకంగా కలిపి వార్త అందించాలని తెలుగు పత్రికల రూపురేఖలు మార్చేశారు. రోజంతా తన పని పూర్తి అయిన పిమ్మట ప్రతిరోజూ కనీసం రెండు గంటలపాటు రాయి వద్ద నిలబడి అన్ని పేజీల అలంకరణను చూసుకునేవారు. బ్రిటీష్ ప్రెస్ ఉత్తమ సంప్రదాయాలకు అనుగుణంగా వార్తాపత్రికను చౌకగా లేకుండా, పసుపు రంగు లేకుండా ప్రకాశవంతంగా, సంచలనాత్మకంగా లేకుండా ప్రభావవంతంగా తయారు చేయడంలో విజయం సాధించాడు.

నార్ల జర్నలిజంలో తనదైన ముద్ర వేసుకోవడం అనుకోకుండా జరిగింది కాదు, అదృష్టం అతనికి అనుకూలంగా ఉంది. పరిశ్రమ ప్రయోజనాలను కూడా పరిరక్షించవలసి ఉంటుంది. శ్రామికుల ప్రయోజనం కోసం పని చేయాలి. కృష్ణా పత్రికలో పార్ట్‌టైమ్ పని, ఇంగ్లీష్,తెలుగు ప్రెస్‌లకు క్రమం తప్పకుండా రచనలు చేయడం ద్వారా కొంతవరకు తన స్వంత సంపాదనతో కళాశాల చదువు కొనసాగించాడు. జ్ఞానం కోసం దాహం, వ్యక్తీకరణ కోసం తపన ఎల్లప్పుడూ ఉంది. కళాశాల రోజుల్లోనే రాయడం పట్టుకున్నాడు. దేశభక్తి ఆవేశం అతని యవ్వన ఉత్సాహానికి ఒక దిశను చూపింది. తీవ్రవాద సంఘాలతో సంబంధాల కారణంగా తరచుగా ఇబ్బందుల్లో పడ్డాడు. ఆ రోజుల్లో జర్నలిస్ట్ అని పిలుచుకోవడం కంటే మరేదీ ఆయనకు గొప్ప ఆనందాన్ని ఇవ్వలేదు. కానీ జర్నలిజం అనేది ఇంకా వృత్తిగా మారలేదు.

ఇది కొందరికి ఒక లక్ష్యం కావచ్చు: కానీ ఇతర వృత్తుల నుండి తిరస్కరణకు గురయిన వారికి ఇది ఆశ్రయం. సంక్షిప్త న్యాయవాదులు, విజయం సాధించని రాజకీయ నాయకులు, కళాశాల లెక్చరర్లు కాలేకపోయిన వారు ఇటువైపు వచ్చేవారు. వారికి వృత్తిలో పేరుకు తగిన శిక్షణా సౌకర్యాలు ఉండవు. కానీ, నార్ల తనకు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోగలిగాడు. కిరాణా దుకాణాల్లో ప్యాకింగ్ చేయడానికి ఉపయోగించే పాత ఇంగ్లీషు వార్తా పత్రికలను పట్టుకోవడం, స్థానిక వారపత్రికలో ప్రపంచ వ్యవహారాలపై రాజకీయ వ్యాఖ్యలకు కావలసినంత మెటీరియల్‌ని పొందడం అతనికి తారసపడింది.ఆయన భారత రాజకీయాల్లో మంచి పునాది కలిగి ఉన్నాడు, అంతర్జాతీయ వ్యవహారాలపై మంచి పట్టును కలిగి ఉన్నాడు. అతని ఫ్రీలాన్సింగ్ ప్రయత్నాల ద్వారా స్పష్టమైంది.

జర్నలిస్టుగా నార్ల రెగ్యులర్ కెరీర్ ముప్పైల ప్రారంభంలో మద్రాసులో ప్రారంభమైంది. జర్నలిజంలోకి ప్రవేశించడానికి తన ప్రారంభ ప్రయత్నాలలో, దివంగత S. G. ఆచార్య (చిత్ర గుప్త, ప్రజాబంధు) సహాయానికి నార్ల చాలా రుణపడి ఉన్నాడు, వీరిని నార్ల కృతజ్ఞతతో గుర్తుంచుకుంటాడు. నార్ల స్వరాజ్యంతో సహా మద్రాసులోని అనేక ఆంగ్ల, తెలుగు వార్తాపత్రికలలో వివిధ రకాల పనులు చేసిఅన్ని విభాగాలలో అనుభవాన్ని పొందాడు. ఆంగ్లం రాయడం పట్ల ప్రాధాన్యత ఉండేది.

ఆంధ్రప్రభ ఆగష్టు 15, 1938న ప్రారంభించబడింది. ఖాసా సుబ్బారావు మొదటి సంపాదకుడు, వెంటనే దివంగత న్యాపతి నారాయణమూర్తి నార్ల తరువాత వార్తా సంపాదకునిగా చేరి కర్తవ్యం పట్ల తనకున్న అంకితభావంతో దృష్టిని ఆకర్షించారు. వార్తాపత్రిక పని. నలభైల ప్రారంభంలో సంపాదకత్వంలో కఠినమైన శిక్షణ ఉద్దేశపూర్వక ప్రయత్నానికి తార్కిక పరాకాష్ట. ప్రమోషన్ నిచ్చేనలో మరో మెట్టుగా సంపాదకత్వం తీసుకోలేదు. ఒక ట్రస్ట్ స్ఫూర్తితో ఆయన దీనిని చేపట్టారు. ఆయన సంపాదకుడిగా పదిహేడు లేదా పద్దెనిమిది సంవత్సరాల పదవీకాలంలో అసలు విధానాన్ని



తీసుకురాలేదు, ప్రజా ప్రయోజనానికి సంబంధించిన ప్రశ్నే లేదు. అలాగే ఆంధ్ర ప్రజానీకం తన సముచిత పాత్రను పోషించేందుకు ముందుకు రావడానికి ఆయన వెనుకాడిన దేశానికి ఆందోళన కలిగించే సందర్భాలు ఏవీ లేవు.

దేశంలో సాధారణంగా, ముఖ్యంగా ఆంధ్రులను ఆందోళనకు గురిచేస్తున్న జ్వలించే సమస్యలకు పరిష్కారాలను సూచించడంలో నార్త సులభమైన మార్గాన్ని సూచించింది. నార్ల తన ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చాడు. వివాదాలలో జనాదరణ లేని వాటిని సమర్థించటానికి ఆయన భయపడలేదు.

ఉదాహరణకు, ఆంధ్ర రాష్ట్రం విడిపోయినప్పుడు, మద్రాసు నగరం రాష్ట్ర సాధనకు అడ్డంకిగా ఉండకూడదని భావించినందున, నగరంపై హక్కులను వదులుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన మాటలు ఆ సమయంలో, సెంటిమెంట్, సహవాసం కారణంగా చాలా మందికి రుచించలేదు, కానీ అతని పరిష్కారం, న్యాయమైన హక్కులను వదలుకోవటానికి వాస్తవికమైనది, ఆచరణాత్మకమైనది. కొత్త రాజధాని ఏర్పాటైనా, ఆంధ్రా–తెలంగాణ విలీనమైనా, ఆంధ్రా–మద్రాసు మధ్య నదీజలాల పంపకాల విషయంలో కానీ, మొదటి సూత్రాలకు విరుద్ధం కాని రాజీలకు ఆయన సిద్ధంగా ఉన్నారు. కృష్ణా–పెన్నార్ ప్రాజెక్టు ప్రతిపాదనను ఎత్తివేసే వరకు ఆయన పోరాడి ఇప్పుడు నాగార్జునసాగర్ పేరుతో ఉన్న నందికొండ ప్రాజెక్టు కోసం ఉద్యమించారు. కానీ ఆయన గోదావరి మిగులు జలాలను మద్రాసు రాష్ట్రంతో పంచుకోలేదు. కృష్ణా, గుంటూరు జిల్లాల రైతుల అవసరాలే కృష్ణా జలాల విషయంలో ముందుండాలని ఆయన వాదించారు. ప్రతి ప్రశ్నను దాని సుగుణాల ఆధారంగా నిర్ణయించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉన్నాడు.

నార్ల వివాదాలలో మునిగిపోవడానికి సన్నద్ధంగా లేనప్పటికీ, అవసరమైతే నాయకత్వం వహించడం, పక్షం వహించడానికి ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం విషయంలో, ఆయన వైఖరి నిస్సందేహంగా ఉంది. ఆంధ్రాలో ప్రతిచోటా చర్చనీయాంశమైన అతని పత్రిక శక్తివంతమైన నాయకులు, ప్రభావవంతమైన కార్టూన్‌లను తరువాతి సంఘటనలు పూర్తిగా సమర్థించాయి. ***నార్ల తన పాఠకుల నాడిపై వేలు పెట్టాడు***. అధికార భాష సమస్యపై, ఆంగ్లం నిరవధికంగా కొనసాగించడం కోసం ఔత్సాహికులు, ఇంగ్లీషుకు సంక్షిప్తంగా మారాలని కోరుకునే హిందీ తీవ్రవాదుల మధ్య నార్ల నిలిచాడు. నార్ల ఆంగ్ల వార్తాపత్రికల సంపాదకుల కంటే ఎక్కువ ఆంగ్ల పుస్తకాలను చదివి కొనుగోలు చేసినందున ఇంగ్లీష్ విలువ ఆయనకు బాగా తెలుసు. కానీ ఆంగ్లభాషపై ప్రేమ మాతృభాషపై ప్రేమను ఏ విధంగానూ తగ్గించలేదు. ఆంగ్లభాష నుండి కొత్తఆలోచనలు, ఆలోచనా విధానాలతో పాటు భావవ్యక్తీకరణ విధానాలతో తెలుగు యాసను సుసంపన్నం చేసే లక్ష్యం నుండి అతని దృష్టిని మళ్లించలేదు.

కొత్తగా వచ్చిన లాభాలు తెలుగు భాషా ప్రతిభకు, ప్రజల జీవితంలో పాతుకుపోయిన ప్రాథమిక సంప్రదాయాలకు నష్టం కలిగించకుండా చూసేందుకు నార్ల ఎల్లప్పుడూ జాగ్రత్త తీసుకున్నాడు.

గోదావరి వరదలతో, రాయలసీమలో కరువుతో అల్లాడుతున్న వారిని ఆదుకునేందుకు, పత్రిక ద్వారా, ప్రముఖ సినీ నటులు నాటకాల ద్వారా, విరాళాల ద్వారా లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ ఆంధ్రప్రభ చేసిన సేవ ఇప్పటికీ ప్రజల స్మృతిలో నిలిచిపోయింది.

నార్ల తన అధ్యయనాన్ని స్థానిక, ప్రాంతీయ, జాతీయ ప్రాముఖ్యత గల ప్రశ్నలకు పరిమితం చేయలేదు. విదేశీ వ్యవహారాలపై ప్రత్యేక ఆసక్తి కలిగి ఉన్నాడు. ఆంధ్రజ్యోతి మాసపత్రికలో అతని నెలవారీ కథనాలు, విశ్లేషణా స్పష్టత, సరళ వ్యక్తీకరణలు, గుర్తించబడిన పార్టీ రాజకీయాలను ఏ పాత్రికేయుడు విస్మరించలేరు. కానీ నార్లవారి ధోరణి వ్యక్తుల పట్ల కాకుండా సూత్రాలపై ఆధారపడి ఉండేది. విగ్రహాలు, రాజకీయ/ మతపరమైన/ లౌకిక/పవిత్రమైన వాటిని ఆరాధించడానికి నిరాకరించాడు. అతను ప్రజాస్వామ్య పుణ్యక్షేత్రాన్ని రాజ్యాంగ ధర్మాన్ని ఆరాధించేవాడు. నిరంకుశ సమూహాల దాడికి వ్యతిరేకంగా ఆంధ్రాలోని ప్రజాస్వామ్య శక్తులను సుస్థిరపరిచే క్లిష్టమైన పనిలో ఎటువంటి అవకాశాన్ని ఆయన వదిలిపెట్టలేదు.

నార్ల కష్టపడి పైకి వచ్చాడు. ప్రారంభ జీవితంలో అనేక నిరుత్సాహాలను ఎదుర్కొన్నాడు, కానీ కష్టాలు అతని ఆత్మను తప్పుదారి పట్టించలేదు, దృక్పథాన్ని వక్రీకరించలేదు. ఆధునిక జీవితం, రోజువారీ వార్తాపత్రిక సందడి మధ్య అతను ప్రశాంతంగా, సమాన నిగ్రహాన్ని కలిగి ఉన్నాడు. అతను తన వ్యక్తిత్వానికి తగినతను ఇచ్చే దృక్పథాన్ని సంపాదించాడు. అతను విశ్రాంతిలో శక్తికి, పనిచేసేటప్పుడు బలానికి ప్రతీక. నార్ల ఇప్పటికే చాలా చేసాడు, కానీ అతని స్వర్ణయుగం గతంలో లేదు.

–హాఫ్‌వే (1958) నరియా ఫెస్ట్ నుండి పునర్ముద్రించబడింది.

టైమ్స్, లండన్

ఆగష్టు 16, 1957 నాటి సాహిత్య అనుబంధంలో ఇలా రాసింది. "ఇన్ని భాషలు ఉన్న భారతదేశంలో సాధారణ అభిప్రాయ సర్వేక్షణ ప్రకారం కొంతమంది రచయితల పేర్లనే పేర్కొనగలం. మరాఠీలో మర్ధేకర్, ముక్తిబోధ్; బెంగాలీలో సుచీంద్రనాధ్ దత్తా, జిబానానంద దాస్,బహుశా తెలుగులో "నార్ల ," హిందీలో నిరాలా ఏ ప్రమాణం ప్రకారం చూసినా మహాకవులుగా గుర్తించబడతారు. "

మంచి పుస్తకాలు:

మీ వద్ద ఉన్న పుస్తకాల సంఖ్య ఎంత పెద్దదైతే, మీ మనస్సును ఉత్తేజపరిచేందుకు, మీ భావోద్వేగాలను మెరుగుపర్చడానికి, మీ భావాలకు పదును పెట్టడానికి, మీ అవగాహనలను విస్తరించడానికి, ఒక లక్ష్యాన్ని అందించడానికి మీ వద్ద ఉన్న మహా ఆత్మల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అవి మీ భావాలను విస్తృతపరచి నీ జీవితానికొక అర్థాన్నిస్తాయి.

నార్లవారి, వారి కుటుంబసభ్యుల ఉత్తరాలు:

నవంబరు 30, 1984

నా ప్రియమైన శ్రీకాంత్,

ఏడేళ్ల వాడివి నీ కంటె మీ తాతయ్య ఎంత పెద్దవాడో తెలుసా? నేను దాదాపు పదకొండు రెట్లు పెద్దవాడిని. నువ్వు నిండు నూరేళ్లు జీవించాలి. నాకు చిన్న, తీయని ఉత్తరాలు రాస్తుండాలి. పెద్ద ఉత్తరాలు రాయటం నేర్చుకో.

రాధీ, నేను నిన్ను–, నా మనుమలు, మనుమరాళ్లను ప్రేమిస్తాను. మీరు మంచిగా ఉండాలి. ప్రతిరోజూ మీ పాఠాలు తప్పకుండా చదువుకోవాలి. ఇంటివద్ద చేసే పని చేయాలి. మిగతా సమయాల్లో ఆటలు ఆడుకోండి.

రాధికి చెప్పు. ఆమె నాకు ఉత్తరం రాస్తే నీలాగే ఆమెకు కూడా జవాబులు రాస్తుంటాను. నీకూ, రాధికి నూతనసంవత్సర శుభాకాంక్షలు.

మీ ప్రియమైన,
తాతయ్య

24 యేళ్ల తరువాత నా జవాబు

ప్రియమైన తాతగారికి,

నవంబరు 30, 2008.

ఇప్పుడు నీ మనవడి వయసు ఎంతో తెలుసా? నా వయసు 29. అంటే 23 ఏళ్లుగా మిమ్మల్ని కలవలేకపోతున్నా. రేపటితో మీకు 100 ఏళ్లు నిండుతాయి. కాని ఈ మైలురాయిని చేరుకోకముందే మీరు చాలా గొప్ప పనులను సాధించగలిగారు, నేను కూడా అలాగే చేయాలనుకుంటున్నాను.

నేర్చుకోవటానికి ముగింపు ఉండదు. అయినప్పటికీ నా పాఠాలన్నీ చదివాను. ఇవాళ ఇంటివద్ద

చేయవలసిన పనిని పూర్తి చేశాను. పని ఎంతతీరికలేకుండా ఉన్నప్పటికీ, నేను ఆనందించటానికి కాస్త సమయం లభిస్తుంది.

దురదృష్టవశాత్తు నేను కాని రాధీ కాని నీవు తుదిశ్వాస విడిచే లోగా మళ్లీ రాయలేకపోయాము. అంత మాత్రాన మేము నిన్ను గురించి ఆలోచించటం లేదని కాదు. నిన్ను తరచుగా తలచుకోవటంలేదని కాదు.

మేము మా జీవిత కాలమంతటికీ సరిపోయే బలాన్ని నీనుంచి గ్రహించాము.నీ పుస్తకాలు మాతో ఉన్నాయి. అవకాశం దొరికినప్పుడంతా వాటిని చదువుతుంటాం. వాటి ద్వారా నువ్వు మాతో మాట్లాడుతుంటావు.

మనం ఇద్దరమూ కలసి గడిపిన సమయం చాలా తక్కువైనందున మనమధ్య జ్ఞాపకాలు తక్కువ. అందుకు నేను చింతిస్తాను. కాని నేను నీ ఒడిలో కూర్చోని, బొమ్మలతో ఆడుకునే ఫోటోను చూసినప్పుడు నా ముఖం చిరునవ్వుతో విప్పారుతుంది.

నిన్ను నీ మనుమళ్లు, మనుమరాళ్లు అందరూ ప్రేమించినట్లే ప్రేమిస్తాను. అందుకు మేము నీకు ధన్యవాదాలు చెప్పుకుంటాం. మేము అందరమూ పెరిగి పెద్దవారం కావటం చూసి నువ్వు ఆనందిస్తావనుకుంటాము. మేము మంచి వారిగా ఉండటానికి మాకు చేతనయినంత చేస్తాము. నువ్వు మాకు ఇచ్చిన వారసత్వసంపదను వాడుకుంటాం.

ప్రగాఢమైన ప్రేమ దానికది వ్యక్తం కాదు. అది ముఖముపై ప్రకాశిస్తుంది. కళ్ల వెలుగులో కాంతులను చిందిస్తుంది. ఆనందకరమైన నీ పుట్టినరోజు బాగా జరుపుకో తాతయ్యా, దిగులుపడకు, నాకు

శక్తి ఉన్నంతకాలం ఈ రోజున గాలిబుడగలను నేను ఊదుతుంటాను, నీ జ్ఞాపకాన్ని పదిలపరచుకుంటాను. నీ కోసం కొవ్వు వత్తులు వెలుగుతుండేలా చూస్తాను. నీ ప్రియమైన మనుమడు,

(చంద్ర పుట్టగుంట గారి కుమారుడు) శ్రీకాంత్

రగిలించే పదాలు

నా యౌవనకాలంలో కళ్లద్దాలు పెట్టుకున్న మనిషి
నా మనసును తీర్చిదిద్దిన వ్యక్తి, మా అమ్మకు నాన్న
సమాచారాన్ని చేరవేయటానికి ఆరాటపడే పత్రికా మానవుడు
ప్రజలకు సాయపడటానికి పనిచేసే చట్టసభా సభ్యుడు
తన హక్కులను కసిగా వ్యక్తం చేసే రచయిత,భారత జాతీయవాది

ఇతర సంస్కృతులను అర్థం చేసుకోవటానికి
తీరని దాహంతో, ఆకలితో తపించే తపస్వి
మానవునిలో నిద్రాణంగా గల బలాన్ని నమ్మే మానవుడు
ఇంటి చుట్టూ ఉన్న పుస్తకాలను స్నేహితులుగా ఆరాధించే వ్యక్తి
ఇష్టాలు ,అయిష్టాలు కల వ్యక్తి
జీవితభాగస్వామి, కుటుంబసభ్యులు ఆరాధించే వ్యక్తి
ఆయన కథను అందరూ చెపుతున్నారు,
కాని తాతయ్యా, ఈ కథ నేను చెపుతున్న కథ.
ఆయన వి.ఆర్. నార్ల, మా తాతయ్య.
ఆయన నాలో చూచినట్లే నాలో గొప్పఅంశాలు దాగి ఉన్నాయి.

నేను చిన్నవాడిగా ఉన్నపుడు ఆయన అన్నారు.

"ముందుగా మేలుకున్న పిట్టకే ఆహారం ఎక్కువ దొరుకుతుంది. దాని అర్థం నీకు ఇప్పుడు తెలియక పోవచ్చు. దిగులుపడకు, ఆరోజు వస్తుంది. జీవితమంతా వేకువగా మేలుకునే పిట్ట గురించి కబుర్లు చెపుతూ కాలక్షేపం చేయవు, నిజాయితీగా, ఆత్మవిశ్వాసంతో, హృదయపూర్వకంగా మాట్లాడతావు. సృజనశీలివి అవుతావు. ప్రపంచాన్ని నువ్వు కలలు కన్నట్లుగా రూపుదిద్దుతావు. వాస్తవమైనదానికోసం పోరాడతావు. మరీ ముఖ్యంగా ప్రపంచంలో మార్పును తీసుకురాగలనని నమ్ము. మిగతా ప్రపంచ పౌరుల జీవితాలను వెలుగులతో నింపు, కార్యాచరణకు కదిలించు. ప్రశాంతిగా విశ్రాంతి తీసుకో.

నువ్వు మమ్మల్ని వదలి వెళ్లిఉండొచ్చు. కాని, నీ మాటలు నా మనసులో వేడిని పుట్టిస్తూనే ఉంటాయి.

ప్రేమతో,
రాధిక
(నార్లవారి మనుమరాలు, చంద్ర పుట్టగుంట గారి కుమార్తె)

నాకు కచ్చితంగా తెలిసినది

నాకు జీవితంలో ఒక విషయం కచ్చితంగా తెలుసు, మా అమ్మ, నాన్నలు నేను ఆరాధించే అభిమాన కథానాయకీ నాయకులు. నేను వారిలో స్నేహభావం, ప్రేమ, దయాగుణం, మిత్రత్వం, ఆరాధనా భావం కాక మరేమీ చూడలేదు. మా అమ్మ చదివింది కేవలం నాలుగు తరగతులే అయినా, నాన్న జీవితభాగస్వామిగా నిలువెత్తు నిర్వచనం.

నాన్న జర్నలిస్టుగా అడుగులు వేస్తున్నప్పటి నుండి, ప్రఖ్యాత పాత్రికేయుడై భారతదేశ రాష్ట్రపతితో కలచాలనం చేసే దాకా అమ్మ వెంట ఉన్నది.మా కుటుంబాన్ని పోషించేది నాన్న. అంతకు మించి మిగిలినవన్నీ మా అమ్మయే చూసుకునేది.

ఆమె భార్య, ప్రేమించే మాతృమూర్తి, సాధారణ, ముఖ్యమైన చిన్న, పెద్ద నిర్ణయాలు తీసుకోవటంలో మా నాన్నకు సలహాదారు. ప్రతిరోజూ పగలు రేయనక పదుల సంఖ్యలో వచ్చే అతిధులకు ఆప్యాయం పంచే అమ్మ. ఆమె ఈ పాత్రలన్నిటినీ, నవ్వుతూ సమర్ధవంతంగా నిర్వహించింది. నాన్న ఇష్టాలను, అవసరాలను హృదయపూర్వకంగా చూసుకుంటూ సేవలను అందించటానికి సర్వసన్నద్ధంగా ఉండేది.

మా అమ్మనాన్నలు ఎవరూ ఒకరి నొకరు మార్చటానికి ప్రయత్నించలేదు. ఒకరు మరొకరిపై ఆధిపత్యము చలాయించలేదు. ప్రతి విధానంలో పరస్పర పూరకంగా జీవితాలు గడిపారు.

నాకు పన్నెండేళ్ల వయసులో మా పెద్దబావగారు మా అక్కయ్యతో అంటున్న మాటలు నా చెవిన పడ్డాయి. " మీ అమ్మా, నాన్నలు కాపురంలో పొందుతున్న సుఖశాంతుల్లో సగం పొందినా మన దాంపత్యం మహావిజయవంతం అయినట్లే". నేను జీవితంలో మా తలిదండ్రులను ఆదర్శంగా తీసుకోవటానికి ప్రయత్నించాను. వాళ్లను గుర్తుచేసుకొనని రోజు ఒక్కటీ లేదు.

వారు నాపై చూపిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతతో ఉంటాను. వారిని చూచే ప్రేమించటం, ప్రేమించబడటం, స్వంతశక్తిపై నమ్మకం పెరిగింది.

మీనాక్షి చెల్లప్రవ, (నార్ల గారి కుమార్తె)

తీయని కల

అత్యంతప్రియమైన అత్తయ్యా,

ఈ ఉత్తరము చాలా కాలము తర్వాత రాస్తున్నాను. ఇంకా ఆలస్యం చేయబోను. మిమ్మల్ని నా జీవితంలో కలుసుకోగలగటం, మీతో ఉండాలనుకున్నంత కాలం ఉండలేకపోయినా కొంత కాలమైనా మీ దగ్గర ఉండగలగటం నా అదృష్టంగా భావిస్తాను. మీతో గడిపిన రోజులన్నీ నాకు తీయని కలలుగా ఉన్నాయి, కాని దురదృష్టవశాత్తు అవి హఠాత్తుగా ఆగిపోయాయి. మీరు నాకెన్నో తీపి జ్ఞాపకాలను పంచి యిచ్చారు. వాటిని నా మిగిలిన జీవితకాలమంతా గుర్తుచేసుకుంటూ ఆనందిస్తాను.

మీరు నాకు ఇచ్చిన కానుక (నేను ఇంతవరకు అందుకున్న కానుకలు అన్నిటిలో) అత్యుత్తమమైనది. మీరు నాతో, మా అమ్మ, రాము కలసి సింగపూర్ యాత్రకు రావటం. అంతటి ఆనందకరమైనది మరేదీ లేదు.

నాకు ఒక అమ్మ కాదు, ఇద్దరు అమ్మలున్నారనే మధుర జ్ఞాపకాలతో సింగపూర్ వదలి వచ్చాను. మీ తృప్తికరమైన నవ్వులో ఆనందం ఉట్టిపడుతుంటుంది. నేను దానికోసం ప్రతిరోజూ ఎదురు చూస్తుంటాను. మెల్లగా కాకుండా పెద్దగా నన్ను ‘ విజయా’ అని ప్రత్యేకంగా పిలవటం నా చెవుల్లో ఇంకా మార్మోగుతుంటుంది. ఆనందంగా ఉండటానికి ఏమి చేయాలో మీరు నాకు నేర్పారు. నిరాడంబర జీవితపు విలువను కళ్లకు కట్టినట్లు చూపించారు. మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొని ఆచరించటం చాలా చాలా కష్టం. అయినా నాకు వీలయినంతవరకు ప్రయత్నిస్తాను. నీ అల్లుడిగా ఉండే అర్హతను కలిగి ఉండటానికి ప్రయత్నించగలను.

నాకు మీలో నచ్చని విషయం ఒక్కటే. మీరు మమ్మల్ని వదలి చాలా ముందుగా వెళ్లారు.మీరు నాకు పంచిన ప్రేమ, కురిపించిన అనురాగాలను తిరిగి మీకు అందించటానికి అవకాశము ఇవ్వకుండా వెళ్లారు. బహుశా మాకంటే విలువైన వ్యక్తి (గౌరవనీయులు మా మామయ్య నార్ల వెంకటేశ్వరరావు)కి మీ సాన్నిహిత్యము అందరికంటే ఎక్కువగా అవసరము అనుకున్నారేమో, హఠాత్తుగా వెళ్లారు.

ఏమైనా నాకు మీరు కానుకగా ఇచ్చిన మీ చిన్నమ్మాయిని నా దగ్గర ఉంచి వెళ్లారు. అది నా అదృష్టం అనుకుంటాను. మా మామయ్య గారిని మీరు చూసుకున్నట్లు ఆమె నన్ను చూసుకుంటుందని నా నమ్మకం. నేను ప్రపంచమంతటికీ ప్రకటిస్తాను.మా అత్తగారిని మించిన అత్తగారు మరెవ్వరూ లేరు.

కుప్పలు, రాశులుగా ప్రేమను, మర్యాదను అందిస్తూ,

– *విజయ్ కె.బజెడ్ల,* యం.డి.లూయిస్టన్, NY

నార్లవారి పుట్టినరోజు

మీ వారసత్వసంపదను పరిరక్షించటానికి, మంచి వారిగా ఉండటానికి మాకు చేతనైనంత కృషి చేస్తాం. నా దగ్గర గొప్ప పదాలు లేవు. అందుకని మీ మాటలనే వాడతాను.

ఇద్దరు అద్భుత వ్యక్తులు



ఈరోజు నేను అమ్మను అయ్యాను. నా కుమార్తె పుట్టినప్పుడు ఆరు పౌండ్ల, పదకొండు ఔన్సుల బరువు ఉంది. ఆమె చిన్నది, నటిలా ఉంది. ఆమె ముక్కు అచ్చం తండ్రి ముక్కులాగా ఉంది. ఆమె ప్రపంచంలో ఏదైనా వృత్తిని లేదా అభిరుచిని కొనసాగించవచ్చు...

శ్రీ వి.ఆర్. నార్ల, శ్రీమతి సులోచనాదేవి ల మనుమరాలు. వారిద్దరూ అద్భుతమైన వ్యక్తులు. వారి మనుమరాలు (నా కుమార్తె) కూడా తాను ఎంచుకున్న ఏ మార్గాన్ని అయినా అనుసరించగలదు.

మా నాయనమ్మ అంతగా చదువుకోకపోయినప్పటికీ నేను చూసిన ఆడవారిలో ఆమె తేజోసంపన్నంగా ఉంటుంది. నాయనమ్మ, తాతయ్యల నేపథ్యాలు వేరయినా వారిద్దరూ చదువును మించిన సంపద లేదని గట్టిగా నమ్ముతారు. వాళ్లిద్దరూ వారి సంతానాన్ని విద్యావంతులుగా చేయటానికి అంకితభావంతో, అనుకున్నదానికంటే అధికంగా శ్రమించారు. వారి పిల్లలు కూడా అలాగే తమపిల్లలను విద్యావంతులను చేయాలని ఆశించారు. దేశంలో ఆడపిల్లల చదువుకు అంతగా ప్రాధాన్యత లేని కాలంలో కూడా మా తాతయ్య, నాయనమ్మ ఉద్దేశపూర్వకంగా తమ తర్వాతి

తరాలవారిని విద్యావంతులను చేయాలనుకున్నారు. వారు అనుకున్నవి సాధించారు. భవిష్యత్తులో నార్లవారి అమ్మాయిలు తమ సోదరులు, తండ్రులు, భర్తలకు ఏ విధంగానూ తీసిపోరని, అన్ని రంగాలలో సమానులని నిరూపించాలని కోరుకొని సఫలులైనారు.

మా తాతయ్య స్వీయకృషితో ఎదిగిన వ్యక్తి, ఆయన ప్రసిద్ధ పాత్రికేయుడు, రచయిత , రాజకీయవేత్తగా మారాడు. మా అమ్మమ్మ, నేను కలుసుకున్న అత్యంత ప్రకాశవంతమైన మహిళల్లో ఒకరైనప్పటికీ, అధికారిక విద్య చాలా తక్కువ. భిన్నమైన నేపథ్యాలు ఉన్నప్పటికీ, మా తాతముత్తాతలు ఇద్దరూ విద్య కంటే మరేమీ ప్రధానం కాదని నమ్ముతారు. నా తాత , అమ్మమ్మ తమ కుమార్తెలకు తమ కుమారులకు ప్రతి అవకాశం కల్పించాలని నిశ్చయించారు , వారు తమ కుమారుల నుండి తమ కుమార్తెల నుండి విద్య పట్ల అదే అంకితభావాన్ని కోరుకున్నారు. మహిళల విద్యకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత లేని కాలంలో , దేశంలో, మా తాతయ్య, అమ్మమ్మ తమ కుమార్తెలకు భవిష్యత్తు జీవితంలో విజయానికి హామీ ఇవ్వడానికి ఉద్దేశపూర్వకంగా ఎంపిక చేసుకున్నారు. ఈ సూత్రాలను వారి కుమార్తెలకు అందించడం ద్వారా, మా తాతలు ఇంకేదో చేసారు, వారు తమ సోదరులు, తండ్రులు , భర్తలతో అన్ని విధాలుగా సమానమని నార్ల భవిష్యత్ తరాల వారికి తెలియజేసారు.

ఇప్పుడు మా పాప నా ఒడిలో నిద్రపోతుంది. ఆమెకు ఏమి కావాలో? తాను ఎలా రూపొందాలోనని కలలు కంటున్నది. ఆమె రచయిత్రి కావచ్చు, డాక్టరు, సంగీతకళాకారిణి, ఆర్థికవేత్త, పత్రికా జర్నలిస్ట్ కావచ్చు. ఆమె ఎంచుకునే మార్గము ఏదైనా కావచ్చు, అది సువిశాలమైనది. ఆమె పెరిగి పెద్దది అయే కొలది ఆమె ముత్తాత, అవ్వల గురించి తెలుసుకుంటుంది. ఆమె వాళ్లిద్దరినీ ఎప్పుడూ కలుసుకోకపోయినా, వారిని చూడకపోయినా వాళ్లు ఆమెకు ఇచ్చిన కానుక అత్యంత అసాధారణమైనదని వారిని గుర్తుచేసుకుంటుంది.

మోనికా నార్ల బెల్లప్రవాలు ఎడెల్ స్టెయిన్,
నార్ల గారి ముని మనుమరాలు



V R NARLA

CENTENARY (1908 - 2008)

MEMORABILIA